C

దగాపడిన తమ్ముడు

(నవల)

894.8273
DAG

Ci

AOUA 103B106

దగాపడిపతప్పుడు

సంస్కారంగల ఒకమనిషి ఒకనాడు ఆటంబాంబును, జపాను లోని హిరోషిమానగరం నడిబొడ్డుమీద వేశాడు; సరిగ్గా అదేరోజురాత్రి ఆంధ్రిదేశంలో, ఉత్తరాన వంశధారానదీతీరంలోని నవిరిగ్రామంలో ఒక సంస్కారంలేనిమనిషి పదిహేనువందల పల్లీయులని గజగజ లాడించాడు;

ఆ మనిషి సంస్కారం ఆటంబాంబును ఏ నడిసముద్రంలోనో పడవేయనీకండాచేసి, రెండులక్షల అరవై వేలమందిని చంపి, ఒకలక్ష అరవై మూడువేలమందిని గాయపరచి, మూడువేల మూడువందల ఎకరాల మేరను ధ్వంసంచేసి అరవైనాలుగువేల భవనాలు కూల్చివేసింది. నవిరిలో గజగజలాడిన పదిహేనువందలమందిలో ఇతడికి లేని సంస్కారం భయాన్ని రేకెత్తించి ఆ గ్రామదేవత నీలమ్మకు నివాళిగా, ఒకరోజు పూరంతాకలిసి ఆటపాటలతో ఉత్సవాన్ని చేసుకోనిచ్చింది;

వంశధారనదిఒడ్డునే గ్రామకంఠంలోవున్న నీలమ్మగుడిలో ఆ రాత్రి శివమెత్తిన దాసుడు రాముడు, గగనానికి వినిపిస్తున్నట్లు అరుస్తున్నాడు.

చప్పిముక్క, వాలినగడ్డం, విరబోసినజుత్తు, కొమ్మ్రిల్లా తెలుపు నలుపు కలయికతో మెలితిరిగిన మీసాలు, గోక్కపోయిన ముఖం, నల్లని బక్కచిక్కిన శరీరం; చిన్న గావంచాకట్టు తప్పించి అతడి వొంటి మీద బట్టలేదు.

చుట్టూ మూగిన పల్లీయులలో దాసుని శివాలకు తలలు దించేవారు కొందరు, అక్కడే దాసుకు పాదాలదగ్గర తమగెడ్డాలను వంచేవారు మరి కొందరు, అయ్యో; ఎంత పొరపాటైపోయిందని విసుక్కొనేవారు చాలా మందీ వున్నారు.

తన కాళ్ళదగ్గర పడ్డ గెడ్డాలకు, ఈ దాసునికీ బాగాపరిచయంవుంది. ఈ దాసుడు రాముడే ఒకప్పుడు మంగలిరాముడనే పేరుతో వుండేవాడు.

కొడుకు చేతికిఅందేవరకు అతినమ్మకంగా తనే ఎప్పుడూ ఆ మంగలి తోలుపొదిపట్టుకొని ప్రతియింటికి వెళ్ళి క్షురకర్మచేసేవాడు. తన కొడుకు తనలా దిప్పకత్తిరింపు, గెడ్డం గీస్తే నాలుగు గంట్లుపెట్టడం నేర్చుకో లేదు. "పట్నంబాబులకు క్రాపింగులుకూడా మా బాబు నేస్తాడని" గర్వంగా రాముడు చెప్పుకొంటూండేవాడు. తనకు దొరికిన తీరుబడిలో గ్రామకర ణంగారివెంట వుంటూ కొద్దో గొప్పో ఏ చుట్టముక్రూపంగానో, లేక చోడిగింజలరూపంగానో సంపాదించేవాడు.

ఒకనాడు కరణంగారియింటికి కొత్త రెవిన్యూఇన్స్పెక్టరు వచ్చాడు. ఇదివరకు చాలామందికి కాళ్లుపట్టడం, నలుగురాయటం, తలకు నూనె రాసి మర్దించడం చేసేవాడు. తను చచ్చేవరకూ ఆ పనిమాత్రం సంతోషం గానే చేస్తుంటానుకొన్నాడు. కానీ ఆ ఇన్స్పెక్టరురాకతో తన జీవితం లోనికి కొత్తగ్రహం వచ్చిందని, రాముడే నమ్మకంగా అనుకొన్నాడు. ఆ వేళ ఒంట్లో కొద్దిగా జ్వరంగా వుంది. "కాళ్లు పట్టావా లేదా వెధవా!" అంటూ ఇన్స్పెక్టరు ఎగిరిపడ్డాడు. చేతులు కట్టుకొని తన ఒంట్లో బాగాలేదని వినయంగా విన్నవించుకొన్నాడు. అధికారికోపం రెచ్చి పోయింది. అన్నీ వేషాలని, జైల్లో పెట్టిస్తానని జడిపించాడు. చేసేదిలేక కాళ్లు పట్టాడు, కాని కడుపు కమిలిపోయింది.

ఆ నిముషంనించి వైరాగ్యం వచ్చింది. ఈ నీలమ్మగుడిదగ్గర కూర్చున్నాడు. ఒక్కసారి తను ఆ అధికారిమీద అధికారి అయితే ఎంత బాగుండే దనిపించింది. కాళ్లుపట్టమని అనేవాడినే అనుకున్నాడు. ఇంత కష్టపడ్డాను, ఒక్క కానీ ఇచ్చాడు కాదే అనుకున్నాడు. తనేదో అయి పోవాలనే కోరికతో వెనుకకు తిరిగి రెండు చేతులెత్తి "అమ్మా! నీలమ్మ తల్లీ! నా కడుపు కమిలిపోతుందమ్మా! నా బాధ యిని కనికరించు తల్లీ! ఈ మంగలిరాముడ్ని మనసులో పెట్టుకో అమ్మా!" ఇలా అన్నాడేగాని ఏం కావాలో కోరుకోవడం మరచిపోయాడు!

గుడి నల్లగావుంది. గుడికి రాతిగుమ్మం వుంది కానీ తలుపుల్లేవు. లోన ఒకదిమ్మమీద నాలుగు కర్రవిగ్రహాలున్నాయి. మధ్యనున్న రెం టిలో వొకటి నీలమ్మతల్లి, రెండోది నీలమ్మఅన్న ఎర్రన్న,మిగతా రెండూ నీలమ్మ అప్పాచెల్లెళ్లు! ప్రొవవెంటపోయే ప్రతివారూ వొకమొక్కు మ్రొక్కుతారుగానీ, ఆలనా పాలనా పీటి కుండేదికాదు. తన అయ్యకు

కూడా ఈ గుడి ఎప్పుడు కట్టారో తెలియదట.కానీ సచ్చిన తనఅయ్యకు సీలమ్మంటే ఎంతోభక్తి, తనకుమాత్రం లేదూ?

కొద్దినిముషాలు పోయాక రాముడికి ఎంతో జాలివేసింది. సీలమ్మ గుడి అంతా బుగ్గితోనూ, పట్లుతోనూ నిండిపోయిందే, గబగబ ఇంటికి వెళ్ళాడు. చీపురు తెచ్చి అంతా తుడిచాడు. పట్లు తీశాడు. తరువాత బొమ్మలకి రంగులేస్తే ఎంత బాగుండుననిపించింది. గుడికి సున్నంవేస్తే? ఈతల్లికి ఆలనాపాలవాలేదే, పల్లకివుంటే....దప్పుల ధమధమతో వూరే గునే, అంతా తను అప్పుడేచేస్తే ఎంతబాగుండును, అంతడబ్బుంటే తను చెయ్యగలిగేవాడే,తన రాబడి తనచేతిని నోటివరకూ ఎప్పుడూ పోనివ్వదు. ఊరిలోవాళ్ళతో చేస్తే!....అనుకున్నట్లే నలుగురైదుగురితో చెప్పాడు. వాళ్ళెవరూ వినలేదు. వేళాకోళంచేశారు. మన తాత ముత్తాతల దగ్గర నుంచీ లేనిది, మనం కొత్తగాచేస్తే యేమవుతుందో అని బెంగతో అన్న వాళ్లకూడా వున్నారు. ఈతల్లికి ఒకమొక్కు మ్రొక్కుడం తప్పించి పూజా పునస్కారాలుచేస్తే కోపంవస్తుందని యింకొక ముసలమ్మ చెప్పింది.

రాముడి కిదేమీ సచ్చలేదు. రానురాను సీలమ్మతల్లిమీద భక్తి హెచ్చిపోయింది. ఒక్కొక్కసారి చీకటిపడ్డవరకూ వుండేవాడు. ఒక్కొక్కనాడు చిన్న ప్రమిదతో దీపంపెట్టేవాడు. చేతులుకట్టుకుని కూర్చునే వాడు. ఈమధ్య రెండుసార్లు ఇన్‌స్పెక్టరు వచ్చాడు. కానీ, కాళ్లుపట్టమన లేదు, "సీలమ్మతల్లి"తనబాధ విన్నదని గట్టిగా నమ్మాడు.

రానురాను గెడ్డాం పెరిగిపోయింది. కళ్లు మబ్బులు కమ్మాయి. రోజూ యేటిలో వుదయమే ఒక మునుగు మునిగి అలా సీలమ్మగుడికి వచ్చేవాడు. తనకు వచ్చిన భాషలో వచ్చినట్లు ప్రార్థించేవాడు. ఇప్పుడు యెవరైనా క్షౌరానికి పిలిస్తే "యీవేళ ఉపవాసం వున్నాను. పొది ముట్టుకొంటే సీలమ్మతల్లికి కోపంవస్తాది" అనటం అలవాటైంది. రెండు మూడుసార్లు భక్తి హెచ్చటంవల్ల గట్టిగా పైకి అనటం నేర్చుకొన్నాడు. పొరుగూర్లో శివాలువేసే మనిషిదగ్గరకు మూడుసార్లు వెళ్ళి ఆరీతిని నేర్చుకొన్నాడు. గుడిలో ప్రయత్నించాడు. గొంతుకకు తరిఫీదిచ్చాడు.

ఒకనాడు తెల్లవారేసరికి ఊరంతా ప్రాకింది.సీలమ్మతల్లి మగంటి రాముడిమీద వాలిందని, అదిగో ఏరావతారం....వాలింది వాలిందన్నారు

సగంజుత్తు నెరసిన ఆ వయసువాళ్లు. "నిజమేనర్రా....అసలు ఆడు రెండుమూడు నెలలై ఈ గుడి వదల్లేదర్రా. ఆ తల్లి వుపాసన చేశాడు! వాలింది వాలింది" అన్నారు మరికొందరు.

ఇలా రోజుకి రోజు మరింత భక్తి హెచ్చిపోయింది. శివాలు వెయ్యటంలో మరింత ప్రావీణ్యం వచ్చిందిఁ తను కోరుకున్నవన్నీ జరి గాయి—బొమ్మలకి రంగులు—గుడికి సున్నం, దేవుళ్ళకు పుష్పకం, ఊరంతటికి తను ఈతల్లికి దాసుడని....తనను భక్తిగౌరవాలతో చూడ టం—ఇదివరలా మంగలిరాము డనకుండా, దాసుడు రాముడనటం—రెవిన్యూ ఇన్‌స్పెక్టరు మళ్ళీ కాళ్ళపట్టడానికి రమ్మంటే, తను యీసారి ధైర్యంగా రానని తిరిగి కబురుపంపటం—అధికారికి కోపంవచ్చి ఎగిరి పంతంబడితే, వూరంతా ఒకటై ఆ దాసుడిచేత ఆ పని చేయించటానికి వీలులేదనటం—ఇంతా జరిగిందిఁ ఇప్పుడు దాసుడు ఆవూరికి వేదాంతి, పూజ్యుడు!

అలాంటి గౌరవం ప్రజల్లో సంపాదించుకున్న దాసుడు, చుట్టు పట్ల గ్రామాల్లో కలరావుండటం విని తనపని తను చేశాడు.అంచేత తను యీనాడు గొంతుకనెత్తాడు.

గుడిలో ప్రమిదలో దీపం వెలుగుతూంది. చిన్న చట్టాంలో గుగ్గి లం ధూపంవేశారు. గుడిలో పెద్దరైతు, రైతుభార్య, గ్రామనాయుడు, (మునసబు) మరి నలుగురు పెద్దలూ కూర్చున్నారు. గుడిబయట చాలా మంది నిశ్శబ్దంగా నిల్చున్నారు.

కళ్లు మూసుకున్న దాసుడు రాముడు "ఊ" అంటూ ఊపిరి ఎగ బీల్చాడు. మతంవేసుకొని వున్నాడేమో, ఇదివరలా భీభత్సంగా కద ల్లేదు. ఇక గొంతుకనుంచి పెద్దమూలుగు బయటపడింది. వెంటనే "నరుడా!" అని అరిచాడు. ఇక రాగాలతో మొదలుపెట్టాడు. "ఓరి నరుడా! నొర్ని అమ్మవారు వెళ్ళిపోతున్నాది. దూతలు తినేస్తున్నాయి—యీ - ఓరీ! దూతలు తినేస్తున్నాయీరా! నాను ఈ ఊరిని యెంతకని కాస్తానూ....మరి యెంతకని కాస్తానో....నూ! ఆ దూతలు ఈ ఊరిమీద పడి తినేస్తున్నాయిరా! నా నెంతకని కాస్తానూ! నరుడా! జాగ్రత్తపడితే

గానీ ఊరు ...ఊరంతా వుండదు. చూతలు నొల్లెస్తాయి. జాగర్తపడురా నరుడా!"

అడ్డతలకాయతో ఏనుగులాంటి పెద్దరైతు, రాముడికాళ్ళమీదపడి, "అమ్మా! తల్లీ! గేమానికి కాసినతల్లివి. నువ్వు కాయకపోతే యింకెవరు కాస్తారు?" అన్నాడు.

దాసుడు గొంతుక గగనానికి మళ్ళీ వినిపించింది. "ఎర్రోడా! నాను తలుచుకుంటే భూచక్రం బుగబుగ మంటిపోతుంది. సవుంద్రాలు యింకి పోతాయి. యిటు దిక్కున్న పొద్దు అటు దిక్కు లేస్తాది!"

"నిజం తల్లీ! నిజం! ఈ నీ పిల్లల్ని కనికరించు తల్లీ!" ముసలి నాయుడు అంచుకున్నాడు.

దాసుడు ఒక్క నవ్వునవ్వి "ఓరి నాయనా! నా పిల్లోళ్ళంటే నాకు యెర్రిరా! ఆల్లమీద నల్లని యీగవాలితే నా ఒళ్లు కందిపోతాది. ఆల్లకి సిన్నసీమ కరిస్తే నాకు గాబరా అయిపోతాది! పక్కన తమ్ముడు యెర్ర న్నున్నాడు. ఈడు అక్కచెల్లెళ్ళతో ఒకడే మగబిడ్డ. దొరికినోళ్ళని తినే యదమే ఈడిపని - నాగురించి కాదురో ....యీడిగురించైనా ....ఇన్నాళ్లు వూరుకొన్నారు ...పనిపాటల్లో వున్నారని సెప్పుకొచ్చినాను ....సంబరం సెయ్యాలిరో! అప్పుడే నాను సొర్ని అమ్మోరిని, చూతల్ని తగిలేస్తంటే, యీడు సాయంసేస్తాడురో! నాయనలారా! సెయ్యండిరా ....సంబరం సెయ్యండి! ...."

రాగాలతో దాసుని కోర్కె బయటపడటంతో, అంతవరకూ పిడి కిల్లో ప్రాణాలుపెట్టుకొన్నవా ళ్ళందరిలోనూ కొద్దిగా ఉత్సాహం బయలు దేరింది. నీలమ్మతల్లి సొర్ని అమ్మవారు, ఈ ఊరు దిబ్బసెయ్యకండా కాస్తుంది. ఆ తల్లికి సంబరంసెయ్యాల సెయ్యాలని అందరూ వూసు లాడుకుంటూంటే, పెద్దరైతు గుమ్మందగ్గర నిచ్చని, గట్టిగా అన్నాడు: "పచ్చే గౌరీపున్నమనాడు, యీడూ ఆడూ అనకండా ఊరంతా కలసి నీలమ్మతల్లికి తిరుగుడులు చెయ్యాల"

"ఓ" అన్నారు అందరూ!!

2

గౌరీపున్నమ వచ్చింది. పల్లీయులలో ప్రమాదం హెచ్చింది. పున్నమ అయిదురోజు లున్నదనగా చిన్న తాటిరేకు బుట్టల్లో ఇసుక పోసి అయిదారురకాల పప్పుదినుసులు వేసి నీడలో వుంచారు. జాజి పూలు నారకుచ్చుల్లా పెరిగాయి. ఆడమ్మలు ఉపవాసం వున్నారు. జాజి పూలజుత్తులో దోపుకున్నారు.

సాయంత్రం దాసుడు గుడిగుమ్మందగ్గర నిల్చున్నాడు. చూపులో సంతోషం, నిట్టూర్పులో నిటారు: జుత్తు విరబోసివుంది. ముక్కులో బంగారంకాడతో మూతి తెరచి నిల్చున్నాడు. వాతావరణం వెచ్చగా హాయిగా వుంది.

ముఖాలనిండా పసుపురుద్ది మోదాన్నిగొలిపే ఆడంగులు, ఆనందంతో హాయిగా బిందెలనిండా ముర్రాటాలతో వయ్యారంగా నడుస్తూ దాసునికాళ్ళమీద వారు పోస్తున్నారు.

ఒక మొక్కు మొక్కుతున్నారు, దాసుడు గర్వంగా చూస్తున్నాడు. తన బ్రతుకు ఎంత మారిపోయినది! కొన్నేళ్ళక్రితం పీళ్ళందర్నీ అమ్మా తల్లీ అని బ్రతిమాలి చోడిగింజలు అడుక్కునేవాడే! అదిగదిగో పెద్ద రైతుభార్య! నాయుడుగారు. ఇంకా ఎందరు తనకాళ్ళమీద పసుపు నీటిని కుమ్మరిస్తున్నారు!!

ఏటికీ, గుడికీ మధ్య రంగు రంగు చీరెలతో, నెత్తిన బిందెలతో పల్లెవనితలు నడుస్తూనేవున్నారు. కొండమీద ప్రొద్దు కనుగీటి క్రుంగింది.

కనుచీకటి. చంద్రుడు లేడు. శరత్కాలపు వెన్నెల శరీరాలని పులకరింపచేస్తూంది! ఒకమూలనుంచి ఏదో కూనిరాగం, ఇంకోపేపు గంగమ్మతల్లి గలగల్లాడుతూంటే చూస్తున్నవాళ్ళ కిలకిలలు! అంతా ఆనందమయం!

భోజనాలయ్యాయ్. దగ్గరనున్న పట్నంనుంచి అద్దెకు తెచ్చిన రెంటు పెట్రొమాక్సులైట్లు వెలిగాయ్. అప్పుడే డప్పులు ధమధమలాడుతున్నయ్. విశ్వమంతా వెలిగిస్తున్న చందమామను వెర్రెత్తించి, డప్పులవాళ్లు పరిగెత్తిస్తున్నారా అనిపిస్తున్నట్టు బాదుతున్నారు.

ఉదయంనించి ఉపవాసంవున్న దాసుడు, ఒక్కొక్క బొమ్మనే కర్రపుష్పకం ఎక్కించాడు. ప్రజల్లో ఉత్సాహం రేకెత్తింది. అరటిపళ్లూ పువ్వులూ పుష్పకంమీదకు విసిరారు; చిచ్చుబుడ్లు కాల్చారు; పుష్పకం చాకలివాళ్ళ భుజాలమీది కెక్కింది.

రంగులతో అలంకరించుకొన్న విగ్రహాలు ఎర్రనిపుష్పకంచుట్టూ కలవతోరణాలు. దాసునికి వూరంతా కలిసి ఇచ్చిన నేరేడుపండురంగు పట్టుపంచె,—వెన్నెల్లో మెరిసే సున్నమేసిన గుడి....ఈ రంగురంగుల కలయిక హరివిల్లు చూసినట్లుగా....కనులపండువుగా వుంది;

అందరిముఖాలు పున్నమవెలుగులాగే మెరిసిపోతున్నాయ్;దాసుడు పీఠాధిపతిలా పుష్పకంముండు నిల్చున్నాడు.

సీలమ్మగుడి ఎదురుగా రెండేళ్ళక్రితం కొబ్బరితోట వుండేది. 1943లో పెద్దగాలివాన నాలుగుచెట్లని తప్పించి, మిగతావాటిని వూడ్చేసింది. ఆ స్థలంలోనే దప్పులు మోగుతున్నాయ్; ఉత్సాహం ముసలివాళ్ళలోకూడా తాండవించింది. పెద్దవాళ్ళ భుజాలమీద చిన్నకుర్రాళ్లు కూర్చుని చూస్తున్నారు. చుట్టుపట్ల గ్రామాలనుంచి వచ్చిన చుట్టాలు, బంధువులూ, మరింత ఉత్సాహంచూపిస్తున్నారు.

దప్పులు "ఛినకఛినక్ సో...." అని మందంగానే మోగడం మొదలుపెట్టాయ్. ఒక ఐదేళ్లకుర్రాడు మొగ్గలువేస్తున్నాడు. దప్పుల వాళ్లు గంతులేస్తూ బాదుతున్నారు.

ఇంకో ముసలాడు ముందుకు వచ్చాడు. పళ్ళాడినా, "ధంజినకడీ ధంజినకడి;" — అని దప్పులవాళ్లను యెగరకొడ్తున్నాడు.

"ఇదిగో ...వచ్చాడూ;" అన్న తృప్తి చుట్టూ మూగినవాళ్లలో ఒక్కసారి అవరించింది; చెక్కు చెదరని ఉక్కులాంటి శరీరం; పంచె లంగోటీలా ఎగగట్టి, మీసాలు మెలుపుకుంటూనే రంగంలోనికి పిల్లి మొగ్గతో మధ్యకురికాడు. నలుపైనా నిగనిగలాడే దేహచ్ఛాయ; పొడుగాటి ముక్కుకుతగ్గ వుబ్బిన పెద్దముఖం; కళ్లు కళకళలాడుతున్నాయ్; మెడలో కాశీతాడు, మణికట్టుకు మరొక నల్లత్రాడు; అదే చెప్తుంది గరిడీలో వాడు ఘటికుడని; గూటాల్లాంటి దండలు, దూలాలవంటి తొడలు; అంత మనిషి ఒక్క ఎగురుయెగిరి గాలిలో తేలిపోతున్నాడు. ప్రతీ కీలు

సులభంగా త్రిప్పుతున్నాడు.గేరాగిరజాలు వీపుకు అంటీ అంటనట్లుండి ఎగురుతున్నయ్. వాడే, మరెవడూకాడు.... పుల్లయ్య!

దప్పులవాళ్ళు ఒకచోట నిల్చుకోలేకపోయారు. అదిగో ముందుకు వెనకకి రొప్పుకపోతున్నారు,

"ఝనక్ ఝనక్ లబ్బిమ్మకడి ఝనక్ ఝనక్" పుల్లయ్య ఆటకి దప్పులన్నీకూడి దగ్గరకువచ్చి మోగుతున్నాయ్. ఆ చుట్టుపట్ల పదిగ్రామాలకీ పేరుపడ్డవాళ్లు....పుల్లయ్య ఆటకి ...అప్పుడప్పుడూ దప్పులు ఆగిపోతున్నాయ్! పెట్లిపోతున్నాయ్. భళిరాపుల్లయా!అని ప్రజలరుస్తున్నారు!

ప్రక్కన దప్పులు గడ్డిమంటవేసి కాచుకున్నా పోటీకి నిల్చోలేకపోతున్నాయ్. అప్పుడే రెండు దప్పులు పెట్లిపోయాయి. పులిఆట ఆడుతూ అడుగులువేస్తున్న పుల్లయ చప్పున ఆగిపోయాడు. అందరూ గతుక్కుమన్నారు. దప్పులవాళ్ళ ముఖాలు మెరిశాయ్! పుల్లయ్య అలసిపోయి ఓడిపోయాడు!!

పుల్లయ్య నాలిక కరుచుకున్నాడు. ఆ తల్లికి మొక్కుకుండా మొగ్గలేశాడే! ఎంత పొరపాటైపోయిందిరా గబగబ నీలమ్మతల్లిదగ్గర కెళ్ళి వొక మొక్కుమొక్కాడు. దానునికి దండంపెట్టాడు. దానుడు చిన్న నవ్వు నవ్వి "భళిరా! పుల్లయ్యా!" అన్నాడు. పుల్లయ్య వొక్క ఎగురు ఎగిరాడు. ఆ యెగురుతో రంగంలో పడ్డాడు. దప్పులవాళ్లు కొయ్యబారిపోయారు. వాళ్ళ చేతులకు శక్తిలేనట్లుగా దప్పులు మోగుతున్నయ్. అందరూ వూసులాడుకుంటున్నారు. "పుల్లయ్య,పుల్లయ్యే తక్కువోడా?" "ఆడికి గరిడీలో చుట్టుపట్ల మించిన మగోడున్నాడా? లేదు ...లేదు.... నిజద్దిగా లేదు" అంటున్నారు,

గర్వంతో వొక ముసలాడు మీసం దువ్వుకున్నాడు.తనకు గురువు పుల్లయ్య అయినందుకు వొక చిన్నకుర్రాడు నవ్వుతూ హాయిగా భుజాలు తట్టుకున్నాడు.

పుష్పకం కదిలింది. ప్రజ కదిలారు. ముందుగా చిచ్చుబుడ్లు వెలిగాయ్.

ఊరిలో ప్రతి ఇంటిదగ్గిరా వుష్పకం ఆగుతోంది. ఇల్లాళ్లు బెల్లం పడపప్పు, అరటిపళ్లు నీలమ్మతల్లికి ఇస్తున్నారు. ఇంటిని చూచి మరీ

దాసుడు నీలమ్మభాగాన్ని తీసుకుంటున్నారు. కొందరు చీరలు చూపించి మొక్కుతున్నారు.

పెద్దరైతు ఇంటి కెదురుగా మళ్ళీ చాలాసేపు ఆగారు. పుల్లయ్య చేత బాణాకర్ర పటుకుని సాముకు లంఘించుకున్నాడు. "ధంజినకడి ధంజినకడి" అనే శబ్దంతో చెవులు బ్రద్దలైపోతున్నాయ్. రాకెట్‌లా గాలిలో కర్ర తిరుగుతోంది. కంటికి కనబడ్డంలేదు. దప్పులు ఆగిపోతున్నాయ్. అదిగో ఆగిపోయాయ్! ఇదిగో ఆగిపోయాయ్ చెమటలు కక్కుతున్న పుల్లయ్య ఫకాలుమన్నాడు. ప్రజలంతాఒక్కగొంతుకతోకేక వేశారు "భళీ! భళీ!!"

అవును—పుల్లయ్య పెద్దరైతు ఇంటి అరుగుమీద మూగిన—యౌవనంతో బలిసి మిసమిసలాడే సువాసినుల హృదయాల్లో—అదేదో అనుభూతి కలిగిస్తున్నాడు.

పుష్పకం కదిలిపోతూంది.ప్రజ కదులుతున్నారు. పెద్దవీధిలో మరి రెండుచోట్ల గరిడీపెట్టారు. పుల్లయ్య శిష్యులు గురువుపేరు నిలబెట్టారు. పెద్దవీధిచివర పుష్పకం ఆగింది. ఎదురుగా కలకత్తానుంచి మదరాసుకు పోయే బ్రంకురోడ్డు వుంది. రోడ్డు రెండోవైపు రెండు పీధులున్నాయ్. పుష్పకం రోడ్డు దాటేముందు మళ్ళీ దప్పులవాళ్లు శక్తిని కోలుకున్నారు.

పుల్లయ్య పిల్లిమొగ్గతో రోడ్డుప్రక్కనే నడిచాడు. మళ్ళీ లేచి నిల్చుని గిరిచుట్టూ తిరిగాడు-ఆవేశ సంతనుంచి వస్తున్న బళ్ళసమూహం ఈ ఉత్సవాన్ని చూసి ఆగింది. బళ్లు ఎక్కి బండినాయుళ్లు చూస్తున్నారు. మధ్యకొచ్చాడు ఒక కుర్రాడు. మూడు పళ్ళాడిన పాపడు. తొడలు చరుచుకుంటూ గెంతుతున్నాడు. దప్పులవాళ్లు గాలిలో ఎగిరిపోతున్నారు. మూతిబిగించి కుర్రాడు వాళ్లకంటే హుషారుగానే ఎగురుతున్నాడు. బుగ్గలు పొంగివున్నాయ్. గోచి వూడిపోతూంది. ఆరేడేళ్ళ నిండక పోయినా ఎక్కడకండ అక్కడుంది. చూపుకి ముద్దుగా, ముచ్చటగా వున్నాడు. అంతా ఆ కుర్రాడినిచూసి వుబ్బిపోతున్నారు.

పుల్లయ్య శిష్యుణ్ని చూసి "పహావ్వా" అనుకున్నాడు.ఒక్కసారి మధ్యకురికి పిల్లిమొగ్గవేసి కదలకుండా ఒక్కచోటే నిల్చున్నాడు. తల ఆ మెత్తని భూమిమీద ఆన్చాడు. దప్పు లాగిపోయాయ్. పాపడు గబ

గబ గాలిలోవున్న పుల్లయ్య పాదాలవరకూ తాటిచెట్టు యెక్కినట్లు యెగ బ్రాకుతున్నాడు. పుల్లయ్య కాసుకోలేదు. కుర్రాడు జారిపోతాడు. తప్పక జారిపోతాడు! అందరూ....బండినాయుళ్ళతో సహాగొణిగేశారు....కుర్రాడు రెండుపాదాలమీద తన చిరుపాదాలు వేస్తున్నాడు....

నిశ్శబ్దం! నిశ్శబ్దం! నోళ్ళన్నీ తెరచివున్నయ్. ముఖాలన్నీ మీదికి ఎత్తి చూస్తున్నయ్.

ఒక్క విజిల్....పాదాలమీద నిల్చున్న కుర్రాడు భుజాలుతట్టి నవ్వుతున్నాడు.

ఆహా!...భళి....భళి!....ప్రజల కంటిరెప్పలు పడడంలేదు. గుండెలమీద పిడికిళ్లు పట్టుకున్నారు. పుల్లయ్య ఊపిరి బిగపట్టాడు!

నిలవసీటిలో ఒకబెడ్డ వేసినట్లు....తరంగాల్లా వచ్చి పుల్లయ్యచెవులో మాటలు దూరాయ్. ఎవరది? బండినాయుడే?....“ఇంకెవరికంతసాహసం వుంటాది? ఆ కిందోడికొడుకే మీదోడు!”

పుల్లయ్యకళ్లు కాయలుకాసిపోయాయ్. ఆ అన్నమనిషిని చూడాలి! తప్పక చూడాలి! పాపడు దిగిపోయాడు. ఎదురుగావున్న బండినాయుడే! ముసలాడిగాలేని ముసలాడు—వయసులోవున్న ముసలాడు—ఉత్సాహంలో కుర్రాడు.ఇంకా మురిసిపోతూ బొక్కినోరువిప్పి నవ్వుతున్నాడు

బళ్లు కదులుతున్నాయ్. ముసలాడు కొరడాతో దున్నపోతులను అదిలిస్తూ “అదృష్టంఅంటే అలాగుండాలి! ఆయ్యపేరునిలపే పాపణ్ని కన్నాడు!”

బళ్లు కదిలిపోయాయ్. పుష్పకం కదిలిపోతూంది. ప్రజా కదులుతున్నారు. పుల్లయ్య కదలలేకపోయాడు!

అవును. కొడుకు! నాకు కొడుకు!! నాకా కొడుకు? నా కెందుకు కొడుకుండకూడదు? నాకూ కొడుకు కావాలి, కావాలి.

ముచ్చటగా, ముద్దుగావున్న పాపడు. ఆడూ నాలాగే గేరా గిరజాలు పెడ్తాడు. నలుగురిలోనూ మెప్పు తెస్తాడు. దేనికీ జడవడు. ఆడిని గరిడీలో ఘటికుణ్ని చేస్తాను. మాటన్నాడంటే ప్రాణంపోయినా నిలబడతాడు. దొంగల్నిపట్టే దొరవుతాడు. దోసిళ్ళతో దానంచేస్తాడు. మట్టిని నమ్మి చెమటకార్చి మా పరువు నిలబెడతాడు!

నా కొడుకు! నా కొడుకు!!

3

పెళ్ళాంకన్నా పిల్లడిగురించి తలుచుకోవడమంటేనే పుల్లయ్యకి హాయిగావుంది. ముసలాడిమాటలు మళ్ళీమళ్ళీ నెమరువేసుకుంటున్నాడు చటుక్కున పోతులకి గడ్డివెయ్యలేదని జ్ఞాపకంవచ్చింది. అడ్డత్రోవ గుండా ఇంటికిపోవాలని రోడ్డు ఎక్కాడు.నాలుగడుగులువేస్తే రోడ్డు ప్రక్కనే కళ్ళాలు. కళ్ళాలనుఆనుకునే పదమటివేపున మురగడిమడులు. మడిగట్టుమీద నడుస్తున్నాడు. మళ్ళీ కొడుకుతలపు పోతులగురించి మరిచిపోనిచ్చింది!

ఆగాడు. ఏటిఒడ్డు కనిపిస్తోంది. అదిగో నీలమ్మగుడి. చంద మామ ఎత్తునవున్నాడు. మేఘాలు తెలతెలపోయి తప్పుకున్నాయ్. పట్ట పగల్లా వెన్నెల తీర్చికాస్తోంది.

వెన్నెల్లో ఏటిమీదున్న మూడుఫర్లాంగులవంతెన తెల్లతెల్లగా మెరిసిపోతూంది.

చల్లనిగాలికి మెల్లగ కదులుతూ పొట్టతో పచ్చగావున్నచేను పలక రించింది. "హాఁ హాఁ — మాతల్లి లచ్చిందేవి" అని మనసులో చేతు లెత్తి మొక్కుకున్నాడు. అక్కడక్కడ పొట్టవిడిచిన వెన్నులు వూగు తున్నాయ్. ఆ ప్రశాంతతలో గలగల్లాడుతున్నయ్ — మా లచ్చిందేవి గాజుల గలగలు!

నవ్వుకున్నాడు. సంతోషంతో శరీరం వుబ్బిపోయింది. అడుగులు వేస్తున్నాడు. ఆకాశం నిర్మలంగా వెలిగిపోతూంది.

పాడింపంటలున్న బంగారుభూమి. పాలుపెరుగులున్న పల్లె. కవ్వ మాడని ఇల్లు, కదురుతిరుగని కొంపాలేదు.

మావూరు! ఇది మావూరు! పుల్లయ్య తనవూరును తలుచుకుని ఒక్కఎగురు ఎగిరాడు.

చిత్త చిత్తగించి, స్వాతి చల్లచేసి, విశాఖలో విసరకుండావుంటే అనూరాధనాటికి అడిగినంత ఫలసాయం ఇస్తానంటుంది భూమాత. రోహిణిలో వర్షంకురిస్తే రోళ్లు విండిన పంట!

ఈవూళ్ళో గంగమ్మతల్లికి కొదవలేదు. వర్షాలు కొండల్లోకురిస్తే ఏరుపారుతుంది. కాలువలు నిండిపోతాయి. పంటలు పోవటం విచి

త్రంగా వుంటుంది వీళ్ళకి. రెండేళ్ళక్రితం కోతలు కోస్తారనగా గాలి వాన కొట్టింది, వూడ్చేసింది. వూడ్చేసినా ఈవూరివాళ్లు చెయ్యి వాపలేదు. కరువుపెట్టిన మెట్టప్రాంతాలవాళ్ళకి సహాయంచేశారు.

ఇల్లాంటిది తనవూరు. ఇంత గొప్పది తనపల్లె! పుల్లయ్య తిరిగి చూశాడు. చిన్న తెల్లమబ్బు చందమామను కప్పేసింది. చిన్నగాలి చేను మీద సవారీచేసింది. అవును. సకాలంలో పడింది ఇత్తనం. గాదెలు, నిండవా? చప్పున తనవిషయం తలుచుకున్నాడు.తనకొడుకు! —కొడుకు తనలా గిరజాలుతిరిగి, దొంగలనుపట్టే దొర—సకాలంలో పడ్డవిత్తనం, కాలంయెరిగిన కొడుకు ఒకటి! కార్తిలోపడని వర్షం, కాలంలో పుట్టని కొడుకు సమయానికి పనికిరాడే!

పెళ్ళాంలేకుండా కొడు కెలా వస్తాడు? పెళ్ళాంకన్న ఒళ్లు ముఖ్య మన్నపట్టుదలే ఇంకా పెళ్ళాంగురించి తలుచుకోడానికి జంకుపుట్టిస్తోంది.

కాలు కదిపాడు.

ఎక్కడినించో—ఆ తియ్యనిరాగం!

"చందమామో!"

పుల్లయ్యఒళ్ళంతా ఒక్కసారి మురిసిపోయింది.

"నోమీ నోమన్నాల నోమన్నలాలో—"

వహ్వా—బలే బలే—పెదాలు చప్పరించాడు. ఎన్నో గంధర్వాం గనల గాత్రాలలా కలిసి"చందమామో!"—

మళ్ళీ వొకే స్వరం "నోమీ నోమన్నాల నోమన్నలాలో—"

పుల్లయ్యకు ఆ గొంతుక పిలిచినట్లయింది! పరుగులెత్తి ఆగొంతు కలో కలిసిపోదా మనిపించింది.

తనే ఏమిటి? పిలుపువిని చందురుడేసరిగ్గా పోలేక ఇటు పరుగెత్తి వస్తున్నాడు.

తేజరిల్లిన చందమామ తెగ మురిసిపోతున్నాడు.

"చందమామో! "ఎన్నోస్వరాల! చప్పట్లుకూడా వినిపిస్తున్నాయ్.

మళ్ళీ తన క్కావలసినగొంతు మధురాతిమధురంగా "వాటి చేతులు పెద్దావని చేటలు కొననివ్వడే—"

"చందామామో! చందమామ!!"

పుల్లయ్య గప్పు గప్పుమంటూ గంతువేసివచ్చాడు.గుడి దాటాడు. ఏటివొడ్డున పడ్డాడు. ఆ స్వరం తనను లాగుకొంటోంది. ఏదో అనుభూతి మురిపింపచేస్తూంది!

వెన్నెలను యేరు మింగుతూ దిగువకు దిగజారిపోతూంది.

అదిగో ఏటివొడ్డున వంగిన చింతచెట్టు. చెట్టుపక్కన పొడక బండి. ఆ బండిపక్కన చిన్న బయలు. ఆ బయలులో —ఆ వెలుగులో తెల్లబట్టలతో పసందైన పల్లెపడుచులు!

నృత్యగానాలతో నీటుగా మెరిసిపోతున్నారు. పుల్లయ్య మెల్లగా దొంగలా చెట్టుచాటున చేరాడు. కళ్లతో వాళ్ళని మింగేసేలా చూశాడు. మనసుభో సరసాలతో తాను మురిసిపోతున్నాడు!

చప్పట్లుకొడుతూ ఎనమండుగురు వెనక పాటతోగెంతులేస్తున్నారు. వాళ్ళచుట్టూ తిరుగుతూ, ఇంకోపడుచు ముందుపాట పాడుతోంది.

ఆ పాడుతోందే నీలమ్మ, ఊరంతా నీలి అంటారు.

నీలి వంగుతూ, వాలుతూ వయ్యారంగా చుట్టూతిరుగుతూ, చెట్టు దరిదాపులలోనికి వస్తూంటే. పుల్లయ్య నరాలు వుబ్బిపోతున్నాయ్. చెయ్యి పట్టుకొని లాగి చేతితో నలిపేద్దామని వుబలాటపడుతున్నాడు.

తెల్లని బట్టలు — పండువెన్నెల — బలిసిన శరీరాలు — విజృంభించిన యౌవనం. చల్లని గాలి. మెల్లని తియ్యనిపాట. హాయ్ హాయ్!

జాకెట్లులేని జివ్వనులు.

ముఖాన పసుపు, మెట్టల్లో జాజులు. మళ్ళీ పాట మొదలు కొచ్చారు.

"నోమీనోమన్నాల నోమన్నలాలో —
చందామామో!
వాడిచేతులు పెద్దావని చేటలు కొననివ్వాడే
చదాంమామో!"

పుల్లయ్య చేతులు చూసుకొన్నాడు. పెద్దచేతులే. హాయిగా రాగంతో తిరుగుతూ నీలి చెట్టుచాటుకు వస్తోంది.

ఆహా! ఆ విజృంభించిన యౌవనశోభంతా ఆ వక్షంలోనే వుంది. చూసిన పుల్లయ్య వెర్రెత్తిపోయాడు. మళ్ళీ తిరుగుతూ —

"వాడికడుపూ పెద్దాదని కడవలు కొననివ్వడే
చందమామో, చందమామ!"

చప్పట్లు, లయ, లయకు తగ్గట్లు అడుగులు పడుతున్నయ్. మళ్ళీ నీలి చెట్టుచాటుకు చేరింది. నీలి ఆట్టే నలుపుగాని నలుపు. ఆ ముఖం అమాయకానికి నిలయం. అసూయలేని తనకు ఆ ముఖంలో వుంది.

ఒళ్లు విరుస్తూ మళ్ళీ గొంతుకెత్తింది—

"వాడికాళ్ళూ పెద్దావనీ నిచ్చెన కొననివ్వడే —
చందామామో చందామామ!"

ఆ ఒళ్లు విరుపు- ఆ కళ్ళ తనుకు- పుల్లయ్య బ్రామనుకు అంటి పోయాడు.

"వాడిపళ్ళూ పెద్దావని పప్పొండనివ్వడే —
చందామామో చందామామ!"

పడుచులు చుట్టూ తిరుగుతున్నారు. పుల్లయ్య పట్టలేని మమకారంతో, మనసు కలిపానని, నిలిపానని, ముందుకు రెండుసారు నీలి చెయ్యి పట్టుకోవాలని, వురుకుతూ ఆగిపోయాడు.

ఇక పదం చకచక నడిచింది. పుల్లయ్య ఉరకలు వేస్తున్నాడు.

"వాడి బొక్కినోటికి లెక్కల పలకర
వాడిపట్టిబుర్రకి, పట్టుతలపాగో"

"అమ్మో! అలాంటి మొగో డెవరిక్కావాల!" ఎనమండుగురూ తుర్రున ఎగిరిపోయారు తూర్పుదిక్కు. నీలియిల్లు దక్షిణానికి వుంది.

"నీలి నిల్చింది! నిజంగా నీలి నిల్చింది! ఒంటిగా! వహ్వా వహ్వా! నీలి నిల్చింది!"

నీలి కదుల్తోంది. కదిలిపోతూంది.

పుల్లయ్య పయ్యాట చెంగుపట్టి, పట్టి లాగాడు. వెనకనుంచి నీలి అదిరిపడి చూసింది. ఆ చాటుకి లాక్కొంటే "హా....దొం....గ!"

పుల్లయ్య మూతిమూసి గుండెన హత్తుకున్నాడు. ముఖంలో ముఖంపెట్టి "దొంగనో దొరనో సూడు! బాగా సూడు!"

"హా హా —నీకు నాయంకాదు, నాయంకాదు. దేముడునీకుబాగా సూడ్డు. వదిలే....వదిలే"

నీలి గుమ్మరిస్తోంది, పుల్లయ్య వదల్లేదు. గట్టిగా అరవబోయింది. అరవలేదు. గుంజాటన పడుతోంది. విడిపించుకోలేక గిజగిజలాడి పోతూంది.

మెట్ట (కొప్పు) వూడిపోయింది. మనిషి నలిగిపోయింది. అంతా అయోమయం!

ఉష్! అన్నాడు పుల్లయ్య ఒక్కసారి. కరిచి విడిపించుకున్న నీలి పరుగులెత్తింది. చేతిమీది కాటురాస్తూ "నిన్నే పట్టుకోకపోతే" అంటూ తలాడించాడు. వెళ్ళిపోతున్న నీలి "సిగ్గులేదూ!" అన్నట్లు వినిపించింది.

4

త్రల ఆడించుకుంటూ నాలుగడుగులు వేశాడు. తిరిగి చూశాడు. నీలి కనబడలేదు. కాని నీలి తన దగ్గరే నిల్చున్నట్లనిపించింది. పెదవు లొకసారి చప్పరించాడు. తస్సదియ్యా, ఎక్కడికి పోయిం దనుకుంటూ ఇంటివేపు నడిచాడు.

పాదాల చప్పుడు విని నిల్చున్న పోతులు తేరి జూచాయి.కన్నెలు తెంపుకొని దగ్గరకు రావాలని వురుకుతున్నయ్. గబగబ పెరటిలోకి వెళ్ళాడు. గడ్డిమేటినుంచి గడ్డిలాగి పోతులముందువేశాడు.ఆకలితోవున్న పోతులు అమాంతంగా మ్రింగేస్తున్నయ్. నిల్చున్నాడు. పోతుల ఒంటి మీద దర్జాగా నిమిరాడు.

పైన వెన్నెల. పోతులు గడ్డితింటూ చిన్న శబ్దంచేస్తున్నయ్.చిరుగాలి వీస్తోంద. నులకమంచం వాకిట్లో వెన్నెల్లో వేసుకున్నాడు. కూర్చున్నాడు. పెరటిలోవున్న రావిచెట్టుమీద పిచ్చుకలు కిలకిలలాడుతూ చిన్న అలజడి చేస్తున్నయ్.

"చందమామో" పదం ప్రతిధ్వనిస్తోంది. చందమామవేపు చూస్తున్నాడు. పొంగే సముద్రంలా ఒళ్లు పొంగిపోతూంది! నీలి చరచరా తప్పించుకుపోయింది, పిట్ట!

మీసాలు సర్దుకున్నాడు. దానితో సరసాలతో మురిసిపోకపోతే యీడు పుల్లయ్యేకాడు! మల్లునాయుడుకొడుకే కాడు.

పోతులు చారబడ్డాయి.పుల్లయ్య వాకిటినుండి మంచమెత్తి గుమ్మం దగ్గర వేశాడు. గడ్డియిల్లు గుమ్మటంలా వుంది. అటున్న చందురుడు ఇటు వచ్చాడు.

నిద్దరపట్టలేదు. ఇంకా దప్పులమోత వినిపిస్తూనే వుంది. ఒక్క సారి తనెంత మారిపోయానో అనుకున్నాడు. "యీ యేళ పోతులకి గడ్డెయ్యటం మరిసిపోనాను. సీలమ్మతల్లికి మ్రొక్కటం మరిసిపోనాను. అంతా మరుపే!

ఏనాడూ పుల్లయ్యలో మరుపులేదే! ఏనాడూ ఆడాళ్ళకి దూరంగా వున్నాడే. ఈనాటికి ఆడదానికి లొంగిపోయాడే!

"ఛా ఛా! యేంబ్రతుకు! ఆడదానిచేతసిగ్గులేమా అనిపించుకున్నానే"

ఇలా చాలాసేపు గింజుకున్నాడు. తనగుండె ఎప్పుడు తెల్లవారుతుందని ఎదురుచూసింది. చూస్తూవుండగానే కంటిరెప్పలు బరువెక్కిపోయాయి.

తెలతెలవారేసరికి పొలంలో కత్తవబోరిగ భుజాన్న వేసుకుని పుల్లయ్య గట్టుచుట్టూ తిరుగుతున్నాడు. ఉదయాద్రి ముఖాన్న వెలిగే బాలభానుని కిరణాలు. పచ్చని ఆ ప్రకృతిపై బడి. పులకరింపచేస్తున్నయ్. అక్కడక్కడ మెరకనుంచి పల్లంకు పారే జలం చిన్న జలజల శబ్దం చేస్తోంది. చిన్నగాలికి చేను చేసే గలగల శబ్దం. ఆ లేతఎండలో ఏరి ఎన్నులు హారంపడ్తున్నాయ్!

బారెడు పొడవున చేను, జానెడు పొడవున్న యెన్నూ! ఈ ఏడు రోళ్లు నిండినపంట తప్పదు.

ప్రక్క పొలంనుంచి పీన నరిసింహులు "ఓరయ్యా! ఈ యేడు మిడత మచ్చుకొకటీ లేదురా"అరిచాడు. నరిసింహులను ఊళ్ళోవారంతా ఇంటిపేరుపెట్టి పిలుస్తారు.

"మిడతలా? సేనిముంగటి కొస్తే సంపేసి నలిపెయ్యనూ"అన్నాడు. పుల్లయ్య పట్టుదలతో అరచిన అరుపుకు చేను ఊగుతోంది. చిన్న బుడబుడ శబ్దం. బుంగ సీటిని మింగుతోంది. బొరిగతో బుంగని కప్పుతున్నాడు.

బుంగ కప్పటంవల్ల నీరు క్రిందగలేదు, ఇంతలో పీస తన గట్టు మీదకు వస్తూ "యింకేంరా గట్టునున్నగడ్డి కోశావుకాదుఁ"

"కోశాను. మళ్ళీ పెరిగిపోతంది. పెరగనీ పెరగనీ. ఈ ఊరు పశువులనోట శనుంచేనాఁ మనూరంటే యేంటిఁ బంగారం! బంగారం!"

పుల్లయ్య మాటలకి పీస నవ్వాడు.తన తరవాతతరం ఊరిని చూచి గర్విస్తోందని.

"దిగవపొలాని కెళ్ళావాఁ"

"ఓ! అందులో యీ యేడు చేను తెగబలిసిపోనాది!"

"నీకేంరాఁ ఒక్కటే లోటు!"

"నాకాఁ నాకేంలోటుఁ నాకులోటన్న మొగా డెవడూఁ"

"పట్నం బుగతోరి రెండెకరాల పొలం అంబారానికి దున్నుతున్నావాఁ మీ అయ్య గడించింది యేభై పెంట్లున్నాయాఁమరినీకడుపే పెళ్ళం అని యెప్పుడూ యేడిస్తే.... ఈ ఒళ్లు యినపదిమ్మా యిలాగ వుండిపోడానికిఁ—యినపదిమ్మే తుప్పపట్టుది—కాలూపెయ్యికి అయ్యేవో ళ్లుండాలంటావా"

పీస ఇదివరలా ఇప్పుడూ పెళ్ళి చేసుకోమంటున్నాడు. కొత్తేమీ లేదు. పుల్లయ్య కొరకొరా చూడలేదు. చిరునవ్వు నవ్వాడు. ఎదుగుగా వున్న మనిషి బుగ్గమీసాలు ఆడుతున్నయ్! చీకికళ్ళతో చూస్తున్నాడు. చిన్న నవ్వునవ్వాడు. "నా కైదుగురాడపిల్లలు, ఆరుగురు మొగపిల్లలు సుమా!" అన్న గర్వం ఠీవిగా నిల్చున్నవాడిలో కన్పిస్తూనేవుంది.

పంచ యెగగట్టిన పీస ఒంటిమీద బట్టలేదు. సగం నెరళన తల గోక్కుంటున్నాడు "నీకు తెలీదు! సూశావాఁ జపానోడు వస్తాడనుకున్నాను. పిల్లలనుబట్టి భూమి పంచేస్తాడనుకొన్నావాఁ ఆడు ఓడిపోనాడని పట్నంలో మొన్న అనుకుంటున్నారు. నాను నమ్మలేకపోనాను. పొట్టోడికి పుట్టెడు బుద్ధులుకదాఁ ఏ మంత్రిమో, తంత్రమో యేసి, తెల్లోడిని మోసంచేసైనా రాజ్యం యేలతాడనుకున్నాను! పోసి యిప్పుడేం పోనాదిఁ కాంగ్రెసోడు రాడాఁ ఆడూ జపానోడిలాగే యెక్కువమంది 'పిల్ల' లున్నోళ్ళకి యెక్కువ భూమి వుండాలంటాడటలే"

పుల్లయ్య నవ్వాడు. పీస పట్నం ప్లీడరుబాబు నాలుగెకరాల పొలం దున్నుతున్నా, ఇప్పటికి పదేళ్ళయింది. రెండుసార్లు అంబారం ఇవ్వలేక పోయాడు. ఇచ్చేదామని వుబలాటపడ్డాడు. ప్లీడరు ఊరుకోలేదు. కోర్టు కెక్కించాడు.ఉన్న జిరాయితీ పొలం అమ్మేసి అంబారంసొమ్ము కట్టాడు. కోర్టుకు తిరిగాక గేనం కలిగింది. లోకంపోకడ తెలిసిందని పీస చెప్పుకుంటాడు.ఓళ్లో తన ఈడుమాళ్లు పీస మాసెద్ద తెలివైనో డంటూంటారు.

పుల్లయ్య పద పోదాం అన్నాడు.

పీస యెగువపొలాని కెళ్లొస్తా నన్నాడు. ఒకడుగువేస్తూ"ఓరయ్యా! గాంధీమహాత్ముడున్నాడే! మారాజు—దేవుడితో సమానం!"

"ఓ ఓ! దేవుడే" అన్నాడు పుల్లయ్య.

"అలాంటి దేముడు మా సెద్ద పట్టుపట్టాడట! సూడు — కొంగ్రె సోడు రాజ్యం ఏలకమానడు! ఆడొచ్చాడూ అంటె — దున్నెవోడిదే పొలం అవుతాదంట!అయ్యా పుల్లిగా, పెద్దరైతుకి ముప్పైఎకరాలపొలం. ఒక కొడుకే. అలావుండానికి వీలుందదే! ఆడికంటె నాను పెదరైతు నవ్వాల. కాలమానం ఎలా తిరుగుతాదో! యేగం ఒకింటోడివైతే! ఒంటి పచ్చివా యిప్పుడు...."

పుల్లయ్య కులాసాగా నవ్వాడు. కొడుకు జ్ఞాపకానికి వచ్చి చరచరా నడిచాడు. గట్టుమీద నడుస్తూనే ఆగిపోయాడు. కొడుకు ముందు భుజాన బోరిగేసుకొని మిలటరీ మనిషిలా నడుస్తున్నట్లనిపించింది. ఒళ్ళంతా కళ్ళయి కొడుకుతీవిని చూస్తూ మురిసిపోతున్నట్లు భ్రమపడిపోతున్నాడు.

కొడుకు! నాకొడుకు! వాడిని ఎత్తుకుని ముద్దులాడాలని, తను పిల్లిమొగ్గేసి పాదాలదగ్గరకు యెగబ్రాకి యెక్కినిల్చుని భుజాలు తట్టే వీరుడు తన కొడుకు....కొడుకు!"

గట్టుదాటి, పుట్టదాటి, రోడ్డుదాటి, మురగడిపొలందాటి. గుడిదాటి తిన్నగా ఆదెమ్మాప్ప యింటివేపు వెళ్ళాడు.

ఆదెమ్మాప్ప ఊరంతటికీ అప్పే. చెవుకు నాగులూ,చేతులకు ముగులూ. ముప్ఫయియేళ్ళప్పుడు మనిషి ముదరకుండా నిగనిగలాడింది. అప్పటికి ఒక్కర్తే కూతురు. మనిషి ఇరవైయేళ్ళదానిలా వుండేది.

చిక్కితే రక్తంవచ్చే వంటిబింకం! అలాంటప్పుడు మొగుడుపోయాడు. మారుమనుం వెళ్ళమని చాలామంది చెప్పారు.పెద్దనాయుళ్లు కోరివచ్చారు! ఏసేమిరా కాదంది! సూద్దాం దీనిపంతం అన్నారు. నడుంకట్టుకొని ఎలాగ ఇంటిలో ఇంకొకడ్ని సూడకండా వుంటుందని....ఆ ఒక్క కూతుర్ని మేనల్లుడికిచ్చి ఇల్లరికం తెచ్చుకుంది. ఉన్న ఆస్తిలో, నిలుపుకున్న శీలంతో ఊరందరికీ అప్పయింది! ఈ యేభయ్యోపడిలో ఊరిలో ఎవరికి యే సలహా కావాలన్నా ఈ అప్పదగ్గిరకు రావలిసిందే.

పుల్లయ్య వచ్చాడు. అరుగుమీద అప్ప బెండకాయలు పులుసులోకి తరుగుతోంది! చూడగానే చిన్న నవ్వు నవ్వింది.

"అడుగో వచ్చాడు! పెళ్ళి పెడాకులులేని పాపడు!"

పుల్లయ్య అరుగుమీద అప్పదగ్గరగా కూర్చున్నాడు ముదరబెండ కాయలవేపు చూస్తూ.

"అప్పా! పంతంవచ్చిందే!" అన్నాడు.

"బెండకాయలా ముదిరిపోనావు! ఈ వయసుదాకా మన జాతిలో యెవరూ నేరా! పెళ్ళీ గిళ్ళీ అయితే పంతా లెందు కొస్తాయ్! ఎవురితో యేం తగువు తెచ్చినావ్?"

పుల్లయ్య చెప్పడానికి సిగ్గుపడ్డాడు. అప్పతో సెప్పకపోతే ఈలు పడదే? పెద్దదిక్కు మరి! తెగించి చేప్పేశాడు.

"ఇన్నాళ్ళూ ఒళ్లు పాడవుతాదని పెళ్లొద్దన్నాను కానీ...."

"ఏటీ, ఏటీ! పెళ్ళా పెళ్ళా! నా నాయనే! ఎంత మంచికబురు సెవిలో యేసినావురా! ఒక యింటోడివై తే....నీ పిల్లా....నీ జెల్లా....!"

పుల్లయ్యకు ఇంకా సిగ్గు చావలేదు. ముఖందించుకొని బొరిగతో గడపమీద మెల్లగా పొడుస్తున్నాడు.

"మరి నాయనా! బంగారం యేమాత్రం వుంచినావు?—మన కులాచారంబట్టి పెళ్ళి నీ యింట్లో చెయ్యాలికదా? నువ్వంటే యెవర్తి వలచి రానంటాది?"

ఆమెముఖంలోని ఒకనాటి అందచందపు శేషాలు కన్పిస్తూనే వున్నాయ్. కత్తిపీట ప్రక్కకు నెట్టి సర్దుకు కూర్చుంది. పుల్లయ్యవేపు చూసింది! రెండో అరుగుమీద కూతురు రాట్నం త్రిప్పుతోంది. ఎదురుగా

పశువులసాలనుంచి ఆవులు తోలుకుని, మందకు పోతున్నాడు కాపరి: అప్ప అంది.

"మరి సెప్పు బంగారం యెంతుంచినావో:"

"ఏవుందప్పా: నీకు తెలీదా: ఆ వున్న భూమిమీదే యేవైనా తీసుకురావాల!"

"దానిమాటకేంగానీ...."

పుల్లయ్యకి నాన్చటం యిష్టంలేనట్లు గబగబ బొరిగఅక్కడ వదిలి అన్నాడు:

"అప్పా! మరి పంతంవచ్చిందే! విచ్చేళ్ళి ఆ నీలి...."

అప్ప ఱుగ్గమీద చెయ్యివేసి ఆశ్చర్యంగా చూసింది....చప్పున మాటాడలేక తికమకపడింది.

"ఇదేంటిరా నాయనా! ఎతె తి యెంగిలాకుమీద కాలేసినట్టు! నువ్వంటే — ఏసూపురేకల పాప రాదు:"

"అప్పా! మరి అడ్డుపెట్టకే! నాకు పంతం వచ్చిందని సెప్పినాను కదా:"

"తొందరపడకురా! నాయుడోరిబొట్టి నారాయణమ్మ మోజుపడి వస్తానంటే వద్దన్నావ్! ఈ ఊర్లో పెద్దింటి యే యెలవోడు నీకు బొట్టి నివ్వనంటాడు: సూడు,నా మాటిను! ఆ నీలా: ఏం సూపురేఖలు నేవు! పోనీ, కన్నారిది రూపాయన్నర కోక పాలైనా తెచ్చుకోలేదు!"

"అప్పా అప్పా!" ఆగిపోయాడు.

"అది సెల్లక వుండిపోనాదీ! అత్తారింటికెళ్ళితే నువ్వు కాళ్లు సేతులూ తీసుకురావాల! తొందరపడకు నాయనా!బంగారం పళ్ళెంలాంటి దానికే గోడసేరు వుండాలంటారు! ఏదో ఒక పెద్దింటి పిల్లని సేసుకుంటే —నీ కెవరున్నారు మరి: —కష్టాల్లోను నష్టాల్లోనూ సాయపడ్తారు"

పుల్లయ్య తలదించేశాడు.

కంటి యెదట నీలి....ఆ విజృంభించిన యౌవనంతో వశం: ఆ కౌగిలి....ఒళ్ళంతా జలదరించింది! పెదవులు చప్పరించుకొన్నాడు!నిన్నే పట్టుకోకపోతే....తన పంతం....సిగ్గులేదూ అందే:ఛా ఛా, పంతంపంతమే

ముఖమెత్తి "అప్పా" అన్నాడు. అప్ప ఆత్మతతో మనసు మార్చు కున్నాడేమోనని చూసింది.

"అప్పా! ఏం లేకపోయినా అది రెండుసేతులు తెచ్చుకోదా? రైతోడి కాళ్లసేతులు గట్టిగా వుండాలికానీ....!"

అప్ప చిరాకుగా అంది "నా నెందుకు యింత సెప్తున్నానో యిని పించుకున్నావుకాదు! దాని కా మూసల్ది తప్ప మరెవరూ లేరు. అది మనవ రాలియెంటే వస్తాది. రేపొద్దున్న అది గుటుక్కుమంటే నువ్వేసెయ్యాల! నీ కున్నదెంత? నలుగురు పిల్లా జెల్లా అయితే యెక్కడుంటావ్? కోరి ఇందరు పెద్దింటోళ్లు నీ కాళ్ళవద్దకు వస్తూంటే, వస్తున్న సంపదని తన్ను కుంటావురా?"

పుల్లయ్య — తెలిసిన వేదాంతంలోనికి దిగాడు. "అప్పా! ఉన్న పుడు రెండు, ఎలిపోయేటప్పుడు రెండు, మనిషి యెంట వుంటాయంట! ఆ కీర్తి, అపకీర్తి దానితోనే పడతానులే! నీమీదే ఈ పెళ్ళి భారమంతా యేస్తున్నాను!"

అప్ప లేచింది. "నాయనా! యీ పెపంచకంలో యెలాగో బతక లేవా? నీళ్ళో,పాలో,గంజో గడుగో ఆ పుట్టించినోడు యివ్వడా? పెద్దింటి అల్లుడివయితే ఎక్కడైనా పావలాడబ్బులకి పరపతి వస్తాదని యింత సెప్పినాను. ఆ నీలి అదృష్టం అలాగుంటే నేను యింత సెప్పటం తప్పే! నాను పెద్దదాన్నని నామీద భారమేసినావు కనక, నీ యమ్మవుంటే ఎలా గయ్యేదో నానూ అలాగయాను. అందుకే యిన్ని మాట్లాడాను. నీ దగ్గర నీమాటా, నాదగ్గర నా మాట ఆడటం నాకు తెలీదు. మనసులో వున్నది మొగమాటం లేకుండా అనేశాను. తప్పకండా దాన్నే సేసుకో! అది యింటికొచ్చిన ముహూర్తాన నీ యిల్లు లచ్చిందేవితో గలగల్లాడి పోకూడదా? మాలాంటోళ్ళం మీ బాగుకోరతాంగానీ, బిష్టు కోరతామా? మా అమ్మిని అడగటానికి పంపిస్తాను....బంగారమో?"

పుల్లయ్య లేదన్నట్లుగా ముఖంపెట్టాడు. అప్ప చిన్ననవ్వు నవ్వి, "ఆ ముసల్ది కూటికి తక్కువదైనా కులానికి తక్కువ గాదురా! యెన్న డక్కుండా మనవరాల్ని పెళ్ళికిస్తాది? సరే నువ్వెళ్లు-పోతులు కడగవా? నా నేదో సూస్తాను!"

పుల్లయ్య ముఖం వెలిగింది. అరుగుమీద నుంచి వురికి బొరిగ పట్టుకొని వుల్లాసంతో విజిలు వేసుకుంటూ వెళ్ళిపోయాడు.

5

పోలినాటి వెలమబిడ్డ పుల్లయ్య పెళ్ళి స్థిరమయ్యింది. ఈ పెళ్ళి గురించి తలోలా అనుకున్నారు. ఆ ఊరు చరిత్రలో యిదొక సంచల నాన్ని కలిగించిన ఘట్టం.

రూపురేఖలులేని, గతిలేని బొట్టికి, రూపురేఖలుండి నలుగురిచేతా శెభాష్ అనిపించుకున్న పాపడికి పెళ్ళి! సుట్టుపట్ల ఊళ్ళనించి యెందరు కోరి పిల్లనిస్తామన్నారు; తను అందులో యెవర్ని చేసుకున్నా ఆస్తి పాస్తులు కలిసొచ్చేవే. ఇప్పుడు రెండువేపులా ఖర్చులు తనే భరించాలి.

కొందరు రాత అనుకున్నారు. పెద్దవీధి రాట్నాలసాలలో పాతిక రాట్నాలు తిరుగుతూండగానే ఆడంగులు ఈ పెళ్ళినిగురించి ఊసులాడు కున్నారు.

చివరకు "ఆ యమ్మ శాపం ఊరకనే పోతాదా?సత్తెం!సత్తెం!!" అని ఒక వయసు మళ్ళిన మనిషందీ. అందరూ నిజమని తలూపారు.

ఆ స్థలపురాణం ఒక తరంనుంచీ ఇంకోతరంవారికీ కథరూపంగా అల్లుకుంది. ఒకప్పుడు ఒక జంట ఆ దారిన వెళ్ళిపోతూంటే, ఊళ్ళో కొందరు విరగబడి నవ్వారట! మొగుడు వికారంగా పొట్టిగా వున్నాడు. పెళ్ళాం తీవిగా, అందంగా, జబర్దస్తైన మనిషి! ఈడూజోడూలేని ఈ జంటను చూసి నవ్వగానే ఆ పెళ్ళాం పతివ్రత అవటంచేత,శాపం ఇచ్చిందట. "ఈ ఊరి ఆడపిల్లలకీ ఈ ఊరే గతి"అని.ఆ సమ్మకంవల్ల సాధారణంగా ఊరి పాటకజనం, రైతుకుంటుబాలు, ఈ యింటిపిల్ల ఆ యింటికి, ఆ యింటిపిల్ల ఈ యింటికి వచ్చేటట్లు చేసుకుంటుంటారు.

ఈ శాపం నీలికికూడా తగలటంచేత ఊళ్ళోనే మొగు దొచ్చాడన్నారు.

పెళ్ళికి నీలి ఒప్పుకుంది. పుల్లయ్య వహ్వా! అనుకున్నాడు. సిగ్గులేదూ అని రెట్టించింది. కాదేసింది....పెళ్ళికి ఒప్పుకుందే....బలే! నో

రూరిపోయింది. "పట్టుకుంటానన్నాను....నా పంతం నెగ్గింది. దాన్ని ఇలాగలాగ యెలాగడుగుతాను? మీసాలు తిప్పనూ? సిగ్గు నాకా దానికా? ఆ రోజు రావాల....రానీ....రానీ!" అని పుల్లయ్య పెదవులు బిగించాడు.

రోజంతా అదే తలుపుకువచ్చేది. ఛా ఛా! నాకెప్పుడూ యిలాగ వుండేదికాదే! నోరూరిపోతుంది. నీలి నా మనసులో నిగనిగలాడి పోతుంది. దానికి ఒకంతట లొంగుతానా? దానిమాట దాని కప్పచెప్పనా!" తల ఆడించాడు. "బలే బలే! నాకు కొడుకే! ఈ వూరు బంగారం! నా కొడుకు బంగారం...."

ఒక్క ఎగురు ఎగిరాడు!

పెళ్ళిరోజు వచ్చింది. పెళ్ళికొడుకుఇంటిముందర పందిరవేశారు. ఆదెమ్మ అప్పుడే పెద్దరికం. అసలు ఈ పెళ్ళిఖర్చులకీ రెండువందలు పద్దూ గిద్దూ లేకండా అల్లుడితో చెప్పి పుచ్చుకుంది. ఈ గుమ్మటంలాంటి ఇంట్లో పొందికగానే పెళ్ళి జరిపిద్దామని, పుల్లయ్య పెళ్ళంచే పొమ్మన్నారు వాళ్లుకూడా వచ్చారు.

నీలి తల్లి తల్లి పళ్ళాడిన ముసలిది. రోజూలు లెక్కపెట్టుకు కూర్చుంది. చింపిరిజుత్తుకు ఆదెమ్మప్ప మంచినూనె రాసింది. కొత్తకోక కట్టించింది. ఆ ముసలిదాని కళ్లు ఈ చివరిదశలో ఆశతో చూస్తున్నయ్. టకోరామేళం వాగుతూంచే పసందుగా వినిపిస్తోంది.

ఈ ముసలిది ఒకప్పుడు మనుమరాలిలానే వుండేది.మామ్మపోలికే నీలిది. కట్టుకున్న మొగాడు త్రాగుబోతు. ఒళ్ళంతా హూనం చేసేవాడు. యెముకకు యెముక విరిచేసేవాడు. ఎవరితోనూ చెప్పుకోలేదు. నీతికి నిజానికి కట్టుబడింది. యౌవనం వొక్కడికే అనుభవించడానికి అప్ప చెప్పింది. పిల్లలు పుట్టారు. పెరిగారు. తిండిలేక చచ్చినవాళ్లు చచ్చారు. అదంతా జ్ఞాపకంవస్తే, మనిషంతా గిరగిర చుట్టుకుపోతుంది. వణికి పోతుంది. గుండెదడ పట్టుకుంటుంది.

అంతా చచ్చారు. మిగిలింది ఒక్క కూతురుకూతురే. తనను మాత్రం ఈ పిల్లకోసం బ్రతకనిచ్చాడు దేముడు.

మేళం మోగుతోంది. ముసలిది అరుగుమీద కూర్చుని పెళ్ళిపీటల వైపు చూస్తోంది. బ్రొద్దున్న జరగవలసిన తంతు జరిగిపోయింది.

మధ్యాహ్నం భోజనాలయ్యాయి.

పెళ్ళికొడుకు అలకసాగించాడు. వెళ్ళి పక్కనేవున్న వంగిన చింతమ్రానుమీద కూర్చున్నాడు. తోటిపెళ్ళికొడుకు కూడా చెట్టెక్కాడు. పుల్లయ్య చుట్టూ చూశాడు. ఇక్కడే ...ఈ చెట్టుచాటునే....నీలిరూపు, చూపు....సొంపు, పెంపు చూసి మురిసిపొయ్యాడు. ఆమెవంటిని తాకి ఉద్రేకంతో ముద్దులాడాడు. చేతిమీద కాటు చూసుకున్నాడు.

"ఇంకెంతసేపు....!"

సాయంత్రం కావస్తోంది.పశువుల బీడునుంచి తిరిగివస్తున్న పశువులు సాలలు చేరుకుంటున్నాయ్. ఆడకూతుళ్లు కడవలతో నీరు తన యెదురుగుండా తీసుకపోతూ పుల్లయ్యవేపు వొక చూపు పారేస్తున్నారు. నాలుగడుగులు ముందుకువేసి వూసులాడుకుంటున్నారు. చిన్న నవ్వు నవ్వుకుంటున్నారు. పుల్లయ్యకు సిగ్గు పుట్టుకొచ్చింది.ఆడవాళ్ళమీద ఎన్ని కబుర్లాడాడు! వాళ్ళని విషం చూసినట్టు చూశాడు ఇప్పుడో? ఆడదానికి లొంగిపోతున్నాడు!

వాళ్ళంతా తనను గురించే వూసులాడుకుంటున్నారు. విజంగా.... "ఆడుకోనీ....నా పంతం సెల్లాల. మీసకట్టున్న మొగోడ్ని నాను!"అనుకున్నాడు.

గలగల గంగమ్మ పారుతోంది. చెట్టుమొదట కూర్చుని యేటివైపు చూస్తున్నాడు. వారధిమీద బళ్లు, బస్సులు, మేకలమంద,మనుషులు పోతున్నారు. చూస్తున్నాడు.

మేళం వినిపించింది....వస్తున్నారు....తోటి పెళ్ళికొడుకు చెట్టు మీదనుంచి ఒక్క గంతేశాడు.

పుల్లయ్య కొత్త కమీజు, పంచా, జరీవాణి, తలపాగా సర్దుకున్నాడు!

పొలోపొలోమని ఆడంగులు కిలకిలమంటూ చుట్టుముట్టారు.అందరూ వరసకి వదినెలు....మరదళ్లు....పుల్లయ్య ముఖం దించేశాడు!తోటి పెళ్ళికొడుకు, "యెత్తరా ముఖం, సిగ్గుపడతావేంది?అదగరా కట్నాలు" అన్నాడు. ఆడమ్మలు "డాసుంచాం!" అన్నారు.

మేళం మోగుతోంది. పుల్లయ్య పెళ్ళికి ఊరంతా పెద్దలే। ఈతం తుకు పెళ్ళికొడుకు సిగ్గుపడిపోతున్నాడు. రమ్మని యెవడో జాతోడు పిలు స్తున్నాడు। మామవరస....పుల్లయ్య లేచాడు. "కూకోడు। కూకోడు।"అని అరచారు కుర్రాళ్లు. ఆడాళ్లంతా "ఓ....ఎందుకు కూకోడు।" అంటూన్న సన్నని స్వరాలు కలిసి వినిపించాయ్.

పుల్లయ్యను బలవంతంచేసి కూర్చోబెట్టారు. ముఖం పక్కకు తిప్పించారు. అలక....ఇది అలకే అన్నట్లుగా ముఖకళను, అందరు కుర్రాళ్లు అరచి మార్పించారు. మేం నెగ్గామని సగర్వంగా నవ్వుతూ యెగురుతూ యౌవనులపేపు చూశారు.

"ఓడిపోనారు।" అని కుర్రాళ్లు అరచేటప్పటికి ఆడాళ్లు నవ్వుతూ ముఖాలు చూసుకున్నారు.

పుల్లయ్యకి మరదలువరస అవుతుంది....ఒక పికపికలాడుతున్న పెళ్ళికానిపిల్ల, ఒంటిబింకంతో, కళ్ళ తళుకుతో కళకళ్ళాడుతోంది.

పంతంతో ముందుకు పెళ్ళికొడుకుదగ్గరకు వచ్చింది. ఈనూనూగు మీసాల యువకులు మొఖాలు తేలవేసి పెదవులు చప్పరించుకొంటూ పిల్లవైపు చూశారు. బలే....బలే....

గొంతుకెత్తింది కిక్కురుమనకండా వూరుకొన్నారు. పాడుతుంటే ఆమెవైపు కళ్ళప్పచెప్పి చూస్తున్నారు.

"ఏమయ్యా మీ రలిగి తోట నున్నారా।
గుర్రమూ లేదని మీ రలిగినారా।
గుడ్డికుక్కన్నాది యెక్కి రావయ్యా।
గంధమూ లేదని మీ రలిగినారా।
గేదెపుర్రున్నాది రాసుకోవయ్యా।
ఆకులూ లేవని మీ రలిగినారా।
చిక్కుడాకు లున్నాయి వేసుకోవయ్యా।
చెక్కలు లేవని మీ రలిగినారా।
చింతపిక్కలున్నాయి వేసుకోవయ్యా।
ఏమయ్యా మీ రలిగి తోటనునారా।

పాటయ్యింది. పకపక అందరూ నవ్వారు. ఊసులాడుకున్నారు, రెండు పార్టీలవారు వాదించుకుంటున్నారు. ఇంతలో కబురువచ్చింది. "బాపనబాబు మూర్తం.దగ్గరపడినాది. రమ్మంటున్నారని" పోలోమని అంతా కదిలారు. అల్లుడి అలక పోడానికి ఈ పెళ్ళి అయ్యేవరకూ మామగా అభినయిస్తున్నమనిషి ఏమీ ఇయ్యలేదు. అల్లుడు చిరునవ్వుతో మామపెంట పడ్డాడు.

పెళ్ళిపందిరి: పీటదగ్గర ఒకపక్క మేడి, మోకు పెట్టారు. రెండోపక్క సన్నెగల్లు. మేళం మోగుతోంది. ముసలమ్మ అరుగుమీద కూర్చుని చూస్తోంది.

సాయంత్రం లగ్నం. అక్షితలతో వరసయినవాళ్ళు సరసాలాడుతుంటున్నారు, ముత్తయిదువుల కోలాహలం ఇంతా అంతా కాదు. వాళ్ళ గొంతుకలదగ్గర మొగాళ్ళగొంతుకలు పనికిరాలేదు. పుల్లయ్యపెళ్ళి....ఆ గేరాగిరజాలు....ఆ మెలితిరిగిన కండలు....అందరికీ అదో వెర్రి అభిమానం.

తంతు పూర్తయింది. పుల్లయ్య పెతుమానం కట్టాడు. "అచ్చిం తాలు యెయ్యండర్రో!" అని ఎవరో అరిచారు. అక్షితలు పడ్డాయి. పెళ్ళి కొడుకు పెళ్ళికూతురివైపు ఓ వోరచూపు చూశాడు.

ముఖానికి పసుపు. పసుపుపచ్చనికోక. చేతికి గాజులు, చెవులకి కమ్మలు, ముక్కుకి నవరంకమ్మి. మెడలో పగడాలకుత్తికంటు. కాళ్ళకు మట్టెలు, కంటికి కాటుక, నుదుట కుంకుమబొట్టు, నల్లని మెట్టి.పుల్లయ్య సంతోషంతో సర్దుక కూర్చున్నాడు.

ముసలిది పిచ్చిగా నవ్వుకుంటోంది. ఆదెమ్మప్ప తన పెద్దరికం సాఫీగా సాగిపోయిందని మురిసిపోతూంది. అందరి ముఖాలలో కాంతి వెలుగుతున్నది.

బాపనయ్య అరటిపండు వలిచి, పెళ్ళికొడుకుచేతిలో పెట్టాడు. మేళం ఆగిపోయింది. మనుషులు మాట్లాడకండా చూస్తున్నారు. గ్యాస్ లైట్లకాంతి పందిరిని ప్రకాశవంతం చేస్తోంది.

పుల్లయ్య పురోహితుడు చెప్పినట్లు అరటిపండు సగంకొరికి, మిగతాసగం భార్యనోటిలో పెట్టాడు. ఆమెతిన్నాక బాపనయ్య చెప్తుంటే

పుల్లయ్య "ఈ యేళనుంచి నిన్ను నాను పెళ్ళాడినందున, యేపనిచేసి తెచ్చినడబ్బా సగం నీకు యిస్తాను" అన్నాడు.

ఈసారి ఆమె సగంముక్క కొరికి మిగతాసగం మొగుడినోటిలో పెట్టి సిగ్గుతో మెల్లిగా: "ఈ యేళనుంచి మిమ్మల్ని నాను పెళ్ళాడినందున యిప్పటినుంచీ మా కన్నవారివలనగానీ మిగతా బంధువులవలనగానీ వచ్చినడబ్బు—నా సర్వస్వం మీ అధీనంచేస్తున్నాను." అంది.

ఈ మాటలు అనిపించిన బ్రాహ్మడు ఇద్దరినీ లేవమన్నాడు. లేచినా పుల్లయ్యకు మనసంతా ఆమాటలతోనే నిండిపోతోంది. ఆ మాట ల్లోవున్న సత్యం గుండెకు హత్తుకోవటంవల్ల పెళ్ళాంవేపు మాటి మాటికి చూస్తున్నాడు. తనకేదో పవిత్రమైన బంధం దగ్గరకు చేర్చింది. కొద్ది నిముషాలముందుకన్నా ఇప్పు డామె ఇంకోవిధంగా కనిపిస్తోంది. తన పంతాన్నీ ఆవేశాన్నీ ఈ మూడుముళ్లూ చల్లార్చినట్లనిపించాయి. భార్య వేపు గౌరవంగా చూస్తున్నాడు.

దంపతులు పల్లకియెక్కి పూరేగారు.

6

ఏటిఒడ్డున రెల్లుపూలు గాలికి మెల్లిగా కదులుతున్నాయ్ ఒడ్డున. కొత్తపెళ్ళికొడుకు నోటిలో పల్లుదోముపుల్ల పెట్టి యెదురుగా కనిపించే వారధివైపు చూస్తున్నాడు. పొద్దుటి యెండలో వంతెన మనోహరంగా కన్పిస్తోంది. నీలాటిరేవులో పల్లెనితలు, పూసులాడుకుంటూ పుల్లయ్య వేపు ఒకచూపు పారేస్తున్నారు. ఆలమందలు యేటిఅవతల ఒడ్డునవున్న బీటిలో మేస్తున్నాయ్.

పుల్లయ్య కళ్ళప్పచెప్పి బీటివైపు చూస్తున్నాడేకానీ, నీలితోనే మనసు నింపుకొన్నాడు. రాత్రి పల్లకిలో ముఖమేనా ఎత్తించికాదు. దాని కాటికకళ్లలోని తళుకులు చూద్దామని పుబలాటపడ్డాడు. కాని సిగ్గు!

లేచిపోయాడు. పళ్లదోముపుల్ల అక్కడ పారేసి గంగలో దిగి ముఖం కాళ్ళా చేతులూ కడుక్కున్నాడు. పెళ్ళిబట్టలు, పసుపు ఒంటినే వున్నాయ్. గబగబా ఇంటికి వెళ్ళాడు. గదిలోకి వెళ్లి నీలిచెయ్యి పట్టు

కోవాలనుకుంటే, ఆదెమ్మప్ప అరుగుమీద కూర్చుంది. ఒళ్లు చల్లారింది.

ఆవేళంతా ఆరాటమే. ఇల్లు కదల్లేదు. ఎవరొచ్చినా లోలోన విసుక్కుంటున్నాడు. కొద్దిక్షణాలు ఎలాగో అంకించుకొన్నాడు. పెరటిలో పట్టుకుందామనుకునేసరికి పిట్ట తుర్రున ఎగిరిపోయింది.వెంటపడితే పట్టుకోగలడుకాని ఆదెమ్మప్ప ఆరుగుమీద కూర్చునుంది.

ఆవేళ మధ్యాహ్నమే అంతా మాగన్నుగా నిద్రపోతూంటే, నీలి ఎందుకో పెరటిలోకి వచ్చింది. దొరికిందిరా అనుకున్నాడు. అటువేపు వెళ్తూంటే ఇటువేపు వచ్చి గుమ్మంలో ముసలమ్మొదగ్గర కూర్చుండిపోయింది. సిలక తమాషాచేస్తూందే అనుకున్నాడు.

పెదవులు చప్పరిస్తున్న పుల్లయ్య వాటిని ఒక్క-సారి బిగించాడు. "తస్సదియ్యా, పఁతం పంతమే! మీసకట్టున్న పసున్న మొగాడ్ని-నాకా దానికా సిగ్గుఁ దాన్ని ఇలాగ అలాగ యెలా గడుగుతానో?" అనుకున్నాడు.

అలా అనుకుంటూండగానే చీకటిపడింది. మనసులో ఆ మాటలు దొర్లుతూండగానే భోజనాలయ్యాయ్. ఇంకా ఆ పట్టుదల సడలకుండానే ఇంటినిండా వదినలు, మరదళ్లు మూగిపోయారు.

శోభనం. వండిన పిండివంటలు ముత్తైదువలు గదిలో అమర్చారు. అంతా ఆడపుట్ట! ఇంక సందడికి కొదవలేదు. పుల్లయ్యముఖంలోకి చూసి మరీ వరసైనవాళ్లు మాటలు విసురుతున్నారు. ఉహూఁ! పుల్లయ్య మూగోడిలా చూస్తున్నాడు.

వరసకి వదినౌతుంది: నల్లగా బింకంగా వుంది. మూడుపదుల వయస్సు. ముగ్గురుపిల్లలతల్లి. పుల్లయ్యచేతిలో ఇచ్చరూపాయి పెట్టి, మొగుడూ పెళ్లాలచేతులు కలిపించింది....ఇద్దరినీ గదిలోకి తీసుకువెళ్ళింది. ఆడాళ్ళంతా వెంటపడ్డారు. నులకమంచంమీద జంటకూర్చుంటే జవ్వనులంతా నవ్వుతూ మురిసిపోయారు. వీలి చెవులో నోరుపెట్టి ఇంకా ఏమేమో చెపుతూనే వున్నారు.

పుల్లయ్య తల వంచుకుని అలాగే కూర్చున్నాడు. వదిన అందర్నీ పదండర్రా అంది. గదిబయటికి అందర్నీ పంపించాక పుల్లయ్య తలెత్తి వదినవైపు చూస్తూ, చేతనున్న రూపాయి ఇచ్చేశాడు.వదిన నవ్వుతూతీసు

కుంటూ: "జాగర్త ....పెళ్ళాంఅంటే మొగ్గలెయ్యటం కాదు. వెయ్యి కళ్ళతో దాన్ని సూడాల. అందులోన అది అమ్మలేనిపిల్ల.అమ్మలేని పిల్ల లకు అల్లకల్లోలాలు కదా! అమ్మా, అయ్యా, మొగుడూ అంతా నువ్వే దానికి! సూపు మద్యం కాకుండావుంటే, దానిపస నువ్వేతెలుసుకుంటావ్! అది బాగుంటేనే నీ బాగు!....వస్తా....జాగర్త!"

వదిన కదిలిపోతూంది. పుల్లయ్య తన పెద్దకళ్లతో చూస్తున్నాడు. చూపుమధ్యమైపోతూంది. కళ్లు మసకలు కమ్మాయి. తలుపు వేసుకున్నా ఇంకా ఆ తలుపువేపే చూస్తున్నాడు.

"పెళ్ళంఅంటే మొగ్గలెయ్యటంకాదు!" ఈ మాటలే మనసులో అనుకుంటూ నీలివైపు చూశాడు. ఒళ్ళంతా అదోలా అయ్యింది. గప్పున దగ్గిరకు లాక్కోవాలనుకున్నాడు. కానీ అనుకోకుండా లేచి నిల్చున్నాడు.

కర్రపెట్టెమీద ప్రమిదలో దీపం వెలుగుతోంది. గదిబయట చిన్న అలజడి వినిపిస్తోంది. దీపం ఆరిపేదామనుకున్నాడు. కాని మళ్ళీ మనసొప్పలేదు.

ఇదేదో కొత్తగావుంది. ఆడవాళ్ళని మచ్చికచెయ్యటం గట్టిచిక్కే అనుకున్నాడు.

గబగబ వెళ్ళి చెయ్యిపట్టుకు లాగాడు. చెయ్యి లాక్కుంది. తప్పుకుంది. మొఖం ఎత్తమంటే మొండికెత్తింది.

పుల్లయ్య కిదేం నచ్చలేదు. తనలాంటి మీసకట్టున్న మొగాడు కనుసైగచేస్తే రావలసింది, ఇంత ఆర్భాటంచేస్తూందే! "పొద్దున్నదగ్గర నుంచి గోరణి యిలానేవుంది! దీని సంగతేటో చూసాను, పంతం పంతమే!" అనుకున్నాడు.

చాలాసేపటివరకూ అలాగ పెట్టెమీద కూర్చున్నాడు. మూగ దానిలా పెళ్ళాం ముఖందించుకు కూర్చుంది. ఛా ఛా అనుకున్నాడు.

పైన అలజడి వినిపించలేదు. ముందురాత్రంతా నిద్రలేదేమో, ఎవరింటికివాళ్లు పోయారు.

నీలి కొద్దిగా తలెత్తి గుమ్మంవేపు చూశాక, క్రీగంటితో మొగుడి వేపు చూసింది.

పుల్లయ్య పెళ్ళంవేపు చూడలేదు యౌవనగర్వంతో వున్న పెళ్లాం దాసోహం అనాలన్న అహంభావంతో పుల్లయ్య పెలుగుతున్న దీపకళిక వేపు చూస్తున్నాడు. వత్తిమీదకెత్తాడు .....అదేదో వెన్నెల్లో వున్న ట్లనిపించింది. వంగిన చింతచెట్లు,....జివ్వనులు....నీలిసొంపు,పెంపు.... చందమామో, చందమామ! తుర్రున యెగిరిపోయారు! నీలి, నీలి....నీకు నాయంకాదు....దొంగా....దొంగనో దొరనో సూడు...కాపేసిందే....! చెయ్యి తడుముకున్నాడు! పంతం పంతమే! సిగ్గు....నాకా దానికా?

గబగబ లేచాడు. పక్కన కూర్చున్నాడు. "సూడే నీలీ!"అన్నాడు. నీలి చూడలేదు. మీసం తిప్పాడు. నీలి చూసింది. గర్వంతో చిన్ననవ్వు నవ్వాడు.

"ఏమనుకున్నావో....నాసంగతి!"

ఈసారి నీలి మరికొద్దిగా తలెత్తి పైకి చూసింది. పుల్లయ్య చప్పున చేతితో నీలితల పైకెత్తాడు!"బాగాసూడు....దొంగనో దొరనో!"

జవాబులేదు. దెబ్బతిన్నలేడిలా చూస్తోందనుకున్నాడు.

పుల్లయ్య వేళాకోళంగా నవ్వాడు. మీసాలు తిప్పుతూ!"ఏమైనా... పట్టుకుంటానన్నాను....ఆఁ పట్టుకున్నానా?" అన్నాడు

నీలి మురిసిపోయే మొగుడివైపు నవ్వకండా చూసి, తలదించి మెల్లగా నవ్వుకుంది.

పుల్లయ్య మరీ అహంభావంతో నిల్చుంటూ నీలితలెత్తి ముఖంలో ముఖంపెడ్తూ "సిగ్గు నీకా నాకా? హాహా!...."

భర్తనవ్వు పూర్తయ్యేవరకూ, అలా చూస్తోంది. ఆనందంలో హాయిహాయిగా తేలిపోతున్నాడు. "జవాబు చెప్పదేంటి? ఓడిపోనాది, ఓడిపోనాది!" అనుకున్నాడు.

నీలి చిరునవ్వు వలకబోసింది. పుల్లయ్యా చూశాడు,ఆగిపోయాడు

నీలి ఈసారి ముఖం వెలిగించి, భర్తవేపు కళ్ళప్పచెప్పి చూసింది, నవ్వింది. నవ్విందే....పుల్లియ్య పిచ్చాడిలా, ముఖంలోకి చూస్తూంటే, నీలి తలదించి, ఇంకా నవ్వుకుంటోంది.

అదిగో మాట్లాడింది....హాఁ మాట్లాడిందే!

"ఓడిపోనాను....!"

పుల్లయ్య తృప్తిగా నవ్వుకుంటూనే యెటకారం....యెటకారం.... అనుకుంటూ "ఆఁ" అన్నాడు.

నీలి తలమీద కప్పుకున్న చీరకొంగు తీసి లేచినిల్చుంది. ప్రమిదలో వత్తి కొద్దిగా దిగువకులాగి మళ్ళీ వచ్చి కూర్చుంటూ....

"అనాలనుకున్నదంతా అనేశావా?" అంది.

హాఁ—పుల్లయ్యపక్కనే మంచంమీద కూర్చుంటూ "హాఁ—నాకేంటి?....మీసకట్టున్న మొగాడ్ని!....అవును నానంటే నాకుగర్వం! మావంశం అలాంటిది. సిగ్గులేదా అన్నావు—నాకా నీకా సిగ్గు?"అన్నాడు. ఈమాటలు ముఖం అదోలా చేసుకొంటూ అంటున్న భర్తవేపు నీలి చూస్తూనే వుంది. ఇంకా ఇటువేపు ముఖం తిప్పని భర్తభుజంమీద చెయ్యివేసింది. పుల్లయ్య కదల్లేదు మెదల్లేదు.

ఆభుజంపై అలా తలవాల్చి చిన్న కమ్మనైన స్వరంతో, మెల్ల మెల్లగా. "సూడు! వివ్వుచేసినపని బాగుందా?"

"నాదా తప్పు?"

"తప్పని అనలేదు. సూడు. నీ సెల్లెల్నే యవడో నివ్వుచేసినట్లు సేస్తే నివ్వెలాగుంటావ్? పోనీ నన్నే ఇంకోమొగోడు నివ్వుచేసినట్లు సేస్తే నేను ఆడికి లొంగిపోతే నీకు యెంత అన్నాయం సేసేద్దును! నీకు తెలిస్తే నువ్వుయేమౌతావ్?" అంది.

పుల్లయ్య వోరచూపు చూశాడు, నీలి మరీదగ్గరగా జరుగుతూ, ఆ చెయ్యిని గేరాగిరజాలలోకి చొప్పిస్తూ భర్తను, అంటిపెట్టుకుని, "సూడు! నీకళ్లుమూస్తాను. లోకంకళ్లు మూస్తాను. కాని దేముడికళ్లు ముయ్యగలనా? మన మంచీ చెడూ సూసేవాడు పైనున్నాడని నువ్వు నాయంగా నమ్మకంగా యెల్లకపోతే—మనం బతికెందుకు?"

చల్లనైన వాతావరణం నెమ్మదైన మాటలు! ఈ ఆడకూతురు కన్నవారింటో కడుపుకి కష్టాలుపడింది.యౌవనంతో వంగుతూ వాలుతూ వయ్యారంగా తిరుగుతూ పాడుతూ మురిసిపోయింది. పెళ్ళిఘడియల్లో ఏమీ తెలియని అమాయకురాలిమల్లె సిగ్గుతో ముడుచుకుపోయింది. పెళ్ళమై పంతంపట్టిన మొగుడికళ్లు విప్పుతోంది.

పుల్లయ్యకు కొద్దిగా వణుకుపుట్టింది. నీలి తన పెళ్ళామని మరచి పోయాడు. అదేదో ఒక పవిత్రమైనదిగా కనిపించింది. ఆమె మాటల్లోని సత్యం ప్రతీకణంలోను ప్రతిధ్వనిస్తోంది. "అవును....నాదే తప్పు...." అని లోలోన పెద్దపెట్టున తిట్టుకుంటున్నాడు.

నీలి మరీ దగ్గరగా జరిగి కౌగలించి మొగుడ్ని పట్టుకుంది. ఆమెకు తెలుసు ఎందరు యౌవనులు ఈ మనిషిగురించి మిసమిసపడి మనసులో కోరికతో నిండిపోయేవారో, ఆమెకూడా ఈ గేరాగిరజాలు, ఈ మెలితిరిగిన కండలనుగురించి ఎన్నిసార్లు తలుచుకుంది....! వాటిని తాకుచు కోపటం వెర్రితనమని ఈ వెర్రిబాగులపిల్ల ఆ తలపును తుడిచిపెట్టేది. కానీ ఆ గిరజాలలో ఇప్పుడు తనచెయ్యి దూర్చివుంది. ఈ తిరిగిన కండలకి తనశరీరం తాకుతోంది! ఎంతహాయి....ఇంక ఆమెకేం కావాలి!

నీలికళ్ళల్లో నీర....పెదవులమీద వెర్రినవ్వు. పుల్లయ్య చూశాడు! పెళ్లాన్ని గట్టిగా గుండెకు హత్తుకున్నాడు....నీలి....నా నీలి....నాదే నాదే ....ఒళ్ళంతా కళ్లుచేసుకున్నాడు—ఎంత హాయి....ఇంత హాయ్ హాయ్ బ్రతుకిదే. ఇందులో ఎంత తీపి....ఇదివరకు గడిపిన బతుకంతా ఇసుక దిబ్బ....ఇప్పుడు....పంటతో నిండిన తన పొలాన్ని చూసినట్లుగా, అంతకు రెట్టింపు గర్వం.

ఆమె కళ్ళలోనించి జారే నీటిని తుడిచాడు. ఆమె నవ్వే పెదవులను తన పెదవులకు దగ్గరగా చేర్చుకున్నాడు.

7

నీలి నునుసిగ్గు దొంతరులు రానురాను తెలతెలపోయిన మేఘాల్లా చెదరిపోయినయ్. ఆ మనసులో ఆ చూపులో ఒక కొత్తదనం, ఆశ, అనురాగం కనిపించేవి. పుల్లయ్యని చూచి చిరునవ్వుతో చిందులు త్రొక్కేది.

మొగుడు మందహాసంచేసేవాడు. వలచివచ్చిన మగని ఇల్లంతా మనుషులు వుండడానికి పనికివచ్చేటట్లు చెయ్యాలి. ఇంట్లో ఒక దాకా, కుండా, బిందే ఏదీ సరిగాలేదు. ఇప్పుడే ఇలావుంటే పెళ్ళిముం దెలా వుండేదో!

పెళ్ళానికి ఇంటి పనిపాట్లలో ఏదైనా సహాయంచేద్దామని వెళ్తే ఈ బలేచక్కనివాని చేతకానితనానికి నీలి చిన్ననవ్వు నవ్వి ముఖంలో వింతకాంతులు వెదజల్లేది.

పుల్లయ్య తన చేతకానితనాన్ని మరచిపోయి, చిగురించిన కోరికలతో నగవుతో మురిసిపోతున్న పెళ్ళాన్ని ఊరూరూగించేవాడు.

పుల్లయ్య శరీరపోషణపట్ల నీలి శ్రద్ధతీసుకొంటూంది. పొద్దూపారే నీటిలో బుడకపెట్టి పుల్లయ్య ఒళ్ళు బాగా తోముకొని నీళ్లు పోసుకొని ఇంటికి వస్తే పెళ్ళాం—గేరా గిరజాలకు నూనెరాసి చక్కగా దువ్వుతుంది. వేళకు తిండి, కంటికి నిద్ర, మనసుకు హాయి కలుగుతున్నాయి.

ఈ రోజుల్లో ఇంటిపిల్లి అయిపోతున్నాడు. రోజూ ఒకసారి పొలంకు పోవటం, మిగతాకాలమంతా పెళ్ళాందగ్గర కూర్చోవటం. ఊళ్లో తలోలా అనుకుంటున్నారు. నవ్వుకున్నారు. వేళాకోళం చేశారు. గరిడీకి రాలేదని చాలామంది విసుక్కుంటున్నారు. ఒకవేళ వెళ్ళినా ఎంతసేపో వుండేవాడుకాదు.

"క్రొత్త రబ్బసం. అందులోనూ ముదిరిపోనాక పెళ్ళం వచ్చింది, బెల్లం కాకపోతాదా?" అంటున్నారు.

పుల్లయ్య గరిడీనించి వస్తూ ఈ మాటలు విన్నాడు. నలుగురూ వకపక నవ్వుతున్నారు. కోపంవచ్చింది. గబగబ వెళ్ళి గడపలో కూర్చుండిపోయాడు. పెళ్ళాం కులుకు పలుకుల్లోని 'తలపులేవో' అర్థంచేసుకోక ముఖం ముడుచుకున్నాడు.

పెళ్లాం కంగించి కవ్వించింది. అలా కూర్చునే చేతులు త్రిప్పుతూ అన్నాడు: "నాను పెళ్ళొద్దంటే, నేసుకో అని వేళాకోళం చేసేవోరు. నేను కొన్నానా? యిప్పుడూ యేళాకోళమే-నోరున్నాదని!"

నీలి చిన్ననవ్వు నవ్వి ఆ అమాయకమైన ముఖం వెలిగించి అన్నది: "అందుకేనా అలాగున్నావ్! ఆ ల్లెందు కన్నారు? పడేవోడి వని అభిమానంతోటే అన్నారు. నవ్వులాలు నవ్వులాలుగా తీసుకోవాలిగానీ, మనలో లోటుంచుకుని ...పంతాలు, కోపాలు తప్పుగాదా?"

పుల్లయ్య మొగమెత్తి ఆ మెరిసే కళ్ళవేపు చూశాడు. ఇంకా ఆ చూపు తన పొరపాటును ఎత్తిపొడుస్తున్నట్లనిపించింది. తన పంతాలు

ఎలాంటివో శోభనంనాటిరాత్రే తెలిసిపోయింది. ఆమెకంటె తను గొప్ప వాడినని అనుకోలేకపోతున్నాడు. ఏదో భయం, భక్తి, అభిమానం, అనురాగం....చివరకు గర్వం, తన మనసులో గిరగిరలాడిపోతున్నాయి:

దీపావళి దాటింది; వచ్చింది నాగులచవితి. ఊరంతా సందడిగా వున్నది. రోడ్డుపక్కన పుట్టలోపోసిన పాలు బాగా ఇంకిపోయాయి. నాగన్న నోటిలో గుడ్లుపడ్డాయి. మధ్యమధ్య టపాకాయల సందడి.... ముగ్గూ పసుపూ పుట్టను కప్పివేశాయి.

ఇంటికి వచ్చారు. ముసలమ్మ మనవరాలుకు కొడుకుపుట్టే నాగరాజని పేరుపెట్టానని మొక్కుకుంది. పుల్లయ్య విన్నాడు. ఛ్రురమన్నాడు. "నా కొడుకుపేరామా అయ్య పుట్టుకొస్తాడు. మా అయ్య మీసాలు తిప్పిన నాయుడు; నా కొడుకూ అలాంటోడే అవ్వాలి. ఆడు బుసకొట్టే నాగన్నకాడు"

"తప్పు తప్పు" అంది ముసలమ్మ.

"తప్పూలేదూ గిప్పూలేదూ. నా కొడుకుపేరు మల్లునాయుడే"

ఇంకా ముసలమ్మకీ, పుల్లయ్యకీ వాదన సాగుతోంది. పకపకా నవ్వుతూ నీలి పక్కకొచ్చింది.

"చెట్టున కాయే కాయంది.... ఎందు కలా అయిపోతారు; రెండు పేర్లు పెట్టుకుందురుగానీ.... పేరుల్లో యేవుంది?"

"లేదూ; మా అయ్యపేరు పెట్టకపోతే సచ్చి సర్గాన వున్న మా అయ్యకు కోపంరాదా?"

"వస్తాది; ముమ్మాటికి వస్తాది...." అంటూ ఏదో కొత్తనోరు కలిసింది.

గుడ్డోడా నిజం సెప్పావురా!" అని పుల్లయ్య అంగటికి వెళ్లాడు.

"చేతిలోకర్ర....పొడుగుపాటి మనిషి. ఎముకలు కనిపిస్తున్నా, ఒకప్పుడు బలంగా వుండేవాడని చెప్పొచ్చు. పుల్లయ్య ఇంకా వాడితో మాటాడుతూంటే, నీలి అప్పుడే వాకిట విస్తరాకు వేసింది. గుడ్డివెంకన్న "కన్నోరింటిలో పేదారోదాకి గంజిపోసి రచ్చించావు. నీ యింట్లోనే అన్నం పెట్టున్నావు తల్లీ; ఏదైనా మనిషి మిగల్తు గానీ, మాట మిగిలిపోతుంది!"

భోంచేస్తూంటే ఇంకో ముసలిగొంతుక: "యెంకడి పని పం
డింది—అదృష్టం—"

"ఏవే ముండా! నీ లోబం కాలా....నడ్డిఒంగినా, నీలో నలుసు
సావనేదు—" అందుకున్నాడు గుడ్డివెంకన్న!

"ఊరుకో! రా....గన్నెమ్మా!....నువ్వూ ఈ ప్రక్కన కూర్చో"
నీలి యింకోవిస్తరి వేసింది.

"ఇలాగ యిచ్చేయి తల్లీ!ఒకపూటే యింత మెక్కేబదులు రెండు
పూటలకు సర్దుకుంటాను...."

"గంపెడుడబ్బు, గుంపడుభూమీ ఉంచుకొని, కాకికి సెయ్యి
దులపకుండా, నివ్వు తినకండా బతికినావు—ఏం అయ్యావే! తినేముండా!
తిన్నదే దక్కింది" అందుకున్నాడు గుడ్డివెంకన్న.

గన్నెమ్మ అన్నం మూటకట్టుకుని వెళ్ళిపోయింది.

గుడ్డివెంకన్న తింటూనే మాటలు లంకించుకున్నాడు.

"ఓరీ నాయనా! పుల్లయ్యా! గుర్రానికి బారెడు తోక ఉంటాది—
రెయ్యికి జానెడు మీసం వుంటాది—నాభం! ఈ మనుషులకీ ఎందు
కొచ్చిన గర్వాలురా! ఆడున్నాడే ఆ రాజిగాడు-ఇంకా నామీద కసి తీరనే
లేదు. సూస్తున్నాను....సింహం ఉందే ...ముసలైనా .... జబ్బుదైనా....
గడ్డిపరకలు మేస్తాదిరా! గొడ్డు కనిపిస్తే గుడ్డిదౌతాదిరా!"

"పో పోరా! దొంగ నాయాలా! కళ్లు పోకపోతే....నివ్వా! ఈ
చుట్టుపట్ల వూళ్లు తగలెట్టేదువు!"

"నాయనా! గొడ్డు గోతిలోపడితే తలొక మాటంటారులే!"

"నువ్వా!కళ్లులేని సింహానివి—కోరలు తీసిన పాముని—యెదవ
కుటుంబాలనే కాల్చేశావు నీ పొగరుతోని! ఎలాంటోడికి అలాంటి గతే
పడ్తాదిలే...." పుల్లయ్య కోపంగా అంటూ లేచిపోయాడు.

నీలి చప్పున అందుకుంది. "తిండిపెట్టి తిట్టావా! తప్పు తప్పు!"
వెంకన్న దగ్గిరగా వెళ్ళి, "నీతో సరసం ఆడుతున్నాడు. ఏం అనుకో
కయ్యా!"

ముసలాడు నవ్వాడు. "తల్లీ.ఆ రోజుల్లో నేనొక పులిని....నన్ను
మరిపించేడు గరిడీలో పుల్లయ్య.అయితే నాను పెజల్లో చెడ్డోడినయ్యాను.

నీ మొగుడు సెబాష్ అనిపించుకున్నాడు. కలకాలం నీ పసుపు కుంకుమలో నీ ధర్మం కాసి,ఇద్దరూ హాయిగా బతుకుతారమ్మా!"

"పో పోరా, నీ దీవెన లెవరికొ-వాల దొంగోడా?" పుల్లయ్య అందుకున్నాడు.

"నువ్వు వెలమోడివి....నాను గొల్లోడిని"

"జాతు లెందుకు తెస్తావయ్యా,ఆకాశంక్రింద ఉన్నాలంతా ఒకటే జాతి" అంది నీలి చప్పున.

"మాతల్లి, సల్లని సెందురిడినాగ నీశాంతమే నీ మొగుడి కోపాన్ని మాయంసేస్తాది....." అంటూ లేచి, కర్ర తడుముకుని వెళ్ళిపోతూ "అమ్మా!" అన్నాడు. గొంతుక గుర గురలాడిపోయింది. కళ్లు గ్రుడ్డి వైతే నీళ్లు ఎందుకుండవ్....పరిస్థితి అర్థంచేసుకున్న నీలి ముందుకు నడిచింది. నడుస్తూనే వెంకన్న అన్నాడు. "అసలు సంగతి ఈనాటికీ యెవరికీ తెలీదమ్మా.....?" ఉధృతంగా యేడుపు వచ్చేసింది. "ఏడవ కయ్యా, మనచేతిలో యేపీలేదు.నరులకి తెలియకపోయినా దేముడికీ అందరి మంచి చెడ్డలూ తెలుస్తాయ్...."

"నాకూతురా, సిన్నదానివైనా నిజం చెప్పావు!"

గ్రొద్దు గ్రక్కకు తిరిగింది.పసుపులు పూసుకున్న ముత్తైదువులు, ఆచాడాన్నిబట్టి పొలాలకి జట్టులు జట్టులుగా బయలుదేరారు. పసుపువర్ణం దేరుతున్న చేలు, తల లూగిస్తూ పలుకరించాయి. గాలికి వంగుతున్న వెన్నులు చిన్న అలజడి శబ్దం చేస్తున్నయ్. కోతలు మొదలుపెట్టడానికి ఇంకెన్నిరోజులో లేవు. విరామం ఎరుగని పనిరోజులు దగ్గ:పడుతున్నయ్. వయసులోవున్న ముత్తైదువలు వేరే మాటలు ఆడుకున్నారు. వయసుమళ్ళినవారు పంటనాణెం పరీక్షించుకున్నారు. పుట్టికి యెంత బియ్యం రాలుతుందో, తవుడు పళువులకీ యెన్నిరోజు లొస్తుందో—బుగతకీ అంబారం చెల్లించగా ఎంత మిగులుతుందో మిగిలిన దానిలో కంబారి, యేరిజీ, చాకలి, మంగలికీ పోను మిగిలేదెంతో....ఆ మిగిలిందాంతో, యేడాదంతా యెలా గడపటమో—ఇలా రకరకాల అంచనాలు వేస్తున్నారు. విచారంతో తిరిగివచ్చినవాళ్ళూ ఉన్నారు.

నీలికూడా వెళ్ళివచ్చింది. ఆమె ఇలా ఏమీ అనుకోలేదు. ఒళ్లు గట్టిగా ఉంటే రెక్కలకష్టంమీద బతకలేమా అన్నధీమా ఆమెది.

రాగానే పుల్లయ్య పెళ్లాన్ని "కాళ్లు పీకెల్టంలేదా?" అని అడిగాడు. నీలి సమాధానంగా చిరునవ్వునే పొలకబోసింది. పుల్లయ్య ముఖంలో యేదో ద్వేషం స్ఫుటంగా కనిపించటంతో నీలి దగ్గరగాజరిగి, "చెప్పు, యెందు కలావున్నావు?" అని అడిగింది.

పుల్లయ్య ఎగిరిపడ్డాడు. "ఆ పాపిష్టోడికి ఆ పాపిష్టి ముండకీ.తిండి పెట్టి నీ కడుపు మాడ్చుకోమని యెవరు చెప్పారో నీకు?"

"ఎవరు పాపిష్టోళ్లు?" అంది నీలి నవ్వుతూ.

"కారూ? అది డబ్బాముకంసూసి మొగుడ్ని సంపింది. ఆడు దొంగయెదవ...."

"అంతేనా?" నీలి మందహాసం చేసి మొగుడి నడుమును చేతులతో చుట్టివేసి, "సూడు!" అంది.

"ఏం సూస్తాను? ఆడికి కళ్లుపోయినా పౌరుషం చావదు. దానికి నడ్డి వంగినా మమకారంపోదు!"

"మనకి లేదా? అందరు మనుషులూ ఒకలానే వుంటారా?నీ కాళ్లలాగ నీ సేతులున్నాయా? అన్నీ కాళ్లయితే మనిషి బతకగలడా? నువ్వు యెందు కూరికే ఒకరిని చూసి అసహ్యపడతావు? అసహ్యపడితే ఆయుస్సు తక్కువంటారు....సూడు!"

పుల్లయ్య ముఖం భార్యవైపు తిప్పాడు. ఆమె ప్రశాంతంగా ముఖంతో మాటలు ఒలకబోస్తోంది ... "నూతిలాగ సూకమ్మ వుండేది. చేదలాగ వెంకన్న తోడుకొనేవాడు. అది సచ్చాక....పాపం! యేనుగలాంటివాడు పీనుగయ్యాడా? గన్నమ్మ అంత బతుకు బతికింది....అన్నమోరామా అని అడుక్కుంటోందా? నీకు తెలీదు....కడుపు సంవత్రం. తెల్లారితే పరగడుపే — నాలిక దాటితే నరకం. మట్టికుండలో ఒండి చర్మం కుండలో పడేసుకోవటమే....చెయ్యి కింద ఉండటంకంటే మీద వుండటం అదృష్టంకాదా?....ఆలాగ అయిపోకు!"

పుల్లయ్య వెంటనే మాట్లాడలేకపోయాడు. నీలి మొగుడ్ని అదిమి పట్టుకుంది. పుల్లయ్యమనసు రానురాను పెళ్ళంమాటలు తలపుకు రాగా

వెన్నెలా కరగజొచ్చింది.ఆమెను గట్టిగా బాహువుల్లో బంధించబోయాడు. ఇంతలో ఆమె మెల్లగా మాటాడుతోంది. "మామామ్మ సెప్పింది — ఎగిరిన దూది గాలిలో, యెంతసేపో వుండదని. నువ్వు అలాగ వూరికినే యెగిరిపోకు.నీ కాలికి దెబ్బ తగిలితే నీ సెయ్యి వూరుకుంటుందా? అలాగే మన సుట్టుపట్ల ఉన్నోళ్లు ఆకలని యేడుస్తూంటే ఊరుకోమంటావా? సెప్పు?...."

ఆమె భర్తను మరీ గట్టిగా అదిమిపట్టి ప్రశ్నించింది. పుల్లయ్య శరీరమంతా గగుర్పాటుజెంది జవాబియ్యలేక ఆమెతలను తన వక్షానికి అదిమిపట్టాడు. కళ్లల్లో నీరు పూరినట్లు కాగా అభిమానం అంతా మౌనంగా ఆమెపై ప్రసరింపచేశాడు. నీళ్లు నిండిన యిద్దరికళ్లూ ఏక మైనాయ్!

8

గుడ్డివెంకన్న అసలుపేరు వెంకయ్య.చిన్నప్పుడే తండ్రిపోతే,తల్లి కొడుకుని కన్నవారింట్లో వదలి, ఇంకో మనువుకి వెళ్లిపోయింది. మారు మనువుకి పెళ్ళి మరేం సుఖపడలేదు. ప్రాగుబోతు మొగుడి తన్నులకి ఒళ్లు చితికిపోయింది. విచారంతో యెన్నాళ్లో వుండలేదు. కొడుకు లేబ్రాయంలోనే లోకం విడిచిపెట్టింది. వెంకన్న తాతకి పెద్ద నేకలమంద వుండేది. చిన్నప్పుడే తాతని నానాతిప్పలూ పెట్టేవాడు.మందలో కొత్తగా పుట్టిన మేక పిల్లల్లో మూడోవంతైనా మాయమౌతూండేవి. పిల్లల్ని సగానికి సగం ధరకి అమ్మేవాడు వెంకన్న ఆ రాత్రే కొన్నవాళ్ళదగ్గరనుంచి ఆ పిల్ల సాధారణంగా మాయమైపోయేది. అమ్మిన డబ్బులో పదోవంతైనా తను పేదా రోదా అనుకొనేవాళ్ళకు చేరేది. "మీసాలు సరిగ్గా మొలవకుండానే ఇలా చేస్తున్నాడు కదా!ఇంకా పెద్దయితే వీడిని పట్టలేం. బిడ్డయినా, బెడ్డయినా పుట్టాక విడిచిపెడ్తామా?ఆడపిల్ల అయ్యుంటే — ఒక బిరుదు తీసేసును అల్లుడు — ఎంతైనా మొగోడు—మూరెడు గుడ్డ,ముద్దడు అన్నం తెచ్చుకోలేడా?" అని తాత తమాయించుకునేవాడు.

యౌవనం ఉబుక్కుని వచ్చింది.కండలు తిరిగిన జవాను.రాళ్ళతో కుస్తీలు పట్టి చెట్లని పీకేసే బలం. అందమైన ముఖం; దొంగవెధవైనా బీదా బిక్కి అంటే వెన్నలా అయిపోతాడని, తాతకు మనుమడంటే లోపల గర్వం వుండేది. గరిడీలో ఘటికుడయ్యాడు. మీసాలు తిప్పి తొడ చరిచే అహంభావం వచ్చింది. మేనమామ పీడితో పడలేక ఆస్తి పంచుకొని వేరే వెళ్ళిపోయాడు. మిగిలిన కొద్ది మేకలతో మంద సాగ లేదు. ముసలాడు మనవణ్ని తిడుతూనే గంజిపోసేవాడు. కానీ ఒకోసారి తల్లీతండ్రి లేనోడని ఏడ్చేసేవాడు. వెంకన్నకుమాత్రం ఆ విచారం ఒక నాడూ లేదు. అసలు విచారం అంటే ఏంటో ఎరగడు. తాతయ్య చచ్చి పోయిన్నాడు మాత్రం ఏడ్చాడు. ఆ మరుసటిరోజువరకు ఆకలివెయ్యలేదు.ఆకలివేసేసరికి "తాతా గెంజిపోసేరా!"అన్నాడు అప్రయత్నంగా; కానీ మళ్ళీ ఆ యింట్లో వుండలేక వీధిలోపడ్డాడు. ఎవరూ తనను సరిగ్గా పలకరించలేదు. అందరూ దూరాన్నవున్న తన్ను చూసి ఇళ్ళల్లోకి వెళ్ళి పోతున్నారు. పిల్లలుకూడా తనని చూసి భయపడుతున్నారు.వీధికుక్కలూ పక్కకు వెళ్ళిపోతున్నాయ్;

ఒక్కసారి తనింత చెడ్డవాడినా అనుకున్నాడు. దొంగతనాలు చేశాడు; నలుగురినీ భయపెట్టాడు — తిట్టాడు — కొట్టాడు.డబ్బులేనప్పుడు దారికాశాడు. ఈర్ష్యాదగా అడిగి ఉన్నదంతా పుచ్చుకొనేవాడు. ఇవ్వని వాళ్ళవీపులు చితకగొట్టేవాడు. అయితే ఇదంతా తను యెలా చెయ్యగలిగా ననుకున్నాడు. తనొక బంగారుపళ్లెం — గోడలా తాత అండవుండేది — అది యిప్పుడు లేదు — అంచేత కామోసు-తన కేమీ విలువలేదు;

తను చెడ్డవా డవ్వాలి; విధిలేదు. మందలేదు — మసానులేదు.తిండిలేదు. డబ్బాలేదు. గిబ్బాలేదు; ఈ లోకంలో తనకు తనే; ఏడ్చినా ఏడ్వాలి. తనెందు కేడ్వాలి;తను కష్టపడడం నేర్చుకోలేదు — "సరే వచ్చేదేదో వచ్చింది. జీడిమరక పోతాదా; కానీ - ఈ పెజల్లో సెడ్డాడిని అవనే అయ్యాను — అలాగే వుంటాను — మనిషి భస్తే మాటమిగుల్తాది. యెద్దుభస్తే యెముక మిగుల్తాది — ఈ సుట్టుపట్ల నాను సచ్చినా రావకా సురిడలాగ నా పేరు ఉండిపోనీ —" నడుస్తూనే అనుకున్నాడు వెంకన్న.

మా తాత యెంతో మంచోడనీ యిదే తొలిసారి అనుకోవటం: దుఃఖం ముంచుకు వచ్చేసింది. కాని కళ్ళల్లో నీరు రాలేదు. ముందుకు సాగలేక ఎదురుగావున్న సూరయ్య ఇంటి అరుగుమీద కూర్చుండిపోయి నేలవేపు చూస్తున్నాడు. తాత కనిపిస్తున్నాడు —తనవేపు చూసి యేదు స్తున్న ట్లనిపించింది-ఏకాకి తను:

సూరయ్యఇల్లు పెద్దదే. పదెకరాల పల్లపుభూమి. సక్కనైన సుక్కలా ఒకేఒక కూతురు సూరమ్మ.సూరమ్మకు అందానికి తగ్గ మాటల తీరువుంది. వయసు వచ్చినా తండ్రి మమకారంచేత ఇంకా ఇంకా పెళ్ళి చెయ్యలేదు. ఏదో ఇల్లరికం అల్లుడికోసం తాపత్రయపడుతున్నాడు.

వెంకన్నవేపు చూసి "పావడ:" అంది. వెంకన్న వినిపించుకో లేదు. "కడుపు ఆంటుకపోయింది. అన్నం పెట్టేవా?" వగరెక్కిన కోయిల గొంతుకలావుంది. ముఖం పక్కకు తిప్పాడు. ఆ మందహాసం చేస్తూన్న ముద్దుమోము చూడగానే, తనలో సంతోషం గెంతులువేసుక వచ్చింది. అంతలో కల్లోల గౌతమీ పొంగి పారింది.

సూరమ్మతల్లి లోనుంచే కేకవేసింది. "ఓ లమ్మీ: కుక్కనోట్లో కర్రెట్టకే —భౌ భౌ మంటాది:"

తను కుక్కా: తన కా విశ్వాసం ఎక్కడుంది? మళ్ళీ తనను ఈ సైతుభార్య అవమానపరిచిందనుకున్నాడు. పుట్టిడు అప్పైనా కాయొచ్చు కాని పిప్పిమాట లెవడు పడ్తాడు? నాలాంటి మనిషి ఆ సైతోడు. వాడి లాంటి మనిషి నాను —"

"ఏవమ్మో తల్లీ: ఏవన్నావ్:" అని లేచాడు.

వెంకన్నవైఖరి చూసి ఆమె ముఖంలో లేని నవ్వు తెచ్చుకొని "ముసలోడు యెంత మంచోడు వెంకన్నా:"

వెంకన్నమనసు మళ్ళీ తాతవైపు తిరిగిపోయింది.

"అవునమ్మా: ఆడు బతికినన్నాళ్లు నానాహింసయి పెట్టాను. నా నుంచి ఆడు ఊరంతా సెడ్డయిపోయినాడు."

వెంకన్న వస్తున్న యేడుపును ఆపుకోవటంలో మరి మాటాడలేక పోయాడు. ఇంతలో పెనటి వరండాలో వడ్డించి సూరమ్మ రమ్మంది. తల్లి మాటాడలేదు. వెంకన్న వద్దని వెళ్ళిపోబోతూంటే ఆమె తన కళ్ళ

ల్లోకి నిదానించి చూసింది, తొలిసారి తన జీవితంలో నరాలు పొంగి కంపించినయ్.

కాలు కదిపినా ముందుకు పోలేదు. ఆమెలోని ఏదో మహత్తర శక్తి తనను కట్టేసి ఆమెవేపే లాగుకుంటోంది. మళ్ళీ ముఖం తిప్పాడు. ఆమె తనను గెలుచుకున్నట్లు చిరునగవు విసరింది. ఆమె యేమీఅనలేదు. ఇంకా అలానే నిల్చుంది. వెంకన్న యెదురీత ఈదలేకపోయాడు. వెళ్ళి విస్తరిముందు కూర్చున్నాడు. పశువులసాలకు తల్లి వెళ్ళింది. ఎదురుగా నిల్చున్న సూరమ్మవేపుకు చూడటానికి సిగ్గువేసింది. అసలు తినడానికే సిగ్గువేసింది. ఒక్కసారైనా తలెత్తకుండా వుండలేకపోయాడు: తన కండల్ని, శరీరపొందికను చూసి మురిసిపోతూందని తెలుసుకున్నాడు.

భీమబలుడు — యౌవనం బలిసిన ఆడది చూసి చలించిపోయింది. అంతే. ఒకేమాట అంది "నువ్వెంత మంచోడివి!"

వెంకన్న ఆ మాట విని అదిరిపోయాడు. ఈ లోకంలో తనని మంచోడని అన్నవాళ్లున్నారే! కూటికిలేని పేద తనెక్కడ? సిరిగల ఇంటి యీ చక్కనిచుక్క యెక్కడ?

నోటిలోనికి ముద్ద వెళ్ళలేదు. ముఖం కొద్దిగా మీదికి లేచింది. ఘోరగా చూశాడు. జవ్వని నరాల బిగువుతో నాట్యంఆడినట్లుంది. ఒళ్లు పులకరించింది. ఎటుచూసిన....అందం....ఆనందం! ఆమెఒళ్లంతా అందమే....చప్పున లేచి ఏదో చేసేద్దామనుకున్నాడు, లేచిపోయాడు.

"సూరీ! నాయంత పెద్దోడు ఎవుడూ నేడూ?"

అదే వెళ్లిపోవటం....తిరిగి చూడలేదు. తనలో పెనుగాలి వీచింది....ఎప్పటకీ అణగారలేదు.

గూడులేని పిట్టలా తిరిగాడు. సూరమ్మ కబురుపెట్టింది. ఎందుకో భయంవేసింది. డబ్బు పంపించింది. అందుకున్నాడు. మళ్ళీ "ఆడదాని డబ్బు నాకొద్దు" అని ఇచ్చేశాడు. ఎక్కడికి వెళ్ళిపోయాడో యేంటో మూడుపక్షాలు దాటేవరకూ ఎవరికీ కనబడలేదు.

తిరిగి గౌరీపున్నమనాటికి వచ్చాడు. ఆకాశంలో చందురిని చల్లని చూపు చుక్కల కసుగీటులను సరీగ్గా కనపడనీయలేదు! ఊరంతా ఉల్లాసంగావుంది. కమ్మరిచేసిన గైరమ్మతల్లి బాజాభజంత్రీలతో డప్పుల

ధమధమలతో ఊరేగుతోంది. యువకులు యువతులు మెచ్చుకున్నట్టు దేవి ఎదరుగా గరిడీకి లంఘించుకున్నారు. సూరమ్మకు కావలసిన ఒళ్లు కొంతసేపటికిగానీ రంగంలోకి దూకలేదు. ఢప్పులవాళ్ళని వెర్రెత్తించాడు వెంకన్న! కానీ మనసు మనసులా లేదు....గైరమ్మ కదలిపోతూంది. వెనకా ముందూ చుట్టూ ప్రజ కదులుతున్నారు. సంతోషంతో గెంతులువేస్తున్నారు కొందరు. ఆడుతూ పాడుతూ పోతున్నారు మరికొందరు. వెంకన్న ఆగిపోవటంచూసి సూరమ్మ తోటివారినుంచి తప్పుకుంది.

ఆమె ఇంటిపెరటి-బూజుగా, తుప్పలా అక్షింతాల చెట్టు — ఆప్రక్కనే గడ్డిమేటు! ఆ చాటులో నిల్చింది! అనుకున్నట్లు వెంకన్న ఆత్రోవనే వెళ్ళిపోతున్నాడు. పైగచేసింది. నిల్చున్నాడు, కానీ రాలేదు. చూసింది. ఆగలేక చెయ్యి పట్టుకుంది. అప్పటికీ కదల్లేదు. "ఎవరూ లేరు" అంది.

"నేనెవరికీ జడవలేదు. పదిమంది వచ్చినా చీల్చేస్తాను."

"నా మాట వినవూ?"

ప్రార్థనతో కూడిన కోరికకు కాదనలేకపోయాడు. వెంటపడ్డాడు. ఆకసం నిర్మలంగావుంది. పట్టపగల్లా తీర్చి కాస్తున్నది వెన్నెల!

"ఈరోజు యెప్పటి కొస్తాదని యెన్నిరోజులనుంచో చూస్తువ్నాను నిన్ను పట్టుకుని మురిసిపోవాలని....ఎదవ జాతులు!"

వెంకన్న ఆమె నింకా తాకలేదు. అన్నాడు: "అందసందాలున్న ఆడకూతురివి నువ్వు! బంగారంనాంటి కొంపలో పడతావు. నాలాటి పాపిష్టోడితో నీకెందుకు?"

ఆమె నోరు నొక్కేసింది. "నా పెళ్ళి స్థిరమైపోయింది. రాత్రీ పగలూ నీకోసమనే సూసుకొని వున్నాను. ఎటో వెళ్ళిపోదాం పద....పద!"

ఆమె గట్టిగా అదిమి పట్టుకుంది. కన్నీరు కార్చేస్తోంది. వెంకన్న లోన చలించినా, బయటికి శిలాప్రతిమలా అయ్యాడు.

"వద్దు! ఇంత బలంగలవోణ్ణి నీటికంపె పల్చన, దూదికంటే తేలికయిపోమంటావా?"

ఆమె మాటాడలేదు.

"వద్దు సూరీ! ఈ దొంగోడ్ని యిలా బితకనియ్యి!"

ఆమె కళ్ళవెంట నీరు కారుతోంది. చూశాడు. మనసు మళ్ళీ ద్రవించుకపోయింది. "సూరీ! నన్ను మంచన్నది యీలోకాననువ్వొక్కదానివే! లోకాననాబాగుకోరిన నీఒక్కదానికి అన్యాయం సేసేస్తే ఈభూమి నాలాంటి పాపిష్టోడిని మొయ్యగలదా? ఈయాళ ఇక్కడుంటాను—లేపు యేవూర్లో, యేమూలో — సుఖాన్నవున్న పేణాన్ని దుఃఖాన్న పెట్టుకోక!"

వెళ్ళిపోవాలని ఆమె కన్నీరు చేతితో తుడిచాడు. ఆమె ఇంక యేడవలేదు. వెన్నెలను ఒకమబ్బు తినేస్తోంది. ఆమె దుఃఖాన్ని ఒక కోరిక నమిలేస్తోంది.

"సూడు! నేనొక్కటి కోరతాను. కాదనకు —"

వెంకన్న ముందుకు అడుగువేయబోయి ఆగాడు. "సెప్పు" అన్నాడు.

"ఇద!" చెయ్యి చాపింది.

మబ్బుతెర లేచిపోయింది. మెరుగెక్కిన చందురుడు మెల్లగా కదిలిపోతున్నాడు.

తెల్లవారేసరికి వెంకన్న వూళ్ళోలేడు. వారంరోజుల్లోనే వూళ్ళో తకోరామేళం వాగింది. యెర్రయ్య పెళ్ళికొడుకు. ఏనుగులాంటిమనిషి—గానుగెద్దులాంటి తరిఫీము. మొదటి పెళ్ళానికి పిల్లాజెల్లా లేరు. ఈ మొగుడితో మనలేనని కన్నవారింటికి వెళ్ళిపోయి తెగతెంపులు చేసుకుంది. ఊళ్లో నలుగురూ, సూరమ్మ చాలా బాగుంది. చక్కనిచుక్క అన్నారు. పదుగురూ అంటున్న పిల్లని పెళ్ళిచేసుకోవాలని భీష్మించుకున్నాడు. పెళ్ళయిపోయింది. డబ్బుకీ తనకీ లంకె. దానికోసం యేం చేయమన్నా చేసేస్తాడు.

సూరమ్మ కాపరానికి వచ్చింది. "దున్ననివానికి మడియెందుకు? యేలకపోయినవానికి పెళ్ళ మెందుకు" అనుకుంది సూరమ్మ. ఇంట్లో తనకేం లోటులేదుకానీ, సౌఖ్యం అనేది లేకపోయింది. రెండునెలలు పోయాక వెంకన్న ఒకరాత్రి పొరుగూరినుంచి దొంగతనంచేసి వచ్చేస్తున్నాడు. ముగ్గురు మనుషులు ఆ చీకట్లో పెద్ద కొండపోతులతో తారస పడ్డారు. పోతులు యెర్రయ్యవని పోల్చుకొని, వాళ్ళతో చేతిలోని బాణా

క్రమతో యుద్ధానికి లంఘించుకున్నాడు. ఆ దొంగలకి దెబ్బలు బాగా తగిలాయి. ఒకడికి కాలు విరిగింది. వెంకన్నకు కవుకు దెబ్బలు తగిలాయి. ఆ రాత్రి మీద పోతులు, కాళ్ళు విరిగిన మనిషిని మోసుకొచ్చిన వెంకన్నను చూసి, అంతా సెభాష్ అన్నారు. ఎర్రయ్య కృతజ్ఞతగా రెండు పూటలు ఇంట్లో భోజనంచేసేమన్నాడు.

అదే చిక్కు తెచ్చింది. నీటితీరువలేని సారమైనభూమికి కాలవ నీరు వచ్చింది. వెంకన్న తనతో వుండకపోతే బలవంతాన చచ్చిపోతానని సూరమ్మ మొరపెట్టింది.

ఊళ్ళో గుసగుసలు బయలుదేరాయి. రానురాను వెంకన్న బస యెర్రయ్యయిల్లు అయిపోయింది. ఏం ఫలితం కోరకుండా పనిపాట్లలో సహాయంచేస్తున్నాడని యెర్రయ్య సంతోషించాడు. సూరమ్మకు ఒక్క క్షణం వెంకన్న లేకపోతే బ్రతకటం దుర్భరంగా వుంది. ఈ తిండితో కండలు పెరిగిపోయాయి. విచారంలేదు. నలుగురిలో నాయుడిగా చెలామణి అయిపోతున్నాడు. కొందరు "పెద్దచెరువు నీటికి, పెద్దింటి రంకుకు" పోల్చారు. కొందరు పదుచుకున్న యిల్లు తుడుచుకుపోతాదని లోలోన అనుకున్నారు. ఎవరో గుసగుసలాడుకుంటున్నారని, ఎర్రయ్య విసవిసలాడాడు. కానీ పెళ్ళాం ఏడ్చుకుందని కరిగిపోయాడు.

సూరమ్మకు కొడుకు పుట్టాడు. వూళ్ళో వెంకన్నరూపేనని గుసగుసలాడుకున్నారు. సూరమ్మ ఒకే ఒక కొడుకు రాజన్న నూనూగు మీసాలప్పుడు వెంకన్నను ఇంటినుంచి పొమ్మన్నాడు. చాలా రభస జరిగింది. ఆ మాటల పోరాటంవల్ల వెంకన్న రెండురోజులు ఎర్రయ్య ఇంటికి వెళ్ళకపోవటంతో, సూరమ్మకు జ్వరం పట్టుకుంది. యెర్రయ్య కొడుకుని మందలించాడు. "మీ అమ్మతో నువ్వు తగలక. అది వచ్చింది. ఉన్నసిరి ఇట్టే పొంగిపోయింది. అది బతికినంతకాలం ఈ ఇంట్లో లచ్చిందేవి ఉన్నాదే" అని చెప్పాడు. కొడుకు అప్పటికి ఊరుకున్నాడు. ఎర్రయ్య వెళ్ళి వెంకన్నను పిలిచాడు. రాజన్నాయుడు వురఫ్ రాజిగాడికి పెళ్ళయింది. పెళ్ళాం, అత్తలాంటి చక్కని రూపుకాకపోయినా, బింకమైన మనిషి. వారంరోజులు, కాపరంచేశాక ఈసంసారంలో మూటలతోనే చిచ్చుపోసింది.

"బలే కుటుంబం! చెట్టంతకొడుకుని పెట్టుకొని....మాతల్లి....మా అత్తకి సిగ్గులేకపోతే....నీకు లేదా?"

ఈ ఎగతాళితో ఆ రాత్రంతా రాజన్నకి నిదరపట్టలేదు. పెళ్లం అంతతో వూరుకోలేదు. "నాకు ఈ రగడ తెలిస్తే, ఈ ఇంటికి కోడలిని కాకపోదు"నంది. తండ్రిదగ్గర భయంవున్న కొడుకు, యింకావోర్చాడు. ఒకనాటిరాత్రి "ఎందుకంత పెద్దమీసాలు" అంది. దానితో రాజన్నకు బ్రహ్మాండమయిన పౌరుషం వచ్చింది. నిర్మొహమాటంగా చెప్పేశాడు. వెంకన్న ఇంట్లోకి అడుగుపెట్టడానికి వీల్లేదని, ఈ కేకలు ఇరుగు పొరుగుకి ప్రాకి ఊరంతా ప్రాకిపోయినాయి. తల్లిపోలిక కూతురికి వస్తాదిగాని కోడలి కెందుకొస్తాదనుకున్నారు కొందరు. సూరమ్మ సగం చచ్చి పోయింది. ఈ గలాటాలో "నీ వెవ్వరికి పుట్టావురా కొడకా!" అని అందామన్నంత పౌరుషం వచ్చేసింది. కాని కొడుకంటే యెడతెగని ప్రేమ. ఒకప్రక్క వెంకన్న, ఇంకోపక్క కొడుకు. ఎటూ మాటాడలేక కుమిలిపోయింది. వాడు పోకపోతే నేను వేరే వుంటానన్నాడు కొడుకు.

వెంకన్నకు ఆత్మాభిమానం కలిగినా సూరమ్మను విడిచి తనూ బ్రతకలేడు. మాటలుపోయి చేతులు పైకెత్తారు. రాజన్నాయుడిని పదదొయ్యడానికి ఒక్క చెయ్యి చాలు....కానీ....ఆగిపోయాడు ...వెళ్ళిపోవాలనుకున్నాడు. కానీ ఆమెను విడిచి వుండలేడు!

ఒకనాటి అర్ధరాత్రి -చీకటిరాత్రి! ప్రకృతి నల్లగుడ్డ కప్పుకొని, నిద్రపోతోంది. ఆ నిశ్శబ్దంలో వుండివుండి, దూరదూరాన్న చలిబాధకు ఆకలిబాధకు ఓర్వలేని ఓ ముసలినక్క- యేడుస్తోంది. పెరటిలోవున్న పెంటమీదినించి గాలి దుర్గంధాన్ని మోసుకొస్తోంది. వెంకన్న ఒంటిగా ఎర్రయ్యింటిపెరటి కొట్టు అరుగుమీద దుప్పటి కప్పుకొని, పడుకున్నాడు. చాలాసేపటివరకూ నిద్దరపట్టలేదు. ఎప్పుడూలేనిది, జరిగిన రోజులు నెమరువేసుకున్నాడు. తన ఒళ్లు కోస్తే రక్తంఅంతా పాపమే అనుకున్నాడు. తనే యెర్రయ్య ఆయితే, రాజన్న అయితే సూరమ్మచేసిన పనికి యేం అయ్యేవాడు? మళ్ళీ పాపిష్టోడు జరిగింది, జరగబోయేది ఆలోచించకూడ దనుకున్నాడు. పడుకునే ముందర తనదగ్గర యెవరో వున్నట్లనిపించింది. లేచి చూశాడు! దెయ్యమా? వంద దెయ్యాలు రానీ-

ఒంటిగా వల్లకాటిలో పడుకుంటాను.మళ్ళీ ఏదో కదిలినట్లయింది. పెరటి సాలలోని పోతులు ఇంకా తెలివిగానే వున్నాయ్. ప్రక్కనేవున్న ఆవు కునుకుపాట్లు పడుతోంది. పడుకుంటూ ఆకాశంలో చుక్కలవేపు చూశాడు. ఆకాశంలో చిన్న పెద్ద చుక్కల్ని వుంచాడు. భూమిమీద నాలాంటివోల్లని యెర్రయ్యలాంటివోల్లని, పుట్టించాడు. దేముడు బలేవో డనుకున్నాడు....అలా మగతనిద్దర కమ్ముకొచ్చింది.

నలుగురు చుట్టుముట్టారు. పోటిలో గుద్దుట—కాలుచేతులకు బంధం! అమ్మో అంతాసరి! అనబోయాడు. ఆ యేడుపు గుండెలో ప్రతిధ్వనించింది. అంతా చీకటి. జగమంతా చీకటి. తన సూరమ్మ యెలా వుంటుందో, యిప్పుడు వూహించుకోవాలి. పొడిచిన కళ్ళనించి రక్తం కారుతూంది. తను వెంకన్నాయుడు కాడిప్పుడు-గుడ్డి వెంకన్న. గట్టిగా ఏడవబోయాడు. నాలుగు సింహాలబలం పౌరుషం వచ్చింది....పోతులూ ఆవులూ కట్టచుట్టూ తిరుగుతున్నాయి. ముసలినక్క ఏకకంఠంతో అరుస్తోంది.

చిన్న చప్పుడుకు సూరమ్మ బుడ్డి పట్టుకొచ్చింది. కొడుకు, మరి ముగ్గురూ! హా! ంది....మరి మాటాడలేదు. చూసింది....తన ప్రియుడి కళ్ళవెంబడి రక్తం కారుతోంది. నిట్టూర్పులతో మిదపతిపోయింది. కళ్ల వెంబడి కన్నీరు మున్నీరుగా కారుతోంది....కొడుకు తల్లిని కాళ్ళతన్ని వుమ్మివేసి వెళ్ళిపోయాడు.

నోటిలో గుడ్డలు తీసింది. వెంకన్న, జంతువు కదలిక పసిగట్టి అకలిగొన్న సింహంలా వున్నాడు. కానీ కళ్ళల్లో మేకులు గ్రుచ్చుకుని, గ్రుడ్డిచేశాయి. సూరమ్మను నొక్కివేస్తూ యేడుపులోనే రొద్రాన్ని, వెళ్ళ గ్రక్కుతూ "రాజిగాడి రక్తం త్రాగకపోతే!" తొడచరిచాడు.

ఆమె కీళ్ళన్నీ ఒక్కసారిగా విరిగిపోయినట్లయినయ్. అలా వంగుతూ వెంకన్నపాదాలమీద పడిపోయి కన్నీటితో పాదప్రక్షాళనం చేస్తోంది.

ఈ స్త్రీ భార్యకంటె తల్లిగా పరిపక్వంచెందిం దిప్పుడు. ఒక్కగాని ఒక్క కొడుకు-కడుపు వెర్రిఅయిపోతోంది....ఈ సింహంలాంటి మనిషి తలచుకుంటే యేమైనా చెయ్యగలడు. కొంతసేపటికి వెంకన్న "సూరీ!

నాపాకలో దిగబెట్టే"అన్నాడు. ఈ గొంతుకలో యిదివరకు భీకరంలేదు, ఆమె భుజంమీద చెయ్యివేశాడు.

"ఒక అడుగు, రెండడుగులు, తీసుకుపద....ఆగకే సూరీ! నాలు గడులు వేస్తే నరకం! సదే సూరీ!"

ఇప్పుడు కన్నీరు కారిపోతూంది. నడుస్తూనే సూరిభుజాలు, మోము, ముక్కు ...తల....తాకుతున్నాడు!

మళ్ళీ తనపాక! అంతా మత్తుమందు తిన్నట్లు....కొత్తగా తాగిన వాళ్ళలా నిద్రపోతున్నాడు.

కూర్చున్నాడు. చీకటి! ఆ చీకటిలో తన ప్రేమమూర్తిని తాకింది. మళ్ళీ యౌవనం ఆమెలోకి చొచ్చుకున్నట్లయింది.

"సూడు! నేనొక్కటి కోరతాను....కాదనకు!"

వెంకన్నకు ఆ వెన్నెలరాత్రి జ్ఞాపకంవచ్చింది.

"సెప్పు" అన్నాడు,

"ఇద" అని చెయ్యి దాపింది. వెంకన్న మళ్ళీ బాధలోనే యౌవనాన్ని అంకురింపచేసుకున్నాడు. ఈమె ఈసారి సుఖం కోరాలనుకున్నా కోరలేదు. కళ్ళల్లో నీరు వుబికి వుబికి రాలుతోంది."ఆడుపశువయ్యాడు. నాకొడుకు కాడు, నీ కొడుకే....ఆడికి యేం కీడుసెయ్యనని...."ఆమె గొంతుక పట్టుకపోయి ఆవేదనతో వెంకన్నఒడిలో తలెట్టి వెక్కి వెక్కి యేడవడానికి ఉపక్రమించింది.గుడ్డివెంకన్న మెల్లగా ఆమెచెయ్యి అందుకున్నాడు. నేతిలో చెయ్యివేసి వచ్చేదుఃఖాన్ని బలవంతంగా ఆపుకొంటూ "సూరీ! అంతా ఋణానుబంధం!" వెంటనే మాట రాలేదు. కాసేపు ఆగి మెల్లగా:"నానుచేసినదానికి శిక్ష యిది....నీ కొడు కీ శిక్ష యేయలేదు....ఆ దెవడు వేయడానికి....! భగవంతుడే యీశిక్ష యేశాడు....నచ్చిపోను.... బాగా బాధపడతాను...." ఏడుపు ఆపలేకపోయాడు. కన్నీరు ఆమె తల మీద చుక్కలు చుక్కలు పడుతోంది. "అతీగతీలేక యీధిలో కుక్కలా నస్తాను-యెళ్ళే సూరీ!"

ఆమె యెంతసేపటికో లేచి మౌనంగా పాదాలను తలమీద పెట్టుకొని, వెళ్ళిపోయింది. వెళ్తూ "నా దేవుడా!" అని లోన మొక్కుకొని వెళ్ళిపోయింది. ఇంత జరిగినా తిరిగి వెళ్ళేసరికి మొగుడు వీధరుగుమీద

కుంభకర్ణుడిలా నిద్రపోతున్నాడు. తెల్లవారేసరికి ఆ వూళ్లోనేకాదు, ఇరు పొరుగూర్లు కూడా గుబ్బుమన్నాయ్. ఎర్రయ్యకూడా పలుకరించడానికి వెళ్లాడు.

"రాత్రిమీద ముళ్లడొంకమీద పడిపోయాను,ముళ్లు గుచ్చుకున్నా" యన్నాడు కొందరు నమ్మారు. మరికొందరు; "దొంగతనం ఆడిపుట్టి కతోనే వచ్చింది. వెళ్ళివుంటాడు. ఎవరో కళ్లుపొడిసి యింటికి దిగబెట్టే శారేమో" అని అనుకున్నారు. వున్నది వూడిపోతేగాని వేదాంతంరాదని మరికొందరు గొణుక్కున్నారు.

సూరమ్మ ఆరోజునుంచి వెంకన్నముఖం చూడలేదు. రోజు రోజుకు బెంగతో చిక్కిపోయి—ఆరునెలలు తిరగలేదు-యీసారి యిది వరలా అత్తారింటికి కాదు-యమసదనానికి—వెళ్ళిపోయింది.

సూరమ్మ చచ్చిపోయి అప్పుడే అయిదేళ్లయింది. వెంకన్న ఆమె చచ్చిపొయిన మరుసటిరోజునుంచీ గిన్నెపట్టుకు వీధిలోపడ్డాడు.

9

నీలి—గంజీగడుగూ, అంబలీ సంబలీ త్రాగే కడుపుకు దంపుడు బియ్యం అన్నం తగలటంచేత, నరాలలో జనసత్వాలు, జేరొక్కొన్నాయి, యౌవనం బలిసి ఒళ్ళంతా సర్దుకుంది.అందం అన్ని అవయవాల్లో మూర్తీభవించి వక్షంలో కేంద్రీకరించింది. ఆమె ఇప్పుడు విడిన గులాబీ, విరితేనియ!

పుల్లయ్య అనుకున్న సమయం. తనలా కండలుతిరిగిన వస్తాదు, పెళ్ళం బక్కచిక్కినట్లుంటే, పట్నంలో బుగతేమనిపోతాడు? ఇప్పుడు పెళ్ళం—తన ఒళ్లుకు సరిపడ్డ వొళ్లు—మనసు కలిసిన మనిషి-మాటలో మాట—తన పెళ్ళం!

గుడ్డెలోని బీరకాయలు, అనపకాయలు, చెరుకుముక్కలతో తట్ట నిండిపోయింది. మొగుడూ పెళ్ళాలు ముస్తాబులయ్యారు. నీలి యెర్రటి అంచుగల తెల్లటి చీరకట్టింది. తల దువ్వుకుని మెట్టవేసి కళ్ళనిండుగా కాటుక పెట్టింది.

పుల్లయ్య బస్తీకి వెళ్తున్నాడుగదా! చేతికి కాశీతాడు కట్టాడు. తెల్లని పలాచని కళ్ళాలల్చి, లోపల నలుపురంగు బనియను, బనియను మీద తెల్లదారంతో కుట్టిన రావియాకు,వోణీతో వారతలపాగా చుట్టాడు. మెడలో కాశీతాడు, చంకన బాణాకర్ర, గేరా గిరజాల చివరల పెంబడి కారేటట్లు నూనె, ముంగాలువరకూ పంచెకట్టు. అద్దంలో బాగా చూసుకున్నాడు బయలుదేరేముందు.

రోడ్డు యెక్కారు ఇద్దరూ. ప్రొద్దుపెండ వీపుకు తగిలి వెచ్చగా వుంది. ఈ మాట ఆ మాట ఆడుకొని కదిలిపోతున్నారు దంపతులు.

నాలుగు క్రోసుల దూరం ఎంతసేపు.

ఇక బుగత సంగతి! ఆయనపేరు సీతారామస్వామి బి. ఎ. బి. ఎల్. ప్లీడరు. ఈయనతండ్రి నవిరి గ్రామకరణంగా వుండేవాడు.ఆ గ్రామంలో సగంభూములు, ఆ రోజుల్లో ఒకమాలుకోదారివి. ఆయన పట్నంలో వుంటూ అంబారం వగైరాలు వసూలుచేసే బాధ్యత ఈ కరణంగారిమీద వదలివేసేవాడు. కొన్ని సంవత్సరాలు సవ్యంగానే వెళ్ళిపోయింది.మాయి కోదారువలన కొంతరాబడి సంపాదించుకొన్నాడు.కరణం బ్రతకడానికి లోపంలేకుండా సరిపోయేది. ఒక సంవత్సరం మాత్రం దగాచేశాడు!

ఆ యేడు దక్షిణాదిన కరువుపుట్టింది. ధాన్యం ధరలు వుండివుండి పెరిగిపోయాయ్. పెరిగిన ధరకి అమ్మి, ధరలు పెరగకమునుపే అమ్మినని, మిగతా డబ్బు కాజేశాడు. భూములు కొన్నాడు. కొడుకుని పట్నం పంపించాడు.పెద్దచదువు చదివించి కలెక్టర్ని చేస్తానని పూరంతా చాటాడు. కొడుకు వాగ్ధాటి విని కొడుకు తప్పక కలెక్టరవుతాడని నమ్మాడు. నోటికి బ్రకీ ఎక్కడా సామ్యం కుదరలేదు.దండయాత్రలు సాగించి ఎలాగో మద్రాసులో చదివి ప్లీడరుపట్టా సంపాదించుకున్నాడు కొడుకు.

కొడుకు స్వగ్రామానికి దగ్గరగా వున్న పట్నంలోనే ప్రాక్టీసు పెట్టాడు. సంపాదన శూన్యం. ముసలివాడు మదుపు పెట్టవలసివచ్చేది. రెండు కుటుంబాలు దివ్యంగా గడపటానికి సంపాదకోసం--అందులో మిగిల్చి ఆస్తిచెయ్యటానికి-ప్రజలను తుడిచేసేవాడు. భయం, భక్తి ప్రజల్లో వుండేది. ముసలాడి మాటకు అడ్డూ ఆపూ వుండేదికాదు. ఆ బాబుకి అనుభవించాలని వుంది అనుభవిస్తున్నాడు. మనకి రాతలేదు-లేదు.

ఒకడికి వున్నాదని యేడిస్తే రెండుకళ్ళూ పోతాయని సమాధానపరుచు కొనేవారు. అసూయ అనేది ఆనాటి ప్రజల్లో సాధారణంగా వుండేది కాదు. ఆ తరం సరి.

సీతారామస్వామి తరం వచ్చింది. ఈయన పట్నం మకాం ఈ పల్లెలోని ఇంటిని మట్టిలో కలిపింది. పట్నంలో తండ్రి వున్నప్పుడే పెద్ద యిల్లు కట్టించుకున్నాడు. ఆ రోజుల్లో కూలీలు బళ్ళతో ఇటికలు రాళ్ళూ, సున్నంకూడా నవిరినుండే, ఖర్చులేకుండా వెళ్ళాయి. ఇంత యిల్లూ అయిదోవంతయినా ఖర్చుకాకుండా తయారయిపోయింది. ముస లాయనకు యింట్లో పెళ్ళం, పీఢిలో వుంపుడుకత్తె వుండేది. సీతారామ స్వామికి అది లేదు కానీ, ఆడవాళ్ళంటే కొంచం పిచ్చి వుండేది. తల్లీ తండ్రికి ఒకే సంతానం అయన పెళ్ళం. ఆస్తి కలసివస్తూందని ముస లాయన సంబంధం చేశాడు.భార్య పల్లెటూరునుంచి వచ్చినా ఆ రోజుల్లో పెద్దయింటి ఫేషన్లు తెలుసు. మణికట్టువరకు చేతులున్న జాకెట్టు వేసేది. పట్నంగాలి తగలటంతో పలుకుకూడా వచ్చింది. ఒకవిధంగా మొగుడ్ని మించేసింది. ఆమెకు సెక్షన్లతో సహా కేసుల విషయమై పల్లెటూరి వాళ్ళతోనూ, ఆడవాళ్ళతోనూ నచ్చచెప్పటం తెలుసు. ఇదెంతలో పని: అయన నోరెత్తారంటే ముససబుకూడా ఆశ్చర్యపోతాడని క్రిమినలు కేసు లన్నీ మొగుడివేనని చెప్పటంలో, భర్తకు సహాయంచేస్తున్నాననుకొని చెయ్యలేకపోతుంది. పడకగదిలో మొగుడు చెప్పిన సెక్షన్లు వప్పచెప్ప గలనని గర్వం వుంది ఆమెకి.సీతారామస్వామి మొదట సన్నంగా వుండే వాడట. పెళ్ళాం నాజూకుగా వున్న యెత్తయిన పుష్టయిన విగ్రహమే. అత్తగారికి అల్లుడిలా వుండటం నచ్చక నేటివుమందులు తినిపించింది. కానీ, మనిషి అలానే వున్నాడు.

సీతారామస్వామి జాతీయ పోరాటంలో పాల్గొన్నానని చెప్పు కుంటాడు. తన భార్యకూడా పాల్గొన్నదని తను చెప్పడుకానీ, తన భార్య చెప్పుకుంటుంది. అలా ఆమె చెప్పుకోవటం తనకు యిష్టంలేదు. ఆ రోజుల్లో స్త్రీకి సంపూర్ణ స్వాతంత్ర్యం వుండాలని వాదించినవాడు, ఈ రోజుల్లో వాదనకువస్తే భార్య వినకండా-వుండకూడదనే అంటాడు. తన జీవితంలో ఈ సంబంధమైన దేదో బాధవుంది. బహుశ: అది అనుమా

నంవల్ల వచ్చివుండవచ్చు. ఒకటి రెండుసార్లు ఆత్మహత్య చేసుకొంటా మనుకొన్నట్లు జ్ఞాపకం. కాని పురుషుడనని, ధరలో రెండు తెరగుల నుత్త ముడనని, భార్యను అదుపాజ్ఞలలో వుంచడానికి, ప్రయత్నించాడు — సఫలుడయ్యాడు. కాని ఈ యాభైయ్యోపడిలో ఆమెదే పైచెయ్యి అయి పోయింది. ఆమెనోరే తన వాగ్ధాటిని మింగగలదు. ఆమె గీసిన గీటు దాటకూడదు. భార్య పెట్టిన హద్దులను మనసులోనే దాటడం అలవాట య్యిం దిప్పుడు. ఒక్కొక్కప్పుడు తన దృక్పథాన్ని ఆమె ఆమోదించ టం జరుగుతూ ఆశ్చర్యాన్ని కలిగిస్తూంటుంది.

సీతారామస్వామికి క్లయింటులు చాలా తక్కువనే చెప్పాలి. తండ్రి గడించింది లేకపోతే, బోర్డు తీసేసి యే ఆఫీసులోనో గుమాస్తాగా చేర వలిసిందే. కానీ తనకున్న ప్రాక్టీసువల్ల యెక్కడకు వెళ్ళటానికీ వీలు లేకపోతూందని వచ్చిన కొద్దిమందితోను చెప్పకుండా వూరుకోలేక పోతున్నాడు. తనలో గొప్పతనమట. రాబోయే విషయాలని గ్రహించే దూరదృష్టేనట. దానికి తను ఎన్నైనా వుదాహరణలు యివ్వగలడు! తన ఒకే ఒక కొడుకు విషయమే ఉదాహరణ. కొడుకుపేరు వెంకట అప్పల రామనరసింహారావు — దేముడు, తల్లి, తండ్రి అందరిపేర్లు ఈ పేర్లో కలిశాయి. ఈ రావూ ఒక ప్లీడరే. తండ్రి కొడుకు బోర్డులు గేటుకు రెండు వైపులా వుంటాయి. రెండూ ఒకే సైజువికానీ, ఇద్దరు మనుషులూ వేరే సైజు. చెట్టుమొదలు — చీపురుపుల్ల! తండ్రికి నోరున్నాది, బుర్రలేదు — కొడుక్కి బుర్రున్నాది, నోరులేదు. అంచేత ఆర్జనలేదు. ఆస్తిపాస్తులమీద ఆధారపడి వుండవలసివస్తోంది.

వెంకట అప్పల రామనరసింహారావుకు—అన్నీ మనసులో పెట్టు కోవటం అలవాటు. తండ్రి ఒక సంబంధం చూశాడు. ఆ పిల్ల స్కూలు ఫైనలు వరకు చదువుకుంది. శరీరపొందికలో తనకు తీసిపోదు. ఈ రావు కండలు తగిలిన వెచ్చని కౌగిలికోసం తహతహలాడేవాడు. కానీ తండ్రికి ఇష్టంలేదని చెప్పలేదు. ఆ అమ్మాయికి ఒకే ఒక తమ్ముడు వుండేవాడు. ఆమెలానే చీపురుపుల్లలా వుండేవాడు. రావుకు పెళ్ళయిన పదినెలలకే ఆ అర్భకుడు చచ్చాడు. ఆ ఆస్తంతా కోడలికి కలవబోతోంది. తన దూర దృష్టికి నిదర్శనం యిదైనా, సాధారణంగా పైవాళ్ళకో చెప్పడు. ఈ

రావుకి పెళ్ళం కాపురానికి వచ్చాక నాలుగు సంవత్సరాల్లో ముగ్గురు ఆడ పిల్లలు పుట్టారు.అంతా యించుమించు తల్లిరూపే—పోతే ఒకపిల్లకు మెల్ల కన్ను: ఇంకోపిల్ల నల్లగా వుంటుంది. వీళ్లు పెద్దయి, చెల్లడానికి ఆ కల సిన ఆస్తి చాలదని అంచనావెయ్యొచ్చు!

పుల్లయ్య తాతలకాలంనించీ వీళ్ళతో సంబంధంవుంది. పుల్లయ్య తాత రెండెకరాల పొలం రావు తాతదగ్గర అంబారానికి పుచ్చుకున్నాడు. పుల్లయ్యతండ్రి మల్లునాయుడు మా పౌరుషంకల మనిషి. సీతారామ స్వామి కొద్దిగా ఆలస్యానికి ఒప్పుకోక మాటంచే. స్వంతభూమి అమ్మి పంటపోయినా అంబారం కొలిచాడు. ఆనాటినుంచీ అంతా సవ్యంగానే సాగిపోతూంది.

పుల్లయ్య పెళ్ళాంతో పట్నం చేరేసరికి పొద్దు చుర్రుమంటోంది. ప్లీడర్లిద్దరూ యింటిలోనే కోర్టు సృష్టించారు. భార్య వాదిస్తోంది యేదో విషయంమీద. కొడుకు మాటాడకుండా వింటున్నాడు.పుల్లయ్యను చూడ గానే పెద్దప్లీడరు "ఏంవోయి పులుపు అయ్యా" నవ్వుతూ అన్నాడు.

"వాడెక్కడ తియ్యటి మనిషి కాబట్టే బంతిలాంటి పెళ్ళాన్ని కట్టుకున్నాడు" అందుకుంది భార్య. దండం మొర్రికిక్క యిద్దరూ కొద్దిగా సిగ్గుపడ్డారు. చిన్న ప్లీడరు చూపు ఒకసారి నీలిమీద పడింది. మనసు ఇక పనిచెయ్యటానికి పూనుకుంది. విరామమెరుగని పని! "ఆ రాత్రి వాళ్లు వుండిపోతే....పుల్లయ్యకు పుత్తునిద్ర పట్టే....తను యేదో పుస్తకం పట్టు కొని వరండాగదిలో, రాత్రి పండ్రెండు గంటలవరకూ తెలివేసుకొని వుంచే....నీలికి నిద్దరపట్టదు.... ఆ వెలుతురువేపు కళ్ళుంటాయ్....తను లేవలేదు....ఆమె! అందం పల్లెవనితల సొత్తు....రోజంతా అద్దం ముం దున్నా....ఈ పట్నంలో అందం అరనిముషంలోనే అరగిపోతుంద!... అయితే నీలికి నిద్రపట్టదు."

కోడలు వంటయింటికి వెళ్ళింది.పుల్లయ్య చిన్న సిగ్గుతో "బాబూ! ఆడమ్మలేని యిల్లు. ఏ ఉండావండూ....నోరు చచ్చిపోయింది. ఇదిగో యీ సిన్నదాన్ని...."

"మంచిది—మంచిది"తల పంకించాడు పెద్దప్లీడరు. "నీ పేరే?"

అన్న యజమానురాలి ప్రశ్నకు పుల్లయ్యే "నీలమ్మ—ఊరంతా నీలి అని పిలుస్తా"రని అందుకున్నాడు.

"భ్రమంగా పనిపాటలు చేసుకుంటుందా?"

"ఓ! మనిషి కనబడ్డంలేదూ? పని పెయ్యకపోతే మనిషెలా సేవ తేరతాది? పెద్దలు అంటారు —కూకున్న కూతురు కూలిపోయింది, చేసిన కోడలు సేవదేరిందని"

పుల్లయ్య మాటలకు పెద్దప్లీడరు ఫకాలుమంటూ "మాయింట్లోనా వంటపుట్టి—యిద్దరు నౌఖర్లూనూ...."

పెళ్ళం కాస్తా తీక్షణంగా చూసిందని కామోసు ఆగిపోయాడు. కానీ పెళ్ళం నోరెత్తింది. "మాకేంటోయ్ పుల్లయ్య! ఆయనకు జడ్జీ ఉద్యోగం యిస్తానంటే యెందుకొద్దన్నారో తెల్సా?"

"చిత్తం! చిత్తం!"

"మనకు స్వతంత్రం వుండదోయ్! రే ప్రొద్దున్న వోట్లగొడవొస్తే మరి ఆయన మంత్రి అయిపోరా!"

"చిత్తం! చిత్తం!"

"కూర్చో అమ్మీ!" పెద్దప్లీడరు నీలివేపు తిరిగి అంటూ అంగటికి వెళ్ళిపోయాడు. నీలి చీర సర్దుకొని ఆ పెరటివరండా గచ్చునేలమీద కూర్చుంది. వరండాకు ఆనుకొని వున్న గదిలో చిన్నప్లీడరు కుర్చీమీద నుంచి, ఒళ్ళంతా కళ్లుచేసుకొని నోరావలించి నీలిని భ్రమింగేస్తున్నాడు.... ఆలోచన....అన్నీదాటి.... చీరలోనుంచి చొచ్చుకొని వెళ్ళిపోతోంది.

పుల్లయ్య అంగటికి యజమాని సైగచెయ్యటంతో వెళ్ళాడు. రెండునెలలజీతం యింకా యివ్వలేదని కామోసు కోడలితో చెప్పి నొచ్చుకుంటున్నాడు. వంటపుట్టి తిండికివుంచె శేరున్నర బియ్యం దండుగని, పెద్ద యజమానురాలు వీళ్లని వేగం పంపించేద్దామని చూస్తోంది.

ఇటూ అటూ వరండాలో పచారుచేస్తూ సీతారామస్వామి అన్నాడు "బాగుందిఁ భేషైన పిల్లని పెళ్ళిచేసుకొన్నావ్ కానీ...." ఆగిపోయాడు.

"ఏం బాబో?"

"నివ్వు చెప్పినమాట వింటాదా?"

"ఏనకేం బాబూ?" చిన్న సిగ్గుతో "నా నెంతంచె అంత!"

"అలాగా!....అయినా ఆడజాతిని అదుపులో వుంచుకోవాలి— వమ్మలేం!"

పుల్లయ్యకు ఈ మాటల్లో ఆంతర్యం అర్థం కావటంవల్ల కామోసు నవ్వి, "తమరన్నది తెలిసింది. ఏ దొచ్చినా ఆడాళ్ళనించే వస్తాది" అన్నాడు.

"బాగా పోల్చావు! వాళ్ళని పొయ్యిదగ్గర— పిల్లులతోటి వుంచాలి కాని, ఇట్లు కదిపితే...."

పెద్దరు వుండి వుండి పెరటి వరండావైపు చూస్తున్నాడు. పుల్లయ్య అన్నాడు, "ఆడదానిని మొగోడు, మొగోడిని ఆడదీ, నమ్మకపోతే, యీ పెపంచకం యెలా నడుస్తాది బాబో! ఆలూ మనలాగ పేణం వున్నోలేనా? యాత్రకీ, జాత్రకీ....యెల్లి సూడకపోతే ..."

"ఓయి పిచ్చోడా! రాను రాను నీకు తెలిసొస్తాదిలే....నా మాట విని....పిలా జెల్లా అయ్యేవరకూ పెళ్లానికి అధికారం ఈయకు!"

పుల్లయ్య చిన్న నవ్వు నవ్వాడు. పెద్దప్పీడరు "నా మాటలు నీకు నచ్చలేదులే! ఎన్ని వందలమందో ముందు జరుగబోయేది చెప్పేజ్ఞానం నాకు వుందని ఒప్పుకున్నారు....నేను కోర్టుకి వెళ్లక్కర్లేదు....నా కాళ్ళ దగ్గరకే వస్తారు"

"చిత్తం! చిత్తం!"

"ఇంతకీ నేను చెప్పే దేమంటే, ఆడవాళ్లు దగాచేస్తారు జాగ్రత్త అని!"

పుల్లయ్య మాటాడలేదు. అత్తా కోడలూ పెరటిలో యేదో విసవిస లాడుకుంటున్నారు. అత్తకు తెలియకండా వాళ్ళకోసమని వంటవాడిచేత బియ్యం కడిగించిందని!"

పొద్దు తిరిగింది. యిద్దరూ కలవుతీసుకొనిబయలుదేరారు. ఇంత వరకూ కొండంత సృష్టించుకున్నాడు రావు. నడుం విరిగింది. క్రోవంట పెళ్లం ఏవో ఏవో అడుగుతోంది. పుల్లయ్య మనస్సు అదోలా వుండటం చేత యేదో జవాబు చెప్తున్నాడు.మొగుడలా వుండటం ఆమె కేం నచ్చ

లేదు. బుగత యింటివాళ్లంతా మంచివారని చెప్తోంది — ఇంకా పొగుడుతోంది — పుల్లయ్య వోరచూపు చూసి — "బడాయికి బచ్చలికూర తినక పోతే తోటకూర" అన్నాడు.

"ఏం అలాగ అంటున్నావ్?" అంది.

"సంసారం గట్టి, మెడ ఒట్టి!" అన్నాడు.

చలికాలపు పొద్దు వేగంగా సముద్రానికి దిగిపోతోంది. రోడ్డుమీద నాటుబళ్లు గడగడ చేసుకొంటూ సంతనుంచి తిరిగి వచ్చేస్తున్నయ్. ఒక బొగ్గు బిస్సు బొక్కు బొక్కులాడుకుంటూ వెళ్ళిపోయింది పట్నంవైపు. మబ్బులు చెట్టునీడలు దాటివస్తూంటే, రోడ్డుప్రక్కనే అంతదూరంలో చెరువు కనబడింది. చెరువు నానుకొని పల్లపుభూములు, వాటి నానుకొని మెట్ట భూమి, ఆ మెట్టునానుకొని చిన్న గుట్ట!

మాటాడకండా మొగుడన్న మాటల్లోని అర్థాన్ని గ్రహించిన నీలి మెల్లగా అన్నది "మనం పెడితే పెళ్లికోరటం — పెట్టకపోతే చావు కోరటమా? ఒకరి మంచితో మనకి సంబంధం కానీ, ఒకరి సెడ్డతో లేదని మా మామ్మ సెప్పింది. ఆ బాబు బతకటానికి ఆదరువు సూపించాడు కదా! యెందు కలా అంటావు?"

పుల్లయ్య యింక పౌరుషంతో దాచలేకపోయాడు. "అత్తా కోడలూ అలాగయిపోయారే? మనం కూడు కెళ్లామే! ఆ బాబు నిన్ను నమ్మొద్దంటాడు — దగాసేస్తావట!"

మరి కోపంతో మాటరాలేదు. ఎదరగా చెరువు కనిపిస్తోంది. చెరువు దగ్గర ఆగి కాళ్లూ చేతులు కడుక్కొని పడమటివైపు తిరిగి ఒక క్షణం కళ్లు మూసింది. మళ్ళీ మొగుడివెంటపడ్తూ "పెద్దబాబు....ఆ మాట ఎందుకొచ్చిందో....మన చేతిలో ఏం వున్నాది! అన్నిటికీ ఆ దేముడున్నాడు!" అనుకుంది.

పుల్లయ్య వోరచూపు చూశాడు.

10

పండిన వరిచేలు కొయ్యకుండానే పెసర విత్తనాలు చల్లారు. చలికాలం ప్రతిభ చూపిస్తోంది. ఆడ, మొగా, పిల్లా, పిచ్చికా, దుప్పట్లూ,

కోకలూ గెంట్లువేసుకోవటం మొదలుపెట్టారు. ముసలమ్మలు, కుంపట్లు ముందుంచుకొని అడ్డ పొగచుట్టలు కాలుస్తూ వెచ్చగా ప్రొద్దున్న సాయంత్రం మూలకూర్చునేవారు. చుట్టూ చేరిన పిల్లలకు ముచ్చట్లూ, వేదరాశి పెద్దమ్మ కథలూ, చెప్పేవారు. ఎండప్పుడు వాళ్లూ పొలాలకు కొడవలి పట్టుకొని వెళ్ళేవారు.

కోతలు సాగుతున్నాయ్. అందరికీ తీరుబడిలేని పని. లేనివాళ్ళూ, పిల్లలూ, కలవారి పొలంపెంబడి అక్కడక్కడ పడిన ధాన్యపు వెన్నులు యేరుకొని బుట్ట నిండాక ఇంటి కొస్తున్నారు. లేచిన పెసర మొక్కలు ఇస్తున్న లేత పచ్చదనంతో పొలాలన్నీ మనోహరంగా కన్పిస్తున్నాయి. ఓమూలనుంచి జంటజంటలు పదాలుపాడుకుంటూ చేస్తున్న పనివల్ల కొద్దిగానైనా అలసటలేకుండా ముందుకి సాగిపోతున్నారు. ఓ మూల కోసిన పొలాల్లో కుప్పలు పెట్టిస్తున్నారు. ఇంకోప్రక్క బళ్ళతో కుప్పలను దగ్గరగావున్న కళ్ళాల్లో వేస్తున్నారు.

ఎక్కడ చూసినా ఉత్సాహమే. నీలికూడా పొలాలలో పదాయి పాడింది. పుల్లయ్య అప్పుడప్పుడు వంతపదం పాడేవాడు. ఇలా సరదాగా పొలంలో పంట కళ్ళాకిని వచ్చింది. కళ్లంలోనించి ఇంటికి, ఇంటినుంచి బుగతగారింటి కెళ్ళాలి.

కొడవలి చేనులో దోపిన దగ్గరనుంచి కొత్తధాన్యం వుడకబోసి యెండాక దంచి, ఆ బియ్యం అన్నం తినటం చాలామందికి పరిపాటి. నీలికి ఇంటి పెద్దరికం వచ్చింది. మొగుడికి యిష్టంలేకపోయినా చెయ్యికి తిరుగులేదు. చాకలికీ, మంగలికీ పంటమోపులు యిచ్చింది. ఊరి బడిపంతులుకు — ఇచ్చేటప్పుడు పుల్లయ్య కలుగచేసుకున్నాడు.

"మనకేం పిల్లలున్నారు చదువుకీ? పందుం ధాన్యం అంచే యేం టనుకున్నావ్?" అన్నాడు.

"పాపం! పిల్లలుకలోడు ఆ బాబు! నలుగురూ నాలుగు పందుం లిస్తే బతుకుతాడు" అంది.

మూతి బిగించి పక్కకు తప్పుకున్నాడు మొగుడు. నూర్పులు అయ్యాయి. పొలిబెంటు మండీవీధ పెట్టారు. ఎగరబోత అయ్యాక రాసి

తోశాడు. ధాన్యం పొలిబెంటు చేటలో వేసి పొలంకు వెళ్ళాడు. కొంటి కర్రతో, పొలంలో బెడ్డతీశాడు, గొయ్యలో ధాన్యంపోశాడు; దండం పెట్టాడు, ఆ బెడ్డ వినాయకుడికి కళ్ళంలోని రాసిమీద పెట్టాడు. కయిలు నాడు రాసట్లు చేసింది నీలమ్మ. ఉప్పు, బెల్లం వెయ్యని ఆ అట్లు వినాయకుడు ఆరగించాడు. కొబ్బరినీటితో అభిషేకం చేయించుకొని, ఇంట్లో ధాన్యపుగాదిలో మొదట కూర్చున్నాడు—ఇక ధాన్యపురాసి కళ్ళంనుంచి వచ్చిపడింది. గాదిలో—గాదిలోంచి పట్నం బుగతగారింటికి కదలాలి:

గంగిరెద్దువాళ్ళ కిదే సమయం: ఓళ్ళో కోమటిపేరయ్య గడించటానికి ఇదేకాలం—మందలి సోదెమ్మకూ యిదే సైము.

"ఓయమ్మ—వాతనొప్పులకీ మధువాయనొప్పులకీ మందు—మంచి మంచి ఔషధాలున్నాయ్—"

ఒళ్ళంతా ఇత్తడి సరుకులు, మెడనిండా పగడాలపూసలు-చంకన పిల్లడు - చేతిలో తంబుర - నెత్తిన బుట్ట! —నోటినిండా మాట -మందలి సోదెమ్మ!

"సంతానంలేదు"....పొరుగమ్మ అందుకుంది....నీలివైపు చూసి సోదెమ్మ "లేకపోవడమేంటి తల్లీ—పద్దెనిమిది గాడిదలమీద వచ్చిన పురండాలు (పురాణాలు)—కన్ను బోయినా, కాలుపోయినా, పిల్లలు లేకపోయినా, అన్నిటికి మాదగ్గరలేనిదిలేదు—కొలిసి ముప్పయికుంచాలు కొలక ముప్పయికుంచాలు—ఇది గురువాగ్య, తల్లి! గురువాగ్య—గురువాగ్య తప్పినోడు గుర్రవై పుట్టాడు—గనమెరిగి బితకనోడు గాడిదై పుట్టాడు!"....

"ఒక్కొదాని కింత కర్చా—" పొరుగమ్మ ముక్కుమీద వేలు వేసుకుంది. లోనుంచి ముసలమ్మ అందుకుంది. "నీలమ్మా! నువ్వు ముసలిదానవా, ముతకదానివా? మందులోని మరలో పడక!"

సోదెమ్మకు కోపంవచ్చింది. ముఖం ముందుకుతోస్తూ అభినయంతో.

"ఓ యీగరెప్పలదాన—సీపి కల్ల దాన
పెట్టిన కూటిలో బుగ్గిపోస్తావా?
ఏకానికి యెత్తే వానలుండవు—
దిగానికి పత్తే పంట లుండవు—"

ఈ సాప్యంపెట్టి మందివ్వకండానే వెళ్ళిపోతూంది—సోదె సెప్ప కండానే పారిపోతోంది. నీలి పిలిచింది—రాలేదు. మళ్ళీ పిలిచింది.....

"నాడి తెలిసినోడే మందులోడు—కీలకంతెలుసుకోవాలి....గురు వాగ్య!" అంటూ తిరిగివచ్చింది.

"నూడు సోదెమ్మా! నాకెందుకుమందు - ఇద = తీసుకువెళ్లు".... అంటూ అడ్డెడుధాన్యం పోస్తూంచే పొరుగావిడ ముక్కుమీద వేలు వేసు కుంది. సోదెమ్మ"మళ్ళా యారోజులనాడు రానా....పండులాంటి కొడుకు నెత్తుకోనా తల్లీ?" అని దీవించింది.

పుల్లయ్య బుగతకు అంబారం కొలవగా మిగిలినదానిలో వూరిలో రివాజుప్రకారం ఆదెమ్మప్పదగ్గర పెళ్ళికి తీసుకున్న డబ్బుకి వడ్డీ ధాన్యం కొలిశాడు. ఆదెమ్మ అల్లుడు, డబ్బుకి పద్దురాయించుకొన్నాడు. ఆ డబ్బు యెలాగ తీర్చడం? మిగిలిన ధాన్యంతో యెలాగో సంవత్సరమంతా గడు పుకోవాలి.....ఇన్నాళ్లూ ఒకేప్రాణం, యిప్పుడు మూడుప్రాణాలు! అందులో పెళ్ళానిది చిక్కినిచెయ్యికాదు! నీలి కాళ్ళూ చేతులు లేవా అన్నది.

పుష్యమాసం సాతానివాళ్ళ పదాలతో బంతీచేమంతుల వాసనలతో పుషారెక్కి వూగుతూ వెళ్ళిపోయింది. వచ్చింది మాఘం. శుద్ధ ఏకాదశి నాడు కొండమీద యాత్ర! నవిరికి దక్షిణాన-క్రోసున్నరదూరాన వున్న దా కొండ-సాలెహాండం.చరిత్రప్రసిద్ధికెక్కిన దది-ఆ కొండమీద విష్ణ్వా లయం.ఆ చుట్టుపట్ల వూళ్లనించి ఆడా మొగా, పిల్లా జెల్లా—బయలు దేరారు—తెల్లవారి ప్రొద్దు లేచింది—చలిగాలి పీస్తోంది—కొండకు ప్రక్కగా పారుతున్న వంశధార నదిలో వేలకొలది జనం స్నానాలు చేస్తున్నారు—స్నానఘట్టంనుంచి కొండకు వెళ్ళేవరకూ, యిరువైపులా గుడ్డలుపరచి, భిక్షకులు బారులుతీర్చి కూర్చున్నారు. స్నానాలస్థలంలోనే భజనలుచేసేవారు—తప్పిడిగుళ్లు వాయిస్తూ ఆ యిసుకలో పరవశమై నాట్యంచేసే గుంపులు! ఆ పాటలు అమడదూరం వినిపిస్తున్నయ్! జన సమూహం దూరాన్నుంచి చూస్తుంటే, బారులుతీరి పోతున్న చీమల సమూహంలావుంది. సాధువులు సమూహంలో చేరి, విభూదిబొట్లు ప్రజ లకు పెట్టి సత్కారం పొందుతున్నారు.

నీలి, పుల్లయ్య కలిసి జాతరకు వెళ్ళారు. తలకు స్నానంచేసి కాంతినిచ్చే తండ్రికి ఒక మ్రొక్కు మొక్కి కొండవైపు బయలుదేరారు. కొంగులో పోసిన బియ్యం, దారికి రెండువైపులా పరిచిన గుడ్డలమీద వేసుకుంటూ నీలి ముందూ, వెనుక పుల్లయ్యా నడుస్తున్నారు. పట్నం నుంచి మంచి కళాకారులు, కిళ్ళీదుకాణం మనిషికూడా వచ్చారు. పట్నంలో కనబడని అందం ఇక్కడే వుంది. ఈ పల్లెయువతుల కూటమిలో స్వాభావికమైన వంపులతో కూడుకున్న సొంపును తిలకించడానికి ....వచ్చారు! ఓమూల కూర్చుని,అమాయికంగా ముందుకి నడుచుకుపోయే —అతివల శరీరపు బిగువులలోనికి తీక్షణంగా చూస్తున్నారు కొందరు. యౌవనం తొణికిసలాడుతున్న కాళింగవనితలు — బింగారుఛాయతో శృంగారంగా అందాన్నంతా జీర్ణించుకొని, ముందుకు సాగిపోతున్నారు— చూచేవాళ్ళకి కనులపండువుగా ఉంది.

పసుపురాసుకున్న ముఖాన పెద్ద కుంకుమబొట్టు పెట్టుకుంది నీలి— పళ్లూ, కాయలూ కొని కొండమీదకు ఎక్కుతున్నారు—అక్కడక్కడ పందిళ్లు వేసివున్నాయ్-ఆ కొబ్బరిపందిళ్ళమీదకు పళ్లు విసురుతున్నారు- అక్కడక్కడ నిల్చుని పదాలు పాడే భిక్షుకులు—వెనకనే ఫకాలున నవ్వుతూ, వెంటపడే పట్నపుకుర్రాళ్లు—ఆ నవ్వును వినకండా పల్లెప్రజ ఒకటే దృష్టి —కొండమీదిదేముడు—ఆ తండ్రి దర్శనం దొరకాలి— జన్మ తరించాలి! రాతి విగ్రహంలో రమణీయత చూస్తారు.. అందులో జీవి కళకళ్ళాడినట్లుంది. వాళ్ళ ప్రార్థనలు విని మనో ఈప్సితాలు అర్థం చేసుకుంటుం దా విగ్రహం! తాము తమభక్తిని అర్పించామనే తృప్తికి నివాళిగా ఈ పళ్లూ కాయలూను! విశ్వాసంతో బ్రతుకుతారు — విశ్వాసమే వాళ్ళ పరమావధి—ఆ విశ్వాసంలోనే ఆనందంపొంది తరిస్తారు.

ప్రజ మీదికి కదలిపోతున్నారు. ఈ దంపతులు భక్తితో తన్మయులై ముందుకు సాగిపోతున్నారు—ఒక సాధుదగ్గరగా యెత్తున గౌరీ పార్వతులు నందివాహనంమీద కూర్చున్న బొమ్మవుంది—శంకరుడు నవ్వుతున్నాడు—అదిగో హాలాహలం మింగిన నీలకంఠుడు — చిరునగవు వలకబోస్తున్నాడు — నందివాహనారూఢుడై ముందుకు వస్తున్నాడు. భక్తితో ఇద్దరూ తలలు వంచారు. సాధువు ఇద్దరి తలలపై చేతులు ఆన్చి

"పండ్లు దానంచేశారు! పండులాంటి కొడుకు పుట్టాడు!"అనిదీవించాడు. పుల్లయ్య ఒళ్లు జలదరించింది! కొడుకు - ఈమధ్య పెళ్ళం వలపు తళుకుల్లో, లీనమై కొడుకువిషయమై మరచిపోయాడు. కొడుకుకోసమే కదా తను పెళ్లాడింది! —నాయంకీ నీతికీ కట్టుబడేవాడు—దొంగలనుపట్టే దొర—తనకంటే గరిడీలో ఘటికుడు తన కొడుకు—కనిపిస్తున్న పిల్లలందరిలోను. తన కొడుకు అగుపిస్తున్నట్లుంది—"నా కొడుకు యింత తెల్లగా వుంటాడేమో! యింతకంటే మొఖం బాగుంటుంది - యీ కొండ యిలా యిట్టే ఎగబ్రాకేస్తాడు.

కొడుకుతలపుతో కొండ యెక్కిపోయాడు. కోవెలదగ్గర జనం క్రోసుకుంటున్నారు. ఆ సమూహంలోనికి చొచ్చుకపోవటం బ్రహ్మండమైనపని. తనైతే వెళ్ళగలడు. నీలి, తనూ ఇద్దరూ వెళ్ళాలి. మనసు తీరా మొక్కాలి. ఎంతోమందిలా వీళ్ళూ కోవెలమీదకు అరటిపళ్లు విసిరేశారు. దేవునిదర్శనం అయిందికాదు మొదట. కానీ అలా వోర్చివుండేసరికి, బ్రొద్దు తిరిగిపోయింది.చలికాలపు బ్రొద్దు గబగబ దిగిపోతూంది. జనంఎద్దడి తగ్గాక స్వామిదర్శనం చేసుకొని, రెండోవైపునించి కొండ దిగారు. పట్నంనుంచి రకరకాల వస్తువులు, దుకాణాలు, కాఫీహోటళ్లు, పల్లెలనుంచి చెరకుబళ్లు- పండరి భజనదళాలు వచ్చాయి- ఒకమూల గారడీ జరుగుతోంది-ఇంకోబ్రక్క రంకులరాట్నం! సంబరం అంతా చూశారు—అప్పుడే జనం పల్చబడుతున్నారు — సెనగలు, ఖర్జూరం, చెఱకులు, కొన్నారు. ఎంత బలవంతం చేసినా నీలి అట్టే ఏమీ తినలేదు. ఒళ్ళంతా బ్రిప్పుతున్నట్లుంది.అయినా మొగుడితోచెప్పక వెంట నడిచింది. అటువైపునుంచి నవిరి రావటానికి రోడ్డువుంది. ఆరోడ్డుమీద కొంతదూరం వచ్చాక అడ్డబ్రోవలో పొలాలగట్లపైనుంచి నడుస్తున్నారు. నీలి కుంటుపడుతోంది. వాళ్ళను దాటుకొని వెనక బయలుదేరినవాళ్లు ముందుకు వెళ్ళిపోతున్నారు.

సాయం సమయం! పడమటి ఆకాశం తెలుపుయెరుపుల కలయికతో మనోహరంగా వుంది. అక్కడక్కడా చెదరిన మేఘాలు, కుంకుమలో తరిచిపోయినట్లున్నయ్. ఒకేఒక తాటిచెట్టు ఆకాశంలోకి చొచ్చుకపోయింది. పక్షులు యెర్రటి పళ్ళతోనిండిన వటవృక్షమని కామోసు,

అటువైపు యెగిరిపోతున్నాయ్! దిగువ పెసరచేలు ఇంపుగా ఆకుపచ్చని రంగు పూశాయి. ఒంటిగా ఒకేగుట్ట భల్లూకంలా భానుడ్ని మింగేస్తోంది!

ముందుకుచూస్తే యేరు! మెల్లగా ఈ అందమైన అందిన ప్రకృతిని నములుతూ దిగువకు కదిలిపోతోంది. అవతలిఒడ్డున గుబురుగా యెత్తుగా లేచిన సరుగుడుచెట్లు సరాగాలాడుకుంటున్నాయ్. ఒంటరిజాలరి వలను చేపలమీదికి విసురుతున్నాడు!

ఆ దృశ్యాలన్నీ మధురాతిమధురంగా వుంటే పుల్లయ్య కాళ్లు గబ గబ పట్టూన్నాయ్! నీలికి ఏదో ఒళ్ళంతా వెర్రి అయిపోయినట్లుంది. ఇంక నడవలేక కూర్చునిపోయింది—ఆ దగ్గరగానే పాములపుట్ట!

"ఓపికచేసుకో—అదిగో కన్పిస్తోంది మనవూరు!"

నీలి మాటాడలేదు. వెనక వచ్చే జనం అట్టేలేరు. చీకటిపడడానికి ఇంకెంతో సమయంలేదు. చలిగాలి అప్పుడే వీస్తోంది. చంద్రుడు మెరుగులు దిద్దుకోడానికి సన్నాహంచేస్తున్నాడు.

నీలికి కడుపు తెమిలేసి పెద్ద వాంతిఅయ్యింది. పుల్లయ్య గాభరా పడ్డాడు. నీలి ఫరవాలేదంటున్నా, ప్రక్కల నిల్చొని పెళ్ళాంచెంపలు గట్టిగా నొక్కి పట్టుకున్నాడు. ఆ పుట్టప్రక్కనుంచి పాము వాళ్ళని చూడనట్లే వెళ్ళిపోతూంటే నీలి గతుక్కుమని లేచింది. ఇద్దరూ నమస్కారంచేశారు. ఆ సర్పరాజం వీళ్ళపేపు చూడకుండానే అలా పొలంగుండా పెసరచేలను చీల్చుకుంటూ వెళ్ళిపోయింది.

ఇద్దరూ ముఖాలు చూచుకున్నారు. మెల్లగా భర్తభుజం పట్టుకొని నడుస్తూంటే మళ్ళీ కడుపు తెమిలేసింది. అప్పుడే ఒక ముసలమ్మ, మనవడూ, యాత్రనుంచి ఆగి ఆగి వస్తున్నారు. గాబరాపడ్తూన్న పుల్లయ్యవైపు నవ్వుతూ చూసి బోసినోటితో,

"ఎన్నాళ్ళయింది నాయనా పెళ్ళయి?" అని అడిగింది.

సమాధానం చెప్పటానికి ఆమాటలు వినిపించుకుంటేగా? మెల్లగా ముందడుగు వేస్తూ వేస్తూ నీలిముఖంలోకి చూస్తూచూస్తూ చిన్న నవ్వుతో "పండులాంటి పిల్లాడిని యెత్తుకుంటావులే!" అంది.

పుల్లయ్య ఆమాటలు వినగానే ఒక్క ఎగురు ఎగిరాడు. నీలి చిరునగవు మెరుపుతీగలా ఒక్కసారి మెరిసింది!

11

ఆ సంవత్సరం చలి మామూలుకన్నా హెచ్చుగావుంది. వార్తాహరు డైన పీస పట్నంనుంచి చలి హెచ్చవటానికి కారణం తెలుసుకు వచ్చా నన్నాడు. "జపానోడు వోడిపోతూ అవ్వసుబాంబు యేసేసి నోడట! అది గాలిలోన కలిసిపోయి ప్రపంచకమంతా సుట్టేస్తోంది!" చాలామంది ఈ వార్త నిజమని నమ్మారు.

ఈ బాంబు ప్రభావం గుడ్డి వెంకన్నకు గన్నెమ్మలాంటి గతిలేని ముదుసలికి బాగా చూపించింది. నీలి, కొద్దిగా చిరిగిన కోక ఇచ్చింది. "నాతల్లి ఆరోజుకి మనవడికింద యేయడానికి ఒక గుడ్డపాత యిచ్చు కొంటానే" అన్నది గన్నెమ్మ. నీలి చిన్న నవ్వునవ్వి "మనవరాలు పుట్టే! అంది. పుల్లయ్య విని, "నోరుముయ్" అని కేకవేశాడు! "నా కొడుకు నాలాగ గరిడీలో ఘటికుడు....దొర!" అన్నాడు దర్పంగా.

నీలి బదులు చెప్పలేదు. పుల్లయ్య ఊహలో పడ్డాడు. కొడుకుకు ఏయే విద్యలు యెలా నేర్పాలో! యేడాదికే యెగిరి మొగ్గలెయ్యడా అను కున్నాడు!

పీస జోస్యం చెప్పాడు. "ధరలు పెరిగిపోయి మనుషులు గంజిలేక మలమలమాడి పోతారు! పట్నంలో అప్పుడే రాసనింగు వచ్చింది!.... మనకీ వస్తాది. ఉన్నాడు లేదంటాడు; లేనోడు బతకలేడు. మనకు లేక పోయినా నువ్వూ నాను ఒకటని వుంటున్నాం. అప్పుడా! నీకు నువ్వే నాకు నానే! పట్నం అసలు అధ్వాన్నం మరీఅధ్వాన్నంఅయిపోతున్నాది! యెగిరేపిట్టను పంజరంలో పెడ్తామంటాడు, గవర్నమెంటోడు! రేప్పొ ద్దున్న పండ్లూ గవర్నమెంటోడే తోమాలని ఆర్డీలు పెట్టుకుంటారట!"

అంతా చిత్రవిచిత్రంగా ఈ మాటలు విన్నారు. తలోలా అను కున్నారు. గుడ్డికాసుడు, తన అగ్రపీఠాధిపత్యం నిలుపుకోవాలని సాయంత్రం నీలమ్మగుడిలో శివాలుపేశాడు. "మందుకి ముసలం వున్నాది మనిషికి మనిషికి పులిపంది వోరడి అవుతాది! ఆకాసానమేఘాలుండవు. దిగవని పచ్చని జాగావుండదు! దూతలు ప్రజలమీదపడి నొల్లేస్తాయి. కళకళ్ళాడిన పూళ్ళే దిబ్బలయిపోతాయి —"

చుట్టూ మూగినవారు చేతులు జోడించారు. "తల్లీ నువ్వే మొండి చెయ్యి చూపిస్తే, పిల్లలకడుపులు మాడవా? నువ్వు తలుసుకుంటే ఆకాసాన మేఘాలు కరువా? నీ పిల్లలు పచ్చగావుంటేకదా నీకు సంబరం చేస్తారు!"

దాసుడు గొంతుక గగనానికి వినిపిస్తోంది. "ఓరీ నాయనలారా! నేను దూతలతోదెబ్బలాటకు దిగానురో! నా బిడ్డలకి అన్నానికి దూరంచేస్తానా? ఎవరుసెప్పిన జోస్యం మీరు నమ్మకండి. తిమ్మన్నలాగ అత్తోరికుందంటే యెత్తేటం—కన్నోరికుందంటే మోయటం సెయ్యకండి! అంతా ఒకటే అని - గడ్డుకాలానా, వున్నోలు పేదారోదకి సూశారంటే—మనిషికి మనిషి నమ్మ్మారంటే -ఆకాశం బద్దలైనా, భూమి భుగభుగ మండిపోయినా.....ప్రజకి దోకా లేదురా!"

దాసుడు తనపని నిర్వర్తించాడు. ఇక కోమటి పేరయ్య యిదివరకు పెద్దసోలతో ధాన్యం కొలిసి, చిన్నసోలతో వుప్పుయిచ్చి కొసరువేసేవాడు. ఇప్పుడు కొసరవెయ్యటం మానివేయటంతో, వూరంతా ధరలు పెరుగుతున్నాయని తెలిసింది. చిన్నపిల్లలు యేది కొనడానికి వెళ్ళినా బెల్లంపిసర లంచం దొరికేది. అది ససేమిరా యిప్పుడు లేదు. తక్కెడ గుళ్లు కొద్దిగా అరగదీస్తున్నాడు!

ఆ వూరికి మిలిటరీకి వెళ్ళిన ఒకే ఒకడు తిరిగి వచ్చాడు. రకరకాల వస్తువులు తెచ్చాడు. వూరంతా వాడిమాటలు చెప్పుకున్నారు! జపానోడితో యిలాంటోలంతా దెబ్బలాట పెట్టి ఓడిపోనారనుకున్నారు! పీస ప్రశ్నలుకూడా వేశాడు. టాంకు ఆకాశంమీదికి రెక్కలుంటే ఎగిరిపోతాదా అని అడిగాడు. అది భూమిమీదకే అంటే—రామాయణంలో పుష్పకం—భారతంలోని అస్త్రాలు గురించి చెప్పుకొచ్చాడు. మన భారతంలోని అస్త్రాలు....వరుణాస్త్రం....నారాయణాస్త్రం, పాశుపతాస్త్రం.... యివన్నిటి కిటుకు జెర్మనీవోడు, యేనాడో అంకించుకొన్నాడు. ఆడు ఆ కిటుకుమీద బాంబులు,టాంకులు, యియన్నీ సేస్తేకదా—ఇంగిలీషోడు, ఆమెరికనోడు, జపానోడు నేర్చుకున్నారు!

పీసమాటలకు తెలివికి వూరంతా సంతోషించారు, "ఎంతపట్నాలు

తిరిగి, యుద్ధం పేసివచ్చినా, గేనం ఒకరోజుకి వచ్చేస్తాదా?" అని అక్కడక్కడ చెప్పుకున్నాడు పీస.

ఇంకో కొత్తవిశేష మేమిటంటే, పట్నంలో వున్నలాంటి చిన్న కాఫీహోటలుకూడా లేచింది రోడ్డుమీద; ఇక్కట దక్షిణాదినుంచి దిగుమతిఅయిన యిడ్లీ సాంబారు తయారులోకి వచ్చింది. కోమటి పేరయ్య కొడుకు తనతండ్రిలా మూడుమణుగుల బరువుబస్తా భుజంమీద వేసుకొని, అన్నిదినుసులూ అమ్మకానికి, వూళ్ళోనూ, పొరుగూళ్లోనూ తిరగగల సత్తువలేక యేదైనా సూక్ష్మపద్ధతిమీద డబ్బుచేసుకోవట మెలానో ఆలోచించి, ఈకాఫీహోటలు పెట్టాడు. ఊళ్లో ఎవరూ బ్రాగుతారనికాదు, బ్రోవపొయ్యే వాళ్ళెవరైనా చేరుతారని. రష్యన్ వోడ్కాని, బ్రేంచి బ్రాక్షసారాయిని మించిన పులిసిన చద్దిఅన్నం చల్లని అంబలి మరిగిన ఈ పల్లీయులు కాఫీహోటలుకు పరుగెత్తే పరిస్థితి మొదట రాలేదు. కొన్నాళ్ళవరకూ హోటలుకు బేరాలు లేకపోవటం చూసి అరువులు బలవంతాన ఇచ్చాడు. తీరుబడి వున్నప్పుడు రోడ్డుమీదకు వెళ్తున్న బ్రేక్వాడీ బ్రజ వెచ్చగా తియ్యగా వాసనగా అందులోనూ అరువు—కొద్దిగా రుచి చూచేవారు—రానురాను పొద్దున్న ఈ పులిసిన చద్దిఅన్నం ఈ కొత్త రుచ్యముల యెదురుగా ఆగలేకపోయింది; వూరిలో వయసువస్తూ యేపుగా పెరిగవల్సిన పిల్లలు ఈ అలవాటులో కొద్దోగొప్పో పడటం నేర్చారు.

రోజు లిలా కొద్ది కొద్ది మార్పులతో, దొర్లుకపోతున్నయ్. యుద్ధ కాలంలో పెరిగిన కాగితాలు ఇదివరకెన్నడూ, కాగితాలముఖం చూడని వాళ్లుకూడా చూస్తున్నారు. కాగితం రూపాయి చెల్లదని- పుచ్చుకోని ముసలమ్మలుకూడా ఈవుళ్ళో వున్నారు;

నీలి, పుల్లయ్య ఈ మారేపరిస్థితులలో ఇరుక్కోక తప్పిందికాదు. చూలాలు యింట్లో వంటవగైరా పనులతోబాటు, భర్తకు పనిపాట్లలో సహాయంచేస్తూంది.

నవిరికి పడమరగా, ఉత్తర దక్షిణాలుగా బ్రవహిస్తున్ననది వూరు దాటాక కొద్దిగా తూర్పుకు తిరిగివుంది. అక్కట నవిరివేపువున్న ఒడ్డు యిసుకమయమై, ఆ భూమ్మీద సరుగుడువనం, జీడితోటలు, విస్తారంగా వున్నయ్. అక్కడక్కడ యెత్తయిన తాటిచెట్లు—ఎక్కడో

ఒకొక్కక్క మర్రిచెట్టుకూడా వున్నవి. ఈ తోటలో ప్రక్కనేట్టి లంక లున్నయ్. ఆ భూములకు నీటి సరఫరా, తూర్పువైపునుంచి కాలవ గుండా రావటంచేత, శీతాకాలంలో వరిపైరూ, మిగతాకాలంలో కాయ గూరలు బాగా పండుతాయి. ఈ భూమికి మూడువైపులా వున్న యెత్తైన సరుగుడు తోటలు .....తోటలనుంచి వచ్చే సన్నని సరాగాలు....ఆ ప్రక్కనే మెల్లగా ప్రవహించేనది....జీడితోటల్లోని రకరకాల పక్షులు సరుగుడుతోటలోవున్న పచ్చని చిలకల గుంపుల కిలకిలలు....మర్రి చెట్టుమీద పగలంతా నిద్రపోతున్న గబ్బిలాలు—ఒంటి ఈతచెట్టుమీద గూళ్ళలోవున్న బంగారు పిచ్చుకలు—ఏపుగా ఆకాశానికి అంటుకున్న ట్లున్న బూజు, తాటిచెట్టుమీద ముసలిగుడ్లగూబ జడిపింపు — సాయం త్రం అయితే బిలంలోనుంచి బైటకువచ్చే నక్కలు—అదిగో దూరాన తూర్పు కనుమలపాయలు ఎంతనునుపుగా వున్నాయో.....హోరుమనే బంగాళాఖాతపు ధ్వని — యిటురాకండా అడ్డుతున్నయ్ కామోసు!

ఈ జంట కలిసిమెలిసి ఈ భూముల్లో పనిచేస్తూ....అప్పుకొంత తీర్చుకోవాలని తాపత్రయపడుతున్నారు. సంతలో ముందు పండబోయే కూరగాయలు ఆమ్మాలని, యిప్పుడే భూమిని గత్తంలో నింపి,....పుచ్చ పాదులు తగిలిస్తున్నారు.

వేసవికాలం వచ్చింది. ఏటిలో నీరు పారటంలేదు. అక్కడక్కడ చిన్నచిన్న గుమ్మిలున్నయ్. వాటిలో పశువులు, మనుషులుకూడా స్నానాలుచేస్తున్నారు. జాలరివాళ్లు యెండుతున్న చెరువులు వూడ్చాక,పని లేక వలలు అల్లుకోవడానికి నూలు సరిగ్గా దొరకలేదని వాళ్ళల్లో వాళ్లు గుసగుసలాడుకోవటమేగాని, ఇంకా బయటకు అనటంలేదు. ఊళ్లో సాలి వాడు బట్టలమీద ఖరీదు పెంచటంతో వూరంతా గుప్పుమంది.నూలు దొరకలేదని....పాటినూలు ఖరీదు పెంచిందని రాట్నంవున్న ముసలమ్మ సంతోషం కొంతసేపైనా లేదు నూలుతోపాటు టూది ధరకూడా పెరిగింది కాబట్టి.

నీలి ఇప్పుడు నిండుచూలాలైనా ఒకమూల కూర్చోలేదు. ఒకరి సహాయం లేకుండా ఇంటిపనిపాట్లు చేసుకుంటోంది. పుల్లయ్య కొడుకు కోసం రోజూ కలలుకంటున్నాడు,వలవరిస్తున్నాడు.నిద్రపోతున్న పెళ్ళం

వైపు దీక్షగా చూసేవాడు. "కదులుతున్నాడు కడుపులో—నా కొడుకు! ఈడు పుట్టిన్నాడు, జలజల చినుకులు రాలవా? వీడు మాటాడిన్నాడు, పక్షులు పలకవా? వీడ్ని నా గుండెలమీద వేసుకొని పెంచనా?....అవును నా కొడుకు! మీసాలుత్రిప్పిన మొనగాడై....వూళ్ళోనూ .... పొన్నూర్లోనూ....నాయం నిజంసెప్పే పెద్దమనిషైతే.... తనూ.... ....బంగారం, ఊరూ బంగారం—కొడుకో!....అనుకున్నారు.

ఒకనాడు యిలా అనుకొని పొంగిపోయి ఒక్కగెంతు వేశాడు. నీలికి తెలివివచ్చి "ఇంకా కునకలేదా?" అంది.

"ఎందుకు కునుకుతాను? సూడు నా కొడుకు. అయ్యా అని పిలుస్తాడు....అమ్మా అని పిలడే!"

నీలి నవ్వుకుండా "నాకు కలొచ్చింది" అంది.

"నాకు తెలుసు. కలలో యేను గగుపించింది కదూ! బలే కొడుకు పుడ్తాడులే!"

"కాదు!....ఆడపిల్లే పుట్టి అమ్మా అమ్మా అని పిలుస్తున్నట్లు"

నీలి మరి మాట్లాడకుండా కళ్లు మూసుకుంది. పుల్లయ్య "సూద్దాం! మా అయ్య మల్లునాయుడు—మా పౌరుషమైన మనిషి. సచ్చినప్పుడేమన్నాడు! మొగోడై పుట్టకపోతే....పీకపిసికేనూ....?" అంటూ పెళ్ళం ప్రక్కన రెండుచేతులు ముందుకుతోస్తూ కూర్చున్నాడు.

"ఎవరిపీక పిసుకుతావ్?" అంది.

పుల్లయ్య "ఎవరిదా?" అని జవాబులేక ఆగిపోయి, భార్యవైపు చూశాడు. నీలి కళ్ళువిప్పింది. ఆ లేత వెలుగులో ఆ చిరునగవు నిండిన ముఖం, ప్రదీప్తంకాగా, పుల్లయ్య అలా చూస్తూ, మాటాడటం మరచిపోయాడు. ఆమె తన చేతిమీద చెయ్యివేసింది. మెల్లగా నిమురుతూ, "సంతోషంవస్తే ఆపలేం! ఏడుపొస్తే ఓదార్చలేం"

"ఎవరికీ?" అన్నాడు పుల్లయ్య.

"నీక్కాదులే! సూడు. యిలాగ యెగిరిపోతున్నావుకదా! మనరాత సరిగ్గాలేక ఆడపిల్లపుట్టే నువ్వు ఇంటికొస్తావా? బెడ్డయినా బిడ్డయ్యాక వదిలెస్తామా? కండే కొండవుతాది!—కొడుకుపుట్టే నాలుగు బిరుదులు తగిలించుకోగలవా? వాడు పెరగాలి, నలుగురిలో సెభాష్ అనిపించుకో

వాలి: అప్పుడు నువ్వు నాలుగు బిరుదులు తగిలించుకో; పిల్లలు పుట్టగానే సరా: పువ్వు పుయ్యాలంటే, చెట్టుకీ బలమైన గెత్తం యెయ్యడం సంగతి మరచిపోతే యేంనాభం:"

పుల్లయ్య మాట్లాడలేదు. ఇంతసేపూ పెళ్ళం మాటాడుతున్నట్లు అనుకోలేదు. ఆకాశంమీదనుంచి యెవరో అంటున్నట్లనిపించింది. అలా తల నిమురుతూంటే నీలి నిద్రపోయింది.

అ మరుచటిరోజు రాత్రి పెద్దవీధిలో, బుడబుడక్కల పాటకు, నిండుచూలాలు నీలికూడా వెళ్ళింది. మంచు పడకుండా దగ్గరగావున్న యింటి అరుగుమీద కూర్చుంది.

బుడబుడక్కల పద్మనాభం స్త్రీవేషం వేశాడు. కొండమొచ్చు లాంటి ముఖం, మీసాలువున్న స్త్రీ-యెర్రటి నారచీర కట్టాడు. మాసిక లున్న జాకెట్టు:

"ఒకవేపు మూత, ఒకనరం పూత,ఒక సిర్త వేత, ఒక తీపుతీత:" బుడబుడక్ మంటోంది: నడివీధిలో పాతిన క్రొయ్యకు రెండువేపులా కిర సనునూనె బుడ్లు-మధ్య నూనె పోసే గల్లా: వెనుక పాటకులు ఇద్దరు, నూనెపోసేవాడొకడు-ఈ బృందం వీధినడుమకు వచ్చేసరికి, ఊళ్ళో పిల్లా పిచ్చికా, చిన్నా పెద్దా నిండిపోయున్నారు:

ఈ నారచీరకట్టిన మీసాలుగల నారీరత్నం ప్రార్థనకు లంఘించు కున్నది.

కమ్మని గొంతుక ఆలాపనతో.—

"మము గన్న తల్లీ, ఓ మంజువాణీ:"డొక్క- డబడబలాడుతోంది. వెనుక పాటకులు, ఈమె అడుగులో అడుగులువేసూ అభినయం చేసు న్నారు.

తనకొచ్చిన పాండితిని వెలగబోస్తున్నది ఈమె:

"ఈ సభాయందున్న బూసురోత్తములునూ, రాజులునూ, వైశ్య రత్నంబులూనూ, మీరు సెలవిస్తే, పూర్తిగా పాడతాను"

పెద్దరైతు "నీ కేయే కథలు వచ్చునురా?"

"కాకమ్మకథ, శశిరేఖా పరిణయం, బాణాసురుని యుద్ధం.... ఇంకా ....!

జనంనుంచి శశిరేఖాపరిణయం అంటూ కేకలు వినవచ్చాయి. మొదలుపెట్టి కొంతవరకు వచ్చాడు.

సుదతు లానందింప చూలేరు పడెను
నడక మందంబాయె నాభి గన్పడుచుండె
నగలు భారంబాయె మిగుల వేవిళ్లు
చనుమొనలు నలుపెక్కి సతి మేను తెలుపెక్కి
సన్నతాంగి సొల మన్ను తినగోరె,
మందయానకు నవమాసములు నిండె....
సుభదినంబున.....”

అర్ధరాత్రి దాటిపోయింది. నీలి వింటూ వింటూ, కథ పూర్తి కాకుండానే యింటికి వెళ్ళిపోయింది. పుల్లయ్య వెంట వెళ్ళాడు.

ఇటు వీధిలో శశిరేఖ విరహం-“నన్నిడిచి పెట్టావ నా బావా.... నా బావో....” అటు నీలికి చిరాకుగా వుంది. గదిలో ఆదెమ్మప్ప యిరుగు పొరుగు ఆడమ్మలు దూరిపోయారు.

అంతా వాళ్ళింట్లోనే జరుగుచున్నట్లు, పుల్లయ్యకి, నీలమ్మ పుట్టుకకి యే మంత్రసానో, ఇప్పుడూ అదే! పెద్ద బుట్టలాంటి పండిన జుత్తుతో వచ్చి నలుగుర్ని ప్రక్కకు తోసింది. ఆమెకు ఇది ఏ వెయ్యో పురుడు పొయ్యటమో!

పుల్లయ్య పైన అటూ ఇటూ పచారుచేస్తున్నాడు. వుండి వుండి చిన్న మూలుగు వినిపిస్తూంటే, పుల్లయ్య బేజారెత్తుతున్నాడు. వేకువ రూము తూరుపు తెలతెలవారుతోంది. “కయ్” మన్న యేడుపు-పుల్లయ్య గతుక్కుమంటూనే ఒక్క ఎగురు ఎగిరాడు. అప్రయత్నంగా “మల్లూ!” అని నోటివెంబడి వచ్చేసి ఒక్క మొగవేళాడు.

లోనుంచే ఊరు మంత్రసాని “మల్లమ్మ!” అంది. “అలాగయితే పెపంచకం తిరగబడ్తాది!”

లోనుంచి తలుపు తియ్యకండానే ఆడమ్మలంతా ఫకాలుమన్నారు. “నొలుగు బిరుదులు తీసేసినాడు పుల్లయ్య”

ఈ మాటల వెనువెంటనే కొద్దిక్షణాల వెనుకనే ఏడుపుతో ఇంటి

పైకప్పు ఎగిరిపోతోంది. కొంతసేపయ్యాక ఆదెమ్మప్ప బైటికి వచ్చి నవ్వుతూ "ఏడస్తందిగానీ....కూతురు ఎంత సక్కనిసుక్కరా....ఎలా గుందంటే....తోటకూరలా జుతు...."

పుల్లయ్యలోని యేదో బలమైన కోరిక నమ్మిక — "లేవండి— సూస్తాను ...మల్లునాయుడు....మా అయ్య....సొరగానికిపోయి మోసం సేస్తాడా? కొడుకే—నాను నమ్మను....లేవండి!"

తోసుకొని లోపలికి బలవంతంగా వెళ్ళిపోతుంటే ఆదెమ్మప్ప చెయ్యిపట్టుకుని "మంచీచెడ్డా సూసి వెళ్తవుగాని...."

"ఏ సెడ్డాలేదు...." అంటూ లోపలికి వెళ్ళిపోయాడు....ఆడ మ్మలు పక్కకు తప్పుకున్నారు.ముసలమ్మ వెర్రినవ్వు నవ్వుకొంటూంది. ఇంకా బుడ్డిదీపం వెలుగుతూనేవుంది....ఆ వెలుగులో నులక మంచం మీద నీలి—ఆ ముఖం—తుఫానుమధ్యనుంచి ఒడ్డుకుచేరిన స్త్రీలాగ— ప్రక్కనే....నిజంగా పండులాంటి కొడుకే! పుల్లయ్య కండలు తిప్పుతూ, నవ్వుతూ....ఒక్కసారి మీసాలు త్రిప్పాడు....

కొడుకు ఇప్పుడే ఇలా వున్నాడుకదా....తనకంటే వస్తాడు.... ఘటికుడు కాడా? ఆ చూపు మెల్లమెల్లగా నీలి అమాయకపు చూపులో కలిసింది— కళ్ళు బాసలాడుకున్నయ్! స్త్రీ కింకేం కావాలి? ఇంతవరకు యౌవనంతో మురిసిపోతూ మొగుడ్ని ఆరాధించింది. ఇప్పుడు పండులాంటి సంతానం! ఆమె చూపుల్లో లేశమాత్రం గర్వం కలవాలి—నిజానికి కలిసింది!

12

రాత్రి పాటంతా అయ్యాక సభను తిలకించి మీ దయ అన్నాడు పద్మనాభం. అనగానే లేచినవాళ్ళు లేచిపోయారు. మిగిలినవారిచ్చినదంతా కూడితే పావలాడబ్బులు కాలేదు. కిరసనూనెకే ఆరణాలయ్యింది. ఉదయం ఓళ్లో ఇంటింటికీ తిరిగి దండుకుంటూ పుల్లయ్యగుమ్మంలో కాలు పెట్టాడు.

"బారతంఅంతా విప్పితే, ఒక ముసలోడు, ఒక కుర్రాడే! ఆ కుర్రోడి పదం యిన్నాడు. నల్లనిపొద్దున భూమిమీద పడ్డాడు! అంతటోడు కాడా?" అన్నాడు పుల్లయ్య.

పుల్లయ్య పద్మనాభుడ్ని సంక్కరించాడు.ఆ పొగడ్తలకు మీసాలు మెలివేశాడు. "ఓరే పద్మనాభం! చినుకులు రాలాయిరా....?"

"సల్లదనం, సల్లదనం!" బాదబుడక్క మనిపిస్తూ ముందుకు నడిచిపోయాడు.

నీలి ఐదురోజులనాడే వంటయింటికి వెళ్తాంచే. ముసలమ్మ వద్దనలేదు. పదకొండోరోజునాడు ఇంట్లో పనిపాటలు చేసుకుంటోంది. ఇరవయొక్కటోరోజు వచ్చింది. నీలిని కొందరు పేరంటాళ్లు పసుపు కుంకుమతో నదిఒడ్డుకు తీసుకవెళ్ళారు. ఇసుక మూడుపోగులు పెట్టి పూజచేయించారు. మా పిల్లడిని కాపాడమని కోరారు. దీనినే "కప్ప మొక్కడం" అంటారు. నీలి తరువాత కడవతో నీళ్లు తెచ్చింది. ఆవేళ నుంచీ పనిపాట్లు పొలంలోకూడ చేసుకొంటోంది. సర్కారు సరుగుడు తోటలోకి వెళ్ళి తొక్కనొల్లి రావటం,వంటచెయ్యటం, పిల్లడిని చూసుకోవటం, అంతా మామ్మూలు పని అయిపోయింది. బయటకు వెళ్ళేటప్పుడు ముసలమ్మ మనుమడిదగ్గర ఉంటోంది.

పిల్లడికి రోజువిడిచి రోజు నీళ్లు పోస్తున్నారు. జుత్తు తోటకూరలా పెరగటం చూసి నలుగురు ముత్తైదులు ముద్దులవర్షం కురిపించి, "ఆడ పిల్లేనే!" అన్నారు. ఆ మాటంచే మంట పుల్లయ్యకి. తండ్రి ముట్టుకుంచే, పిల్లడు యెండిపోతాడని ముసలమ్మ వద్దంటుంది. దోసపండులా వున్నాడని అయ్యకంచే ఆరురెట్లు పెరుగుతాడని ఇలా ఊళ్లోవాళ్ళు తలోలా అంటూంచే, ముసలమ్మ దిష్టితియ్యడానికి ఎక్కడలేని బొగ్గులూ, చీపురుపుల్లలు, మిరపకాయలూ చాలటంలేదు. పిల్లడికి నీరు పోసేటప్పుడు దగ్గరేవుండి కడవలోని అడుగునీరు ముందు పొయ్యొద్దని, మనవరాలిని మందలించేది, అడుగునీరు ముందుపోస్తే పిల్లలు అడుగంటి పోతారని.

నెలకు మూడురోజులు తక్కువలో పిల్లడిని ఉయ్యాలలో వేశారు. పుల్లయ్య పెద్ద సంబరంలా చేశాడు. లోకం అంతా పచ్చగా మనోహ

రంగా వుంది. తన జీవితంలో ఎన్నడూలేని గర్వం వచ్చిపడింది. ఉన్న కొద్దీ గొప్పా ఆవేళ ఖర్చుపెట్టడానికీ జంకలేదు. ఊళ్ళో అప్పుడే "రాస నింగు" అంటున్నారు. "వోరు ఫండు"కి డబ్బిచ్చితీరాలని గ్రామ నాయుడు (మునసబు) ఖచితంగా చెప్పి వెళ్ళిపోయాడు. "దానిని తరు వాత సూడొచ్చు; కొడుకుని నలుగురూ దీవించాల;"

వచ్చినవాళ్లు ఏకకంఠంతో దీవించారు. పిల్లాడివైపు చూస్తూం టేనే దీవించ బుద్ధివేస్తోంది.నాలుగు నెలల పిల్లాడిలా నెలరోజులు పూర్తి కాకమునుపే కనిపిస్తున్నాడు. ఆగష్టు నెలాఖరు రోజులేమో ఎండలు తగ్గి భూమి చల్లబడింది. పొలాల్లో పైరునాటుకొని, భూసత్తువనులాగుకొని, మీదికెగసిపోతూ, గాలికి ఆడుతున్నది.రైతువారీ ప్రజలకు కావలసినంత తీరుబడి. ఆదెమ్మప్పదే ఈ సంబరమంతానూ. మళ్ళీ పెళ్ళిచేసిన్నాటివలె నడుంకట్టింది. ఈ కొద్దిరోజుల్లోనే ఇంట్లో ఆమె పెద్దరికం తగ్గి, అల్లుడిది హెచ్చింది. ధాన్యం ధరలతోపాటె మిగతా వర్తకపు పంటల ధరలు పెరగటంతో, దానధర్మాల పరిమితి తగ్గించవలసి వచ్చింది. ఈ పరిస్థితికి ఆదెమ్మప్ప తట్టుకోలేకపోవటంతో పెద్దరికం అల్లుడు తీసు కొన్నాడు. ఆర్థికంగా చేతులు కట్టివేసినా, మాట మంచితనం చూపిస్తూ పెద్దరికంచేస్తోంది. చేస్తూనే "ఎందుకు పనికొస్తాను నాయనా;నా చేతిలో యేం వుంది; మనవడికి బిళ్ళల మొలతాడైనా చెయ్యించలేకపోయాను;"

నీలి మాటందుకుంది. "ఇచ్చినంత మాటన్నావప్పా; యింకా ముం దుకి అవ్వని ఆడించడా;"

లోకప్ప, ఆదెమ్మప్ప నవ్వుతూ "అదెంతటివాడు పుట్టుకొచ్చాడు. యింటిదగ్గరేకాదు పీధిలోనూ మెప్పుతెచ్చాడు. సచ్చి సొరగానవున్నాడు కానీ....;" అన్నారు.

పుల్లయ్యతండ్రి పేరెత్తటంతో ఒళ్లు పొంగింది. ఇంతలో కొడుకు కిలకిలలాడినట్లనిపించింది. ఒక్క యెగురెగిరి "అప్పా; అప్పా; అది గో యె కిలకిల్లాడుతున్నాడు- మల్లునాయుడి మనవడు....మల్లూ;" ఉత్సా హం ద్విగుణీకృతంకాగా కొడుకుని తీసుకోబోయాడు. అదేపేరు పెట్ట డం అయిపోయింది.

ఆ క్షణంనుంచీ "మల్లు" అంటే ప్రాణం. తల్లిపాలతో బిడ్డడు దినదినవర్ధమానుడౌతున్నాడు. భార్య యిదివరలా తనవైపు మధురాతి మధురమైన చూపులు విసరకపోయినా, ఆ అమృతతుల్యమైన స్పర్శ ఆబ్బే తగలకపోయినా.... పెరుగుతున్న కొడుకునిచూసి అన్ని అనుభూతులు పొందుతున్నాడు.

గుడ్డివెంకన్న మనవడికి యేమీ ఇవ్వలేకపోయానని, గిజగిజ గింజుకుంటున్నాడు. గన్నెమ్మ పాతరోజులు జ్ఞాపకంతెచ్చుకుని యేడ్చుకుంది. కొడుకుని పుయ్యాలలో వేసిననాడు నీలి వాళ్ళకి కడుపునిండా పెట్టింది. వాళ్ళబాధను గ్రహించిన నీలి "అయ్యా! దేముడిదగ్గరికి పళ్ళా, కాయలూ తీసికెల్తేనే వుందా? పువ్వేసి మొక్కినోలకి మోషం నేదా? ఇంత మంచిమనుషులు మీరు. నా కొడుకుని దీవించండి! చాల"ని కొడుకుని దగ్గరగా తీసుకవెళ్ళింది.

వెంకన్న పిల్లడిని తడుముతూండగానే యేదో కోరిక మనసును క్షోభపరిచింది. ముద్దులాడుతూ "పాపిష్టోడ్ని తల్లీ! కళ్లుంటే....!"

గన్నెమ్మ పిల్లడ్ని వర్ణించడం మొదలుపెట్టింది. వెంకన్న వింటూ "తల్లి! చేసిన ధర్మాలు వుట్టినేపోతాయా? నీ కొడుకు యెలాంటి వంశాన పుట్టాడు! నే నెందుకనాల? నలుగురూ నెభాష్ అనరా! అలా అంటూనే భూమిమీద కుదిచెయ్యి యిటూ అటూ రాస్తే చేతికి ఒకమంటి బెడ్డ దొరికింది. దానితో మనసులో యేదో ఆనందం పొంగి, చిరునగవు వెలగబోస్తూ, పిల్లడిచేతిని తడుముతూ పట్టుకొన్నాడు. పిల్లవాని అరచేతిలో బెడ్డపెట్టూ "మనవడా! మల్లూ! మనిషికి భూమిమీద పడిన దగ్గరనుండి దీనితోనే వున్నాదిరా!" అన్నాడు.

గన్నెమ్మ ఖస్సుమంటూ "బంగారం భాగ్యం యివ్వలేకపోతే, పూరుకోవాలిగానీ...."

ఆనందంతో గుడ్డివెంకన్న కళ్లు నీరుతో నిండిపోయాయి. ఈ కటిక పేదవాని కరుణాతిశయాలు పూర్తిగా అర్థంచేసుకున్న నీలికి, పెన్నిధి దొరికినట్లయి, కొడుకుచేతిలోని బెడ్డతోనే పట్టుకొని, యింటిలోనికి తీసుకపోయింది. ఆ బెడ్డను భద్రంగా కొడుకుతలవైపున వుంచింది.

Acc No. 11,712

రోజులు తిరిగిపోతున్నయ్. పుల్లయ్య యీ మధ్య భార్యతో సంబంధం లేనట్లుగా ఆ కొడుకుతోనే వుందన్నట్లు మెసుల్తున్నాడు. నీలి ఆనాడు పొలానికివెళ్ళి వేగంగా వస్తూన్న పుల్లయ్యవైపు చూసింది. క్రీగంటి చూపు చూసి మందహాసంచేసింది. పుల్లయ్య చూడలేదు. ఉయ్యాలలోవున్న పిల్లాడిని వూపుతూ....జోలపాట పాడుతోంది....

"ఎత్తుచెవులని ఏనుగుని వద్దంటి—
గుడికాళ్ళని గుర్రాన్ని వద్దంటి....
పడగతలసీ పామునీ వద్దంటి....
కోతినీ పెల్లాడి కొడుకునీ గంటి....జో....జో—"

పుల్లయ్య పెళ్ళంవైపు నిదానించి చూస్తూ....కోతిలా మూతిపళ్ళు. మళ్ళీ వలపుతలపులు, వగలు, కులుకులు యివ్వరిలోనూ ప్రవేశించాయ్.

NARLA MEMORIAL LIBRARY
D.R.NARLA
D.P.R.I.
Acc. No.
13

చలికాలం ఒకరోజు సాయంత్రం, వీకటిపడ్డాక పొలంనుంచి నీలి పుల్లయ్యా వస్తూంటే, నీలమ్మగుడిదగ్గర దాసుడు శివాలు వేస్తున్నాడు. ఇద్దరూ బయటనిల్చునే మొక్కి-మొక్కారు. ఈ సంవత్సరం పంట ఉత్సాహంగాలేదు. మిడతలదండు హోరంపట్టే సమయానికి వచ్చిపడింది. చేను యేపుగాపెరిగి కంటికి కనిపిస్తోంది కానీ, సగానికి సగం పొల్లే. బుగత అసలే కఠినుడు. అందులో రోజుకిరోజు పెరిగే ఈ ధరలలో ఒకగింజ తగ్గించనంటున్నాడు. ఇద్దరూ ఈ విషయాలే మాట్లాడుకుంటూ పొలంనుంచి వచ్చారు.

గుడివేపు, గుడిలోని విగ్రహాలవేపు, విగ్రహాలని ఆరాధించే దాసునివేపు చూస్తూంటే, మనుష్యుల్లో ఏదో మార్పువచ్చినట్లు స్పష్టమౌతోంది. రెండేళ్ళకీ ఇప్పటికి తేడా ఎంతోవుంది. దాసుని శివాలకి భయపడ్డవాళ్లు లేరనికాదు. అలా భయపడ్డవాళ్ళ చేతుల్లో యే అధికారం లేదు. నాయుడు, పెద్దరైతు ఆ దరికి చేరరు. ఎవరైనా శివాలవిషయం చెప్తే వినిపించుకోరు. ఇప్పుడు వాళ్ళకి వినిపించుకోవడానికి వ్యవధిలేదు. దాసునితోపాటు విగ్రహాలు, విగ్రహాలతోపాటు గుడీ ఈ క్రొత్త

సంఘంలో అప్రధానమైపోయాయ్. సంబరాలు సెయ్యండన్న దాసుని గోల గాలిలోకి కరిగిపోతూంది. అంతే:

ఒంటిమీద కప్పుకోడానికి బట్టలేని దాసుడు శివాలువేస్తున్నాడు. చుట్టూ చీకటి. గుడిలోనే చిన్ననూనెదీపం:అదీ ఆరిపోవటానికి సిద్ధంగా వున్నట్లుంది.

కదిలిపోవటానికి 'సిద్ధంగావున్న ఈ జంటవైపుచూసి దాసుడు చెయిసైగచేశాడు. ఆగినవాళ్ళదగ్గరగా వస్తూ: "యిన్నారా ఆ తల్లి యేం అన్నాదో, యెల్లి ఆ నాయుడితోనూ పెద్దలైతుతోనూ సెప్పండి. నేను సెపితే నాకు మతిపోనాదంటారు."

అలాగే అన్నట్లు తలలూపారు. దాసుడు గుడితలుపులు వేస్తూ వెంటబట్టాడు. వృద్ధాప్యం వచ్చిపడ్డట్లు ఒళ్లు వణుకుతోంది. తనకి చెప్పుకోడానికి యెన్నో కష్టాలున్నాయ్. వాడు యేకొడుకుమీద ఆశలు పెట్టుకున్నాడో, వాడే తనకు సరిగ్గా గంజి పొయ్యలేదు. దిగువవీధిలోకంపి అడతాడు. ఓడిన్నాడు ఇంట్లో అందరిమీద లేస్తాడు, గెలిసిన్నాడు దొంగ సారాకొట్లో కూర్చుంటాడు. తాగివచ్చి తండ్రిమీద లేస్తాడు. దాసుడు ఎవరో తనను దగాచేసినట్లు బాధపడిపోయాడు. అలా మెల్లమెల్లగా అడుగులు వేసుకుంటూ "అమ్మా! నీలమ్మా! సూడు! ఈగరికిమీద నడుస్తున్నాం, గరికతిన్న గాడిద సస్తాదిగాని, గరిక సావదు! నాను సచ్చిపోతాను. నాలాగే నా కొడుకూ సచ్చిపోతాడు - నాను కమీజు యెప్పుడూ యేసుకోలేదు. నాకొడుకు యేసుకుంటున్నాడు. ఆడికొడుకు పట్నంబాబులాగ బొతావులకోటు యేసుకొంటే యేసుకుంటాడు. మొకం తేటా, మొలగజ్జీ అయితే యేంలాభం అమ్మా! అలాగే ఊరు తయారైపోతూంది లచ్చి లక్షణాలను తెస్తుందంటారు. డబ్బు పొంగిపోతూందని, గుండెనిదాసేస్తున్నారు. అమ్మా! బతికున్నప్పుడు రెండు, సచ్చాక రెండూ ఉంటాయే!"

సీని యిల్లువచ్చింది. దాసుడ్ని సీలి లోనికి పిల్చింది. చిన్నబుడ్డి దీపం మంచందగ్గరగా తలవైపు వెలుగుతోంది. కాళ్ళవైపు ముసలమ్మ కూర్చుని మనుమడివైపు చూస్తూ ముసిముసినవ్వు నవ్వుకుంటూంది.

మూడునెలలు దాటిన పిల్లాడు దీపంవైపు చూస్తూ మూతి విరుస్తున్నాడు. నవ్వుతున్నాడు.

"ఒరే తాత!" అన్నాడు దాసుడు. మల్లు కాళ్లచేతులు ఆడిస్తూ వూసులాడుతున్నాడు. పుల్లయ్య, నీలి చెరోవైపు నిల్చున్నారు. దాసుడు మంచంమీద కూర్చుని పిల్లాడిముఖంలో ముఖంపెట్టి నవ్వాడు: ముద్దు లాడాడు. నిర్భయంగా వూసులాడుతున్న పిల్లాడ్ని తాకుతూ, "అప్పుడే అమ్మా అంటున్నాడు!" ఆన్నాడు.

పుల్లయ్య చప్పున"అమ్మకాదు—అయ్యంటున్నాడు!"

దాసుడు నవ్వుతూ "పంది పదిపిల్లలు కాస్తాది. యేనుగు ఒకపిల్లనే కాస్తేనేం? ముందు ముందు మరీ గడ్డురోజులున్నయ్ నాయనా! మెతుకు మూడుభాగాలు సేపైనా పెంచుకొస్తే నీ కొడుకైనా, యీ బలిసిపోతున్న అన్యాయాన్ని నరుక్కొస్తాడు!"

దంపతుల ముఖాలు యీ బ్రహ్మదీవనతో వెలిగిపోయాయి. వెళ్ళి పోతూ "ముసలమ్మా! మనవడిపెళ్ళి సూడవా?" అన్నాడు. ముసలమ్మ "ఒరే రాముడూ! నాతలమీద గొడుగేనాడు పోయిందో ఆనాడే సచ్చిపో నానురా" అంది.

ముసలమ్మ మొగు డెలాంటిమూర్ఖుడో తెలిసిన రాముడు ఫక్కున నవ్వాడు, ఆ నవ్వు గుర్తించి "యెంత సెడ్డోడని లోకం అన్నా, నమ్మిన దానికి ఆడు మంచోడే! లోకాన ఎవరినో ఒకరిని నమ్మాల. ఆడు యెలాం టోడవని, ఆ నమ్మికతోనే సవ్వాలి! అదే పున్నెం."

దాసుడు ముసలమ్మకు దండమెట్టి వెళ్ళిపోతూ "నాయనా నలు గురూ బతకాలంటే ఒకరితోనైనా సెడవ్వాల! ఈ కోపరేటు బోర్డు పెట్టిం చాడు ఆ నాయుడు. పెదరెతు, కరణం,మీసాలు మెలేసినోరు కూడారా. నాయం ఆడివిలోకి పరుగెత్తిపోతూంది. గవర్నమెంటోడు మంచి సారా యిచ్చోడు. ఈదొంగసారాతో పెద్దలుబతికిపోతున్నారా.నాకడుపు కమిలి పోతుంది నాయనా. ఆ తల్లిపాదాలు పట్టుకొని బతిమాలుతున్నాను."

పుల్లయ్య "సస్తారులే!" అన్నాడు.

"వద్దునాయనా,వాళ్లు నూరేళ్లు బతకాల. ఆలు సస్తే మనకేంరాదు. ఆలిని మంచిమనుషులు సెయ్యమ్మా, డబ్బుతోని హాయిగా బతకనీ యెవు

రొద్దన్నారు. ఎదుటోలవేపు ఒకసూపు సూడాల. యెప్పుడులాగ తల్లికి ఆలనా పాలనా జరిగితే — పంటలు బాగా పండుతాయి — ప్రజా సుఖ పట్తారు!"

దాసుని సాగనంపి తిరిగివచ్చాడు పుల్లయ్య. నీలి మల్లుకి పాలు యిస్తోంది. ముసలమ్మ ఒకమూల నడుంవాల్చింది.మంచంమీద కూర్చుని యీ తతంగం యేం బాగాలేదన్నాడు.

"ఏమిటేమి"టంది నీలి.

"సూడు, యీ రేసినింగుపేరుపెట్టి మనపేర కారుడు — మనకు అంబలి నాయుడింట్లో బియ్యంకొట్టు! ఈసారి కార్డు యిస్తానంటే ఇస్తానో, పట్టపోడొచ్చి, ఈలదగ్గర బట్టుకొని రెట్టింపు ధరలకి అమ్ముతున్నాడులే!ఎదవలు మేడలు కోటలు కట్టిస్తన్నారు!"

నీలి మాటాడలేదు. పిల్లడ్ని మంచంమీద వేసింది. అప్పుడే బొమ్మలపడ్డానికి ప్రయత్నిస్తున్నాడు. భోజనా లయ్యాక పుల్లయ్య అరుగు మీద కూర్చున్నాడు. నీలి వంటయింటిపనులు పూర్తిచేసుకొని—కొడుకు దగ్గర కూర్చుంది. పిల్లడు వూసులాడుకుంటున్నాడు. ఇంతలో సంజీవి అలా వెళ్ళిపోతూ "పుల్లిగా" అన్నాడు. "ఏంరా?" అంటే వచ్చి దగ్గరగా కూర్చున్నాడు. సంజీవి ఆ వూళ్లోకి పొట్టిమనిషి. గరిడీలో ఘటికుడు వంగపండుచాయ శరీరం, గేరాగిరజాలు — మూతినింపుగా మీసాలు: చేతిలో బాణాకర్ర యెప్పుడూ వుంటుంది. వయస్సు పుల్లయ్యకంటే పదేళ్లు హెచ్చు. పొట్టోడికి పుట్టెడుబుద్దులని అంతా అంటారు. క్రితంలో సర్కారునే ఎదిరించి చుట్టుపట్ల పేరు సంపాదించాడు. ఆరోజుల్లో సారా బట్టీలు పెట్టి, ఉద్యోగులకు చాల పని కల్పించాడు. కొంతమంది వీపు చదునుచేశారు. వీడి ఉనికి కనుక్కోలేక ఎన్నో తిప్పలు పడేవారు.సంజీ విని పట్టియిచ్చేవాడికి అయిదువందల బహుమానం ప్రకటించారు. సంవత్సరంవరకూ దొరకలేదు. ఒక తెలివైన యిన్స్‌పెక్టరు ఊళ్లో నాలుగు రోజులు మకాంవేసి సంజీవివిషయం గుట్టులాగడానికి ప్రయత్నించి కృతకృత్యుడయ్యాడు. ఒక గ్రామనాయుడితోకూడి, ఆ చుట్టుపట్ల పది గ్రామాలలోను దండోరా వేయించాడు. ఉత్తరదేశంనుంచి ఒక స్పెల్మాను వచ్చాడని వాడిని ఓడించే మీసంగల మొగోడెవడైనా వుంటే

ఫలానాగ్రామ నడిబొడ్డున ఫలానారోజున కలుసుకోమనీ. నిజానికి ఆ ఫైల్మాన్ని చూడగానే చాలామంది భయపడ్డారు. నలుగురూ నాలుగు విధాల తననుగురించి అనుకోవడం సంజీవికి నచ్చలేదు. ఊరుపేరు నిల బెట్టాలని రంగంలోకి వురికాడు. నలుగురూ సెభాష్ అన్నారు. యిన్స్పె క్టరు అనుకొన్నట్లు ఆ ఫైల్మాను యిట్టే వోడిపోయాడు. కానీ సంజీవి పోలీసులకి చిక్కిపోయాడు. ఊరంతా గుప్పుమంది. పోలీసులు తుపా కులు చూపించారు. మూడేళ్లు కారాగారం అనుభవించి వచ్చాడు. నలు గురిలో తలెత్తడానికి సిగ్గువేసింది. ఇంతగడసరీ యెంతో బాధతో కుమిలి పోడానికి అవకాశం, తన వుంపుదుకత్తె యిచ్చింది. ఇంకొకర్ని చూసుకోవడంతో దాన్ని చంపుదామనుకున్నాడు. అయితే అది హేళనగా అన్నది. "సంపడానికొచ్చావు? ఏంతిని బతకమని కయిదులో కూర్చు న్నావు? మచ్చపెట్టుకొన్నావు! ఆ జీడిమరక వూడుతాదా? ఆ యిల్లాలి యేడుపే నీకు మచ్చపెట్టింది. దాన్ని సరిగా యేలుకోరా యనా" అంది. నిజానికి ఆ సంబోధన బాగానేవుంది. సంజీవికంటె ఆమె కొద్దిగా వయ సులో పెద్ద. తను ఆమెను చంపలేడని తెలుసు. చంపగలిగినా చంపాలని లేదు. ఆకత్తి నడియేటిలోనికి విసిరాడు. ఆరాత్రికిరాత్రే చలిలోనే "దిమ్మదిరగా" మునిగేశాడు.ఇంటికి తడిబట్టలతో వచ్చి తలుపు తట్టాడు. భార్య తీసింది. ఆమెను బిగియార కౌగలించుకొని యేడ్చేశాడు. ఎప్పుడూ యింకో ఆడదాన్ని సూడనని ఒట్టేసుకున్నాడు. పెళ్ళం కళ్లుతుడిచింది. ముద్దెట్టుకుంది. హృదయానికి హత్తుకొని సంతోషంతో కన్నీరుకార్చింది.

ఆవేళనుంచి గ్రహం మారిందని చెప్పుకొనేవాడు. ఒళ్లువంచి పొలంలో పనిచెయ్యటం—యిదినాది అనే మమకారంయేర్పడడం—జరిగి సంవత్సరంలో ఒక కొడుకును యెత్తుకొన్నాడు. ఇలా పాడైపోతున్న ఇల్లు నిల్చింది. సంసారం బాగా గట్టిపడింది. భార్య చిక్కదనంవల్ల, భార్య అదుపాజ్ఞలలో తను వుండడంవల్ల, వూర్లో తనూ ఒక ఘరానా మనిషిగా అయిదారేళ్ళలోనే పేరుపొందాడు. ఇప్పటికి ముగ్గురు పిల్లల తండ్రైనా, ముఖం బుగ్గమీసాలతో నిగనిగలాడుతూనే వుంటుంది. పులి వేషంవేసి, యిల్లెక్కి కోడిపుంజుపీకను పళ్ళతో కొరికే సత్తువుంది.

అలాంటి సంజీవి పుల్లయ్యను పలకరించాడు. ఇద్దరూ వూర్లో జరుగుతున్న అన్యాయాలను గురించి మాట్లాడుకున్నారు. నిరుడికి ఈ యేటికి యెంతగా ధరలు పెరిగిపోయాయి? లేని ప్రజలు యెంతగా బాధ పడుతున్నారో? ఉన్నవాళ్లు చెయ్యిదులపకండా వున్నారు! నాయుడ్ని, పెద్ద రైతులని గట్టిగా అడగాలని పుల్లయ్య అన్నాడు.

ఇంతలో నీలి పిల్లాడ్ని యెత్తుకుని అరుగుదగ్గరకు వచ్చి "అంతా ఇంటున్నాను. రేపు నాయుడు మీ 'రానను' తీసుకోమంటే మీ బట్ట కొను కోమంటే వూళ్లో ఎందరిదగ్గర దబ్బున్నాది?"

"నిజం సెప్పినావు కూతరా!" అన్నాడు సంజీవి....

పుల్లయ్య "నిజవా! రైతోడికి అక్కర్లేకపోతే తిరిగి గవర్న మెంటోడి కిచ్చేస్తే యింకొకలికిస్తాడు. మనపేరు సెప్పి మనకడుపు కొట్టి ఆడు గదించాలా? అంతా బేకే—అంతా బేకే! —"

ఆవేశంతో లేచిపోతున్న మొగుడివైపు చూస్తూ చిన్న నవ్వు నవ్వింది. పుల్లయ్య ఖస్సుమంటూ "రేపెళ్ళి టోరుదగ్గర కూర్చుంటాను. వచ్చిపోయినోల్లతో ఈ అన్యాయం సెపతాను" అన్నాడు.

"నాయుడు కొనొల్లని సూపించమంటే!"

"ఎందు కడుగుతాడు? గవర్నమెంటోడికి సెప్పనా?"

సంజీవికి స్టోరులో కొంత పలుకుబడి వుండటంవల్ల "పుల్లిగా! కూకోరా!" అంటూ తను లేచిపోయాడు.

"అమ్మీ! నీలమ్మీ! గడ్డికుప్పదగ్గర కుక్కేంసేస్తాది? గడ్డి తినదు: తిననియ్యదు. పుల్లిగా! ఊర్లో పెద్దలదగ్గర పరపతిమీద బతుకుతున్నావు. ఎందుకు వూరికే ఆ పరపతి సంపుకుంటావు? తల్లితండ్రిపోతే బతకొచ్చు కానీ, పరపతిపోతే బతకలేం. రేప్పొద్దున్న ఈ లేనోలంతా నీకేం సాయం చేస్తారులే. చేస్తే పెద్దోడే సెయ్యాలి కానీ" అంటూ వెళ్ళిపోయాడు.

పుల్లయ్య మాటాడలేదు. మీసాలు మెలేస్తూ పెళ్ళంవేపు చూస్తూ కొడుకును అందుకున్నాడు. అరుగుమీద జార్లబడుతూ కొడుకుని గుండె మీద పడుకోబెట్టుకుంటూ "మల్లూ! నీతాతకొడుకు - నీ అయ్య—కడుపు మాడినా నీతికి నిలబడతాడు....నువ్వో!"

కొడుకు పకపకా నవ్వినట్లు, ఒళ్లు గిలిగింతలుపెట్టినట్లయింది.

14

సంక్రాంతి వచ్చిండి. మల్లు బొమ్మలు పడ్తున్నాడు. ఇల్లంతా పాకే స్తున్నాడు. పుల్లయ్యకేసి చూసి ముసిముసి ముద్దునవ్వులు వొలకబోస్తూ తూలుతున్నాడు. ఆనందంలో అదోమాదిరిగా అయిపోయి పుల్లయ్య కొడుకు యెదరగా గెంతులేస్తూ "ఛినక్ ఛినక్ సో," ఝుంజిన కడి.... ఝుంజినకడి...." కొడుకు చేతులాడిస్తున్నట్లుంది....నోరు పెగిలిస్తున్నట్లు భ్రమపడుతున్నాడు, ఒక్కసారి ఆకాశంమీదికి కొడుకును ఎత్తుకుంటే, పిల్లాడు యేడవలేదు. కానీ ముసలమ్మ కోపంపడుతూంది.

"ఎవడనుకున్నావ్—నీ కళ్ళతోనే సూడవా? వాను మొగ్గేస్తే.... ఎగబ్రాకి మీద నిల్చోడా?"

మల్లుకి ఆరునెలలు దాటలేదు....కూర్చుంటున్నాడు. "అదిగో అదిగో కూర్చుంటున్నాడు, గోడపట్టుకొని నిలబడ్డానికి యెగబడుతున్నాడు ....నామల్లు....నామల్లు...." అని ఒకటే ముద్దులవర్షం కురిపించాడు.

ముసలమ్మ బోసినోటి నవ్వుతో, "వయసుకుతగ్గ బువ్వ—బువ్వకు తగ్గ ఒళ్ళు—నీకొడుకు వచ్చేయేటికి కుండలే కాళీచేస్తాడు....అయ్యో! పాడుదాన్ని....నానే దిష్టియేస్తున్నాను...."

కుర్రాడు రోజుకురోజు వెలుగుతెచ్చి మనసుల్ని ఆనందంతో పుర్రూతలూగిస్తున్నాడు.

పైరుపంటల్లో పెసలు కొద్దిగా పురుగుపట్టినా, ఒకవిధంగా బాగానే రాలింది. ధాన్యం బుగతికి కొలవగా ఆ భూములవల్ల మిగిలింది పెసలే. పుల్లయ్య స్వంతపొలంలో పండిన గింజలతో కాలం వెళ్ళిపోతూంది. అది జాగ్రత్తగా వాడకపోతే రాసనికి డబ్బెక్కడిది? రాట్నంయిచ్చిన నూలు అమ్మగావచ్చినది చెప్పుకోతగ్గ డబ్బుకాదు. పనిపాట్లు మళ్ళీ వేసవి దాటితేగాని యేమీ వుండవు. చోడిపంట వేసవికికానీ అందిరాదు.

బ్రతుకుతెరువులు ఇలా వున్నా కొడుకు మల్లు ఆ విషయం ఆలో చించడానికే తండ్రికి అస్కారం యీయలేదు. సాలతోనున్న పోతుల వైపు చూసి అవి అరుస్తున్నా జడవలేదు; చందమామను చూసి చెయ్యి ఆడించటం నేర్చుకొన్నాడు. రావిచెట్టుమీద పిట్టలు అరుస్తుంటే అటువేపు

దీక్షగా చూడటం, తల్లినిచూసి, తండ్రినిచూసి నవ్వటం, ఒకోసారి తీసుకోపోతే ఏడవటంకూడా చేస్తున్నాడు. చిన్న పన్ను వచ్చింది. నవ్వు తూంటే ఆ పాలపన్ను ఎంత అందంగా కనిపిస్తూంది!

ఆ సంవత్సరమే ప్రభుత్వం ధాన్యంసేకరణ మొదలుపెట్టింది. ఉళ్ళో మూలనున్న ముసలమ్మకుకూడా ఇంగ్లీషు వచ్చింది. "పొక్కూరి మెంటు" అంటే అందరికీ ఏదో భయంపుట్టించింది. కొందరెందుకిస్తాం అన్నారు. మాచెమట—మాయిష్టం—గవర్నమెంటోడికి నాయం లేదన్నారు కొందరు. పీస చాలా అలజడి చేశాడు. వాడిమాటలు మూడొంతుల ముప్పాతికమంది నమ్మారు. "లెక్కలన్నీ పంట పొలంలో ఉండగానే తయారయిపోయినాయి. యిప్పు డా దొంగరాతల్ని నమ్మి గవర్నమెంటోడు, పోలీసుల్ని, ఎఫ్ఎస్ఓని, టి. ఎస్. ఓని పంపి యిస్తావా సస్తావా అని బెదిరిస్తాడు. పెద్ద కబుర్లాడితే కైదే!"

పుల్లయ్య మీసాలు మెలివేశాడు. "ఎలాంటోడు నాకొట్టు ముడ్తాడో సూస్తాను. ఉన్నోడికొట్లు కాళీసేసి, లేనోడిదగ్గరకి గవర్నమెంటోడురానీ ....ఆడే ఆడికి కలిగింది యిస్తాడు"

"ఈ యేటి కిలాగయిపోయిందిలే. గవర్నమెంటోడు, వచ్చే యేడుముండే మిడతలదండులాగ వచ్చేస్తాడు" అని జోస్యంచెప్పాడుపీస.

గ్రామకరణీకం శాశ్వత వారసత్వపు హక్కుప్రకారం పట్నంలో వున్న, ప్లీడరు సీతారామస్వామివారి సంతతి చెయ్యవలసింది. కాని వారీ హక్కును పది సంవత్సరాలకని నాలుగువందలు పుచ్చుకొని, వూర్లోవున్న పట్నాయడుకు యిచ్చారు. ప్రస్తుతంవున్న కరణం ముప్ఫయియేళ్ళవాడైనా ఆరుగురు పిల్లలతండ్రి. తన తండ్రి ముసలి పండునక్క. గొప్ప వ్యవహారస్తుడు. భూసంబంధమైన వ్యవహారాలు కుదిర్చిబెట్టి డబ్బు సంపాదించుకుని బ్రతుకుతున్నాడు. కొడుకుకు కరణీకంతో తనకు అధికారం వచ్చింది. అయితే యీ అధికారం యిదివరకు భూక్రయవిక్రయ తనఖాదుల సమయాల్లోనే డబ్బుచేసుకోడానికే పనికివచ్చేది. కానీ ఇప్పుడు ప్రొక్యూరుమెంటు అసలైన అధికారాన్ని యిచ్చింది.

ఈ ముసలినక్క ఒకప్పుడు చాలా పరపతివున్న మనిషి. వడెకరాల పల్లం, నిక్షేపంలా పండేది. పదిగ్రామాల్లోను, హోముగా, మాలు

కోదారుగా చెలామణీ అయిపోయేవాడు. ఉన్న ఒక్కకూతురుపెళ్ళి అయిదురోజులు బ్రహ్మాండంగా సంతర్పణలతో చేశాడు. జిలుమూరు మాలుకోదారులంటే, ఆరోజుల్లో చక్రవర్తుల్తో సమానం. వాళ్ళ రాబడికి తగ్గట్టు యింట లక్ష్మీ సరస్వతులు తాండవమాడేవి. అలాంటి కుటుంబం ఆ తరంతోనే సరి. వాళ్ళపిల్లలు, ఖర్గపూరులో రైల్వే వుద్యోగాలు చేసి రెక్కాడితేగాని డొక్కాడని పరిస్థితులలో వున్నారు. ఆ మాలుకోదార్లను గురించి యిప్పటికీ ఆ చుట్టుపట్ల గ్రామాల్లో చెప్పుకుంటారు. భట్రాజులు ఆ పొగడ్తలు యింకా మరచిపోలేదు. అలాంటివాళ్ళతో ఆ రోజుల్లో సంబంధంచేశాడు. కత్తిపీటనుంచి పందెరకోళ్ళ గిలక మంచం వరకు సారెయిచ్చి పల్లకీతోనూ, పద్దెనిమిది యెడ్లబళ్ళతోనూ, నూటొక్క కావిళ్ళతోనూ కూతుర్ని అత్తవారింటికి పంపించాడు. ఆరోజుల్లో కట్నాలుండేవికావు. కట్నంఅంటే యేవగింపు. కొన్ని సంవత్సరాలవరకు ఈయనచేసిన పెళ్ళిగురించి ఆ చుట్టుపట్ల అనుకోకుండా వుండలేక పోయారు. ఈకీర్తి తన పదెకరాలను అమ్మించింది.

ఈయన ఇప్పటికి,తన జీవితంలో ఈ ఒక్క ఘనకార్యంచేశాను, చాలని మురిసిపోతూంటాడు. కూతురు అత్తవారింటి కెళ్ళాక ఒక్కసంఘటన జరిగింది. పదిహేనేళ్ళయినా నిండని యీ పిల్ల తెలివిని అత్త, విధవాడపడుచూ పరీక్షింపచూశారు. వేపుడుకు, ముద్దకూరకు, పులుసుకు కావలసిన కూరగాయల్ని తరిగి ఒక జంగెడలో కలిపివేసి వంటయింటి దగ్గర పెట్టేశారు. మాలుకోదారు భార్య, కూతురు నౌకర్లున్నా వండవలసిందే. వచ్చిన చుట్టాలకు వడ్డించవలసిందే: కోడలుకూడా ఆ యింటి తరహాను మన్నించాలి. దేనికి కావలసిన కూరగాయలను, అమె వేరు చేయటంతో యిద్దరూ గర్వపడ్డారు. పొయ్యిమీదినుంచి కుండదించటానికి నల్లగుడ్డ లేదని ఆ యిల్లాలు అత్తగారిని అడిగింది: అత్తగారు పరిహాసంగా, కన్నవారు యివ్వలేరా అని ప్రశ్నించింది. ఆమె వెంటనే కట్టుకొనివున్న పట్టుచీరచెంగు చింపి నల్లగుడ్డగా వాడింది.ఈ ఘటన యిప్పటికీ ఈ తండ్రైవ ముసలాయన, యెందరితోనో చెప్పి తన పరువు కూతురు నిలబెట్టిందని సంతోషిస్తుంటాడు.

భూమి పోగానే రాతకోతలతో బతుకును కరణంగా చేసుకున్నాడు. ఆ కరణంచెవుల్లో ఈవూరో ఆడుతున్న గుసగుసలు దూరాయి: ఇటు జీతం హెచ్చించలేదని గవర్నమెంటుమీద, అటు తనకు మామూలు చెల్లించలేదని రైత్వారీ ప్రజలమీద అక్కసు హెచ్చ యింది. రోజుకోలెక్క, రోజుకోడొక్క. మొత్తంమీద సర్కారువారి బలవంతం అంతగా లేకపోవటంవల్ల యిచ్చి నకొద్ది ధాన్యమే సేకరణ చేశారు. వేసవిలో చోడిపంట బాగా పండింది. మళ్ళీ వరి వూడుపులు పూర్తయ్యాయి.

పదేళ్ళక్రితం గరిశె అరవైరూపాయలువున్న ధాన్యం, యిప్పుడు ఆరువందలైందిః ప్రపంచం తల్లక్రిందులైపోతోందని బీదాబిక్కా, పేదా రోదా అనుకున్నారు. బ్రతుకుభారం మోయలేక, చావలేక దేవునిమీద భారంవేసి, క్రుంగుతూ కృశిస్తూ వున్నారు. ధాన్యంతోసహా వుప్పూ పప్పులూ రోజుకోధరతో ముందుకు పరుగెత్తుతున్నయ్. కోమటి పేరయ్య అడ్డకు ఆణా హెచ్చితే. ఐదణాలు హెచ్చిందని కేకలు వేస్తున్నాడు. నాయుడు, పెద్దరైతు వగైరా పెద్దల ఆవసరాలు అన్నీ కోపరేటివ్‌స్టోర్సు కంట్రోలు ధరలకి యీయగా,మిగిలినది మళ్ళీ రాత్రికి రాత్రి రెట్టింపుధరకి పట్నం నడచిపోతూంది.

దాసుడు శివాలకు దరిచేరేవారు లేరు. దాసుడే ఆకలితో అలమటించిపోతున్నాడు. అయినా సాయంత్రమైతే నీలమ్మగుడి తలుపుతీయటం మానటంలేదు. ఒక్కోసారి ఏడ్చేవాడు. ఆ కన్నీరుతో తల్లి బాధ విన్నదనే తృప్తితో కడుపు కొంత నిండేది. ఊర్లో కాలుపెట్టి నలుగురితోను తల్లికి సంబరం చెయ్యండి, ధరలు తగ్గుతాయంటే, లేనివారు గ్రామపెద్దలకు చెప్పమనేవారు. పెద్దలు పకపకా నవ్వేవారు. దానితో మళ్ళీ ఆకలితో ఒళ్ళంతా నులుచుకుపోయేది. నోరెత్తి ఆడగటానికి అభిమానం వేసింది. ఒకనాడు చీకట్లో వెళ్ళిపోతూ ఆరాత్రి తను పస్తువుండాలని జ్ఞప్తికివచ్చేసరికి కాలు ముందుకు పడలేదు. ఆత్రోవపోతున్న పుల్లయ్యవేపు చూసేసరికి ప్రాణం వచ్చింది. ఇదివరకు రెండుసార్లు పెద్దలను అడిగి వాళ్ళ ఆగ్రహాలకి పాత్రుడయ్యాడు పుల్లయ్య. మళ్ళీ అడిగించినా లాభంలేదు. అయినా భుజంమీద చెయ్యివేసి వెంటపడ్డాడు.

నరాలన్నీ చుట్టుకుంటున్నా ఓపికచేసుకుని మెల్లగా అడుగులు వేస్తూ వేస్తూ పుల్లయ్య ఇంటికి వచ్చి మౌనంగా కూర్చున్నాడు. మల్లు అప్పటికి నడుస్తున్నాడు. "అత్త ....తాత" అంటున్నాడు. ఆడుకుంటూ తనదగ్గరకు వచ్చాడు. ముఖంవేపు చూశాడు. బుడ్డిదీపం వెలుగులో, నల్లగా మాసిన గెడ్డంతో, దొక్కలాడిన్న దాసుడు మల్లుని చేరదీయటానికి చేయిచాచాడు మల్లు దగ్గరగావస్తూ "తాతా...." అన్నాడు.

"ఆ తల్లి రచ్చించాలి....చీకటిలో పొద్దు—సంవత్రంలో ఓడలాం టోడౌతాడమ్మా!"

పుల్లయ్య కొడుకు యెదురుగా ఛినక్ఛినక్ సా, అని గెంతాడు. కొడుకు నవ్వుతూ గెంతబోయాడు. కాని దబ్బున పడిపోయాడు. ఏడుస్తా డనుకుంటే మళ్ళీ లేవబోతున్న కొడుకుని, యెగరవేసుకొని గుండెకి హత్తుకున్నాడు. ఇప్పుడు "అమ్మ....అత్త" అని నత్తినత్తిగా అంటున్న కొడుకుమాటలన్నీ "అయ్య" అన్నట్లుగానే పుల్లయ్యకు వినిపిస్తున్నయ్.

దాసుడుమనసు తెలుసుకున్న నీలి, చోడిపిండితో చేసిన రొట్టి ముక్క యిచ్చింది. కళ్ళకు అద్దుకున్నాడు. నీలమ్మని తలుచుకునే, అలా కూర్చునే, నమిలిమింగేశాడు. క్షణంలో బలం వచ్చింది. మల్లుని ముద్దాడి మెల్లగాలేచి యింటివైపు నడుస్తున్నాడు, పుల్లయ్య కొడుకుతో ముచ్చ ట్లలో పడ్డాడు.

నడవీధిలో ఏకోగొడవగా వున్నట్లుంది. పీసచుట్టూ ఎంతోమంది మూగివున్నారు. పెద్ద గొంతుకతో పీస వార్తలు చెపుతున్నాడు.

"మీరంతా యిన్నారో లేదో!....ఆ కృష్ణపరమాత్మకి అర్జునుడు లాంటోడు నెరూ! గ్రాంధీమహాత్ము డున్నాడే. దేముడేకదా—ఆదేముడు, పట్టుపడితే అలాంటి అక్షోణిలక్షోణీల సేనలతో వున్న, వీరులు కౌరవ బలమే ఓడిపోయిందికదా—ఈ తెల్లోడు ఒకలెక్కా? రేపటినుంచి తెల్లోడిరాజ్యం పోయి—నల్లోడిరాజ్యం వస్తోందట....ఇంక చూడం దయ్యా....!"

యింకా ఆ ధాటికి ప్రజ గుమిగూడిపోతున్నారు. దాసుడు ఆ దరి దాపుల్లో పెద్దరైతు డాబాయింటిఅరుగుమీద కూర్చుని వింటున్నాడు. పీస అభినయంతో—"ఇప్పుడున్నదంతా మారిపోతాది....ఈ కాంగ్రెసో

లకి పెద్దో డా నెరూ; ఎక్కువ పిల్లలున్నోలకి ఎక్కువపొలం, తక్కువున్నోలకి తక్కువిస్తాడు."

"పిల్లలు లేనోలకో?" ఎవరో గుంపునుంచి ప్రశ్నించారు.

"అలాంటోలకి గవుర్నమెంటోడు సాలాసాలా తక్కువభూమియిస్తాడు." పీస గొంతుక సర్దుకొని, "పట్నంలోను నందడి యింతా అంతాకాదు. నీకొడుకూ, నాకొడుకు కలెక్టరు లవుతాడు."

"పోపోరా!"అన్నా డెవడో.

"నూతిలో కప్పలాంటోడివి నీకేం తెలుసు; తెలివైనోడు.నాకొడు కైతేనేం నీకొడుకైతేనేం ఆడికి పెద్దపని అవుతాది-నాను పెపోర్ని కాకపోయినా,నాకొడుకు తెలివైనవోడైతే పెదోడవుతాడట; మనిషికి మనిషికి తేడావుండదు. సాకలోడి కూతురికి మంగలోడి కొడుక్కూ, మంగలోడి కూతురు బావనయ్య కొడుక్కీ పెళ్ళాదొచ్చు; వద్దనోళ్ళకి గవుర్నమెంటోడు కైదులో పెట్టాడు!"

"ఏ మారాజు వచ్చినా ఈ కరువు పోగొడ్తాడా?" అని ఒక ముసలమ్మ ప్రశ్నించింది.

"ఈ కరువు పెట్టినోలందరికి కైదే!—దానితో కరువు పటాపంచలైపోతాది. మనోడు గవర్నమెంటోడుమనమంచి సూడ్డా! అంతా మేజిక్‌లా పని యింక జరిగిపోతాది—సూడండి – సూడండి!"

ఈ మాటలు చాలామందికి నచ్చాయేమో కాని,దాసుడికి నచ్చలేదు. మెల్లగా లేచి ఆ సమూహందగ్గరకు వెళ్ళాడు. వెళ్తూండగానే అక్కడవున్న కొందరివైపు చూస్తూంటే, ఒళ్లు మండిపోతోంది. ఆ గ్రామానికి యిప్పుడు పెద్దలనుకున్న కుర్రకుంకలంతా అక్కడే వున్నారు. వీళ్ళకి దొంగసారా త్రాగటం తెలుసు. పట్నం పదిసార్లు బయస్కోపులకు వెళ్లటం, సిగరెట్‌పొగ రింగురింగుల్లా వదలటం అలవాటు. బింకంగా పసందుగావున్న అమ్మాయిలమీద కన్నేసి కార్యం నెరవేర్చుకోవటం తెలుసు. యిప్పుడు వీళ్లు గ్రామానికి నాయకులు. వీళ్ళ తలిదండ్రుల మాటలు చెల్లుబడికాకుండాపోతున్నయ్.

వీళ్ళంతా భేష్ అంటున్నారు. దాసుడు యెందుకో పుగ్రుడై పోయాడు. పీస యేవో కల్లబొల్లిమాటలాడుతున్నాడని స్ఫురించింది.

సమూహం చేరగానే "పీసా!" అని అరచాడు. ఈ అరపుకో నిశ్శబ్దం ఆవరించింది- "ఎవడ్రా నీకు చెప్పాడు? మేజిక్‌లా అయిపోతాదని?" పీస యేదో చెప్పటానికి వస్తూంటే, అవకాశం యివ్వకుండా దాసుడు "మనసులబట్టి మనం! ఎవుడొచ్చినా మనలో నీతి, నాయం లేకపోతే యింతకంటె వూరు అధ్వాన్నం అయిపోతాది—"

నాయుడు యెర్రగించి చూశాడు. దాసుడు పెద్ద గొంతుకతో "ఈ పెద్దమనుష్యుల్లో యెందరికి నీతి వున్నాది? ప్రజలిలాగ మాడిపోతూంటే, డబ్బు దోసుకుంటున్న ఈ తాగుబోతులంతా పెద్ద మనుషులా పీసా?"

"నోరుమూయ్ మంగలి వెధవా?" అరిచాడు నాయుడు.

దాసుడుమతి చలించినట్లయింది. తన వునికినే మరచిపోయి "మూస్తాను మూస్తాను-ఆడదాని యేలుబడి —నివ్వేం నాయుడివి? ఊరి పెద్దయితే యేనాడో ఆ తల్లికి సంబరంచెయ్యిద్దువు. ఈ కరువులు, కాట కాలు తీరును!"

దాసునితల వూడినట్లు ఒక్కడెబ్బ పడింది. క్రోగుడు వాసన చుట్టూ వెదజల్లే నాయుడితోసహా కూడిన యువకుల చేతులు దాసుడిపై పడ్డాయి. పడుతున్నా దాసుడు తన నిందావాక్యాలను యేక కంఠంతో అరుస్తున్నాడు. మీరే ఒక తల్లీ తండ్రికి పుట్టివుంటే ఆ బేకులో గడించిన డబ్బుతో బీదా బిక్కీ ఆకలితో చచ్చిపోకుండా వుండనిచ్చోవోరని, నీతిలేని మనుషులనీ అరుస్తున్నాడు!

ఈ అరుపులు పుల్లయ్యచెవిలో పడగానే పరుగెత్తాడు. అప్పటికే కొందరు జోక్యంచేసుకుంటున్నా పుల్లయ్య నలుగురినీ నాలుగు వేపుల క్రోసి క్రింద కూర్చున్న దాసునివేపు చూశాడు. ఆ కళ్ళల్లో రౌద్రం ఒక్కసారి పుల్లయ్యను చూడగానే అభిమానంతో నిండి అశ్రువులుగా మారిపోయింది.

పుల్లయ్య ఆ పెద్ద లందరినీ వుద్దేశించి "మీరంతా దున్నలు! వాటి కయినా నీతి వుంటాది. దాసుడిమీద మళ్ళీ చెయ్యి వేశారంటే ఒక్కొక్కడి పీక తెగేస్తాను-పోతారా లేదా? —ఊరికి పెద్దలు-గోచీపాతలు—"

"ఎవడూ?" మూలిగాడు కోపంతో నాయుడు.

"నేను పుల్లయ్యని! నాయుడైతే నాయుడిలావుండు" మధ్యను రాజిగాడు పోపోరా ఆన్నాడు. పుల్లయ్యకు మండుకొచ్చి, వాడిచేయి పట్టుకొని అంతదూరం విసిరేశారు. అక్కడనుంచే వాడు నీ పని పట్టకపోతే యెర్రయ్యకొడుకునే కాదన్నాడు. "పోరా యెదవా! నువ్వు యెర్రయ్యకు పుట్టినట్టే మాటాడతావు, గుడ్డెంకన్నరా మీ అయ్య!"

పరిస్థితి విషమించేదే. నలుగురూ కూడి రాజిగాడ్ని, వాళ్ళ ఇంటి వైపు క్రోసుకపోతూంటే. "మేక పులిని కరుస్తాదా? నీ బతుకంటే యెంత?"

పుల్లయ్య దాసుడ్ని లేవనెత్తి, చెయ్యిపట్టుకొని వాళ్ళ యింటివైపు నడిపించాడు! దాసుడు దుఃఖంతో మాట్లాడలేదు. క్రోవలో ఒక యింటి దగ్గర గుమ్మంలో గ్రుడ్డివెంకన్న, గన్నెమ్మ కూర్చునివున్నారు. అక్కడ జరిగినసంగతి వూరంతా ప్రాకిపోయింది. ఆ యింటి యిల్లాలు గంజి పోస్తుంటే వెంకన్న అన్నాడు:

"తల్లీ! ఆదాసుడు సంబరం సంబరం అని కొట్లాడిపోతున్నాడు. ఈ పెజల్లా ఆ నీలమ్మతల్లిలోనూ నీతిసచ్చింది. ఆతల్లికే నీతుంటే ఈ గేమ పెద్దయిల్లల్లో నలుగుర్ని లేదనిపించదా?"

దాసుడు "ఛా ఛా" అన్నాడు. "ఆతల్లికి నీతిపుందికాబట్టి కొడుకులకు గేనంలేకపోయినా భరిస్తున్నది!"

అంతే, మరి మాటాడలేదు. ఇల్లు దగ్గరగావస్తోంది. ఊడిన జుత్తయినా ముడివేసుకోలేదు. ఆకాశాన చుక్కలవెలుగు. వీధిలో మరెవరూ నడవలేదు. దాసుడు ఆగి, "నాయనా పుల్లిగా!" అన్నాడు. "నానూ మొదట అబద్ధాలాడేవోడ్ని. లేనిపోని వేసాలు వేసేవాడ్ని. ఆతల్లిని కొలిచాను. నాకు మంచిగతి దొరికింది. ఈలంతా...." పుల్లయ్య చప్పున "నువ్వేమీ జడిసిపోక" అని అందుకున్నాడు.

దాసుడు చిన్ననవ్వు నవ్వి "జడుపా! నీతికోసం కడుపు మాడిసస్తేయేం? నలుగురిసేతా దెబ్బలుతింటేయేం? నాయనా, యేడ్చేవాడినే ఆతల్లి ఓదారుస్తాది. నా గుండెలో ఏకుళ్లూ లేకపోతే నన్ను యెవరు యేం చేసినా నాకు తగలదు—ఎళ్లు నాయనా—సంబరం సెయ్యండని నా పాకులాట

యెందుకుఁ నువ్వు గరిడీ మరిసిపోతే అంతా సరి—ఆ పుట్టినోళ్లు బిత కఱ్ఱర్లేదుఁ"

పుల్లయ్య వెనుకకు తిరిగాడు. దాసుడు మెల్లమెల్లగా అడుగులు వేసుకుంటూ యిల్లు చేరుకునేసరికి కొడుకు అగ్నివర్షం కురిపించాడు. "కయ్యం సరికి సరితోని ఆడుతావాఁ వూరంతటితోని ఆడుతావాఁ నా పర పతి పోయింది. వేరే వుండు" అన్నాడు చివరికి కొడుకు.

దాసుడు ఆ క్షణంలో మినుకు మినుకుమనే చుక్కలవేపు చూస్తున్నా నీలమ్మతల్లి పాదాలు కనిపించటంచేత కామోసు చిన్ననవ్వు నవ్వాడు.

15

పీరావేశంతో యింటికి వెళ్ళిన రాజిగాడు పెళ్ళంమాటలు వినక తప్పిందికాదు. భార్య నోరెత్తగానే నాయుడు కిక్కురుమనకుండా వూరు కున్నాడు. రాజుగాడిపెళ్ళం పుల్లయ్యను నమయంవస్తే కాళ్ళమీద పడే టట్లు చేయిస్తానని మొగుడికి హామీయిచ్చింది. తండ్రి వాడితో దెబ్బలాట ఎందుకన్నాడు. నాయుడితండ్రి, దాసుడ్ని సమర్థించగానే కోడలు కస్సు మంది. తను సంవత్సరమైంది. యే విషయాల్లోను జోక్యంలేనట్లుగానే మెసులుతున్నాడు. ఒకప్పుడు ఏంకావాలన్నా, ఏం చెయ్యాలన్నా తన కోరిక సాగదు. అలా కోడలు పోసిందేదో త్రాగవలసిందేఁ

ధాన్యం ధరలు రోజురోజుకీ పెరిగిపోతున్నాయ్. గంజికూడా తాగడానికి లేక కొన్ని కుటుంబాలు తహతహలాడిపోతున్నయ్. ఉన్న మటుకు 'పిసరిపిప్పి' అమ్మివేస్తున్నారు. ఇంకా కోతలు పట్టలేదుకాబట్టి ఎక్కడా పనిపాట్లులేవు. అకలి అబద్ధాలు ఆడించి కొందర్ని వూరినుంచి పట్నం పొయ్యేలా చేసింది. అక్కడ కూలీనాలీ దొరకకపోతే దొంగ తనంచేయడమే పద్ధతి. ఏమైనా చిక్కితే యింటికిరావటం, లేకపోతే బైదు సంతోషంగా అనుభవించటంఁ ఇలాంటి దారుణ పరిస్థితులు రావ టంతో, పీస చెప్పినమాటలు అబద్ధాలని ఎందరో ఎత్తిపొడిచేవారు. పీస అసలు బాధపడ్తున్నాడు. రాత్రులు తిండివుంటే తినేవాడేకాని పిల్లలబాధ కొంతలోకొంతైనా తీరుతుందని "ఉపవాసం వుంటున్నాను—" అనేవాడు

"పుట్టగానే పిల్లడు నడిసేస్తాడా? మాటాడేసినాడా? ఓర్సండి. మనగవర్న మెంటోడు పెదోడయితే మనకు యిలాగ వుంస్తాడా? పోషించడా?" అని నలుగుర్కీ-నచ్చచెప్పటానికి ప్రయత్నిస్తే కొందరు "గవుర్న మెంటోడు తలుసుకొంటే యేంకాదు? నందిని పందిచేస్తాడు? పందిని నందిచేస్తాడు? కరువు పోవాలని గట్టిగా పట్టుపట్టే పోదా?" అని ప్రశ్నిస్తే —

"ఓరయ్యో! కంట్రోళ్ళు ప్రజ బతుకుతారని పెట్టాడు. దానిపేరు పెప్పి అవతల గవర్న మెంట్దోడి సిబ్బంది. యిటు యేపారం సేసినోడు పెజల కడుపుమాడ్చి మూటకడుతున్నారు! కట్టనీ-ఎలాగొచ్చింది ఆలాగే పోతాది! సెమటోడ్చి గడించిందే నిలవదు. అలాంటిది ఇదంతా నీటి బుడగలాంటిదిరా! ఏతిప్పిరీలోపడి బుడ గసేటపోదురా? ఆ గజేంద్రుడు మొరపెట్తేకదా దేవుడు నిలబడ్డపాటున వచ్చేకాడు. నీకూనాకూ సావుంది కానీ, నాయం నీతికి సావులేదురా?" చెయ్యి గట్టిగా గుండెమీద వేసుకుంటూ "నా గవుర్న మెంటోడు పెద్దోడయితే, నాను సుఖపడనా! యీ లందరూ మొర్రోమవి ఏడవరా? చేసినపని సెరిపేగలమా! ఇలాగ నీతికి కట్టుపడి సచ్చిపోతాను గాని.... అన్యాయానికి నెట్టుకుంటానురా?"

అక్కడేవున్న పుల్లయ్యవొళ్లు పులకరించి "బలేబాగా సెప్పావు రయ్యా! ఇలాగ చచ్చిపోతాంగాని.... అన్యాయానికి మొక్కుతామా? ఈ గేమపెద్దలు యేంసేస్తారో సూద్దాం."

సరేసరేఅంటే సరే అన్నారు. అలాగ వస్తూన్న రాజిగాడు ముసి ముసి నవ్వులు నవ్వుతున్నాడు. "ఏంరా పీసా, రేసను తీసుకెళ్ళలేదు.... నీకు వద్దంటే, కారుడుయిస్తే యింకొకలికి పనికిరాదా?" అన్నాడు నాయుడు.

"నాను యివ్వను. నాకు కానీపరక కలిగిన్నాడు కొంటాను. లేని నాడు వూరుకుంటాను."

"నీ కారుడు యివ్వకపోతే — మరి పని జరగదు" అనుకుకుంటూ చేతివాటీ చూసుకుంటూ వెళ్ళిపోయాడు నాయుడు.

పుల్లయ్య పోల్చుకుని "పీసా! టి. ఎస్. ఒ తో సెప్పాలిరా ఈ వైనం!" అన్నాడు.

"అంతా ఒకటేనిరా"....ఆడుకూతురి పెళ్ళని, తాలూకాని దోసే కాడుఃబురదనీరు పారేకా మంచినీరు పారదాఃరారాఃఎవరుచేసిన కర్మ వారనుభవించరాఃనీ కళ్ళా నాకళ్లా మూస్తారు. వాళ్ళకళ్ళా,వాళ్ళ కళ్ళకి కళ్ళయిన దేముడికళ్ళా, మూసేస్తారాఃఁ అంటూ పీస వెళ్ళి పోయాడు.

పుల్లయ్య యింటికి వెళ్ళేసరికి కొడుకు నవ్వుతూ, ఎగురుతూ, ముందుకువచ్చి స్వాగతంఇచ్చాడు. తండ్రి ఎత్తుకోగానే కిలకిల్లాడి, ఒళ్లు ఆడించాడు. వరిచేలు కోతకివస్తున్నాయ్. చులకనలు అక్కడక్కడ కోస్తున్నారు. ధాన్యం కంట్రోలుధర గరిసె మూడువందలే. కానీ ప్రజా నీకానికి ఆ ధరకి దొరకలేదు. నల్లబజారులో 600, 650, 700 వరకూ పెరిగిపోతూంది.

ఈ సంవత్సరం బాగా పండింది. పొలాలనుంచి కళ్ళాలకు పంట వచ్చినా ఎవరూ ఇదివరలా, ఒకవెన్ను ఎవరినీ ముట్టనివ్వడంలేదు. ధాన్యం బంగారంలా చూస్తున్నారు, నీలి ప్రతిసంవత్సరంలానే ఇవ్వవల సినవాళ్ళకు ఇస్తూంటే పుల్లయ్య ఎగిరిపడ్డాడు. ధాన్యం ఇప్పుడు బంగా రంతో సమానం కాబట్టి చూసుకొని పెద్దరికం చెలాయించమన్నాడు.నీలి నవ్వి, యిది బంగారం అని చేతులు నలుక్కోమంటావాఃఅంతా నాకే అనుకొంటే, ఆకాలానికి సూసినోల్లెవ్వరూ వుండరు. మా మామ్మ చెప్పింది. మూతులుండి సేదలు లేకపోయినా, సేదలుండి మూతులు లేక పోయినా బతకలేమని!"

పుల్లయ్య మరి మాటాడలేదు. బుగత ఈ సంవత్సరం పర్మిట్ తీసుకొని వచ్చి ధాన్యం కొలిపించుకున్నాడు. కళ్ళానికి కొడుకు రావటం వల్లనే ధాన్యం బాగా రాలిందని పుల్లయ్య పెళ్ళాంతో చెప్పుకున్నాడు.

1948 వ సంవత్సరం ప్రవేశించింది. పొలాల్లో పెసరవుంది.పెద్ద పండుగకి కొడుక్కి మెళ్ళో వెండి అత్తికర్ర చేయించాడు.మళ్లు మొదటి పీకినా తరవాత అలవాటుపడి వూరుకున్నాడు. అప్పుడే తల్లిని విడిచిపెట్టి తండ్రిదగ్గర చనువు ఏర్పరుచుకుంటున్నాడు. రాత్రిళ్లు నీల మత్తుగా నిద్ర పోతూంది. ఏడుస్తే, పుల్లయ్యే ఎత్తుకుని త్రిప్పి, గుండెమీద వేసుకుని నిద్రపుస్తున్నాడు.చెయ్యి మీద వుంటేగాని, నిద్రపోడు. పుల్లయ్య చెయ్యి

తీసివేస్తే "కయ్" మంటున్నాడు. ముసలమ్మ, పిల్లడు వరుసగా నాలుగు రోజులు నిద్రలేకండా యేడవటంతో, ఏ గాలి సోకిందోనని ముల్లున్న రణభేరికాయున్న కొమ్మను పెణకలో దోపింది. ఇప్పు డంతగా ఏడవ టంలేదు. ఒక్కోనాడు పెద్దల పేరంటాలను తల్చుకొని మనవడికి యేం రాకండా చూడమనేది; ఒక్కోసారి కింకపెట్టేవాడు. తండ్రి ఓదారిస్తే కొంత నయం. లేదా అంటే తండ్రి వచ్చేవరకూ తగ్గేదికాదు. ఒక్కొక సారి తండ్రితో వెంటపడేవాడు. తీసికెళ్ళకపోతే ఏడుపు;

ముసలమ్మ పిల్లాడి ఏడుపు విని యేవో పాటలుపాడేది.ఐనా కింక వదల్లేదు. ఏవైనా బాలారిష్టాలేమో అని,మట్టిబొమ్మ చేసి,ఐదు కొమ్మలు, ఐదు ఆకులూ, ఐదు ఖజ్జాలూ, నల్లటిగుడ్డ, జుత్తు, అన్నం, దీపంతో చేటలోపెట్టి-వూరికి దక్షిణవేపున పోయించింది. ఏడుపు తగ్గింది. కాని పిల్లాడు చిక్కినట్లే వున్నాడు. పడమటి ఆకాశంలో రక్తవర్ణంతో మేఘాలు రోజూ కనిపించాయ్. ఏదో అనర్థం వస్తుందని ముసలమ్మ అనుమానపడసాగింది. "మా రోజుల్లో యీ కంట్రోళ్ళూ యివన్నీ యెర గం; కలిగిన పొరుగమ్మ వున్నదాంట్లో యిరుగమ్మకు ఆకో పాకో యిచ్చేది. కానీ ముఖం సూడకండాబతికామంటే యెలాగ మరి;"

నీలి వున్న గంజీగడుగూ, వెంకన్న గన్నెమ్మలాంటి ఆనాధులకు పోసేది. ఒకనాడు పుల్లయ్య పొద్దుతిరిగినా ఇంటికిరాలేదు.మొగుడికోసం అన్నం వుంచింది. అడుక్కునే కుష్ఠురోగి వచ్చాడు. చూడటానికి భయం కరంగా వ్యాధి శరీరంఅంతా వ్యాపించివుంది. "ఊరు ఆ చివరనుంచీ అడుక్కుని వస్తున్నాడు. ఏ తల్లికీ కనికరం కలగలేదు. రెండురోజు లైందమ్మా....నోటిలో బుక్కెడు గంజిపొయ్యలేదు. యిలా వెళ్ళి ఆ యేటిలో పడిపోయి ఛస్తాను. నా శవాన్ని యే నక్కలో పీకి,రాబందులో తింటే కొంత పుణ్యమైనా వస్తాది" అన్నాడు.

"రామ రామ" అంది నీలి.

"నా నే పాపం యెరగను తల్లీ; నా కీ కష్టం వచ్చింది. ఇలాగ వచ్చిందికదా అని దేముడ్ని తిడతానా;ఏ జన్మలో యే పాపం చేశానో, యీ జన్మలో, అనుభవించేస్తే వచ్చేజన్మలో ఒకేమాట ఆడేవోడిగా పుడ్తాను"

నీలి వాడి సిలవరి గిన్నెలో మొగుడికోసం వుంచిన అన్నంలో సగం వేసింది.నిల్చొనే ఒక్క నిముషంలో లేదనిపించాడు;మరి కొద్దిగా తెచ్చింది. ఇక మొగుడికి మరి లేకపోయింది. వాడు "తల్లీ! ఈ కడుపొక సముద్రం అమ్మా! ఆకలి అగ్గిలాంటిది. అగ్గికి యేదో హారం వెయ్యకపోతే, మనిషినే కాల్చేస్తాది. ఒక పేణం నిలిపావు తల్లీ! నీ ధర్మమే నీకు గొడుగై కాస్తాది" అని దీవించాడు.

పెళ్ళం పొయ్యి వెలిగించి వండుతోంది. కానీ శరీరమంతా ఏదో తిప్పుతున్నట్లుంది. పుల్లయ్య గబగబ వణికిపోతూ వచ్చాడు. కొడుకు యెదురై నవ్వుతూంటే, ఏమీ అనకండా ఇంటి నులకమంచంమీద కూర్చుని బొలబొలా కన్నీరు కారుస్తున్నాడు. పెళ్లం వచ్చి ఆశ్చర్యంగా మాటాడలేకపోయింది. ఒక్కసారి ఘొల్లుమన్నాడు.మళ్లు తండ్రిని చూసి ఒకటే గోల. పిల్ల్దిద్దరి ఏడుపుకో నీలి కళ్ళంట నీరు చిమ్మి మెల్లగా రాలుతున్నాయ్!ముసలమ్మ కళ్లు మసకలు కమ్మాయ్!అంతలోనే వూరంతా అట్టుడికిపోయింది. చిన్నా, పెద్దా, పిల్లా, పిచికా కళ్ళల్లో నీరే కనిపిస్తోంది. ఈ ఏడుపు హృదయంలోంచి వుబికి వుబికి వస్తోంది. జాతి, వర్ణ, వర్గ, భేదాలులేకండా అందరూ ఏడుస్తున్నారు. లోకం తల్లకిందులై పోతూంది. ఇంక మనం వుండి దేనికి? మనం అంటూ వుంటామా అని ఎవరికి వారే అనుకుంటున్నారు. కుష్టురోగి కూడా, విషయం తెలుసుకుని తల మొత్తుకొని యేడ్చాడు.

ఊరంతా నీలమ్మగుడిదగ్గర సమావేశమైనారు. సరి! ఆ తెలివి తక్కువ వెధవెవడో ఆ దేముడ్ని పేల్చేశాడు. ఆ దేముడు ఆ రూపులో లేకపోయినా, మనవెంట వుండనేవుంటాడు. దేముడు లేకపోతే ఈ పెంపచకం వుంటాదా-ఆని తలోలా అన్నారు. ఆయన ఆత్మశాంతికి ప్రార్థించారు. పదో రోజున నీలమ్మ గుడియెదరగా వూరంతా కలిసి బీదలకు అన్నదానం చేశారు. అంతా ఏకమై కలిసిమెలిసి బిరువుగుండెలతో ఈపని నెరవేర్చారు. ఈ సమయంలో దాసుడు నీలమ్మగుడి తలుపులు తెరిచి, గుమ్మందగ్గర సంతోషంతో నిటారుగా నిల్చున్నాడు. తింటూన్న బీదల ముఖాలను చూస్తూంటే తన కెంతో జాలివేసింది. నీలమ్మతల్లివైపు చూశాడు. ఆనందంతో నవ్వుతున్నట్లు స్ఫురించింది—కనిపించింది! ఒక్క

సారి ప్రజల నుద్దేశించి "నాయనలారా సూడండ్రా! ఆ తల్లి సంతోషం ఇంతా అంతా కాదు!ఆగాంధీమహాత్ముడు దేముడు — దేముడుపేరు సెప్పి మీరు మంచిపని చేస్తారు-మంచిపనిచేస్తే దూతలు దూరం అయిపోవా?ఆ తలికి సంతోషంకదా?"

పీస లేచాడు. " ఆ దేముడిని, ఆ రూపకంతో మరి సూడం-కానీ ఓ రయ్యల్లారా! ఆ దేముడు పెట్టిన ఒరవడిన పోతే, ఈ బీదా, బిక్కీకి ఆ పెద్దరైతోళ్ళనాగే యేళ్ళన్నీ నోటిలోకి యెల్తాయ్. ఇంటిలోను ఒకడు కడుపునిండా తిని తందానలాడి, మిగతావోలకి కడుపు మాడితే ఆ ఇల్లు ఇల్లేనా? ఆ తిన్నోడు మనిషేనా? ఎక్కువ పండిందాకా, ఉన్నదే నలు గురికి నర్దినోడు మనిషి---ఆడు తినకండా ఎదరోలకి ఇచ్చినోడు పెద్ద. అందరూపెద్దలెలాగయిపోతారు?"

పెద్దలు మాతులు త్రిప్పాటు. చిన్నలు శ్రద్ధతో విని నిజమే అను కున్నారు. ఇంతలో సంజీవి చెవిలో నాయుడు ఏదో చెప్పాడు. గబగబ పీసచెయ్యి పట్టుకొని "కబుర్లు చెప్పుదువుగాని రారా! పదుగురికి పట్టె డన్నం వడ్డించరా!" అన్నాడు.

పీస విదలించుకొని పులుసు దాక పట్టుకొంటూ, "బాలనాయకం, బహానాయకం" అని గొణుక్కున్నాడు.

16

కొడుకు తన మెడను చేతులతో చుట్టివేయగానే, పుల్లయ్య అలా చిన్న పరుగు నడకలతో వీధిలో పడ్డాడు. కొడుకు సంతోషంతో నవ్వు తున్నాడు. మళ్ళీ మెల్లిగా నడుస్తూంటే "ఊ! ఊ! అయ్యా...." అని పరుగెత్తమనే పుబలాటాన్ని వ్యక్తంచేస్తున్నాడు. అలా ఆగుతూ, పరు గెత్తుతూ ఆదెమ్మపాయింటికి చేరుకున్నాడు.

ఆదెమ్మ కడుపునొప్పితో యేడుస్తూంది. వాము, జీలకర్రలు ఇప్పుడు పనిచెయ్యటంలేదు. పొరుగూర్లో వున్న నేటివ్ వైద్యుడు లవణం పొట్లాలిచ్చాడు. కొద్దిగా తగ్గాంతిగావున్నా మళ్ళీ ఒకొక్కసారి ఉధృ తంగా నొప్పి వస్తోంది.

చుట్టూ చేరినవాళ్లు మనిషోలా అంటున్నారు. "పట్నం తీసికెళ్తే పొటో తీస్తారు. ఏమున్నాదో తెలిసిపోతాది" అని పీస సలహాయిచ్చాడు. ఏ సలహాలు అల్లుడు వినలేదు. అసలే పిసినారి. అందులో పెద్దరికం వచ్చింది. "ఎందుకర్రా, ఆ వైదుగుడు, ధంకామీద దెబ్బకొట్టి నయం సేస్తానంటూంటే, తొందరపడకండి" అని తమాయించుకొస్తున్నాడు.

మందు ఒక పొట్లాం వెయ్యగానే కొంతసేపటికి నొప్పిసర్దుకుంది. ఆదెమ్మపప్ప ముఖం మల్లుని చూడగానే కొంచెం తేరుకుని అలా నులక మంచంమీద దొర్లుతూనే, మల్లుని దగ్గరగా చేర్చుకుంది కాని వాడు తండ్రి వేపు వురకలు వేసుకుంటూ వచ్చేశాడు.మళ్ళీ మెడను ఆ చిన్ని చేతులతో చుట్టివేసి తండ్రితో ముద్దులాడుతున్నాడు.

అనుకోని మాటలు అల్లుడి నోటివెంబడి వచ్చాయి. పుల్లయ్య పెళ్ళికి పుచ్చుకున్న రెండువందలూ వేగంగా తీర్చేమన్నాడు. 'కొండ కొదాలు' కొనే అవసరం వచ్చిందనీ, డబ్బు రొక్కటంగా వుందనీ చెప్పాడు. పుల్లయ్య బదులు చెప్పలేదు. ఆదెమ్మపప్ప 'తొందరపెట్తే ఎలా గరయ్యా' అంది. "వాడి అవసరానికి యిచ్చేటప్పుడు మన అవసరం చూడాలంటావా లేదా?నిన్న నూరురూపాయలున్న కొదాలు ఈవేళ నూట పాతికైపోతున్నయ్. పుల్లయ్యా! యేగం ఏదో సూసి. అప్పుతీరిస్తే నా కివతల నష్టం వుండద"న్నాడు.

తల ఆడించి ఇంటికివచ్చి పెళ్ళంతో అన్నాడు. "ఆడికి యెవడో సెప్పిన మాటలు కాకపోతే, దాన్నె ంగరికె ఏడొందలకి అమ్మేడు— డబ్బు నేదా!"

నీలి ఓషణం వూరుకొని "ఇన్నాళ్లు ఊరుకొన్నారు - ఇంకొక రైతే వూరుకొంటారా?"

"మాకు వూరికినే యిచ్చారే? వడ్డీదాన్నం ఈ రోజుల్లోనూ తగ్గించకండా యివ్వలేదా?"

"ఈ బంగారం వుండి యేంసెయ్యాల?" అంటూ ఉన్నదంతా వూడ్చి, మొగుడిచేతబెట్టి, బలవంతాన కంసాలి చినోడి దగ్గరికి పంపించింది. తిరిగివచ్చి" నాశిరకం బంగారం అని తులందగ్గర నాలుగురూపాయలు గుంజుకోవాలని సూస్తున్నాడు. పట్నం తీసికెల్దాంలే" అన్నాడు.

నీలి "ఊర్ని కనిపెట్టి బతుకుతున్నోడ్ని మాని, పొట్టపొడిచి పోషిస్తామాఁపిల్లలుగలోడు. కకుర్తిపడ్తున్నాడు. మనం కొన్న ధర కంటే యెక్కవడబ్బు వస్తోందికదా.... ఈడికే యిచ్చి" అని బలవంతం చేసి మొగుడ్ని పంపించింది.

అప్పుతీర్చేగా మిగిలినడబ్బుతో బట్టలు కొందామంటే,కోపరేటివ్ స్టోర్సులో బట్టలేదు. ఏదో వాదిస్తే "ఏ నాడో నీకు డబ్బు కలుగుతాదని బట్ట దాసిపెడ్తామా" అని హేళనచేశాడు స్టోర్సులోవున్న నాయుడు.

ముసలి సాలిపాపయ్య దగ్గరకెళ్తే, నూలుధరలు పెరిగాయనీ కంట్రోలు నూలన్న పేరేగాని దొరకలేదని, వాడి కష్టసుఖాలు చెప్తూ,చీరలు చూపించాడు. మిగిలిన డబ్బుకి తనకొకచాపు, పెళ్లానికి ఓ కోక, ముసలమ్మ కొకతాను వచ్చింది. ఆనాడు రెండు రూపాయలకోక ఈనాడు పది రూపాయలు: ఊరిని కనిపెట్టుకున్న సాలి పాపయ్యదగ్గర కొన్నందుకు నీలి సంతోషించింది.

నీలి కొత్తబట్టలు పెద్దలు పేరంటాలకు చూపించింది. ముసలమ్మ బోసినోటి నవ్వుతో కొత్తతాను కట్టుకుంది.పనవడ్ని ముద్దుపెట్టుకొంది. పొలంనుంచి వస్తున్న తండ్రిని చూడగానే ముసలమ్మ చేతులనుంచి జారిపోయి, గబగబా గెంతులేసుకుంటూ, నవ్వుతూ ఎదురెళ్ళాడు.తండ్రి మీదికి ఎక్కగానే, పుల్లయ్య అలా అరుగుమీద కూర్చునే కొడుకుని ఆడిస్తున్నాడు. కొత్తపంచతో కొడుకుని కప్పాడుముందు. బోసినోటి నవ్వు చూసి, పైకి లేవనెత్తగానే పెణక అందుకున్నాడు మల్లు. ఉయ్యాల్లా ఊగిస్తూంటే యేడవలేదు. కొడుకుని గుండెకు హత్తుకుంటూ, "భళీ! భళీ!" అన్నాడు.రోజుకిరోజు మల్లుకి అయ్యతోనే సంబంధం హెచ్చుగా వుంది.రాత్రుళ్లు ఏడ్చేటప్పుడు అయ్యదగ్గర వుంటేచాలు ఏడుపు పోతుంది. ముసలమ్మ హాస్యానికి "ఆడు అయ్య కొడుకుగానీ! అమ్మకొడుకా?" అంటే పుల్లయ "ఎవడైనా, నీ మనవడేలే!" అంటే ముసలమ్మ ఆనందంతో, పళ్లులేని పెదాలతో నవ్వుతో మురిసిపోయింది.వంగిన ఆ నడుం యెక్కడవాల్చినా ఆ మనమడివేపే కళ్లు —ఎక్కడ ఆ తుషిర్‌ంచిన దేహంవున్నా మనసు ఆ మనమడివేపే —!

ఒక్కసారి గతం జ్ఞాపకంవచ్చేది. ఆ దేముడు—నా అయ్యా! అనుకొని మురిసిపోయేది. దేనికీ ఆమె విసుక్కొని యెరగదు,దుఃఖంతో కుమిలిపోలేదు. సంతోషంలో వుబ్బి తబ్బిబ్బవలేదు. మనుమడు పొలానికి వెళ్తున్నతండ్రి వెంటబడటానికీ అడుగులు వేస్తూంటే, పట్టుకుంది. విరుచుకపడ్తూ మామ్మజుట్టు పీకేస్తున్నాడు. అప్పటికీ వదలకపోవటంతో, గుంజాటనపడుతూ విడిపించుకొన్నాడు. ముసలమ్మ ఫకాలుమంది. "ఏచెట్టు యిత్తనం....!" తండ్రి కనపడకపోవటంతో యేడవటానికి లంఘించుకున్నాడు. ఎవరు ఎంత బోధపరిచినా లేదు. ఏడుస్తూ ఏడుస్తూ పడుకుండిపోయాడు.

పుల్లయ్య పొలంనుంచి వచ్చేసరికి,నేలమీద పడుకున్న కొడుకుని చూసి యెత్తి మంచంమీద వేస్తూంటే, తెలివివచ్చి "అయ్యా" అంటూ ఒక్కకేకవేశాడు. అయ్యను చూడగానే ప్రాణం వచ్చింది.ఒడిలోనిల్చుని మెడను చేతులతో చుటివేశాడు.

గ్రామకరణం తండ్రికి, పోయిన ఆస్తులను గడించాలనే కోరిక వున్నా లేకపోయినా, కొడుకు తన కుటుంబాన్ని పోషించుకోడానికి సరిపడే భూవసతైనా ఈ కంట్రోలురోజుల్లో గడించాలని వుబలాటపడ్డాడు. రాత్రికిరాత్రి రొడ్డువెంబడి, అడ్డుత్రోవంటి నల్లబజారులో కొన్న ధాన్యాలు నడిచిపోతూంటే, కరణం ఆపకండా వుండటానికి కొంతడబ్బు మొదటే చేరుతోంది. కోపరేటివ్ స్టోర్సువల్ల కొంతడబ్బు కూడుతోంది. ఇక వూళ్ళో ప్రొక్యూరుమెంటు లెక్కల గొడవల్లో దొరకవలసింది బాగా దొరుకుతోంది. ఇంతవచ్చినా ముసలాడికి తృప్తి కలగలేదు. వచ్చినది పొదుపుచెయ్యడం కోడలికి తెలియదు. పెళ్ళంకి అంతకన్నా తెలియదు. నెలకు అంతకన్నా పెద్దకుంటుబాలున్న ఇంటికి రెండు అడ్డలు మంచి నూసయితే, పీళ్ళకి అయిదుఅడ్డలు చాలటంలేదు. కేకలువేసినా ముసలాడిని వాళ్లు లక్ష్యంచెయ్యలేదు. ఇంతవచ్చినా ఇంట్లో సరిగ్గా జరుగుబాటు లేనేలేదు.

పుల్లయ్యకు పంపవలిసినవేవో పంపేమని అడిగితే, నాకేం వుందన్నాడు. ఈ విషయం నీలికి తెలియదు. ప్రొక్యూరుమెంటు ఈ సంవత్సరం, యేప్రిల్, మే నెల్లో చాలా తీవ్రంగా జరుగుతోంది.ఏజంట్లు వస్తు

న్నారు. ధాన్యం కంట్రోలుధర, గరిసె మూడువందలు. ఆ ఏజంటే, రాత్రిమీద నల్లబజారులో గరిసె ఏడువందలకి కొంటున్నాడు. ఈ తతంగంలో వుద్యోగుల సహాయం బాగా దొరుకుతుంది. ఇదివరలో డబ్బు కళ్ళకు హత్తుకొనేవారు. ఇప్పుడు నోట్లకట్టలు మామూలు కాగితాల కట్టలులా చూస్తూ, ధాన్యాన్నే కళ్లకు హత్తుకుంటున్నారు. కరణం లెక్కల వల్ల పదిగరిసెలు పండే పెద్దరైతు, ఒకగరిసె ప్రొక్యూర్‌మెంటుకి కొలుస్తున్నారు. ఒకగరిసె పండే చిన్నరైతు సగం కొలవాలి. ఇది అన్యాయం అంటే, పెద్దరైతుకి కూలీకీ, తిండికీ, పశువుల ఆహారంకీ, ధాన్యం తియ్యగా మిగిలింది ఒక్క గరిసే! ఆ గరిసే ప్రొక్యూరుమెంటుకి కొలుస్తున్నా డంటున్నారు! ఈ వాదాన్ని పోలీసుల సహాయంతో, ఒక్కొక్కసారి, వస్తున్న ఆఫీసర్లవలన, పెద్ద రైతులు వుద్యోగుల పక్షాన వుండటంవలన, చిన్నరైతు లెవరూ మాటాడలేకపోతున్నారు.

పుల్లయ్యవంతు వచ్చింది. పదిహేనుపుట్లు (పుట్టికి 20 కుంచాలు) కొలవాలసి. "నా కొట్లోవున్నది పదిపుట్లైనా లేదు. ఇంకో ఏడాదంతా తినాలి—తూడుపులకీ, దుక్కలికీ, కోతలకీ. కూలికి యేం యిస్తాను! నాను కొలవ"నని పుల్లయ్య భీష్మించాడు. కొలవక విధిలేదని నాయుడు, కరణం పట్టుబట్టి ఇంటికి వెళ్తే, బాణాకర్ర పట్టుకొని కొట్టుదగ్గర "ఎవడు వచ్చి నా కొట్టు ముట్తాడో సూస్తా"నని విల్చున్నాడు.

అంతదూరంనుంచే అంతా వెనక్కి వెళ్ళారు. ఆ సమయానికి నీలి యింట్లోలేదు. ఏటికి వెళ్ళింది. రాగానే ముసలమ్మ జరిగింది చెప్పగానే, చప్పున కరణం యింటికి పరిగెత్తింది. కరణం వూళ్లో బాలనాయకులతో పేకాటలో నిమగ్నుడైవున్నాడు. ప్రాధేయపడుతూ ఆపదనుంచి తప్పించమని ప్రతిమిలాడింది. కరణం వినిపించుకోనట్లుగానే వుంటూ "నివ్వెంత చెప్పినా లాభంలేదు. ఆ బుద్ధి నీ మొగుడికివుంటే ఈ గొడవంతా వచ్చేదా! ఈ రోజుల్లోనూ మంచిగా వుండి బతకగలమా!"

నీలి ఏంచెప్పినా కరణం పేకాటగొడవలో "వెళ్లు, వెళ్లు" అన్నాడు తృణీకారంగా. ఇంటికి వచ్చింది. ఏమివస్తుందో అని భయపడ్తూంటే, పుల్లయ్య వెటకారంగా, "యింక కొట్టుదగ్గరికి వస్తారే" అంటూ మీసాలు మెలివేశాడు.

కొడుకుతో అప్పుడే కుస్తీలకు దిగుతున్నాడు. మీసాలు మెలి వేయటం, తొడచరచటం నేర్పిస్తూంటే, నీలి అలా చూస్తూ కూర్చుండి పోయింది. "ఈసారి కొట్టుదగ్గరికి ఎవడైనావస్తే, నాదాకా యెందుకు? మల్లు సాలడా?" అంటూ బిగ్గరగా నవ్వుతూ కొడుకుని యెత్తుకొని వీధి లోకి వెళ్ళిపోయాడు.

ఈ సంఘటన జరిగిన నాలుగోరోజునే వూళ్లోకి పోలీసులు, ఎఫ్. ఎస్. ఓ, టి. ఎస్. ఓ. లు వచ్చారు. చిన్నచిన్న లైతులు వీళ్ళని చూడగానే ధాన్యం కొలిచారు. కొలుస్తూనే కళ్ళంట నీరు కారుతోంది. ధాన్యంకు వచ్చిన కాగితాలు కర్రపెట్టెల్లోకి విసిరారు కొందరు.

పుల్లయ్య మీసాలు తడుముకొని, కర్రపట్టుకొని, కొట్టుఅరుగు మీద కూర్చున్నాడు.ముసలమ్మ పెరటి గడ్డిమేటిదగ్గర పిడకలుచేస్తూంది. మల్లు ఉయ్యాలలో నిద్దరపోతున్నాడు. నీలి ఆకులు తొక్కి నొల్లటానికి తోటకు వెళ్ళింది.

ఈ దండుకుదండు పుల్లయ్యయింటిమీదకు వచ్చారు. టి. ఎస్.ఒ "నువ్వేనోయ్ పుల్లయ్యా?" అన్నాడు.

"సిత్తం"

"నువ్వుకొలవవలసిన పదిహేనుపుట్లు కొలుస్తావా? లేక జైలులో కూర్చుంటావా?"

"ఎందుకుబాబూ అలాగా కళ్ళెర్రచేస్తావ్?"

"నీ వుద్దేశం?"

"కొలవను?"

"నువ్వు కొలవకపోతే మేమే కొలుచుకుని, నీడబ్బు నీముఖాన్న పారేస్తాం" అని ముందుకు వస్తూంటే, పుల్లయ్యకు ఒళ్ళంతా రౌద్రంతో మండుకుపోయింది. బాణాకర్ర పట్టుకొని నిల్చుంటూ "అక్కడే ఆగండి, నా కొట్టుమీద సెయ్యిపడిందీఅంటే, మీ వీపులు పదునైపోతాయి. పది గరిశెలు పండినోడూ నానూ ఒకేలా కొలవాలా? ఈ దొంగరాతలతో మా కడుపు మాడ్చేస్తారా?"

"ఉపన్యాసం చాలించి లేస్తావా లేదా?" అంటూ టి. యస్. ఒ. ముందుకు చొచ్చుకపోతుంటే, పుల్లయ్య అటకాయించి గంభీరంగా వాడి

కళ్ళలోకి చూశాడు. ఇంతలో పోలీసులవైపు అధికారిచూసి సైగచేశాడు. వారు చుట్టు ముట్టూంచే, అధికారి కొట్టుగడప యెక్కబోతూంచే, పుల్ల య్యకు ఒళ్ళంతా పౌరుషంతో మండుకపోయి, "కొట్టు ముట్టక!" అని గట్టిగా గద్దించాడు. ఆ అరుపుకు అధికారి దద్దరిల్లినా,సగర్వంగా కొట్టును ముట్టుకోగానే, పుల్లయ్య ఒక్క వురుకు వురికి, ఆ యెత్తునుంచి, అధికా రిని త్రోసివేశాడు.

క్రిందపడ్డ అధికారికళ్ళు జేవురించాయ్. "పట్టుకోండి! బేడీలు వెయ్యండి!" అని అరిచాడు. చుట్టుముట్టి పోలీసులను విసరితన్నాడు. మండిపోతున్న కడుపుతో, నోరు యేమంటూందో తనేం చేస్తున్నాడో తెలుసుకోలేక, భీభత్సంగా మెసులుతున్నాడు. ఇంతలో నీలి వరుగెత్తుకు వచ్చింది. కాలరుద్రునిలా విహారంచేస్తున్న భర్తనుచూసి భయంవేసింది. ఉయ్యాలలో పిల్లాడు కేకలుపెట్టి యేడుస్తున్నాడు. ముసలమ్మ ఇటువేపు చూడలేకపోతూంది. నలుగురు పోలీసులు పటాపంచలుకాడానికి ఇంకెంతసేపోలేదు. వాళ్ళ లాటీలు పుల్లయ్య రాకెట్‌లా తిరుగుతున్న బాణాక్రమందు ఆగలేకపోయాయ్! ఊరంతా మూగిపోతున్నారు!

నీలి ఆ కోలాహలంలో తలమీదగంప క్రిందపెట్టి, మొగుడుకాళ్లు పట్టుకుంటూ, యేమంటూందో ఆ కోలాహలంలో ఎవరికీ వినబడలేదు. ముఖంలో ముచ్చెమటలు పోశాయ్. ఆ చెమట క్రిందనున్న పళ్ళెంమీద పడుతోంది.చుట్టూవున్నప్రజ ఇప్పుడు కనిపించారు తనకంటికి.కాళ్ళదగ్గర వున్నది తన పెళ్ళామేనని ఇప్పుడు గుర్తుకువచ్చి విసిరితన్నలేదు, ఆమె వైపు చూడగానే తనేదో నేరంచేశానేమోనన్న తలపు మనసులో చొచ్చు కపోయింది. ఇప్పుడే, ఇంతమంది మాట్లాడుతున్నా, కొడుకు యేడుపు చెవులోకి చొచ్చుకోపోసాగింది. ఇంతవరకూ తను ఈ ప్రపంచంలో లేనట్లనిపించింది. దెబ్బలుతగిలిన పోలీసులు మెల్లగా దగ్గరగా చేరుకుంటు న్నారు. వాళ్ళవేపు చూడగానే ఎందుకో కనికరంవేసింది. ఈ కండలు లేనివాళ్ళమీదనా తన బలం ఇంతసేపూ చూపించింది!" అనుకున్నాడు.

గబగబ అక్కడనుంచి కదలబోతూంచే, పోలీసులు పట్టు కున్నారు. వాళ్ళను విదిలించుకుంటూ ఇంటిలోనికి పరిగెత్తి, ఉయ్యాలలో ఏడుస్తున్న కొడుకుని ఎత్తుకుని, ముద్దులాడుతూ, "మల్లూ! నిన్ను కొట్టి

దగ్గర పెట్టాను కాదురా! ఈయేల మీ అయ్య మీసంలేనోలతో దెబ్బలా డాడు—ఈ మీసంవుండి యెందుకు?"

కొడుకు ఇదంతా తనకే అని విని అర్థంచేసుకున్నట్లు తండ్రివేపు చూశాడు. ఒళ్ళంతా సంతోషంతో ఆడించేశాడు, కానీ ఆ నిముషంలో ఇల్లంతా ఘొల్లుమంది! చేతికి బేడీలుపడిన పుల్లయ్య, అదేపనిగా కయ్ మంటున్న మల్లు వేపు చూస్తున్నా,ఇంకా చూడటానికి కూడా వ్యవధిలేక పోయింది. చేతులకు బేడీలతోనే నీలివైపు చూశాడు. ఆమె కళ్ళనిండా నీళ్లున్నయ్. ఆమె కళ్లు తనవేపుచూసి దాచగానే, తన్నేదో నేరం చేశానని అనుకోసాగాడు. అలానే ఇల్లు కదిలి, నడివూరుగుండా సంకెళ్ళతో నడు స్తూంటే దీనికంతటికీ కారకుడయిన రాజిగాడు ఇంటిఅరుగుమీద నిల్చుని చూసి సంతోషించాడు.

17

పీస, దాసుడు పట్నం పరుగెత్తారు; సాయంత్రం తిరిగివచ్చి మళ్ళీ రేపు బెయిలుకోసం వెళ్ళాలన్నారు. వకీలుని పెట్టాలన్నారు. ఇంట్లో డబ్బులేదు. ఎవర్ని అడుగుదామా అని నీలి ఆలోచిస్తూంటే, రాజిగాడి పెళ్ళాం ఇంటికి వచ్చి మంచీచెడ్డా మాటాడి, యాభైరూపాయలు అప్పు అడగకుండానే ఇచ్చింది. నీలి కృతజ్ఞత తెల్పింది.

మరుచటిరోజు పదిగంటలకు మళ్ళీ పోలీసులు మినహా ముందు రోజు బృందం వచ్చారు. వాళ్ళను చూడగానే నీలి బయటికి వచ్చింది.

నిన్న పరాభవింపబడ్డ అధికారి"ధాన్యంకొలవాలమ్మా"అన్నాడు.

నీలి మాటాడకుండా కొట్టుతాళం తీసుకవచ్చి తలుపు తీసింది. తీశాక అధికారిముందు నిలుచుని, సవినయంగా "బాబూ! అంతాపోగా మిగిలింది ఈ కొట్టులోనే యేసుకున్నాం. మదుపులకి తిండికి యేంవుంచి రచ్చిస్తారో? పెద్దబాబులు మంచీచెడ్డా మీకు తెలీదా? మీకు నాయం అని తోసింది సెయ్యండి" అంది.

అధికారికి ఆమె వినయంతో కూడుకున్న మాటలతీరు చూడగానే మనసు కరిగింది. కొట్టులోకి తొంగిచూసి దగ్గరగా వస్తూ, పట్నంలో

మీలాంటి ప్రజే వున్నారు. వాళ్ళని రైత్వారీప్రజ పోషించకపోతే వాళ్లు మలమల మాడిపోరా!"

"సిత్తంబాబూ! నలుగురూ సుకంగా వుంటేనే పెపంచకం నిలుస్తాది!"

"నేనూ మనిషినికానా—ఒక్క పుట్టెడుధాన్యంయియ్యి,ప్రొక్యూరు మెంటుకి" అన్నాడు అధికారి.

ఆమెముఖం వెలిగింది. "బాబూ రెండుపుట్లు తీసుకోండి" అంది.

అధికారి సంతోషించాడు. ఏజంటుకు పుట్టెడు ధాన్యమే కొలుచుకొని డబ్బు చెల్లించమని చెప్పి యింకోయింటి కెళ్ళాడు.

మందుపెండలో నడిచి పుల్లయ్య, పీస, దాసుడు పట్నంనుండి వచ్చారు.బెయిలుమీద విడుదలయిన పుల్లయ్యకు వీధివెంబడి రావటానికి సిగ్గుపడేసింది. పెరటిత్రోవవెంట వచ్చి ఇంటిలో దూరాడు. తండ్రికోసం యేడుస్తున్న మల్లు అయ్యను చూడగానే, సంతోషంతో కేకవేసి మీద కెక్కాడు. కొడుకుని నిమురుతూ "నా మల్లూ..:..సీపురుపుల్లలా అయి పోయావురా—ఈ ఒక్కరోజుకే....!" అన్నాడు.

పీస నవ్వుతూ "నువ్వూ ఈ కొడుకుని తలుచుకొని సీపురుపుల్ల య్యావు!" అన్నాడు.

నీలి ఈ అభిమానాలు స్థాయిలో పడేవరకూ మాటాడలేదు. పుల్ల య్యకు అన్నంతినేప్పుడు యెదురుగావున్న పెళ్ళంవేపు చూడటానికి సిగ్గు వేసింది. అంతలోనే తనను అన్యాయంచేసిన గ్రామపెద్దలమీదా, అధి కార్లమీదా కోపం లోలోన మందుకుపోతూంది. కొడుకు తనతో కలిసి తింటున్నాడు. నీలి యేమీ మాటాడకండా యెదర నిలుచుంది. ముసలమ్మ కర్రదువ్వెనతో వీధిఅరుగుమీద జుత్తుపీక్కుంటోంది. సాలలోని పోతులు తనవేపే చూస్తున్నయ్! అన్నం తిన్నాక అంబలిపోసింది. పుల్లయ్యకొడుకుకూడా తినటానికి పోతూంటే వద్దు అని ముక్కుమీద వేలువేశాడు. కొడుకు అలా ముఖంవేపు చూస్తూంటే దగ్గరగా తీసు కున్నాడు. ఇంతట్లో పుల్లయ్య పట్నంనుంచి వచ్చాడని తెలిసివూళ్లో చాలా మంది ఇంటికివచ్చి పలకరించారు. వాళ్లు వెళ్ళిపోయాక ఆత్మాభిమానం వుబికిపోయి, ఇంట్లో అటూఇటూ పచారుచేస్తూ ఘీంకరించాడు. దీనికి

కారకులైనవాళ్ళని పూరకనే విడిచిపెట్టనన్నాడు, మళ్ళా వచ్చి ధాన్యం యెలా తీసికెళ్తారో చూస్తానన్నాడు. ఈ గొడవకు ములసమ్మ "ఎందుకలా అయిపోతావు నాయనా? నువ్వు తిడ్తున్నావే వాళ్లూ మనుషులే! మనిషికి మంచిచెడ్డలుండక మానుకుంటుందా?" ఇంకా యేదో అనబోతూంటే పుల్లయ్య "ఊరుకో" అని ఖస్సుమన్నాడు. ములసమ్మ మాటాడలేదు. నీలి భర్త కోపంలో యెక్కువభాగం కక్కేవరకు వూరుకుంది. అరుగు మీదకు వెళ్ళబోతూ మళ్ళీ చటుక్కున జ్ఞాపకంవచ్చి పెరటిలోకి వెళ్లాడు. చుట్టుపట్ల గ్రామాల్లోకూడా గరిడీలో ఘటికుడైన పుల్లయ్య - నీతిమంతుడయిన మల్లునాయుడు కొడుకు, నడివీధిగుండా బేడీలతో వెళ్ళాడని తెలిసిపోయింది. కైదులో ఒకరోజు కూర్చున్నాడు-ఇది తనకెంత చిన్న రికం? తను కలలోనైనా ఇలా వస్తుందని అనుకోలేదు, ఇది నాయానికి కాలంకాదని మనసులో కాకండా బైటికే అనేశాడు. రాట్నం తిప్పుకుంటున్న నీలి ఈమాటలు విని "లోకాన్నీ కాలాన్నీ యెందుకంటావ్?"

"అనమా! ఊరు దిబ్బైపోదా?"

"ఊరుదిబ్బైతే మనం యెక్కడుంటాం? గేనం లేదా? యెగిరే మూది గాలిలో యెంతసేపు వుంటాదని? పువ్వు పెట్టునుంచేనే సోబ సక్కరం —"

"అయితే యేవంటావే?" అన్నాడు విసుగ్గా, కొడుకు యీ మూల నుంచి ఆ మూలకి ఆ-ఆ-అంటూ నడుస్తున్నాడు.

"ఆ కోపం, పౌరుషం నేకపోతే యీగొడవంతా ఎందుకొస్తాది?"

పుల్లయ్య మాటాడకుండా మీసాలు తడుముకున్నాడు. నీలి మొగుడి కళ్ళలోకి ఒకసారి చూసి మళ్ళీ రాట్నంవైపు దృష్టిపోనిస్తూ "నువ్వు ఏ బాబుకి తోసినావో ఆ బాబే, రెండుపుట్లు తీసుకోమంటే ఒకపుట్టే తీసుకున్నాడు.ఏ రాజిగాడ్ని నానామాటలన్నావోఆడిపెళ్ళమే,యేభైరూపాయలు యిచ్చి, నిన్ను ఇంటికి తెప్పించింది. నువ్వు ఒకరిని మంచిఅనకపోతే, నీకొకరు మంచిఅని యెందుకంటారు?"

పుల్లయ్య భార్యవేపు చూశాడు. ఇంకేమైనా అంటుందేమోనని ఎదురుచూశాడు. కాని ఆమె మరి మాటాడలేదు, కానీ ముఖంలో భర్త చేసినపనికి ఆమె అయిష్టత స్ఫుటంగా కనుపిస్తూనేవుంది.

పుల్లయ్య రెండురోజులవరకూ ఇల్లు కదల్లేదు. పలుకరించడానికి వచ్చేవారు వస్తున్నారు. ఇంట్లో పెళ్ళంతోనూ సరిగ్గా మాటాడలేదు. ఏం సన్నిహితంగా వుంటున్నాడో కొడుకుతోనే, ఆకొడుకూ తండ్రిని విడిచి పెటలేదు.

ఈకేసు వాయిదాలు పడుతూ వచ్చింది. ప్లీడరుకు ఇవ్వటానికి డబ్బు కావాలి. పట్నం వచ్చేటప్పుడల్లా యేదో ఖర్చు అవుతూనేవుంది. అమ్మటానికితగ్గ ధాన్యంలేదు. ఉన్నమట్టుకి అమ్మివేస్తే మళ్ళీ ఈధరల ఎద్దడిలో కొనుక్కోవటం కష్టం. అంచేత అప్పుడు విధిగా వెళ్ళవలసి వచ్చింది. ఎవరూ ఇదివరలా మాటమీద అప్పు ఇచ్చేవారులేరు. పేరుకు గవర్నమెంటు రేటు|పకారం నెలకు నూటికి అర్ధరూపాయి వడ్డీపత్రం మీద వుంటుంది. కానీ వడ్డీ చెల్లించేటప్పుడు ధాన్యరూపంగా సంవత్సరానికి నూటికి మూడుపుట్లు చెల్లించవలసిందే. ఈవడ్డీకి వూర్లో కోమటి పేరయ్యేకాదు. పెద్దరైతులంతా యెంతకావలిస్తే అంత యిస్తారు. యిది అన్యాయమని పుల్లయ్య అప్పుకి వెళ్ళలేదు. కాని వెళ్తేకానీ పీలులేని పరిస్థితి వచ్చింది, తన స్వంతభూమి అస్వాధీనంతనఖాకు పెట్టవలసివచ్చింది రాజిగాడి పెళ్ళమే రెండుపుట్లధాన్యానికి సీలి |బతిమాలగా యిచ్చింది.

తిరగ్గా తిరగ్గా వర్షాకాలానికి కేసులో తీర్పు ఇచ్చారు. ఈ అయిదు నెలలలోనూ రెండువందల వరకూ ఖర్చులయ్యాయి. మేజిస్ట్రేటు నూరు రూపాయల జరిమానా, అది ఇవ్వకపోతే రెండునెలల ఖైదు చెప్పాడు: ఆరోజున కోర్టు ఆవరణలో నవిరివూర్లోవాళ్లు ముప్పయిమందివరకు వున్నారు, పుల్లయ్యకు యెక్కడలేని పౌరుషం వచ్చింది. ఆ గద్దెమీద కూర్చున్నమనిషికి న్యాయంలేదని ఈ లోకంలోనే న్యాయం చచ్చిందని చికాకుపడ్డాడు. ఇలాంటి సమయంలో రాజుగాడిపెళ్ళం తన అక్కసంతా వెళ్ళగ్రక్కింది. ఏమన్నా సీలి మాటాడలేదు. ఊరకే వందరూపాయలు యిస్తున్నట్లు ుచ్చి నీ మొగుడుతో ఇదంతా సెప్పుతావనే అన్నాను ఎంతకాలం పద్దుపిద యిస్తాం: స్వాధీన తనఖాపత్రం రాస్తేగాని నీ మరది ఒప్పుకోనంటున్నాడు."

సీలి మొగుడితో ఆ సంగతి చెప్తానంది. సమయానికి ఆదుకున్నందుకు, ఆమెమేలు మరవనంది. పుల్లయ్య ఈసారి వారంరోజులవరకు

ఇల్లు కదల్లేదు. ఒక్క కొడుక్కి తనకే సంబంధం. కానీ రానురాను పొలానికి, పోతులకి పచ్చగడ్డికి వెళ్ళవలసివచ్చింది. వెళ్ళేవాడు కానీ తనేదో చిక్కిపోయినట్లు, తనను అంతా వేలెత్తి చూపిస్తూ హేళన చేస్తున్నట్లుగా బాధపడిపోయేవాడు.ఒక్కొక్కసారి కొడుకును తనభుజంమీద ఎక్కించుకుని నీలమ్మగుడికి వస్తున్నాడు. అక్కడ దాసుడు శివాలు వేస్తుంటేతండ్రికొడుకులు కూర్చునేవారు.చీకటిపడకండామనవణ్ణి ఇంటికి తేకపోతే ముసలమ్మ పుల్లయ్యతో కయ్యమాడేది. ఏగాలో ధూళో సోకితే పిల్లడు చిక్కిపోతాడని ఆమె భయం.

ఇంకా వరిచేను పండలేదు. నెలరోజులకిగాని పంట అందిరాదు. కొట్లో ఒకగింజలేదు. చోళ్లకూడా సరి. ఎవర్ని అప్పు అడగటానికీ పుల్లయ్యకు నోరు రాలేదు. నీలిరాజిగాడి పెళ్ళందగ్గరకు అప్పుకి వెళ్ళింది. అప్పటికి రూపాయకి అడ్డెడుబియ్యం ఇస్తున్నారు. కరువు హోరుమంటోంది! కంట్రోలుబియ్యం యెర్రగా మేకుల్లా వున్నాయ్! పశువులుకూడా తినవు! అవి కొద్దిగా చవుకగా వున్నాయని కొని దంచితే నూకలయ్యేయి. ఆ నూకలన్నం చూస్తూ తినలేకపోయేవారు. బయట కొనుక్కుంటే ఒక రూపాయకి అడ్డ. పైరుపంటలధరలు, ఉప్పు, పప్పు, నూనెధరలు విపరీతంగా పెరిగున్నయ్. ఉన్నవాళ్ళకి డబ్బు చేసుకోటానికి లేనివాళ్లు మల మల మాడిపోడానికి కొద్దో గొప్పో ఉన్నవాళ్లు అడుగంటిపోవడానికి ఇవేరోజులు. ఈరోజుల్లోనూ నీలిచెయ్యి కట్టివేయబడలేదు. ఎక్కడా ఏమీ దొరక్కపోతే ,చచ్చిపోకండా ప్రాణం నిలుపుకోడానికి ఒక్కెడు గంజి దొరికే నీలియిల్లు ఉందని కుష్టురోగికీ, వెంకన్నకు, గన్నెమ్మకు తెలుసు.

బియ్యం రూపాయికి అడ్డచొప్పున, చోళ్లు రెండడ్డలు చొప్పున ఇస్తూ ఆ అప్పు పంట వచ్చేసరికి మూడువందలయాభైనుంచి నాలుగు వందల యాభైకి రాజిగాడు పొడిగించాడు. పల్లపుబట్టిలో ఒకమాదిరిగా పండింది. మెరకబట్టిలో సగానికి సగం రద్దు. ఆ భూమిమీద పండిన పంటలో మూడింటరెండువంతులు వడ్డీకి వెళ్ళింది. మిగిలిన ఐదుపుట్లలో దానధర్మం, చాకలీ మంగలీ పోను ఇంటికిపచ్చింది రెండుపుట్లే! బుగత అంబారానికి సరిపోయింది ఆ పొలంమీద పంట! రెండుపుట్లతో ఒకఏడాది

గడపటమెలా? ఈ ఆలోచనలు వద్దన్నా పుల్లయ్యమనసులో చొచ్చుక పోయేవి. తను ఇదివరలా పుషారుగా లేడు.తను చిక్కిపోతున్నాడని తన పాతశిష్యులు అనుకుంటున్నారు. వాళ్ళలోనూ వయసు వచ్చింది—కానీ ఉత్సాహంలేదు. వాళ్ళ వయసులో తను యెంతహుషారుగా పుండేవాడు! వాళ్లు గరిడీలో ఘటికులు అనిపించుకోలేదే. చుట్టుపట్లవూర్లలో వాళ్ళలో యేవొక్కరిపేరూ యెవరికీ సరిగ్గా తెలియదు. ఈతరంవాళ్ళలో ఏదోలోటు కనిపిస్తూనేవుంది. గెంతే తనకొడుకునిచూసి గర్వించేవాడు. కడుపునిండా తృప్తిగా భోజనం చేసినట్లనిపించేది. "నాకొడుకుతరంవాళ్ళు మళ్ళా ఈ లోకంలో నాయం, నీతి నిలపరా? నాకొడుకు సుక్కల్లో సెందురిడిలా అగపడడా? ఈముండగా నాకేంనోటు?" అని తమాయించుకునేవాడు. ఇలా గర్విస్తూనే వూర్లో కొత్తగా కట్టున్న పెంకుటిల్లువేపు చూసేవాడు. కోమటిపేరయ్య గుడిసెపోయి డాబా యిల్లయింది. పరపతివున్న పెద్ద రైతులు పెంకుటిళ్లు కట్టించివేస్తున్నారు. ఇంటిమీద నిరుడు గడ్డివేసుకుని నేయించినవాళ్లు కొందరు, ఈ సంవత్సరం అదీ చెయ్యలేని పరిస్థితిలో వున్నారు. మనుషుల్లో మాటనిలకడ వున్నట్లు తనకు తోచలేదు. డబ్బుతో మంచీచెడ్డా, ఇంటా, బయటా, న్యాయం,నీతీ కొలవటం జరుగుతోంది. ఇదంతా చూస్తూ తలచుకొని తన జుత్తుకూడా పండిపోతున్నదేమో నన్న అనుమానం కలిగింది. ఈ దారుణ పరిస్థితులు చూసి, దాసుడు వూరిలో రాత్రనక పగలనక, పెద్దవారిసందరినీ, ఎక్కడపడితే అక్కడే అడుగు తూంచే నలుగురూ వాడు పిచ్చివాడయ్యా డన్నారు.

పీస ఏదో ఒకపూట పుల్లయ్యయింటికి వస్తున్నాడు. నీతికి నిల బడి బుగతకు అంబారం కొలవగా మిగిలినది అయిపోవచ్చింది. ఈపిల్లతో ఎలా గడపటమో తోచలేదు. మల్లును చేరదీసుకున్నాడు. వాడితో అడుకుంటూంచే కొంత ఈ విచారం మాయమయ్యేది. పీసతాత, భుజాలెక్కి బోసిపళ్ళతో ముత్యాలవర్షం కురిపించేవాడు.తాత, ముక్కు, మీసాలు, జుత్తూ ఒక్కొక్కసారి కోపంవస్తే పీకేసేవాడు.

శివరాత్రి వచ్చింది. ఊర్లో రువ్వవాళ్ళ కుటుంబాలు, వాళ్ళ యిష్ట దేముడికి సంబరం చేశారు. ఆప్పుడు గుండెకు తప్పిడిగుళ్లు కట్టుకొని ఆడాలి. వాళ్ళవి అసలే కలిగినకుటుంబాలు. ఈ ధరలో డబ్బు బాగా చేసు

కున్నారు. ఆచారప్రకారం పుల్లయ్యకూడా వెళ్ళి ఆడాడు. మల్లు తప్పిడి గుళ్ళ కడితేనేగాని పూరుకోలేదు. ఉపవాసంవున్న రువ్వ అప్పుడు దివిటీ పట్టుకొని ఆడుతున్నాడు. అలిసిపోయినట్లున్నాడు. చుట్టూ వున్నవాళ్ల "అలిసిపోయినావా నాసామి!" వాయిస్తూ గెంతుతున్నారు. తాళంవేస్తూ తండ్రిని అనుకరిస్తూ కొంతసేపు గెంతాడు. వడపప్పూ,అరటిపళ్లు పంచి పెట్టారు. ఇందులో పీసకూడా పాల్గొన్నాడు.,కానీ, ఎంతసేపో ఆడలేక పోయాడు. కాళ్లు పీకెట్టిపోయాయ్. ముందురోజు రాత్రి నోటిలో మంచి నీరు పోసుకొని నిద్రపోయాడు. ఇచ్చిన ఫలహారంలో కొంతలో మిగతా యింటికి తీసుకవెళ్ళాడు.

పుల్లయ్యకు కొడుకు తప్పించి ఈ లోకంలో,మరి దేనిమీదా లేదు. నీలి వేసినదేదో తినటం, ఏదో పొలంపని వుంటే చూసుకోవటం.మల్లుకి రెండున్నరేళ్ళ వయస్సు. ఇప్పుడు తండ్రివెంట పొలానికి ఎక్కడకు పడితే అక్కడకు వెళ్తున్నాడు. తల్లి అవసరమే తనకులేదు. తిండికూడా తండ్రితో కలియబడి తింటున్నాడు. పండిన పెసలు బుగతకియ్యగా విత్త నాలకు ఇంటిఅవసరాలకు వుంచగా, మిగిలినది అమ్మివేశాడు.

ఒకనాడు చీకటిపడింది.వంట అయిపోయాక ముసలమ్మ తిన్నది. వీధిలో అరుగుమీద ముసలమ్మ, మనుమరాలు కూర్చున్నారు. పుల్లయ్య కొడుకుతో సహా వీధిలోకి వెళ్ళాడు. ఆ సమయంలో యేదో గొణు క్కుంటూ ఘీంకరించుకుంటూ, నడుస్తూనే శివాలువేస్తున్నట్లుంది దాసుడు. అసలు ఆకలితో దహించుకుపోతున్నాడు. దీపం వెలిగించటానికి నడు స్తున్నాడే కాని తూలిపోతున్నాడు. ఆ వైఖరిచూస్తే తాగినవాడనో, పిచ్చి వాడనో, అనుకోవచ్చు. పుల్లయ్య ఇంటివైపు చూడగానే ప్రాణం వచ్చి నట్లయింది. "నాయనా! పుల్లిగా...." అంటూ అంగట చతికిలపడ్డాడు.

నీలి "యీదిలోకి యెల్లాడయ్యా" అని జవాబిచ్చింది. ముసలితనం బాగా మీదపడినట్లుంది. మాటలు పెగలకుండా వున్నయ్. కాని అలా చూస్తూ తడబడుతూనే "ఆ తల్లికి,....కోపంవచ్చినాదంటే....భూ.... చక్రం....భుగ....భుగలాడి....పోతాది....ఎంతకని.... యీలందరినీ సెమించమని....పాదాలు పట్టుకోవటం....దీపం యెలిగించి...."

ఆయాసంతో మరి మాటాడలేకపోయాడు. కొద్దినిమిషాల్లో ఆకలి జయించింది. ఒళ్ళంతా ఆవరించిన ఆ దావాగ్ని దాసుడ్ని మూర్ఛపుచ్చ డానికి ప్రయత్నిస్తోంది. కానీ, దాసుడు చావుబతుకుల్లో కొట్లాడుకొం టూనే "తల్లీ! అంతా మాయ....సావు పిలుస్తోంది....తల్లీ!...."....

నీలి చప్పున గదిలోంచి బుడ్డితెచ్చి దాసుడ్ని చూసింది. ప్రాణం అక్కడే ఒదిలేస్తున్నాడేమోనన్న భయంవేసింది. కళ్ళుమూస్తున్న దాసుడు చెయ్యి సైగచేశాడు. నీలి వంటయింటికి పరిగెత్తి గిన్నెడు అన్నంతెచ్చి, చప్పున కలిపి, గబగబ దాసుడినోటిలో కుక్కింది. జఠరాగ్నికి దహించ డానికి ఆహారం దొరకగానే దాసుడు కళ్లువిప్పాడు. కళ్ళంట నీరు బొట బొట కారటం మొదలెట్టింది. యెడమచేతితో కంటినీరు తుడుస్తూ, కుడి చేత అన్నం కుడుపుతూ, ఆ విగ్రహంవేపు చూస్తూంటే, యెక్కడలేని జాలీ దుఃఖం పెనవేసుకొచ్చింది. కళ్ళల్లో తిరిగే కన్నీరు కార్చకండా చీరకొంగుతో ఒత్తుకుంది.

దాసుడు మంచినీరు చివరకు త్రాగి, అలా గోడకు చారబడి అల సట తీర్చుకున్నాడు. ఎంతసేపటివరకో మౌనం త్రుంగివేసింది. చివరకు లేస్తూ నడవబోయి ఆగాడు. అభిమానం అంతాకూడి కళ్ళల్లో,నీరయ్యింది "అమ్మా! నీలమ్మతల్లీ! ఈ దాసుడికి యెన్నాళ్ళకు కనిపించావు తల్లీ!" అని అనుకుంటూ మెల్లమెల్లగా అడుగులు వేసుకుంటూ వెళ్ళిపోయాడు.

18

దాసుడు వెళ్ళాక పుల్లయ్య మల్లుతో వచ్చాడు. నీలి యింకా దాసుని గురించే ఆలోచించుతూ కూర్చుంది. పెళ్ళం యేనాడో చచ్చిపోయింది. ఉన్న ఒక్కకొడుకూ త్రాగుబోతు - పిల్లలు! కోడలేమో గయ్యాళి. ఆస్తి పాస్తి ఆ మంగలి పొడే. దానిని పూర్తిగా నమ్ముకుంటే బ్రతికేవాళ్ళే! పాపం! ఈ ముసలికాలంలో దాసుడికి ఎంతకష్టం వచ్చిపడిందో నని నీలి విచారించింది.

మల్లు తల్లియెదురుగా గెంతులేస్తూ "ఛినక్ ఛినక్ సో!" అంటు న్నాడు. నీళ్ళాడివున్న నీల ముసిముసినవ్వు నవ్వుకుంది. పుల్లయ్య చాల

కాలానికి గూటాలు త్రిప్పాడేమో ఆకలివల్ల, వేసినమట్టుకు లేదనిపించి పెళ్ళంవేపు చూశాడు. కొడుకుకూడ ఖాళీఅయిన కంచుకంచంవేపు తల్లి చూడలేదేమో నని కామోసు చూపిస్తున్నాడు. పుల్లయ్య నీలివేపు యెగాదిగా చూసి లేచిపోయాడు. మల్లుకూడా తండ్రిని అనుసరించాడు.

మనుమడిని మంచంమీద వేసి పాటతో నోరు కదుపుతోంది ముసలమ్మ. కొంతసేపటికి తండ్రి దగ్గరవుండి మీద చెయ్యివేయటం చేత మల్లు నిద్రపోయాడు. ఒక కంట భార్య యేంచేస్తున్నదోకనిపెట్టూనే వున్నాడు.

నీలి వంటయింటి పనులు పూర్తిచేసి గదిలోకి వచ్చింది. ముసలమ్మ ఒకమూల దొర్లుతోంది. దొర్లుతూ యేదో "నాయుడొరి బొట్టాట నారాయణమ్మ" అంటూ పదం రాగాలుతీసుకుంటూ పాడుకుంటోంది. పుల్లయ్య పోతులకు గడ్డివెయ్యడానికి వెళ్ళాడు. నీలి పెరటికిలోని కెళ్ళి నిల్చింది. చీకటిరాత్రులు. ఆకాసమంతా చుక్కలతో నిండిపోయింది. పోతులు నిల్చొని గడ్డి నములుతున్నయ్. ఈరాత్రికి సంతోషంగా పస్తున్న పెళ్ళంవేపు పుల్లయ్య చూశాడు. తను అంత యెక్కువ యెందుకు తిన్నానా అని బాధపడ్డాడు. దానితోపాటు ధాన్యం ఆఖరైందనే తలపుకూడా వచ్చింది. ఆ భూమిమీద యింకా అప్పుతెచ్చి తిరిగే అది ఈ సంవత్సరమే మునిగిపోతుంది. తరవాత....?

పుల్లయ్యవచ్చి పెళ్ళందగ్గర నిల్చున్నాడు. ఆమెను చూస్తూంటే చూడాలని సంతోషం, గర్వం. అయ్యో యిద్దరు పస్తున్నారే అని జాలి వేసింది. ఎందుకు తినలేదని అడగడానికి సిగ్గువేసింది. కానీ యేదో విధంగా ఈ ప్రశ్నవేస్తేగాని మనసు కుదుటబడలేదు. ఆమెభుజంమీద చెయ్యివేసి వెనుక నిల్చున్నాడు. నీలి కన్నెత్తిచూసింది. మెల్లగా బుగ్గ నిమురుతూ....

"కొట్టు కాలీఅయిపోనాదా?" అన్నాడు.

"ఈ వేళతో సరి" అంది.

"నాకేమీ మనసు బాగులేదు. కాలమానం చూస్తుంటే బయంయేస్తంది. ముందు ముందు బుక్కెడు గంజైనా దొరుకుతాదో లేదో?" అన్నాడు.

నీలి నెమ్మదిగా అంది: "ఎందు కలాగ నేద్దే అనుకోవాలా ఒళ్లు గట్టిగావుంటే ఒకరికింద చాకిరీచేసినా కడుపు జరిగిపోతాది!"

ఈ చాకిరీ అన్న పదం పుల్లయ్యకు నచ్చలేదు. తన తాతల దగ్గరనుంచీ వున్న హోము, మంచీ మర్యాదలు తన రక్తంలో యింకిపోయినయ్. అవే బాధపెట్తున్నాయ్.

"రేపటినుంచీ మళ్ళీ ఆ రాజిగాడేనా గతి!" అన్నాడు.

భర్త గొంతుకలో నిరాశ స్పష్టంగా కనిపించడంతో నీలి చిరునవ్వు నవ్వి భర్తవేపు తిరిగింది.ఆ గిరజాలను మెల్లగా నిమురుతూ గుండె మీద తల ఆన్చి "సూడు! ధయిర్యమే లచ్చిందేవి అంటారు. పెసలు అమ్మిన డబ్బుపెట్టి దాన్నం కొంటాను. దంచినబియ్యం వేపారంసేద్దాం. మిగిలిన తవుడు పోతులకీ, నూకలు జావకీ! ఏమైనా బియ్యంవుంటే అన్నం వండుకుందాం!"

"మన యింటలేదు ఈ పని" అన్నాడు.

"మనం బిచ్చమెత్తుకోలేదుకదా!వేసవిలో సోడిపంట కలిసొస్తాది. కోమార్తి యెళ్ళి నీరఇత్తనాలు తీసుకరా.గుడ్డిమీద పాదులేద్దాం. బీరకాయలు సంతకి తీసికెల్తే డబ్బుదాదా?"

పుల్లయ్యకి ఈ మాటలన్నీ కొత్త కొత్తగా అనిపిస్తున్నాయ్. తన కుటుంబ తాహతుకు హోదాకు తగ్గపనులు ఇవేవీ కావనిపించాయ్.

"నా కేమీ — మనసు బాగునేదే...."అన్నాడు.

నీలి తలెత్తి భర్తకళ్ళల్లోకి చూసింది. పుల్లయ్య అన్నాడు "ఈ రాజిగాడు మనబూమి మింగేద్దామని సూస్తన్నాడు. పిల్లలు పుట్టున్నారా? వాళ్ళకి యేం ఇస్తాం?ఊరు ఊరంతా అన్నాయంతో అట్టుడికిపోతోంది. ఈ.పెద్దోలందర్ని గవుర్నమెంటోడు కైదులో పెట్టేస్తే!"

నీలి చప్పున అందుకుంది. ఒకరిమీద అనుకొనేబదులు మన సెద్దేంటో తెలుసుకుంటే మంచిది. అలాగ పండితే మనకూ డబ్బుమీద ఆశవుంటాది. ఈడిసావు, ఆడి కైదు ఎందుకో కోరాల!పాపం వస్తాది. నా బతుకు నేను కష్టపడి బతుకుతానంటే ఈలంతా యేం సెయ్యగలరు?"

"సెయ్యరా, బతకనిస్తారా?"

"ఎవరిపాపం వాళ్ళనే తింటాది. నివ్వూ, నేనూ వాళ్ళని తింటామని పాపిష్టోలమవుతామా, కాళ్లూ, సేతులూ వుండగా బతకలేమంటా వేమిటి, కాళ్లూసేతులు ఆ జబ్బు తినేస్తే ఆ కుళ్ళురోగే బతికిపోతున్నాడు. అందరూ మనుసులే---అందరూ బతకడానికి ఈ మన్నున్నాది. ఒక్కసెట్టు కాయలే ఒకలాగుండవు. అంతా నీ సేతులో వున్నాదనుకోని, అన్నిటికి నివ్వే పెద్ద గొప్పవాడివి అనుకోని ఉండబట్టే యిలాగైపోతున్నావ్. ఒకరిమీద మనసులో సెడ్డపెట్టుకోని యేం తీసుకపోతాం! మనుసులంతా మంచోలే! నీబట్టి నా మంచి—నా బట్టి నీమంచీ వుంటాది. ఒకరికి సెడ్డ అనుకొని సూస్తే వాళ్ళమంచేం సూస్తావు?"

ఇంతసేపు మెల్ల మెల్లగా నీలి అంటుంటే ఒక్కమాటా మొగుడు ఆడలేకపోయాడు. ఆమెను తాకి అలా ఆకాశంవేపు చూస్తుంటే ఆ చుక్కలు....వెలుగులూ....యింకా అవేవో అనుభూతులు....ఓ క్షణం ఈ ప్రాపంచిక విషయాలూ వాటిపై ఆసక్తి....అన్నీ మరచిపోయాడు. తనలోవున్న ద్వేషాలు పటాపంచలయిపోయినట్లనిపించింది. తల వంచే సరికి భార్య మోము ఆ వెలుగులో వెలిగినట్లయింది. ఆమెను గట్టిగా హృదయానికి హత్తుకుని ఆ తలను మనస్ఫూర్తిగా నిమురుతూ కళ్ళల్లో అభిమానం అంతా నింపేశాడు!

తెలివి తెచ్చుకున్న మల్లు ప్రక్కన అయ్యలేకపోవటంతో 'అయ్యా' అని మూలుగుతూ కేకవేశాడు. చెయ్యివేసి ప్రక్కన పడుకుంటేగానీ మళ్ళీ నిద్దరపట్టలేదు. నీలి క్రింద కోక వేసుకొని పడుకుంది.పుల్లయ్యకు నిద్దర పట్టలేదు. ఎన్నో ఆలోచనలు వచ్చి పడుతున్నయ్. ఇదివరకు తను ఆలోచించి యెరగడు. దేనికీ బాధపడీ యెరగడు. ఇప్పుడు అన్నీ ఆలోచనలే....ప్రతి ఆలోచనా బాధే! ఈ ముసలమ్మ టోకుర్లు తీస్తోంది. ఎప్పుడు వూపిరి ఆపేస్తుందో, దానిక్రింద దిన వారాలకి యెంత ఖర్చు? నలుగురు కులంవాళ్లనీ పిలవకపోతే నామోషీకదా?

కొడుకు తినడానికి వచ్చే కాలానికి ఇలాగ పరిస్థితులు వచ్చాయే అని విసుక్కున్నాడు. పొలం అయిపోతుంది. రాజిగాడు వచ్చేయేటికి మింగేస్తాడు. ఇంక బుగతపొలం వున్నాది. వాడు నిలకడలేని మనిషి!

ధరలు వస్తున్నాయికదా అని అమ్మేస్తే, ఎలాగమ్ముతాడు. తాతలకాలం నుంచీ దున్నుతున్నాంకదా, ఏమో అమ్మేస్తే — కొనుక్కోడానికి డబ్బు వుంటే యెంత బాగుండేది. ఆ దాన్నం సంవత్సరం అంతా తినగా నీలి యెందరికి చెయ్యి దులిపినా సరిపోయేది. డబ్బెక్కడిది, అమ్మడానికి యెన్ని గుండెలుండాలా — ఇలా ఆలోచించి నీలి సెప్పినదే సరియైనదని పించింది. తెల్లారుజామున లేచాడు. మల్లు యింకా నిద్దరపోతున్నాడు. పెళ్లాంతో చెప్పి బీరవిత్తనాలు తేడానికి కోమార్తిగ్రామం వెళ్ళాడు.

మేలొక్కన్నమల్లు అయ్యలేకపోవటంతో సాలలోనికి వెళ్లాడు. అక్కడ అయ్యలేడు. "అయ్యేడీ" అని అడిగాడు. ఒకపోతు తలాడించింది. ఇల్లంతా చూశాడు. అరుగుమీద చూశాడు. గబగబ నోరు, ముఖము కడుక్కుంటున్న మామ్మజుత్తు వెనుకనుంచి పట్టుకొని "అయ్యేడీ" అని అడిగాడు. "ఉహూ!" అన్నాది; యెక్కిరించాడు. అమ్మ అలావస్తే "అమ్మా, అయ్యేడీ!" అన్నాడు. "కోమార్తి వనిమీద యెల్లాడు, వస్తాడు. మామ్మ ముకం కడుగుతాది — యెల్లు" అంది. అమ్మ.

"అయ్య రావాల!" అని భీష్మించుకొంటూ వాకిట మఠంవేసుకొని కూర్చున్నాడు. పొద్దు బాగా యెక్కింది. ఇంకా అయ్యరాలేదు. కళ్లు కాయలుకాసిపోయాయి. రాను రాను ఆ కళ్ళల్లో నీరు నిండుకుంటున్నాయి. గొంతుకకూడా గురగురలాడుతోంది. ఇంకా అయ్యరాలేదని యేడవడానికి యింకెంతసేపో పట్టదు — అదిగో! అయ్య అగుపించాడు. ఒక్కగెంతేసి పరుగెత్తి అయ్యమీదవాలాడు యెత్తుకోగానే ఆనందంతో వుబ్బి తబ్బిబ్బయ్యాడు. కొడుకుని యెత్తుకొని వస్తుంటే, ముసలమ్మ అంది: "వాడు అమ్మకొడుకా అయ్యకొడుకా?"

మల్లు తండ్రివంటిమీద తూలుతూ, గెంతుతూ, నవ్వుతూ "అయ్య! అయ్య!!" అన్నాడు.

ఆరోజే ధాన్యం కొన్నారు. వూరంతా పుల్లయ్య బియ్యంవర్తకం చేస్తున్నాడని తెలిసిపోయిందని పుల్లయ్యకు సిగ్గువేసింది. వారంరోజుల్లో నీలిచెప్పిన లాభాలు కనిపించాయి. పుల్లయ్య ధాన్యం దంపడం, నీలి చెరగటం. ఇలా వేసవివచ్చింది. కళ్ళాల్లో కొట్టవలసిన కొందరి చొప్పకుప్పలున్నాయ్. ఏవో దొంగతనాలు జరుగుతున్నాయని పెద్దరైతులు అనుకో

వడమేగాని, దొంగని పట్టుకోలేకపోతున్నారు. నీలి చేతితోనూ, మల్లు చేతులతోను వేసిన బీరపాదులు పువ్వులు పూశాయి. పిందెలువేశాయి. యేతాలతో నీలు యేటినుంచి తోడి చోడిపంటవేశారు. పుల్లయ్యకు ఈ రోజుల్లో చేతినిండా పనివుండటంవల్ల ఆట్టే లేనిపోని ఆలోచనలకు తావు లేకపోయింది. నీలి పైవాళ్ళ చోడివూడుపులకు, గొప్పులకు, కూలికి వెళ్ళటం పుల్లయ్య ఇష్టపడలేదు. నలుగురూ ఈ విషయం యేదో హీనంగా అనుకుంటారనీ, అనుకున్నారనీ వెత్తన్న పెళ్ళాన్ని పుల్లయ్య వద్దన్నాడు. ఆమె యెంతో నచ్చచెప్పింది కష్టపడి తెచ్చుకున్నప్పుడు సిగ్గెందుకు పడాలని ఆమె వాదన. యెప్పుడోగాని రాజిగాడిదగ్గరకు అప్పుకువెళ్ళే అవసరం రాలేదు. వరి ఊడుపులకు, దుక్కులకు, మెుపుకు అవసరం వచ్చేటప్పుడు రాజిగాడిదగ్గరకు వెళ్లవలసివచ్చింది. మూడు సంవత్సరాలు నిండుతున్న మల్లుకూడా అప్పుడే గోచీపెట్టి చేతిలో చిన్న ముల్లుకర్ర తోనూ, ముక్కులో చిన్న బంగారంకమ్మి, మెడలో వెండి అత్తికర్రల తోనూ అయ్యకు సహాయంచేసేవాడిలా బయలుదేరుతున్నాడు. పారా, బొరిగె పట్టుకొని గడ్డి తవ్వటం నేర్చుకుంటున్నాడు. వూడుస్తున్నప్పుడు "నోమీ నోమల్లాల" అని పాడే ఆడమ్మలతో గొంతుక కలుపుతున్నాడు. వరియాకు కట్ట క్రోవలో గైరమ్మగాపెట్టి దారినపోయేవాళ్ళను డబ్బులెయ్యండని అడుగుతున్నాడుకూడా. పోతులను "హేయ్! హేయ్!" అని యేటిలోనికి వెళ్ళిపోతున్న పోతులను పిలవటంకూడా తెలుసు. బలవంతాన అయ్యచెయ్యి లాగుతూ గూటాలున్న చింతచెట్టుక్రిందికి తీసుకవెళ్ళి అయ్యను తిప్పమనడం, అయ్య గూటాలుపట్టుకొని త్రిప్పుతుంటే తను వుత్తిచేతులు త్రిప్పటం చేస్తున్నాడు. తండ్రి సంతోషంతో కొడుకుని మీదికియెత్తి ఆ చిన్నిపాదాలు పట్టుకొని గాలిలో నిల్చోపెట్టే మొదటి కొద్దిగా భయంవేసినా, రానురాను ఆ భయంపోయి ఇప్పుడు తొడ చరచడంకూడా తెలుసు, భళీ అంటే పుల్లయ్య-మల్లు "భళీ! భళీ!" అని అరుస్తాడు

పనిపాట్లు అయిపోయాయి. మళ్ళీ కావలసినంత తీరుబడి. వర్షాలు కురుస్తున్నాయి. వెలుస్తున్నాయి. యేరు—గెడ్డపారుతోంది. పెదేరు వచ్చే

టప్పుడు జీలుగుతెప్ప పట్టుకొని కర్రలు పుల్లయ్య తీసేడు. నీలి ఒడ్డున వుండి చెత్త పోగుచేసి అధీ,మొగుడు తీసినకర్రలూ యింటికి మోసింది. మల్లు "అయ్యతో తెప్పమీద యెల్తానని యేడ్చేవాడు "పెదేరు సూసి జడిసి పోవాలకదా అలాంటిది మల్లుగాడికి యేంటి ఆ ధైర్నం!"అని మనిషోలా ఆశ్చర్యపడ్డారు. ఈలోగా ధాన్యంధరలు, దానితోపాటు మిగతా జీవితావ సరాల ధరలు పెరిగిపోతున్నయ్! గరిసెధాన్యం ధర పదమూడువందల వరకూ పెరిగింది! అంటే రూపాయికి మూడుసోలల బియ్యం! పుల్లయ్య ఒక్కడూ రూపాయి బియ్యపు అన్నం ఒక్కపూటకే లేదనిపించగలడు. కాని జరుపుకోవడంవల్ల అదే యింటిఅందరికీ ఒకరోజుకు వస్తోంది.

పీస, రోజూ వస్తున్నవాడు, ఈమధ్య నాలుగురోజులు మనుమడు దగ్గరకు రాలేదు, ఐదోరోజు సాయంత్రం వచ్చేసరికి మల్లు "తాతా" అంటూ యెదురెళ్ళాడు.మల్లుని భుజాన్నెక్కించుకొని గుర్రంలా గెంతుతుంటే పకపకా సంతోషంతో మల్లు నవ్వుతున్నాడు.

"సీతకానోడివిరా"అన్నాడు పుల్లయ్య మల్లుని దించి అరుగుమీద కూర్చుంటున్న పీసతో. ఇంతలో నీలి యిటు వచ్చింది. నీలిని మధ్య పెట్టుతూ, "సూడే కూతరా!ఆ బుగతోడిది భూమి. దరలు సాలా సెడావుగా వున్నాయి. ఇది అమ్మితేకాని బుగతకూతురికి పెళ్ళికాదు! మనం యెలాగ కాదంటామే,"

"మీ అయ్యకాలంనుంచి దున్నుతున్నావుకాదా, నీదా ఆడిదా హక్కా?" అంటూ పుల్లయ్య "బుగతను నా షోలంమీద కాలుపెట్టమను, ఎంత ఆలముత్తాతలు గడించినా?" అన్నాడు.

నీలి నవ్వుతూ "ఇంకో నూరురూపాయిలు...."

పుల్లయ్యకు ఆత్మాభిమానం రేకెత్తి "సూడవా! యీసారి పిల్లనై పోనులే" అంటూ మీసాలు మెలివేశాడు. పీస నీలి నుద్దేశించి "ఆలు అమ్మకుంటామంటే మనం కొనలేము – రాయే కూతరా - పుట్టించినోడు పెట్టకపోడు - మనల్ని నమ్మి బుగత పొలమిచ్చాడు, ఆ ణాబు కవుసరం వచ్చింది అమ్మేస్తున్నాడు. నమ్మినోడికి ఆ దెలాంటోడవనీ ద్రోహం సేస్తే మనకిజరగదే కూతరా! నాకు ముట్టసెప్పవలసిందేదో ముట్ట చెప్పాడు"

సీలి తనతో ఏకీభవిస్తున్నట్టుగా ఆమెవైఖరినిబట్టి పోల్చుకున్నాడు. ఈమాట ఆమాట ఆడుతూ "వూర్లో దొంగతనాలు హెచ్చిపోతున్నాయే. పిల్లలగల్లోడ్ని, జరక్రా నానే సేస్తన్నానని కొందరు గుంటకాయల అనుమానం. లేదమ్మా! ఇలా రెండురోజులకి బుక్రాడుగంజి చట్టెడు అంబలి తాగి యెందుకు బతుకుతున్నానని. నాకింతమంది పిల్లలా — ఈలంతా కష్టపడ్డానికి భూమిపుట్రో, వుద్యోగం సద్యోగం ఏదో నా గవుర్నమెంటోడు పెద్దోడైతే సూపించడా? ముందుకున్నాయే కూతరా మంచిరోజులు" అన్నాడు.

ఆ విశ్వాసంతోనే జీవిస్తున్న పీస చాలా సేపటివరకూ మనుమడితోఆడుకొని యింటికి వెళ్ళిపోయాడు.

19

సీలికి కూతురు పుట్టింది. కొడుకు పుట్టినప్పుడు ఉన్నంత వుత్సాహంగాని, పరిస్థితులుగాని ఇప్పుడు లేవు. "పిల్ల సక్రాగా వుంటాదని" అందరూ అంటున్నారు. పుల్లయ్య కూతుర్ని ఒక్రాసారే సరిగ్గా చూశాడు. "దీనికి మంచిమొగుడిని సూడాల" అనుకున్నాడు. ముసలమ్మ ఆనందం యింతాఅంతా కాదు. "ఇంటికి పేరుతెచ్చినా కీడుతెచ్చినా ఆడపిల్లేతెస్తాది. ఫలానోల బొట్టె బీదాబిక్రాని ఒకకంట చూస్తుందంటే ఆ తల్లీ తండ్రికి యింకేంకావాలా?" అని ఆమె వుద్దేశ్యం. వచ్చినవాళ్ళెవరైనా "సెల్లిని తీసుకపోతారా!" అని అంటే మల్లు కర్రపట్టుకొని గుమ్మందగ్గర కాస్తున్నాడు.

ఇంకా కోతలు పట్టలేదు. వూర్లో పరిస్థితులు చాలా అధ్వాన్నం అయిపోతున్నాయ్. దొంగతవాలు హెచ్చవుతున్నాయని పెద్దవాళ్ళంతా అంటున్నారు. కానీ దొంగలు దొరకలేదు. సరుగుడుతోటల్లో చెట్లకుచెట్లే రాత్రులు మాయమౌతున్నాయి. ఒకయింట్లో అన్నంవండిన కుండతోసహా మాయమయిపోయింది. ఇంకోయింట్లో వాకిటవేసిన కట్ట కట్టలాగుండే, లోన సగంపెసలు ఖాళీఅయిపోయాయి. కోడిపెట్టలు, పుంజులు లెక్రా లేవన్ని అగుపించలేదు. నాయుడు సరియైన కట్టుబాట్లేమీ చెయ్యలేదని

అనవలసినవాళ్లు అన్నారు. వున్న ముగ్గురు తలారులనూ వూర్లో రాత్రులు తిరగాలని నాయుడు పెళ్ళాం ఆర్డరువేసింది. యిద్దరు తలవూపారు. మూడో వాడు మాలరామిగాడు కాదన్నాడు. పొడుగ్గా, భారీగా వుంటాడు. పిల్లలు తిండితినకపోతే వీడిపేరు సెప్తేసరి తిండి కడుపులోకి పోతుంది. యేమా పైనా యధార్ధంగా యెదురుగుండానే అనేస్తాడు-ఆది తహశీల్దార్ అవ్వనీ --నాయుడు పెళ్ళమవ్వనీ తనకేం భాతరులేదు. వూరి యీ చివర కేక వేశాడంటే ఆ చివరకు వినబడవలసిందే! తనకొడుకు వ్యవసాయం చూసుకుంటున్నాడు, మనుమడు వుద్యోగంచెయ్యడానికి చదువుకుంటు న్నాడు. రామిగాడు ఒకరి నౌక దమ్మిడీ అడుగడు. తనదగ్గర యేమున్నా యెవరడిగినా లేదనడు. దీనివల్ల పెళ్ళం. కొడుకూ యేకమైపోయారు. పెళ్ళం మొట్టికాయలు పెట్టినట్లు మాట్లాడినా ఆ పెద్దనోరుతో పకపక నవ్వుతాడు.

"దొంగసుపట్టి యేంసేయమంటావు తల్లీ?" అని అడిగాడు ఆమెను.

"ఈడ్చుకురా — పంచాయితీ పెట్టించి"

"పెట్టించి కొరడాదెబ్బలు కొట్టిస్తావమ్మా! రాయమ్మా ఈ కడుపు కాలనంతసేపూ అంతా సీతే — కాలితే తెలుస్తాది. గెంజితాగి బతకటానికి యెవడు దొంగతనంచేసినా అడిమీద ఈగవాలడానికి వీల్లేదని" ఖచ్చి తంగా చెప్పాడు. యిలా చెప్పినా తను రాత్రుళ్లు తిరగడం మానలేదు. మిగతా యిద్దరూ ఒకప్పుడు యెవరినైనా పట్టితే విడిపించటానికి.

వారంరోజులు తిరిగారు. దొంగతనాలు వూర్లో తగ్గాయి. కాని తోటల్లో జరుగుతున్నాయ్. ఇద్దరు కాయలేని నౌకర్లు రానురాను ఇంట్లోనే కావలాకాశారు. అలా నెలరోజులు గడిచిపోయాయి, యెప్పుడు కోతలు మొదలుపెట్తారా అని వ్యవసాయపు కూలీజనం యెదురుచూస్తున్నారు. వెంకన్న గన్నెమ్మలవంటి అనాధుల పరిస్థితి చాలా విషమంగా వుంది. నీలిదగ్గరకు వెంకన్నకు పెళ్ళటానికి మనసు పుట్టలేదు. అమ్మా అని వెళ్తే ఆమె కుంచుకోకుండానే వున్నది పోసేస్తుంది. పోసి, నోటినిండుగా అభిమానంగా మాటాడుతుంది.అది బుక్కెడుగెంజైనా కడుపునిండిపోయి హాయిగా వుంటుంది, గన్నమ్మమాత్రం మొగమాటపడలేదు. నీలి ఒక్క సారీ విసుక్కోలేదు. రాజిగాడి పెళ్ళంకూడా నలుగురి బీదాబిక్కికి లేద

నకుండా ఒకకంట చూస్తాదని విన్నాడు. కాని వెంకన్నకు ఆగుమ్మంలో దేహీ అని వెళ్ళటానికి యిష్టంలేదు. అక్కడ కెళ్తే తనకు జరిగినదంతా తలపుకు వస్తుంది. తను గుడ్డివాడైనా అంతా కనిపిస్తుంది. ఒళ్ళంతా దుఖం పౌరుషంతో ముడుచుకుపోతోంది.

ఒకనాడు అప్పుడే చీకటిపడుతోంది. ఆకలితో వెంకన్న, గన్నెమ్మ బాధపడుతూ నీలమ్మగుడిదగ్గర పలకరాయిమీద కూచున్నారు. ఇంతలో దాసుడువచ్చి గుడిలో దీపం వెలిగించాడు. శివాలువెయ్యక మౌనంగా కళ్ళుమూసి తల్లియెదురుగా కూర్చున్నాడు. తిరిగి వెళ్ళిపోయేటప్పుడు ఇద్దర్నీ పలుకరించాడు. "ఈకరువు యెప్పుడు పోతాది?" అని అడిగింది దాసుడ్ని. "లోకంరాత బాగునేదే? అంచేత మంచోలకీ సెడ్డబుద్దులే పుడ్తున్నాయ్! ఆనాడు యెంతబతుకు బతికావు? నీరాత తిన్నగా లేకదా అడుక్కుంటున్నావు" అంటూ కదిలాడు.

గన్నెమ్మ ఒకప్పుడు గొప్పబ్రతుకే బ్రతికింది. యెంతో భాగ్య భోగాలతో తులతూగింది. గొడ్డుసంసారం .మొగుడు పిసినారి. అంతకంటే రెట్టింపు తను. మెడనిండా బంగారం, కొట్టునిండా ధాన్యం. యెంగిలి చేతితో కాకిని కొట్టలేదు. చుట్టాలెవరూ వారింటికివచ్చిన పాపానపోలేదు అధవా వచ్చినా భోజనంవేళవరకు ఉండనూలేదు. డబ్బుకూ ఆమెకూ లంకె. ఆ డబ్బునే వరించింది. ఉలావుండగా మొగుడికి జబ్బుచేసింది. అదేపోతుందని వూరుకుంటే మోపుచేసింది. కషాయాలు, గిషాయాలతో తనకు తెలిసినవైద్యం చేసింది. మంచంపట్టాడు. పొరుగూరి నేటివ్ వైద్యుడు డబ్బుగుంజటానికే ప్రయత్నించాడని వాడ్ని వదిలించి, బైరాగి చిటకాలతో జబ్బు నయంచేయబోయింది. రోజుకురోజు పరిస్థితి విష మించింది. యెవరో నాటువైద్యుడ్ని పెట్టింది. నలుగురూ పట్నంనుంచి పెద్దవైద్యుడ్ని తెస్తే జబ్బు నయంఅవుతుందని చెప్పారు. కానీ యెవరి మాటా లక్ష్యపెట్టలేదు. మొగుడు చివరికి వచ్చేమాటా, రానిమాటతో నలుగురూ అంటున్నాడు. ఆ పట్నం వైదిగుడ్ని తీసుకరమ్మంటే. "ఈలంతా నీవుబతకాలని చూస్తున్నారా? నీసేత వూరకే డబ్బు గంగలో కల్పించాలని చూస్తున్నారని" మొగుడుకి చెప్పింది. నలుగురూ నాలుగు విధాలంటుంటే "వచ్చినోలువచ్చినట్టుండండి. మీరంతావైదిగులా, ఇప్పుడు

మందిచ్చినోడు వైదిగుడా? ఆడికి నాకూ ధైర్యంవున్నాది. మీకెందు కర్రా?" అని అరిచింది. నాటువైద్యుడు వారంరోజులకి జబ్బే యెగిరి పోతాదని చెప్పాడు. వారంరోజులకి మనిషే ఎగిరిపోయాడు.

వూరంతా ఒకేకంఠంతో యీ ముండను తిట్టిపోస్తే యేడుస్తూనే "నన్నెందుకర్రా అంటారు? మీకూ ఆరోజువస్తే మీరూ వుండిపో"రంది. దానినోట్లో నోరెందుకు పెట్టడం? దానికి తెలిసొస్తాదని వూరుకున్నారు. బంగారం కాసులు కూడబెట్టింది. ఆళ అంతస్తుల్లా పెరిగిపోతోంది. ఎవడో దూరపు చుట్టం దాపరించాడు. ఆ ఆళను మరింత వృద్ధిచేశాడు. ఆమాటల చమత్కారంతో నమ్మించాడు.పొంగించాడు. చాలా ఘరానాగా వ్యవహరించాడు, వ్యాపారం గురించి. ఆ లాభాలు గురించి చెప్పు కొచ్చాడు. ఆళ పుట్టింది. ముందు వందరూపాయలే తన వాటాగా వ్యాపా రంలో పెట్టమని యిచ్చింది. నెలరోజుల్లో నూటయాభై తెచ్చియిచ్చాడు. నెలకు వందకు లాభం యేభయిరూపాయలే! కళ్లు జిగేల్‌మన్నాయ్! అడ క్కుండానే ఐదువందలిచ్చింది. దానికి లాభమొచ్చింది. ఆ చుట్టం దేము డులా అగుపించాడు! వ్యాపారం రానురాను పెద్దదైపోయింది. పట్టణాల లోకికూడా వాళ్ళ సరుకులు వెళ్తున్నాయి. నలుగురూ చెప్పుకుంటున్నారు. ఆ చుట్టం చుట్టంలా లేడు. ఇంటిమనిషికంటే యెక్కువ–అలాంటివాడ్ని పూర్తిగా నమ్మింది. నీ పేరను లారీకొంటాను. లాభం నూటికి నూరూ వుంటా దన్నాడు. ఒప్పుకున్నాది. ఇంట్లోను, ఒంటిమీదావున్న బంగారం అమ్మింది. వున్న ధాన్యం అమ్మింది, ఇంకా చాలకపోతే భూమి తాకట్టు పెట్టింది. ఆ తాకట్టుపై వూర్నించి తనే కుదిర్చాడు. ఒక కాగితం లారీ తెచ్చి చూపించాడు. భద్రంగా ఆ కాగితం యెవరికీ చూపించకుండా దాచింది. లారీమీద కూర్చొని పట్నంకుడా వెళ్ళింది. సినిమాకి, కాఫీ హోటళ్ళకి తీసుకవెళ్ళాడు. ఆ రోజుల్లో యివన్నీ జమీందారులకే చెల్లు తాయి! యెంతో మెచ్చుకుంది చుట్టాన్ని. లాభాలు వస్తున్నాయి. అప్పు డప్పుడు వ్యాపారం ఓడవ్యాపారమంత కాబోతోందని తెలిసి భూములు అమ్మింది. ఆ డబ్బు తిరిగి రాలేదు. ఏదని అడిగితే లారీమీద తీసుకు వెళ్ళి గోదాంలోని సరుకులు చూపించాడు, కావాలంటే ఇక్కడే ఇల్లు

కట్టిస్తాను వుండిపో అన్నాడు. అంత నమ్మకం వుండగా తనెందుకు వూరువదలాలి?

ఒకనాటి ఉదయం....మంచిరోజున చిప్పచేతికిచ్చాడు. గొల్లమన్నాదిః కాగితాలన్నీ అందరికీ చూపించింది. నోటికిరానితిట్లు తిట్టింది. తలబాదుకున్నాది. నూతిలో గెంతడానికి పరుగెత్తింది. ఊరంతా ఓదార్చారు.తలోలా అనుకున్నారు. గొడ్డు కసాయివాణ్ణే నమ్ముతుందన్నారు కొందరు. చేతులారా మొగుడ్ని చంపేసింది. అలాంటి ముండకు ఇంత కంటేమంచిగతేం వస్తుందన్నారు.

ఉన్నయిల్లు కొన్నాళ్ళకి కూర్చుని తినగా అప్పులకింద పోయింది. వయసుమళ్ళిన కాలంలో ఎవరూ దగ్గిరకి చేరనివ్వలేదు. ఒకరికి పెట్టి వుంటే ఆ ఒకరు ఇప్పుడు కనికరించేవారు. ఈకోజుకి నడ్డివంగినా, మమకారం పోదు. లేనిపోని ఆశలు పెట్టుకొని వీళ్ళని దూషిస్తూ వాళ్ళని దూషిస్తూ బతుక్కొనివస్తూంది.

* * *

కోతలు మొదలుపెట్టారు. చేను కళ్ళాలకు వచ్చింది. కొట్లో వేయకుండానే ఈసారి పుల్లయ్య బుగత అంబారం కొలిచేశాడు. అట్టు నుంచి వచ్చినదగ్గరనుంచి మనసు మనసులా లేదు. మళ్లు గరిడీకని చెయ్యిలాగుకొని వెళ్ళినా వెళ్ళలేదు. రాజిగాడిదగ్గర తెచ్చిన డబ్బుకు వడ్డీ ధాన్యం యిస్తే, నెలరోజులకు తప్పించి గ్రాసం వుండదు. అంచేత నీలి వడ్డీరూపాయలలో కట్టుకోమని బ్రతిమలాడింది. ఈ ధరల్లో ధాన్యం కట్టడానికి ఒప్పుకోలేదు. ఇప్పుడు గరిసె బ్లాకులో వెయ్యివున్నా ముందు ముందు పదిహేనువందలు కాకూడదా అని ప్రశ్నించాడు. నీలి బ్రతిమలాడింది. ఈమాత్రం ఉపకారం చెయ్యకపోతే పిల్లలు తిండిలేక మాడిపోతారని ప్రాధేయపడింది. చివరకు భూమి స్వాధీనంతనఖా వ్రాస్తే ఒప్పుకుంటానన్నాడు. అంతేకాకుండా ధరలు హెచ్చుగావున్నాయి కాబట్టి వడ్డీ వందకి రెండుపుట్లనుంచి కొద్దిగా తగ్గించి మిగతాధాన్యం వచ్చేయేటినుంచి నేనే మీ కిస్తా నన్నాడు. ఆ భూమిమీద పైరుపంటలు మీరే పండిచుకోండన్నాడు. నీలికి చాలా సబ బనిపించింది, ఒప్పుకున్నాది. పుల్ల

య్యకు నచ్చలేదు. యెలాగో ఓలాగ యీ మాగాణి దక్కించుకోవాలని వాడు చూస్తున్నాడనీ, ఇంకా ఏడాదిలో తనకే అయిపోతాదని అన్నాడు. నీలి బలవంతంమీద రెజిస్ట్రేషను అయిపోయింది.

పేసవి వచ్చింది. ఒకనాటి సాయంత్రం మల్లు తన ఈడూజోడూ పిల్లల్ని ప్రోగుచేసి వాళ్ళకి గరిడీ నేర్పుతున్నాడు. "ఛినక్ ఛినక్‌సో...." అంటూ అడుగులు సరిగ్గా వేస్తుంటే అంతదూరంనుంచి చూస్తున్న పుల్ల య్యకు యెక్కలేని గర్వం వచ్చింది. పులి పంజా ఆడిస్తున్నట్లు ఆడిస్తు న్నాడు అరచేతిని. అడుగులు సరిగ్గా పడుతున్నాయ్! పుష్టిగావున్న శరీ రంలో యే కీలు కా కీలు వొంగుతోంది. దప్పులుంటే ఎంతబాగుండే దని పించింది పుల్లయ్యకి, అలాగే వెళ్ళి పిల్లిమొగ్గ వేస్తే....కొడుకు ఎగ బ్రాకి పాదాలమీద నిల్చునిః దిగవాడి కొడుకే మీదోడు! మళ్ళీ ఆరోజు జ్ఞాపకం వచ్చింది. ఆ ముసలాడిగాలేని ముసలాడు .... వయసులో ముసలాడు—ఉత్సాహంలో కుర్రాడు....బొక్కపళ్ళ నవ్వుతో ఆ రెండే మాటలతో....తనను పెళ్ళికొడుకు చేశాడు....మా అయ్యని పుట్టుకు రప్పించాడు....నాకు మల్లునిచ్చాడు....ఆ ముసలాడు యెక్కడున్నాడో ....యేమయ్యాడో?

"నాను మొగ్గేస్తే" అనుకున్నాడు పుల్లయ్య. కొడుకు యెక్కమంటే యెక్కుతాడు. తను కాసుకోగలడా? నేనేమోనన్న పిరికితనంవేసింది. వేసుకోలేకపోతే....నాకొడుకు అంతమీదమంచి పడితే....కాలుగానీ, చెయ్యిగానీ విరిగితే....అమ్మో! అంతపని చెయ్యనుకున్నాడు. మెల్లగా కొడుకును సమీపించాడేగాని, మళ్ళు ఆటలో మునిగిపోయివున్నాడు. తన లాగే నలుగురూ వీధినిపొయ్యేవాళ్ళు ముచ్చటగాచూసి మురిసిపోతున్నారు. ఒకమ్మ యేటినుంచి నీళ్ళకడవ నెత్తినపెట్టుకొనివస్తూ "అలాంటోడు ఒక్కడైతేం!" అంది. పుల్లయ్య ఒళ్ళంతా పులకరించింది. కొడుకు తండ్రినిచూచి పరుగెత్తుకొచ్చి మీదెక్కుడు. ఇంటివేపు నడుస్తుంటే "అయ్యా, మామ్మకి జొరం—నచ్చిపోతాదా?"

ఇంత సంతోషం ఒక్కసారి మాయమై ఆలోచనలో పడిపోయాడు పుల్లయ్య.

"శివ్వడమ్మ సెప్పిందట—యెవడో యెనుబోతుమీద వచ్చి.... పేణాలు తీసుకపోతాడట! యెప్పుడొస్తాడయ్యా? కర్రపట్టుకొని కూకుం టాను మామ్మదగ్గర!" అన్నాడు.

చిన్ననవ్వు నవ్వాడు "యేదయ్యా—అడు నిజంగా సెప్పనేదు" మల్లు వెనువెంటనే తండ్రిముఖంవేపు చూస్తూ అయ్యసెప్పింది అయ్యకే "నిజం సెప్పనేదు....శివ్వడుకళ్లు పోతాయి" అని అప్ప జెప్పాడు.

ప్లీడరు సీతారామస్వామిగారు ముందుచూపు మళ్ళీ కొడుకుపెళ్ళి తర్వాత యీనాటికి చూశారు. తాను ఆలా చూడటానికి పరిస్థితులు యేమంటే ముందుకి ఎలక్షనులు వస్తున్నాయ్. అప్పుడే వివిధపక్షాలూ కొద్దోగొప్పో ప్రచారం చేసుకుంటున్నాయ్. హెచ్చు వోట్లు పల్లెలోనే వున్నాయికాబట్టి పల్లీయులను ఆకర్షించే విధానాలలో ప్రచారంచేయాలి. అంచేత దున్నేవాడిదేభూమనే నినాదం లేవదీశారు. యేదోవిధంగా అన్ని పక్షాలూ ఈవాదం సబబనే అంటున్నాయ్.ఈవాదంద్వారా స్వలక్ష్యాలను-అంటే పార్టీలకు ఎలక్షనులో గెలవటం; పెట్టుబడిదారు యీ సమ్మంధ మైన సినిమాతీసి చిత్తుగా డబ్బు ఆర్జించుకోవడం. ఈ యితివృత్తంతో లేనిపోని సంఘటనలు కల్పించి నాటకం ఆడి భూకామందులపై లేని ఈర్ష్యను అమాయక ప్రజలలో సృష్టించి. వాళ్ళమీద తిరుగుబాటు చెయ్యించ పూనటం—తద్వారా నాటకం గిట్టుబాటైందని అనిపించు కోవటం—ఇలా ఆలక్ష్యాలను యేదో ఒకస్థాయిలో సాధించుకుంటున్నా రని చెప్పాలి. ఈ పరిస్థితులు చాలామంది భూకామందులకు తమ ఆస్తి పాస్తులు కాపాడుకొనే అవసరం వచ్చిందని కట్టుదిట్టాలు చేసుకో నిచ్చింది. రైతులను తొలగించి కొందరు స్వంతసేరీ పెట్టుకున్నారు. ఆ రైతులు అడుగంటిపొయ్యారు. ఆకలితో అలమటించి కొందరు బ్రతు కుమీద ఆశతో ఆత్మహత్యచేసుకోలేక, అడుక్కొని పొట్టపోషించు కుంటున్నారు. ఈ విపరీతమైన ధాన్యంధరలవల్ల కొల్లలుగా డబ్బు కూడ బెట్టి యెలాగ వినియోగించాలో తోచని పెద్దరైతులు ఈ పైవూళ్ళలో వున్న భూకామందుల భూములకు పోటీలపై ధరలుపెంచుకొంటున్నారు. కొన్నాక సొంతసేరీ చేసుకోడంవల్ల మొదట ఆ భూమి అంబారానికి

దున్నుతున్న చిన్నరైతు కూలిపోతున్నాడు. ఇలా లెక్కలేనన్ని సంఘటనలవల్లఅక్కడక్కడరక్తపాతంభరుగుతోందిఓళ్ళలో కొనేవాడిపార్టీ దున్నేవాడిపార్టీలు లేచిపోతున్నాయ్. డబ్బుగలవాడిదే జయం. ఆ పార్టీ బలం యెక్కువ.

సీతారామస్వామి ఈ పరిస్థితిని యేనాడో వూహించాడు. కానీ పుల్లయ్య నమ్మకంగా ధాన్యం తెచ్చియిస్తాడని భార్యకూడా అమ్మడానికి ఒప్పుకోలేదని ఊరుకున్నాడు. సంవత్సరం పోయాక అయ్యే యెలక్షను లకు ఇప్పుడే హడావిడి మొదలైంది. ఆ పరిస్థితులు చూస్తుంటే వచ్చే ప్రభుత్వం అక్షరాల దున్నేవాడిదేభూమి చేస్తుందని తను నిర్ధారణ చేసుకున్నాడు. అదీకాకుండా పట్నంలోనే యేదో కొంపకొని అద్దెలకు ఇచ్చుకుంటే భద్రత,రాబడి అధికం కూడా అవుతుందని భార్యకు ఒకరోజంతా నచ్చచెప్పాడు. ప్రపంచమంతటా ఇంతపెద్ద జిల్లాలేదు. వచ్చే ప్రభుత్వం దీన్ని ఎలాగూ ముక్కలుచేస్తుంది, చేస్తే జిల్లాకేంద్రం ఈ పట్టణంలోనే వుంటుంది. అప్పుడు ఇంటిఅద్దెలు రెట్టింపవుతాయి. ఇదంతావిని ప్లీడరు భార్య పుల్లయ్య దున్నుతున్న రెండెకరాల పల్లపుపొలం అమ్మడానికి ఒప్పుకుంది, ఆ అమ్మేడబ్బుతో ఒక యిల్లు ఏర్పడుతుంది.

ఈ రెండెకరాల పొలంలో ఒకయెకరం రాజిగాడు; ఇంకోయెకరం ఇంకో పెద్ద రైతూ కొనడానికి నిర్ధారణ అయిపోయింది. పుల్లయ్యను ప్లీడరు పిలిపించాడు. డబ్బు అవసరం వచ్చింది. ఈ భూమి అమ్మితేగాని పిల్లేదని చెప్పాడు. పుల్లయ్య "మా తాతలకాలంనుంచీ దున్నుతున్నాం బాబూ! ఏనాడూ పందుంధాన్యం వుంచుకున్నామా? పైరుపంటలుకూడా మీపాలు తెచ్చియిచ్చేవాడ్ని. మీ ఆవులకి గడ్డిమేట్లు తెచ్చిఏస్తాను మాతాతలకాలంనుంచి యిలా జరిగిపోతున్నదికదా, మీరిలాగ అంటే ఏగంగలో పడిపోమంటారు?"

ఈ మాటలు శాంతంగా ప్రాధేయపడుతూనే అన్నాడు.ప్లీడరుగారు అప్పుడే కొంత డబ్బు కొనవలసినవారి దగ్గర పుచ్చుకొని అమ్మితీరాలని నిశ్చయానికి వచ్చారు కాబట్టి, పుల్లయ్య యెంత ప్రతిమాలినా లాభంలేక పోయింది. ప్లీడరు ప్రాధేయపడుతున్న పుల్లయ్యకు ఏదో కొంత ముట్టచెప్తానన్నాడు. "ఆ అంబారం పొలం కొనేవాళ్ళకు కొలుస్తాను, ఆలాగ

ఏర్పాటు చేయించండన్నాడు" పుల్లయ్య. ఆ కొనేవాళ్లు ఫలానావాళ్ళనీ, వాళ్ళే రైతులనీ, కాబట్టి ఇంకొకరి కెలా ఇస్తారని ప్లీడరు ఖచ్చితంగా చెప్పాడు.

ఇలా ప్రాధేయపడడంపోయి పౌరుషాలవరకూ వచ్చింది. ప్లీడరు పెద్దమాటలాడగానే పుల్లయ్య భ్రమన లేచాడు. "లా పోయింటులూ, గీ పోయింటులూ లేవు బాబూ—మా తాతలకాలంనుంచీ ఆ పొలం దున్నుతున్నాం. యే గవర్నమెంటోడు సాగుహక్కు లేదంటాడో సూస్తాను. మీరెన్ని కోర్టులు తిరుగుతారో తిరగండి. నాను భూమిమాతం వదలను" అని వెళ్ళిపోతుంటే, ప్లీడరు గట్టిగా అన్నాడు "యేటా ముచ్చట్లాకులు వాళారోయ్. సాగుహక్కు యెక్కడ వచ్చిపడిందిరా మీలాంటోళ్ళెంద రిని చూశాను? యెందుకు తుప్పన గెంతుతావు. తరువాత ఈ డబ్బుకూడా దొరకదు" అన్నాడు.

"రా బాబో! నీ కాగితాలమీద నాయంలేకపోతే, నా వూరంతా కచేరీలో నిజం సెప్పరా.సాగుహక్కు అప్పు డెలా రాదో నానూ చూస్తాను" అంటూ యింటిముఖంపట్టాడు.

పుల్లయ్య వెళ్లేక రాజిగాడు, యింకోరైతూ ప్లీడరుయింట్లోకి వెళ్ళారు. "ముందర పత్రం రాసేయండి. మీరు విడిపించకపోతే నాను యిడిపించుకుంటాను. ఆడికి రోజులు దగ్గరపడ్డాయి"అని రాజిగాడు అనగానే ప్లీడరుకు కోర్టుకెక్కటం తప్పిందని సంతోషంగా రెండెకరాలు అమ్మేసి రెజిస్ట్రేషను చేయించేడు.

నవిరి పెద్దవీధిలో పీసయింటిదగ్గర ఈ విషయంపై మాటలేవో పడ్డాయ్.పుల్లయ్య జరిగినతంతు తెలియగానే అగ్గయిపోయాడు.పీస ఓర్పు మాటతో "అయ్యా పుల్లిగా, దేముడున్నాడురా!" అన్నాడు.

"దేముడా! పొలంగట్టుకు యెవడొస్తాడో సూస్తాను! ఆడి బ్రతబద్దలవదా?"

"వాళ్ళకి మనుషుల బలం, డబ్బుబలం రెండూవున్నాయి. కాసులుగలవాడు దాసీదానికొడుకైనా రాజే! నీపక్క నాయం వున్నాది. నాయమే దేముడు, దేముడికి సావునేదని సిన్నపిల్ల నడిగినా సెప్పుతాది!"

పీస సర్ది అంటున్నమాటలకు పుల్లయ్య మరీ విజృంభించి" ఎప్పుడూ దేముడు దెయ్యమని కూర్చుంటావురా? దేముడు —! ఇదేనట్రా నాయం— లోకం మండిపోతున్నాదిరా అన్నాయంతో —అ దేము డే మూల సస్తున్నాడో? దేముడున్నా డంటన్నావు దేముడు!"

పీస ప్రశాంతంగా "ఉన్నాడురా. నీ ముకంలా నాముకం యెందుకు నేదు? నీ బతుకులా నా బతు కెందుకునేదు? మనిషికొక ఆకారం మనిషికొక బతుకు యెందుకున్నాది? —"

ఇంక పుల్లయ్య పీసను చెప్పనివ్వకండా "రేప్పొద్దునే పొలాన యేరు వూస్తాను.ఏ, మీసంగల మొగోడువచ్చి యేరిప్పుతాడో సూస్తాను" అని మీసం మెలిపితే, మీసంలేని కొడుకుకూడా మీసం త్రిప్పేశాడు!

ఈ రగడంతా వింటున్న, చూస్తున్న కుష్టురోగి కాలీడ్చుకొని వస్తూంటే రాజిగా డెదురయ్యాడు.వాడికి అప్పుడే అంతా తెలిసిపోయింది. సంజీవితో "ఏలాగ యేరు వూస్తాడో నాసూ సూస్తానని" మీసాలు మెలివేసి అంటుండడం విన్నాడు. తిన్నగా నీలిదగ్గరకు వెళ్ళి "అమ్మా తల్లీ! రేపు పొలంలోకి పుల్లిబాబు యెల్లాడంటే బితకడమ్మా....ఆ రాజిగాడూ గట్టిపట్టే పట్టాడు. భూములు దబ్బుపోసి కొనుక్కున్నాడా? ప్రజా ఆడియేపే అంటారు—గవర్నమెంటోడూ ఆడియేపే మాటాడుతాడు కానీ,బగమంతుడునేడా?"

నీలి కొద్దిగా కంగారుపడినా సర్దుకుంది. రాత్రి నిద్దరపోయేవరకూ ఈ విషయాలేమైనా మొగుడు చెప్తాడేమోనని యెదురుచూసింది. పుల్లయ్య మౌనంగా గంభీరంగా వున్నాడు. ముసలమ్మ జ్వరాధిక్యతవలన ఒక మూలపడి మూలుగుతోంది. చంటిపిల్ల అప్పుడే లేచి కేకలుపెట్టి యేడుస్తోంది. ఏమో తల్లిపాలు చాలటంలేదు. ఈ నెలల పిల్లకు అన్నం పిసికి కూడా పెట్తోంది. పాలు కొనడానికి దబ్బు సరిగ్గా చేత ఆడలేదు. పిల్లకు పాలుయిస్తూ యిటూ అటూ నిద్రపట్టక కదులుతున్న పుల్లయ్యవేపు చూసింది. ఆనాడు చింతచెట్టుక్రింద బలవంతంచేసిన పుల్లయ్య....పెళ్ళినాడు తను చూసిన ఓరచూపుకు ప్రత్యక్షమైన మొగుడూ....పట్నం ముస్తాబై యిద్దరూకలిసి వెళ్ళినాడగపడ్డ ఈ వస్తాదుకీ —ఈవేళబాధతో, దిగులుతో, పౌరుషంతో అట్టుడికిపోతున్న వైతుకూ యెంతతేడా! ఆమె

చూస్తునే మొగుడిమీద కనికరంవేసింది. ఇదంతా తనకెందుకు చెప్పలేదో ఆమెకు తెలుసు; ఎంత మెత్తనిగుండె!

కొద్దిసేపటికి పిల్ల నిద్దరవోయింది. ముసలమ్మ మూలుగుతూంది. మల్లు తండ్రిపక్కనే పడుకున్నాడు. నీలి బుడ్డిదీపం తగ్గించి మెల్లగా వెళ్ళి మొగుడుప్రక్కన కూర్చుంది. భార్య కూర్చున్నట్లు ఆమెచెయ్యి తన నుదుటిమీద పడేవరకూ పుల్లయ్య పోల్చుకోలేదు. ప్రేమతో చూస్తూ మెల్లగా, కమ్మగా, తియ్యగా చిరునగవునవ్విన,నీలివేపు ఒకసారి చూశాక మళ్ళీ చూడలేకపోయాడు. ఆమె ఆ చేతిని మెల్లమెల్లగా ఆ గీరా గిరజాల లోకి పోనిచ్చి తలదించి ముఖంలో ముఖంపెట్టింది. పుల్లయ్యశరీరం యెందుకో కంపింపసాగింది. ఆమె అతిమెల్లగా సహజ శాంతస్వరంతో "యింతజరిగినా వూరంతటికీ సెప్పి, నాదగ్గిరేనా దాపరికం?" అంది.

పుల్లయ్య మాటాడలేదు. శరీరం గగుర్పాటుచెందసాగింది, ఏదో నేరస్థుడిలా అయిపోయాడు. కానీ ధైర్యం చిక్కించుకొని చూస్తూ "ఊందరిదగ్గర నాకు బయంనేదు;" అన్నాడు.

నీలి మొగుడుప్రక్కనే ఒరుగుతూ, మొగుడితలను తన వక్షానికి అదుముకుంది. అభిమానానురాగాలు కట్టలు త్రెంచుకొని ప్రవహించుట చేత యిద్దరికళ్ళల్లోనూ కన్నీరైంది. కొంతసేపటికిగానీ మాటలురాలేదు. నీలి గోడకు చారబడికూర్చుంటే ఒడిలో తలపెట్టుకున్న మొగుడి కళ్ళల్లోకి చూడకండానే "రేపు యిల్లు కదలకు. పౌరుషాలువస్తే మనుసులు పశువులై పోతారంటారు. మనరాత అలాగవుంది. యేంచేస్తాం? కాళ్ళా సేతులూ గట్టిగా....వున్నాయికదా!"

ఆమె బిహళా దుఃఖం ముంచుకురావడంవల్ల కామోసు మరి మాటాడలేదు. కానీ ఆమెకళ్ళనీరు కారి భర్తమీద పడలేదు. మౌనంగా ఆమెబాధను అర్థంచేసుకున్న పుల్లయ్య "నలుగురికీ మనకీ అన్యాయం జరిగిందని తెల్సిరావద్దే" అన్నాడు.

"ఈ పిల్లల ముకంసూసి పౌరుషం తగ్గించావంటే బతుకుతాం ఎవరికి ఆస్తి పాస్తు లుండిపోవు — ఎవరూ ఈలోకాన్న వుండిపోరు; మంచీ చెడ్డా మిగిలిపోతాది, ఒకకంట నీరుకారితే యింకో కన్ను నవ్వితేనే బతుకు — నీ యిష్టం!"

ఆమె మరి మాట్లాడలేదు. మెల్లగా లేచి మంచంమీదనున్న పిల్ల ప్రక్కన వెళ్ళి పడుకుంది.

తెల్లవారింది.పొద్దు మీదకు లేచింది. పుల్లయ్యకు రాత్రంతా జరిగింది కలలా అయిపోయింది. కొద్దిగా గెంజిత్రాగాడు. చల్లని అంబలి జుర్రాడు. అప్పుడే వూరంతా ప్రాకిపోయింది పుల్లయ్యకీ రాజిగాడికి ఈ వేళ యేదో గలాటా వుందని. బుర్రలు పగుల్తాయని కొందరు అనుమాన పడ్డారు. మొదట వెళ్ళటం మానివేస్తే అనుకున్నాడు. మీసాలు తీసేశానే మోనని అనుమానపడ్డాడు. ఇన్ని కబుర్లాడి 'ఛా, సస్తే సస్తాను. పిరికిపం దనైపోతానా? మల్లునాయుడి కొడుకు, మాట అన్నాడంటే జరిపించుకో వలసిందే! పెజల్లో ముఖం నిటారుగా సూపించవలసిందే!'

చంకన బాణాకర్ర పెట్టాడు. పోతులను విప్పి నాగలి భుజాన వేశాడు. వెనువెంట కొడుకు వున్నాడు —నీలి మౌనంగా ఈ పనులన్నీ చేస్తున్న భర్తవేపు చూస్తోంది. పుల్లయ్య వెళ్ళంవేపు చూడలేదు. సరే! బయలుదేరాడు.ఇంట్లో మంచంమీద పిల్ల కెవ్వున కేకలువేస్తోంది. ముస లమ్మ మూలుగుతూనే మనుమడ్ని పట్టుకోబోతే జుత్తు పీకి, కొట్టి మరీ విడిపించుకొని అయ్యవెంటవడ్డాడు. నీలి మొగుడు యేమంటాడనో చూసింది. మాటాడకండా వెళ్ళిపోతున్నవాని వెంటపడి వెనకనించి చంకలోని బాణాకర్ర పట్టుకొంది. వెనుతిరగబోతే నాగలి పూదు నీలితలకి టక్కున తగిలింది. ఆమెకళ్ళవేపు చూశాడు —కర్ర వదలి ముందుకు అడుగులువేస్తున్నాడేగాని కళ్లు వెనుకే వున్నాయ్.

పొలంగట్టు చేరాడు.తన చిన్నతనంనుంచీ ఈ గట్టు తనదే అను కున్నాడు. గొట్టెపిల్లకూ, పందెంపోతుకూ, పశువులకు యెత్తుగా ఈగట్టు మీద పెరిగిన గడ్డికోసి మేపేవాడు. తనలా తన కొడుకూ కోసి మేపుతా డనుకుంటే, ఇప్పు డిలా వచ్చింది. తన తల్లీతండ్రిమీద యెంత మమకా రమో ఈభూమిని చూస్తే అంతకు రెండింతలు —ఇలాంటి మన్ను తనది కాదట!

నాగలి దించాడు. కొడుకు చిన్న బెత్తంపట్టుకొని పోతులను ఆపాడు. కాడికట్టాడు. పొలం తూర్పుదిక్కుకు తిరిగి నాగలిమొన పెట్టాడు. ఇం తలో పీస పరుగెత్తుకొచ్చాడు."అయ్యా, ఆలు మందలు మందలుకర్రిలు

పట్టుకొస్తున్నార్రా, నా మాట విను పుల్లిగా, పదరా యెళ్ళిపోదాం.... వచ్చే స్తున్నారు.... అదిగోరా తోటదాటిపోనారు.... అదిగోరా వచ్చేస్తున్నారు. నాయనా....నా నాయనా పుల్లిగా —నీ కాళ్లు పట్టుకుంటానురా....! నాయనా.....”

పీస భయంతో అలసిపోతున్నాడు, సొలసిపోతున్నాడు. ఇందులో ఒక్కమాటా వినిపించుకోనట్లుగా పుల్లయ్య పొలం దున్నుకుంటున్నాడు. వాళ్లు వచ్చేశారు....అదిగో ఒకరు యిద్దరుకారు....పొలంచుట్టు ముట్టే శారు. పీస ఆత్మతగా “వచ్చార్రా, ఒక్కడిని కొట్టడానికి....యిందరు ....కర్రలు పట్టుకరావాలా? మీరంతా మనుసులేనా? నాయం వూళ్ళో లేదు—అడవిలోకి యెల్లిపోయిందిఃఁ

రాజిగాడు పొలంలో కాలుపెట్టి పీసను యీడవబోతే పీస తప్పిం చుకొని మల్లుని ఎత్తుకొని బయటకు పోడానికి వచ్చాడు.మల్లు యేడుస్తూ తాతనుకొట్టూ విడిపించుకున్నాడు. ఆ చిన్న గోచిపాత వూడిపోయింది. ముచ్చటగొల్పుతోంది. గోచీసర్దుకొంటూ మళ్ళీ అయ్యవెంటపడ్డాడు. రాజయ్య పీసను పొలంఅవతలకు త్రోసివేశాడు. అవతలనుంచి పీస కేకలువేస్తున్నాడు. ‘నాయనా పుల్లిగా....తొందరపడకు’ఃఁ

రాజిగాడు పోతుల యెదరగా వెళ్ళి ఆపాడు. పుల్లయ్య పోతుల్ని అదిలించాడు. అవి ముందుకు పోబోతుంటే కర్రలు పట్టుకు మరి యిద్దరు ముందుకు వచ్చారు. పోతులనాపి కన్నెలను విప్పేశారు. పుల్లయ్య పళ్ళు బిగబెట్టాడు. చుట్టూ ప్రజని తను చూడలేదు. ఒళ్ళంతా రాజుకుపోయింది. కళ్లు మండుకుపోతున్నయ్. ఆ యెండలో తల జిగ్గున పొడుస్తోంది. కోపంతో మసకలుదేరినకళ్ళతో పోతులనవిప్పిన రాజిగాడివైపు చూశాడు. కళ్లూ మసకలు కమ్మాయేమోనని కళ్లు తుడుచుకున్నాడు. ఇంకా ఆ కం టిక నీలే కనిపిస్తోంది....యేమిటీ?నా పోతు లిప్పింది రాజిగాడు కాదా? నీలా!....నీలమ్మ....

యెక్కడలేని పిరికి సహనం బాగా నిండిపోయింది—మల్లువేపు చూడగానే మరింతగా అసహాయుడైపోయాడు. చేతిలో కర్రలేదు. కర్ర వుంటే పెళ్ళాన్నా తను కొట్టేవాడుఃఁ

ఆ స్థలం విడిచి వెళ్ళని పోతులకు గట్టివెబ్బలు కర్రతో రాజిగాడు వెయ్యడంతో పొలంబయటకు పరుగులెత్తాయ్.మల్లుకు పౌరుషంవచ్చింది. "యెవడవురా....మా పోతుల్ని బాదావు?" అంటూ చేతిలోని బెత్తంతో రాజిగాడ్ని కొట్టాడు. రాజిగాడు కోపంతో మల్లును పొలం బయటకు యీడ్వబోతుంటే గట్టిగా రాజిగాడితొడ కరిచి విడిపించుకొని అయ్యదగ్గ రకు పరుగెత్తాడు.

రాజిగాడు వుగ్రుడైపోయాడు. నాగలి విసిరేస్తూ "పొలంసుంచి కదుల్తావా లేదా" అంటూ ఒకతిట్టు విసిరాడు.

పుల్లయ్య సర్వనాడులూ విజృంభించాయ్! ఒక్కఎగురు ఎగిరి సింహంలా వాడిమీద నరికి పడబోయాడు. కాని ఆ గెంతడంలో యేదో అసహాయత....కాలుజారి దున్నినభూమిలో చారబడిపోయాడు.అంతలోనే లేచి పరుగునవెళ్ళి మీద పడబోయాడు. ముగ్గురు అడ్డుగా కర్రలు పెట్టూ "ముందుకు అడుగేశావంటే తల పగులుతా"దన్నారు.

అలా నిల్చోని పుల్లయ్య ఆ కర్రలమధ్యనుంచి చూశాడు. యెదురుగా యెందరో వున్నారు. రాజిగాడుకూడా వున్నాడు. కాని వాళ్ళందరూ కనబడలేదు — యెవరది? నీలి....నా నీలి....నా నీలినా సంపబోయాను?

ఆ ముగ్గుర్లో యిద్దరు తన రెండుచేతులూ పట్టుకున్నారు. కొడుకు నింకొకడు పట్టుతున్నారు. రాజిగాడు చెప్పినట్లు బయటికి యీడ్చుక వస్తుంటే ఆ పొలంమీద తండ్రీకొడుకు లిద్దరూ రాలిన మన్నును ముద్ద పెట్టుకుంటూనే పొలంఅవతల పడ్డారు. పరుగెత్తి దగ్గరగావచ్చిన పీస పుల్లయ్యకంటిలో నీరుచూసి "నా పుల్లగా....నివ్వా నాయనా యేడుస్తున్నావ్? పుల్లి పిల్లి అయిపోయిందా తండ్రీ! యేంగతి వచ్చిందంటా" అని నెత్తిబాదుకొని గట్టిగా బొలబొలా యేడ్చేశాడు.

20

ఆరోజే మధ్యాన్నం....ఎండ తీవ్రంగా కాసి....కాసి....ప్రొద్దు తిరిగాక ఆకాశమంతా మబ్బులు కమ్మాయ్. అక్కడక్కడ చిరుచినుకులు రాలాయి; రానురాను గాలివీచింది. మేఘాలు పడమటి దిక్కునకు ప్రయా

ణంచేసి కొండల్లో కేంద్రీకరించాయి. సాయింత్రానికి కొండల్లో మెరుపులు మెరిశాయి.

ఆ సమయాన సీలమ్మగుడిదగ్గర పలకరాతిమీద గుడ్డివెంకన్న ఒంటిగా కూర్చున్నాడు. చేతిలో బాణాకర్రవుంది. గన్నెమ్మ పుణ్యామా అంటూ తన కోరిక నెరవేర్చింది. ఇక్కడ విడిచిపెట్టి వెళ్ళిపొమ్మంటే తీసుకొనివచ్చి విడిచిపెట్టి వెళ్ళిపోయింది.కర్ర ముందుకువేసుకొని కూర్చున్నాడు.

చిన్న చప్పుడు కాగానే "యెవరయ్యా" అన్నాడు.గుడ్డోడా సీకటి పడ్తంది యిక్కడేం వున్నావ్" అని సంజీవి అడిగాడు.

"అయ్యా! దాసుడు శివాలేస్తే యిని పోదామని...."

"ఆకలితో సగం సచ్చాడు. జొరంతో సస్తంటే ఎలాగొస్తాడు? రా యిదిలో వదిలేస్తాను" అన్నాడు.

"వద్దయ్యా! దాసు డెలాగైనా వస్తాడు...." అంటూ సర్దుకొని కూర్చున్నాడు.

ఏరు జలజల పారుతున్న శబ్దం వినిపిస్తోంది. వారధిపై గంటలతో పరుగులెత్తే యెడ్లబళ్ళ చప్పుడు. అప్పుడప్పుడు "పొప్పాయ్" అన్న బస్సుల అరుపులు....వీటన్నిటిమీదకు భల్లూకంలా మీదపడి మ్రింగడానికి వచ్చే చీకటి!

పాదాల చప్పుడు.

"ఎవరయ్యా?"

జబాబులేదు.

"పేరు సెప్పు"

చిన్నమూలుగు.

వెంకన్న కర్రయెత్తి "సెప్పకపోతే మీదపడ్తాది"

"నేనురా....దాసుడ్ని!"

"అయ్యా, వూరుకోని కొంప ముంచేద్దువు!రాజిగాడుయిలా గొస్తాడని కాశాను"

దాసుడు మౌనంగా గుడితలుపులు తీశాడు. ఈవేళ చిరిగిన మాసిన వస్త్రాలు, తడిపి ఆరవేసి మడికట్టుకొని వచ్చాడు. నిన్న వీటితోనే

వచ్చాడు. కొడుకు నిన్న మధ్యాహ్నమే జ్వరంతో పడున్న తండ్రిని చూచి మెల్లగా ఆ మేదరి బుట్టలోని పట్టువస్త్రం....పూరంతా కలిసి దానికి కొనియిచ్చిన ఆ నేరేడుపండు రంగు పట్టుపంచె—కాజేసి క్రాగ డానికి డబ్బుకోసం అమ్మేశాడు. కోమటి పేరయ్య నాలుగోవంతు ఖరీదుకు కొనేశాడు. ఆ పంచె పోవడంతో దాసుడు నొచ్చుకున్నాడు. జ్వరం అధికమైంది. ఆ పంచె పోయింది—తన బ్రతుకూ సరే అనుకున్నాడు. లేవలేని పరిస్థితి.కానీ కడప్రాణం వున్నంతవరకూ తల్లికి తనచేత ఆలనా పాలనా జరగవలసిందే! నెమ్మదిగా లేచి బట్టలు మార్చుకొని....అడుగులో అడుగులు వేసుకుంటూ ఆయాసం రాగా ఆగి—మళ్ళీ నాలుగడుగులువేసి....ఇలా చాలసేపటికి సీలమ్మగుడి చేరుకున్నాడు. అక్కడకు వచ్చేసరికి ఆయాసం రావటంచేత వెంకన్నకు వెంటనే బదులు చెప్పలేక పోయాడు.

దీపం వెలిగించి కూలబడిపోయాడు. శివాలువెయ్యటానికి శక్తి లేదు. ముదుసలి ముద్దలా గజగజ వణికిపోతున్నాడు. పండిన జుత్తూ, గెడ్డం....ఆ మధ్యను బక్కచిక్కిన ముఖం—పల్లురాలిన నోరు....లోతు కళ్ళూ....గోడకు జార్లబడిపోయాడు.

వెంకన్న తడుముకొని మెల్లమెల్లగా గుడిగుమ్మం బయట కూర్చున్నాడు. దాసుని మూలుగు వినిపిస్తోంది.

"అయ్యా!" అన్నాడు వెంకన్న. దాసుడు సమాధానంగా మూలిగాడు. "ఆ రాజిగాడు పసిపిల్లడు మల్లుని యీడ్పించాడు. ఆ పుల్లయ్య భూమీ పుట్రా దోసినాడు. బతుకులు యెందరివో కూలుస్తున్నాడు. ఆడు—ఆడిరక్తం చూస్తేగానీ బుద్ధిరాదు. అందుకేనయ్యా కాళాను!"

దాసుడు మూలుగుతూ "నాయనా! పులా - సింగమా! మనుసుల్ని సంపుకు తిననంతసేపూ మంచోడేనురా!...."

"మంచోడా? నాయం వూర్లో వుండాలా. ఈ గేమం గంగలో కలిసిపోతంది. సూడయ్యా! నివ్వు ఈలందరికీ యెంత సెప్పినావు! ఏల! నాలాంటి గుడ్డోడు కన్నుమూసి సూసినా కన్నిప్పి సూసినా ఒకటే!"

దాసుడు మెల్లగా ఆగి "ఎవరిగెహాల....బట్టి....ఆళ్ళ....బతుకులు

....నడుస్తాయి! సీకటి నేకపోతే....యెల్లు గెవడికాక్కావాల? సెద్దనేక పోతే....మంచినేదు!"

నాలుక లాగుతోంది. మాటలు తడబడుతున్నాయ్. కానీ వున్న కొనవూపిరితో మాటలు మెల్లగా దొర్లుతున్నాయ్.

"పడమట....పొద్దుకుంగితే....తూటుపున లేవదా? ఒకరోజు వేడి ....యింకోరోజు సల్లన. సస్తాం....పుట్తాం! సావు మనక్కాదు పెపంచ కం నిలబడడానికీ?"

ఒక్క మూలుగు మూలిగాడు. కొండల్లో ఉరుములు గంభీరధ్వని చేశాయ్. మెరుపులతో మేఘాలు ఇటువేపు వురుకుతూ పరుగెడుతున్నయ్. ఆకాసం దద్దరిల్లిపోతోంది!

వెంకన్న "అయ్యా" అన్నాడు. మాటలులేవు. తల్లి వాలింది!అను కున్నాడు. మౌనముగా "నరుడా" అన్న గంభీరశబ్దం వినడానికి చెవులు రిక్కించి చేతులుకట్టుకొని కూర్చున్నాడు.

ప్రమిదలో నూనెవుంది. వత్తి యెత్తేవారెవరూ లేరు. రానురాను ....ఓ నిముషంలో వత్తే కాలి దీపం ఆరిపోయింది. చీకటి! ఎటుచూసినా చీకటి! కానీ వెంకన్నకు మనసులో ఆనందం! నీలమ్మతల్లి మాటలు వింటాడు!

హోరున గాలివీస్తోంది. వర్షం ముంచుకొస్తోంది --ముంచుకొ చ్చింది! దబదబ పడుతోంది. వెంకన్న మెల్లగా తడుముకుంటూ గుడి లోనికి కాలుపెట్టాడు.

తలుపులు వేయడానికి ప్రయత్నించాడు. గాలి తలుపులను తెరుస్తూ వర్షపుజల్లును గుడిలోనికి కొట్టుతోంది. లోన గడియలేదు.తలుపులు కొట్టు కుంటూన్నాయ్. ఉరుముల శబ్దం గుడిలో ప్రతిధ్వనిస్తోంది. సాష్టాంగ పడ్డాడు. ఆ పడటంలో మోచెయ్యి ప్రమిదలోపడింది. చప్పున లేచాడు. గుడిలోనికి గాలి బాగా కొట్తోంది.....తను తడిసిపోతుంటే కూర్చునే తడుముకొంటూ ఒకమూలకు పోతుండగా చేతికి యేదో తగిలింది.మెల్లగా చేతితో తడిమాడు. చల్లగా తగిలింది. అలా చేతితో ఒళ్ళంతా తడిమాడు. దాసుడు చచ్చిపోయాడని నిర్ధారణచేసుకోడానికి ఒక క్షణమైనా పట్టలేదు.

ఆ శవాన్ని....ఆ తలని రెండుచేతులతో గట్టిగా పట్టుకొని గుండెకు హత్తుకొంటూ బెక్కాడు. యేడుపు ఉధృతంగా వచ్చేసింది. కన్నీరు కాల వల్లై దానునిమీద పడజొచ్చింది. ఆ యేడుపుతోనే "నిన్ను ఆకలితోనే సంపేశారు.... మా అయ్యా....మా దాసయ్యా! నిన్ను ఆకలితోనే సంపేశారురా!.....మా తల్లికి యింక దీపం యెవురు పెట్టారు? శివా లెవరే స్తారు?" ఒకటే యేడుపు! ఆ గోల అంతా వురుముల భీకరధ్వనిలో కలిసి పోయింది. ఆ కన్నీరు దానునిమీదనుంచి జారి ప్రకృతిచల్లిన వానలో చేరిపోయింది!

21

మరుచటిరోజు వుదయం - వర్షం వెలిసి ప్రకృతి ప్రశాంతంగా వుంది. విరిగిన చెట్లు,యెగిరిన యింటి కప్పులు భీభత్సపు అవశేషాలుగా అగుపిస్తున్నాయ్.దానుడు ఈ మట్టిలో పుట్టి, యీ వూరు మన్ననే నమ్మి కొని, బ్రతికి, చివరకు యేటిఒడ్డునబుగ్గయిపోయాడు.

మధ్యాన్నమయ్యేసరికి పేపేరు ముంచుకొచ్చింది. హోరుమనే ఆ ప్రవాహపువడి వూరి చివరవరకు వినిపిస్తోంది. రెండు ఒడ్డులుతీసి పారి యెదుట ఒడ్డునవున్న భైరి గ్రామంలోకి కూడా ప్రవాహం చొచ్చుకు పోతోంది. ప్రజలు యిల్లు వాకిలీ విడిచిపెట్టి దగ్గరగా వున్న గుట్టమీదకు వెళ్ళిపోతున్నారు. నవిరి గ్రామంకు ఆ ప్రమాదం లేదు—ఒడ్డు యెత్తుగా వుండటం, దక్షిణపువేపు యిసుకదిబ్బలు, దిబ్బలపై సరుగుడు తోటలు వుండటంవల్ల యేరు ఎంతవచ్చినా వరదబాధ వుండదు.

ఏరు రానురాను హెచ్చయి బొబ్బలుపెట్తోంది. చెట్లూ,పశువులూ, కలపకంపనూ ప్రిప్పుతూ క్రోసుకుంటూ పోతోంది.జీలుగుతెప్ప లేకుండా యెటువంటి గజయీతగాడూ యేటిలో దిగలేకపోతున్నాడు. గంగమ్మతల్లి రాను రాను రౌద్రస్వరూపిణి అవుతోంది.ఒడ్డును దభీమని కూల్చేస్తోంది. వంతెనను గజగజలాడిస్తోంది. తెప్పలమీదనున్న మనుషుల్నికూడా తిప్పిరీలలో గిరగిర ప్రిప్పి ముంచబోతోంది—ఏమిటీ భీభత్సం? ఎందుకీ ప్రళయాకారం? ఎందుకింత ఒడుకు దుడుకులు?—ఏవమ్మా—మొన్ననే

వెన్నెల్లో సొగసుతో, సొంపుతో, మువ్వల రవళులతో నృత్యంచేసిన దానివి, యింతలో యీ భీభత్సం దేనికమ్మా? ఎప్పుడూ ఆ మాధుర్యం నీలోవుంటే—కంటికి యింపై నీ ఒడ్డునవున్నవాళ్ళలో భావోద్రేకాలు కలిగించి కమ్మగా రాగాలు కలకాలం తీయించేదానవే!

ఏరు నవ్వింది! కారుచీకటిలో ఒకమూల చిన్నవెలుగు, నిరాశలో ఆశారేఖ, గతం జ్ఞప్తికితెప్పించింది ఒకప్పుడు యేరు భీభత్సంగా వచ్చింది. రానురాను తగ్గి చూపుకు పసందుగా ప్రశాంతంగా పారజొచ్చింది. వేసవిలో యెండి స్తబ్ధురాలైంది. పెనుగాలికి యిసుకరేణువులే యెగిరాయ్. తాగడానికి నీట్టిబొట్టు యివ్వలేని నికృష్ట నిర్జీవియ్యైంది! మళ్ళీ భీభత్సమైన వరదవస్తేగానీ ఆమెలో ప్రాణం తొణికిసలాడలేదు!

ఏదేశ చరిత్రకైనా, ఏ వ్యక్తి బ్రతుకుకైనా నేనే ప్రతిబింబమని తెలుసుకోలేక పోయినందుకే కామోసు యేరు నవ్వింది! ఆ భీభత్సమే లేకపోతే ఆ మనోహరమైన ప్రశాంత జీవితానికి ఆస్కారం వుండేదా!

జీవితంలో నిజంగా ఒడుకుదుడుకులతోనే దాసుడు జీవించాడు. సుఖంగా స్తబ్ధుగావుంటే తనలో ప్రాణంవుండీ లేనట్లే అయ్యేది. ప్రాణం లేని మనిషి, అలాంటి మనుషుల్ను జాతి యెలా వర్ధిల్లుతుంది?

నవిరిగ్రామంలో యెందరో పుట్టారు—ఎందరో గిట్టారు. లోటు కనపడలేదు. కానీ దాసుడులేని లోటు కనిపిస్తూనే వుంది. నీలమ్మగుడిలో దీపం పెట్టేవాడు లేరు. బాధగా బరువుతో వున్న గుండెలను యేమాటలు తేలికచేసేవో, ఆ మాటలు అటువంటివాళ్ళకు వినిపించలేదు. ఆపదలో, ఆవేశాలలో యే హృదయం సామెతలతో, మంచి మాటలతో లేశమాత్రమైనా అసూయలేని అపూర్వమైన అభిమానంతో, ప్రేమతో లాలించేదో ఆ గుండె కరువె పోయింది. దాసుడు చనిపోయాక కూడా జీవించాడు. కోడలు కోపంతో యెగిరిపడి మాటలు విసరడానికి మామ ఇక లేడు. కొడుకు కొఱుక్కునీ, పీకి తినడానికి తండ్రి లేడు. ఆమె కోపాన్ని, వాడి రాక్షసత్వాన్ని చల్లగా భరించే కుంద పగిలిపోయింది. ఇప్పుడు చెదిరిన కోపాలు, విహరిస్తున్న రాక్షసత్వం వాళ్ళనే బాధపెట్టజొచ్చినయ్. ఆ ముసలాడు యెంతమంచోడు! కొడుకునకు యిప్పుడు అయ్య జ్ఞాపకంవస్తే

బావురుమని యేడుస్తాడు.కోడలు తను యెంత అన్యాయం చేశానని నొచ్చు కుంటుంది. ఆ యేడుపు రాకుండా వుండాలంటే తను అయ్యను జ్ఞాపకం తెచ్చుకోకూడదు. జ్ఞాపకంరాకండా వుండాలంటే తను యిలా బ్రతక కూడదు. తన మనసు యింకెవరి అధీనంలోనో వుండాలి! అంచేత దొంగతనంచేసో, పనిపాట్లుచేసో, పేకాటఆదో యేంచేసి యేం వచ్చినా వూర్లో దొంగసారాకొట్లో పోసి తండ్రిని మరచిపోతున్నాడు. పెళ్ళం కూలీనాలీ దొరికినమట్టుకు చేసి, లేనప్పుడు పెద్దయిళ్ళల్లో అడుక్కొని పిల్లలను పోషిస్తోంది.

ఒకనాటి సాయంసమయాన నీలి వంటఅయ్యాక వీధి అరుగు మీద పత్తి బాగుచేసుకుంటోంది. ముసలమ్మ ఒక మూల కూర్చోలేదు. ఏదో పనిపాట్లు చేసుకుంటోంది. కాస్త అలసట రాగానే రెండేసి రోజు లకి జ్వరంవస్తోంది. ఈవేళ జ్వరతీవ్రత లేకపోవటంవల్ల మనుమరా లుకు ఏకులు చెయ్యటంలో సహాయం చేస్తోంది. దగ్గర నీలి కూర్చుంది. అప్పుడే వెంకన్నకు కొద్దిగా అన్నం గంజీ పోసింది. వెంకన్న తింటు న్నాడు. ఇంతలో పీసగొంతుక గట్టిగా వినిపిస్తోంది. వీధిలో యెదురుపడ్డ వాళ్ళని ఆపి "ఓరయ్యా! సూద్రపోడ్ని పప్పు తినమంటే యెలాగరా? అందరూ పప్పుతింటే రేపొద్దున్న పైదండు వస్తే కత్తీతుపాకీ పట్టుకో గలరా? శూద్రపోడి బతుకే మాంసం! ఆడు తుపాకీ పట్టుకోవాలంటే దేముడూ సారా రెండూ వుండాలంటావా, లేదంటావా?"

నవ్వుతూ వాళ్ళు ఒప్పుకున్నారు. పీస గొంతుక మరింత హెచ్చించి అభినయంతో "ఆ గవుర్నమెంటోడు మంచిసరుకు యిచ్చేవోడు తక్కువ ధరకి! ఈ దొంగనాయు లంతా పెద్దసరుకు ఎక్కువ ధరకిచ్చి మనుసుల్ని యేగంగా సంపేస్తన్నార్రా! నాకు తెలుసును.... ....నాకంతా తెలుసును.... యిది నా గవుర్నమెంటోడుపని కాదులే!"

గుంపులో ఒకడు "మరెవడిదిరా? సూశావా? ఆడు యెగిరేపిట్టల్ని పంజిరంలో పెట్టానంటే యేం అవుతాది! ఏనాడూ తాగనోడివి నివ్వు తాగావా? పదిమంది జబ్బులొచ్చి సస్తన్నారు—నాయుడూ, కరణాలు, పైసునోళ్ళు సారాకొట్టోడు బాగుపడిపోతన్నారు!"

పీస పకపక నవ్వుతూ మళ్ళీ చప్పున నవ్వునాపి "ఏమన్నావయ్యా! నా గవుర్నమెంటోడిని నాలోంటోలనీ అంటావా? ఛాఛా .... మీదనున్న నా గవర్నమెంటోడు, కిందనున్న మనం మంచోలమే — ఈమధ్య నున్నోలే — దేముడు వరం యిచ్చినా పూజారి యివ్వడురా! అయ్యా, నం దిని పందిసేస్తారు....పందిని నందిసేస్తారు! సూశావా? కరణం దొంగ లెక్కలు రాసేసినాడా! పుల్లయ్యని కైదులో పెట్టేసినారా....నిన్నటికి ఈ యేళకీ నివ్వు మారిపోనావు — అలాగే రావా మంచిరోజులు"

ఆ దగ్గరలోనే నీలి యింటిదగ్గర వున్న వెంకన్న ఉత్కంఠం ఖస్సుమనటంతో పీస యిటువేపు వచ్చాడు. వెంకన్న మాడిన కడుపు పూటుదేరటంతో శక్తివచ్చి నిల్చొనే "వస్తాయి! ఊరంతా యీ పెద్ద నాయలంతా పెట్టిన కాటకంతో మాడిపోతూ గొట్టెలయిపోనారు! దేముడు కళ్లు యిచ్చినాడుకాడు!"

పీస దగ్గరగా వచ్చి నీలిని చూడగానే "ఏం అమ్మీ! ఈ గుడ్డోడు తక్కువ పాపాలు సేసినాడా, ఏమయినాడు? అలాగే యెవురిరోజు వాళ్ళకి వస్తాది. మనం అందరినీ పీకడం మేలా? ఆ కర్మే రాదంటై పీకుతాది!"

గుడ్డివెంకన్న "వస్తాను తల్లీ" అంటూ కర్ర సహాయంతో చిన్న చిన్న అడుగులు వేస్తూ ఆగి గట్టిగా "ఎవుడిపాపం వాడినే తింటాదని ఆ పిల్లులకి రొయ్యల మొలతాళ్లు కట్టండి! ఆ కుక్కలకి పెత్తనం యిస్తే యీ పేదోలింటి కుండలన్నీ కెలకవా? దాతా దైవం లేని కొంపలాగ ఊరంతా అయిపోతుంటే కళ్లున్న యీ మనుసులంతా గొట్టెలయిపోతు న్నారు! అందరూ కూడి ఈ నలుగుర్ని కట్టి పంచాయితీ పెట్టించండి!

కొడుకు మామ్మ నేర్పిన సామెతలు అంటుంటే, సంతోషంతో పుల్లయ్య "ఏంరా గుడ్డోడా, అలా గరుస్తున్నావ్!" అని పలుకరించగానే వెంకన్న ఆగి "నాయనా పుల్లిగా! నా తరవాత నివ్వే వూరిపేరు నిల బెట్టావ్. నాను గుడ్డోడినయ్యాను. నీకు కళ్లున్నాయ్. పేణంపోయినా నీతికి నిలబడాలరా! ఊరిలోవున్న బీదా బిక్కి పడుకున్నారు! ఆలని లేపి, నాయనా! సచ్చినోలకి ప్రాణంపోసి, బతికి బగమంతుడ్ని సూపించు! ఆలు అప్పుడు మనుసులవుతారు. ఏనాడు ఆలు మనుసులయ్యారో, శవాలను పీక్కుతినడానికి వున్న ఈ రాబందులన్నీ యెరిగిపోతాయి!"

వెంకన్నకు వుద్రేకంతో ఒళ్లు పులకరించిపోయింది. పుల్లయ్య బదులు చెప్పలేదు. మల్లుమాత్రం వాళ్ళ మామ్మఅనే సామెతల్లో ఒకటైన "నోరూనోరూ నొల్లావా....వీపువీపూ కాశావా?" అంటున్నాడు. పుల్లయ్య "రేపు సూద్దాంలే" అంటూ వాకిట అడుగుపెట్టినా పీస మాటాడలేదు. మల్లుకు పీసతాత మెడను చుట్టిపేసి "నోరూనోరూ నొల్లావా....వీపు వీపూ కాశావా" అంటున్నాడు.

"బాగుందిరా తాతా" అన్నాడు పీస. ఆ పొగడ్తతో మల్లు తన తెలివిని విప్పుతున్నాడు. "బుద్ధి బుద్ధి బాగున్నావే —బువ్వా నీవుతింటున్నావే!"

పీసకు యెంతో ముచ్చటవేసి మనవడ్ని ముద్దులాడాడు. నీలి చప్పన కలుగజేసుకుని "అయ్యా! తాగావా" అంది.

పీసను ఈప్రశ్న మేలుకొలిపింది. ఇంతవరకూ మౌనంగా వున్న యీ గొంతుక యీ ప్రశ్నతో మైకాన్ని పటాపంచలుచేసింది. వెంటనే జవాబు చెప్పలేకపోయాడు. కొంతసేపటికి "అమ్మా" అన్నాడు. మళ్ళీ నోరుపెగల్లేదు. వాస్తవిక పరిస్థితులలోపడ్డ పీసకు దుఃఖం ముంచుకొచ్చి "పిల్లా జెల్లా మాడిపోతుంటే సూడలేక — సేతకాక....ఆ మంగలోడు పట్టిస్తే....ఓ పెణమేనా యియన్నీ మరిసిపోతే....పేణానికి సుకమని...."

కాస్సేపు నిశ్శబ్దంగా వుంది. పుల్లయ్య "నీలాంటి రోజులు యింక మాకూ వస్తాయిలే" అని అనబోతూ పెళ్ళంవేపు చూచి వూరుకున్నాడు.

22

ఒక సెంటు జాగాయైనా తన స్వాధీనంలో లేనిది పోతులు వుంచుకొని యేంచేస్తాడు? కొనేవాళ్లు వస్తున్నారు. ఐదేళ్ళయి దొడ్డిలోవున్న పోతుల్ని విడిచిపెట్టడం కష్టమనిపించడంవల్ల ధర హెచ్చు చెప్తున్నాడు. బేరం కుదరటంలేదు. ఇలా వుంచుకొని లాభమేమున్నదంది నీలి. మరి కొద్దిరోజులుపోతే అవి ఆకలితో వుండాలా? అమ్మెయ్యమని బలవంతం చేసింది. విధిలేక ఒప్పుకున్నాడు.

వాటిని కొన్న పొరుగూరివైతు సొలనించి పోతులు విప్పటం చూచిన మల్లుత్రోవకాశాడు.చేతిలో బెత్తంవుంది.యజమానివైపు చూస్తూ

కదలనిపోతులు, మీద కొరడాతో దెబ్బలు పడగానే సాలనుంచి బయటకు పరుగెత్తాయ్.కొత్త యజమాని వెంటపడ్డాడు.మల్లు పోతులు వడిగా నడుస్తూ తనవేపు వస్తున్నా కదల్లేదు. "హోయ్" అని అరుస్తున్నాడు. ఈ అరుపు పుల్లయ్యకు వినపడి పరుగెత్తాడు. పోతులు మట్టివేస్తాయని తోచింది. త్రోవలో లేవమని అరిచాడు. క్రొత్త యజమాని కంగారు పడుతూ యింకోవేపు పోతులను త్రోలబానికి ప్రయత్నించాడు. కానీ పోతులు మల్లు మాటలు విని ఆగిపోయాయి.అలా పుసులుకట్టిన కళ్ళతో మల్లువేపు చూస్తూ తలలు ఆడించాయ్. "అయ్యా! పోతులు కట్టు" అన్నాడు. అయ్యవచ్చి కొడుకుని యెత్తుకొని దారి తప్పుకున్నాడు. ఆగిపోయిన పోతులు కదల్లేదు.మళ్ళీ కొరడాదెబ్బలు చర్రుమనగానేముందుకు పరిగెత్తాయ్. అయ్యచేతుల్లో వున్న మల్లు చేతిలోని బెత్తం ఆడిస్తూ ముందుకు పరిగెత్తాలని గుంజూటన పడుతున్నాడు.పుల్లయ్య కొడుకును గట్టిగా పట్టుకొని ఇంటివేపు ఒక్కొక్క అడుగువేస్తుంటే కొడుకు గోలపెట్టి యేడుస్తున్నాడు.

పెరటి వాకిటలో కూర్చున్నాడు. క్రింద కుదించిన కొడుకు కాళ్లూ చేతులూ కొట్టుకొని యేడుస్తున్నాడు. పుల్లయ్య మారుమాటాడకండా అలా సాలవేపు చూస్తున్నాడు. కంటికి పోతులు కనిపిస్తున్నట్టున్నయ్. కాని తేరిచూస్తే కనిపించలేదు. తనచేతులూ కాళ్ళూ విరిగినట్లున్నయ్.ప్రియాతి ప్రియమైన యింటిమనుష్యులు మళ్ళీ తిరిగిరాకుండా వెళ్ళిపోయినట్లనిపించింది.తను యిక. లైతును కానని జ్ఞప్తికివచ్చి దుఃఖం ముంచుకొచ్చింది. గర్వంతో నిండిన లైతురక్తం పల్చబడిపోయినట్లనిపించింది. బాధతో బరువుతో నిండిన గుండెతో లేచాడు.కొడుకును లేవనెత్తి గుడ్డతో ఒళ్ళంతా తుడిచాడు. అయినా యింకా మన్ను అంటుకొనే వుంది. "దుక్కికి తీసుకెళ్ళాడు. రేపు మన పోతులు మన సాలలోకి వస్తాయి" అని ఓదార్చాడు.

ఏటికివెళ్ళి యిద్దరూ బుడకపెట్టారు. ఆ దగ్గరగానే పోతులు కడిగేవాళ్ళలో ఒకడు "పోతులు ఎంతకమ్మావు పుల్లిగా?"అని అడిగాడు. "నూట అయిదురా" అన్నాడు. అలా అంటున్నప్పుడు కొడుకు తండ్రివేపు చూస్తున్నాడు.ఇంటికి వెళ్తుండగా త్రోవలో వెనుకకుతిరిగి"అయ్యా పోతులు రానేరావు....అబద్ధం ఆడితే కళ్లు పోతాయికదూ?"

పుల్లయ్య జబాబు చెప్పలేదు. కానీ యెత్తినతల దించాడు.

ఊడుపులయ్యాయి.ఈ సంవత్సరం పైవాళ్ళ పనిపాట్లకు వెళ్ళాడే గాని పొలంలో వున్నంతసేపూ మనసు మధనపడేది. కొడుకు వెంట వుండి యెంతో సహాయంచేస్తున్నట్లువుండి మధ్య మధ్య వింతవింత ప్రశ్నలు వేస్తూంటే యెక్కడలేని దుఃఖమూ వచ్చేది. ఒక్క యెకరం పొలంవుంటే చెమటతోనే పండించేవోడ్ని అనుకొనేవాడు. ఊడుపుల య్యాక పనిపాట్లులేవు. పోతులమ్మిన డబ్బు బియ్యం కొనటంతో సరి. కొడుకు తనుతింటేగానీ తినడు. తను చిక్కిపోయినా ఫరవాలేదు. తన కొడుకుమాత్రం చెక్కు చెదరకూడదు.ఈసారి అప్పుకు వెళ్తే రాజిగాడు ఇంకేం వస్తా దన్నాడు.ధర కట్టించి యేంవచ్చినా తీసుకపొమ్మన్నాడు. పుల్లయ్యకు పౌరుషం వచ్చింది. అంతపని మాత్రం చెయ్యనన్నాడు.అలా వడ్డీతో మునిగిపోతుంది గానీ మరేం లాభంలేదని యింకోప్రక్క పీక్కు తింటోంది. నీలివెళ్ళి పదిరూపాయలు బ్రతిమాలి తెచ్చి ధాన్యంకొని దంచి వ్యాపారంపెట్టింది. రానురాను ఒకపూట గంజికి, ఒకపూట అన్నంకూ సరిపడేటట్లు వ్యాపారం పెంచింది. కొందరికి అరువులిస్తేగానీ వీలయ్యేది కాదు. ఆ డబ్బు సరిగ్గా వసూలయ్యేదికాదు. నీలినిచూసి పదియిళ్ళవరకూ ఈ వ్యాపారంలో దిగారు. పొరుగూరికి తీసికెళ్ళి మరీ అమ్మేవారు. నీలి బ్రతిమాలి రాజిగాడిపెళ్ళందగ్గర పాతిక తెచ్చి కర్రలవ్యాపారం చేయ మని మొగుడ్ని ప్రోత్సహించింది.రోజు కో కావిడి కర్రలు పొరుగూరికి మోసుకవెళ్తే రూపాయివస్తుంది. పుల్లయ్యకు చాలా నామోషీ అనిపిం చింది. ఒకనాడు చుట్టుపట్లా పేరుపొందిన పుల్లయ్య ఒక కంబారిలా కర్రలకావిడి మోయటమా! వాళ్లు ముఖం చూడకండా బేరాలాడేవారు! ఏదో మాట విసరేసేవారు. ఒక్కరోజుకే ఒళ్లు చచ్చిపోయింది. కాని పెళ్ళం పిల్లల ముఖం చూసి యింకోరోజు వెళ్ళాడు. ఇలా రానురాను అలవాటుపడ్డాడు.

ఇంట్లో పరిస్థితిచూసి పీస పరిస్థితి రాదని పుల్లయ్య సంతోష పడ్డాడు. భార్య చెప్పిన మాటలయందు తనకు నమ్మకం కలిగింది. తను కష్టంమీద బతుకుతున్నప్పుడు బాధపడడంలో అర్థంలేదనుకున్నాడు. ధరలు రోజురోజుకూ పెరిగిపోతున్నా తనకు ఆ పెరుగుదల కనపడలేదు.

తనూ ఇప్పుడు రూపాయివున్న కావిడి రూపాయి పావలాకి అమ్ము తున్నాడు. పెళ్ళం బియ్యం రూపాయికి అడ్డ అమ్ముతోంది. కర్రలు తను ధరతగ్గించి యెందుకు అమ్మకూడదనుకున్నాడు — ఊరులోనేకాదు అన్ని వూర్లలోనూ ధర లిలా యెక్కువగా వుంటే తనెందుకు తక్కువకి అమ్మాలనిపించింది. రానురాను కావిడి రూపాయన్నరకు అమ్మాడు. నిజా నికి తనకు షావుకారు దగ్గర పన్నెండణాలకే గిట్టింది. ఒకపూటకు పన్నెండణాలకూలే-ఎంతయెక్కువ! అనుకున్నాడు. అయినా తక్కువకి అమ్మడానికి మనస్కరించలేదు. ఇప్పుడు రాజిగాడు, పేరయ్య వగైరా రాబందులను కొనేవారు జ్ఞప్తికివచ్చారు. ఇదివరకల్లా తనకూ వారికీ భేదంవుందని — వాళ్లు రాబందులు, తను మనిషి అనుకొనేవాడు. కాని వారిది తనలాంటి ఆశే అని జ్ఞప్తికివచ్చి మనుషులంతా మంచివాళ్ళే అని దాసుడుచెప్పిన మాటల్లో ఎంత సత్యంవుందో గ్రహించాడు.

ఇలా మూడునెలల్లో యింట్లో జరుగుబాటు వెళ్ళింది. ఈ విపరీత మైన ధరల్లో డబ్బు కొల్లలుగా మూటలుకట్టినవాళ్లు సద్వినియోగంకోసం వుబలాటపడుతున్నారు. ముఖ్యంగా పెద్దరైతులే డబ్బుచేసుకున్నారు. చిన్నరైతులు సర్వనాశనం అయ్యారు, చిన్నవాళ్ళ భూములు పెద్దలు కొన్నారు. ఆ డబ్బుకు ధాన్యం నల్లబజారు రేటులో యిచ్చారు. ఈ పెద్ద రైతులు యిక భూమి హెచ్చుధరలకైనా అమ్మేవారు లేకపోవటంతో మిగతాడబ్బు యెలా పెట్టుబడి పెట్టడమని వుబలాటపడ్డారు. ఒకడు వూరిలో రోడ్డుప్రక్కన ధాన్యంమిల్లు పెట్టాడు. మిల్లుకు అనుబంధంగా చిల్లర బియ్యంకొట్టుకూడా పెట్టాడు. ఒక నెలరోజుల్లో పదికుటుంబాల బ్రతుకులు గంగలో కలిశాయి. ఆ బ్రాగే గంజికైనా ఆధారం లేక పోయింది. ఐదుకుంచాల ధాన్యంవున్నా మిల్లుకి వెళ్ళిపొయ్యేది.చౌక-డబ్బు లేకపోయినా ఆ ధాన్యంనుంచి వచ్చినతౌడు యిచ్చివేస్తే చాలు! దీనివలన పెద్దరైతుదగ్గరనుంచి మూలనున్న ముసలమ్మకూడా ధాన్యంమిల్లుకే తీసు కపోయేది. ఇదివరకు పెద్దరైతుల యిళ్ళల్లో కూలికిదంచే వ్యవసాయ కూలీజనం వృత్తులు పోయాయి.పరిస్థితి మరీ అధ్వాన్నం అయిపోయింది. ఈ మిల్లుబియ్యం అన్నం మల్లెపువ్వుల్లా వున్నాదని వూరంతా సంతోషిం చారు కానీ, దీనివలన కొందరి వృత్తులు పోయాయి. ఒక పెట్టుబడిదారు

మరింత భాగ్యవంతుడయ్యాడు. పెద్దరైతు భార్యకూడా యిదివరకు ధాన్యందంపులో పాల్గొనేది—అటువంటి శ్రీమంతుల స్త్రీలకు సుకుమారత్వం అబ్బి రానురాను కొన్నాళ్ళకు వూర్లో వైద్యుని అవుసరం హెచ్చయింది. పొరుగూరి వైద్యునిదగ్గర క్రొత్తగా నేర్చుకున్న వైద్యుడు వూర్లో మకాంవేశాడు. ఈ వైద్యునికి ఇంజెక్షను యివ్వటంవచ్చు కానీ ఆ యింజక్షను అన్నమాట ఆపల్లీయులు అన్నట్లుగానే "యిండీషను" అనే అంటాడు. సూదిమొన శరీరానికి తగిలితేకాని దబ్బుపడదు. అంచేత గజ్జికుపులనుంచి విషజ్వరాల వరకు సూదిమందు తగుల్తోంది. అవసరం లేనివాటికైనా "డిష్టిల్డువాటరు" యింజెక్షనుయిచ్చిను మూడు రూపాయలు పుచ్చుకుంటున్నాడు. ఆ పల్లీయులకు కావలసింది గాజు బుడ్డి (ఆంపోలు) కోస్తున్నాడా లేదా అన్నదేగాని అందులో మందుతో వాళ్ళకు సంబంధం లేదు.

సిలి పుల్లయ్యకూడా యిందులో చిక్కుకున్నారు. బియ్యం వ్యాపారం సరి. కిరలవ్యాపారం కొద్దిగా సాగుతోందనుకుంటే అటువేపుకూడా పోటీ వస్తోంది. విడిగా చెట్లు అమ్మటంలేదు—తోటకు తోటలే కంట్రాక్టు పాడి దబ్బున్న ముగ్గురూ మరింత దబ్బు చేసుకుంటున్నారు. పుల్లయ్యలాంటి చిల్లరవ్యాపారులకు వచ్చేవి చెట్లు కొట్టగా వచ్చిన మొదళ్లు. ఇసికప్రదేశం అవటంవల్ల ఆమొదలుచుట్టూ పెద్దగొయ్యిత్రవ్వి అందులో దిగి గొడ్డలితో కొట్టి మొదలు బైటవెయ్యాలి. ఇది అంత సులువైన పని కాదు—దీనివలన జ్వరగుబాటు తక్కువైనా కష్టం హెచ్చవుతోంది. పుల్లయ్య వారంరోజులకే చిక్కిపోయాడు.

ఒకనాటి పగలు పదిగంటలప్పుడు గొడ్డలి, పార భుజాన వేసుకొని వూరికి దక్షిణదిక్కుగావున్న సరుగుడు తోటలోనికి వెళ్ళాడు. అప్పటికి మల్లు యింట్లోలేదు. వీధిలో యెవరో సాయెబు గారడీచేస్తుంటే పిల్లలతో పరుగెత్తాడు:

పుల్లయ్య గమ్యస్థానానికి చేరుకున్నాక పార, గొడ్డలి అక్కడవేసి పంచె యెగగట్టి లంగోటి లాగికట్టాడు. గేరాగిరజాలు ముడివేశాడు. పార పట్టుకొని సరుగుడు చెట్టు మొదట్లో గొయ్యితియ్యటానికి మొదలు పెట్టాడు. పనిలో నిమగ్నమైపోయాడు. రానురాను యెండ హెచ్చుతున్న

కొద్దీ చెమట జారి గోతిలో పడ్తోంది. ప్రక్కనేవున్న సరుగుడుతోట గీమంటోంది—చిలకలు గుంపులు గుంపులుగా ఆ చెట్లపై వాలి యెగిరి పోతున్నయ్. అంతదూరంలో లంకలోని వరిచేలు పచ్చగా నిండుగా వుండి తలలూపుతున్నయ్. ఎక్కడో ఒకమూల ఒకమనిషి వుంటున్నాడు ఒక బొరియనుంచి నక్క యింకో బొరియవేపు పరుగులు తీస్తోంది.

పుల్లయ్య వీటివేపు చూడనేలేదు. ఈ శబ్దాలు వినిపించుకోనేలేదు. అల్లంతదూరంలో యేరు పారుతోంది.

నిలువెత్తు గొయ్యి తియ్యటం పూర్తయేసరికి ప్రొద్దు నెత్తిమీదికి వచ్చింది. గొయ్యిలోనికి దిగేముందు చుట్టూ చూశాడు. మనిషిజాడలేదు. గొడ్డలి భుజానవేసి మెల్లగా మొదలుపట్టుకొని గోతిలోనికి దిగాడు. మీదికి చూశాడు. ప్రొద్దు కంటిమీదపడి జిగేల్మన్నాది. కళ్లుమూసి తెర చేసరికి యేదో గొంతుక వినిపించినట్లయింది.నూతిలో గొంతుకలావుంది. ఎవరో అనుకొన్నాడు. ఆ క్షణంలోనే చచ్చిన ఆప్పన్న జ్ఞాపకంవచ్చాడు అప్పన్న బ్రతుకంతా కళ్ళయెదుట ప్రత్యక్షమైంది. అప్పన్నబ్రతుకు తన బ్రతుకుతో పోల్చుకోసాగాడు.

అప్పన్న తనలాగే కష్టజీవి. బుగతభూమి తీసుకున్నాడు. ఉన్న యెకరం ఒక పెద్దరైతుపొట్టన పెట్టాడు. ముగ్గురుపిల్లలు. పెళ్ళం. పెద్ద కొడుకు మల్లులాంటివోడే. అయ్యా అని పిలిసే అప్పన్నకూడా కొడుక్కి అయ్యా అని పిలిచేవాడు. తనలాగె కావిడివేసి కర్రలు అమ్మేవాడు. నిరుడు వేసవిలోనేకదా యీదగ్గిరే అదిగో ఆతోటదగ్గిరే ఇలాగే గొయ్య తీశాడు....యింతగొయ్యే-యిలాంటి మిట్టమధ్యాహ్నం అప్పుడే....నాలాగ గొడ్డలి పట్టుకొని....మొదలు నరుకుతుంటే....యిలాంటి ఇసిక ఒడ్డంతా మీద కూలిపోయింది....ప్రేణంతోవున్న మనిషిని పాతివేసింది.... అయ్యా....అని అరిచాడట. తియ్యండర్రో అని అరిచాడట. యెండప్పుడు ఒంటిగా యీ త్రోవ యెవరు వెళ్ళినా యీకేక వినిపిస్తోందట....అవును. వాడే అరుస్తున్నాడు....ఒంటిగా వున్నాను. వాడే....గొంతుక రానురాను పెద్దదవుతోంది....తనవేపే అరుస్తూ అప్పన్న వస్తున్నట్లున్నాడు.... ఈ యిసిక ఒడ్డంతా తనమీద పడిపోతుంది. దెయ్యం.తనపీక పిసికేస్తాడేమో ....నాలాంటోడు—ఆడు నా పీకెందుకు పిసుకుతాడు. పుల్లయ్యని నా నా

దయ్యానికి భయపడ్తున్నానా?" .... తమాయించుకోబోతూ గొడ్డలితో మొద్దుమీద గట్టిగా రెండు నరుకులు వేశాడు. పైనుంచి ఒడ్డు కొడ్డిగా కూలి యిసిక తలమీద పడింది. తల దులుపుకొని మీదికి చూశాడు. అయ్యా అన్న పిలుపు వినిపిస్తోంది....ఆ పిలుపు అలసిపోయి సొలసి పోయి అరుస్తున్నట్లుంది. అప్పన్న మరీ దగ్గరగా వచ్చినట్లు అప్పన్నలా తనూ యెక్కడ చచ్చిపోతానోనన్న భయం, పిరికి ఆవరించాయి. తను చచ్చిపోతే తన పెళ్ళంపిల్లలూ అప్పన్నపిల్లల్లా వీధిలోపడి అడుక్కో వలసిందే!

ఈ తలపుతో గోతిలో వుండలేకపోయాడు. ఈవేళ యిదికొట్టి కావిడివేసి అమ్మితేగాని – రాత్రికి పస్తువుండవలసివస్తుందని తోచినా ఓక్షణమైనా వుండలేకపోయాడు. ఆ పిలుపు తనగుండెకు సూటిగా తగు ల్తోంది. పైకి వచ్చి చుట్టూ చూశాడు. పిలుపు తప్పించి యింకెవరూ కనపడలేదు, భుజాన గొడ్డలి, పారవేసుకొని యింటివేపు నడుస్తుంటే పిలుపు దగ్గరగా వినిపిస్తోంది. పదడుగులు వేసేసరికి గతుక్కుమన్నాడు. ఆ పిలుపు యిప్పుడు వింటుంటే యెక్కడలేని వుత్సాహం వచ్చేసింది. పరుగెత్తి ముందుకు వెళ్ళాడు. ఎత్తైన యిసుకదిబ్బ. వేడెక్కిన యిసుక దిబ్బ సగానికి యెగబ్రాకి యిసుకలో కాళ్లు దూర్చుకొని పైకి యెక్కడా నికి శక్తిలేని మల్లు, యెండకు కాళ్లుమాడిపోతుంటే అయ్యకోసం బాధతో కేకలువేస్తున్నాడు. పుల్లయ్య ఒక్కగెంతుగెంతి కొడుకును మీదికెత్తి గట్టిగా హృదయానికి హత్తుకున్నాడు. తండ్రీకొడుకుల చెమటలు కలిసి పోయాయ్!

23

రోజుకు రోజూ పుల్లయ్య చిక్కిపోతున్నాడు. ఎప్పుడూ తనకి అంటని విచారం నీడలా తన వెంటనే వుంటోంది. ఊర్లో పనిపాట్లులేవు. కష్టపడి కర్రలు అమ్ముకున్నా జరుగుబాటుకావటంలేదు. తనతోపాటు పిల్లలిద్దరూ చిక్కిపోతున్నారు. ముందుకేంగతి అన్న ఆలోచన తననింకా పీడిస్తోంది.

నీలిమాత్రం మనసులో యెప్పుడైనా తప్పి జారి యిలాంటి ఆలోచన వచ్చినా వెంటనే సర్దుకుంటోంది. ఒకక్షణం వూరకపోకండా రాట్నం త్రిప్పటం, ఇంటిపనులు చేసుకోవటం సాగిస్తోంది.

సమయానికి వూర్లో అప్పుపుట్టకండావుంది. ఇదివరకు వీళ్ళదగ్గర అప్పుతీసికెళ్ళినవాళ్ళుకూడా "తీర్చడానికి యేం వుందని అప్పుయిస్తామని" పైకి అనకపోయినా, లోన అనుకొని లేదంటున్నారు. కోమటి పేరయ్యను ఒకపూట రెండడ్డలు బియ్యం అరువీయమంచె, ఇంటినుంచి బయటకు గబగబ వచ్చి "ఇంట్లోవుండి లేదంటే మాలాడిని" అన్నాడు. ఈ అంతరార్థం గ్రహించిన పుల్లయ్య చప్పున ఒళ్ళుమండి "విన్యలంకమాలాడివే" అన్నాడు. దానికి పేరయ్య వూర్లో నలుగురుపెద్దలతో చెప్పి నానాహంగామా చేశాడు. ముఖ్యంగా మల్లు చిక్కిపోతుండటం చూడలేకపోతున్నాడు. ఒకోక్షణం తిండిదగ్గర మల్లుఅల్లరి చూసి అయ్యో! నాకొడుకు యేపుగా యెదిగేటప్పటికి ఇలా వచ్చింది కదా! అని మనసు పరిపరి విధాల పోయేది.

ఊర్లో తనకు ఇదివరకున్న గౌరవంలో నూరోవంతైనా లేదు. వయసులో చిన్నవాడైనా యిదివరకు యే సంబరాలైనా గరిడీలైనా తనే నడిపించాలి. తనకు యిదివరకు మిగిలిన ధాన్యం అంతా యిలా ఊర్లో వినోదాలకు సంబరాలకింద ఖర్చుపెట్టడంవలన పెళ్ళికి అప్పు చెయ్యవలసివచ్చింది. తను యిప్పుడు ఒక కూలివాడు. నలుగురి వ్యవసాయపుపనులు వాళ్లు చెప్పినట్లు చేసి సాయంత్రం బుట్టపట్టుకొని కూలి ధాన్యం కొలిపించుకోడానికి వెళ్ళాలి! తనే యీపరిస్థితికొస్తే తనకొడుకూ కూలిహాడే అవుతాడుగాని వూరికి ఘనం తెచ్చే పెద్దయెలా ఔతాడు? ఈ తలపులన్నీ కలిసి తనను రాత్రులుకూడా బాధపెట్టేవి. ఏంచేస్తే తన కొడుకు యేపుగా పసందుగా పెరుగుతాడు? దొంగతనం చెయ్యగలడు-కానీ ఆ డబ్బు యెంతకాలం? ఆకలితో చచ్చిపోతాడుగాని ఆలాంటి పాడుపని చేయనని భీష్మించుకున్నాడు.

అప్పుడప్పుడూ మనసు చిరాకుతో కుమిలిపోయేది. నలుగురు పెద్దలనీ దుయ్యబట్టేవాడు. తన పొలంమీద యింకేం రాదన్న రాజిగాడి మీదకు వురకబోయాడు. చిన్నవాళ్లు సహాయంచెయ్యలేరు. పెద్దవాళ్లు

ఈ కేకలవల్ల సహాయం చెయ్యకపోవటమేకాకండా యెలా పీడిచేత చిప్ప పెడ్డామని చూస్తున్నారు.

ఒకనాడు పీసయింటిదగ్గర వాదోపవాదాలయ్యాయి. గ్రుడ్డివెంకన్న "ఊరంతా పోగయితేగానీ రోజులు మారవ"న్నాడు. నాలుగు ఖానీలైతే గానీ పేదోళ్ళకడుపులు నిండవన్నాడు. దానికి పుల్లయ్య కాదనలేదు.

పీస నవ్వుతూ "ఎవడో వచ్చి మన పిల్లాజెల్లని యెత్తుకొని పోలేదు మనం తలొంచడానికి. ఊళ్ళో పదుగురికీ ఆశ ఆకాశానికి అంటించాలని తాపత్రయం; నాయనా ఆకాశానికి అంటుతుందా? ఆశ దబ్బున ఒక్కసారి కూలిపోయి ముక్కలు చెక్కలైపోదా? ఓర్సండి నాయనా ఓర్సండి— ఓరిస్తే కోడిగుడ్డు. వీశెమాంసంపడ్డ పుంజనదా? ఓరిస్తేనే మనిషి; అలాగ ఓరుపుమీద వచ్చిన ఫలసాయం సాలాకాలం వుంటాది."

ఇదేమీ నచ్చలే దిద్దరికి, ఊరు బాగుపడాలంటే యీలంతా సగానికి సగం ధరలు తగ్గించాలి. మంచిమాటలతో చేస్తారా? చెయ్యరని వీరి వాదన.

వెంకన్న ఇంటింటికీ వెళ్ళి చెప్తుంటే "ఆలవాకిటికి గెంజిపొయ్యమని యెల్లకపోతే నీకు జరగదు. కళ్లులేవు నీకెందుకురా ఒకమూల పడుండక"అని సమాధానాలు వస్తున్నాయ్.వెంకన్న లోలోన "గొర్రెలు; పీళ్ళల్లో ఉడుకురక్తంలేదు" అనుకున్నాడు.

పుల్లయ్య యింటికి వెళ్ళాడు. ఆపూట పొయిలో అగ్గివేయలేదు. అది తెలుసుకొని కొడుకుయెదట రాజిగాడిమీద. గ్రామపెద్దలమీద విరుచుకపడుతుంటే ముసలమ్మ అందుకుంది, "ఎందుకునాయనా నోరు జారేసుకుంటావ్? కొడుకుయెదరగా యిలా అని ఆచిన్నమనసుపాడుచేయక. ఆలకీ నీకు తెలిసినంత తెలీదుగావాల-తెలిస్తే లేనోలకిసెయ్యిదులిపేవోరే. అయ్యో; నా అన్నలూ తమ్ములూ ఏం తీసుకపోతామనే మాటలేదే అని వాళ్ళమీద కనికారం చూపించు. నీ కడుపులో బుక్కడుగంజి లేకపోయినా నిండినంత సుకంగా వుంటాది."

పుల్లయ్య చర్రుమన్నాడు. "ఒకమూల కూర్చోక నీ కీదంతా యెందుకే!" అన్నాడు.

ముసలమ్మ శాంతంగా "నాయనా! మనసు వెర్రయిపోకూడదురా. మనసు వెర్రయిపోతే మనిషిలేడు. జరగవలసింది ఆపేదానికి నివ్వెవ డవు? ఒకరు ఈ సెణం సేసిందాని, మంచిసెడ్డా మరికొన్ని సెణాలకి కని పించిపోతాది. అలాంటప్పుడు యిలా నివ్వు అయిపోతే పాడయిందెవరు? మనిషికి అభిమానంకన్నా దొడ్డదింకేమీలేదురా"

పుల్లయ్య యీ మాటలు వినిపించుకోనేలేదు. కడుపు ఒకమూల మండిపోవటంమూలాన "నీకేం? ఆ పూటకి గంజో కడుగో మా కడు డులు మాడ్సయినా పోస్తోందికదా,యెన్నిమాటలైనా అంటావులే! నాపీకకి యిదొకటి సుట్టుకున్నాది" అంటూ బయటకు వెళ్ళిపోయాడు.

నిబ్బున్న నీలి నిశ్చేష్టురాలైంది. ఏదో ప్రళయం వుందనుకుంది. ముసలమ్మవేపు చూసేసరికి ఆమె బోసిపళ్ళనవ్వు మెల్లమెల్లగా వలక బోస్తోంది కానీ నీలికి తెలుసు ఆ ముసలిగుండె కెంత సూటిగా ఆమాటలు తగిలాయో? నిజానికి రెండు నెలలుపైగా సరిగా భోజనమేలేదు. రెండేసి రోజులకి జ్వరం వస్తుంటే పచ్చి మంచినీళ్ళయినా నోటిలో పోయటం లేదు. అలాంటప్పుడు భర్త అన్నమాటల్లో యెంత అబద్ధంవుందో ఆమెకు తెలుసు. ఆమె ఆ ముదుసలిని మొగుడుబదులుగా క్షమాపణ వేడుకోవాలని దగ్గరగా వచ్చి ప్రక్కన కూర్చుంది. మెల్లగా అతిమెల్లగా దీనంగా భయంగా మామ్మతో "ఎందుకో కోపంతో అనేశాడు....మనసులో పెట్టు కోక మామ్మా!" అంది.

మామ్మ మెల్లగా తలత్రిప్పేసరికి మనుమరాలికళ్ళల్లో సీళ్లుగిర్రున తిరిగినాయ్. ఆ నీరుచూసి మామ్మకళ్లు తడిసిపోయాయి. మనుమరాలితల నిమురుతూ మెల్లమెల్లగా ఆగి ఆగి మాటలు జారవిడుస్తోంది. నాలుగిర పైల జీవితసారం అంతా ఆ గుండెనుంచి వెళ్ళగ్రక్కుతున్నట్లుంది. "అమ్మా!....నాకు యెదుటోలిమీద సెడ్డగా సెప్పుకోడానికి....సాలా ఉండేది. మీతాతమీదన్నీ — అయినా ఆ సెడ్డోలందరిమీదా మంచే సెప్పు కున్నాను — నాలికనుంచి కాదమ్మా గుండెనుంచే! అలాగ సెప్పుకోని కష్టపడ్డానని పైవోళ్లు అనుకోసి-కాని తల్లీ, అలాగ అనుకోవడం సెప్పు కోవడంవల్ల నాకిప్పుడున్నంత సంతోషం సుకం యెవరికున్నాదే! లోకం అంతా కోడైకూస్తాది నాయంతకష్టం యెవరూ పడనేదని-కానీ నాఅంత

సుఖమైన ఆడది లోకానవున్నదా? మట్టికుండనుంచి యీచర్మంకుండలో పడేసుకుని యిన్నాళ్లు బతికాను! ఇంకా కుండ పగిలిపోక యెంతకాలం వుండిపోతాది?" నీలికి ప్రతీమాటా హృదయానికి హత్తుకుంది. ఏమాటా ఆడకండా ముసలమ్మను గట్టిగా హత్తుకొని ఆమెఒడిలోనికి జారి ముఖం దాచుకుంది.

కొంతసేపయ్యాక, పుల్లయ్య చోడిపిండి పట్టుకొని వచ్చాడు. నీలి వంటప్రయత్నంలో వుంది. పుల్లయ్యనిచూసి ముసలమ్మ నవ్వుతూ "నాయనా" అని పలకరించి అన్నది "నివ్వెంత మంచోడివి కాకపోతే నా మనవరాల్ని అన్నిఖర్చులూ పెట్టుకొని పెళ్ళాడినావు. నన్నూ సేరదీసి పెంచినావు. సచ్చి మనవరాలి కడుపులో మొగాడివై పుట్టుకవచ్చి నీ ఋణం తీర్చుకోనా?" పుల్లయ్యకు సిగ్గువేసి గదిబయటకు వచ్చేశాడు.

చీకటిపడ్డాక కర్రలు అమ్మి పుల్లయ్య అప్పుడే వచ్చాడు. పీస మంచీచెడ్డా మాటాడుతున్నాడు. ఇంట్లోవున్న హీనమైన పరిస్థితులు చెప్పుకొచ్చాడేగాని ఋక్కడుగంజి పొయ్యమ్మా అని నాలికచివరకు వచ్చినా అడగలేకపోయాడు. వీళ్ళయింటిలో పరిస్థితి అంతబాగుండలేదని తెలుసు. వెళ్ళిపోయేముందు "అయ్యా పుల్లిగా. ఒకరేతిరిమీద నా యిల్లు తగలబడిపోయినా బాగుణ్ను! అక్కడే భూదేవి గజగజలాడి బద్దలయినా యింటంతా అలోమని సచ్చిపోదుము!"

ఈమాటలు నీలి విన్నది.వెళ్ళిపోతున్నవాణ్ని పిలిచి"ఈ పావలా పోళ్లకొని అంబలైనా యీరాత్రికి తాగండయ్యా" అని యిస్తుంటే పుల్లయ్య కొటకొటా చూస్తున్నాడు. ముఖం చేటంతచేసుకు పీస పరుగున వెళ్ళిపోయాడు. నీలి పీసవెళ్ళాక "నాను సెప్పాను — యిటికల పున్నంకి యిద్దరిపిల్లలనీ రెండిళ్ళల్లో కంచరితనానికి పెట్టమని. కడుపు మాడుతుంటే యింటిరాగటాసూస్తే యెలాగ? కష్టపడకండా ఆ లూరకనే యిస్తారా! ముందుకు పిల్లలుండగా సుఖపడడా?"

భార్యమాటల్లో అభిమానం వుట్టిపడగా పుల్లయ్య మాటాడలేదు. మిగిలిన డబ్బుతో పేరయ్యకొట్టుకు నీలి వెళ్ళింది. ఆ మరుచటిరోజు వుదయం ముసలమ్మ లేచి దేముడిమీద కీర్తనలు "రామ రాగవా-రచ్చించుము దేవా....రామ రాగవా!" అని పాడుకుంటోంది. మనుమడు దగ్గర

కూర్చొని వెనకపాట పాడ్తున్నాడు. మూడురోజులు పోయాక ఒకనాడు పొద్దు మీదికిలేవకమునుపే నడ్డి వంచుకొని ఇంటియింటికి వెళ్ళింది.నలుగురి దగ్గర శలపుతీసుకుంటోంది. మళ్ళీ మిమ్మలినందరినీ నా మనువరాలి కడుపులో పుట్టి సూడనా అని చెప్పింది. రాజిగాడి యింటికివెళ్ళి కూర్చుంటే మొగుడూ పెళ్ళాం చాలా అభిమానంగా చూశారు. రాజిగాడు అన్నాడు "సూడేమామ్మా!పుల్లిగాడు మాటాడితే నామీద ఇరుసుకపడ్తాడు. నా అయ్య ఆ గుడ్డోడుట — నాకు పగువుమర్యాద లేదట! నేనేం ఆడికి అపకారం సేశాను. ఆడిని కైదులో పెట్టితే ఆడుకోలేదా! ఆడికి కడుపు మాడతంటే బియ్యం కొలవలేదా! నాకైనా యేంవుండే! ఈ నలుగురి పిల్లలకి వంతులేస్తే ఒక్కొక్కడికీ యేంవస్తాది! ఆ పొలం మైనరుకొడుకున్నా డని యెవురూ సూడకపోతే నానే తెగించి రాంచుకున్నానా!మంచిగావచ్చి అడిగితే దావలసినదేదో యిచ్చీనా!"

ముసలమ్మ "నాయనా ఎవరి మంచీసెడ్డా ఆలదగ్గిరేవుంటాదిరా! ఒకడి కడుపు మనం యెట్టిసేస్తే మన కడుపొకడు యెట్టిసేస్తాడు. మనం యీ సంసారంలో కుడితికుండలో పడ యెలకలా కొట్టుకుంటాం! పెమిదలో వత్తికి సరిపడ్డనూనె పోయాలా! ఆ నూనె డబ్బుకాదురా — అభిమానంరా! నా కంటికి నివ్వూ పుల్లయ్యా యిద్దరూ ఒకటే, యిద్దరూ మంచోలే"

వెళ్ళిపోయేటప్పుడు అంతదూరం సాగనంపగా ముసలమ్మ నాయనా యింకెన్నాళ్లుండిపోతాను! నివ్వు ఒక కొమ్ముపట్టవా!" అంటే రాజిగాడు ముసలమ్మ భుజంమీద చెయ్యివేసి "అంతా నాదేనే మామ్మా" అన్నాడు. బోసిపళ్ళనవ్వు వొలగబడింది.

ఆ మరుచటిరోజు నీలమ్మగుడిబయట ద్వారంమీద తల ఆన్చి మొక్కింది. నదివేపు వంతెనవేపు, కంటికి కనబడ్డ ఆ వూర్లోవున్న అన్నిటివేపు చూసింది. ఇంటిదగ్గర వసారాలో కూర్చొని వీధిలో వెళ్ళి వస్తున్న అందరిని పిలిచేది.చెప్పవలసిన నాలుగు మంచిమాటలు చెప్పేది. చిన్నా పెద్దలనీ తాకి దీవించేది — ముద్దులాడేది.అభిమానం కట్టలు తెంచుకుని యిలా వారంరోజులు గడిచింది. రాత్రుళ్లు చాలాసేపటివరకూ,వేకువజామున లేచి, వచ్చిన భక్తికీర్తనలు పాడుకొనేది. "నాను పుట్టిన్నాడూ

వున్నావు---పెరిగిన్నాడూ వున్నావు—సచ్చిన్నాడూ వుంటావు.లోకంలో మనిషై పుట్టి నే చెయ్యవలసినపని నివ్వు చెప్పినట్లు చేస్తాను తండ్రీ" అని సూర్యదేముడికి మొక్కింది.

ఆపేళ ఆకాశంఅంతా మబ్బులుకమ్మాయి. సాయంత్రంవరకూ అప్పుడప్పుడు చినుకులు పడుతున్నయ్. ఆరాత్రి దూరాన్న మెరుపులు అగుపించాయి. మునలమ్మ జ్వరంతో ఒకమూల మూలుగుతూ పడుకున్న దల్లా చప్పున నడిరాత్రప్పుడు లేచింది. అంతా నిశ్శబ్దంగావుంది. అంతా పడుకొనివున్నారు. లేచి తలుపుతీసి బయటకు వచ్చింది. దూరాన ఆకాశాన చుక్కలు మెరుస్తున్నయ్. అక్కడక్కడా చిన్న మబ్బుతునకలు యిటూ అటూ కదులుతున్నయ్. ఆ చుక్కలు చూడగలిగేదృష్టి ఆమెకుంది.ఆ నిశ్శబ్దంలో....ఒంటిగా....వీధిగోడకు చారబడి కాళ్లు చాపింది. ....ఆ కొద్దినిముషాల్లోనే మాగన్ను నిద్దరపట్టినట్లయింది....ఏవోకలలు ....ఎవరో పెద్దలంతా ఆగుపిస్తున్నారు....ఎవరోవచ్చి వెళ్ళిపోతున్నారు. ఆమె మొగుడు....పోయిన సంతానాలు....వీళ్లూ వాళ్ళూ....తనను పిలుస్తున్నారు. ఏవేవోపూలరథాలు....గుర్రాలూ....ఆకాశంమీద అగుపిస్తున్నాయ్ ...ఇవన్నీ తనకోసమే....అన్నట్లు వాళ్లు చూపి పిలుస్తున్నారు....

మళ్ళీ తెలివివచ్చింది....తెలివి వచ్చేసరికి దీపం....ఆ వెలుగులో నలుగురూ గుమిగూడి వున్నారు....మనుమరాలు యేడుస్తోంది....ముది మనుమడు మల్లు గోలపెట్టున్నాడు—మామ్మా అని పిలుస్తూ "కయ్"మంటున్నాడు.కళ్లు తెరవగానే మనుమరాలు మీదగ్గగా వచ్చి తలపట్టుకుంది. ఆ ముఖం యింకా నల్లబడిపోలేదని ఆ బోసినోటి నవ్వే చెప్తోంది. "అమ్మా....తల్లీ....నా నీలమ్మా...." ఒకసారి మనుమరాలి తల నిమిరింది. ఆ ఖుష్కించిన చేయి అభిమానంతో నిండిపోయి మనుమరాలి ఒళ్ళంతా తాకుతూ, ఆ మూసుకుపోతున్న కళ్ళల్లో చివరికి మిగిలినసీరు అనందబాష్పాలై రాలసాగాయ్. "నా అమ్మా!" ఆగి మెల్లగా....అతి మెల్లగా....ఆగి మరీఆగి...."నెయ్యి కాలితే....కుండ యెత్తేస్తాడు.... ఓర్సనేడమ్మా....పుల్లయ్యా! ఆకుండ....పడిపోకుండా....కాయి తల్లి!.... ఇంకేంయిస్తాను!" ఈ మాటలు చెప్తూచెప్తూనే చివరిసారి కళ్లు తేరి మను

మరాలిపేపు, పుల్లయ్య, మల్లుపేపు చుట్టూచేరిన నలుగురిపేపు చూసింది. అందులో రాజిగాడు వున్నాడు, చిన్ననవ్వుతో అలా చూస్తూ చూస్తూనే దేహాన్ని చాలించింది.

24

వరిచేలు హారంపట్టున్నాయ్. మబ్బులు క్రమ్మి అప్పుడప్పుడూ వర్షాలు కురుస్తున్నాయ్. చలికాలం యింకా ప్రవేశించలేదుగానీ, వుండీ వుడిగీ కొద్దిగా రాత్రుళ్లు చలిపేస్తుంది.

ఒకనాటి రాత్రి: నడిరేయి చీకటి దట్టంగా వుంది. ఆకాసం మబ్బులతో నిండివుంది. సంజీవి ఇంటిపెరట్లో ఒక్కసారి గోల వినపడింది. దొంగవాడి జుత్తు పట్టుకొని ఆ చీకటిలోనే సంజీవి నాలుగు తగిలించినా, దొంగ మాటాడకండా ముఖం క్రిందికి దించివేశాడు. పెళ్ళం బుడ్డిదీపం వెలిగించబోతే గాలికి ఆరిపోయింది.చుట్టూ మనుష్యులు మూగిపోయారు. పుల్లయ్య, మల్లుకూడా పరుగెత్తారు.

మూగినవాళ్ళలో వ్యాఖ్యానాలు విసుర్లూ వరసగా వస్తున్నయ్. ఎవడో ఆ దొంగయెదవ—తన్నండి అని మని షో చెయ్యివేశారు. "మొన్న కట్టలో పెసలు వీడిపనే!"—"మా కోడిపెట్టలు వీడిపనే—!" "దొంగయెధవా! జరగకపోతే ముష్టియెత్తుకోకూడదూ?"—అంటున్నారు.

ఈ వ్యాఖ్యానాలు ఆడవాళ్ళ నోటివెంబడికూడా వస్తున్నయ్! ఆ దొంగ మూడురోజులబట్టి ఆకలితో అటమటించిపోతున్నాడు. తనేకాదు భార్యాపిల్లలుకూడా! ఇవన్నీ చూడలేక భరించలేక ఆకలిపిచ్చితో అర్ధ రాత్రిమీద దొంగతనానికి బయలుదేరాడు!సంజీవి పెరటి వంటయింటిలో దూరటం సులభం! చల్దిఅన్నం కుండలో గెంజిత్రాగి కుండ యింటికి మోసుకవెళ్తే పిల్లలు మరి రెండు పూటలైనా యీ భూమిమీద బ్రతుకుతారు!

కానీ దొంగ దొరికిపోయాడు! ఇన్నిమాటలు ఈ దెబ్బలూ తనకు తగల్లేదు. అంతా కలలావుంది. హారంలేని నరాలు చుట్టుకపోతున్నాయ్.

అలా కూలబడిపోయాడు. కూలబడిపోతూ "ఆకలి ఆకలి." అని ఆయా సంతో అన్నాడు. సంజీవి దొంగఆకలి తీర్చడానికి మరి రెండు తగిలిస్తూ "పేసాలు పేసాలు — ఇలా కూలబడితే వదిలేస్తామనుకున్నావురా దొంగ నాయాలా" అంటూ రెట్టించి కాళ్ళతో తన్నాడు. దొంగ "అమ్మో" అని కెళ్వమన్నాడు. పొరుగునే వున్న రాజిగాడి యింటినుంచి హరికెన్ లాం తరు వచ్చింది. ఆ వెలుగులో పీసముఖం చూసి ఓ క్షణం అంతా నిశ్శ బ్దం అయిపోయింది. యుద్ధంలో బాణందెబ్బతిని నేలకూలిన యోధునిలా వున్నాడు; నిజంగా యీ పోరాటంలో ఆకలి జయించి నిర్దాక్షిణ్యంగా ఈ పీసని నలుగురిలో యిలా కూల్చివేసింది — అయినా ఆ ఆకలిమంటలు మండుకపోవుటచేత చెయ్యి సైగచేస్తూ ఆయాసంగా "ఆకలి ... ఆక లమ్మా" అన్నాడు.

సంజీవి పెళ్ళం గిన్నెలో అన్నంవేసి గంజిపోసి తెచ్చింది. ఉప్పు వెయ్యటం మరచిపోయింది తొందరలో. పీస గడగడ త్రాగేశాడు. ఉన్న మెతుకులు నమిలాక "అమ్మయ్యా" అంటూ ఒక్కసారి తలెత్తి చుట్టూ వున్నవాళ్ళవేపు చూశాడు. దగ్గరగా మల్లు కూర్చున్నాడు. పుల్లయ్య. సం జీవి, రాజిగాడు .... ఊరంతా ....! ఘొల్లుమని యేడవడానికి మొదలు పెట్టారు. అక్కడ తను చేసినపని జ్ఞాపకంవచ్చి దొర్లి దొర్లి యేడవాలని పించింది. ఇంతలో తుప్పలావున్న తల పెట్టుకొని మాసిన చింకి బట్ట లతో గోలపెట్టుకుంటూ వచ్చిన పెళ్ళంవేపు చూశాడు.

చూడగానే పిల్లలు జ్ఞాపకం వచ్చారు. తిన్నదంతా వాంతి చేసుకో వాలనిపించింది. ఇదంతా తనే చేశాడా అనే తలపుతో లేవబోయాడు. ఒంట్లో శక్తి కొద్దిగా కూడుకున్నా యీతలపులు తనకు జూగిస్తున్నాయ్. పండు ముసలిదానికన్నా అధ్వాన్నంగా తయారయ్యేడు. చుట్టూ చేరివున్న వాళ్ళవేపు చూశాడు. తను దొంగ; దొంగను వదిలివేయడం మంచిపని కాదు; దొంగకు శిక్షపడకపోతే న్యాయం గంగలో కలిసిపోతుందని అను కున్నాడు.

"ఓరయ్యా సంజీవి;" అన్నాడు.

బాధతో కుమిలిపోతూ కళ్ళంట నీరు కారుస్తూన్న పీసవేపు చూస్తు

న్నాడు. కళ్లు తుడుచుకుంటూ "పంచాయితీ పెట్టించు! దొంగకు సిచ్చపడాలిరా!"

"ఎల్లిపోరా యేం సిచ్చ!" అన్నాడు సంజీవి.

"వద్దయ్యా! ఇప్పుడు సిచ్చపడకపోతే—యముడు ఇనపకాకుల చేత పొడిపిస్తాడు"

అక్కడవా ళ్లెవరూ ఒప్పుకోలేదు. దగ్గరగావున్న ఆవుకట్టు పీసవిప్పివేసి ఆ కన్నె సంజీవిచేతికిచ్చాడు. ఆవు కట్టుదగ్గరనుంచి కదలకండా ఈ మనిషివేపు చూస్తోంది. వీపు సంజీవివేపు త్రిప్పుతూ "అయ్యా! ఆ కన్నెతో గట్టిగా నాలుగు వీపుమీద వేసే నాయనా!"

సంజీవి కన్నె ప్రక్కన పడవేయబోతుంటే "వేస్తావా లేదా" అని అరిచాడు....ఇక లాభంలేదని మెల్లగా రెండు వేసాడో లేదో, మళ్లు పరుగెత్తి సంజీవి కుడికాలు పట్టుకొని తొడదగర కరువగానే దద్దరిల్లాడు. పీస ఆ కన్నెతీసుకొని తనంతతనే గట్టిగా కొట్టుకున్నాడు. వీపు కడుపు తట్లుదేరిపోయాయి. అప్పుడు ఆ కన్నెతో మళ్ళీ ఆవునుకట్టి దండంపెట్టి మెల్లగా యింటివేపు నడిచాడు.

తెల్లవారిపోయింది. పుల్లయ్యకు ఆ రోజంతా మనసు మనసులా లేదు. కర్రలకు వెళ్దామంటే అక్కడా ఆళలేకపోయింది. ముందుగా డబ్బుచెల్లించి మొదళ్లు తవ్వుకోమన్నాడు తోటకలవాడు.ఏమంటే ఎవడో డబ్బు యివ్వకండా మాయమయ్యాడు. నష్టంవచ్చింది. అంచేత అరువు లేదన్నాడు. అంచేత యేమీతోచక వూరుబయట వేపచెట్టుక్రింద కొడుకును పట్టుకొని కూర్చున్నాడు. ఇంటికివెళ్తే పస్తు. అక్కడవుంటే కొడుకునుచూస్తూ నిరాశతో మనసు నిండుకపోతోంది. మాటిమాటికి రాత్రి పీసకు జరిగిన పరాభవమే జపి కివస్తోంది.

ఆ రాత్రి నీలి అడిగింది "బెంగగా అగుపిస్తున్నావు. మనసులో యేంవున్నాదిరా?"

"ఏమీ నేదులే" అన్నాడు.

అప్పుడు మళ్ళీ ఏ ప్రశ్నా వెయ్యలేదు. ముసలమ్మ లేకపోవటం యేదో వెలితి కనిపిస్తోందని ఒకటి రెండుసార్లు పుల్లయ్య అన్నాడు అలా

ఒంటిమీద అయ్య చేయివుంచేగాని నిద్రపోని కొడుకువేపు చూస్తుంచే. గతం అంతా జ్ఞప్తికివస్తోంది పుల్లయ్యకు —ఆ నాటిరాత్రి గరిడీ! మునలాడిగాలేని ముసలాడు ఏమన్నాడు? "నా కొడుకు—ముచ్చటగా ముద్దుగా వున్న పాపడు నాలాగే గేరాగిరజాలు పెడ్తాడు. నలుగురిలో మెప్పు తెసాడు! దేనికీ జడవడు!నా కొడుకు....నా కొడుకు...."

అలా చేతిని నిమిరాడు. కొడుకు ముఖం ఆ లేతబుడ్డి దీపపు వెలుగులో ఎంత ముచ్చటగా కనిపిస్తోంది. "నా కొడుకుని గరిడీలో ఘటికుడ్ని సేస్తానునుకున్నాను. దొంగల్నిపట్టేదొరని సేస్తానని — దోసిళ్ళతో దానంసేస్తాడని....మట్టిని నమ్మి సెమటకార్చి మా పరువు నిలబెడ్తాడని.... అంతయెత్తుకు యెగిరాను! నా కొడుక్కి యేంవుంచాను? ఒంటిమీద గుడ్డ పాతలేదు — కడుపునిండుగా గంజైనా లేదు! బువ్వ బువ్వని యేడుస్తూనే పడుకున్నాడే....నా అయ్య...."

అలా దుఃఖం యీ తలపులతో ముంచుకురాగా ప్రక్కనే చేరబడి కొడుకును చేరదీసుకుంటూ పడుకున్నాడు.

కొంతసేపటికిగానీ కళ్ళల్లో తడి తుడుచుకోలేదు. ఆ సమయానికి నీలి కూతుర్ని విద్దరపుచ్చి దగ్గరగావచ్చింది.

"ఏం ఆలాగ వున్నావు?"

జబాబులేదు.

"నాలాగ నివ్వెలాగవుంటావు? ఏనాడు ఆకలంచే నీకు తెలిసొచ్చేదా? కష్టాలంచే నీకు యేంతెలుసును? అందుకే అలాగ గాబరాపడిపోతున్నావు. కొన్నాళ్లు కష్టాలుపడితే నీకూ ఓర్పువస్తాది. ఇప్పుడు మనకంచే యెవురు సుకపడ్తన్నారులే!"

ఈ చివరి వ్యాఖ్యానంతో పెళ్ళంవేపు వింతగా చూశాడు. ఆమె చిన్న నవ్వునవ్వి మొగుడివేపు చూస్తూ "ఎవరికితగ్గ కష్టాలు వారికీ వున్నాయ్. మనకి పొలంలేక ఒకపూటవుంటే ఒకపూటలేదు. మరి అదెమ్మకు తినడానికేంలోటు? ఆ కడుపునొప్పితో బుక్కడుగంజి తాగగలుగుతోందా? ఏమైనా యేకష్టాలైనా యెంతకాలం వుండిపోతాయి. ఇవిగో కోతలువస్తాయి. ఒళ్లు గట్టిగావుండగా మనకేలభయం?"

అప్పటికీ పుల్లయ్య మాటాడలేదు. పరిస్థితి పోల్చుకున్న నీలి దగ్గరగా జరిగి "మామ్మ చెప్పింది! సెయ్యికాలితే కుండ యెత్తేస్తావని! నా మొగుడు అంత దయిరంలేనోడా? ఆ దయిరం నీలోకి యెప్పుడొస్తా దంటే నలుగురిలో నీ మంచిచూసేనే! అందరిలోనూ మంచి, సెడా రెండూ వుంటాయి. నివ్వు యిదివరకు ఆలలోని మంచే తీసుకొనేవోడివి —యిప్పుడు సెడ్డతీసుకుంటున్నావు. అప్పుడు నీ మనసు యెంత బాగుండేది—ఒకోపూట గరిడీ సరదాలో తిండే మానేసేవోడివి! అప్పుడెలాగ వున్నావు. ఇప్పుడు ఒకపూట లేకపోతే బెజారెత్తిపోతావు! ఎంచేత? నా కెప్పుడూ యెలాగ బ్రతుకుతామని పిరికిలేదుసుమా?"

పుల్లయ్య చల్లగా, మెల్లగా చెప్పుతున్న పెళ్ళంతో ఒక్కసారి "పీసలాంటోడే దొంగయితే...."

నీలి నెమ్మదిగా నవ్వింది "అవును. తప్పెవరిది? పీసదే! పిల్లలున్నారు—నా గవుర్నుమెంటోడు, పెద్దయితే నా పిల్లలని సూడడా అని—పెద్దోడ్ని సగంసదివించి పనీపాటుకీ పనికిరాకుండా సేశాడు! ఆడు కలెకటేరు యెప్పుడైపోతాడు? మరి సిన్నోలని యెవరికింద కంబార్లుగా యేసినా యేడాదికి పదిపుట్లు దాన్నెం తెచ్చుందురు"

"అదే సెప్పినావు? అంతబతుకు బతికాడు...."

"అయితే యిప్పుడు యిలా నచ్చిపోవటం మంచిదంటావా? వచ్చే యేడు మల్లు నలుగురి పళ్ళులమంద కాయడా? నివ్వు పెద్ద రైతుయింట్లో సేరావంటే యిరవైపుట్లు కొలవరా? ఏం సేసుకుంటారు?"

పుల్లయ్యకు పౌరుషంవచ్చి "నానా! పొన్నూర్లో బిచ్చం యెత్తుకుంటాను గానీ జాతోడింట్లో నౌకరీకి కుదురుతానే!"

అభినయంతో "అలాగంటే యెలాగ?" పడుకున్నవాడు చప్పున లేచి "నాను పెద్దయింటోడిని-పెద్దబతుకు బతికాను-వూర్లో పెద్దగానే వుంటాను. అసలు నీనుంచే ఆల పనిపాటకి యెళ్తున్నానుగానీ .... నాకు యీ కూలిపని అబ్బితే—నా కొడుక్కి అదే అబ్బుతాది! పళ్ళులుకాసే దద్దమ్మని సేస్తావా నా కొడుకుని? ఆడు దొంగల్నిపట్టే దొరౌతాడు.నాపేరు వూరిపేరూ నిలబెడ్తాడు!"

"అవును. ముందు తిని బతకాలా? పెట్టు పువ్వుహూసి కాయలు కాయాలంటే భూమిలో గత్తం వెయ్యాలా వద్దా? నీకు అంత పౌరుషం కొబగాదంటాను"

పుల్లయ్య లేచి నిల్చొన్నాడు. కడుపుమంటకు యీ మాటలు మరింత రాణించాయ్. ఇటూ అటూ అయిపోతూ "మా వంశం పౌరుషంగల వంశం. నాను పౌరుషంలోనే పుట్టాను. పౌరుషంతోనే సస్తాను. నీలీ! అలా సచ్చిపోతానుగానీ... దొంగతనం సెయ్యనే.... అడుక్కోనే.....!"

ఆవేశంతో మాటలు వేగంగా గట్టిగా రావటంతో మల్లు "బువ్వ" అంటూ లేచి కూర్చొని యేడుస్తున్నాడు. పుల్లయ్య చప్పున కూర్చుని కొడుకుని పరుండబెట్టబోయాడు. కానీ "అమ్మా బువ్వే!" అంటూ కళ్లు నులుపుకొని యేడుస్తున్నాడు.

నీలి వశం వుబికి పొంగిపోయింది. కానీ కొడుకు అయిదేళ్ళవాడి వ్వుడు.... రెండేళ్ళ క్రితమే ఈ పరిస్థితి వస్తే కొడుకు ఆకలి తీర్చేది! పుల్లయ్య ప్రక్కకు తప్పుకున్నాడు. పడుకోబెట్టి యిద్దరిచేతులూ కొంత సేపటివరకూ వీపుమీద మెల్లగా పడితేగానీ మల్లుకు నిద్దరపట్టలేదు.అంత సేపూ ఒకరిముఖాలు ఒకరు చూసుకున్నారు. పుల్లయ్య చివరికి అన్నాడు "ఇంక మిగిలింది ఆ కంచమే.... రేపు పొద్దున యిచ్చీ" అన్నాడు. నీలి మౌనందాల్చింది.

25

నాలుగురోజులు గడిచాయి.ఆదెమ్మప్ప యింటిచుట్టూ జనం మూగిపోయారు. మనిషోమాట. "సావేనారాదని" కడుపునెప్పితో బాధపడ్తున్న ఆదెమ్మప్ప యేడుస్తోంది. మని షో సలహాచెప్తుంటే అల్లుడు విసుక్కుంటున్నాడు. పీసకూడా మధ్యన దూరాడు. జబ్బుతోనున్న కోడిసెట్టలా గిజగిజ గింజుకుంటున్న ఆదెమ్మప్పను చూసీ చూడటంతోనే "ఏమే! అల్లుడ్ని యిల్లరికం తెచ్చుకున్నావు! నీకు కష్టంవచ్చింది కదా! డబ్బుకు చూసుకుంటే యెలాగనే! నీకు నోరులేదు ముండవి!"

"అరగని తిండి జరగని మాటా అయిపోయింది, నారాత నారాత!" అని బాధతో శలబాదుకుంది ఆదెమ్మప్ప.

"రాతలేదు గీతానేదు, పట్టుకో నాలుగు వందలు మూడురోజుల్లో మామ్మూలుదానవు అయిపోతావు. నీకు యెలాంటోడినంటే అలాంటోడిని తోడిస్తాను. ఆ పుల్లిగాడున్నాడే —ఆడిముఖం సూడగానే ఆ డాక్టరు ఆసుపత్రిలో చేర్చేస్తాడు, ఇంతకీ ఆలస్యంసేసినావా సావే, ఒక్కకోతతో బాద నయం!"

"అమ్మో! కోతే!"

"యెట్టిదానా! నీకు కోస్తన్నారని తెలుస్తాదా?బాదుంటాదా? ఢిల్లీకి పేటపడ్డాది పెద్దాసుపత్రి! డబ్బు యిస్తేగాని తలుపులుకూడా తెరవ్వట. అందులో డాక్టర్లే—యెముకలు యిరిగిపోతే అతికేస్తారు,మెదడు యెగిరిపోతే మేకమెదడుపెట్టి మనిషిసేస్తారు. యిశాపట్నం—యిశాపట్నం—అంటే ఏమిటనుకున్నావు? అక్కడటా....మీరందరూ యినేవుంటారు ఆరుబారు—సిండియాకుంపెనీ-పిచ్చాసుపత్రి-యింక ఆకాశానికి అంటుకుంటాయట మేడలు! సస్తే ఆ కళ్ళ వైబోగం సూస్తావే! రేపేయెళ్ళ-బాదా నయంఅయిపోతాది పట్నమూ సూస్తావు!"

ఆదెమ్మ అల్లుని చూసింది. అల్లుడు ముకం ప్రక్కకు తిప్పేశాడు పీస మరింత గట్టిగా అభినయంతో "అదిగో గారనాయుడు సుట్టుపట్ల వైదుగుల్ని సూసి యిసిగిపోనాడా? యిశాపట్నం యెల్లిన పదిరోజులకి ముఖం డీలాగఅయి యెలిపోచ్చాడు. ఇప్పుడు ముదర గొట్టెపోతు మాంసం యియ్. ఈశెడు రెండుపూటలు సేసి తిన్నా కడుపులో నొప్పినేదు. దేనికేనా తెగింపులేని బితు కేం బితుకు? సూస్తూసూస్తూ డబ్బుకి ఆశపడి నిన్నుఆ గన్నెమ్మ మొగుడ్ని సంపినట్లు సంపేస్తాడునీఅల్లుడు!"

ఈ చివరిమాట అంతమందిలో అనటంతో అణ్ణడికి పౌరుషం వచ్చింది. "ఓరి పీసా నోరు జారేసుకోకురా! నాలుగొందలుకాదు యైదొందలు తీసికెళ్ళమను, ఇప్పుడికి యెన్నొందలు కాలేదు, యెల్లనీ."

"అదిగోయే ఆదెమ్మా!అల్లుడొప్పుకున్నాడు .రేపే ప్రయాణంకట్టు పుల్లిగాడు నివ్వు బతిమాలితే కాదనడు. కేవు నివ్వేకడ్తావు, తిండిపెడ్తావు. సత్రవులో దిగుతారు. పెళ్ళిగిళ్ళి సేసినావుకదా,అమాత్రం నీకింతసేయడా? తిరిగివచ్చినప్పుడు సింహాదిరప్పన్నకి ఒకమొక్క మొక్కి యెల్లిపోరాండి."

పీస మరి కాస్తవుషారుగా మాటాడి పుల్లయ్యఇంటికి వచ్చాడు. ప్రయాణంవిషయం చెప్పాడు. మల్లు యెలా ఉంటాడనే బాధ! పుల్లుని ఈ రాసనురోజుల్లో అక్కడికి తీసుకెళ్ళడానికి ఆడెమ్మప్పఅల్లుడు ఒప్పుకోడే. "అయ్యా యెల్లినోడివి యెల్తావు. పట్నం అన్నిమూలలు బాగా సూసీ! సిండియా కుంపినీ — ఆరుబారు.... ఎన్నో కుంపినీలువున్నాయట— నెలజీతం వచ్చిన నౌకరీ చూసుకోని మరీ రా! నివ్వెల్లి అక్కడ వున్నా వంటే నీపక్కన నానూ ఏదో సిన్న పనిచేస్తాను."

"బాగా సెప్పినావ"న్నాడు పుల్లయ్య. మనసు చాలా వుల్లాసంగా ఉంది. నీలి పెరటినుంచి వచ్చి పలుకరించగానే పట్నం ప్రయాణం చెప్పాడు. ఓక్షణం అయ్యాక పీస అన్నాడు"అమ్మీ! నీమాటలు ఇన్నాను గాదే. నీమాటే యినుంటే ఆ ఆకలిదయ్యం నాకు పట్టి ఆడించేదా! అల నాడు ధర్మరాజు అబద్దం ఆడినట్లు నాను యీనాటికి దొంగతనం సేశాను. సినోల్లిద్దర్ని పళువులు కాయడానికి యెట్టేసాను. పెద్దోడ్ని పట్నం పీదర్ని బతిమాలి ఆలింటిదగ్గరే పనికి పెట్టాను. ఆడు అలాగ ఆలింటి నౌకరీచేసి సదివితే నా గవుర్నమెంటోడు పెద్దోడైతే ఆడికి నెలజీతం వచ్చినపని యియ్యడా!"

నీలి పీసమాటలకు సంతోషంగా "మంచిపని సేశావయ్యా! కష్ట పడ్తారు. తెచ్చుకుంటారు, తింటారు.దానికి సిగ్గెందుకుపడాలి! పౌరుసాలు పెట్టుకుంటే బతకగలమా! అయ్యా! పౌరుషంతో నీటిమీద యెన్న తీస్తామంటే అవుతాదా! గవుర్నమెంటోడు ఒళ్లు ఒంగనోలకి యేంయిస్తే యేం నాబం! పనిచేస్తేనే పేణం వుందంటారా! కూకుంటే పేణం వుందంటారా! పేణం వున్నోలం బతకలేమా!"

పుల్లయ్య యింతసేపూ మిటుకు మిటుకమని నీలివేపు చూస్తున్నాడు పీస చిన్న నవ్వుతో "అమ్మా! ఆముసల్ది బాగానూరిపోసేసిందే! ఎంతైనా గుట్టంకడుపులో గాడిదపిల్ల పుట్తాదా! కడుపుమాడితే ఆ పౌరుషా లన్నీ ఆ అగ్గిలోపడి బుగ్గయిపోతాయే! అనుభవంతో సెప్తన్నాను. నీమంచే నీ కెక్కడి కెల్లినా కాస్తాది. ఈ పదిగేమాల్లోనూ నీపేరెత్తితే సెడ్డోలే మంచయిపోతారే!" అంటూ లేచిపోయాడు.

పుల్లయ్య ప్రయాణం స్థిరమయ్యింది. కానీ మల్లువస్తానని యేడుస్తున్నాడు. తీసుకపోదామంటే డబ్బులేదు. "ఆడెంతకు అక్కడ రాసను కట్టుపెట్టంగా ఉన్నాదని" ఆదెమ్మప్పఅల్లుడు సపేనికా వద్దన్నాడు. నీలి పెద్దరైతుయింటికి వెళ్ళి ఏదో పనిపాట్లు చేయటం, తీరికసమయాల్లో నూలు వడకటం చేస్తోంది. ఒకపూటకు ఉంటే ఇంకోపూటకు లేనట్లు బ్రతుకు సాగుతోంది. మల్లుకి మెల్లగా బోధపరిచాడు. మళ్ళీ యీవోజు సరికి వస్తానని చెప్పాడు. అక్కడనుంచి బొమ్మలూ, బట్టలూ తెస్తానన్నాడు, చివరకు తల్లి వినకండా నా నొచ్చి మీ అందరికీ తీసుకపోతానన్నాడు, అందరం పట్నంలో పనిచేసుకొని హాయిగా ఉందామన్నాడు.

పట్నంవెళ్ళాక మల్లుకు రోజంతా అయ్యతలుపే. ఇంట్లో ఒక మూల కూర్చునేవాడు. భోజనసమయానికైనా లేచేవాడుకాదు. ఆక లేస్తే వంటయింటికి వెళ్ళి ఉన్నగంజి సిలవరిగిన్నెలోనికి ఒంపుకొని గడగడ త్రాగేవాడు. వారం దాటిపోయింది. అయ్య రాలేదు. ప్రతిక్షణం అయ్యనుగురించి తలుచుకుంటూ ఒకోసారి "అయ్యా"అని యేడ్చేవాడు. వారం ఆల్లా పదిహేను రోజులయ్యింది. నిద్దట్లోనూ అయ్యనుగురించి పలవరింపే ఏడుపు రానురాను హెచ్చయిపోయింది. వెళ్ళి రోడ్డుమీద కాసుకకూర్చునేవాడు! ఎంతసేపు చూసినా అయ్యజాడ కనపడేదికాదు. చీకటిపడినా కదలకపోతే తల్లి ఎత్తుకొని తీసుకవచ్చేది. తల్లి భుజంమీద కళ్లనలుపుకొని అయ్యా అని గోలపెట్టి యేడ్చేవాడు. ఇలా మల్లు చీపురు పుల్లలా అయిపోయాడు బెంగతో.

ఒకనాటి సాయంత్రం పుల్లయ్య, ఆదెమ్మప్ప తిరిగివచ్చారు. ఆప రేషనులేకండా యేదో మందులిచ్చారు. పీస చాలా నొచ్చుకున్నాడు. "కోసేస్తే మళ్ళా దానిసేషం వుండకపోను. మళ్ళాయెప్పుడో అగుపిస్తాది అయ్యా! పుల్లగా నీ సొమ్మేంపోనాదిరా, ఒక సంచి ఆ డాక్టేసుకి తోసే వల్సింది. వెండిసెప్పు దెబ్బతగిల్తేగానీ యీకోజుల్లో యెవసు సూస్తాసు!" పుల్లయ్య ఇంటికివచ్చాడు. మల్లు తండ్రినిచూసి పెరటకు వెళ్ళిపోయాసు కొడుకుముఖం చూడ్డానికి సిగ్గువేసింది. తనకు తెస్తానన్నవేవీ తీసుక రాసుండా వుత్తిచేతికోనే వచ్చాసు. ఐనా చప్పున వెళ్ళి యెత్తుకోగానే

కొడుకు అయ్యను పట్టుకొని గట్టిగా యేడుస్తున్నాడు. ఓక్షణం మాట రాలేదు. ఆయేడుస్తూనే "అయ్యా వుండిపోనావూ-వూ...." అంటున్నాడు

"ఏడుస్తావా? అందరు యీ యేళరోజుకి అక్కడే ఉందాం!"

"హా"అన్నా దొక్కసారి!

"మనవూరు పట్నం—మనం పట్టపోలం. అక్కడ రైళ్ళూ—"

"పట్నం....పట్నం....అయ్యా రైలా....రైలా...." ఏడుపంతా పోయి తండ్రివేపు చూశాడు.

"గుప్పుగుప్పుమని అంటాది—మనం ఆ పెట్టెలో కూకునుంటే —పట్నం యెలిపోతాం"

"అయ్యా! బస్సునాగ ఉంటాదా?" "బస్సుకంటా సాలా పెద్దది! నివ్వు యేడిస్తే అగపడదు!" "ఓ ఓ —యేడను...."

చంకదిగి గబగబ "మాం పట్నంపోతాం....పట్నం పట్నం...." అంటూ నులకమంచంమీదనున్న చెల్లిలిదగ్గర గెంతుతున్నాడు.

ఆరాత్రి పీసతో తను చెయ్యదలచినదంతా చెప్పాడు."పట్నంలో అంతమంది ప్రైజవున్నారు. ఆన్ని కుంపునీలున్నాయ్. ఎక్కడైనా నెల జీతంపని దొరక్కమానదు. కొడుకూ బాగుపడ్తాడు. ఇక్కడ కొన్నాళ్లంటే ఆకలితో సచ్చిపోవటమేకదా?" అన్నాడు.

పీస 'మంచిదే నాయనా ఎళ్ళు' అన్నాడు. మనిషి చాలాఆతతగా వుండి చిక్కిపోయినట్లున్నాడు. ఆరోజుల్లో పుల్లయ్యకు ఈనాటి పుల్లయ్యకు .యెంతతేడా! ఆ గేరాగిర్జాలు లేకపోతే పుల్లయ్య అని పోల్చుకోవటమే కష్టమయ్యేదేమో!

తెల్లవారేక పూరంతా ప్రాకిపోయింది. పుల్లయ్య కుటుంబంఅంతా యెత్తుకొని పట్నం పోతాడని నలుగురూ నాలుగువిధాల అనుకున్నారు. ఏందయిరం నేకపోతే యెలిపోతాడని కొందరూ, ఒక్క వొంగనోలకి ఊరు ఆచ్చదని మరికొందరూ తలోలా అనుకుంటూ, కొందరు నీలిని పలుకరించడానికి వచ్చారు. నీలి సహజ శాంతం కనపరచింది అంతే. కాని యెటువంటి వ్యాఖ్యానాలూ చెయ్యలేదు.

మధ్యాహ్నం సరికి కొడుకుతోసహా యింటికి వచ్చాడు. నీలి మెల్లగా అడిగింది "ఊరంతా తెలిసిందిగానీ నాకు తెలియనేదని!"

దీనికి జవాబు చెప్పలేదు. మళ్ళీ ప్రశాంతంగా "ఏ ఆదరువూ నేకండా వున్నారు వదిలేటం మంచిదికాదు. పుట్టిపెరిగినవూరు.అందరూ తెలిసినోలు. ఆపదకి ఒకరు కాకపోతే యింకొకరైనా ఆదుకుంటారు. పట్నంలో యెవ్వరికి యెవురు దిక్కు. నాకేం అని పదికాసు లున్నాయి గనకనా! నా మాటిను...."

చప్పున పుల్లయ్య విసుగుబాటుతో "అందుకే నీకు సెప్పనే"దని లేచి వెళ్ళిపొయాడు.

వీధిలో పీస యింటిదగ్గర పదిమందికూడి పుల్లయ్యకు ప్రశ్నల వర్షం కురిపించారు. వీరందరికీ ఒకటే సమాధానం. "నాయిష్టం" అని పుల్లయ్య చెప్పగానే పీస నిల్చొని నలుగుర్ని ఉద్దేశించి "ఓరయ్యలూ! మీరంతా మనవూరో దొకడు ఢిల్లీకి పేరుబడ్డ ఆ పెద్దపట్నాన ఉంటాడని ముచ్చటపడకండా యిదంతా దేనికర్రా! మీకు తెలియదు,పట్నాల్లో యేం జరుగుతున్నాయో. మనం అంతా నూతిలో కప్పలం! అమెరికన్నోడట పెద్ద యిమానంలో సుక్కల్లో సెందురిడిదగ్గరకు వెళ్తాడట! అక్కడికి నువ్వూ నేనూ ముందెళ్తామా! పట్నంలోవున్న పుల్లయ్య ముందెళ్తాడు," పుల్లయ్యవేపు తిరిగి "ఓరయ్యా పుల్లిగా! అక్కడ ఈ యెళ్ళినోలందరూ యిక్కడలాగ యెవుడిబాగు వాడిబాగు అనుకోకూడదుసుమా! ఇప్పుడు సిక్కిపోయినా ఒకనాడు కండగలవోడివి, మనిషివికావా!అక్కడ సెందురిడిలోను యిల్లూ వూళ్ళా కట్టారుకావా! అక్కడ నీకష్టం అందరికష్టం, నీసుఖం అందరిసుఖం —నాపిల్లలూ, నీపిల్లలూ, వాడిపిల్లలూ —అంతా అందరిపిల్లలే! ఆస్తి అంటావా, కొందరిదికాదు అందరిదీను, మనిషి జాతంతా ఒకటేజాతి! అలాంటి గవుర్నమెంటోడు అక్కడ వచ్చినట్లు సెయ్యాలి."

మల్లు యెంతో తెలిసినట్లుగా "తాతా! తాతా!" అని గెంతాడు నవ్వుతూ.

"మామా, పట్నం పోతాం!"

ఆ సాయంత్రం వెళ్ళి నీలమ్మగుడిదగ్గర ఒంటిగా కూర్చున్నాడు. కొడుకు వీధిలో పిల్లలతో ఆడుకుంటున్నాడు. "దాసుడువుంటే యేం చెప్పేవాడో! తల్లి దీవనలుయిచ్చి పంపించేది, మాతల్లికి ఆలనాపాలనా

లేదే! అయ్యో! గేమం అంతా యిలాగే దేముడు. దెయ్యం అనే భయం లేకుండా పోయిందే! ఎవుకిసేతికందింది వాడిదే. పొదుగున ఒకడు కడుపు మాడి సస్తన్నాడనే కనికరం లేదు. నీతి నిజాయితీ యెక్కడికి ఎగిరి పోయిందో! నాయంగలవోడు పెద్దకాదు. డబ్బునోడు పెద్ద. ఆడికే నలుగురూ కొలుస్తున్నారు. యీలాంటివూరు యెంత తనూరైనా ఎందుకు తనుండాల? ఇక్కడ నాకు పాయసం దొరికినా వుండను. నాయంవున్న స్థలాన బుక్కడు మంచినీరుమీద బతికితేం?"

"పట్నం పోతాను. మళ్ళీ మొదటి పుల్లయ్యనైపోతాను. నాయం నీతికి కట్టుబడి మల్లునాయుడి కొడుకుగాను మల్లు అయ్యగాను గంజిత్రాగి హాయిగా యింటా బయటా మెప్పుతో బతుకుతాను." పట్నంలో తన ఉద్యోగం, అక్కడ బ్రతుకు గురించి ముచ్చటగా తలచుకున్నాడు. సంతోషంతో మనసు నింపుకున్నాడు. నీలమ్మతల్లినీ, దాసుడుగురించి తలచుకున్నాడు.తల్లిని యిక్కడెందుకు, పట్నంలో పెద్దసంబరంఅవునే! మాయమ్మ నివ్వెంత సల్లనితల్లివే! యిలా చీకటిపడిపోయింది. నీలమ్మ తల్లికి మొక్కమొక్కదామని లేచాడు. తలుపుసందుకోనించి చూశాడు. దీపాలు వెలిగినట్లున్నాయ్ దాసుడు ఆ లేతదీపపు కాంతిలో కూర్చుని మౌనంగా ఓగుకున్నట్లనిపించింది! దాసయ్య సచ్చిపోయినా తల్లిని వద ల్లేదా?" ఒళ్లు పులకరించింది. మనసులో "అయ్యా! దాసయ్యా! పట్నం పోతాను. దీవించరా!" అని అడుగుతున్నాడు. వెంటనే సమా ధానం "నాయనా!" అన్నపిలుపు తనలో మారుమోగింది. అలా కూర్చుం డిపోయాడు.తన ఉనికి మరచిపోయాడు. కంటికినీరమ్మతల్లి....దాసుడు ....దీపాలు అంతా ఆగుపిస్తున్నాయ్. దాసుడు మౌనాన్నివదలి నడుడా అన్నకేకవేసినట్లు వినిపించింది. సాష్టాంగపడిపోయాడు పుల్లయ్య. "వెళ్ళరావెళ్లు! పిచ్చివాడా! నేను యీవూర్లో యీగుడిలోనే ఉన్నాననుకుంటున్నావా! నీలోలేనూ! ఇప్పుడు తిట్టినవాళ్ళందరిలోలేనూ —యెక్కడలేనురా! యెళ్ళరాయెళ్లు —మానిందే మందు బతికిందే వూరు"

ఇంతలో 'అయ్యా' అన్నకేకలు వినుపించసాగినయ్. తలుపు సందులోనుంచి చూశాడు. ఏ దీపాలూ లేవు. చీకటిగావుంది. విగ్రహాలైనా అగపడలేదు. అంతా ఒక కలలావుంది. ఆ చీకటిలో భయంభీతి లేకుండా

ఒంటిగా అయ్యా అనుకుంటూ గుడిదగ్గరకు వచ్చినకొడుకును చూశాడు. సంతోషంతోను అభిమానంతోను ఒళ్లు పులకరించసాగింది. కొడుకును గట్టిగా హత్తుకొని ముద్దులాడాడు.

26

పట్నంలో ఇల్లూ, వాకిలీ, వుద్యోగం సద్యోగం చూడకండా అంతా లేచి వెళ్ళిపోవటం నీలికి నచ్చలేదు. మొదట పుల్లయ్య వెళ్ళి కొన్నాళ్లుండి పనిపాట్లు చూసుకొనివస్తే అంతా వెళ్ళిపోతే బాగుండేదని నీలి అభిప్రాయం యిచ్చింది. మల్లు అయ్యనువదలి వుండలేదు. ఒంటిగా పుల్లయ్యపోతే వేళకు తిండివుండదు. అదీకాకుండా ముసలమ్మ కళ్లు మూస్తూ అన్నమాటలు జ్ఞప్తికిరావటంవల్ల నీలి ఖరారుగా యేమాటా చెప్పలేకపోయింది.

చీకటిపడి చాలాసేపయ్యింది. ఒంటిగా పీఠిఅరుగుమీద నీలి కూర్చుంది. ఆమె ఆలోచనలోపడేదేకానీ గుడ్డివెంకన్న గన్నెమ్మ కలసి వచ్చి వాకిట కూర్చొని మాటలు కలిపాడు.ఇంతలో పుల్లయ్య కొడుకుతో సహా వచ్చాడు. మల్లు అయ్యచేసిన గొప్పతనాన్ని తల్లిలో చెప్పడానికి అభినయంతో వుపక్రమించాడు. నీలి గతుక్కుమని "నవ్వుతున్నావా? ఆలతో యిరోదం యెందుకు తెచ్చుకున్నావు!"

"తెచ్చుకోనూ? అడిరక్తం తాగుతాను."

"అవేంమాటలు? ఎందుకు పులిలాగ అయిపోతావు? ఆ రాజిగాడు మనకేం పెద్ద అన్నాయంచేసినాడు?"

"సెయ్యలేదా? సగానికి సగం యిచ్చి అంత పొలం పొట్టలో పెట్టుకుంటానంటాడు, అడి పేగులు లాగి తీసుకోను నా పొలాన్ని!"

"సెబాష్‌రా అయ్యా" గుడ్డి యెంకన్న అందుకున్నాడు. నీలి దీనంగా "అయ్యా! నివ్వూ అలాగే అంటావా? ఆడిపెళ్ళం అదక్కుండా వచ్చి డబ్బిచ్చి కైదునించి యిడిపించింది. మామ్మ సచ్చిపోతే ఆ రాజిగాడు వచ్చేనా అంతా సేసినాడు. అడు మనకేం దగ్గిరోడు సెయటానికి. ఆమాత్రం మనకు యిస్వాసం నేకపోతే మనుసులం అని యెలాగ అనుకుంటాం?"

"అమ్మీ, అందర్ని మంచాంటావే నివ్వు. పెపంచకంలో అంతా మీలాంటి అమాయకమైనోలు ఉండరే! ఆడా! కక్కూలకశ్శెం.... ఈదంట యెల్లేవాళ్ళగుండార్లులాగుతాడు."

నీలి అరుగుమీదనించి లేచి "మీ తల్లీ, తండ్రికి దండమెడ్తాను. మనకెందుకు కోపం? పెదాలకిసేటు. అంతా నాకొదిలెయ్యండి. అడిగినట్లు అంతా నాకొదిలెయ్యండి. అడిగినట్లు అడిగితే యేమంటాడు?"

"మూతిమీద కొడ్తాడే!" పుల్లయ్య అందుకున్నాడు. "ఒళ్ళంతా వుండగా మూతిమీదేకొడ్తాడా? అయినా ఆదదాన్ని — కొట్టడానికి ఆది సేతులు రావులే!" అంటూ నీలి పెరటకు వెళ్ళిపోయింది.

అంతా అక్షణం వూరుకున్నారు. వెంకన్న, గన్నెమ్మ చాలాసేపటి వరకు అక్కడే కూర్చున్నారు. చీకటిరాత్రి గిన్నెలోని మెతుకులు గంజీ వెంకన్న ముట్టుకోలేదు. గన్నెమ్మ లేని వెంకన్నను పట్టుకొని భజన మందిరందగ్గరకు తీసుకవెళ్ళింది. ఆదగ్గరగానే రాజిగాడియిల్లు. వెంకన్నకు నిద్దరపట్టలేదు. గోడకు చారబడి యేదో ఆలోచిస్తున్నాడు.

చీకటి! వూరంతా యీ చీకటితో ముసుగువేసుకుంది. గన్నెమ్మ వెంకన్న గిన్నెలోనిఅన్నం దొంగతనంగా తడిమి ముద్దకుముద్ద నోటిలో కుక్కుకుంటోది. అన్నంనమిలితే చప్పుడౌతుందని మ్రింగేస్తోంది. కానీ చిన్న చప్పుడౌతోంది. ఈ చిన్న శబ్దానికి చెవులు రిక్కించగలిగిన వెంకన్నకు యిప్పు డీ చప్పుడు వినవడలేదు. మనస్సంతా పుల్లయ్య రాజి గాడి తగువుమీద కేంద్రీకరించుకపోయింది.

అర్ధరాత్రి. అంతవరకూ మనసు పరిపరివిధాలపోయింది. పొర పాటునైనా కునుకుపడలేదు. ఎందరినో తలుచుకున్నాడు. ఎన్నో అను కున్నాడు. ఎంతో జ్ఞాపకం వచ్చింది. నీమ్మతల్లి అని మ్రొక్కు కున్నాడు. దాసయ్యని తలచుకున్నాడు. "నాకొక నెల కళ్లు కనిపించనీ తల్లి" అన్నాడు. రానురాను ఆకోరిక ప్రబలమై పోయింది. ఉద్రేకంతో "ఒక నెలకాదే ఒకవారమే....వారంకాదే....ఒకరోజేనాయీయవా తల్లీ! నిద్దరపోతున్న ఊరిని లేపేద్దునే! ఈ గొట్టెలని పులుల్ని చేస్తాను తల్లీ! ....ఒక రోజు కాదే....ఒకగంటయియి తల్లీ.. ఒకగంటైనా యీయవా? ఈ అన్నాయాన్ని తుడస్తాను....ఒక గంటమ్మా....ఒకనెణం తల్లీ!"

లేదు,నేత్రదృష్టి రాలేదు. ఆవేశంతో వెంకన్న కళ్లు సీటితోనిండి పోయాయి. జలజల నీరు కారసాగింది. ఎగవూపిరి తీశాడు. ఒంటిమీద నున్న ఒకే గుడ్డపీలికతో మెల్లగా కళ్లు తుడుచుకొని నవ్వుకున్నాడు.

చీకటి—కటిక చీకటి—ప్రకృతి గాఢంగా నిద్రపోతోంది.మెల్లగా తడిమాడు. చేతికర్ర దొరికింది.లేచాడు. ఊహకొద్దీ రాజిగాడి యింటివేపు రెండడుగులు వేశాడు. ఏదో చప్పుడైనట్లుంది. ఎవరదని అడగాలను కున్నాడు. కానీ మెల్లగా వెనక్కి తిరిగి భజనమందిరం అరుగుమీద కూర్చున్నాడు. ఓ క్షణం కూర్చున్నాడు, చప్పుడులేదు. తడుముకుంటూ గన్నెమ్మను లేపాడు. ఎంతో నిద్దరపోయినట్లు ముసలిది లేచింది.

"హుష్! నివ్వు నా కో మేలు సెయ్యాల"మెల్లగా గొణిగాడు.

"నే నేం సేస్తాను?"

"రాజిగాడు దాన్నంకొట్టు అరుగుమీద కాపలా కాస్తాడు.మెల్లగా అడుగువేసి నిద్దరోనాడో లేదో సూసి రాయమ్మ తల్లీ నీకు మొక్కతాను"

"నా నెల్ల నమ్మో!దొంగతనానికి వచ్చినావంటే!"

"ముండా! ముందు ఆ గిన్నెలోని అన్నం తినీ....ఈయేళ నాను సెప్పినట్టు యిన్నావంటే నాకు దొరికిందానిలో రోజూ సగానికి సగం నీదే"

వెంకన్న మాట అన్నాడంటే విలుపుకునే మనిషని ధైర్యంవున్న గన్నెమ్మ గిన్నెలో మిగిలిన గంజి గడగడ త్రాగేసింది.

నడ్డివంచుకుని మెల్లమెల్లగా అడుగులు వేస్తూ చూసింది. టోకుర్లు తీసుకొని ఒంటిగా రాజిగాడు కొట్టు అరుగుమీద నిద్దరపోతున్నాడు. పళ్ళు వులు సాలలో పడుకున్నాయి.

వెంకన్నకు ఈలోగా ఎన్నో ఆలోచనలు వచ్చాయ్. ఇంటికి అగ్గి పెట్టామనుకున్నాడు. ,వాడిరక్తం త్రాగుదామనుకున్నాడు. చంపాలను కున్నాడు.

ఇంతలో తనలో యెవరో ప్రశ్నించారు. వాడెవడు?రాజిగాడెవడు? నీ కొడుకుకాడూ? కొడుకును సంపుతావు....ఆడిరక్తం త్రాగుతావా? సూరమ్మకు ఆ రాత్రి యేంసెప్పావ్?దాని దగ్గర యేమని ఒప్పుకున్నావ్? అది నీకు సెమిస్తాదా?

లేచి యిటూ అటూ గాబరాగా తిరిగాడు. సెడ్డోడు కొడుకైతేనేం? ఆ సల్లని తల్లి సీలమ్మాయింటికి నిప్పుపెట్టాడు. బుగత భూములు కొనేసినాడు — స్వంతభూమి దగ్గరెట్టుకొని అన్నాయం చేసినాడు — ఇచ్చిన డబ్బుకి యిల్లుయిస్తేగానీ సాలదని....ఆల్లని సెట్టుకింద పచ్చల్ని సెయ్యాలని సూస్తన్నాడు....ఆడు మనిషేనా....ఆడు నా కొడుకేనా? కాదు — కాదు....!

గన్నెమ్మ వచ్చింది. వెంకన్న ఆమె సహాయంతో మెల్లగా కొట్టు చేరుకున్నాడు — గన్నెమ్మ గబగబ వెనక్కి నడిచింది. భజనమందిరం అరుగుమీద పడుకున్నట్లు అభినయించింది.

వివిపిస్తున్నాయ్ టోకుర్లు. గాఢనిద్దర్లో వున్నాడు. చేతులు మెల్లగా రాపాడించాడు. చేతులతో ముఖం ఒకసారి తుడుచుకున్నాడు. అభిమానాలన్ని ఆశయం యెదర మండుకపోయాయి. శరీరమంతా కర్తవ్యనిర్వహణలో వుబ్బెక్కి వురకలు వేసింది. చీకటి — ఆ చీకటిలో కళ్లు నిజంగా కనిపించనట్లయింది. జంతువు యెదురుపడ్డ మృగరాజయ్యాడు. ఒక్కవురుకు వురికాడు. నాకు లేపకండా సేసావ్? లే....లే....లేరా నా కొడుకా?"

రాజిగాడు తెలివి తెచ్చుకొని ఘీంకరించాడు. మీదికి లేవబోతే వెంకన్న జుత్తు పట్టుకొని అలా క్రిందనే వుంచాడు. "రండర్రో" అని అరిచాడు రాజిగాడు. గింజుకుంటున్న వాడి ముక్కుమీద తీసి ఒక్కగుద్దు గుద్దాడు. రక్తం బొడబొడా కారజొచ్చింది. ఆ రక్తంచుక్క బొట్టు పెట్టుకొని "నా కొడకా! నీ యమ్మముకం సూసానురా! లేదా అంటే ఈ సెణానికి యమలోకాన్న వుందువు!"

దీపాలతో నలుగురూ చుట్టుముట్టారు. వెంకన్నను నలుగురూ పట్టుకున్నారు. బంధింపబడిన సింహం గర్జిస్తోంది. "పుల్లయ్యలాంటోల బతుకు లెందరిని కాలుస్తావురా? వదలండి! ఇంకోగుద్దు గుద్దుతాను. తెలివొస్తాది....నా కొడుక్కి తెలివొస్తాది!"

"నీ కొడుకుర్రా" అని ఘీంకరించాడు రాజిగాడు. రక్తం కారుతున్న ముక్కుకు గుడ్డ అడ్డుపెట్టి పరుగెత్తివచ్చి కడుపులో ఒక్కతాపు తన్నాడు. 'గయక్'మంటూ వెంకన్న నేలకు ఒరిగి కూలిపోయాడు. అంత

మందిలో 'గుడ్డోడిమీదరా సి బ్బిం'అని యెవరూ అనలేదుగాని అప్పుడే వచ్చిన పుల్లయ్య అన్నాడు. సరి, ప్రజల్లో గుసగుసలు బయలుదేరాయ్. రాజిగాడు రౌద్రంతో "నాకు తెలుసునురా పుల్లిగా! ఊరంతా తెలుసునురా యీ పని యెవుడు చెయ్యించాడో! ఇది వూరుగాని అడివికాదు. ఇక్కడున్నోలందరూ, సాక్ష్యం రారా! రేపొద్దున్న పోలీసులు వస్తే యెవురు కైదులోనికి యెళ్తారో చూస్తారు!"

తెల్లవారింది. "ఎవరి మద్దత్తు లేకపోతే గుడ్డోడికి అంతసాహసం వస్తా"దని వూరిలో చాలామంది అన్నారు. "ఆ పుల్లిగాడికి పోయేకాలం వచ్చింది. అసలు పొలంలో రాజిగాడు యేరు యిప్పినదగ్గరనుంచీ ఎలాగ యీడిమీద కక్ష సాధించుదామని చూస్తున్నాడు. ఆడి నోసట కైదు రాసుంటే పట్నం యెందుకు పోతాడు?" "పెజల్లో సెడ్డయ్యాడు. దాని మంచి యెంతకాలం కాస్తాది?" ఇలా తలోలా వ్యాఖ్యానాలు చేస్తున్నారు. పుల్లయ్య కదల్లేదు. అంతా విని తెలుసుకొని నీలియే మాటాడలేదు. భజన మందిరం దగ్గర తిండిలేక కడుపులో రాత్రి తగిలిన తాపువల్ల నొప్పితో గిలగిల వెంకన్న గింజుకుంటున్నాడని తెలిసింది. నీలి వెంటనే గిన్నెలో తను త్రాగకండా గంజి అన్నం పోసుకొని వెళ్ళింది.

"అయ్యా!" అని పిలిచింది.

నీలిమాట విని సిగ్గుపడి నా, నులుచుకుంటున్నవాడు లేచి కూర్చున్నాడు.దగ్గర కూర్చొని కడుపుమీద చెయ్యివేసి"పాపం! వాసిపోయిందే" అంటూ చెయ్యితో రాసింది. గుడ్డివెంకన్న కళ్ళల్లో నీరు తిరుగసాగింది. యెదురగా గిన్నెపెట్టి చెయ్యి అందులో పెట్టింది. ఆకలితో వున్నాడేమో గబగబ ఆ మెతుకులు నమిలి గంజిత్రాగాడు. ఇప్పుడు నీరు కడుపులో పడిందేమో వుధృతంగా యేడుపు వచ్చేసింది. ఏడుస్తున్న యీ సింహాన్ని చూచి కళ్ళల్లో నీరుబికినా ఓదారుస్తూ "ఏడవకయ్యా! నిన్నటిలాగా యీ వేళ నువ్వున్నావా? నిన్నటిలాగ వుండాలన్నా వుండగలవా? అలాగే అందరి బతుకులూ! ఈవేళ చెడ్డని ఒకర్ని సంపేస్తే రేపు మంచి అనకండా చేస్తాం! సంపి మనం మరింత సెడ్డ అవడం దేనికి? నీలాంటోలకి నాలిక మంచైతే వూరు మంచవుతాదయ్యా!"

వెంకన్న దుఃఖం యింకా వుపశమనం కాకపోవటంవల్ల మాటాడ లేదు. కొంతసేపు కూర్చున్నాక గన్నెమ్మ వచ్చింది. "మామ్మా! ఇక్కడే పడుకున్నావుకదా! ఒద్దనైనా సెప్పలేకపోనావా? ఇనకపోతే నన్నేనా పిలిసి నావుకాదు. సూడు కడుపు యెలాగైపోనాదో? నూన పిసర తెస్తాను. రా స్తే వాపు తగ్గుతాది"

నీలి మాటలకు గన్నెమ్మ గతుక్కుమన్నా "బాగుపడేవోళ్ళకి ఒకరు సెప్పాలా? పాడయ్యేవోలకి వొకరు సెప్పితే బుర్రకెక్కుతాదా? నానేమయ్యాను....రాత రాతే తల్లీ!" అంటూ యింకేంమాటలు వస్తాయే మోనని అక్కడనించి నడ్డివొంచుకొని వెళ్ళిపోయింది.

ఇంతలో సంజీవి అలా పోతూ "నీలమ్మా! ఆ గుడ్డి నాయాలనా కనికరిస్తున్నావు.అదిగో రాజిగాడు నాయుడుయింటిదగ్గర యేంచేస్తున్నాడో సూడు! పోలీసులొస్తారు. పుల్లిగాడికి రోజులు బాగులేవు"

గుడ్డివెంకన్న చటుక్కున "రానీఅయ్యా రానీ! ఇందులో యెవురు దొంగతనం సెయ్యనేదు --రంకుతనం సెయ్యనేదు. నిజం నిలకడమీద తెలీదా?"

"నివ్వు ఆడిని సంపెడ్తువే - నిజం యేంటిరా గుడ్డోడా నిజం?" అంటూ దగ్గరకు త్రోసుకొచ్చాడు.

వెంకన్నకు మనసు మండి గట్టిగా "ఎలాంటోడు పుల్లయ్యని కైదుపెట్టిస్తాడో నామూ సూస్తాను"

"నివ్వేం సేస్తావురా? ఊరినుంచే నిన్ను తగిలెయ్యాలని సూస్తుంటే!"

"నలుగురి పీకలుతీసి మరీ వూరు కదుల్తాను"

నీలి మెల్లగా జోక్యంచేసుకొని "ఎందుకయ్యా యీ మాత్రందానికి పీకలు తీసుకోవటం? కర్రవంకర పొయ్యి తీర్నాలిగానీ నీ సేత యేం వున్నాది?"

వెంకన్న చప్పున "మనం ఆ కర్రని పొయ్యిలో పెట్టొద్దే కూతరా!"

"ఆకాలం వస్తే ఆ కర్రే పొయిదగ్గరకి వస్తాది. ఆ దేముడే దానికి తగినోడిసేత పెట్టిస్తాడు"

"ఆ తగినోడ్ని నా నే కూతరా! ఆడి అయ్యని"—

"అయ్యా! పరిగెత్తి పాయసం తాగేబదులు కూకొని మంచినీరు తాగితే ఒంట పట్తాదంటారు. ఇలా తొందరపడ్తే వచ్చిందేమీలేదు. వచ్చినా యెంతోకాలం నిలవదు.ఏపని సేసినా యెదుటోడిగురించి కొంచం తలసాలంటావా, మళ్ళీ వస్తాను. నూనెరాస్తే వాపు తగ్గుతాది" అంటూ వెంకన్నకు మరి మాటాడే అవకాశం యీయకుండా వెళ్ళిపోయింది.సంజీవి కదులుతూ "ఆ కళ్లుంటే...." అంటూ వెళ్ళిపోయాడు.

ఇంటికి చేరుకుని ఆ పుల్లిగాడ్ని యిలా సేస్తాన్ అలా చేస్తానని నోరుచేస్తున్న రాజిగాడ్ని చూసి పెళ్ళం మెల్లిగా "నీకు మతినే"దంది "నాకా!" అంటూ ఆగి వెంటనే "ఏవే, అలాగంటున్నావ్" అన్నాడు.

పెళ్ళం విసుక్కుంటూ "నాకేంటి. మీసంగలవోడ్ని—ఎద్దులో నైనా పోట్లాడతానంటావ్?ఆ వెంకన్న నీ వూరునుంచితగిలేస్తానంటావ్? ఆ పుల్లయ్యని కైదులో పెట్టేస్తానంటావు!"

"ఊరంతా నా పక్కవున్నారు. నాయం నా పక్కవున్నది""కోర్టు లెక్కినోడూ గాడిదెక్కినోడూ ఒక్కటే అంటారు, సూడు, పుల్లయ్య కైదునుంచి వచ్చి నిన్ను బతకనిస్తాడనా? ఆ గుడ్డోడు ఏదో సెయ్యకండా ఊరు కదుల్తాడనా? నాను సెప్పినట్లు వినుు"

"ఏనాడు యినలేదే! నీ మాటయిని ఆడికళ్లు పొడిసీనేదా?"

మెల్లగా చెవిదగ్గర యేదో చెప్పింది. సరే నన్నాడు. అప్పుడే వూర్లో నాయుడు కరణాలకి,పెద్దలకి భజనమందిరం దగ్గర పోగుచేశాడు. పెద్దమనుష్యులు పుల్లయ్యని పిలిపించారు. వాళ్ళేమడిగినా పుల్లయ్య సమాధానం చెప్పలేదు. "నివ్వే వాడ్ని ఖూనీచెయ్యించాలని సూశావ"న్నారు. అప్పటికీ పుల్లయ్య మాటాడలేదు. వెంకన్న "రామరామ—అంతా నానే సేసానర్రా!" అంటూ వెనకనించి అరుస్తున్నాడు.

సంజీవి ముందుకొచ్చి "రాజిగా! ఆ దెలాగా పట్నం యెళ్ళిపోదామని బతుకుదామని సూస్తన్నాడు. ఇలాంటప్పుడు కైదులో పెట్టించకరా! దానిమొకం పిల్లల మొకాలు సూడరా"

రాజిగాడు ఘీంకరించాడు. "అందరూ రాత్తిర రాకపోతే యింతేళకి నాను బుగ్గయిపోదును. ఆడ్ని కనికరిస్తానా?"

"అలాగంటే యెలాగరా, ఏదో నివ్వు డబ్బు యివ్వనేదని తొం దరపడిపోనాడు అదేదో పెద్దలున్నారు.తేల్చేసి ఆడికేంరావాలో యిచ్చి కూడదా?"

"నాకు ఆ భూమీవద్దూ, యిల్లూవద్దూ. నా దగ్గర పద్దులున్నాయి.నా నిచ్చింది యిచ్చేమను. ఒక్కానీ వడ్డీవద్దు"

"ఇప్పుడు ఆడిని గంగలో తోసేస్తే యెలాగ. ఎలాగో కక్కుర్తి పడ్డాడు. మైనేరు ఆస్తి అమ్మడానికి పుల్లిగాడికి యేం హక్కు వున్నాది గానీ....యెవురు కొంటారులే...."

కరణం అందుకున్నాడు "ఎందుకదంతాను రాజిగా?ఆ యిల్లు రాసి స్తాడు. గవుర్నమెంటు వూరకే జాగా గ్రామకంఠంలో యిస్తామంటుంటే ఆ పాత యిల్లు యెవడికి కావాలి? ఎలాగా పట్నం పోతున్నాడు. ఆ రైలు చార్జీకు పదిపూటలు తిండికి తగ్గట్టూ యిచ్చే!"

"నా నొక చమ్మిడీ యివ్వను. కరీదు కట్టండి. నాకు నష్టంగానీ లాభంలేదు" అని రాజిగాడు ఖచ్చితంగా అనగానే నాయుడు కలుగజేసు కొని "సచ్చిన పామును కర్రతోన బాదుతానంటావేమిటి?వూరూరా యిలాగ నిన్ను సంపడానికి యేసాడని తెలిసిపోయిందని ఆడే సచ్చిపోతుంటే!ఆడి పెళ్ళం ముఖం సూడు. ఊరుకొని తనే సెయ్యించినట్లు ఒప్పుకున్నట్టే. ఏదో మరో యెయ్యి రూపాయలు ముట్టసెప్పి ఆ పొలం, యిల్లూ రాయించుకో. కీడుచేసినోడికి మేలు సెయ్యమన్నారు. ఇంతకంటే మేం యేమీ సెప్పలేం! ఏం పుల్లయ్యా యిష్టమేనా?" పుల్లయ్య యిష్టమన్నట్లు తల వూపాడు.

"మీరందరూ పెద్దమనుసులు, మరి కాదని బతకగలనా? నష్టానికే వచ్చింది"అని రాజిగాడు చిన్న సోకం చేసుకున్నాడు. అంతా లేచి వెళ్ళి పోయారు. పుల్లయ్య భజనమందిరం స్తంభానికి ఆనుకొని కూర్చున్నాడు. దగ్గరేవున్న వెంకన్న "అయ్యా! నీకు నాయంకాదు, అలకీ నాయంకాదు" అని బొటబొటా కన్నీరు కార్చి తుడుచుకుంటున్నాడు.

"ఏడవకురా!" అన్నాడు పుల్లయ్య.

"ఏడవనా తండ్రీ! నేరం నీమీదేసుకున్నావు. ఊరెళ్ళ గొట్టున్నారు నిన్ను....నా వెంత పొరపాటు పని సేసినాను?"

"నివ్వేమీ సెయ్యలేదు. నామీద అభిమానంమీద అంతపని సేశావు. పొమ్మన్నారెళ్ళి యేం బతుకుతావ్. ఈ నేరం నీమీదే వుంటే వూర్లో యెవరూ నీకు గంజిపోస్తారా? నానే సంపడానికి పంపానని సెప్పు,పరవా నేదు. మళ్ళా నేను యీ వూరి ముకంసూస్తానా?"

"నాయనా, మరి రావురా? మనవడ్ని నాను సచ్చిపోయే ముందైనా ముద్దులాడనీయవా? నాయమ్మ నీలమ్మతల్లిదగ్గరుండదా? ఆ దేముడ్ని తిట్తానురా....ఆడికి కనికరంలేదురా....ఆడూ నాలాగ గుడ్డోడై పోనాడురా ....ఆడు–ఆడు" ఉద్రేకంతో మాటలు మరి రాలేదు. కానీ ఆ కళ్ళల్లో నించి నీరుమాత్రం బొటబొటా రాలిపోతోంది.

మౌనంగా యిద్దరూ కూర్చున్నారు.

27

పుల్లయ్యప్రయాణం స్థిరమయ్యింది. ఊళ్లో కొందరు పులి వేషంలో చుట్టుపట్ల గ్రామాల్లో పేరుబడ్డ వుల్లయ్యని ఒకసారి వేషంవేసి మరీ వెళ్ళిపోవాలన్నారు. కాదనలేకపోయాడు. 'ఒంటికి రంగు పులిమి, పులిబుర్ర తగిలించినా మల్లు పులికి జడవలేదు. 'నానూ పుల' అని యేడవడం మొదలుపెట్టగానే మల్లుక్కూడా రంగు రాశారు. ఒక పచ్చగుడ్డ మీద పులిబుర్ర గీసి కళ్లు, నోరు, ముక్కుటు దగ్గర ఆ గుడ్డ కత్తిరించి తలకి కట్టారు. తోక తగిలించారు. పుల్లిపిల్లలావున్నాడు. కొడుకే ముందు యిల్లుయెక్కి వెన్నుమీద నిల్చుని ఆడుతుంటే చూసేవాళ్ళందరూ ముచ్చటపడి యింకా ఆడమని కేకలువేశారు. తండ్రికన్న కొడుకు ఆటే బాగుందని అంతా మెచ్చుకున్నారు. ఆ రోజుల్లో పుల్లయ్యఆట చూసినవారు ఈనాడు "యీడు పుల్లయ్యేనా?" అని ఆశ్చర్యంజెందారు. "మనిషి బాగా పితలా అయిపోయినాడు. ఆ చలాకీ! అప్పుడు దప్పులు ఆగేవేకావు. ఇప్పుడు ఏం వున్నయ్–యెముకలు తప్పించి...." అని తలోలా వ్యాఖ్యానించుకున్నారు.

ఆట ఆడి యేటిలో స్నానంచేసి రంగులంతా వూడ్చుకొనేసరికి రాత్రయింది.ఇంటికి ఆకలితో వచ్చేసరికి గంజేవుంది. కొడుకో బుక్కెడు

తనో బుక్కెడు మిరపకాయ నంజుకొని భ్రాగాక యెదళగా నిల్చున్న పెళ్ళంతో అన్నాడు:

"అంత పెద్దపట్నం — అందరూ ఒకబస్తా మోస్తే నాను రెండు బస్తాలు ఒక్కసారే మోస్తాను.... ఈ కడుపుమంట సరిలే...."

"తినని దిరుసెందుకు సెప్పుకోవాల!"

"రాయే! ఇంకా పెద్దరోజు లుంటాయా? కష్టపడ్తాను. నాయం నీతికీ కట్టుబడతాను. నా పిల్లలకి లోటేం వుంటాది?"

తలెత్తి పెళ్ళంవేపు చూశాడు. మరి గంజి భ్రాగలేదు. కొడుకు భ్రాగగా మిగిలింది నీలి గొంతుకలో వేసుకుంది.

ఊరు కదిలేవరకు ఆలోచనతోనే వున్నాడు. అందరితో చెప్పడం అయిపోయింది. నీలి గుడ్డివెంకన్నకు, గన్నెమ్మకు, కుష్టురోగికి రేపు వెళ్ళిపోతామనగా ఈరాత్రి భోజనం పెట్టింది. అన్నీ సర్దుకొనే టప్పుడు వెంకన్న మల్లుకీ యిచ్చిన మంటిబెడ్డ అగపడింది. ఆ బెడ్డను పట్టుకొని కొంతసేపు మౌనంగా అలా విల్చుండిపోయింది. ఆ బెడ్డ విసర డానికి చేతులురాలేదు. మళ్ళా యేనాటికైనా కొడుకు మంటిని నమ్మి కోడా అన్న ఆశతో ఆ బెడ్డను సామాన్లలో దాచింది.

తెల్లవారింది. కొద్దిగా చలివేస్తోంది. తూరుపున మబ్బుల్లో దినక రుడు దాగున్నాడు. ఏరు రెండుఒడ్డులూ తీసి పారుతోంది. సామాన్లున్న బస్తా పుల్లయ్య భుజంమీద వేశాడు నీలి కూతుర్ని యెత్తుకుంది. వెంట పీస, ఆదెమ్మాప్ప, వెంకన్న వగైరా అంతావున్నారు. ఇంటివేపు ఒకసారి చూసి ముందుకు నడిచింది. మళ్ళీ వెనుకకు తిరిగి చూడలేదు. వెళ్ళిపో తుంటే భ్రోవలో ఆడమ్మలు నిల్చొని పలుకరిస్తున్నారు. నీలి తలెత్త కుండా జబాబు మెల్లగా యిస్తోంది. ఆదెమ్మాప్ప పుల్లయ్యతో బుద్ధులు చెప్తోంది. నాయనా! బుద్ధిగావుంటే బువ్వతింటావు, దుడుకుతనం, పౌరు షం పెట్టుకోక; అది సెప్పినట్టు విన్నావంటే బాగుపడతావు. నాలుగుగాళ్లు గడించుకోని మళ్ళా ఈ వూరువస్తే నిన్ను కాదన్నోడు యెవుడు?"

పీస అన్నాడు "పుల్లిగా! అంతపట్నం — యెక్కడేనా బతికి పోతావు. నా గవురుమెంటోడు పెద్దోడు అవుతున్నకొద్దీ బాగా పోషిం చడా? లచ్చి లచ్చనాలని తెస్తుంది. పట్నం యెళ్ళి మారిపోకా?"

నీలమ్మగుడిదగ్గరకు వచ్చారు. ఆగి. దంపతులు మ్రొక్కారు. మల్లుకూడ తండ్రినిచూచి చేతులు జోడించాడు. రోడ్డు యెక్కారు. పుల్లయ్య ఆగి చుట్టూ చూశాడు. వరిచేలు కోతలకు సిద్ధంగా వున్నాయ్. అంతా పసుపుపచ్చ అకుపచ్చల కలయికతో వేలకొద్ది యెకరాలు. ఒక పెద్ద మైదానంలావుంది. ఇటువేపు ఊరు—అక్కడక్కడ పొగక్రమ్మి తోంది. నలుపెక్కిన నీలమ్మగుడి తూరుపువేపు ఆలా యెత్తుగావున్న సరుగుడుచెట్లు-పడమటవేపు వారధి యేరు। ఇదంతా చూస్తుంటే తనకు యింతవరకూ వున్న ధైర్యం సడలిపోసాగింది. అంపకానికి వచ్చిన వాళ్లు తిరిగిపోతూ కళ్ళల్లో నీరు తెచ్చుకున్నారు. పైకి యేడవకండా కుష్టురోగి వెంకన్నకళ్ళలోనుంచి యేకధారగా నీరు కారుతోంది. నోటిలో గుడ్డలు కుక్కుకున్నారు.

పుల్లయ్యకు ముందుకు కాలుపడలేదు. రైల్వే స్టేషను యేడుమైళ్లు దూరంలో వుంది. నడవాలి. కాళ్లు పీకుతున్నాయ్. వెనుకనుంచి పూరనే అభిమానం బంధనాలువేస్తోంది. ఎలాగున్నా నా వూరు బంగారమే। ఈ బంగారాన్ని వదిలి యెలిపోతున్నాను. మళ్ళా రాకండా....చూడకండా ఆకలితో సచ్చిపోతే యిక్కడే బుగ్గయిపోతాను....పట్నం పోను....నా వూరూ। మా తల్లి! ఉండిపోతానమ్మా.... ఇలా అనుకుంటూనే ఒక్కో అడుగూ వేస్తున్నాడు. కళ్ళలో నీరు వుబికిపోతోంది. గుండె బరువెక్కతోంది. కాళ్లు పీకెట్టున్నాయ్—వారధిమీద కాలుపెట్టి వెనుతిరిగి తిరిగి చూశాడు....మౌనంగా తలదించుకొని నీలి వెంట వస్తోంది. ఆమెను చూశాక యెందుకో మొదట సిగ్గువేసింది—తరవాత జాలివేసింది. అభిమానం కట్టలు తెంచుకొని వురకలువేసింది.

ఏదో అందామనుకున్నాడు—మాటరాలేదు. నీలికూడా మౌనంగా శాంతంగా ఒకసారి తలెత్తి వడిగా నడవటంతో పుల్లయ్యలో కొత్త చలనం కలిగింది. మళ్లు వారధిమీద పెద్ద అంగలువేసుకొని సిపాయిలా ముందు నడుస్తున్నాడు. అటునుంచి గొట్టెమంద వస్తోంది. గొట్టెల కాపరి "యెటయ్యా...." అంటే మళ్లే గట్టిగా సంతోషంతో "పట్నంపోతాం।" అన్నాడు.

వూరివేపు గొట్టెలు తలలూపుకుంటూ సాగిపోయాయి. బరువుతో ఆశతో వాళ్ళకాళ్ళు ముందుకుపడ్తున్నాయ్!

28

స్టేషను చేరుకొని చెమటలు కక్కుకుంటూ యీ కుటుంబం స్టేషనులో ఒకమూల కూలబడిపోయింది. కొంతసేపయ్యాక పుల్లయ్య తేచాడు. మల్లు వెంటపడ్డాడు. రూపాయి మూర్చితే యింకేమీ మిగల్లేదు. అరటిపళ్ళు, జంతికలు వగైరా తిని మంచినీళ్లు త్రాగారు. ఈలోగా గూడ్సుబండి వచ్చింది. మల్లు వుత్సాహం యింతా అంతాకాదు. అయ్యను ప్రశ్నలతో చిరాకెత్తిస్తున్నాడు. ముఖం వెలిగివుంది. మధ్యాహ్నం మూడు గంటల పదినిముషాలకి రైలు వచ్చింది. జనం కిటకిటలాడిపోతున్నారు. ఎక్కడా ఖాళీలేదు. ఈ చివరనుంచి ఆ చివరకు పరుగులెత్తారు. ఒక దగ్గర త్రోసివేశారు. ఇంకోదగ్గర ఖాళీగావుంది కానీ, లోసున్న దుబ్బు మనిషి "ఇది పరుపులపెట్టె....ఎక్కితే కైదు" అన్నాడు. ఎలాగో రైలు కదులుతుందనగా చివర పెట్టెలో సర్దుకున్నారు. టిక్కెట్లులేని యిద్దరు ప్రయాణీకులు రైలు కదులుతుండగా ఆ పెట్టె యెక్కారు. పెట్టెనిండా జనం. క్రిందను కూర్చోడానికి కూడా జాగాలేదు. మూటమీద మల్లు కూచున్నాడు. పుల్లయ్య నీలిచేతిలో పిల్లతో నిల్చున్నారు. రైలు కదిలిపోతోంది.

మల్లు సంతోషానికి హద్దులేకుండా వుంది. మూటను మద్దెలచేసి చేతులతో కులాసాగా బాదుతున్నాడు. నాలుగు స్టేషన్లుదాటి రైలు ఆయిదో స్టేషను చేరగానే పెట్టెలో రద్దీ తగ్గింది. రైలు ఈలవేస్తే మల్లుకూడా నాలిక మడచి రెండువేళ్లు నోటిలో పెట్టి ఈలవేశాడు. రైలు మెల్లగా కదులుతోంది ...అయ్యా,అమ్మా మెల్లగా చోటుచేసుకొని రెండు వేపులా దిగువన కూర్చున్నారు. పుల్లయ్యకు గతమంతా జ్ఞప్తికి వస్తోంది. తన యిల్లు వాకిలీ, పొలం,తను.... ...పెళ్ళం, పిల్లలు.....వెంకన్న..... రాజిగాడు.....అదెమ్మప్ప.....వగైరా అంతా మనసులో తిరిగిపోతు

న్నారు. చచ్చిపోయిన ముసలమ్మ, దాసుడు, నీలమ్మగుడి, నీలమ్మతల్లి అంతా మనసులో కదిలిపోతున్నారు. ఎప్పుడో మళ్ళీ తన వూర్లోనే బుగ్గయిపోవాలనుకున్నాడు. కిటికీగుండా పరుగులెత్తుతున్న ప్రకృతిని చూసి మళ్లు వుత్సాహంతో "అయ్యా" అని కేకవేసి "సూడుసూడు.... సెట్లూ, కొండలూ మనూరుకేసి పరుగున పారిపోతున్నాయ్!"

ఇప్పుడు పుల్లయ్యకు తను రైలుమీద పట్నం పోతున్నానని జ్ఞప్తికి వచ్చింది. మాటాడకుండా పట్నం విషయం తలుసుకున్నాడు. బాగా కష్ట పడి సుఖంగా బ్రతుకుతానని వూహించుకున్నాడు.

వాల్తేరు చేరేసరికి రాత్రి యెనిమిదిన్నర గంటలైంది. పెట్టెపెట్టెకు తనిఖీకి చేత కర్ర పట్టుకొని చెక్కింగ్ యినస్పెక్టర్లు వస్తున్నారు. గేటు దగ్గర టికెట్ కలెక్టరు వీళ్ళని ఆపి బస్తాలో బియ్యంలేవా అన్నాడు. పుల్లయ్య మాటాడలేదు కానీ నీలి "కుంచం బియ్యం పెయ్యికాపు కేసు కున్నాం బాబూ!" అంది. "పోలీసు లొస్తారు వుండండి" అన్నాడు.నీలికి భయంవేసింది. వాళ్ళ పెట్టెలోనే వచ్చిన కోటేసుకున్న బాబు బ్రటంకు పెట్టెనిండా బియ్యం యేసుకున్నాడు. ఆయనను యెవరూ అడగలేదు.చక చక నడుచుకుంటూ వెళ్ళిపోయాడు. పట్నం అంటే తొలిసారి తెలిసి వచ్చింది. నాలుగు రూపాయలు పుచ్చుకొని విడిచిపెట్టిన టికెట్ కలెక్ట రును పుల్లయ్య యేదో అనబోతుంటే నీలి వారించి "కైదు తప్పించా డా బాబు. ఆ మాత్రం పుచ్చుకోడా?" అంది.

మళ్లు జిగేల్ జిగేల్మన్న దీపాలవేపు, పరుగులెత్తుతున్న కారులు, రిక్షాలు, బస్సులవేపు వింతవింతగా చూస్తున్నాడు. మేడలూ, మిద్దెలూ కనిపిస్తూంటే యెక్కడ కక్కడే ఆగిపోతున్నాడు. ఒకదగ్గర లౌడ్‌స్పీ కరు నుంచి సినిమాపాట బొయ్‌మని వస్తూంటే మళ్లుచెయ్యి పట్టుక లాగి తేగానీ కదిలాడుకాడు. వస్తూనే "అయ్యా! అంత గట్టిగా.....పదం! ....ఆడు పెద్దమనిసా?"

పుల్లయ్య "పూనగ్రాపు పాడతందిలే మనిషి కాడు"

"అయ్యా పూనగాపా---అదెలాగుంటుంది?"

"పెట్టె"

"పెట్టె పాడతాదా? నాకోటి కొనిపెట్టవూ?"
"పైసాలు దొరికితే అవేకరువా!"
ముందుకు నడిచారు. ఆ త్రోవ గంట వాయించుకుంటూ మిఠాయి దుకాణం బండీ వెళ్ళిపోతోంది. అయ్యా,ఆయ్యా అంటూ ఆగిపోయాడు! చేతిలో పొట్లాం పడ్డాక నములుకుంటూ వెళ్తుంటే అక్కడక్కడ పిల్లలు కనిపించారు. వాళ్ళంతా లాగులూ, కమీజులూ వేసుకున్నారు. ఆడపిల్లలు గౌనులు వేసుకున్నారు. తనకు లాగుంటే అనుకున్నాడు. "అయ్యా నాకు అలాంటిది, నెల్లికి యిలాంటిది" అని యిద్దరు వెళ్ళిపోతున్న పిల్లలను చూపించాడు.

"అన్నీ యియ్యేశే. రేపు కొందాంలే!" అన్నాడు.

టర్నర్ సత్రంలో కాలు పెట్టగానే కుక్కపిల్ల కనిపించింది. చుచ్చూ అని పిల్చాడు. పకోడీముక్క చూపించాడు! రుచి మరిగింది. వెంటపడింది. ఒక్క ముక్క తనకు యింకోముక్క కుక్కకు.... ఈ కుక్కపిల్ల హడావుడిలో పడి అయ్యను యింకేం ప్రశ్నలూ వెయ్యలేదు.

సత్రంలో గదులు శ్రీమంతులకు మధ్యతరగతివాళ్ళకు వేరు వేరుగా వున్నాయ్. డబ్బుయిచ్చుకోలేని ప్రజలకు పెద్ద పందెరలా వున్న తాటాకుల యిల్లు ఒకమూలవుంది. అందులో ఒకమూల మూట దించాడు పుల్లయ్య. సింహాచలం పుణ్యస్థలం దర్శించి, దగ్గరగా వున్న యీ పట్నాన్ని చూడటానికి వచ్చిన పల్లెజనం అందులో కిటకిట లాడుతున్నారు. ఒకమూల వంటలు సాగుతున్నాయ్. చిన్న పిల్లలు నలుగురు గగ్గోలుపెట్టి యేడుస్తున్నారు. తలలు గుండుచెయ్యించుకున్న ఆడంగులు యిద్ద రెవరో నలుగురు మొగవాళ్ళతో మాటల యుద్ధానికి దిగారు. ఒక వయసుమళ్ళినవాడు చేతిలో కర్రతో కుక్కల్నితరుముతున్నాడు.యెక్కడికక్కడే వుమ్మలు.యెంగిళ్ళతో పరిసరాలు అసహ్యంగా వున్నాయి.

పుల్లయ్య కర్రపుల్లలు నూనె వగైరా కొనితెచ్చాడు. నీలి వంట ప్రయత్నం చేసింది. పుల్లు ఒకవేపు కుక్కపిల్లని పెట్టుకొని యింకోవేపు నేలమీద దొర్లుతున్న చెల్లెమ్మను ముద్దులాడుతున్నాడు.

వీళ్ళ భోజనాలయ్యేసరికి యింకా యీ పందిరలో గలాటా తగ్గలేదు. ఎవరో యిద్దరు ఆడంగులు కయ్యమాడుకొని పాతవన్నీ యెత్తి

పొడుచుకుంటున్నారు. ఇద్దరికీ మొగుడైన పురుషుడు పెద్దగొంతుకుతో అరుస్తున్న రెండో పెళ్ళాన్ని నలుగురికో పరువు నిలుపమని బ్రతిమాలు కుంటున్నాడు. అది అలావుండగా యింకో ముసలాడు యింకా అన్నం వెయ్యమని కోడలిని అడుగుతుంటే, అమె మూతిపోట్లు పొడిచిందని చచ్చిన కూతుర్ని తలంచుకొని యేడుస్తున్నాడు. ఒకప్రక్క ఇంకా పొయ్యిలు వెలుగుతూనే వున్నయ్. ఒకమ్మ చేపలుకోసి నోరు వూరించు కొని పులుసుపెట్టోంది.ఇంకోమూల ఆసుపత్రికని వచ్చిన రోగిష్టి కడుపు నొప్పితో యేడుస్తూ అప్పుడే చచ్చిపోతున్నట్లున్నాడు.ఒక పిల్లాడు తనకు వచ్చిన పదాలు పాడుకుంటున్నాడు.ఒక యౌవనుడు యిదివరకు ముక్కు-ముఖం యెరగని బింకమైన స్త్రీతో సరసాలకు దిగబోతున్నాడు. వీళ్లు మాటాడితే చెయ్యి చేసుకుందామని ఆ స్త్రీతో యిదివరకు మాటాడిన స్వగ్రామస్తుడు కోపంతోనూ, మాత్సర్యంతోనూ ఒకమూల కూర్చొని చూస్తున్నాడు. అమాయకునిలా ఒక దొంగ యెదరగా వున్న కొళాయి దగ్గర కూర్చొని అలా వచ్చే అదంగుల మెడలవేపు కనిపెట్టి చూస్తు న్నాడు. ఒక కుక్క ఇంకో కుక్కమీదకు ఘీంకరించి వురుకుతోంది! ఈ చిన్న లోకంలో వున్న నీలి పుల్లయ్యలకు అలసినుండటంవల్ల నిద్దర ముంచుకొచ్చింది. మధ్యను మల్లును, పిల్లను వేసి, చెరోవేపు పడుకు న్నారు. మూట పుల్లయ్య తలవేపు వేసుకున్నాడు. అన్నం తిన్న కుక్క పిల్ల మల్లు కాలుదగ్గరకు వచ్చి పడుకుంది.మంచి రాత్రిమీద చలివేసింది. పుల్లయ్య కప్పుకోవాలని బస్తాలోని పంచె తీయడానికి లేచాడు. ముడు కులు కడుపులో పెట్టుకొని పెళ్ళం పిల్లలు పడుకున్నారు.

అంతా నిద్దరపోతున్నట్లే వున్నారు. రోడ్డుమీదనున్న మెర్క్యూరీ బిల్బు వెలుతురు పందెరలో ఒకమూల పడుతోంది.ఆ వెలుగులో మిగతా భాగం చూచాయగా కనిపిస్తోంది. "నాయనా" అని ఎవరో తనకు దగ్గర గానే పిలిచినట్లు వినిపించింది. ఆ గొంతుక మళ్ళీ వినిపించింది. ఒక ముసలివాడు.వాడిని ఆ కీనీడలో చూస్తుంటే దాసయ్యను చూసినట్లయింది. దాసయ్యే ఈ రూపంతో తన కేదో ద్రోహచూపించాలని వచ్చాడేమోననే నమ్మిక వెంటనే కలగసాగింది. శరీరం ఒక్కసారిగా యీ తలపుతో

పులకరించి, గగుర్పాటు చెందసాగింది. వినయంతో, భక్తితో దగ్గరగా వెళ్ళాడు. ప్రక్కనే కూర్చున్నాడు. మెల్లగా చెవులో యేదో గొణిగాడు. "నువ్వు పడుకో తాతా! నాను సూస్తానులే" అని హామీ యిచ్చి పుల్లయ్య తిరిగివచ్చాడు. పంచె తీసి కొడుకు,కూతురుమీద కప్పాడు. మళ్ళీ చార బడి నిద్దర అభినయిస్తూ ఒళ్ళంతా కళ్లు చేసుకొని పందెర అంతా చూస్తు న్నాడు.

నిశిరాత్రి; నిశ్శబ్దంగా వుంది.ముసలాడు టోకుర్లు తీసుకొని నిద్దర పోతున్నాడు.అందరిలో తెలివితో ఉన్నవా డొక్క పుల్లయ్యే;నిద్దర పారి పోయింది. యెదురుగా కొళాయి వెనుక దాగున్న యిద్దరూ మెల్లగా పం దిరవేపు రావటం చూశాడు. కొద్దిగాకూడా శబ్దంలేదు. చేతులు సర్దుకు న్నాడు. ఉత్సాహం ఒళ్ళంతా అలముకుంది.

అదిగో తలలువంచి మెలగా ఒకావిడమెడదగరకు చేతులు వెళ్ళ న్నాయ్; పుల్లయ్య చప్పున లేచి వాళ్ళమీదకు సింహంలా వురికాడు;ముష్టి యుద్ధం; పందెరఅంతా మేల్కొంది.దొంగ దొంగ అని ఒకటే గగ్గోలు. పట్టుకోండి-చంపండి-కేకలు — పుల్లయ్యను, నుదుటిమీద చేతిలోని కత్తి రతో ఒక దొంగ వేశాడు. రెండోదొంగ పుల్లయ్య బనియను పట్టుకొని "ఇదిగో దొంగ, అదిగో ఈ అమ్మమెడలోనిది కత్తిరించడానికి వచ్చాడు ....ఇదిగో కత్తిర;" అన్నాడు.

"మేం సమయానికి లేవకపోతే....చూశారా ముసాఫిర్‌లా వచ్చి యెంతపని చేశాడో;" అన్నాడు మొదటివాడు.

ఇలా వ్యాఖ్యానాలు దొర్లుకుపోతుంటే నుదుటిమీద గాయం బలంగా తగలటంచేత పుల్లయ్య కళ్లు జిగేల్‌మనటంవల్ల వెంటనే మాటాడలేక పోయాడు. దానికితోడు నలుగురూ నాలుగు యిచ్చుకున్నారు. నీలి.... "కాదు కాదు...." అని మొరపెట్టుకున్నా వినేవారెవరూ లేకపోయారు. పోలీసులకి అప్పచెప్పండని యెవరో అంటున్నారు. ఇంతలో టోకుర్లు తీస్తున్న ముసలాడు లేచి చూసుకుంటూ వచ్చాడు. దొంగలు పలాయనం చిత్తగిస్తుంటే పుల్లయ్య వున్న శక్తితో "వాళ్ళే దొంగలు, పట్టుకోండి;" అని అరుస్తున్నలోగానే....మాయమైపోయారు. ముసలాడు నలుగుర్లో

వికి వచ్చి పుల్లయ్య కళ్ళల్లో కళ్లుపెట్టి చూసి "నాయనా! దొంగల్ని పట్టావురా!....అయ్యో పాపం! దెబ్బ తగిలిందా?....ఏరీ దొంగలు?" అన్నాడు.

పుల్లయ్య "ఒక్కడ్నీ యిద్దరికాళ్లూ యిరగ్గొట్టా ననుకున్నాను.... బిశేయేసం యేసి తప్పించుకొన్నారు!"....అన్నాడు అలసిపోతూనే.

కొంతసేపటికి నిజం అంతా తెలిసిపోయింది. మొగుడి తలకు గుడ్డచుట్టి కూర్చోబెట్టిన నీలి అందరిమధ్యనుంచీ తీసుకొని వెళ్ళి నేల మీద పడుకోబెట్టింది. నలుగురూ నాలుగు విధాల నొచ్చుకొంటున్న మాటలు చెవిని పడ్తున్నాయ్. ముసలాడు "నిన్న లేసిన యేళా యిసేషం బాబూ! వాళ్ళిద్దరైపోనారు ...పక్కనున్నోడినైనా లేపినావుకాదు ..."

మళ్లుకు యేడుపుపోయి నవ్వు వచ్చింది. కుక్కపిల్లతో సెప్పు కుంటున్నాడు "మా అయ్య దొంగలమీదపడి దబ్బుడు యేసేసినాడు.... దొంగలు పారో...."

పుల్లయ్య ఈ మాటలు విని నవ్వుకున్నాడు. నుదుటిమీద దెబ్బ రక్తంకట్టింది. కొంతసేపటికి నిద్దరపోయాడు. తెల్లవారగానే నీలి "యీ యేళ పొద్దుకుంగకముందే యేదో యిల్లూ వాకిలీ సూసుకుంటేగానీ.... యిక్కడుండలేం" అన్నాది.

"ఇక్కడే వుందాం—ఈ రాత్రి మళ్ళీ వస్తారు—ఖర్చుకి బాగా యిచ్చుకుంటా" నన్నాడు పుల్లయ్య.

"ఈ యాత్ర కొచ్చినోలంతా యెల్లిపోతారు. దొంగలు పదుగురొస్తే అంతా సరి....వాళ్ళ ముక్కుకి బిద్దలుగొట్టి రక్తం కారించావు కదా వూరుకుంటారా? అయినా ఆ యిద్దరూ మంచోలే—ఒడిలో కత్తి తీసి పొడిసేసే యేంసేదుం? సాహసంచేయరాని చోటుంటాయి. అది తెలుసుకోలేకపోతే యెలాగ" పుల్లయ్య మాటాడలేదు. చల్దిఅన్నం తిన్నాక యెండలో యింటికోసం పెదకటానికి బయలుదేరాడు. కొడుకు కుక్కపిల్ల నెత్తుకొని పెంటబడ్డాడు. తాటాకు పాకలున్న వీధుల్లోనికి వెళ్ళాడు. ఎత్తుగా వరిచొప్పతో నేసిన, బాగా గాలి తగుల్తున్న యింటిలో వుండటానికి అలవాటుపడ్డాడేమో, దిగువుగా భూమికి చూర్లు తగిలివున్న యీ యిల్లవేపు చూస్తుంటేనే మనస్కరించటంలేదు. ఇవికూడా దొరక

టంలేదు. చుట్టూ కుళ్ళు కాలవకంపు, చెత్తా చెదారాలు. ఎక్కడ కక్కడే పురికి — వాటిపై కుప్పలుగా వాలే దోమలూ, ఈగలూ అంతా అసహ్యం వేసింది. మనుషులు వాటిలో యెలా మెసులుతున్నారని ఆశ్చర్యపడ్డాడు. ఒకదానివెనక ఒకటి — ఒక యింటికి నిప్పంటితేసరి ఆ పేటంతా నాశనమే! తన వూర్లో యెత్తుగావున్న ఆ యిళ్ళకి అగ్ని ప్రమాదాలే లేవు — ఒకప్పుడు యెవడో క్రోధంతో తగిలించినా ఆర్పివేయటం యెంతో సులువు! ఇక్కడ కదలడానికే జాగాలేదు. ఏమైనా తనొక యిల్లు చూసుకోవాలి. అక్కడక్కడా ఖాళీవున్నా వాటిఅద్దె నెలకు ఐదు రూపాయల నుంచి పదిరూపాయలవరకూ వున్నయ్. ఒకనెల అడ్వాన్సు యివ్వాలి. అడ్వాన్సు యిచ్చివేస్తే తనదగ్గర మిగిలిందేముంది?

తిరుగుతూ, తిరుగుతూ పొద్దు తలమీద కొచ్చేసరికి సముద్రపొద్దు చేరాడు. మల్లు సముద్రం చూడగానే భయపడకండా గెంతుతూ సంతోషంగా "అయ్యా, అయ్యా! ఎంతసెరువో...." అన్నాడు. తొలిసారి జీవితంలో సముద్రాన్ని చూడటం.పుల్లయ్య నవ్వి "సెరువు కాదయ్యా సవంద్రం — సవంద్రం!"

"సవంద్రం అంటే యేంటయ్యా"

"నీరు వుప్పగా వుంటాది — ఆ నీరునుంచి వుప్పుగడ్డలు పండుతాయి"

"నాగలేసి దున్నగలమా పండడానికి?"

"ఆ నీరు మడుల్లోకి పెట్టారు. అది యెండిపోయి వుప్పవుతాది"

"అయ్యా! యీ నీరు గంజిలో యేసుకుంటే — వుప్పు కావాలా?"

"నీరు యేసుకోరులే...." అంటూ చెయ్యి పట్టుకొని సముద్రపు వొడ్డుకు తీసుకవెళ్ళాడు. అప్పుడే హార్బరునుంచి స్టీమరు వెళ్ళిపోవటం చూసి "అయ్యా అయ్యా....సూడు సూడు....అమ్మో....ఎంతదుంది?"

"ఓడ అయ్యా అది. అదెక్కితే రంగం యెల్లిపోతాం?"

"అయ్యా, యెక్కుదామా?"

"ఇప్పుడు కాదులే....పద! యిల్లు కుదరాలి — పని కుదరాలి.... అప్పుడు యెక్కడికైనా యెల్దాం"

అంటూ తిరిగి సత్రంకు వచ్చాడు. కుర్రవాడికాళ్లు బాగా పీకెట్టాయ్. భోజనంచేసి తండ్రి పడుకున్నాడు. కొడుకు తనకాళ్లు తనే పట్టుకుంటూ కుక్కపిల్లతో కాళ్లనొప్పి అని చెప్పుకుంటున్నాడు. ఆ కుక్కపిల్ల, కాళ్ళొకసారి నాకింది.

పుల్లయ్య నిద్దరనుంచి లేచేసరికి పందిరిలో చాలామంది వెళ్ళిపోయారు. రాత్రిసరికి బహుశా ఒంటిగా వుండవలసివుంటుందేమో ననిపించింది; నీలితో యిల్లుదొరకడం కష్టమని, పడ్డశ్రమంతా చెప్పాడు. దెబ్బతగలడంవల్ల పుల్లయ్యనుదురు పొంగివుంది. నీలి నేనేయెతికివస్తానని బయలుదేరితే దారితప్పిపోగలవని మొగుడనడంతో. "నోరుంచే వూరు కరువా? నువ్వెత్తే నీకే యిల్లూ నచ్చవు. మన బతుక్కి మేడలూ మిద్దెలూ కావాలంటే యెలాగవస్తాయి? వచ్చినా అందులో వుండగలమా? ముఖానికి తగ్గబొట్టు పెత్తేనే కళగా వుంటాది." అని యింత సమాధానం చెప్పి ఒంటిగా బయలుదేరింది.

సాయంత్రం అయ్యేసరికి నీలి తిరిగిరాగానే పుల్లయ్యగుండె కుదుటపడి "యెతకటానికి రావాలనుకుంటే వచ్చినావు" అన్నాడు.

పెద్దసత్రవు యెక్కడని దారేపోయే మారాజుల్ని అడిగితే సెప్పినారు" అంది నవ్వి.

"ఇల్లు దొరికిందా?"

"ఏదో తలదాసుకోడానికి యిరుగూ పొరుగూవున్న కొంపేలే. యిక్కడ నాలుగు మెతుకులు నవిలేసి రాత్తిరికి వెళ్ళిపోదాం" అన్నది.

"తోవ తెలుస్తాదా?" అన్నాడు.

"ఇదిగో యెంతోదూరం లేదు. ఆరుబారికియెలే తోవలేదూ? ఆ రోడ్డుపక్కనే-కాలవున్నాది. రోడ్డుమీద మర్రిసెట్టుంది."

భోజనాలు వేగంగానే తెముల్చుకొని క్రొత్తయింటికి కుటుంబం బయలుదేరింది. ముల్లు కుక్కపిల్లను యెత్తుకొని ముందు నడుస్తున్నాడు, కొడుకుభుజం ఒక చేతితోనూ తలమీదమూట ఒకచేతితోనూ పట్టుకుని పుల్లయ్య అడుగులు వేస్తున్నాడు. అల్లదిగో మర్రిసెట్టు అక్కడే..... అప్పుడే మల్లు ముక్కు నులుపుకుంటూ "అయ్యా! అయ్యా! కంపు

కంపూ" అంటున్నాడు. ఆ ప్రాంతమంతా దుర్గంధమయం. ఇల్లుచేరేటప్పటికి పొరుగింటావిడ గగ్గోలుపెట్టి యేడుస్తోంది. మొగుడు వారిస్తున్నాడు.

"ఏడుపుతో!" అంటూ బయట మూటదించి పుల్లయ్య చుట్టూ చూశాడు.

ఉప్పుటేరుకాలువ. ఆ కాలవలోకి వూరిలోని కుళ్లునీటిని పెద్ద కాలవలు రెండు మోసుకవచ్చి యెల్లప్పుడూ చేరవేస్తున్నాయ్. ఎదరగా మ్యునిసిపల్ చెత్తబళ్లు వగైరా పెట్టేస్థలం. అప్రక్కనే రోడ్డు. ఆరోడ్డు నానుకునే ఈ వుప్పుటేరుకాలవ. ఈ కాలవవడ్డునే యీ పాతికయిళ్లూ వరసగావున్నయ్. మూడేసి నాల్గేసి గదులుకలసి ఒక కొంప. గదికీ గదికీ మధ్య తడికలు — ఒకగదిలో గుసగుసలు ప్రక్కగదికి స్పష్టంగా వినిపిస్తాయి-అక్కడక్కడా జల్లెడలావున్న తడికనుంచి ప్రక్కగదిలో యేం జరుగుతున్నదీ చూడొచ్చు. ప్రతి గదికీ ముందు చిన్న వాకిలి పడుకోడానికి, పెరట చిన్న గుమ్మటంలో వంట — కాలవలు కుళ్లునీరు మోసుకొచ్చిననాడు, నీరు పెరటిగోడకు తగులుతుంది — ఇంటిలో నీరు వూరుతుంది....ఒకోసారి మేఘాలకి వీళ్ళమీద కోపంవస్తే ఆ కుళ్లునీరు యింట్లోనే వుంటుందిఃఃః

....ఆశ్చర్యంగొరం....అంతా యీనరకకూపంలో జ్ఞాపకం రాసాగాయ్! లేని పోని ఊహలు పెట్టుకుంటూ విచారించుకుంటూ కూర్చుంటే మళ్లు ఆ పొరుగమ్మ యేడుపుకు వినిగెత్తేమో "అయ్యా!"అంటూ చెవులు మూసుకున్నాడు.

పుల్లయ్య యిప్పుడు ఆ యేడుపు సరిగ్గా విన్నాడు. విని ఆశ్చర్య పోయాడు. ఎవరో యింట్లో పోయాడేమోనన్న తలపులోవుంటే ఇంతకీ ఆవిడ పెంచినపిల్లి చచ్చిపోయిందని యిలా గగ్గోలుపెట్తోందేమో అని నవ్వుకున్నాడు. ఆ మొగుడు పాధేయపడిసేసిన ఓదార్పులుకూడా విని పిస్తున్నాయ్. ఆడగొంతుకలో సీలిది ఒక్కటే వినిపిస్తోంది. ఈ చుట్టు పట్లవున్న ఆడవాళ్ళు మనుషులు కారేమోనని అనుకున్నాడు. వారి గడప నుంచే, రెండోవేపు గదిలోవున్న మనిషి "ఏడొకయ్యా మీది!"అన్నాడు.

"తూరుపోలం—మాఊరు నవిరి."

"ఎన్నాళ్ళయింది వచ్చి?"

"నిన్నే్న....."

"ఎక్కడన్నా పనిఅయ్యిందా?"

"దానికే వచ్చినాను—"

"ఏం పట్నాలు! పేరేగానీ....ఆ పల్లెపట్టున పైసాలేకండ బతక వచ్చు! ఈ పట్నాల్లో యేం వున్నాయ్! ఈ కంపు—ఆ బొమ్మలూ...."

"బొమ్మలా?"

"అవునయ్యా....ఆ సినీమాలు సూస్తైనా....మనలాంటోలం మన సులో సంతోషపడతాం...." తరువాత ఓక్షణం ఊరుకొని వెటకారంగా "ఈ సుట్టుపట్లఊర్లనుంచి జంగిలీవోలు వచ్చిపడిపోతుంటే మాలాంటో లికి పనులెక్కడుంటాయ్!"

పుల్లయ్యకు కొద్దిగా సూటిగా తగలడంవల్ల "సరిగ్గా మాటరానీ అబ్బాయ్!" అన్నాడు.

"సరిగ్గానే వచ్చింది. పొద్దున్న శవం యీ ఇంటినుంచి కదిలింది. —అప్పుడే దిగిపోడానికి వచ్చినావు—"

పుల్లయ్యకు ఈ మాటలు వినగానే సీరిమీద యిలాంటి యిల్లు మంచీ చెడ్డా చూడకండా కుదిర్చిందని కోపంవచ్చింది.

నీలివచ్చి బుడ్డీతీసిదీపంముట్టించి కుడికాలుయింట్లోపెట్టి గడిలోనికి వెళ్ళింది. అమూట నీలేమోసుకువెళ్ళింది గానీ పుల్లయ్య కూర్చున్నచోటనుంచి లేవలేదు, తండ్రిదగ్గరే కొడుకు కూర్చున్నాడు. గడపలో పడకవేసి మల్లును పడుకోడానికి చెయ్యిపట్టుకొని లాగితే "కంపు రానురాను" అని కేకలువేశాడు. ప్రక్కనున్న జంటచూసి పకపకా నవ్వుకుంటున్నారు. ఇందులో నవ్వడానికి యేంవుందని నీలి అనుకొని వెళ్ళి యింట్లో నీలమ్మతల్లినీ మామ్మని తల్చుకొని నేల చారపడింది. ప్రక్కనే పిల్లి పడుకుంది. ఒకవేపు దుర్గంధంవల్ల ముక్కు నులుపుకుంటున్నా యెక్కడలేని తృప్తి ఆనందం ఆమెలో ఆవరించి కొంతసేపటికి నిద్రపోయింది. పుల్లయ్య చాలసేపటికి గడపలో వెల్లకిలా పడుకోగానే, మల్లువచ్చి వక్షంమీద పడుకున్నాడు. కొడుకుపీపుమీద మెల్లగా చరుస్తూ నిద్రపుచ్చాక ప్రక్కనే వేసుకొన్నాడు. పొరుగావిడమూలుగు వినిపించి రాను రాను ఆగిపోయినది. రెండోవేపున్న గదినుంచి గుసగుసలువినిపిస్తున్నాయ్

మొగగొంతుక: "ఇంకా దగ్గిరకురాయే....సినీమాలోసూడు యెలా గుంటారో...."

ఆడగొంతుక: "సిలకా గోరింకల్లాగ ఉన్నాంకాదా మావా?"

మొగ: "రాయే నీలాంటి సక్కనిసుక్క యెక్కడుంది?"

ఆడ: "అలాగయితే మావా నివ్వో....మొన్నపంట్లాంయేసుకోని సిగరెట్టు కాలుస్తంటే....నిజంగా....నాగేశ్వ్రావనుకొన్నాను."

కొద్దిసేపటివరకూ యీ ప్రేమఘట్టం జరిగాక కిలకిల నవ్వు వినిపించింది. తరువాత నిశ్శబ్దం!

పుల్లయ్యకు నిద్దర పట్టలేదు. ఆనాటిరాత్రి....చందామామో!.... పసందైన పల్లెవనితలు —నీలి....ఆ సొంపు ...పెంపు గరిడీలో ఘటికుడు ...కండలుతిరిగిన మనిషతను ...ఆ గేరాగిరజాలలో చెయ్యిపెట్టి మొదటిరాత్రినీలి....ఆ ముసిముసినవ్వు ...సిగ్గు....నిజంగా పుల్లయ్యకు ఇప్పుడే అవంతా అనుభవిస్తున్నట్లుగా....ఆనందబాష్పాలురాలిపోయాయ్!

ఆ నవ్వులోనే....యేదో విచారం ...ఆ విచారంలోనే యేదోతృప్తి ...."ఆటువంటి నా నీలి....యీ కంపు....ముంపుచేసుకొని....యెంత సుఖంగా పడుకుందో?"....నాకెందు కలాగ లేకపోవాలనుకున్నాడు —

మనసు ఇంకా పరిపరివిధాలుగా పోయింది—నీలి అన్నమాటలే జ్ఞాపకం వచ్చాయ్ "సంతోషంవస్తే పట్టలేం—ఏడుపొస్తే ఓదార్సలేం?" అని.

పొరుగునుంచి మళ్ళీ గుసగుసలు—ఆపిల్లికోసం యేడ్చిన మనిషి గురించి చెప్పుకుంటున్నారు....

ఆమె: ఆడుసచ్చాడుకాదా?అందుకే....లోకంకళ్లు కప్పుదామని."

అతడు: ఇంకొకడు వచ్చాడు కాదా?"

ఆమె: పొత్తుకుదరదా?"

అతడు: "ఈడూసస్తే దేన్నిసంపి యేడుస్తాదో?".

నవ్వు....పుల్లయ్యఒళ్ళంతా జరజరలాడింది....

ఇల్లుమార్చాల అన్న ఆలోచనలో పడిపోయాడు....ఆ ఆలోచన లన్నిటినీ—నిద్దర మ్రింగేసింది!

29

కొద్దిగా నొప్పిగా వుండిన నుదుట తగిలిన గాయం తెల్లవారి లేచే టప్పటికి దిగుట్లు పెట్టసాగింది. ఎదురుగా కళ్ళకి అగపడే పెద్దపెద్ద భవనాలవేపు గోడాములవేపు—కార్లమీద సైకిళ్ళమీద వెళ్ళిపోయే మనుషుల వేపు ఆత్మతగా చూసేవాడు. హార్బురు, ఓడలుకట్టే కంపెనీల బాకాలు బొయ్‌మని అరుస్తుంటే అవి తననే పిలుస్తున్నాయన్న ఆశతో ఆ బాధను లెక్కచేయకుండా కదలాలని ప్రయత్నించేవాడు. కానీ బాధతో కుమిలి పోతూ జ్వరంవచ్చిన మనిషిలా వణికిపోతుండేవాడు. కొడుకు, భార్యా దగ్గర వుండి కదలనివ్వలేదు.

ఒకరోజు గడిచింది. ఉపశమనాలవల్ల బాధతగ్గినా రెండురోజులు గడిచాక బ్రతుకుభారం యెలామొయ్యటమనే ఆలోచనలు గుండెకు నాటు కుంటున్నాయ్. ఆరాత్రి దీపపుబుడ్డి గదిలో వెలుగుతోంది. మల్లు కుక్కపిల్ల కనబడలేదని యేడుస్తూ నిద్దరపోయాడు. పుల్లయ్య బాధతో మూలు గుతూ దగ్గరకూర్చున్న నీలితో అన్నాడు;

"మనరోజులు బాగునేవే!" అని.

"అలాగనుకుంటే బాగుకేనిరోజులు బాగుపడిపోతాయా?"

పుల్లయ్య బాధతోనే అమెచెయ్యి తాకుతూ "సూడు! ఆక్కడ పొలాలు పోనాయి. ఇక్కడ కాలుపెట్టామా —దొంగలబాధ, యీ యిల్లూ ....యీ...." అని పెద్దగా నిట్టూర్చాడు. నీలి మౌనంగా నవ్వి "కష్టాలు వచ్చాయని పిరికోలమౌతామా? రానీ రానీ! యెప్పుడూ సుఖమే యేల కోరుతావు?" అంది. తరువాత మౌనంగావుండి నిద్దరపోవాలని ప్రయత్నించాడు. ఆకాశం మేఘాలమయంగావుంది. మెరుపులు....ఉరుముల శబ్దం వినిపిస్తోంది. ఆశబ్దానికి ఇంటితడికెలు కదులుతున్నాయ్. నడిరాత్రి మీద వర్షం పడుతోంది. ఇల్లు యెక్కడికక్కడే కారుతోంది. చిన్నపిల్ల యేడుస్తూనే లేచింది. మల్లును ఒకమూలకు వేసింది. పుల్లయ్యకు చలి వేయటంచేత ఒకమూలకు కాస్తయెత్తుగావుంటే అక్కడ అంటుకొని గజగజలాడుతునే "ఇవి సెద్దరోజులు కావా?" అన్నాడు. పుల్లయ్యకు యీ కష్టాలతోపాటు ఒకనాటి సుఖాలు జ్ఞాపకంరావటంవల్ల మరీ బాధ వేసి కళ్లు చెమ్మగిల్లాయి. ఇంట్లో కురిసిననీరు తన పాదాలదగ్గిరికి వచ్చింది.

నీలి నీరు. గిన్నెతో పెరట వుప్పుచేరులోకి తోడిపోసింది.

"నులకమంచమేనా లేద"న్నాడు పుల్లయ్య.

తెల్లవార్లూ యెవరికీ సరిగ్గా నిద్దరలేదు. ఉదయమయ్యేసరికి చుట్టుపట్ల బురదమయంగావుంది. కాలు కదిపితే బురద అంటుకుంటోంది. వర్షంధర్మమా అంటూ కంపుఅంతా తుడుచుకుపోయినందుకు పుల్లయ్య సంతోషించాడు. ఉదయం యెండకాస్తోంది—నిద్దరలేకపోయినా గాయంబాధ అట్టే లేకపోవటంవల్ల పనివెతుక్కోడానికి బయలుదేరాడు. మామూలుగా కొడుకు వెంటబడ్డాడు. రాత్రి ఓషికానికి యెందుకలా అయిపోయానని సిగ్గుపడ్డాడు. తెల్లవారేసరికి బాధ తగ్గింది—పరిసరాలు బురదమయమైనా కంపులేకండావుంది. ఆమాత్రం ఓర్పు తనకెందుకు లేకపోవాలనుకున్నాడు. అలాంటి ఓర్పుతో పని సంపాదించుకొని చెమటకారుస్తానని మనసుదృఢంచేసుకున్నాడు.

ప్రొద్దు నెత్తిమీదకు వచ్చేవరకూ తిరిగాడు. హార్బరుదగ్గరకు వెళ్ళాడు. ఎందరో పనిపాట్లు చేసుకోవటం చూశాడు. వాళ్ళలో తనొక్కడైతే ఎంతబాగుణ్ను! కూలీలు ఓడనుంచి బస్తాలు దించుతున్నారు—"

"అయ్యా సూడురా! ఆడు ఒక చిన్న బస్తా జూగుతూ మోస్తన్నాడు.... నానో?" అన్నాడు.

కొడుకు నవ్వుతూ "రెండు.... రెండయ్యా"

అలా వస్తున్నమనిషి వాళ్ళలోనివాడే — మర్యాదగా అడిగాడు. కాలీలేదని చెయ్యూపుతూ వెళ్ళిపోయాడు. తిరిగివచ్చాక మళ్లు అయ్య రెండుబస్తాలు మోస్తాడని యెంతో అట్టహాసంగా నవ్వుతూ అమ్మతో చెప్పుకున్నాడు.

పుల్లయ్య భోజనందగ్గర కూర్చోగానే గుండె గతుక్కుమంది. రేపటికి పనిలేకపోతే యీ భోజనం ఉంటాదా?.... "నాను పెద్దోడ్ని ఒకపూట నేకపోతే ఇంకోపూట. కాని నా మళ్లుకి.... పిల్లకి...."

గబగబ మెతుకులు నమిలి కాలుపీకెట్టున్నాలెక్కసెయ్యకఒంటిగా సిండియాకంపెనీ (ఓడలుకట్టే కంపెనీ) కి బయలుదేరాడు. కొడుకు అయ్యను వదల్లేదు. పరుగెత్తుతూ వెంటపడ్డాడు. అక్కడ పుల్లయ్య ఆత్మతకు తగ్గట్టే మనుషులు జవాబులిస్తున్నారు. వేలకొద్ది పనివాళ్లు బాకా రయ్యిమనగానే బయటకు వచ్చేస్తున్నారు. వాళ్ళలో యే ఒక్కరితోనైనా పొత్తుకుదుర్చుకుంటే రేపు తనని పనిలోనికి తీసుకవెళ్తారనే వుద్దేశంతో ఒకాయన నుద్దేశించి అడిగితే వాడు పక్కన నవ్వాడు.

"ఏం అయ్యా నవ్వుతున్నావు?"

"ఈ కంపెనీలో పనంటే యేటనుకున్నావ్ — నెలజీతం యెనభై రూపాయలకు తక్కువేనేదు....!"

"అన్ని రూపాయలే!" జేబులోపడ్డట్టే ముఖంపెట్టి "అయ్యా! తూరుపోడ్ని! బతికిసెడినోడ్ని? నీ పున్నెం ఉంటుంది. పిల్లలున్నారు.... నీతో రేపు నన్ను తీసుకెళ్ళితే...."

వాడు నవ్వుతూ "పనవడమంటే యేంటనుకున్నావ్. వుత్తి జంగిలీ మనిషిలాగున్నావ్!" అన్నాడు.

"అనయ్యా! పడతాను.... దొంగెత్తెయ్యను. నలుగురూ సేసినపనికి రెండురెట్లు సెయ్యకపోతే నివ్వేసినశిచ్చ పడతాను!"

"ఓరి పిచ్చన్నా" అని పెద్దనిట్టూర్చి "మొన్నమొన్న అయిదొంద లమందిని పనిలేదని తీసేసినారు! ఏసుకుంటే యీరోజుల్లో పెట్టెలు

మొయ్యడానికి నదువులు కావాలట! ఏదో కూలీనాలీ సేసుకుంటే బతుకు తావుగానీ —యెందుకిలా తిరుగుతావు?"

వాడు గబగబ ముందుకు లెక్కచెయ్యకండా వెళ్ళిపోయాడు.

తిరిగి ఇంటికి వచ్చేటప్పటికి ప్రొద్దుక్రుంగిపోయింది. ఈవేళ కాసిన యెండవల్ల ఇంటి పరిసరాలు అంత అధ్వాన్నంగాలేవు. కొడుకూ తనూ గడపలో కూర్చున్నారు. మల్లు యీవేళ యే పదిసార్లయినా కుక్కపిల్లనుగురించి పలవరించాడు. పుల్లయ్యకు యింకా ఆ సిండియాకంపె నీయే తలలో తిరుగుతోంది. అందులో దొరికిపోతే తనుతిని నలుగురికీ పెట్టేవోడ్ని అనుకున్నాడు, "కూలీ నాలీ చేసుకోమన్నాడు. అందుకోస మాతను పట్నం వచ్చాడు....ఏదో నెలజీతం పనిదొరికితే....కొడుక్కి సదివించనా? నా కొడుకు...." ఆలోచనలకు అంతులేకపోయింది-మళ్ళీ రాత్రి....

గడపలోనే పడకవేశాడు. మల్లు అలసివున్నాడేమో అయ్య చెయ్యి పట్టుకొని నిద్దరపోయాడు....పదిగంటలు దాటింది. ఆకాశాన నక్షత్రాలు మిణుమిణుకు మంటున్నాయి. యెదురుగుండా చెట్లకు ఉత్తర వేపున్న యెలక్ట్రిక్ స్థంభానికి వున్న వీధిదీపపు వెలుగు చెట్టుక్రిందకు పడుతోంది. చెట్టుక్రింద పిల్లలు ఆడుకోవటం పరిపాటి కాబట్టి చదునుగా వుంది. మిద్దెలూ, మేడలూ అగపడుతున్నాయ్‌గాని అక్కడ వాగేరేడియో యింతవరకు వినిపించలేదు.

గడపలో పుల్లయ్య యిటూ అటూ అవుతుంటే నీలి కాస్సేపు కాలుపట్టి పిల్లయేడుస్తుంటే గదిలోనికి పోయి ఓదారుస్తూ నిద్దరపుచ్చి తనుకూడా పడుకుంది. ఆలోచనలతో పుల్లయ్యకు నిద్దరరాలేదు. కుక్కపిల్ల అరచినచప్పుడై చప్పున రోడ్డువేపు చూశాడు— చెట్టుక్రింద కుక్కపిల్ల....మల్లుదిలానే వుంది....ఆ పట్టుకున్న మనిషి యెవడు? అక్కడే కూర్చున్నాడే....నిదానించి చూశాడు....వాడిచేతిలోనుంచి తప్పించుకోడానికి కుక్కపిల్ల వురకలావేస్తోంది....కానీ వాడు వదల్లేదు.

పుల్లయ్య లేచి కూర్చున్నాడు....కుక్క పిల్లకు యేదో తినడానికి పెట్టినట్లుంది....కుక్కపిల్లను అడిగి తీసుకుందామని మెల్లగా లేచి

పుల్లయ్య వెళ్ళాడు. ఆ మనిషి దానివేపే చూస్తూ పుల్లయ్య ఆ దరిదాపు ల్లోకి రావటం గుర్తించనట్లుంది—అంతా ప్రశాంతంగా వుంది.....

ఆ చెట్టుక్రింద కూర్చున్న మనిషి ఆ కుక్కపిల్లవేపు చూస్తూ మాటలు మొదలుపెట్టాడు....."మీ జాతి కెంతవిశ్వాసం? విశ్వాసంతోనే పుట్టారు....దానితోనే బ్రతుకుతారు....ఏ పరిస్థితిలోనూ ఆ విశ్వాసం విడిచిపెట్టరు..... మరి మానవజాతి?....హూఁ హూఁ....అంతా నటనే. ఆ జాతికి అందం,డబ్బుతో అంతాముడి....నాతో యేకీభవిస్తావు కదూ?" అంటూ దానిని మళ్ళీ ఒడిలో పెట్టుకొని ఒకముద్దుపెట్టుకున్నాడు.

దాని తల నిమురుతూ "విన్నావా? విన్నావా నాగోడు నివ్వైనా? రెండురోజులయి నాతోవుంటూ నా కష్టాలని పంచుకుంటున్నావే....నాకు దొరికినదానితో నీ కడుపు నింపకపోతే....నాకు విశ్వాసం యెక్కడుం టుంది?.....రెండు రోజులయినా నాకు తిండిలేదే....కానీ....నాకు.... డబ్బులేదనా? ఎంతవుండేది....నా పెళ్ళం....నన్ను ద్రోహంచేసిందని అనుమానంపడ్డానే—నే నెక్కడ బంగారం పాతరవేస్తానో తెలుసా?—అదంతా నీకు చెప్తాలే...." అంటూ ఆ కుక్కపిల్లను యెత్తుకున్నాడు. ఒక్కసారి కట్టలు తెంచుకొని వచ్చే దుఃఖంతో "నాలో సగం అనుకున్న పెళ్ళం, నమ్మిన స్నేహితుడు కలిసి ద్రోహం....చేశారే—విశ్వాసం....యెక్కడుంది ఆ జాతికి?....

బొలా బొలా యేడ్చేస్తున్నాడు. పుల్లయ్య నివ్వెరపోయి అలా చూస్తునే వున్నాడు—ఆ యేడుపు అలా చాలాసేపటివరకూ తనకు వినిపిస్తూనే వుంది.

తెల్లవారి లేచేసరికి చెట్టుక్రింద మనిషీ లేడూ కుక్కపిల్లాలేదు.

ఈవేళ మళ్ళు వెంటపడితే యెంతవారించినా వీలులేకపోయింది. మీదకు యెగబ్రాకి ఆయ్యమెడపట్టుకొని విడిచిపెట్టలేదు. వెళ్ళవలసిన ప్రతిచోటుకీ వెళ్ళాడు. ఎక్కడా పని పేరెత్తితే ముభావం చూపించేవారే! నీలాంటివాడి కెక్కడ దొరుకుతాదని కొందరన్నారు. తను ఇదివరలా కండలు తిరిగిన మనిషి,గూటాల్లాంటి దండలతో వుంటే యెంత బాగుం డేదనుకున్నాడు. పాత మార్కెట్టుకు వెళ్ళాడు. అక్కడ ముసలమ్మలు, కుర్రకుంకలు బుట్టలు పట్టుకొని కూలి చేసుకుంటున్నారు. వాళ్ళూ వాళ్ళే

పోటీపడి దెబ్బలాడుకుంటున్నారు.ఛా! వళ్ళతో చేరడమేమిటనుకున్నాడు. ఈ కూలి యెక్కడ దొరకదు? ఐనా తనలాంటి మనిషి చెయ్యవలసిన పనా యిది? మల్లునాయుడు కొడుకు. అంత ఘనంగా పదివూళ్ళకి మొన గాడనిపించుకున్న వాడు యీ బజార్లలో పడికాపులు కాసి తిరగవలసి వచ్చింది కదా అని నొచ్చుకున్నాడు.

మధ్యాహ్నం అయినా ఇంటి కేదో పని కుదిరితేగానీ వెళ్ళనని భీష్మించుకొని వెళ్ళలేదు. మల్లుకు ఉడకబెట్టిన సీమ పెండలం ముక్క ఒక ముసలమ్మదగ్గర కొని ఆ ప్రక్కనే కూర్చొని తినిపించాడు.తల బాగా పండివుంది. పళ్ళన్నీ రాలివున్నాయ్.

"ఏవూరు నాయనా?" అంది.

"తూరుపోలం— మా వూరు నవిరి"

"ఏం, వచ్చావు బాబూ?"

"పనికోసం?"

"ఎక్కడ సూసినా కరువే నాయనా— ఇంతపట్నం! ఎక్కడా బతుకుతెరువునేదు"

"అవ్వా! నీ కెవరు నేరా?" అన్నాడు.

"ఉన్నారుబాబూ—ఇద్దరు కొడుకులు—ఆడపిల్లలు లేరు—పెద్ద కొడుక్కి సిండియా కంపెనీలో నెలజీతమే....నాకు కోడలు తిండిపెట్టదు. రెండోవోడికి ఎక్కడా పనిలేదు – ఒకనాడు ఘనముగా బతికాం— కూలిసేసుకోడానికి మనసొప్పదు. నేను యిలాగే పైసా పరక తెస్తే ఇంట్లో గంజి....ఆడికి పెళ్ళం యిద్దరుపిల్లలూ....ఒకోపూట పిల్లలు ఆకలికి....కటకటలాడిపోతారు....ఏం సెయ్యడం! ఆ తండ్రి ఏనాడు కరుణిసే ఆనాడు...."

పుల్లయ్య ఈ మాటలు వింటూంటే తన పిల్లలే ఆకలికి కటకట లాడిపోతున్నట్లనిపించింది. ఈ లోకంలో కష్టాలన్నీ తనొక్కడివేకావు. ఎవరికితగ్గవి వాళ్ళకి వుండనేవున్నాయ్. ఈ ముసలమ్మ ఈ కష్టాల్లోనూ ఇంత ధైర్యంగా ఎలాగుండగలిగింది? ఆమెకు దేనిమీదో పెద్ద విశ్వాసం వుంది. ఆ విశ్వాసంతోనే ఆమె ఇన్ని కష్టాల్లోనూ సుఖంగా బ్రతుకుతోంది? తనకెందు కలా లేకపోవాలి అనుకున్నాడు.

తన విసుగుబాటు పోయి విశ్వాసం తనలో చొచ్చుకోవటంవల్ల మళ్ళీ ముందుకు బైలుదేరాడు.

ఒక కొట్టుదగ్గర పదిమంది మూగివున్నారు. తొంగిచూశాడు. రెండే సైకిలు రిక్షాలు కొత్తవి వున్నాయి.

ఒకటి తనకిస్తే వాళ్ళకి రోజుకు దొరికింది సగం యిచ్చి మిగతా సగంతో తను బ్రతికేసును. మళ్ళీ సంశయించాడు. ఒకప్పుడు నలుగురి చేత పని చెయ్యించుకొనేవాడ్ని. మనుషుల్ని మోసే గుర్రంలా తయారవుతానా? ఆ పనిచేస్తే....తన వూర్లో తెలిస్తే....ఆ చుట్టుపట్లనుంచి యెవుడు ఆసుపత్రి పనిమీద వచ్చైనా చూస్తే....తన్ను కులంనుంచి వెలివేసేరా?....మళ్ళా ఆ ఊరు ముకం చూస్తానా?ఇదేం పని అనుకున్నాడు.

మరి కొంతసేపు వీళ్ళనీ, వాళ్ళనీ కలుసుకొని గతిలేక తిరిగి అక్కడికే వచ్చాడు. ఆ యజమానిని కలుసుకున్నాడు.

"రోజుకు రెండురూపాయలు అద్దె!" అన్నాడు.

"రెండు రూపాయలే...."

"ఏరోజునైనా పది రూపాయలు దొరికితే, హెచ్చు నాకిస్తావా.... రెండు రూపాయలే అంటున్నావు"

"తూరుపోడ్ని బాబూ! నాకు తెలీదు—అంతడబ్బు వస్తాదా?"

"ఓడలమీద దొరలు దిగారంటే, అందులో తాగుంటారేమో—సోబుదారి గల్లీకి తీసికెళ్ళావంటే ఒకటేంటి—రెండు రూపాయల కాగితాలిసిరేస్తారు!"

"సోబుదారి గల్లీ యేంటి బాబూ?"

"అది తెలియనోడివి—నివ్వేం రిక్షాలాగుతావ్? అక్కడవున్న ఆడోలకేసి సూసావంటే కళ్ళు జిగేల్‌మనిపోవా?"

పుల్లయ్య కీ మాట లేపి నచ్చలేదు. ఒకప్పుడు యెవరైనా తన కష్టానికి మించియిస్తే తనెందుకు పుచ్చుకోవాలి? ఆ గల్లీకి అసలే వెళ్ళను అనుకున్నాడు. అప్పుడే త్రొక్కి డబ్బు సంపాదించుకుందామని యజమానితో—

"సరే! గాడీ యియ్యండి. రోజుకు రెండు రూపాయలకి ఒప్పుకున్నాను" అన్నాడు.

ఈ మాటలు తెగించి అనేశాడు — ఏదో ఖూనీ చేసేడానికి వుపక్రమించినవాడిలా !అ యజమాని "అయితే డిపోజిట్టు పాతిక రూపాయలూ తే" అన్నాడు.

"డిపోజిట్టు అంటే?"

"తూరుపోలకి యేమీ తెలీదులే. అందులో వాళ్లు వుత్తి జంగిలీ వోళ్లు — దొంగతనంచేసి పారిపోతారు —

ఈ యెత్తిపొడుపు పుల్లయ్యకి కష్టం అనిపించినా సహించి,"పాతికి రూపాయలా?" అన్నాడు.

"సూశావా? రిక్షాలు యెక్కడ దొరకలేదు. ఒకదానికి పదిమంది తగుల్తుంటే మేం యేం సెయ్యటం? నివ్వు యెప్పుడు మానిస్తే అప్పుడు పాతిక తిరిగి యిచ్చేస్తాం"

పుల్లయ్య తనదగ్గర డబ్బులేదని యెలాగైనా కనికరం చూపించమని ప్రతిమాలాడు. కానీ లాభం లేకపోయింది. అత్యతకొద్దీ యెలాగో తెస్తాను. గాడీ యింకొకరికి యిచ్చేక అన్నాడు.

"నీలాగ పదిమంది వచ్చారు. రేపు తెల్లారేవరకే షరతు. అప్పటి లోగా రాకపోయావంటే యింకెవరికైనా యిచ్చేస్తాను"

సరేనని యింటివేపు బయలుదేరాడు. "ఒక్కసారి పాతికరూపాయలే. యెక్కడనుంచి తేను? ఇంట్లో ఒక కానీలేదు. రాతిరికి యెలాగను కుంటూంటే పాతికరూపాయ లెక్కడతేను? — ఎవర్ని అప్పుయిమ్మని అడగ్గలను? అక్కడ చెక్కా ముక్కా వుండేది. ఆ రాజిగాడికి తాకట్టు యెట్టేశాను. యిక్కడేముంది? నన్నెవడు తాకట్టుపడ్తాడు?"

నడుస్తున్నాడేగాని మనసు మనసులోలేదు. నీలితో చెప్పినా వూరుకుంది. మధ్యాహ్నం వుంచిన గంజి ప్రాగాకకూడా అలా వాకిట కూర్చొని రోడ్డువేపు చూస్తున్నాడు. కొందరి జేబులు యెత్తుగా వున్నాయ్. అందులో డబ్బుంటాది — ఒక పాతిక అప్పిస్తే — ఆ యమ్మ మెడనిండా బంగారం ఆ బరువు మొయ్యలేకపోతోంది. నాకు వడ్డీకి పాతికరూపాయలిస్తే — ఆత్యతతో లేచి అడగాలనుకున్నాడు. కానీ జబాబు తనే ఊహించి నోరు కదపలేకపోయాడు. రాత్రి ఈ చెట్టుక్రింద వున్న మనిషి—బంగారం

యెక్కడ దాచాడో చెప్తే.అందులో పాతికరూపాయలకు సరిపడ్డదే తీసుకొనేవాడినే — మళ్ళీ వాడికి యిచ్చేద్దును!

నిముషం గడుస్తున్న కొద్దీ ఆత్మత హెచ్చిపోతోంది. ఆత్మత హెచ్చుతున్నకొద్దీ ఆలోచనలు ఒకమార్గం పట్టలేదు. ఏ గమ్యం చేరకండానే చీకటిపడిపోయింది. యేమో రోడ్లమీద దీపాలు వెలగలేదు.బిహారు పాడైవుంటాయేమో!

అలా ముడుతులుమీద తలపెట్టి దైన్యంగా కూర్చున్నాడు. ఇంట్లో పిల్లి ఏడుస్తుంటే నీలి ఓదారుస్తోంది.అది కొంతసేపయ్యాక యిటువేపున్న యొవ్వని, మొగుడు యింట్లో లేడని సినీమాపాట కూనిరాగం తీసుకుంటోంది. పిల్లలు యేదో అడుగూ మడుగూ వండగా తిన్నారు. నీలి మొగుడిని గంజి త్రాగడానికి రమ్మంది.

సగం త్రాగి ఒకసారి భార్యముఖం చూసి, మిగతాసగం ఆకలి వేస్తున్నా విడిచిపెట్టేశాడు.

చీకటిరాత్రి — చిన్న చలివేస్తోంది. ఐనా తండ్రి, కొడుకూ గడప మీదనే వున్నారు. నీలి గదిలో పిల్లను వేసుకొని పడుకొంది. పదిగంటలు దాటి పదకొండు దగ్గరగా అయ్యింది. మల్లు అయ్యవఱింమీద పడుకున్నాడు. పుల్లయ్యకు ఆత్మతతో, ఆవేదనతో నిద్దరపట్టలేదు. తలనిండా ఆలోచనలే — ఈ రాత్రి యెలాగైనా పాతిక రూపాయలు సంపాదించాలి. దీనితో తనకు బ్రతుకుతెరువు దొరుకుతుంది — అడుక్కుంటే దొరకదు. దొంగతనానికి వెళ్తేఛా ఛా అనుకున్నాడు —

నీలమ్మతల్లిని, దాసయ్యని భక్తితో తలచుకున్నాడు. ఇలాంటి ఆపదలో సాయంచెయ్యమని విన్నవించుకున్నాడు.కొద్దిగా కదిల్తేసరి మల్లుకు తెలివి వచ్చేస్తోంది. ఇంతలో ఆ చీకటిలో ఎవరో వచ్చిన చప్పుడైంది. దాసయ్య ఈ రూపంతో వచ్చాడా! లేక అదెవరు! రాత్రివచ్చిన మనిషా! పిళ్ళెవరూ కాదు-పొరుగుయువకుడు ఇంట్లోకి వెళ్ళిపోయాడు. ఓ క్షణం పోయాక గుసగుసలు వినిపిస్తున్నాయి.

"సూడే!"

"హా..."

"నిన్ను ఇలాగ వుస్తానా? గొప్పోడి పెళ్ళంలాగ సిల్కు బట్టలతో ఉంచనా?"

"ఎక్కడ దొరికినాది?"

"దొరుకుతాదా? వాల్తేరు టేషనుకాడ-జేబు కాటేశాను"

"పట్టుకోనేదా?"

"టిక్కెట్టుకోసం — రద్దీ — ఆ మందలో యెంత సులువను కున్నావ్ —"

పుల్లయ్యలో అదోలాంటి ఆవేశం వచ్చేసింది. తన బతుక్కోసం ఒక్కసారి తనూ ఆ పనెందుకు చెయ్యకూడదు? "మళ్ళీ ఈ జన్మలో ఆ పని సెయ్యను. ఆ డబ్బుకి పదిరెట్లు పేదోలకి ఆ తెలియని మనిషిపేర దానంసేస్తాను".... వెళ్ళాలని లేవబోయాడు....మళ్లుని ప్రక్కకు వేస్తే కళ్లు నులుపుకుంటూ లేచి కూర్చున్నాడు...."యీడితో సాలాసిక్కే ..." అనుకొని మళ్ళీ వళింమీద వేసుకొని బుజ్జగిస్తున్నాడు....

అదిగో ఈలవేసింది — రైలు వస్తుంది ...టిక్కెట్లు కొనటానికి అంతా తయారవుతారు....రద్దీ ...ఆ జనంలో తను త్రోసుకొని వెళ్ళినట్లు జేబులో పర్సు కాటేసినట్లు....వూహించాడు.

మళ్ళీ మెల్లగా మల్లుని పడకమీదవేసి లేచి నాలుగడుగులు ధైర్యంతో వేశాడు. కొడుకు యేడుస్తూ లేచి గబగబ వెంటపడ్డాడు. పుల్లయ్యకు యెక్కడలేని విసుగూ, కోపం వచ్చింది. మళ్ళీ పడకమీద వేసి మొత్తుతున్నాడు. కాస్సేపటికి మల్లు నిద్దర నభినయించటంతో మెల్లగా చప్పుడు కాకండా బయలుదేరాడు. అయ్యచెయ్యి వీపుమీద లేకపోవటంతో మల్లు తలెత్తి చూశాడు. అయ్య మెల్లగా రోడ్డుమీద కదులుతున్నాడు. ఆ చిన్ని మనసుకు ఓ విషయం తట్టింది. వెంటపడితే అయ్య తనని రానివ్వడు. కొట్తాడేమో....దూరదూరంగా అయ్య పోల్చుకోకండా....దాక్కొని.... మెల్లమెల్లగా వెంటపడ్డాడు!

పన్నెండు గంటల రాత్రి....వూరు నిద్దరపోయింది....అక్కడ క్కడ రిక్షావాళ్లు అగుపించారు. పుల్లయ్య పెద్ద పెద్ద అంగలు వేసుకొని వాల్తేరు టేషనువేపు వెళ్ళాడు. దూరదూరంగా రోడ్డుప్రక్కనుంచి మల్లు అయ్యని అనుసరించాడు ....

స్టేషను చేరేటప్పటికి నిజంగా మూడవతరగతి బుక్కింగు ఆఫిసు దగ్గర రద్దీ యెక్కువగా వుంది. పుల్లయ్యకు సంతోషం, భయం రెండూ ఆవరించాయ్! శరీరమంతా యెందుకో గగుర్పాటు జెందసాగింది. ఐనా తన బ్రతుకుతెరువుకోసం యీ పని చేసితీరాలనే మొండి పట్టుదల,అలా వస్తున్న మనిషిని చూడగానే మరింత నాటుకుంది. "ఈ బాబుదగ్గర డబ్బుంది --ఊరడుగుతాను --పేరడుగుతాను. పాతికే తీసుకొని, మళ్ళా అందులో యేనాడో పాతిక కలిపి....ఆ బాబుకు యెల్లి యిచ్చేస్తాను-నిజం చెప్పి బతుకోసం సేసానని బతిమాలుకుంటాను.... దేముడు సూడడా?"

"ఏ వూరెల్తారు బాబూ?"

"పొందూరు"

సమాధానం చెప్పాడు. మంచి బాబులాదే వున్నాడని "ఆ వూరేం బాబూ తమరిది?"

"అవును...."

"తమపేరు...."

"నాగభూషణం...."

"చిత్తం, చిత్తం...."

NARLA MEMORIAL LIBRARY
V.R.NARLA
D P R I.
Acc. No.

మనసులో తను చెప్పినవి మరచిపోకుండా మళ్ళీ మళ్ళీ అనుకున్నాడు....మల్లు ఆ షెడ్డు స్తంభంచాటుననిల్చుని అయ్యవేపు తదేక దీక్షతో చూస్తున్నాడు....

అదిగో నాగభూషణం టికెట్టు తీసుకోడానికి జనంలో దూరాడు. మరెవరిది దొరికినా ముట్టుకోకూడదు. ఆ ఖద్దరు బెంగాళీ షర్టు పక్కజేబులో పర్సు కనిపిస్తోంది....పుల్లయ్య అటువేపు చేతులో టిక్కెట్టు డబ్బు వున్నట్లు బుకింగ్ ఆఫీసువేపు నడిచాడు....ఆ జనంలో తనూ దూరాడు--కాళ్లు గజగజ వణికిపోతున్నాయ్....ఒళ్ళు. తలా బరువై పోతోంది....మనస్సంతా మహా సముద్రమై అల్లకల్లోలం చేసేస్తోంది--ఆకలి....గబగబ ఆ చేతిని ఆజేబులో చెయ్యి పెట్టించింది....పర్సు దొరికింది....అయ్యో! తెలుసుకున్నాడు. దొంగ-దొంగ-కేకలు....పరుగెత్తుతున్న దొంగ దొరికిపోయాడు. ఆ జనమంతా యిటువేపు తరలారు....

మనిషో మాట....ఒకడు ఒకనాడు జవ్వనులు మురిసిపోయిన గీరా గిర జాల జుత్తు గట్టిగా పట్టుకొని దించుతున్న తలెత్తాడు....గుంపులో యెవ రికి తోచినట్లు వాళ్లు పడపడా వాయించేస్తున్నారు. పుల్లయ్య సిగ్గూ.... బలహీనంతో క్రుంగిపోయి క్రింద కూర్చుండిపోతుంటే యెవరో తాపు తన్నారు....పోలీసులని పిలండీ అని నాగభూషణంకు సలహాలిస్తున్నారు.

ఈ కోలాహలం చూసి కొడు కెంతసేపో చాటున వుండలేక పోయాడు. అయ్యను అంతా కొట్టుంటే నిల్చున్నవాళ్ళ మధ్యనుంచి సందుచేసుకొని లోనికి ప్రాకి కొట్టున్న పెద్దమనిషి కాలు రెండు చేతు లతో పట్టుకొని ఒక్కకాటు వేశాడు. కోపంతో పుల్లయ్యను కొట్టున్న మనిషి అమ్మో అని ఒక్కసారి అన్నాడు. అని వెనుకకు తిరిగి ఆ పిల్ల వాడిని ఆ కాలితోనే ఒక్కతాపు తన్నాడు. పిల్లడు క్రిందపడి దొర్లిపో యాడు....మొటుగావున్న గచ్చు కనికరంలేకండా ఆ లేత చర్మానికి రాపాడి రక్తం తెప్పించింది.

నిస్సహాయుడై పుల్లయ్య కొడుకువేపు చూశాడు --కళ్ళంట నీరు జలజల రాలసాగాయ్.

ఇంతలో నాగభూషణంగారన్నారు:

"వాడ్ని విడిచిపెట్టండి"

"పిచ్చిపట్టిందయ్యా-ఈ వేళ నిన్నూ, వేపు యింకొకర్ని - వీళ్ళ బతుకులింతే. జేబుకాటు లేదా ఖూనీలు చేసేస్తారు....పోలీసులకు అప్ప చెప్పవలసిందే...."

"నే నా కేసుల్లో తిరగలేను. నా డబ్బు నా దగ్గరేవుందికదా --- విడిచిపెట్టం"డని తనే ముందుకువచ్చి పుల్లయ్యను విడిపించి చెయ్యి పట్టుకొని లేవనెత్తాడు. తలదాచుకొన్న పుల్లయ్య వెళ్ళిపోమనగానే కొడుకుదగ్గరకు వెళ్ళి యెత్తుకొని మాటాడకండా ఇంటివేపు అడుగులు వేశాడు.

క్రోవలో కొడుకు తన ప్రతాపం చెప్తుంటే మరింత యేడుపు వచ్చింది.కానీ ఒక్కమాటా ఆడలేదు.ఇంటికి వెళ్ళేసరికి నీలి యేడుస్తున్న పిల్లను ఓదారుస్తూ "యెక్కడి కెళ్ళా"వంది. పుల్లయ్య మాటాడకండా

గడపలో చారబడ్డాడు. మల్లు తనప్రతాపం అమ్మ తెలుసుకోవాలని యిది వరకుండే ధోరణిలోనే "అమ్మా అమ్మా - ఆలు అంతాకలిసి అయ్యని దబ్బుడుదబ్బుడు యేసేస్తుంటే...యెల్లి కరిసేశాను..."

ఈ మాటలు నోటనే వున్నాయ్. పుల్లయ్య మల్లూ అని అరిచాడు. అంతా గ్రహించిన నీలి "దానికి వెళ్ళావా?..." అని పెద్ద నిట్టూర్చింది. పుల్లయ్యకు యెడతెగని అభిమానం. కోపం వచ్చి కొడుకువీపుమీద గట్టిగా చరిచాడు. అయిదేళ్ళా అంటుకపోయాయి. యేడుస్తూనే అమ్మ దగ్గరకు వెళ్ళకండా "అయ్యా" అంటూ గడపకు పుల్లయ్యదగ్గరకే వచ్చేసాడు. నీలి మాటాడలేదు. దీపం ఆర్పి పిల్లనువేసుకొని చారబడింది. ఆమెకు తల్సుకున్నకొద్దీ...దిగులుతో నిద్దరపట్టలేదు.

పుల్లయ్య వెల్లకిలా పడుకుంటే మల్లు మామ్మాలుగా వక్షంమీద పడుకున్నాడు. చీకటి అంతా నిశ్శబ్దంగావుంది. ఆకాశంనుంచి చుక్కలు తనవేపు చూస్తున్నాయ్ - ఏవగించుకుంటున్నాయ్-మధ్యమధ్యను కొడుకు బెక్కుతున్నాడు...

మెల్లగా తనచేతులు కొడుకువీపుమీదకు వెళ్ళాయి...అభిమానంతో తలనుంచి ఒళ్ళంతా తాకాడు...కొడుకు రాల్చిన కన్నీరు వక్షం మీదపడి చల్లగావుంది...ఒక్కసారి పుల్లయ్యకు అంతులేని దుఃఖం వచ్చేసింది. కొడుకును గట్టిగా నొక్కి పట్టుకొంటూ "నా మల్లూ...నా నాయనా!" అంటూ వలవల యేడ్చేశాడు.

30

పుల్లయ్య ఉదయం ఆలస్యంగా లేచేసరికి మల్లు కుక్కపిల్లను పట్టుకొని గెంతులేస్తున్నాడు. వాడి సంతోషానికి అంతులేకపోయింది. అయ్యతో ఆ కుక్కపిల్ల యెలా దొరికిందో చెప్పాడు. ఎవడో ఆమనిషి బూచోడిలా వున్నాడట! వాడివెంట కుక్కపిల్ల నడుస్తుంటే వెనకనుంచి వెళ్ళి పట్టుకొని పారో!

దాని కో తాడుకట్టి వాడెక్కడ వస్తాడేమోనని పెరటతడికకు కట్టాడు. దానితో మాటలకూ ఆటలకూ దిగాడు. అది కయ్‌కయ్‌మని

వుండీ వుడిగీ అరుస్తోంది. ఈసందడీ చూసుకొని పుల్లయ్య చడీచప్పుడు లేకండా చాటుగా ఒంటిగా పని వెదకటాన్కి వెళ్ళిపోయాడు.

ఎక్కడికివెళ్తే దొరుకుతుంది? చూడవలసిన పెద్ద 'కుంపినీలు' ఆప్పుడే చూసేసాడు. మెయిన్ రోడ్డుమీద ఏదో పెద్దమేడ కట్టున్నాడు. అక్కడ కూలీలను తాపీపనివారి నెందరినో చూసాడు. 'పనివుందా?"అని ఒక మేస్త్రీని అడిగాడు, లేదు అనే సమాధానం వెంటనే వచ్చింది. "తూరుపోడ్ని, పిల్లలుగలోడ్ని, మీలో ఒకడ్ని చేసుకోండయ్యా!"

"మేమే యిందరంవుంటే!"

ఆ ప్రక్కనున్నవాడు "పోనీ యీరోజుకి తీసుకోరా" అన్నాడు.

"సూడు, ఆలాగున్నాడుకదా? ఆడేం కూలిపని చేస్తాడురా."

పుల్లయ్య తనవేపు చూచుకున్నాడు. చిరిగిపోయిన చింకిమోటు బనియను, ఆ చిరుగుల్లోంచిచూస్తే—యెముకలే కనిపిస్తున్నాయ్. ముడుకులు దిగలేదు పంచె—మాసిపోయింది. మూతినిండుగా మీసాలున్నా దానిని ఆనుకొన్న గెడ్డం బాగా మాసిపోయింది. తనకేం జబ్బులేదే? ఒకటేజబ్బు-ఒకటే విచారం-"ఛా, ఈ జానెడు పొట్టకేనా యీతంటాలూ —యీ యెత్తిపొడుపులూ?" ఎంత ప్రయత్నించినా కూలికి వస్తానన్న మాట నోటివెంబడి రాలేదు. ఆగుంపులో ఆడవాళ్లుకూడా ఉన్నారు.ఆ ఆడవాళ్ళలో కండలుతిరిగి సహజ సౌందర్యంతో వుట్టిపడే యౌవ్వనులు కూడా వున్నారు. కాస్సేపు నిల్చొని పరికించిచూశాడు. మీసాలు నల్లగా వున్న ఒక మేస్త్రీ "యేమే మరదలా! మా తమ్ముడు మెత్తనోడైపోనాడానేక యింకోదానివల్లోపడి అక్కర సెయ్యనేదా?" అంటున్నాడు.

ఆ జవ్వని ముసిముసినవ్వునవ్వుతూ"అడదాన్ని సూస్తేతిమ్మనలాగ పళ్ళిగలించ"కంది. దానితో నోరు మూసుకున్నాడు. మరో యిద్దరు ఆయిల్లు కట్టిస్తున్నవాడిగురించి పనిచేసుకుంటూనే బాతాకానీ వేసుకుంటున్నారు. ఆ యజమానికి, ఒకనిపై ఆడది మోజుపడటంవల్ల యింతడబ్బు వచ్చేసిందని, అదృష్టం అంటే అలాగుండాలని ఒకడంటే - "అదే ఒక అదుష్టమా - సెమటోడ్చి గడించిందే దక్కదు, ఇలాంటి వెలాగుంటాయ్!" అని మరొకడు అంటున్నారు.

ఆ ప్రక్క.నున్న యింకొకడు కాలుతున్న చుట్టను ప్రక్కనుపెట్టి. "ఆ లచ్చిందేవికి నీతిలేదేంరా - ఉన్నోళ్లింటికే యెల్తాది. మొన్న యీడి బావమర్దికే బేకట్ల ఆటలో యేబయి యేలొచ్చాయట! ఇంతమంది సస్తున్నారు. ఆ బేకట్లు ఆటలోపడి మా అల్లుడు ఆఖరికి యేంచేసినాడు? రైలు క్రింద తలెట్టేసినాడు - ఆడు. పెళ్ళాం నలుగురుపిల్లలూ నాయింటిలో పడ్డారు - రోజులు సూసినావా యెలాగున్నాయో?" అన్నాడు.

ఈ మాటలన్నీ వింటూ పుల్లయ్య అలానేనిబ్బంబే యీమేస్త్రీయే అన్నాడు. "పోనీ యీరోజుకి పనిసెయ్యి—మావేఁ యెక్కువైపోనాం!" మిగతావాళ్లు కాదనలేదు. పుల్లయ్య సున్నం కలిపాడు - మోసాడు కొంత సేపు - కానీ వుత్సాహంగాలేదు. మధ్యాహ్నంసరికి ఆ పెద్దమేస్త్రీఅన్నాడు. "సూసావా! ఆడిపని - ఆడదానికంటే నాసి - యిలాంటోడి నేసుకుంటే నా కేం నొబం? - యింద ఈ అర్ధరూపాయి తీసుకొని యెల్లిపో" అని పంపించివేశాడు.

పుల్లయ్యకు ఆ ఆడవాళ్ళ యెదరగా చాలా నామోషీ అనిపించింది. ఆ అర్ధరూపాయి వాడిమొహంమీద కొట్టేద్దామనుకున్నాడు కానీ,చెయ్యాడ లేదు. ఇంట్లో మల్లూ పిల్లా జ్ఞాపకంవొచ్చారు. వాళ్లు ఆకలితో యీసరికి యేడుస్తుంటారు. ఇది ఒకపూటకైనా జరుపుతుందని యింటివేపు బయలు దేరాడు. త్రోవలో ఒక మూరంతస్థులమేడ కనిపించింది. నిల్చొని పైకి చూసాడు. "అదెక్కడ చూస్తే పట్నంఅంతా కనుపిస్తాదేమో! ఎక్కితే బాగుణ్ను -" కానీ తన జన్మలో అదెక్కగలడా?

ఇంతలో "అయ్యా" అన్నకేక వినిపించింది. మల్లు - ఇక్కడి కెలా వచ్చాడు - ఏబస్సులూ కార్లక్రింద పడిపోతే—వచ్చి గట్టిగా పట్టుకుని వెంటనే నిష్టూరంగా మాట్లాడేస్తున్నాడు. కొడుకు నెత్తుకొనేసరికి యెక్కడలేని సత్తువ ఆనందం వచ్చింది. నాలుగడుగులు వెయ్యగానే "అయ్యా, అయ్యా--అదిగో బూచోడు!" అని చూపించాడు.

వాడు ఆరాత్రి చెట్టుక్రింద వున్న మనిషే. ఏదో గొణుక్కుంటున్నాడు. పుల్లయ్య ఆదగ్గరగా నిల్చున్నాడు - వింటున్నాడు "లోకంఅంతా మోసమే - నాకు లోకంఅంతా కలిసి మోసంచేశారు. అసిగో అదు నా డబ్బుతో మూరంతస్తులమేడ కట్టేశాడు. నా కుక్కపిల్లని ఎవడో ఎత్తుక

పోయాడు - అదే మిగిలింది. అదే నాదయింది - అదే నా కష్టాలు విని సానుభూతి చూపించి నావెంట తిరిగింది — అది నాకు లేదు - నే నెం దుకు ఒంటరిగా బతకాలి? — అయ్యో! నేనెంత పిరికివాడ్ని — పిరికివాడు రోజూ చస్తాడు — ఎప్పుడో అతీగతీలేక రోడ్డుమీద కుక్కలాగ చచ్చి పోతాడు — ఇది నిజం - కానీ నారోదన వినేవాళ్ళంకెవరు?"

ఆ దీనాలాపన పుల్లయ్యకు అర్థమైంది. తనూ రోజూ చచ్చిపోతు న్నాడనిపించింది. తన కెందు కీ బ్రతకలేనన్న పిరికి? ఆ పల్లూడిన ముస లమ్మ కక్రపెండలం అమ్మి కొడుకునూ వాడి పిల్లల్ని పోషిస్తోందే? అ తాపీమేస్త్రీ యిలాచేసి తన కుటుంబంతోపాటు కూతురుకుటుంబం ఈడుస్తున్నాడే! తనలో ఏదో లోటుండాలనిపించింది. తనకెందు కా ఆశ? చప్పున పెళ్ళాం అన్నమాటలు స్ఫురించాయ్ "ఈ లోకంలో అందరూ రాజులు కాలేరు. అందరూ అడుక్కోరు - రాజుకుతగ్గ బతుకు రాజుది, అడుక్కున్నవాడికి తగింది వాడికి - రాజుకంటే రెండోవాడే సుఖంగా ఉంటాడు - రాజుకు మారాజు కావాలన్న ఆశవుంటాది — ఆ ఆశతో వాడికి సుకం వుండదు. అడుక్కునేవాడికి కడుపునిండినరోజు సుకం — లేనినాడు బాధ — అంతే! తనకు నెలజీతం పనవ్వాలని కొట్లాకెందుకు? ఇలాగే యెళ్ళనీ — రోజులు బాగుంటే పేదోడు మారాజు అవడా! ఆడెవడో మే డెలాగ కట్టించేస్తున్నాడు?

ఈ ఆలోచనలతో పుల్లయ్య ఇల్లు చేరుకున్నాడు. పట్నంలో తొలిసారి ఆర్జన పెళ్ళంచేతిలో పెట్టగానే ఆ అల్పసంతోషి ముకం ఒక్కసారి వెలిగినా వెంటనే ఎలాగ వచ్చిందో చెప్పమన్నది. అంతా వివరంగా చెప్పగానే "ఇలాగైతే బ్రతక్క యేం అవుతాం?" అన్నది.

సాయంత్రం కొడుకును పట్టుకొని ఈకొట్లో ఆకొట్లో వనికోసం వాకబుచేసుకొని వచ్చేసరికి యింటిదగ్గర సందడిగావుంది. పిల్లికోసం యేడ్చిన పొరుగుమనిషి దుఃఖం కాస్తా దూరంకావటంవల్ల తన మామ్మాలు స్వరూపం దాల్చింది. ఆ వీధంతా ఆమంటే హడలు. మొగ వాళ్లుకూడా ఆమెనోరు విని యింటినుంచి వెళ్ళిపోతారు. పుల్లయ్య ఆమెను ఈవేళే సరిగ్గా చూశాడు. వయస్సు ముప్పైఐదు, నలభై మధ్యలో వుంటాయి. పిల్లలులేరు. అందుచేత మనిషి చూపుకి ముప్పైయేళ్ళలోపు

మనిషిలా ఉంటుంది. పిక్క-బలం ఉండి ఆమెలో స్త్రీకి వుండే కోమలత్వం ఒకపాలు, మిగతా మూడు పాళ్లు పురుషుడిదే! మొగుడిలో యిటువంటి వాడే పెళ్ళం ఈమే మొగుడులా యింట్లో మెసులుతారని ఆ వీధిలో అనుకొంటుంటారు ఆమెకు వినిపించనట్టుగా!

పుల్లయ్య వెళ్ళినా ఆమె వాగ్ధాటి తగ్గలేదు. నీలి సన్నని గొంతుకతో యిచ్చిన సంజాయిషీ ఆమె వినిపించుకోలేదు. మొగుడ్ని చూచి నీలి యింట్లోనికి వెళ్ళిపోయింది. అడగ్గా యింతకీ తేలిందేమిటంటే యింటిమొగుడు తెలియక రెండు రూపాయిలకీ యిల్లు యిచ్చేసాడు. ఇంకో రూపాయి యివ్వకపోతే ఖాళీచేసితీరాలని —

"దానికే యింతనోరుచేసిందా?" అన్నాడు.

"నిన్న పిల్లలు గోలచేస్తున్నారని యేదో కస్సు బుస్సు మంది. ఆకోపం యీకోపం కలిసింది?"

"పిల్లలు అల్లరిపెట్టక - పెద్దోలు పెట్టాలా?- రానీ తగువు యెలాగ పెట్టాదో చూస్తాను. నోరు జారిస్తే నువ్వూరుకోక!"

నీలి నవ్వింది. "అది జారేసిందని నేను జారేస్తే యేమున్నది. నా తప్పేం నేదు — నే నెందుకు దానిలాగ అణుపోవాలా? కోపమంతా కక్కేస్తానీ..."

"అంతా కక్కేస్తాది-కాటి కెళ్లేవరకూ వుండదా?"

"ఒంట్లో ఒక పుండు ఎంతకాలం వుంటావి? అది బాగు కాకపోతే మనిషేమౌతాడు? అలాగే సెడ్డేదీ మనిషిలో ఎంతోకాలం వుండిపోదని మా మామ్మ చెప్పింది. మంచి దగ్గర సెడ్డకి లొంగుబాటు లేకపోతే యీ పెపంచకమే నిలవదు."

పుల్లయ్య ఇంత సమాధానం విన్నాక మాటాకలేదు. ఆరాత్రి నిద్రపోయేముందు నీలి రాత్రిజరిగిన విషయంగురించి యెత్తింది. పుల్లయ్య దిగులులో మాటాడలేదు. ఆమె మౌనంగావున్న భర్తతో మెల్లగా అన్నది —"సూడు! యిలాగ పచ్చల్లాగ సచ్చిపోదాంగానీ, దొంగతనానిక్కామాత్రం యెల్లొద్దు"

పుల్లయ్య తను దొంగతనానికి యెల్లలేదని తనపుద్దేశము చెప్పాడు.

కొంతసేపయ్యాక "పొరపాటైపోనాది. ఏదో బతుకుతానని అనుకున్నాను. మళ్లా నా పీక తెగినా అలాంటిపని చేస్తానా?" అన్నాడు.

"నానూ యెవరింటికాడైనా పని సూసుకుంటే యిద్దరు తెచ్చింది సరిపోదా?" అంది.

పుల్లయ్యకు యీ నిముషంలో తన గడచిన జీవితమే జ్ఞప్తికి వచ్చింది. మెయిన్‌రోడ్డులోకట్టున్న యింటిదగ్గర ఆడవాళ్లమీద మగాళ్లు విసిరే విసుర్లు నెమరువేసుకున్నాడు.

"ఎందుకులే" అనేసాడు.

ఆ మరుచటిరోజు వీళ్ళనీ, వాళ్ళనీ పనివిషయం అడిగాడు. మళ్ళీ సింకియూకంపెనీ, నేవల్‌బేస్, హార్బరువేపు వెళ్ళాడు. పట్టరానివాళ్ళ కాళ్లు పట్టాడు. కాని లాభంలేకపోయింది. మధ్యాహ్నం ఒక దక్షిణాది వేలాం వ్యాపారస్థుడి మూటలు మోసాడు. సాయంత్రంసరికి మూడు పావలాలు యిచ్చాడు. తనకు సంతోషం లేదుగాని నీలికి యిదే చాలని పించింది. ఆ రాత్రంతా ఆవేదనే. పిల్లలు మధ్యాహ్నం ఆకలితో యేడుస్తుంటే పొయ్యిగనున్న యౌవ్వని పిల్లలకు తిండిపెట్టిందట—దాని దేజాతో—కడుపు మాడుతుంటే జాతీ గీతీ ఎందుకనుకున్నాడు. ఆ రాత్రి మీద తలుచుకున్నకొద్ది నిద్దుర దూరమౌతోంది. ఎదరగా చెట్టుక్రింద బూచోడు పడుకొనివున్నాడు. చలి కొద్దిగావేస్తోంది. ఉప్పుటేరుప్రక్కను రైలురోడ్డువుంది. పోతూపోతూ రైలు ఊలవేసింది....భయంకరంగా! ఆలోచనలు పట్టుతప్పి మనిషిని నీరసంచేస్తున్నాయి—రైలుక్రింద పడిపోతే—అనుకున్నాడు! "ఛా ఛా—మొగోడైపుట్టాక్—పావలాడబ్బులు తెచ్చుకోలేవా? ఆడది, పిల్లలు యేమౌతారు?" వాళ్లు యేడ్చుకొంటున్నట్లు ఆప్పుడే కళ్ళకు కట్టినట్లయినది. "నా నాయనా! నా మల్లూ" అని యేడ్చుకున్నాడు—నా బతుకు యేమిపుకొచ్చిందా అని మరింత యేడ్చుకున్నాడు. ఆదుఃఖంలో యెంతో అనుకున్నాడు—"ఉద్యోగం నేకపోతే ఎలాగ బ్రతకడం? ఊరంతా తిరిగినా కానీపుట్టదు. బీదోలకి సుట్టముక్క—నేదు. గొప్పోలకో—ఇంతబతుకు బతికినా, నాకీగతి యిలా తెచ్చావేం భగవంతుడా!" అనుకున్నాడు.

అలా అనుకొంటుండగానే మూగన్ను నిద్దురపట్టింది. ఏవేవో కలలు. తెల్లారి లేచేక మళ్ళీ గుండె బిరువెక్కింది.పాదాలు అరిగిపోయినట్లు తిరిగాడు. అగపడినవాళ్ళందరికీ ఆతృతతో ఆశతో దండాలు పెట్టాడు. రైలుస్టేషనుకు వెళ్తే రైసెన్సు కూలీలు రానిచ్చారు కాదు. ఒక ముసలమ్మ మొయ్యలేక మొయ్యలేక చిన్న మూట తెస్తూ ఉంది, పోనీ కదా అని మూట అందుకుంటే కూలోడని ఒద్దు, ఒద్దు అంది. గాడీమీద కూర్చోపెట్టాక "నానాయనా-సుకపడతావురా" అని దీవించింది. ఒక్క అణాడబ్బులైనా యివ్వలేదు.

సుఖమెక్కడిది-రోజంతా యెలా గడుస్తుందని ఆరాటమే - రాను రాను యిటు భయం-అటుభయం-ఆకలి పీడించేస్తోంది, అభిమానం చంపేస్తోంది. "ఏ మెట్టి యీ కుటుంబం పెంచేది దేముడా"అని పట్నంఅంతా తిరిగి తిరిగి కాకిశోకం చేసాడు. ఎవడో తనలాంటోడే. కానీ తనకంటే పౌరుషమైన మనిషే. పట్నం బాగా చూశాడు. పట్నంసంగతులు బాగా తెలుసునన్నాడు-అన్నాడు.

"ఓరన్నా! గవుర్నమెంటోడు మావల్లే ఆ దొరల్ని తగిలేస్తాడు-మావల్లే గవుర్నమెంటోడు యేలతన్నాడు. సూడు మనలాంటి బీదోలు పిపైపొతన్నారు. ఎక్కడా కరువే-ఎలాగ దేశవాళీప్రజ ఆకలితో సచ్చిపోయి మాడిపోతన్నారో...."

"అవునన్నా! మన గవుర్నమెంటోడు సిన్నోడు. పెద్దోడైతే మన పని బాగుండదా!" అన్నాడు పుల్లయ్య.

"నువ్వు జంగిలీవోడులాగ వున్నావు.గవుర్నమెంటోళ్లు పెద్దోళ్ళే. అసలు సరిగ్గా పనిచేస్తే మనలాంటోలికి నౌకరీ కాదవా!"

"ఆడెందుకు సెయ్యడు!"

"సేస్తే యీ కరువెందుకుంటాదీ! బీదాడికష్టం యేం చెప్పేదీ! దానికి ఒక మొదలు సివరా నేదు. ఈ పెజ యెందుకూ పనికిరానోలై పోనారు. నంచం కట్టినోలికి వుంచినారు. నాలాంటి లేనోలికి తీసినారు. ఈల్లందరికీ హిందూధర్మం ఎప్పుడు అలవడతాదో ఆరోజు మనం బాగుపడతాం-హిందూధర్మంలో నాయంగాపోయి వారికి కలిగినమట్టుకు అన్నీ జరిగిపోగా పక్కనున్నోడికి సూడమని....అన్నారా!"

అని పుల్లయ్యనీ మల్లునీ ఆ మనిషి వెంటతీసుకెల్లాడు. చిన్న కాఫీ హోటలు—చిన్నబెంచీ, అంతా యీగలు, దోమలమయం.

"ఇదన్నా తాగు...."

ఆకలితో వుండడంవల్ల మారు మాటాడలేదు. బ్రాగేక యేదో నేరంచేసినట్లనిపించింది. మల్లుకూడా బ్రాగాడు.

బెల్లం టీ వాడికి చాలా రుచించింది. సాయంబ్రం కావస్తోంది—ఇంట్లో పెళ్ళాం పిల్ల జ్ఞాపకానికి వచ్చారు. తానైతే యెవడోపోసిన సాసిరు పోసుకున్నాడు. వాళ్ళగతి?

ఈ బ్రొత్త స్నేహితుడు "మీటింగుకు రావా?" అన్నాడు "మీటింగేటి?"

"తెలీదా? ముందుకు ఓట్లు వస్తన్నాయి. ఎవ్వడికేస్తే నా బాదలు తగ్గుతాయో వాడికి యేస్తామ. పెద్దోలు బాగా యీ కరువుకి డబ్బుచేసుకున్నారు. ఎక్కడ సూసినా అన్నాయమే—ఎక్కడా నంచమే—నాలాంటోలి బతుకేమైనాదీ? నాను బతకలేకపోనాను—నా కష్టాలు నా సెల్లెలు సూడలేకపోయింది—."

పుల్లయ్య ఆత్రుతతో "ఏమిసేసిందీ?" అన్నాడు.

ఆ మనిషికళ్లు చెమ్మగిల్లిపోయాయి. అంతలోనే పౌరుషం చుట్టుకుంది. "నా సెల్లి మానం అమ్ముకున్నాది. కత్తితో నరకాలనుకున్నాను: కత్తి సంపాదించాను. అయేల ఒక యేటు యేసేద్దును. కాని రెండురోజులైంది. గంజినేదు—నానెలాగో ఉన్నాను. కానీ నా తల్లిలేని ముగ్గురు పిల్లోళ్లు....? దానార్జనే ఆలని బ్రాణంతో వుంచింది. ఆరాత్రి అది గంజి పొయ్యకపోతే అంతా సరి! ఏమి సెయ్యమంటావన్నా."

పుల్లయ్య మనసు చివుక్కుమంది. అయ్యో పాపం అనుకున్నాడు.

"ఇదంతా అబద్దాలు కావన్నా! నాలుగునిముషాలు యీలోకంలో బతికినా నీతిగా బతికినోడితోవ వేరు — నాకు ఆకలేస్తోందని వూరందరిమీద అబద్దం సెప్తే దేవుడు కాయడు, యీ గొబ్బోల్ని నరికేమని అనను. అలకి మనలాంటోలి బతుకు తాలూకు బరువు తెలీదు. కావిడి మోసినోడికి బరువు తెలుస్తాదిగానన్నా వాలికేం తెలుస్తాది? ఈత కాయ యిచ్చి తాటికాయ పుచ్చుకోవాలని చూస్తారు గాని, తాటికాయ మా

లాంటి బీదోలకిచ్చి మాదగ్గరనుంచి ఈతకాయంత బత్తి వుచ్చుకుంటే యెంతబాగుణ్ణు?"

పుల్లయ్యకు యీమాటలు యెంతో నచ్చాయి. తనకంటే ఘోరంగా బాధపడేవాళ్ళి లోకంలోవుంటే తను యింత వెర్రిగా యెందుకైపోవాలని పించింది. తను కిరకిర చుట్టుకపోవడం బెంగలేదనుకున్నాడు.

మీటింగుదగ్గరకు తీసుకవెళ్ళారు. తనలాంటివాళ్ళే చాలామంది వున్నారు. అంతా చాలవరకు కార్మికులు—మధ్యతరగతివారు. వాళ్ళవేపు చూస్తూంటే పుల్లయ్యకు ఎక్కడలేని ఆనందంవేసింది. బహుశ: యీ వేలకొద్దీజనం తనలానే కష్టపడేవాళ్ళేమో; లేదా అంటే మీటింగు కెందుకొస్తారు; అరే—అదిగో తన పొరుగునవున్న జేబుదొంగ - వీడినుంచే తనూ దొంగతనానికి వెళ్ళాడు! ఎంత గట్టిగా అరుస్తున్నాడో! ప్రజలలో ఆ కోలాహలము - తనెప్పుడూ ఇలాంటిది చూడలేదు. ప్రజలలో ఇంత వుత్సాహం ఉంది. తనకెందుకు లేకపోవాల ....ఒకమనిషి సన్నంగా పేలవంగా ఉన్నాడు. గాలేస్తే ఎగిరిపోతాడేమో; సభావేదిక యెక్కడానికి జయజయధ్వానాలు ప్రారంభమైనాయి! పుల్లయ్య జైకొట్టాడు. తండ్రిని చూచి కొడుకు గొంతుక తెగిపోయినట్లు అరిచాడు.

తనప్రక్కనున్న అన్న అన్నాడు. "ఓరన్నా! సత్తెం ఏనాటికైనా జయిస్తాది. ఈ పెద్దోళ్ళందరు ఆ దొరలకాలంలో బాగా మింగడం నేర్చారు. అలవాటైపోనాది మరి. పోతాదా; రోజుకోధర - రోజుకో యుక్తితోని లోకాన్ని కాల్చేస్తన్నారు - వీళ్ళఆళ అడుగంటదా? అంతా మాయలోపడిగాని, యీ యుదవలంతా యెన్నాళ్లు బతుకుతారు! హరిశ్చంద్రుడు మారాజు - కష్టాలు, పడరాని కష్టాలు పడ్డాడు. కాటికాపరిగా మాతికాడిదగ్గర పనిచేశాడు - కాని మారాజు సచ్చిపోనాడా; ఆదీ బతుకు గాని - సూళావా ఎలాగున్నాడో ఆ బాబు?"

పుల్లయ్య వింతగా చూశాడు. ఆ మనిషి మళ్ళీ మాటలు పొదిగిస్తూ "నాయం యెటుపోతాది; యీ దోసుకున్నాలంతా సివరికి యీది లోన కుక్కలాగ సచ్చిపోరా; యీ కుర్రోళ్లు లేస్తన్నారు పైకి. ఈలలో ధర్మం, న్యాయం ఉన్నాది. పెడుగును కడిగేసి వదిలేస్తారు. ఇక అల ఆటలు సాగనివ్వరులే - వినుఆ బాబు మాటలు....!"

ఉపన్యాసకుడు చీపురుపుల్లలాగ ఉన్నాడుగాని గంగాప్రవాహంలా ఉపన్యాసం గంటకుపైగా ప్రవహింపజేశాడు. ఎన్నిసార్లో ప్రజలు కుతూహలంగా జయజయధ్వానాలు చేశారు. ఉద్రేకంతో కేకలువేశారు. కూర్చున్నవాళ్ళ నరాలు పొంగి లేచిపోయి ముందుకురికారు. ప్రజారాజ్యం రాక ఏమౌతుందని సవాలుచేశాడు ఉపన్యాసకుడు. తన ధోరణిలో తన ఉనికినే మైమరచిపోయాడు. మీటింగు అయిపోయాక వోట్లు కోసం విజ్ఞప్తి జరిగింది. బ్రతుకుభారం మోయలేక గిజగిజ గింజుకొంటూ, జీవితంమీద- భావిమీద ఆశతో బ్రతుకుతున్న ప్రజానీకంలో ఆ ఉపన్యాసం కాసేపు గింగురుమని ఆ కష్టాల్ని తేలికపరిచింది.

ఈ చివర నిల్చొని వెళ్ళిపోతున్నప్రజల నుద్దేశించి యెవడోఏదో చెప్పుతున్నాడు. ఎవరది? "అయ్యా! అదుగో బూచోడు?" అని మళ్లు చూపించాడు. ఆ బూచోడే గొణుక్కొంటున్నాడు. "ఆమాయకుల్లారా!" ఒక్క నవ్వు నవ్వాడు. "వాడికి వసపోసి విడిచిపెట్టారు. కాని బుద్ర లేదర్రా! వాడికి ఒక్కటే తెలుసు — దుయ్యబట్టడం! తిట్టేనాలుక మంచికీ తిడుతుంది చెడ్డకీ తిడుతుంది. వాడికి మనుష్యులపేర్లు తెలుసు. కాని చరిత్రగతే వాడికి తెలీదు! మీ అమాయకుల కళ్ళల్లో వాడి సగము తెలివితో దుమ్ముకొట్తున్నాడు" పకపక నవ్వుతూ "మీలోఎందరు క్రాస్‌వర్డ్, బ్రాకెట్లకోసం ప్రాకులాడరో చేతులెత్తండి?మీలోపెద్దపెద్దకట్నాలుపుచ్చుకోకండా పెళ్ళిచేసుకోలేనివాల్లెందరో చేతులెత్తండి? ఎక్కడ్నుంచో సులభంగా వేలు వచ్చి పడిపోవాలని దురాశతో లేనివాల్లెందరో చెప్పండి? మీరంతా దురాశ అనే మాయలో చిక్కుకొని వాడి దబాయింపుల్లో పడిపోయారు! కాకపోతే అంతా మేజిక్‌లా అయిపోవాలంటాడు. వందయేళ్ళనుంచి అంటిపెట్టుకున్నది ఒక్కరోజులో మార్చివేయమంటాడు? గానుగెద్దు ఒక్కసారి దుక్కిదెద్దు అయిపోతుందా?ఆ మాటలాడేవాడు పిచ్చివాడురా అబ్బాయిలూ?"

అలా వెళ్ళిపోతున్నవారు బూచోడువైపుచూచి హేళనగా పకపక నవ్వారు. బూచోడు మళ్ళీ గొణకటం ప్రారంభించాడు! "పిచ్చివాడు కాకపోతే—ప్రజలకు మరింత సంపాదించటానికి చేసే పోరాటంలో ఇదివ

రకు ఉన్నవాటిని పాడుచేసేమనేవాడిని ఇంకేం అనాలో నాకు తోచలేదు. ఉన్నది నాశనంచెయ్యటం పనిగా పెట్టుకొనే స్వభావంగలవారు ముందుకు ఏదైనా ఎలా నిర్మించగలరో నాకు అర్థంకాకుండా ఉంది — సంతృప్తిగల ప్రజలలో అలాంటి ఎదతెగని ఆశలను రేకెత్తిస్తున్నాడు. అంటే వాళ్ళ ఆశలు ఆకాశంమీదకు పంపించి — సంతృప్తిని మరచిపోనిస్తున్నాడు! అలాంటివాళ్ళకు విశ్వ రాజ్యానికివచ్చి ఎంతయిచ్చినా తృప్తిఉండదు — నిజానికి అలాంటి రకంవాళ్ళను నువ్వెప్పుడూసుఖపెట్టలేవు. నీదుష్ప్రచారముతో వాళ్ళ అసలైన సౌఖ్యాన్ని ఎందుకు కాల్చివేస్తావు. గోడకట్టినట్లు ఇటుకమీద ఇటుకలా సౌఖ్యపరచే పనులు చేవంటే సంతృప్తిగలమనిషే వర్ణించలేని సౌఖ్యాన్ని, ఆనందాన్ని పొందుతాడు. అలాంటి మనుషులు హెచ్చున్న దేశమే శాంతి సౌఖ్యాలతో వర్ధిల్లి కలకాలం నిలుస్తుంది. మీకందరికి కష్టంగా వుంటుంది — నే నేమన్నా! నాయనలారా నేను బాధపడ్డానురా! ఒకరిబాధను పంచుకోడానికి ప్రయత్నించినవాడినిరా! ఏదైనా నాకు చెప్పటానికి హక్కు లేకపోతేయింకెవరికుందిరా! వినండి వినకపోండిరా! చూడండి ఈరోజుల్లో ఎన్నికులాలు, యెన్ని పార్టీలు — యెన్ని సంఘాలు! ఇలా సంఘాలుగా ఉండి వీళ్ళంతా ఉన్నంతగా పోలేదే! ఒకరిమీద ఒకరికి అసహ్యము వ్యాపింపజేస్తున్నారు. మానవత్వంమీద అసహ్యాన్ని ప్రేరేపించడానికి సంఘాలు ఒద్దు నాయనా, నాదేశం, తలుచుకుంటే యీ యుగసంధిలో యింత అధ్వాన్నం అయిందా అని యేడుపొస్తుంది...."

ఇంకా ఎవరూ వినేవాళ్లు లేకపోయినా అలా మాటాడుతూనే కళ్ళంట నీరుకారుస్తూ ముందుకు నడచిపోయాడు.

పుల్లయ ఇంటివేపు ఉత్సాహముతో అడుగులువేసినా యిల్లు దగ్గరౌతున్నకొద్దీ మళ్ళీ మనసులో ఈపూట కెలాగుననే ఆందోళన రేగింది. ఆరాత్రి నీలి పొరుగమ్మదగ్గర చోడిపిండి అప్పుతెచ్చి అంబలి కాయటం వల్ల త్రాగాడు. ఆరాత్రి ఆలోచించి మరుచటిరోజు బజారులో తట్టపట్టుకొని కూలికివెళ్తే మంచిదనిపించింది. నిద్రపోయాడు.

31

రోజూ యెలా జరుగుతుందనే బెంగతో పుల్లయ్య పుల్లలా అయి పోయాడు. ఓరోజు కూలి దొరుకుతుంది. ఓరోజు ఏమీ ఉండదు—ఒక వాడు ఓడలో సరుకులు దించటానికి వెళ్ళాడు. రెండుబస్తాలు ఒక్క సారే మోసేయాలని వుబలాటపడ్డాడు కాని, ఒకబస్తా దించేటప్పటికే ఎంతో కష్టమైంది. మరో రోజు పనిలేదు. తన బలమంతా యేమైపోయిం దనిపించింది—

ఎక్కడో పని దొరుకుతుందని కాగితం రాపించి రిజిష్టరు చేయ మని యెవడో చెప్పాడు. ఒకరోజంతా కష్టపడి నోరు కట్టుకొని కాగితం రాపించి రిజిష్టరుచేయిస్తే జవాబే రాలేదు.'ఈవేళ వస్తాది....రేపువస్తాద'ని చూచి చూచి విసిగెత్తిపోయాడు. "ఏంపట్నం—తెల్లార్తే సైసా నేక పోతే జరగదు. మావూరే నయం—యెల్లిపోతే బాగున్న—ఏ కర్ర లమ్మో—ఏ కాయలమ్మో బతికిపోదును - కానీ యిలాగెల్తే అందరూ నవ్వరా? ఉన్నూరులో బతకలేనోడు పొన్నూరులో బతికిచచ్చినాడని యిదివరకే అన్నారు. అలాంటోలు పుల్లలాంటి పుల్లయ్యను చూసి గేలీ సెయ్యరా? ఏదో సంపాదించి మూటకట్టి యెకరాపొలం నాదీ అని గడిం చానంటే....కాలుమీద కాలేసి బతికేస్తాను....ఎలాగొస్తాది—బతుకే బార మైపోనాది—కడుపే సవద్రం అయిపోనాది -యీ పాడుకడుపుకి తెల్లా రితే వరగడుపెందుకో?"

ఇలా విలపించి గింజుకున్నాడు. ఈ విచారం ఒక జబ్బులాంటి పెట్టుకుంది. ఒకరోజు బుట్టపట్టుకొని బజారుకి వెళ్లాడు. అక్క డంతా పిల్లలు, ముసలమ్మలు వాళ్ళమధ్యకు కూలికి వెళ్ళటానికి సిగ్గువేసింది. అయినా తెగించివెళ్తే కుర్రవాళ్ళంతా "సిగ్గులేదా? పోతులా వున్నా" వన్నారు.సిగ్గువేసింది. కాని ఆకలితో మలమల మాడేబదులు యేదో ఒక పని—ఏం చెయ్యడం? తన కొడుకుకంటె రెండేళ్లు పెద్దపిల్లలు కూడా కూలి చేసుకుంటున్నారు. అయ్యో! నాకొడుకుని యీపని చేయనిస్తానా? వద్దు వద్దనుకున్నాడు. ఇలా నాలుగైదురోజులు కూలికివచ్చాడు. సాయం త్రంసరికి ఓరోజు పదిఅణాలు—ఓరోజుఅర్ధరూపాయి గిట్టేది—ఒక్కొ

క్కరోజు రూపాయపైన దొరికేది—ఆనాడైనా తనకు సంతోషం లేదు. కూలిడబ్బులు యేండబ్బులు—ఒకనాడు యెందరి కీ చేతులతో కూలిచ్చానో అనుకున్నాడు.

నీలి ఈ లేమిలోనూ చెయ్యి కట్టుకోలేదు. ఒకనాడు బూచోడికి గంజిపోసింది. వాడు సాధారణంగా ఎవర్నీ అడగడు—ఎవరిచ్చినా పుచ్చుకోడు—రెండుమూడుగోజుల కొకసారి యెవరింటిదగ్గరకో వెళ్ళి నిల్చుంటాడు-చాలామందికి వీడిలో ఏదో మహత్యం వుందనే నమ్మకం వుంది—వీడికి చాలా వేదాంతం తెల్సునని కొందరు అంటారు. బూచోడొకనాడు ఇంటియెదరకు వచ్చి అడిగాడు. నీలి తనకోసం వుంచుకున్న నాలుగు మెతుకులూ, గంజీ పోసింది. క్రాగాడు నవ్వాడు—వా డేం మాటాడుకున్నాడో నీలికి అర్థంకాలేదు.

చివరకు పుల్లయ్యకు బిజారులో కూలివాడుగా ఉండటం కష్టమని పించింది, పిల్లలు వాడివెంటపడి నానామాటలాడేవాళ్లు. పుల్లయ్య గెడ్డాం గిరజాలనుచూచి పిచ్చివాడనేవారు. తను పిచ్చివాడా? "నా గేరాగిరజాలు ....ఆ రోజుల్లో సుట్టుపట్టు వున్న యెన్నివూళ్ళకి పేరుపడ్డాయి....!"

ఒకనాడు ఒక ముసలోడు కూలికి పిలిచాడు. ఆ గాడిదబరువు కుర్రవాడైతే మోయలేడని పుల్లయ్యను పిలిచాడు. బేరమాడలేదు. చాలా దూరం. వెంట నడుస్తూవున్నాడు. ముసలాడు యేవో తనయింట్లో గొడవలు చెప్పుకుంటున్నాడు. పుల్లయ్యకు ఆశ్చర్యంవేసింది. ఇంత సిరి సంపదలతో వున్న మనిషికీ గొడవలున్నాయా అని? రోలువెళ్ళి మద్దెలతో చెప్పుకున్నట్లు చెప్పక చెప్పక తనతోనా చెప్పుకోవాలి? నే నెవరితో చెప్పుకోను—ఇంటిగుట్టు లంకచేటు అంటూ అంత పెద్దమనిషి నాలాంటి కూలోడుతో చెప్పుకుంటున్నాడే—మంచిమనిషిలా గున్నాడు. డబ్బుకి కటకటలాడుకున్నానంటాడు-మేడ స్వంతంది వుందట-కొడుకు గడిస్తున్నాడట—అంతా అబద్ధాలు కాకపోతే యీలకి డబ్బు కష్టమేంటి? ఒక్కొక్క ఆడపిల్లకి పదివేలుంచేగాని చెల్లరట—పదివేలే—నాకు రెండువేలుంచే బతికేద్దును! ఏంటో ఎంతసెట్టు కంత గా లంటారు? —

ఊకొట్టూనే యిలా అనుకున్నాడు. ఒకమేడదగ్గర చాలాజనాన్ని

చూచి "అక్కా డెందుకు అంతమంది మూగినారు బాబో?" అన్నాడు. కొడుకు వాళ్ళవేపు చూపించి "అయ్యా, అయ్యా" అన్నాడు.

"ఎంప్లాయిమెంటు ఆఫీసు — అక్కడ పనులిస్తారు!"

"అలాగా బాబో — ఈ వూరిలో యిలాంటిదొకటి వున్నాదని నాకు యెవరూ సెప్పినారుకాదు....దినాలు బాగులేక తెలిసిందికాదు!"

"అక్కడికెళ్తే దినాలు బాగైపోవులే!" అన్నాడు కాస్త వేళాకోళంగా. పుల్లయ్య ఈ మాటలు వినిపించుకోలేదు. యెంత వేగిరం తిరిగి వస్తానని పరుగునడక సాగించాడు. ముసలాడి యింటిలో సామానులు పడవేసి యిచ్చింది మాదుమాటాడకుండా తీసుకొని గబగబ తిరిగి వుద్యోగాలిచ్చే ఆఫీసుకు వచ్చాడు!

"ఎంతమంది!" అనుకున్నాడు. బుట్ట బైటపెట్టి చేతులు కట్టుకొని నిల్చొని యెవర్ని అడుగుదామని చూస్తున్నాడు. చాలామంది తెల్లతెల్లటి బట్టలు ఖరీదైన బట్ట వేసుకున్నవారున్నారు. తనలాంటి వారున్నా అందరిలోనూ తనే అసహ్యంగా వున్నాడు.

"నాకు పనిప్పించరా!" అన్నాడు ఒకమనిషిని చూసి.

వాడు చిన్న నవ్వునవ్వి "లోపలికెళ్ళరా" అన్నాడు.

గడిలో కాలుపెట్టేసరికి బింబ్రోతు "బయటికి పోవయ్యా"! అన్నాడు.

పుల్లయ్య గతుక్కుమని అడుగులు వినయంగా వెనక్కివేస్తే కొడుకూ సరిగ్గా అలానే వేశాడు.

అంతలోనే బయటకువస్తూ "యెలెల్లు, అలాగున్నావుకదా నీకేం పని?" అన్నాడు.

"నీ పున్నెం వుంటదయ్యా! తూరుపోణ్ణి. పిల్లలుగలోణ్ణి. ఒకప్పుడు పెద్దబతుకు బతికాను — దొరబాబుతో సెప్పి నివ్వేదో నెలజీతం పని యిప్పిస్తే — నీమేలు మరచిపోతానా? ఏదో ఆకో పాకో యిచ్చుకుంటాను."

బ్రతిమాలుతూ అభినయంతో పుల్లయ్య విన్నవించుకుంటూఉంటే చుట్టూవున్నవాళ్లు నవ్వుకుంటున్నారు. బింబ్రోతు కస్సుమంటూ "అలాంటి

లంచాలు మాటలాడక! సూడు చుట్టూ సూడు, యెన్నిబోర్డు లున్నాయో! నీకు సదువురాకపోతే యెవర్నేని ఆడుగు!"

"తెలీదయ్యా! నా మాటలతో నిన్ను కష్టపెట్టాను. నాకేదో పని ప్పిస్తావా నీపాదాలకి సెప్పులా ఉంటాను!"

బింబ్రోతు ఆఫీసరులానే ముఖంపెట్టి "వెళ్ళవోయ్! నీకేంపని? పెద్దపెద్ద యమ్. ఏ. లు, బియ్యేలు సదివినోలకే లేకపోతే....వెళ్లువెళ్ల" అని లోపల బెల్ వాగడంతో వెళ్ళిపోయాడు.

పుల్లయ్య చాలాసేపు చూశాడు, తననెవ్వరూ పిల్వలేదు. ఆలా ఆ వరండాలో బుట్ట ప్రక్కనుపెట్టుకొని కూర్చుండిపోయాడు. మళ్లు అయ్యప్రక్కన నిల్చొని వుండీ వుడిగీ ప్రశ్నలువేస్తున్నాడు. మధ్యాహ్నం కావస్తోంది. రద్దీ చాలవరకు తగ్గింది. మళ్లుకు చిరాకెత్తిందో లేక ఆలేత హృదయానికి అయ్యబాధ నాటిందో గబగబ గదిలోనికి తొంగిచూశాడు. ఎవరో మనిషి కుర్చీమీద కూర్చున్నాడు, ఆడే అయ్యకి పనియిప్పిస్తాడు. మా అయ్యనాంటి మంచిమనిసి లేడు. మా అయ్యకు ఎందుకు పనిదొరక దని అనుకొని గబగబ గదిలోనికి వెళ్ళాడు. ఆ ఆఫీసరుయెదురుగా నిల్చొని "మా అయ్యకి పని యిస్తావా లేదా!" బింబ్రోతు గబగబా వచ్చి బయటకు ఈడ్చేస్తుంటే మరీ గట్టిగా "మా అయ్యకు పని యివ్వకపోతే సూడండి—కుక్కపిల్లను తెచ్చి కరిపించేస్తా!"

అక్కడ ఉన్నవాళ్లు పకపక నవ్వుతున్నారు బింబ్రోతు ఢాటిగా "పోతావా మెడపట్టుకొని గెంటాలా!" అని పుల్లయ్యను గద్దించాడు. మళ్లు కొరకొర ఆ బింబ్రోతువైపు చూస్తుంటే "ఉల్లిపాయంత ఉన్నాడు గానీ వూరంతా గడబిడ చేసేస్తున్నాడు!"అని బింబ్రోతు విసవిసలాడాడు.

పుల్లయ్య ఈవేళ యేదో ఒకటి తేల్చుకోనిదే కదలకూడదనుకోవ టంవల్ల అటియట నిల్చున్నాడు. కొడుకు బుట్టలో కూర్చుని ఆఫీసువైపే చూస్తున్నాడు. ఇంతలో ఒక మనిషి —చాలా మంచిమనిషిలా వున్నాడు. వెళ్ళిపోతూ వెళ్ళిపోతూ "యేవూరోయ్ నీది!" అన్నాడు. పుల్లయ్య గబ గబ తనవెంటపడ్తూ "బాబూ! మాది తూరుపు—నవిరి. జరగక పట్నం వచ్చాను బాబూ!"

"అలానా పాపం!" అంటూనే ముందుకు సాగిపోతున్నాడు.

"పాపం అని కనికారం చూపిస్తున్నా డీ బాబు-ఈబాబుకు ఈ ఆఫీసులోనే పని—పని చూపిస్తాడన్న ఆశతో ఆయనవెంట బడ్డాడు.

ఆతని యిల్లు ఆ దగ్గరలోనే వుంది. ఇంట్లో కాలుపెడుతూ "లాభంలేదు—వెళ్ళిపో" అన్నాడు. తలుపు వేసుకున్నాడు. కాని పుల్లయ్య ఆగుమ్మం కదలలేదు. భోజనంచేసేక తలుపుతీసేసరికి పుల్లయ్య అక్కడే వుండటంచూసి "ఏమోయ్! నీలాంటివాళ్ళకి ఉద్యోగం దొర కడం కష్టం."

"బాబూ తమలాంటి పెట్టిన మారాజులే మొండిసెయ్యి చూపిస్తే మాలాంటోలం బతకాలా? నా కిక్క డెవరూ గతిలేరు తమరు తప్పించి—బిచ్చం పెట్టకపోతే సచ్చిపోతాను—"

ఈ ప్రాధేయమైన గొంతుకవిని ఆయన కుర్చీమీద కూర్చొని లోనికి రమ్మన్నాడు.వినయంగా వచ్చి నేలపైకూర్చొని కొడుకుచేతకూడా దండంపెటించాడు.

"ఏదో నేను చేసేస్తానని దేముడుని నమ్మినట్లుగా నీవు నమ్మి తున్నావు. కానీ నా చేతిలో యేమీలేదు. నీపేరు ఆ రిజిష్టరులో వేయగల నేమో—"

"అంతేసాలుబాబూ, ఈయాళకాకపోతే రేపియ్యారా!"

అందులో ప్రాసినంతమాత్రాన వుద్యోగం రాదు. నిన్నెక్కడికైనా పంపించడానికి యిదివరకు యే గవర్నమెంటులో పనిచేసావో చూస్తాయ. అందులో పేరున్నమాత్రాన నీకేం లాభంలేదు."

పుల్లయ్య వెలిగినముఖం కాస్తా మళ్ళీ విచారగ్రస్తమైంది-అయినా మనసులో ఈబాబు తప్పక తనకు పనిచూపిస్తాడన్న విశ్వాసంతో "బాబూ! మీరేమన్నా మీ పాదాలా యిడిసిపెట్టను. ఈడిముఖం సూడండి, మంచిరోజున పెద్దోడు పుట్టుకొచ్చాడు బాబూ! ఈడు పుట్టిన్నాడు, చిను కులు జలజల రాలినాయి. నాకేదో తమరు పనిప్పిస్తే నాకొడుకు పెద్దో డవతా! నీతి నిలపడా! దొంగల్నిపట్టే దొర కాడా!మీలాంటి మారాజులు యిటారనేకదా మాలాంటి పేదల్లం కష్టాలు సెప్పుకుంటాం. చూడండి —బట్టమక్క తిప్పి కట్టుకోడానికి లేదు. తిండికే లేనప్పుడు బట్టఎక్క డ్తాడి! నోరుకట్టుకొని పనికి కాగితం పంపించాను—ఏమీ వానిమీద

రాలేదు. ఈ కూలా? ఒకపూటకుంటే యింకోపూట లేదు. నా మాట అటుంచండి. పిల్లలు చుట్టుకుపోతుంటే యెలా సూడమంటారు? ఈ పూట తాగితే రేపు ఈ యేళకి? అందరు సూసి నన్ను జబ్బుమనిషనుకుంటారు —తిండికి లేకపోవడమే జబ్బు! మారాజులు మీలాంటి కుర్రాళ్లు లేసి నారు!"

"నేనేం చెయ్యలేనోయ్. నిజంగా చెప్తున్నాను" పాపం ఆయన తన నిజపరిస్థితి యీ అమాయకుడు తెలుసుకోవాలని నొక్కి చెప్పినా పుల్లయ్య విడిచిపెట్టలేదు. నిముష నిముషానికి తనలో యేదో ఆశ,విశ్వాసం హెచ్చిపోతోంది. మరి కాస్త దైన్యస్వరంతో "బాబూ! చేసేవాళ్ళప్పుడూ అలాగే అంటారు. ఒకరికి నాను దుర్మార్గం తలంచలేదు. నా పెళ్ళంసంగతి మీకు తెలీదు.దానిదగ్గర ధర్మం, నాయం వున్నాది.అదంటే నాకు జడుపు! దానిమంచి నాకు యీ రోజు కాకపోతే రేపేనా వస్తాది. ఆ బిగమంతుడు నాలాంటోళ్లకే కష్టాలు పెట్టిస్తాడు—ఆకరికి ఆ తండ్రే కనికరంతో మీలాంటి మా రాజుల్ని సూపిస్తాడు. తినేందుకు కూడు లేదు—మేడలూ, మిద్దెలూ కోరలేదు—మూరెడుగుడ్డ, పిడికెడు మెతుకులూ దొరికితే సాలు బాబూ—పని సెయ్యనోడ్ని కాను—దొంగెత్తు యెత్తినోడ్ని కాను—ఈ దళలో మిమ్మల్ని ఆ బిగమంతుడు సూపించినాడు. మీకు పదివేల నమస్కారాలు బాబో! నాకింత ఆదరువు యిప్పించండ"ని పుల్లయ్య సాష్టాంగపడిపోయాడు. కొడుకు తండ్రి నను సరించాడు. ఎదురుగా కుర్చీమీద కూర్చున్న మనిషి కళ్లు చెమ్మగిల్లిపోయాయి. వంటయింటినుంచి వింటున్న అతని భార్యకళ్ళనుంచి బిందువులు రాలిపోయాయి.

ఆయన లేవనెత్తాడు. ఏమనడానికీ తనకు తోచలేదు. ఆ నిముషంలో తను యింకేమన్నా పుల్లయ్య హృదయం పగిలిపోతుందేమోనని పించింది. రేపు పది గంటలకల్లా ఆఫీసుదగ్గరకు రా, నే నుంటానని పంపించివేశాడు. మళ్ళీ వెళ్ళిపోతున్నవాడ్ని పిలిచి "నీ పేరేమిటోయ్?" అన్నాడు.

"పుల్లయ్య బాబూ!"

"ఇంద, యీ అర్ధరూపాయితో నీ కొడుక్కేదో కొనియ్యి."

సంతోషంగా పుచ్చుకొని "మీ ఋణం యేంసేసినా తీర్చుకోలేను బాబూ....యేదో పని సెప్పండి-కర్రలున్నాయా కొట్టేస్తాను. ఈ సుట్టు పట్లవున్న గత్తరయెత్తి పారేస్తాను!"

అన్నిటికీ వద్దులే — మధ్యాహ్నం అయిపోయింది. యింకోసారి చేద్దువుగాని అని పంపించివేశాడు. పుల్లయ్యను పంపించివేశాక "పాపం! అలాంటి బాధపడేవాళ్ళని ఒక కంట చూడండీ"అని భార్య అందుకుంది. వెంటనే జవాబులేదు. తరవాత అన్నాడు. ఏదైనా చేద్దాం అన్నవాళ్ళకి చేసే అధికారం వుండదు. నేను ఒక గుమస్తాను. ఇదివరకే మా ఆఫీసంటే ప్రజల్లో నానా అపోహలూ వున్నాయ్. ఏదో తంటాలుపడి వాడ్ని వుద్యోగంకోసం పదిమందితో పంపిస్తాను — కానీ తీసుకునేవాడ్ని నేను కాదుగా!"

పుల్లయ్యతో చెప్దామనుకున్నది భార్యతో చెప్పేశాడు. ఆ మరు చటిరోజు అతికష్టంమీద పేరు రిజిష్టరయ్యింది. ఆ వేళ సాయంత్రం యింటిదగ్గర పుల్లయ్యకు తంతంతా బోధపర్చాడు. "ఎక్కడైనా ఖాళీలు వస్తే ఒకసారి పంపించే పూచీ నాది.తరవాత నీ అదృష్టం"అని చెప్పాడు. అంతా విన్నాక పుల్లయ్య కృతజ్ఞత చూపిస్తూ "ఆ మాత్రం సేసిన మారాజులేరి బాబూ! ఈ రోజుల్లో ఆకలంటే అన్నం యెవురుపెట్టారు!అలాగని దౌర్జన్యంసేస్తే యెవురూరుకుంటారు? ఇక్కడా అక్కడా పెద్దల్లోనూ కష్టమెరిగిన మారాజులుండబట్టి లోకం యింకా మునిగిపోనేదు. నేడా అంటే ఈ సంవంత్రం ఈ లోకాన్ని ముంచీదా బాబూ!"అన్నాడు.

ఒకవారం పదిరోజులవరకు అప్పుడప్పుడూ వచ్చి కనిపిస్తున్నాడు. ఒకనాడు అతను చెప్పాడు "ఇదిగో కాగితం — సరిగ్గా యీ వేళ టిరోజు పదిగంటలకు ఆఫీసుకు రా! ఇలాగ వచ్చావంటే లాభంలేదు. ఒక నిక్కరు, మంచి షర్టువేసుకో. చూడు — ఆ గెడ్డం యేంబాగులేదు— ఆ గిరజాలేంటి, అసహ్యంగావున్నాయ్. అవి తీసి మామూలు క్రాపింగు వుంచుకో!చూడ్డానికి అసహ్యంగావుంటే వుద్యోగం యెవుడిస్తాడు చెప్పు? నేను చెప్పినట్లు చేసి అక్కడకు వెళ్ళు. వాళ్లు యేది మొయ్యమన్నా

మోసెయ్యి—భయపడకండా జబాబుచెప్పు. లోపలికి వెళ్ళగానే యిలాగ సెల్యూట్‌కొట్టు!" అన్నీ మరీ మరీ చెప్పాడు.

ఆరోజు వచ్చింది. గిరజాలు తీయించేశాడు.బట్టలు పొరుగు జేబు దొంగను యెరువుఅడిగితే యిందులో నావేవి కావనేశాడు. తనలా పుల్ల య్యనూ చెయ్యమని సలహా యిచ్చాడు. ఆ సలహాప్రకారం చాకలివాని దగ్గర ఒక కాకీ నిక్కరు, కమీజు అద్దెకు తెచ్చాడు. ఎంత తయార యినా మనిషి సన్నంగానే కనిపించాడు. గిరజాలు తీసేయటంవల్ల డాం బికం తగ్గిపోయింది. అది తీస్తున్నప్పుడు చాలా కష్టంఅనిపించినా విధి లేక కళ్లుమూసుకొని కత్తిరించడానికి మనసిచ్చేడు. ఆ పని చేస్తుంటే మల్లు మంగలాడిమీద కోపంఅయిపోతుంటే తండ్రి వారించాడు. తన పొలం పోయిన్నాడుకూడా తనకు అంతకష్టం అనిపించలేదు.ఐనా కడుపు ముందా, యిది ముందా అనుకున్నాడు.

ఇంటర్‌వ్యూకి మరో పాతికమందితో సహా తనూ వెళ్ళాడు. ఆ స్థలం ఊరికి అయిదుమైళ్లు దూరంలోవుంది. ఎండలో నడిచి వెళ్ళేసరికి అలసిపోయాడు. అక్కడ యిద్దరు ఆఫీసర్లు వచ్చినవాళ్ళని తనికీచేస్తు న్నారు. పుల్లయ్యకు ఆకలివేస్తోంది. డబ్బు దగ్గరలేదు. వున్నమట్టుకు బట్టల అద్దెకు వెళ్ళిపోయింది. ఇంటికి వెళ్ళినా కడుపునిండుతుందనిలేదు. వుండగా వుండగా చివరకు తనపేరు పిల్చారు. ఆకలి-నడవడానికి శక్తి లేనట్లుంది. కాని వుత్సాహం తెచ్చుకున్నాడు. ఆ గదిలో కాలుపెట్టేసరికి కాళ్లు గజగజలాడిపోసాగినయ్. అటువంటి పెద్దవాళ్ళని తను యిదివరకు చూడలేదు. ఒకాయన తెల్లగా పొడుగా వున్నాడు. బెంగాళీ మనిషి రెండో వాడు. నల్లగావున్నా పెద్దముఖం కళ్ళద్దాలతో గంభీరంగా వున్నాడు.

"నీ పేరు...." బెంగాళీ ఆఫీసరు హిందీలో అంటే పుల్లయ్య గాభరాపడిపోయాడు. ప్రక్కనున్న అరవ ఆఫీసరు "నీ పేరేమబ్బా?" అనగానే ఆ గొంతుక విని గతుక్కుమన్నాడు....పుల్లయ్య అని గొణిగేసి దీనంగా "బాబూ! మీరు కనికరం సూపించండి. తూరుపోడ్ని—పిల్లలు గలోడ్ని—ఒకప్పుడు గొప్పబతుకు బతికాను....అన్నంలేక నానూ, పిల్లలూ సచ్చిపోతున్నాం...."

బెంగాళీ ఆఫీసరు "వాడేం అంటున్నాడని" ఆ ఆఫీసర్ను అడిగాడు. కొద్దిగా తెలుగు తెలిసిన ఆ ఆఫీసరు తనకు తెలీదని అనే బదులు వాడేదో గొప్పగా బ్రతికిన పాతబ్రతుకు గురించి చెప్పుకుంటున్నాడు అని చెప్తూ పుల్లయ్యవేపు ముఖంత్రిప్పి "అదంతా ఎవరి కావాలబ్బా! పేరేమిసి పేరేమి!"

"పుల్లయ్య!"

బెంగాళీ ఆఫీసరు "ఏదేనా చుట్లుపట్లున్న దేముడు పేరా"అన్నాడు ఇంగ్లీషులో.

వెంటనే తను ఇదివరకు తెలుగు తెలుసునని చెప్పిన మాట నిలుపుకోడానికి...."కాదు. పుల్ల అంటే పులుపు–పులుపు మనిషి అని ఇంగ్లీషులో చెప్పాడు.

వెంటనే ఆ ఆఫీసరు అలా కనిపిస్తున్నాడులే!" అని ఇంగ్లీషులో అంటూ అక్కడవున్న పెట్టెను ఎత్తమని చెప్పాడు సైగతో! పుల్లయ్య అసలే ఆకలితో వున్నాడేమో ఆ పెట్టి యెత్తుకోడానికి కాస్త గుంజూటన పడ్డాడు. ఆఫీసరు ఇంగ్లీషులో "వాడికాప్రజ్ఞ లేదు" అని చెప్పాడు. ఆ పెట్టె తిరిగి క్రిందపెట్టాక కాస్త ఆయాసంతో వణికిపోతూ నమస్కరించి దీనాతిదీనంగా "సాలా కష్టపడిపోతున్నాను. ఈ బట్టలూ అద్దెకు తీసుకొచ్చాను బాబూ! తిండిలేక నాకేకాదు పిల్లలూ సీపురుపుల్లల్లాగ అయిపోయినారు. పదిపూటలు కడుపునిండా తిండిపడితే ఇలాంటివి రెండు పెట్టెలు రెండు సేతుల్తో ఎత్తేస్తాను బాబూ!" ఇలా అంటూనే కళ్ళల్లో నీరు తిరిగిపోయాయి.

అరవ ఆఫీసరు "వెళ్లు! ఎక్కేంజి వాళ్లు సెప్పుతారు!" అనగానే పుల్లయ్యకు ఎక్కడలేని ధైర్యం వచ్చింది.పని దొరికినట్లే అనుకున్నాడు. ఇంటికి ఆగి ఆగి నడిచివెళ్ళేసరికి చీకటిపడిపోయింది. అలా గడపలో మూర్ఛపోయినట్లు చారబడిపోయాడు. నీలి అర్ధణాయిచ్చి గోంగూరకొని నీటిలో వుడకపెట్టింది. ఆ వీధిలోనే ఒకమ్మ దగ్గర రూపాయికి నెలకి పావలా వడ్డీకి ఒక రూపాయి తెచ్చిందేమో, కడుపునిండగానే పుల్లయ్య తెప్పరిల్లాడు.

ఆ మరుచటి రోజు ఆ బాబును కలుసుకొన్నాడు. జరిగినదంతా చెప్పేశాడు. "పనిలోకి యెప్పుడురావాలో మీతో చెప్తానన్నారు బాబూ" అని చెప్పాడు. ఆ ధైర్యం నాలుగు రోజులు చకచకా యిక్కడకూ, అక్కడకూ పనిపాట్లుకోసం వెళ్ళడం,యేదో కొద్దో గొప్పో కడుపుకు జరిగి పోడానికి అవకాశం యిచ్చింది.

ఆరోజున ఆయన చెప్పాడు "వాళ్ళు నిన్ను తీసుకోలేదు. నేనేం చేస్తాను?" అని.పుల్లయ్య నడుం విరిగిపోయింది. అక్కడే కూలబడి పోయాడు. ఏడుపుకూడా వచ్చేసింది. గట్టిగా బావురుమని యేడ్చేద్దామను కున్నాడు—కానీ కొద్దిసేపటివరకు నోట మాటరాలేదు....చివరకు శోక మయమైన గొంతుకతో—"బాబూ! ఈ గిరజాలుని చూసి మా సుట్టు పక్కల వూళ్ళలో....సూపురేకల పాపలు మురిసిపోయేవోరు .... నాకు అవి పేణంకంటే హెచ్చు బాబో....అన్నంముద్ద నోటిదగ్గరకు వస్తాదని ....మనసుకట్టి కత్తిరికి యిచ్చీశాను—నోటికొచ్చినముద్ద జారిపోయి నాదీ, నన్ను శనీశ్వరుడు తిప్పుతుంటే మీ రేంసేస్తారు బాబూ!" అం టూనే మెల్లమెల్లగా అడుగులు వేసుకుంటూ దారీతెన్నూ చూడకండా అలా వెళ్ళిపోయాడు!

32

లోకం చలికి ముసుగు వేసుకోవటం మొదలుపెట్టింది. ఇక్కడా అక్కడా కూలిచేసుకుంటూ ఒకపూటుంటే యింకోపూటకు లేనట్లు బ్రతు కుతున్న పుల్లయ్యకు పాత—మీటింగు స్నేహితుడు తారసిల్లి ఒకపూట వస్తేగానీ వీలులేదని తీసుకవెళ్ళాడు.

"సూడన్నా! ఈడికా ఒక్కటీ లేదు. ఒక రూపాయి విలవ అస్తిలేదు. ఆ పెద్దోడిలాగ ఓట్లకి ఖర్సు సెయ్యాలంటే యెలాగౌతాదీ! మనలాంటోలకింద సేవచేస్తన్నాడు. సమయం వచ్చింది. మనమంతా ఒకటై ఆ బాబును నిలబెట్టాల!"

ఈ బోధనలో తన తిండికి లక్ష్యంచెయ్యకండా ఓట్లకోసం తిరి గాడు. రకరకాల మనుషుల్ని కలుసుకున్నాడు. వీరిలో నెలజీతాలు తెచ్చు

కొనేవాళ్లున్నారు. జీతం తెచ్చుకొని త్రాగేసి పెళ్ళం, పిల్లలను కొట్టి తిండిలేక మాడ్చేవాళ్లున్నారు. జీతం అంతా బ్రాకెట్లు ఆటలో పెట్టేవాళ్ళు కూడా వున్నారు. కరువు కల్పించినందుకూ, పేదోళ్ళని పీల్చుతూ దబ్బు దోచుకుంటున్నవాళ్ళని యింకా పేల్చీకండా వుంచినందుకు, వాళ్ళంతా ప్రభుత్వాన్ని దుయ్యబట్టసాగారు. ఎన్నోవందల దృష్టాంతాలు. వాళ్ళకు యేమిచేసినా, న్యాయమేనని నిరూపించడానికి తెస్తున్నారు. ప్రభుత్వం పేదవాళ్ళది కాదని పెట్టుబడిదార్లదని బంధుజన పక్షపాతంగలవాళ్ళంతా ప్రజల మంత్రులని నానా భాషల్లోనూ పీల్చి యేకకంఠంతో అనగలుగుతున్నారు. పుల్లయ్య పీరితోపాటు చెయ్యెత్తి జైకొట్తున్నా మనసులో అదోలావుండేది. ఆ మీటింగులో అదంతా వింటున్నకొద్ది "యిదంతా నిజమేగావాల,లేకపోతే నాలాంటోడెందుకు బతకలేకపోతన్నాడు?" అని అనుకున్నాడు. మూడురోజులు మధ్యాహ్నం వెళ్ళాక తనంతట తనకే ఆ మాటలు తిరిగిపోతున్నాయి. నీలి విని "ఇందుకేనా యెళ్తన్నా"వంది.

"నీకు తెలీదులే—ఈతరంవాళ్లు లేశారు. సెడుగు మరి సాగదులే. అందరూ- మారాజుదగ్గరనుంచీ మాలోడుదాక ఒక్కటే—"

నీలి నవ్వి "అలాగని కేకలువేస్తే వచ్చేస్తాదా?"

"రాక....ఈ బాబు గవుర్నుమెంటోడై తేడా....దున్నేవోడిదే భూమి!—కూలోడికి రోజుకి మూడు రూపాయిలకి తక్కువవుండదు—అడుక్కునేవాడు ఆరోజుల్లో మాయమైపోతాడు!"

"చేసినోడు యెప్పుడూ కబుర్లు సెప్పడు?"

"అలాగ! ఉండుండు. పెద్దోల దబ్బు పేదోలకి పంచిపెట్టడా?"

"పెట్తే—అది ఖర్చుపెట్టేక, పేదోడు మల్లా పేదోడు—సూడు ఎందుకిలాగ కూలినేకండా అందులో పడ్తావు? నీ యెదేళ్లూ ఒకలాగ వున్నాయా? ఏ యేటు లేకపోయినా కష్టమే. నలుగుర్ని మంచన్న నాలుకని కోసి రెండు నాలుకలు సేసేక-జరగవలసినదాన్ని ఆపడానికి నివ్వెవడవ్? నే నెవర్తినీ? దానికోసం నీలాగ ముక్కా, సెవులూ వున్నోన్ని యెందుకు సంపుతావు. పులిలాగ ఈయేళ యెదుటోడ్ని సంపితే రేపు నీ కడుపున పుట్టినోడ్ని సంపవా? నీ రాగటా నాకేమీ నచ్చలేదు—"

సీలి మామ్మను తలుచుకుంది. ఆపదలోనూ ఆ ముదుసలి నూరి పోసినదే ఆమెకు జ్ఞాపకం వస్తుంది. పుల్లయ్య మాటాడలేదు. ఆ రాత్రి చలివేస్తున్నా గడపలోనే పడుకున్నాడు. ఆ రాత్రిమీద కూడాను దూరం నుంచి ఓట్లగురించి ప్రచారం వినిపిస్తోంది. ఎక్కడచూసినా కోలాహలమే. మీటింగులే—ప్రజలు తండోపతండాలుగా వెళ్తున్నారు. ప్రజల్లో వుత్సాహం ద్విగుణీకృతంగా వుంది. ప్రతీ యింటిలోనూ యేరోజూ యేమో వాదనలే. పొరుగు జేబుకాటుకు, పెళ్ళంకుకూడా వాదనే వచ్చింది.

ఇలా మారుమూలల్లో వుత్సాహం ఓట్లువేసే తేదీ దగ్గరపడ్తున్న కొలది హెచ్చవుతోంది. బూచోడు ఆరాత్రి చెట్టుక్రింద కూర్చోని కాస్సేపు కుక్కపిల్లలగురించి పలవరించాడు. ఆ మాటలు విన్న పుల్లయ్య మళ్లు నిద్దరపోతున్నాడేమో మెల్లగా కాళ్ళవేపు వున్న కుక్కపిల్లను యిచ్చివేద్దామని లేచాడు. ఇంతలో బూచోడు యేదో గొణుక్కుంటున్నాడు. వాడి నోటివెంటకూడా ఓట్లగొడవే!

"ఓట్లు—ఓట్లు—ఎంత తగలేస్తున్నారు. ఇదంతా చూస్తుంటే దబ్బుతో సీట్లుకొనుక్కొని చేతులెత్తడమే డెమోక్రసీ అనిపిస్తోంది. డెమోక్రసీలో మంత్రివర్యుని దగ్గరనుంచీ బంట్రోతువరకూ స్టేట్ మెంట్లు యివ్వడానికే ప్రయత్నిస్తారు. డెమోక్రసీ ప్రతిఫలం యెలక్షన్ల గొడవల్లో పార్టీలుగా విడిపోయిన ప్రజలు అలావిడిపోయే వుండటం—ఇంతకీ ప్రభుత్వం అవుననన్నది ప్రతిపక్షం కాదనడమే డెమోక్రసీ నిజస్వరూపం!"

పుల్లయ్యలేచి దగ్గరగావెళ్ళి ఉపన్యాసధోరణిలో నిల్చున్న బూచోడుతో "ఎవరితో చెప్తున్నావ"న్నాడు. బూచోడు పుల్లయ్యవేపు చూడకండా "ఎవరితోనా? ఈ వున్న ఒకేచెట్టుతో—యీరాళ్ళతో—ఇవికూడా మరి నాలుగురోజులుపోతే రాజకీయాల్లో పాల్గొంటాయ్! వాటికీ ప్రాణం వున్నదని చెప్పారుకాదూ!"

"ఆ మీటింగులో సెప్పకూడదా?"

"మీటింగు! హూ! పార్లమెంటు. ఇంగ్లండులో ప్రజాస్వామ్యం వున్నతస్థాయిలో వుండంటే పార్లమెంటు ప్రసంగాలవల్ల కాదు—" అని నవ్వాడు.

అనవ్వు కాస్సేపు పొడిగించి కూర్చున్నాడు. చలివేస్తోంది.ఆయినా బూచోడు నవ్వుకుంటూంటే పుల్లయ్యకు అక్కడనుంచి కదలడానికి బుద్దిపుట్టలేదు. ఎదురుగా వున్న వుప్పుటేరు కాలవనుంచి దుర్గంధం చాలా హెచ్చుగా వీస్తోంది. అలా అక్కడ వున్నకొద్దీ పుల్లయ్యలో లేనిపోని ఆశలు రేకెత్తుతున్నాయ్. బూచోడిని యీ చల్లని కాలాన మెల్లగా అడిగితే తప్పక బంగారం యెక్కడ దాచాడో చెప్తాడు—"అది మెల్లగా త్రవ్వి నాను నవిరిపోయి పొలం కొనుక్కొని బతుకుతాను—యీడినీ తీసుకపోయి పెంచుతాను" అనుకున్నాడు.మళ్ళీ ఆ క్షణంలోనే అలాంటి డబ్బు యెంతకాలం వుంటుందనిపించింది. తనవూర్లో పెద్దరైతుకు డబ్బు యెలావచ్చింది? వాడయ్య రంగంవెళ్ళాడు.ఇంటికోసం పునాదులు త్రవ్వుతుంటే పెట్టెలో బంగారం దొరికితేకదా పెద్దోడైపోయాడు. అలాగు తనెందుకు కాకూడదు? ఈ కష్టాలన్నీ పారిపోతాయి—మల్లుకు పెద్దసదువు సదివించి పెద్దదొరనుసేసేనా?....ఇలా అనుకుండగానే బూచోడు మళ్ళీ మాటాడటం మొదలుపెట్టాడు....

"వాడు వూర్లో పెద్దమనిషి; ఆ పెద్దమనిషికి నాలుగుమూలల్లో నలుగురు వుంపుడుగత్తెలు; వాడు దేశసేవకుడు. చుట్టూవున్న అమాయక ప్రజ, పాపం వాడిని మనిషిలాచూసి గౌరవిస్తారు. వాడిడబ్బు గౌరవాన్ని తెస్తోంది. దానధర్మాలు చేస్తున్నట్లు పెద్దదాతసని చెప్పించుకుంటుంటాడు. ఫలానావారి ధర్మమని అన్నిటిమీద స్టాంపు వేయించుకుంటాడు. వాడికి సంఘంలో గౌరవస్థానాన్ని యిచ్చే యీ అమాయకప్రజల్ని చూస్తుంటే నాకు జాలివేస్తోంది. నీతికి ఒక విషయంలో నిలబడనివాడు ఇంకేవిషయంలోనూ దానికి నిల్చోలేడు. అలాంటి పెద్దమనిషికి తమ బాగోగులు చూడమనిచెప్తే ప్రజాసౌఖ్యం ఎలావస్తుంది? వాడికి తెలిసింది యెలా వేషంవేసి ప్రజల్ని మోసగించడమా అనే;ఈ చదువుకున్న మూర్ఖులకన్నా ఆ అమాయక ప్రజల్లో సంస్కారం వుంది. అలాగని వాడ్ని చంపమని చెప్పడంలేదు. రక్తదాహం గలవాడు మనిషి అనిపించుకోడు—పశువు—పశువుకు మానవసంఘంలో చోటులేదు. అయితే ఇలాంటివాళ్ళందరిసి యేం సెయ్యాలి? గుండెనుంచి వచ్చే మర్యాద ఈయటం మానండి నాయనలారా మానండి. ఒకచీమ నిజానికి పాటుపడితే దాన్ని సింహాస

నంమీద యెక్కి-ంచండి. నిజమే మనుషుల్ని పెంచేదీ, రక్షించేదీ!నిజమే శాశ్వతంగా నిలిచేది—నిజంతో నిర్మింపబడ్డ ప్రభుత్వం—దాన్ని ఏమైనా అనండి, అదే కలకాలం నిలుస్తుంది! నిజంకు కట్టుబడని నాయకులు గొప్ప నాయకులని ఆత్మవంచన చేసుకోనీయండి. వాళ్ళ జీవితంలో ఎప్పుడో ఒక్క నిముషమైనా పశ్చాత్తాపపడకపోతే వాళ్ళు నాయకులే కాదు—మనుషులేకారు—అటువంటి పశువులకి అలాంటి అంత్యమే వస్తుంది! ఎంచేతంటే సత్యమే దేముడు. దైవత్వం యేదో పాలులో లేకండా మానవమాత్రుడు యే ఘనకార్యం చెయ్యలేడు."

బూచోడు కాన్సేపు తనలో తనే నవ్వుకున్నాడు. చలికొస్తా వణికిస్తోది—మంచుపడుతోంది. పుల్లయ్యకు నిముష నిముషానికి ఆత్రత హెచ్చవుతోంది కొంతసేపటివరకూ నిశ్శబ్దంగా వుంది....ఆ ప్రశాంత తలో మెల్లగా:

"బంగారం ఎక్కడ పాతావు?" పుల్లయ్య ప్రశ్నించాడు.

"ఎక్కడా?"

"పాతావుకదూ?"

"అవును...."

"ఎక్కడా?"

"కొబ్బరి చెట్టుక్రింద....."

"ఇంటివెనకా?...."

"అవును....."

"కొబ్బరిచెట్టుకి యెటువేపు?"

"ముందే"

"ఎన్ని తులాలు.....నీదేనా?"

బూచోడు చర్రుమన్నాడు. "దానిదీ!నన్ను ఖూనీచేసిందే. దానిదీ. నీకెందుకు ఫోఫో" అని అరిచాడు. ఇంకేప్రశ్న వేసినా జబాబు చెప్పలేదు. లేచిపోయాడు.

"ఏమిలోకం—ఏమిలోకం— అంతా మాయ! అడదిమాయ—మొగోడు మోసం! అంతా దొంగలు-నా కుక్కని నాకు లేకుండాచేశాడు"

పుల్లయ్యకు కనికరంవేసి గబగబ గడపలోనికివెళ్ళి కుక్కపిల్లను తీసుకవచ్చాడు. "ఇదిగో నీ కుక్కపిల్ల! మళ్ళా యిక్కడికి వచ్చావంటే పోతాది....ఎలి పో...."

బూచోడు ఒక్కగంతువేశాడు. "వచ్చావురా నాయనా-నాబాబూ-నీతో చెప్పుకోటానికి ఎంత దాచుకున్నాను-" అంటూ ముద్దుపెట్టుకొని వెళ్ళిపోతుంటే అది చిన్న మొరుగు మొరిగింది.

"నీమూట వాకు తెలీదా? ఏడవకు ఏడవకు బాబూ, కలుసుకున్నాం కదూ!" అని దాన్ని యెత్తుకొని వెళ్ళిపోయాడు.

ఆ మరుచటిరోజు వుదయం పనికొస్తారాలని ఒకడు యింటివేపే వచ్చాడు. పుల్లయ్యకు యెంతో ఆశ్చర్యంవేసింది—ఇలా యింటికి వచ్చే పరిస్థితి వచ్చిందికదా, లోకం యింతగా మారిపోయిందా అని సంతోషపడ్డాడు.

"ఏంపని?" అన్నాడు.

"రోజుకు రెండురూపాయలు. రాల్లెత్తమనం, రప్పలెత్తమనం—వస్తావా? ఇదిగో రెండురూపాయలు!"

పుల్లయ్య అందుకొని నీలిచేతిలో పెట్టి వాడివెంట పడ్డాడు. మల్లి తండ్రిని అనుసరించాడు. ఒక అరమైలుదూరం నడిచాడు. పెద్దమేడ. ఆ మేడ యెదరగా యెంతోమంది నిల్చున్నారు. అంతా తనలాంటివాళ్ళే, వాళ్ళలోవాళ్లు యేదో గుసగుసలాడుకుంటున్నారు. ఓట్లగొడవే!

"ఇంతలో పిలుపువచ్చింది. అంతా లోనికివెళ్ళారు. కుర్చీమీద యెదురుగా పెద్ద మీసాలతో ఒక మనిషి కూర్చున్నాడు. వయస్సు యేభయ్యోపడి వుంటుంది. చేతికి నాలుగు వుంగరాలున్నాయ్. ముఖం తీపితో చామనచాయగా వుంది. మామూలుగా పంచ, సిల్కుకమీజు వేసివున్నాడు. చేతికి కప్పలాంటి వాచీ వుంది.

"వినండి బాగా వినండి." నిశ్శబ్దంగా చేతులు కట్టుకొని నిల్చున్న ఆ యాభైమంది ఒక్కసారి వణీకేట్లు ఆమాటలు ధాటిగా వచ్చాయి.

"నేను చెప్పినమాటల్లో ఒకమాటా మర్చిపోకూడదు, చెప్పినపని చేసుకొచ్చినవాళ్ళకి రేపు మూడు రూపాయలు!"

"సిత్తం....సిత్తం!"

ఆ వ్యక్తి కుర్చీమీదనుంచిలేచి నిల్చుని ఉపన్యాసధోరణిలో....

"సదువుకున్నోళ్ళ దగ్గరికి మీరెళ్ళకండి—మనదేశంలోని సదువు కున్నోలకంటే సాకలోడు నయం. ఆ సదువుకున్నాడనోడికి నగం గేసం. అంచేత మీరంతా యీ మహాపట్నంలోన పేదోడింటికే ఎళ్ళండి. ఆడి కషాలు మీకు తెలుసు, నాకు తెలుసు....యిన్నాఁ?"

"సిత్తం....సిత్తం!"

"నేను యిక్కడ ఎలాగమాటాడానో మీరూ అలాగే మాటాడాల! నాకు యింగ్లీషురాదని తెలుగురాదా? నేను మీదగ్గర యెలాగ మాట్లాడు తున్నానో ఆయెసెంబ్లీలోనూ నా బాసలోనే మాట్లాడుతాను. ఇంగ్లీషు వస్తే వున్నాది లేకపోతే లేదా? నా సుట్టూవున్నవాళ్ళకి ఇంగ్లీషురాదే! నాలాగే వాళ్ళూ పంచెకట్టి కమీజు వేసుకుంటున్నారు. అంచేత నాను వాళ్ళందరికంటే నయమే!"

"సిత్తం....సిత్తం"

కాస్తా మీసం మెలివేసి ఇటూ అటూ పచారుచేస్తూ: "ఈ గవుర్న మెంటోడి రాగటా యేమీ బాగులేదు. చూసారా దొంగసారాబట్టీలు ఎలాగ లెగిచిపోతున్నాయో! ఎంత మంచి ఆఫీసరైనా యెండిచెప్పుతో కొట్తే లొంగిపోతున్నాడు. వేలుచేసుకొన్నవాడిమీద పన్నులేదు. నేను అసెం బ్లీకి వెళ్ళి యిదే వాదిస్తాను. గవుర్నమెంటోడినే బట్టీలుపెట్టి పులిసిన సద్దిఅన్నంలాంటి సారా నివ్వే యియ్యి. నా ప్రజా బాగుపడ్తారు. ఆ డబ్బు పెట్టి యీమురికిగుంటలు బాగుచెయ్యమంటాను. ఇదిచెప్పడానికి ఇంగ్లీషు రావాలా? మా అయ్యకి, తాతకీ యేం యింగ్లీషువచ్చేది! గ్రామసావిడిలో పంచాయితీతీర్పు చెప్పినాడంటే లండను వెళ్ళినా తిరుగుండేదికామ. ఇవన్నీ బాగా విన్నారా! చెప్పండి—గట్టిగా చెప్పండి - అరవండి గట్టిగా అరవండి! మీ ఓటు!"

ఎవరూ గొంతుక పెగిలించలేదు.'అరవండిరా బంగారయ్యకిఅని'

"మీ ఓటు!"

"బంగారయ్యకీ!" అన్ని గొంతుకులు కలిసాయి. పుల్లయ్య విధి లేక అన్నట్లు అన్నాడు. కానీ ఈ బాబు చెప్పినదాంట్లోనూ యేదో నిజం

వుందనిపించింది. ఇంతకీ కూలి పుచ్చుకున్నాడు. తిరగడానికి బియలు దేరారు.

చలి హెచ్చుతున్నకొద్దీ ఓట్లుగొడవ హెచ్చవుతోంది. ఎక్కడా యీ కోలాహలమే. ఈ సీటుకి మూడుపార్టీలవాళ్ళా, ఒక స్వతంత్రుడు పోటీచేస్తున్నారు. స్వతంత్రుడు బంగారయ్య. పెద్దలుగడించిన ఆస్తి తగలెయ్యకండా యేవో కంట్రాక్టులుచేసి పెంచుతున్నాడు. యుద్ధకాలంలో కంట్రాక్టులుచేసి బాగా ఆర్జించాడు. ఈమధ్యనే పదాలుగువేలిచ్చి కారు కొన్నాడు. ఈ యెలక్షన్లలో ఒక అరలకారమైనా ఖర్చుపెట్టి తనజాతిలో గౌరవం, కీర్తి తెచ్చుకుందామనే వుబలాటంతో రాత్రీపగలూ నిద్దర లేకండావుంది. "నేమ మెంబరైతే కల్లూ, సారా మంచిది మొదటిలాగ రప్పించనా? యేవూరురాబడి ఆవూరులోనే ఖర్చులుపెట్టిస్తాను. కరువూ కాటకాలు నాలుగునెల్లకో లేకండా చేస్తానని" ఆచుట్టుపట్లవున్న పల్లెల్లో ప్రచారం సాగిస్తున్నాడు. ఎంతస్వేచ్ఛ అనుకున్నా యీ చుట్టుపట్లపల్లెల్లో ఓట్లు సాధారణంగా ఆవూరు పెద్దలచేతిలో వుంటాయని వాని నమ్మకం. వాళ్ళను పట్టుకొని మూతికట్టేస్తే చాలు, కావలసిన ప్రచారం వాళ్ళే చేసుకుంటారు. బంగారయ్య ఆపనే చేశాడు. ఆ అనాయక పలెజనంలో మూడువంతుల ఓటర్లు తనవేపే ఓటు వేస్తారు-తప్పదని అనుకున్నాడు.

ఇలావుండగా బంగారయ్యమీద యెదుటిపార్టీవాళ్ళు మంచిమంచి పుకార్లు వ్యాపింపజేస్తున్నారు. మధ్యతరగతి ప్రజలలో వాడంటే హేళనగావుంది. పై అంతస్తులో వాడి కెందుకని పకపక నవ్వుతున్నారు. ఉన్నది యెలాగ ఖర్చు అవుతుందని అంతా అనుకుంటున్నారు. బంగారయ్యమీద పుట్టిన పుకార్లలో మచ్చుకి కొన్ని-కార్లు కొన్నాడుకదూ — వెనకసీట్లో ఒక్కడే కూర్చున్నాడు. డ్రైవరు నడుపుతుండగా ఓదగ్గర బర్ అని శబ్దం వచ్చిందట! వెనుకసీట్లోనుంచి "ఆదేంటి! అదేంటి!" అన్నాడట. గేరేశాను బాబూ అంటే బంగారయ్య వెంటనే యిక్కడెందుకేశావ్? ఇంటిదగ్గ రేసేలేకపోయావా?" అని డ్రైవర్ని మందలించాడట! ఒకసారి డ్రైవరు నడిరోడ్డుమీద కారు ఆపితే యెందుకాపినావంటే పెద్దరాయి అడ్డుంది బాబూ అన్నాడట! హారనుకొట్టు అదే తప్పుకుంటాదని బంగారయ్య అన్నాడట! పట్నంలో ఒక మురుగుపేటకు వెళ్ళి వారంద

రితో యేం చెప్పాడట అంటే తను అసెంబ్లీ మెంబరైతే కొళాయిల నుంచి సారా తెప్పించనా అనీ,అంతకీ అక్కడ తనకు మాటాడటం రాక పోతే పెద్ద ప్లీడర్ని డబ్బు ఖర్చుపెట్టి అక్కడ వాదించడానికి పెట్టనా అనీ అన్నాడట!

ఇలాంటి కట్టుకథలు యెమటపార్టీలవాళ్లు ప్రచారంచేస్తున్నారు. బంగారయ్య తొణకలేదు బెణకలేదు. "నాకు పేదోళ్ళబలంవుంది. నేను రాకపోతే యెవడొస్తాడో చూస్తా!" అని ప్రగల్భాలు పలుకుతున్నాడు— డబ్బు విరజిమ్ముతున్నాడు. ఆవేళ సాయంత్రం తిరిగివచ్చినవాళ్ళకి కడుపునిండా తిండి పెట్టించాడు.

"తినండర్రా! మీ కష్టాలు నాకు తెలుసు!"

వాళ్ళ భోజనాలయ్యాక "మీరు వెళ్ళడానికి వీల్లేదు. ఈ రాత్రి ఆ కాంగ్రెసోడు పెద్ద దండుని వూరిలో తిరగడానికి పంపిస్తున్నాడు.మనము వెళ్ళాల. వాళ్లగొంతుకలన్నీ మనగొంతుకలో కలిసిపోవాల—బాగా పని చేసుకొచ్చారంటే మనిషికి రెండేసి రూపాయలు!"

ఈ మాటలువిని అంతా సరే అన్నారు. పుల్లయ్యకు కడుపునిండా తిండి యెన్నాళ్లకి దొరికిందీ! "ఈ బాబు కష్టాలుతెలిసిన బాబులాగ వున్నాడు. ఇలాంటి బాబు గవుర్నమెంటోడైతే కష్టాలు పోతాయేమో! అ ల్లా బాబుకింద నాలుగురోజులు కూలీలేకండా తిరిగినాను. బుక్కెడు గంజైనా పోసాడుకాదు!" అనుకున్నాడు.

ఈ రాత్రి పెద్దదండు పెట్రోమేక్సు లైటులుపెట్టి బాకాబజంత్రీలతో బయలుదేరారు. కేకలు మిన్నుముట్టి పోతున్నాయి. త్రోవలో ఇంకో పార్టీ జండాలతో యెదురైంది. ఆమధ్య నాలుగురోజులూ ఆ పార్టీతో తిరిగాడు. వాళ్ళంతా తనవేపే చూస్తున్నట్లనిపించింది పుల్లయ్యకు! తన స్నేహితుడు పొరుగు జేబుదొంగ వాళ్లంతా అందులో వున్నారు. సిగ్గు వేసింది మొదట, కానీ తరువాత నా కడుపుకన్నానా అనుకున్నాడు. రేపు పొద్దున్న నాను ఆకలితో అలమటిస్తే పిళ్ళాక పైసాయ్తైనా యిస్తాకా అని అనుకుని ధైర్యంగానే అడుగులు వేస్తున్నాడు. ఇంకోవేపునుంచి మరొక దండు —ముఠమ కాడికట్టినయెడ్లు! ఆ చుట్టుపట్ల కోలాహలం మిన్ను ముట్తోంది. అన్ని గొంతుకలూ కలిసి ఆ లౌడుస్పీకర్లు ఆగొంతుల్నిమింగే

స్తున్నాయ్.రానురాను ఒక గుంపుమీద ఇంకోగుంపు మాటలు విసురుకొం టున్నారు-రౌద్రం హెచ్చిపోతోంది! అందులో ఆరౌద్రాన్ని తగ్గించడానికి ప్రయత్నించే సహృదయులు వున్నారు. కాని నిముష నిముషానికి స్థాయి హెచ్చిపోతోంది—మాటలుపోయి చేతలకి వచ్చాయి. రోడ్డువేయటానికి వున్న కంకరరాళ్ళ కుప్పలమీదికి చేతులు వెళ్ళాయి....పుల్లయ్యవేపు రాళ్లువచ్చి పడ్డాయి—పుల్లయ్యకూడా పౌరుషంకొద్దీ రాళ్లు పట్టుకున్నాడు. విసురుదామనుకుంటే యేదో చెయ్యి తనచేతిని పట్టుకున్నట్లనిపించింది. వెళ్ళంతలపు రావటంవలన కామోసు రాళ్లు క్రిందపడేశాడు.

ఇంతలో ఎవరో పోలీసులు వస్తున్నారని కేకలువేశాడు.... కొందరు పారిపోయారు. ఒకపార్టీ ఒకవేపు వెళ్ళిపోయింది. ఇంకో పార్టీ యింకో వేపు....బంగారయ్యపార్టీ ముందుకు సాగిపోయింది.... సాగిపోతున్న కేకలు దూషణలతోసహా మిన్నుముట్టున్నాయ్ —

ఆ దగ్గరలోనే బూచోడు కళ్లువిప్పి అంతా చూస్తున్నాడు. బూచోడు కుక్కపిల్లతో ఆరోడ్డుప్రక్కన కూర్చుండిపోయాడు. కొద్ది క్షణాలు పకపకా నవ్వుకున్నాడు. తరవాత బుజ్జగించి చెప్పే ధోరణిలో "చూశావా నాయనా, ఈ వెర్రిమొర్రిమళ్లు యెలా కొట్లాడుకుంటున్నారో? దేనికి — ప్రజల్ని సుఖపెట్టే ప్రభుత్వంకోసం! ఒకరినొకరు మర్యాద యిచ్చి పుచ్చుకోలేకపోతున్నారు. అసూయ చెడపురుగై మనుషుల్లో మానవత్వాన్ని పిప్పిచేస్తుంది — అలాంటి మనుషులున్న దేశం వేగం పతనంకాదా?"

ఆ ప్రశ్నవేసి లేచి నిల్చున్నాడు....

"బాబూ! నే నెందుకు పతనంఅయిపోయానంటావ్? యెదుటి వాళ్ళ చెడుగులో మంచి చూడలేకపోయాను. పతితుల్ని ప్రేమించే మంచి తనం నాలో లేకపోయిందోయ్! అంతా నాదనే అహంకారంతో కూలి పోయాను. ఈలోకంలో పెరిగిపోతున్న కష్టాలకి కారణ మేమంటావ్? మనిషి అంతా నాదనేమాయలో చిక్కుకున్నాడు. ఈ మాయని యే ప్రభుత్వం తగ్గించగలుగుతుందో అదే రామరాజ్యాన్ని తేగలుగుతుంది. ఆ మాయ మానవుల్లో దురాశారూపంతో అంకురించివుంది. గుర్రానికి కళ్ళెంలాగ ఆ దురాశకు ప్రభుత్వం కళ్ళెంవెయ్యకపోతే దానిష్టం వచ్చి

నట్లు గెంతి బీభత్సం చెయ్యదా? పరిపాలించేవాడే కళ్ళుంలేని గుర్రమైతే అంతాసరి! వాడు సారధి కావాలంటే వాడిమెదడులో ఒక్కన్యాయదృష్టే వుంటే చాలదు. తెలివితేటలుండాలి! ఆ ఒక్కడి న్యాయం తెలివీ కోట్లి ప్రజలకు సుఖాన్ని యిస్తుంది. పూర్వకాలంలో రాజుల న్యాయం మంత్రుల తెలివీ కలిసే దేశాలు వర్ధిల్లాయ్—ప్రజలు సుఖపడ్డారు! అంచేత మనుష్యుల్లో అంతా సహాసమనే వెర్రి అహంభావాన్ని రేకెత్తించి నిరాశ జెయ్యించి వాళ్ళని పతనంచెయ్యటం నాకు ఘోరాతి ఘోరమైన విషయంగా కనిపిస్తోంది! బాబూ! నీవు చాలా విశ్వాసమైన జాతిలోనివాడవోయ్. అంచేత నీతో యింత చెప్పుకుంటున్నాను - అర్థంఅవుతోందా?"

కుక్క చిన్న మొరుగు మొరిగింది. బూచోడు నవ్వుకున్నాడు. ఇంతలో ఏదో యేడుపు వినిపిస్తోంది. మెల్ల మెల్లగా అడుగులు వేసుకుంటూ కుక్క కాస్త పెరిగినా క్రిందవదిలితే యెవరు తీసుకవెళ్తారనే భయంతో ఎత్తుకొనే అక్కడకు వెళ్ళాడు. గడపలో శవం! ఆ శవంపై పడి యిద్దరు పిల్లలు, భార్య యేడుస్తున్నారు. వాళ్లగోడు విని యిరుగు పొరుగున వున్నవాళ్ల కళ్ళల్లో నీళ్ళు కారిపోతున్నయ్.

బూచోడు అలా నిల్చొని చూచాడు. "తమ్ముడా! చనిపోయావా?" అన్నాడు. అక్కడ మూగివున్నవాళ్లు బూచోడివైపు వినయంగా చూస్తున్నారు. వాడిగెడ్డం విరగబోసిన జుత్తు, ఆ తెల్లని ముఖవర్చస్సు చూసి నలుగురిలోను అదో గౌరవభావం ఏర్పడింది. బూచోడు మరి కాస్త దగ్గరకు వెళ్ళి:

"ఎందుకు నాయనలారా గగ్గోలుపెట్టారు. ఇదిగో!" అంటూ ఒక సమకోణ త్రిభుజం దానిభుజాలమీద చతురస్రాలు రాయిముక్కతో తారురోడ్డుమీద గీశాడు. మళ్ళీ ఆచతురస్రాలను చూపిస్తూ "యిదిమనస్సు ఇదిఆత్మ. ఈరెండు కలిస్తేగానీ. పరమాత్మతో సమానంకాదు—మనసునూ ఆత్మనూ కలపలేకపోయాడు—చచ్చిపోయాడు. అలా కలపనంతవరకూ పుట్టూనేవుంటాడు—చచ్చిపోతుంటాడు"-తరవాత కాస్త సేపు మౌనంగా లేచి ఇటూ అటూ తిరిగాడు. అంతా బూచోడు ఏమహాత్యం చూపిస్తాడో అని ఆశతో చూస్తున్నారు. కానీ కొంతసేపటికి మాటాడకండానే తన దారిని తాను పోయాడు!

33

ఓట్లగొడవ అయిపోయింది. పుల్లయ్య కొద్దిరోజుల సౌఖ్యం అంత మైంది. బంగారయ్య వోడిపోయినా "తనలాంటోలంచే కనికరంకాదా సాయంచెయ్యడా" అని రెండుపూటలు అతగాడి గుమ్మం విడిచిపెట్ట లేదు. ఓట్లకోసం డబ్బు పుచ్చుకున్నవాళ్ళే మోసంచేశారని కుతకుత వుడికిపోతున్న బంగారయ్య అవసరం తీరిపోవటంచేత అసలు పుల్ల య్యని మనిషిలా చూడకండా గెంటించాడు! చాలా కష్టం అనిపించినా రోజులు బాగులేవనుకొని యింటికి వచ్చేశాడు.

ఈమధ్య దొరికిన డబ్బు వట్టిలతో అప్పుతీరగా తిండికే సరి పోయింది. ఏకొద్దో మిగిలితే దానితో పిల్లలకు రెండు గౌనులు, మల్లుకు రెండు చెడ్డీలు, కమీజులు కుట్టించింది. ఇలా పనివుంటే యేదో మిగిల్చి ఒకరాట్నం చెయ్యించుకుందామనుకుంది. ఆ రాట్నంమీద డబ్బుచేసి ఒక గేదెను కొంటే న్యాయమైన పాలవర్తకం చేసుకొని బ్రతుకలేనూ! అను కుంది. ఆమె ఆశలన్నీ అడియాసలయ్యాయ్!

పుల్లయ్యకు బుట్టపట్టుకొని బజారుకు మళ్ళీ కూలికి వెళ్ళడానికి సిగ్గువేసింది. తను ఈమధ్య కొద్దికోజులు తింది యెరగడంవల్ల కాస్త ఒళ్లుచేశాడు. తనలాంటివాడు ఐజారులో కూలిసనేమిటనిపించింది. రెండు రోజులు పనికోసం వూరంతా గాలించాడు. ఒకపూట స్టేషనునుంచి మూటలుమోస్తే ఆర్థరూపాయి కూలి దొరికింది. అంతే! మళ్ళీ తన పరి స్థితి మామ్మూలుకు వస్తోంది. ఈమధ్య కొంత విచారం మరచిపోయిన వాడికి మళ్ళీ విచారం ఆందోళన ఆవరించి గుల్లచేస్తోంది!

ఒకపూట బజారుకు తెగించి వెళ్ళాడు. మళ్ళీ వచ్చాడని కుర్ర కుంకలు అంతా యేకమయ్యారు. హేళనకాదు—వెనకనుంచి వచ్చి పిచ్చాడని అరుస్తూ పంచెలాగుతూ, జుత్తులాగుతూ అల్లరి చేయసాగారు. నానారకాల తిట్లూ మొదలుపెట్టారు. ఇదంతా భరించలేకపోయాడు పుల్లయ్య.

మళ్ళీ పస్తుండవలసినరోజులు వచ్చాయి! పిల్లలు కీరకీర చుట్టు కుంటున్నారు. ఒకరాత్రి బయటే గడపలో పడుకున్నాడు. అంతా నిళ్ళ బ్దంగా వుంది. మల్లు ప్రక్కన ఆకలికి యేడ్చియేడ్చి పడుకున్నాడు. రైలు పట్టాలమీదనుంచి కరకరలాడుతూ కదలిపోయింది. ఒక్కసారి ఒళ్లు జలదరించింది. తను ఇలా చచ్చిపోతానేమోనన్న భయంవేసింది. "నా బతుకు ఇంత దరిద్రానికి వచ్చిందా! నా అయ్య అలాంటి పౌరుష మైన బ్రతుకు బ్రతికి చక్రవర్తిలాగ నలుగుర్లో ఘనత తెచ్చుకొని చచ్చి పోయాడు. నాపెళ్ళం మంచైనా నాకు కడుపునిండా గంజిపొయ్యలేదు. ఈ లోకంలో కడుపు ముందా! నాయం ముందా! కడుపునిండకపోతే ఏం చేసినా అది నాయమే! — నా నెందుకు బూచోడిఇల్లేదో కనుక్కొని....ఆ కొబ్బరిచెట్టుక్రింద త్రవ్వి బంగారం తీసుకోకూడదనుకుని యెదురుగా వున్న చెట్టువేపు చూశాడు. బూచోడు ఆవేళ కుక్కను తీసుకున్న దగ్గర నుంచి రావటమే మానివేశాడు. చెట్టుకొమ్మలు గాలికి కదులుతూ చిన్న శబ్దం చేస్తున్నాయి. అలా పరిపరివిధాల తలచుకొని నిద్దరపోయాడు. నడిరేయి చలివేసింది, ఇంట్లోకి వెళ్ళి పడుకున్నాడు.

ఆ రాత్రి గుడ్డివెంకన్న చనిపోయినట్లు కలగన్నాడు. తెలివి వచ్చాక వూరు జ్ఞాపకంవచ్చి మరి నిద్దరపట్టలేదు. భజనమందిరం దగ్గర వెంకన్న కోర్కెలు, యేడుపూ కళ్ళకుకట్టి అప్పుడే తనవూరు వెళ్దామన్న కోరిక కలిగింది.

తెల్లవారింది. ఉదయమంతా తిరిగినా పని యెక్కడా దొరకలేదు. బూచోడు ఆ మూడంతస్థులమేడ యెదరగా పాడుపడివున్న ఇంటి అరుగు మీద కనిపించాడు. ఆ మేడ పెరటివేపు కొబ్బరిచెట్టు వున్నదేమో చూశాడు, లేదు. ఏఇంటి పెరటైనా కొబ్బరిచెట్టు వుంటుందేమోనని తిరి గితే యెన్నో ఇళ్లు అలాంటివి కనిపించాయి. ఇంతలో యెన్నో అనుమా నాలు కలిగాయ్. బూచోడిది ఆవూరు కాదేమో ననుకున్నాడు. మధ్యా హ్నం ఇంటికొచ్చేసరికి నీలి గంజిపోసింది; ప్రాగాడు. ఆకలితో ఆంత ప్రాగాక జ్ఞాపకంవచ్చింది. పెళ్ళం ఆపూటకుకూడా పస్తుంటుందనే ఆలో చన కడుపులో గంజిపడినా త్రిప్పివేసింది!

కాళ్లు పీకెడ్తున్నాయని మధ్యాహ్నం పండుకొని సాయంత్రంసరికి లేచారు. చీకటిపడ్తుండగా కొడుకుతోసహా వీధిలోనికి వెళ్ళాడు. రోడ్డు నిండుగా జనం కిటకిటలాడిపోతున్నారు. ఏదో ఒక పనిమీద వచ్చిన వాళ్లు ఆ షాపుల్లో యేవో కొంటూనేవున్నారు. అవన్నీ చూస్తుంటే, కళ్లు తిరిగిపోతున్నాయ్. తన మల్లుకు ఆడుకోడానికి రబ్బరుబంతి కొంటే.... అదిగో అదెవరో పిల్లోడు రోడ్డుమీదే బంతికొడ్తున్నాడు — చూసిన కొడుకు "అయ్యా అయ్యా" అంటూ అటువేపే చెయ్యి చూపిస్తున్నాడు. ఇంకోపిల్ల నోటిలో బొకాపెట్టి వూదుకొంటూ వెళ్తోంది....మల్లుకీ అదీ కావాలి....అదిగో ఆ చిన్నపాపచేతిలో రబ్బరుకుక్కపిల్లబొమ్మ-మల్లుకు ఇదీ అవసరమే!

"నివ్వంత పుట్టుక పుట్టావుకానీ-నీరోజులు బాగాలేవు నాయనా!" అనుకున్నాడు. అలా కొంతదూరం వెళ్ళేసరికి రోడ్డుప్రక్కన దీపం వెల్తురులో జోతిష్యుడు చేతులు చూస్తున్నాడు. కాని డబ్బులులేవే, ఏం చెప్తాడో!నా దినా లెప్పుడు బాగుపడ్తాయో చెప్తాడు!

"అయ్యా! యెంత తీసుకుంటావు?" అన్నాడు.

"మోదకొండమ్మ పేరుసెప్పి నీకు కలిగిందే నాయనా!" అన్నాడు కోయజాతి మనుష్యుడు. కానీ ఆయినా దగ్గరలేని పుల్లయ్య విసుక్కొని ముందుకు వెళ్ళిపోయి కాళ్లు పీకెట్టడంవల్ల ఒక యెత్తైన కొండవగట్టుమీద కూర్చుండిపోయాడు. కడుపు ఆకలితో దహించుకపోతోంది. తనకే ఇలా వుంటే, తనకొడు క్కెలా ఉంటుంది? లేచి విల్చోడానికే శక్తిలేదనిపించింది. అలా దారీ తెన్నూ తెలియని పాంథునిలా కూర్చుండిపోయాడు. పెద్దపులిలా ఆకలి క్రమింగేస్తోంది. రానురాను జనం పల్చబడిపోయారు. చుట్టుపట్లవున్న కొట్లు కొన్ని మూసివేస్తున్నారు! ఉండిఉండి గాలివీచి తారురోడ్డును తుడుస్తూపోతోంది....మల్లు ఆలా అయ్యతొడమీద తల పెట్టి నీరసంతో వుండటంవల్ల యే ప్రశ్నలు వెయ్యటంలేదు. అలా కొడుకుతల నిమురుతూ మీద చెయ్యి వుంచాడు.ఎక్కడలేని జాలీ, అభిమానాలు కట్టలుతెంచుకొని ప్రవహిస్తున్నాయి. నరాలన్నీ విచారభారంతో పొంగిపోయాయి! ఆ నిముషంలోనే ఆ కొడుకు పుట్టినప్పటి స్వరూపం కళ్ళకు కట్టింది....నవ్వుల్లో ఇలాంటోడు పుట్టలేదు....అంత గొప్పోడూ

ఇలాగైె బస్తీలో కుళ్లుకాలవదగ్గర ఆకలితో వరిగిపోతున్నాడు!"....
ఇంకా అనుకున్నకొద్దీ తన ఆకలి మరచేపోయి కొడుకు ఆకలిబాధను తను అనుభవిస్తున్నాడు....ఆ ఎదురుగావున్న రొట్టెలదుకాణం మూసేస్తున్నాడు. వెళ్ళి ఒకరొట్టె తెచ్చుకుందామనుకున్నాడు — చప్పున లేవకానీ—దొంగతనమా! తను దొరికిపోతాడా! తనను పోలీసుల కప్పజెప్పరా!....

మరి ఇంటికెందుకు వెళ్ళాలనుకున్నాడు....కాని తనూ, కొడుకూ అలా ఆకలితో మంచులోవుంటే యేమౌతుందిా రాత్రిపూట యెవరైనా దొంగనుకుంటే! తను ఇంటికి వెళ్ళకపోతే నీలి యెన్నివిధాలుగా అనుకుంటుందో!

చివరకు లేచాడు. కొడుకూ లేచి మెల్లగా అడుగులువేస్తున్నాడు. ....దగ్గరత్రోవన ఇంటికి పోదామని పీర్లకోనేరురోడ్డువెంబడి నడుస్తున్నారు....ఆ రోడ్డులో జనసంచారం లేదు. వీళ్ళిద్దరే కనిపిస్తున్నారు. నాలుగడుగులువేశాక, నీరసం అనిపించింది. అదిగో మునిసిపల్ దీపం కింద ఒక గుడ్డిమనిషి గుడ్డపరచి అడుక్కుంటోంది. అంతమారంనుంచే చూశాడు. గ్రుడ్డిదిలావుంది....మూసిపోయిన చింకిబట్టలు....శుష్కించిన శరీరంలోని ఎముకలు ఆ చిరుగులలోనుంచి కనిపిస్తున్నాయి! మతంవేసుకొని ఆ రోడ్డువార కూర్చొని యెవరూ నడవకపోయినా అదేపనిగా దీనాతిదీనమైన స్వరంతో.... "అమ్మా....బాబూ....కష్టపడి పనిచేసుకోలేని పాపిష్టిజన్మండి తండ్రీ....యే జన్మంలో యేం పాపం చేసుకున్నానో నాకష్టంమీద కడుపు నింపుకోలేకపోతున్నాను. మీరే తల్లీతండ్రని చెయ్యి చాస్తున్నాను....బాబయ్యా....ఈ గుడ్డిదాన్ని చూసి కనికరించండి తండ్రీ!"

పుల్లయ్య ఆమెను చూశాక "అయ్యో! యెంత పాపంచేసిపుట్టిందో" అనుకున్నాడు. అలాంటోలకీ బ్రతుకుమీద ఆశేనా! అనిపించింది. ఆ దగ్గరగానే కొంతసేపు కూర్చుండిపోయాడు. ఆమె ఇంకా అలా అడుక్తూనేవుంది. కుడిచేతితో బిట్ట తడుముతూనే వుంది—ఒకచివర అణా వుంది....అది ఆమెచేతికి తగలలేదు—పుల్లయ్యకు ఆ వెల్తురులో కనిపిస్తోంది....అదిగో....ఈమె పూర్తిగా గుడ్డిదే....అడుక్కోడానికి గుడ్డిదికాలేదు. అక్కడకు కొంతదూరంలో సినిమాహాలువుంది. ఆట విడిచి

పెట్టాక చాలామంది ఈ త్రోవనే పోతారు. వాళ్ళకోసమని ఆమె అలా అరుస్తూనేవుంది....ఆట ఇంకా విడిచిపెట్టలేదు—పుల్లయ్య కూర్చున్నంత సేపూ ఒకరిద్దరు ఆ త్రోవనే వెళ్ళిపోయారు.

మళ్ళీ తనూ మల్లే....ఆమె ఓక్షణం వూరుకుంది.పుల్లయ్యలో ఈ కొద్ది క్షణాల్లోనూ యేవేవో ఆలోచనలు--ఆదిగో అణా రూపాయా? అనుకున్నాడు.ఆమె మళ్ళీ గొంతెత్తింది....ఆ స్వరం హెచ్చుతున్నకొద్దీ పుల్లయ్యలో అదోలాంటి ఆవేశం వస్తోంది--ఆకలి ఆవేశం కల్పిస్తోంది. అంతా క్షణికమైనదిలా అనిపించి, ఆ అణా తీసుకుంటే.... వడ్డీతో నాకు కలిగిన్నాడు ఇచ్చేస్తానను కున్నాడు—మరుక్షణంలోనే "నా కొడుకు ముందరా? ఇదివరకే ఒకసారి పడ్డాను—నేను దొంగనైతే నా కొడుకు దొంగకాడా?"

మళ్ళీ తటపటాయించాడు—ఏదో మేళతాళాలు వినిపించాయ్. దివిటీలు పట్టుకొని ఆ రోడ్డుమీదనుంచే ఏదో గుంపు వస్తున్నది. జాలరులు—చేతిలో పెద్ద తాళపుజతలు మ్రోగుతున్నాయ్—వెనుక అలంకరించుకున్న తోడపెద్దు నడుస్తోంది. వాళ్ళ గొంతుకలు విని పుల్లయ్యకు ప్రాణం వచ్చినట్లయింది. తను వూళ్ళో పాడుకున్నట్లనిపించింది. తనూ, కొడుకూ అంతకంటే బాగా ఆడగలరు....కానీ....

ఇంత సందడికి కొడుకు ఉత్సాహం చూపించలేదు. దానినిబట్టి ఆ చిన్నప్రాణం ఆకలితో యెంత నకనకలాడిపోతోందో అర్థంచేసుకున్నాడు. ఈ ఆవేశాలు తరవాత మరింత నీరసంచేస్తున్నయ్!

అదిగో....మిఠాయిబండి....ఈ వూళ్ళో కాలుపెట్టినరాత్రి కనుపించిం దిదేవేళ!....ఈనాడు ఇలావస్తోంది. గంటమోగుతోంది. మల్లు తలెత్తాడు, చూస్తున్నాడు. అదిగో ఇటువేపే వస్తోంది....వాళ్ళ ఎదురుగుండా "తీపి తీపి మిఠాయ్!గరంగరమ్ పకోడీ!!" అని అరుస్తున్నాడు. ఆ అరుపు యెంత తియ్యగావుంది! ఎంత గరమ్‌గావుంది!

ఇదిగిదుగో యెదురుగా వచ్చేసింది....మల్లు ఉత్సాహంగా లేచి నిల్చొని "అయ్యా....అయ్యా" చెయెత్తి ప్రేమతో అలాదించకండా చూపిస్తున్నాడు. బండి ముందుకు పోతుంటే ఆ చెయ్యి ఆటువేపే తిరుగుతోంది....పుల్లయ్యకు ఎక్కడలేని దుఃఖం వచ్చేసింది...."నామల్లుకు

ఆకలి....నాకు ఆకలి....నాకొడుకు ఆకలితో సచ్చిపోతే ఇవన్నీ నన్ను రచ్చిస్తాయా?....ఎల్లు అయ్యా,పరుగెత్తి ఆపు. కొందాం" అని కొడుకును రెండోవేపు పంపించి ఇటూఅటూ చూసి మెల్లగా అందుకున్నాడు. అణా!! చేతిలో అణా!!!....పరుగుపరుగున వెళ్ళి....కొన్నాడు ఒక పకోడీపొట్లాం;విప్పాడు. కొడుకు పరుకుపరుకున నమిలివేస్తున్నాడు.... తనపళ్ళా వణుకుతూనే నములున్నయ్....పొట్లాం ఖాళీ అయిపోయింది. కొడుకుముఖం తేరుకున్నట్లుంది. అదిగో మామూలు నవ్వు....నాఅయ్య ....దగ్గరగా తీసుకొని ముద్దులాడుతుంటే అంతదూరంనుంచి ఆ దీనురాలి గొంతుక వినిపిస్తోంది....రానురాను....స్వరస్థాయి హెచ్చుగా....చెవులు బ్రద్దలౌతున్నట్లుగా....ఒళ్ళంతా తిప్పివేస్తోంది....తను వినలేకపోతున్నాడు 'అయ్యో' నానేం చేసినాను?....అదిగో ఆ అడుక్కున్న పేదరాలిదగ్గరగా ....దొంగతనం! అమ్మో, దొంగతనమే!....నాను నీతిగా సచ్చిపోతాను. గానీ దొంగతనం సెయ్యననుకున్నానే! దొంగనా? నాను దొంగనా....?" కళ్ళల్లో నీళ్లు తిరిగిపోయాయి! కడుపంతా తెమలేస్తోంది. చూపుడువేళ్ళు నోటిలోపెట్టి ఆ నిర్జనప్రదేశంలో కక్కుతుంటే కొడుకు తండ్రి ననుసరించాడు.

"అయ్యా అయ్యా -బాగులేదు...." అంటూ కక్కుతున్నాడు కొడుకు. కొద్దినిముషాలక్రితం అంత ఆప్యాయంగా తిన్న కొడుకు ఇలా అటూ కక్కటానికి ప్రయత్నిస్తుంటే పుల్లయ్య శోకం భరించలేక పోయాడు. శక్తిలేకపోయినా కొడుకును యెత్తుకున్నాడు. తొడుక్కున్న చింకిబనియను మరింత చిరిగిపోవటం కొడుకు చూశాడు. "అయ్యా సిరిగిపోనాది...." అంటూ క్రిందికి దిగిపోయాడు. మళ్లు ముందు మెల్లగా నడుస్తున్నాడు. వెనుక మౌనంగా బరువుగా పుల్లయ్య వస్తున్నాడు.

"అయ్యా బనీను సిరిగిపోనాది ...మంచిది యేసుకో!"

"లేదు" అన్నాడు ముక్తసరిగా!

"అయ్యా! నాను పెద్దయితే నీకెన్నో యిస్తాను...."

ఆ చిన్నితండ్రిమాటలకు ఆనందం ఒకవేపు దుఃఖం యింకోవేపు వెనవేసుకవచ్చినా "నాయనా! నివ్వెలాగ పెద్దోడువౌతావు?" అన్నాడు.

మళ్లు సంతోషంగా అభినయంతో "అవుతాను — రెండుసేతుల్తో బువ్వ బుక్కుడు బుక్కుడు బుక్కేస్తాను."

అయ్యకళ్లల్లోనుంచి కన్నీటిబిందువులు రాలాయి.

34

మరుసటిరోజు ఉదయం బుట్టపట్టుకొని బజారుకు వెళ్ళాడు. తన స్థితి మామ్మూలైంది. ఆకుర్రకుంకల ఎగతాళి, ముసలమ్మలగోడు తనను సగం సచ్చినట్లు చేశాయి. తిరిగి వెళ్ళిపోదామనుకున్నా ఈ ఒక్కరోజు మరి రానని వాళ్ళని ప్రతిమాలి నచ్చచెప్పాడు. మధ్యాహ్నమయేసరికి వచ్చిన నాలుగణాలతో ఎక్కడ నాలుగు కడుపులు నిండుతాయి? ఏదో బుక్కెడు నోటిలో పోసుకున్నట్లుంది.

మధ్యాహ్నం చేసినకష్టం నాలుగణాలు వచ్చింది. తనకు లేక పోయినా తను అనుకున్నపని చేసితీరాలి. సాయంత్రం రోడ్డుమీద మనుష్యులు కిటకిటలాడిపోతున్నారు. అనుకున్నట్టే ఆజ్యోతిష్కుడు వున్నాడు గబగబవెళ్ళి పుల్లయ్య దండంపెడ్తూ వినయంగా యెదురుగా కూర్చున్నాడు. కొడుకు తండ్రిని అనుసరించాడు. నల్లటి కోయ జ్యోతిష్కుడు ఒక్కసారి నిదానించి చూచి "గుడ్డలో యేంలేదునాయనా గుండెలోవుంది ....కుర్రాడు నిజాన్ని నిలబెడతాడు....అయ్య పేరుప్రతిష్టల్ని నిలపుతాడు" అన్నాడు.

ఈమాటలు పుల్లయ్యకు యెంతో ఆనందాన్ని ఇచ్చి అతనిపై పూర్తి నమ్మకాన్ని కలిగించాయి. కాస్సేపు మౌనంగా పుల్లయ్యచెయ్యి తీసుకొని చూసి చూసి "నాయనా! దగ్గిరికి వచ్చింది, దూరంవెళ్ళిపోతోంది! తామరాకుమీది గంగలా నీగుండె వుంది! స్వస్థలమందు శని తిరుగుతున్నాడు — నలుగురు బతకాలంటావ్" — రేకను భగవద్ధానంబట్టి ఆవుస్సు యెనబ్బైయుంది. నాలుగుపైసాలు కలిసివస్తాది-ముందుకు సుకం వున్నది. గానీ కష్టంలేదు! కడుపునిండా పెట్టే వూరుకుంటాది — లేదంటే ముక్కు నులుపుతాది....ఏకోచక్రం ఒకటేమాట....ఒకటేబుద్ధి....మొగ

పురుషుడు తుమ్మితో సనూనం। ఆడస్త్రీ పువ్వుతో సమానం. మోదకొండ మ్మని నీపేరు పెప్పిపూజచేస్తాం.... పెడుగంతాకడిగేస్తాది..,మంచిరోజుల్ని తెస్తాది....యీకుంకంరాసుకో నాయనా...."అంటూ ఇద్దరికీబొట్టుపెట్టాడు. పుల్లయ్య ఉత్సాహంగా కొడుకుగురించి యెన్నోప్రశ్నలు వేశాడు. కోయ నవ్వి "ముకమే అద్దంలాగ వున్నాదిఁనాయనా పులికీ యెదురుగా యెల్తాడు నాలుకకీ యెముకవుంచినట్లు నాయమే పలుకుతాడు....నూటానాటాకాదు కోటికి ఒకడు యిలాంబోడు పుట్తాడు।...."

పుల్లయ్యవళ్ళు పులకరించింది। ఇంకేమీ అడగలేదు. బేడా వాడి చేతులోపెట్టి చండంపెట్టి మరీ వెళ్ళిపోయాడు. అప్పుడే దీపాలు వెలిగిం చాడు. మళ్ళీ తనలో ఉత్సాహం చొచ్చుకపోతోంది. నడుస్తూనే కొడుకు వేపు పదేపదే చూస్తున్నాడు. ఎంత చూస్తున్నా తనివితీరకండావుంది. ఆ కొడుకు పుట్టుపూర్వోత్తరాలు జ్ఞాపకానికి రాసాగినయ్.

"నాకు ఆయుస్సు యెనకైయేళ్లుంది....ఈనిదేముడు యెన్నాళ్లుండి పోతాడు—నా కొడుకును సదువులో వేస్తాను. ఎలాగ పట్నం సేరినాను —ఎవురికాళ్లు పట్టుకొనైనా సదివించేస్తాను. నాకొడుకు పెద్దసదువు సదువుతాడు. నాయంసెప్పాడంటే—ఆగద్దెమీద కూర్చోడా। కోటికి ఒక డంటే మాటలా। నా అయ్య తక్కువపుట్టుక పుట్తాడా." అలా అనుకుం టూనే పీర్లకోనేరుదొడ్డు చేరుకున్నాడు. ఈ ఆలోచనలు ఆకలిని మరుగు పర్చాయి.

ఆ భిక్షుకి సరిగ్గా నిన్నటి స్థలంలోనే కూర్చొని అదేకంఠంతో అరుస్తోంది. నిన్న జరిగినదంతా తలుచుకుంటుంటే తనపై తనకే అస హ్యంవేసింది. రాత్రంతా తనకు సరిగా నిద్దరలేదు. అణాకు అణావడ్డీ వేసి మరీ ఆమెచేతిలో వేశాడు. ఆమె తడుముకొని బేడకాసు పోల్చు కొని ముఖం వెలిగించి దీవించింది। పుల్లయ్యకు ఆదీవన శాపంలా తగిల నట్లనిపించింది. చేసినపని చెప్పుకుంటే పాపం పోతుందనుకున్నాడు. కానీ చెప్పలేక "అలాగదీవింపకమ్మా—నీఋణం తీర్చేస్తాను"అన్నాడు.

ఆమె అమాయకంగా నవ్వి "తెలిసిన బాబులు అలాగంటారు, నీ దగ్గర దాచిపెట్టామా నాయనా....మీ ఆర్జనలో మాలాంటి అనాధలకు

యింత పడవేస్తే అది మాడెలా బ్రతుంది? మీలాంటోలకి పుణ్యంరాదా బాబూ!" అంది.

పుల్లయ్య చటుక్కున "పున్నెమా? పాపం! అన్నాడు.

"ఎంత మాటన్నావు తండ్రీ—పెద్ద బ్రతుకు బ్రతికాను;ఏజన్మలో ఒకరికిపెట్టలేదో ఈనాటికి నాకీగతి వచ్చింది. అన్నం? దూరం అయినోలకు ఆయువెక్కువే నాయనా! ఒక్కరోజు హెచ్చుతగ్గుల్లో అందరూ అక్కడకు వెళ్ళవలసిందే—ఆరోజు వచ్చేవరకూ కడుపు యేమైనా చేయిస్తుంది. ఇచ్చినవాడు పుచుకున్నవాడికంటే గొప్పవాడు బాబూ! అలాంటివాళ్ళకి పుణ్యమే వస్తుంది."

ఒకక్షణం పుల్లయ్య ఆమెవేపు చూశాడు. నిన్న ఆమెనుచూసి అసహ్యించుకున్నాడు. అలాంటి హీనమైన బ్రతుకు బ్రతికేబదులు చచ్చిపోయింది కాదనుకున్నాడు. కానీ యీవేళ యిలాంటి తల్లులు కలకాలం బ్రతికుంటే బాగనిపించింది. కోయదొర చెప్పినట్లు గుడ్డలో యేముంది గుండెలో వున్నాది! తను యేపెంటమీద వుంటేనేం— తన నీలి ఆకంపు వీధిలో పందులదొడ్డిలాంటి పాకలోవున్నా దానిగొప్పతనం యెటుపోతుం దనుకున్నాడు. ఈలోకంలో యింతవరకు తను చూసిన మనుష్యులెందరో జ్ఞాపకానికివస్తున్నారు. అందులో డబ్బున్న రాజిగాడు ఒక నాడు సుకంగా బ్రతికాడా? డబ్బులేని కటిక పేదముసలమ్మ యెంత హాయిగా నవ్వుతూ చచ్చిపోయింది? అలాంటి రాజిగాడే నడుంకట్టుకొని కార్యంచేశాడే? ఈ ప్రపంచం మంచిచెడ్డలూ అనే రెండేరెంటితో నిండిపోయింది. మంచికి చావులేదు: చెడ్డ చచ్చిపోయి మళ్ళీ పుట్టుంది! రోజూ చావే రోజూ పుట్టుకే దానికి!!

ఆ నిర్మలహృదయంప్రక్కన కూర్చోగానే పుల్లయ్యకు ఇలాంటి చల్లని ఆలోచనలు వచ్చాయి. యింటికి వెళ్ళి యెంతో గొప్పగా జ్యోతిష్యుడు చెప్పింది పెళ్ళాంతో చెప్తే ఆమె "ఆ పైసాదంబే యీపూటకు గడిచిపో"నంటే పుల్లయ్యకు కోపంవచ్చింది. "ఆ డెలాబతకాల? ఆడి కష్టం వుంచుకుంటానా?" అన్నాడు.

ఆ మరుచటిరోజు బజారుకు వెళ్ళలేదు. మరి వెళ్ళనని భీష్మించుకున్నాడు. ఓరోజు బయట కూలి దొరుకుతోంది ఓరోజులేదు.నీలి చాలా

చిక్కిపోయింది. ఏ సమయాన ఆమెకు జబ్బుచేస్తుందోనని పుల్లయ్య ఆందోళనచెందసాగాడు. ఆ పీధిలో చేతిఅప్పులు యిచ్చినవాళ్లు తొందర చేస్తున్నారు. అద్దె యింకా ఇవ్వలేదని యింటిమనిషి ఎగిరిపడిపోతోంది. అద్దె యివ్వకపోతే సామానులు వుంచి మనుషులు కదలిపోండంటోంది. సీలి యే యింట్లోనైనా పనిమనిషిగా కుదరాలనిప్రయత్నించింది. "అంట్లు తోముతావా? ఛస్తే యిలా చచ్చిపోడాంగానీ ఆ పనికి యెళ్ళా"ద్దన్నాడు. ఐనా ఆమె రోజుకురోజు బలహీనమైపోతోంది. ఎక్కడ తిరిగినా కడుపు నిండే కూలి దొరకలేదు. యేం చెయ్యటానికి తోచక పుల్లయ్య బేజారెత్త సాగాడు.

ఒకనాటి సాయంత్రం ఆకలివేస్తున్నా కొడుకును వెంటపెట్టుకొని యే కొట్లోనైనా పని దొరుకుతుందేమోనని మార్కెట్టులోకి వెళ్ళాడు. ఒకాయన అన్నాడు "నీ మంచీచెడ్డా మాకేం తెలుసు? మొన్న ఒకడ్ని పెట్టుకున్నాం. నిన్న చేతికి దొరికినమట్టుకు తీసుకపోయాడు దొంగ తనంగా!" అన్నాడు. పుల్లయ్య యెంతో ప్రాధేయపడ్డాడు. కాని వాళ్ళు వెంటనే నమ్మేపరిస్థితిలో లేకపోవటంవల్ల లాభంలేకపోయింది. తిరిగి తిరిగి సగం ఆకలితో చచ్చిపోయి తండ్రీ కొడుకులు బొడారా రోడ్డుగుండా యింటిపేపు వస్తున్నారు. అలా చీమనడకలు తలవంచుకొని నడుస్తుంటే అన్నా అన్న పిలుపు వినిపించింది. ఆ పిలుపు యిదివరకు విన్నదే. తలెత్తి చూశాడు....అన్నను చూడగానే పుల్లయ్యకు సిగ్గువేసింది. ఓట్ల గొడవలో తనను కాదని బంగారయ్య డబ్బుకు ఆశపడ్డాడుగా!

మామూలుగా ఆ అన్న భుజంమీద చెయ్యివేసి "అన్నా! సాలా కాలానికి కలిసినావు బంగారయ్య యేదైనా నౌకరీలో యేసినాడా?"

"లేదన్నా! ఆడి అవసరం అయిపోనాక గెంటించీసినాడు. ఆడి పని యేం నాబంగా రాత యిలాగున్నాది—శనిదేముడు పట్టుకున్నాడు—మంచికెళ్ళినా నెడుగే వస్తున్నాది—నీ మాటయిన్నాను కాదు...."

"కష్టపడినోడ్ని—నీ కష్టం నాకు తెలీదా అన్నా! కూలికెళ్ళినావు ....తప్పేంవున్నాది? రా చానీరు తాగుదువుగాని"

పుల్లయ్య కాదనలేకపోయాడు. ఆ రోడ్డుప్రక్కనే వుంది కాకా హోటలు. బెంచీలు దగ్గరనుంచి అందులో పనిచేసే మనుషులు హోటలు గోడలు అంతా నలుపే! ఒకమూల ఒక బేబిలుమీద సిలవరు పళ్ళెరము లతో రకరకాల తినుబండారాలున్నాయ్! ఒకమూల చా చేసే బేబులు. హోటల్ యజమాని లావుగా మోటుబినియను లుంగీతో మొదటిలో కూర్చున్నాడు. ఆ బేబిలుమీద చిన్న గ్రామఫోను వుంది.హిందీ రికార్డులు వేస్తున్నాడు.

బోండాలు, పరోటాలు తెప్పించి యిద్దరి కడుపూ నిండేటట్లు తుక్కించాడు. చానీరు బలవంతంచేసి త్రాగించాడు. ఇంకా నాలుగు బోండాలు పొట్లం కట్టించి "అమ్మ కిచ్చి" అని మల్లుచేతిలో పెట్టాడు. పుల్లయ్య తిన్నాక, రెండు మూడుసార్లయింది అన్నచేతే ఖర్చుపెట్టిస్తున్నా నని సిగ్గువేసింది. కడుపు నిండగానే సత్తువవచ్చింది.

ముగ్గురూ మళ్ళీ రోడ్డుమీదపడి నడుస్తున్నారు. పుల్లయ్య "ఎక్కడైనా పని దొరికిందా అన్నా!" అన్నాడు.

"పని కరువా? ఓరన్నా! సెల్లెలు జబ్బుమనిషి అయిపోనాది. అందరూ యేలెత్తి చూపడమే!లోకం యింత పచ్చగావుంటే యీ కడుపులో సిచ్చు పోసీమంటావా?"

"ఆ బాబు పనిచేస్తే నాకూ యింత ఆదరువుండేది."

"ఆ బాబుదీ పోనాది--ఆ బాబేం సెయ్యినేదు"

"అయితే యెలాగ అయినాది?"

"అంతా సెప్తాను....రా కూర్చో...." అని రోడ్డుప్రక్కనేవున్న గట్టుమీద కూర్చున్నాడు. కూర్చున్న పుల్లయ్యతో "రేపు ప్రొద్దున్న రా గొప్పోడి ఆశలు,బీదోడి కష్టాలేంటో సూస్తువుగానీ.ఇవన్నీ సూస్తే మనకి యీలోకంలో నీతేంటి, గీతేంటి అనిపిస్తాది."

"నీతిపోతే అంతా సరన్నా!"

"అన్నా! నివ్వు ఆకలితో సచ్చిపోతే నీకు నీతేంసేస్తాది? నీవు బతికుంటేనే ఈ నీతీ గీతీ రచ్చిస్తాది....ఆధికారం,దబ్బుతో గుడ్డి అయినోడు రాజరికంచేస్తే యేం అవుతాది? ఒకరిమీద బాంబు యేసీమంటాడు.

అయ్యో ఆ బాంబు పడినదగ్గర నా పెళ్ళం, పిల్లలలాంటోలు వుంటారని అనుకోడే! ఏ పనిసేసినా ప్రజంతా తనబిడ్డలనుకున్నవోడే గవర్నమెంటోడు కావాల. ఆడే మనకి తల్లీ, తండ్రి! ఆడే మనలాంటి బీదోళ్ళకి గొప్పోలు సూసినట్లు సెయ్యకపోతే మనం నీతిగా యెలాగ బతుకుతాం అన్నా!"

"మన గవుర్నమెంటుని అనక.ఆడు సిన్నోడు. అంతా యెంతకని సూస్తాడు"

"నివ్వు యింకా పట్నంసంగతి తెలుసుకోలేదన్నా. మన సిన్న తనాన మన అయ్యలకి అన్నం, బట్టా వుంటేసరి! ఇప్పుడో కార్లుగీర్లు వచ్చినాయా! ప్రతివోడికి ఆశకు అంతులేకుండాపోతోంది. కడుపునిండితే సాలదు. కారు కావాల-కోరికలు యెక్కువైతున్నకొద్దీ మనిషిలో మంచి సచ్చిపోతాది. అలాంటి వున్నోడు లేనోడిమీద సెలాయిస్తాడు! ఆడికి కారు --ఈడికి ఆకలి."

"ఈడికీ కారు కావాలంటావా?"

"నివ్వు నా తల్లీ-తండ్రివి. ఆడికి కారుండనీ—ఈడికి ఆకలిలేకుండా సెయ్యి. ఈడు ఆశ తక్కువోడు. ఈడిలోనే మం చెక్కువుంటాది.ఈడే దేనికయినా నడుంకట్టుకొని నిలబడ్తాడు. అలా నిలబడినోలున్న లోకమే లోకం"

"అయితే గవుర్నమెంటోడు యెందుకు సెయ్యడూఅని...."

"అదేనన్నా! ఆడు గుడ్డోడు అయితేనే మనలాంటోలకి బాధ! ఆనాడు రాములవారు యేం సేసినారు! మారాజు సాకలోడి మాటంబే ఏమిటి! ఆడిదగ్గరకూడా జడిసి మాతల్లి సీతమ్మని అడివికి పంపించినాడే —అన్నా అలాంటి రాజరికం వస్తే ఈ గంజినీరు తాగినా మన లాంటోలకి అమృతం తాగినట్టుంటాది!"

"నిజమేనన్నా —అలాంటి మారాజు మరి పుట్తాడా?"

"ఆ తండ్రి లంకనుంచి వచ్చి యేం చేసినాడు! ఇప్పటిలాగే ఎందరో బాగా డబ్బుసేసుకుంటే ఆ మారాజు కొట్టనేదు, తిట్టనేదు. ఆంజనేయులవారిని పెట్టి గుమ్మడిపండంత డబ్బంటూ గాదెడు డబ్బుతీసుకుని లేనిజనాన్ని సుఖపెట్టాడు అలాగే గవుర్నమెంటోడు బ్లాకులో దొంగ

లెక్కలతో కోట్లు గడించిన ఈలందరికీ సేస్తే మనలాంటోలకి పనిదొర కదా?"

"మావూర్లో యేమైనాదీ?గరికలు పండించిన రాజిగాడికి పొక్యూరి మెంట్ తక్కువ. నాకు యెక్కువ? పైనున్నోడు మంచోడేనన్నా - మధ్య నున్నోలే అంతా సేస్తన్నారు. యీలలో నాయంవుంటే మనకీగతి యెలా వసాది?"

పుల్లయ్య చెప్పిన మాటలకు ఆ అన్న కాదనలేకపోయాడు.

"అన్నా లోకం యిలాగున్నాది. మనం లోకానికి తగి నడుసు కుంటేగానీ బతకలేం—మళ్ళీ పెజల్లో మనిసిననే పౌరుషం తెప్పించి నాయం గుప్పించిన మారాజు పుట్టాల— ఆనాటిదాక బతక్క సచ్చిపో తామా? నామాట యిను. అకలితో నివ్వూ పిల్లాజెల్లా సచ్చిపోకండి— రాత్రుళ్లు వచ్చావంటే"

"దేనికి?"—పుల్లయం సంశయంగా చూశాడు. నీతిని మాటికి నూరుపాళ్ళూ గౌరవిస్తున్న పుల్లయ్యవేపు చూసి ఆ అన్న నవ్వి "దొంగ తనానికి కాదునే—రాత్రిళ్లు రేవులోన గోధుమ ఓడలు దించాల-ఇప్పుడా మీవూరు వెళ్ళలేవు—గడించుకో—తిను—బతుకు—డబ్బు సేసుకొని మళ్ళా వూరు వెళ్ళిపో!"

పుల్లయ్య ఆశ్చర్యంగా "అంతడబ్బు దొరుకుతాదా?" అన్నాడు.

"ఆ మీదున్న కష్టాసు కనికరించాడంటే వందలే దొరుకుతాయి! నశీబుబాగుంటే, వేలే వస్తాయి. రేపురాత్రికి ఈవేళకి యిక్కడే వుంటాను. వస్తావుకదూ - ఒక్కడివే రావాల!"

"ఈడు వదల్డు!"

"బతకాలంటే ఒదిలించుకోవాల—"

పుల్లయ్య శలవుతీసుకొని సంతోషంగా వెళ్ళిపోయాడు. పెళ్ళంతో "ఈనాటికి మన కష్టాలు తీరిపోయినాయి" అన్నాడు. "రేపు రాత్రినుంచీ ఓడపని—మనం తినగా ఒకరికి పెట్టగా యింకా మిగిలించావంటే, మళ్ళా మనవూరు వెళ్ళిపోమా?" అని ఆనందంతో యెగురుతుంటే నీలి "గాలిలో మేడలు కట్టకు—గడించుకున్నదాంతో కడుపునిండితే సాలదా?" అంది.

పుల్లయ్యకు తొలిసారి ఈవూరు వచ్చాక హాయిగా నిద్దరపట్టింది.

35

అనుకున్నట్టే మల్లు ఆ మరుసటిరోజురాత్రి వెంటపడసాగాడు. ఎంత బోధపర్చినా లాభంలేకపోయింది. నీలి బ్రతిమాలింది. ఎన్నో బుద్ధులు చెప్తున్నా వినిపించుకోలేదు. చివరకు ఆమె విసిగిపోయి కొడుకును పట్టుకొని మొగుడ్ని వెళ్ళిపోమని సైగచేసింది. పుల్లయ్య వెళ్తుంటే వీడు గగ్గోలుపెట్టి యేడుస్తూ గుంజాటనపడుతూ అమ్మచేతిలోంచిజారిపోడానికి ప్రయత్నిస్తున్నాడు. చివరికి నీలి చింకిగుడ్డతో కాళ్లుచేతులుకట్టి యింట్లో ఒకమూల కూర్చోబెట్టింది. అవీ పీకివేసి పరుగెత్తబోతే అమె పట్టుకొని ఈసారి తాడుతో గట్టిగా కట్టింది. అలా యేడుస్తూ యేడుస్తూ బెక్కుతూ బెక్కుతూ చివరకు యెంతోసేపటికిగానీ నిద్రాదేవి ఒడిలో తలవాల్చలేదు.

పుల్లయ్య వెళ్ళగానే ఆ అన్న లేచి నిల్చొని తనయింటికి తీసుక వెళ్ళాడు. ఇదే అన్నయిల్లు చూడటం. ఆ చుట్టుపట్లవున్న యిల్లవేపు ఆ వెన్నెల్లో చూశాడు. ఆ పరిసరాలు చెత్తచెదారాలతో చాలా అసహ్యంగా వుంది. ఈ చిన్న పాకలో ఒకభాగంలో అన్న, అన్నచెల్లీ, ముగ్గురుపిల్లలూ వున్నారు. ఒకేగది—అది గదిఅనే బిరుదు ఒక పంచ గదిఅంటే బాగుంటుంది. చిన్న బుడ్డీదీపం ఆ గదిలో వెలుగుతోంది. ఆ గదిలో నేలమీద చిన్న గుడ్డ పరచుకొని అన్నచెల్లెలు పడుకుంది. ఉండి ఉండి ఆమెమూలుగు వినిపిస్తోంది. అన్నకొడుకు మల్లుకంటే మూడేళ్లు పెద్దలా వున్నాడు. అక్కడే పుస్తకంపట్టుకొని గట్టిగా చదువుకొంటున్నాడు. పెద్దపిల్ల చిన్నపిల్లను అడ్డాలలో వేసి జోకొట్టుంది.

పుల్లయ్య పిల్లవాడి చదువు విని తన కొడుకువిషయం జ్ఞాపకానికి వచ్చింది. "బాగా సదువుతున్నాడే" అన్నాడు.

ఆ అన్నకొడుకుగురించి యెంతో గొప్పగా చెప్పుకున్నాడు. వాడి మీద ఆశతోనే బ్రతుకుతున్నానని చెప్పాడు. అదంతా వింటుంటే తన లాగే కొడుకుల్నిచూసి అంత ఆనందం గర్వంపడేవాళ్ళున్నారని తెలుసుకొన్నాడు. అన్నచెలెలువేపు ఆ యేడుస్తున్న తల్లిలేనిపిల్లవేపు చూస్తుంటే

పుల్లయ్యకెంతో కనికరంవేసి "రామరామ తల్లిలేనిపిల్ల—అమ్మలేని పిల్ల లికి అల్లకల్లోలాలే—ఎలాగ బరిస్తున్నావన్నా" అన్నాడు.

అన్న అలా గడపలో కూర్చునే తనగాధ మొదలుపెట్టాడు. "అన్నా! బతుకుతానని కూలినేక, నాలినేక సెయ్యిబట్టి చేసి సెనగల యాపారంఅనీ....యీ యాపా ం, అ యపారం యేదిసేసినా జరిగింది కాదు. అది సచ్చిపోయిన్నాడు—సేత సిల్లిగవ్వనేదు. దానికి సరిగ్గా గెంజిపొయ్యనేక జబ్బులుపాలుచేసి నానే సంపేసినాను—సచ్చినదాకా నా కిదిలేదు అదిలేదని అనలేదు. లేనినాడుకూడా వున్నట్టే మెలిగింది.అది సచ్చిన్నాడే నానూ సచ్చిపోయూనన్నా."

పుల్లయ్య పనివిషయమై మరచిపోయి ఆ విషాదగాధ వింటు న్నాడు. అన్న మళ్ళీ ఆ గోలమధ్యనే మొదలుపెట్టాడు. "మనసేతుల్లో యేం వున్నదన్నా—ఉన్నదంతా గుండెదయిర్యమే—అదే తెచ్చుకున్నాను-యీ పిల్లల్ని సూసుకొని యిలాగ యెలిపోతంది."

ఇంతలో ఇంకోవ్యక్తి వచ్చాడు. పొట్టిగా నల్లగా భీకరంగా వున్నాడు. మొరటులావున్నా ఆ మనిషి రాగానే ఆ అన్న లేచాడు. ముగ్గురూ మౌనంగా కొంతదూరం నడిచారు. రోడ్డుప్రక్కన కాలవ గట్టుపై కూర్చొని ఆ అన్న "ఇదిగో మనవోడే అన్నా....అలాగ కని పిస్తున్నాడు—గానీ బీదోలంటే యీడి ఒళ్ళంతా కోసి యిచ్చీమంటే యిచ్చేస్తాడు. ఎలాగ గడిస్తాడో అలాగే విసుర్తాడు డబ్బుని...."

అంతదూరంలోవున్న హార్బరులో దీపాలతోరణం అగుపిస్తోంది. అటువేపు చూస్తుంటే పుల్లయ్యకు తొందరపాటు హెచ్చవుతోంది.

"పనిలోనికి యెల్లమా?" అన్నాడు.

"అప్పుడేనా....అయినా యీ రాత్రులు మనం ఆపేసేయలేం!"

"ఏం?"

"అదిగో సూడు ఆకాసంమీద యెవడున్నాడో....అడు కుంగి పోవాల...."

పుల్లయ్య సంశయంగా చూశాడు. తన కేదో అనుమానంవేసి "ఓడ దించాలకదన్నా!"

"అవునన్నా....మనలాంటోలకివస్తే ఓడపోతే బేడ"

"నాకు సరిగ్గా నెప్పన్నా"

"నీకు కష్టంగా వున్నాదా మనం పనిదొరికిన్నాడు నేసుకుందాం లేనినాడు ఇందులో తప్పేంవున్నాది మనం యీ సిన్నపనిసేసి యెవుడి కొంప కూల్చలేదే...."

"దొంగతనమా" అన్నాడు పుల్లయ్య ఆశ్చర్యంగా. "ఒరే చంద్రయ్యా ఈ అన్న వుత్తి సేతకానివానిలాగ ఆకలితో సచ్చిపోతానంటాడు గానీ యెలాగో కదుపునింపుకొని బ్రతుకుతాననడు" అని పుల్లయ్య వేపు తిరిగి "అన్నా నివ్వు పని సంపాదించుకొని బతగ్గలవా"

పుల్లయ్య తలవూపాడు.

"చెప్పు, సంపాదించగలవా"

"లేను"

"అయితే బతకడానికి దొంగతనం నెయ్యగలవా"

"నెయ్యలేను"

"పోసి ఏడబ్బున్న ఆడదివలచి వస్తే—"

"పాపం....పాపం"

"అయితే నివ్వు యీ పెపంచకాన యెందుకూ పనికిరావన్న మాట. నివ్వు బతకలేవు—ఒకరిస్తే పుచ్చుకోలేవు—అయితే యెందుకు పనికొస్తావు"

"నీతంటూ సచ్చిపోడానికి" చంద్రయ్య అందుకున్నాడు. "సూడన్నా,నీ నీతి నాకేం బోధపడలేదు. కడుపులు మాడి సచ్చిపోతున్న ప్పుడు నీతంటూ కూర్చుంటావా ఆ దర్మరాజేం చేసినాడు అబద్దం ఆడ నేదా ఆడికంటె నువ్వు గొప్పోడివా నువ్వు సాలా అమాయకుడివి— నామాట యినకపోతే నాలుగురోజుల్లో యీడ్చినోలే యెవరూ ఉండరు."

పుల్లయ్య ముఖం క్రిందికి దించివేశాడు. ఆ అన్న మళ్ళీఅన్నాడు మను ఒకడ్ని ఖూనీ నెయ్యనేదు. ఒకదిరక్తం తాగనేదు. తోడి మనుషుల్ని దగాచేస్తున్నవాళ్ళదగ్గర న్యాయంగా అడిగితే యివ్వలేదని ఇంకోలాగ తీసుకుంటున్నాం—ఆకాశంమీదవున్న యీ మేఘాలు అందరివీ—ఈభూమిమీదవున్న పళ్ళూ ఫలసాయాలు అందరివే—అయితే పెద్దోడు

హెచ్చు—పిల్లడు తకుఁవ తిన్నట్టే అలాగ యీటిని పంచుకుంటే యే గొడవాలేదు. మనలాంటి పిల్లోడికి పెట్టకుండా తినేసే, దయలేని యీ పెద్దోళ్ళపైపడక యింకెవురిమీద పడమంటావ్?"

పుల్లయ్య యింకా మౌనంగానే వింటున్నాడు. అన్న యింకా వాగ్ధాటిని ఆపలేదు.

"నివ్వనుకుంటున్నావ్ యిలాగ రాత్రులు దొంగతినానికి వెళ్ళిన వాళ్ళే దొంగలని....నీకు తెలీదు—ఈ దోచుకున్నోలు నూటికి నూరు లాభాలు యేసుకుంటున్నారు. ఆలు దొంగలా? మనలా బతకడానికి యెళ్ళి నవాళ్లు దొంగలా? నివ్వు రాకపోతే మాకు సేతకాదని కాదు—అదేంటో నీవు కలుసుకున్న మూర్తం ఆలాంటిది. అయ్యోనాలోంటోడివి—పిల్ల లతో మలమల మాడిపోతావని యింత సెప్పడం. నీ పిచ్చిగాని అన్నా యేదోఒకలాగ దొంగతనం అన్యాయం సెయ్యండి యీలోకంలో ఎవుడు ఆస్తిపాస్తులు సేసుకున్నాడు. పోనీ నువ్వు దొంగతనం సెయ్యొద్దు-పైనే వుండు—నీ ఒంతు నివు తీసుకో...."

అలా చందమామ క్రుంగేవరకు కూర్చున్నారు. పుల్లయ్యకు ఆ సమయంలో తిరిగి వెళ్ళిపోవడానికి మనస్కరించలేదు. అప్పు తీర్చాలి—అద్దె యివ్వకపోతే నిలుచున్నపాటున గెంటించివేస్తుందామె! పెళ్ళాం యెదరగా తను అన్నిగొప్పలు సెప్పాడు—మళ్ళీ లేదని యెలాచెప్పటం? తనకొడుకును చదువులో పెయ్యాలి. వాడికి పలకా పుస్తకాలు—బిట్టలూ వుండాలి—తను వాళ్ళతో చేరకపోతే రేపటినుంచీ యేం చెయ్యగలడు? తనవూరు వెళ్ళిపోతే?? ఆ సుందరమైన భూములు, గలగల ప్రవహించే నది—గుమ్మటంలాంటి యిల్లు—పోతులు. వ్యవసాయం—ఆ చక్కని మనోహర ప్రదేశం....మా తల్లి లచ్చిందేవి గలగలలు—నీలమ్మతల్లి సందిరాలు....గరిడీ....ఎక్కడా సంతోషమే....ఎక్కడావుత్సాహమే.... ఒక్కసారి యివన్నీ వికటాట్టహాసం చేసినట్లనిపించాయి "పుల్లయ్యా.... వూరెందుకు కదిలావో మరచిపోయావా? మనుషులు మారిపోయారు—వారితోపాటూ మేమూ మారిపోయాం....ఎక్కడకక్కడే ప్రాణంలేకండా ఒరిగిపోయాం....నివ్వు యీ పల్లెకువచ్చి యేం చేద్దామని....బ్రతుకుతా నంటావా? యెలా బ్రతుకుతావ్....? ఒక సెంటుభూమి వుందా? ఉండ

టానికి యిల్లువుందా?అందరూ నిన్ను చూసి పకపక నవ్వి ఎక్కిరిస్తారు. పడిపోయావుకదా అని కనికరించరు....యేం తిని బ్రతుకుతావ్?—ఏ ముకంపెట్టుకొని వెళ్తావ్?"యిలా గుండెలో గడగడలు బయలుదేరాయి. ....మనసులో వడగళ్లు....వానలా కళ్ళలో నీరు అలుముకుంది ...ఆ శోకంతో మనసులో "అమ్మా నీలమ్మతల్లీ!....కనికరించుతల్లీ....ఈ పని సెయ్యలేను....నా కేదో నాయంగా బతికే బతుకుతెరువు చూపించు"

"ఏడుస్తున్నాడురా" అన్నాడు చంద్రయ్య. "అలాగే మొదటి రోజున మనకి లేదురా! ఆ బురదలో దిగకముంచు మనుషులుగా వుంటాం....బురదలో గెంతితేగాని మనకి జరగదు. ఒకసారి బురదలో గెంతాకయేవై(నాం! పందులమైనాంకదా!"

కొంతసేపు మౌనం ముగ్గురినీ ఆవరించింది. తరువాత అన్న లేచి నిల్చొని "లే అన్నా!నివ్వు దొంగతనం సెయ్యకు!మా యిద్దర మేసేస్తాం. నివ్వు దూరాన్న వుండు. నీకు పని దొరికినంతదాకా సచ్చిపోకండా బతకడానికి మా దగ్గర యెంతోకొంత తీసుకో—అయితే యిదిగో" అంటూ అన్న చంద్రయ్య అరచేతిని తన చేతిమీద వేసుకొని పుల్లయ్యచేతిని ఆ పైనవేసి "అనండి దేముడు తోడుగా, మాలో యే ఒక్కరం దినాలు బాగులేక దొరికిపోయినా మిగతా యిద్దరిగుట్టూ యెంతమాత్రం సెప్పము" మళ్ళీ రెండుసార్లు ఈ ప్రమాణ స్వీకరణ చెయ్యించాడు. పుల్లయ్య తొలిసారి బెణుకుతూ,వణుకుతూ అన్నాడు. రెండోసారి బెణుకు తగ్గి మూడోసారి స్పష్టంగా అన్నాడు.

ఈ తంతు అయ్యాక ముగ్గురూ కలిసి బయలుదేరారు. చంద్రయ్య యిదివరకే ఆ రాత్రి యెక్కడ కన్నంవెయ్యాలో తెముల్చుకొనే వున్నాడు. ఆ సందులోనికి వెళ్ళి వున్న ఒకేఒక మ్యునిసిపల్ యెలక్ట్రిక్ దీపం బల్బు రాయితో బ్రద్దలుచేశాడు. చీకటి. అన్న పుల్లయ్యను సందు మొదల్లో ఒక చెత్తల దొక్కుచాటున కూర్చోబెట్టి గస్తీ పోలీసులుగాని యింకెవరివల్లగాని వచ్చే ఆపాయాన్ని రాకండా తను యెటువంటి సైగ చెయ్యాలో, యెలా పారిపోవాలో చెప్పాడు.

ఇందులో చంద్రయ్య ఆరితేరిన మనిషి. పుల్లయ్య ఆ మూల కూర్చున్నాడేకాని, కాళ్లు గజగజ వణికిపోతున్నాయ్. శరీరమంతా ఆ వణుకు ఆవరించింది. తనకు యెక్కడలేని ఆవేశం,బెంగా ఆవరించాయి. దొంగలు పడ్తే తనవూర్లో యిలా వూరుకొనేవాడా? ఎలా గస్తీతిరిగి మరీ పట్టుకొనేవాడు?అలాంటిది తను కళ్లారా చూస్తూ వూరుకుంటాడా? గట్టిగా "దొంగలు....దొంగలు" అని ఆరవాలనుకున్నాడు. నాలిక చివరివరకూ వచ్చింది. కానీ తన ఒట్టు అన్న మంచితనం, బాధలు అన్నీ ఒక్కసారి కూడి నోటిని నొక్కేశాయి.

వీళ్ళిద్దరూ తిరిగి రావడానికి యెంతసేపో పట్టలేదు. ముగ్గురూ మళ్ళీ నక్కినక్కి మొదటి కాలవగట్టుకు వచ్చారు. చంద్రయ్యకు ఈవేళ పనియేం సంతోషంగాలేదు. బనియనులోపలి జేబూనించి యేదో బంగారం వస్తువు, ఇంకా యేదోవుంది బరువుగా జేబులో- అదికూడా తీశాడు. కత్తి....పుల్లయ్యకు భయంవేసింది. దొంగలకు దొరికిపోయినట్లుగా అనిపించింది.

తెల్లవారుఝాము కాడానికి యింకా రెండుగంటలు కావాలి....అన్న రేపుప్రొద్దున్న కలుసుకుందాం అన్నాడు. పుల్లయ్య యింటివేపు బయలుదేరాడు.

త్రోవలో యెన్నో అనుకున్నాడు. రేపు యీ డబ్బు తీసికెళ్ళి దాని సేతిలో యెలాగ పెట్టాను? అది యెలాగొచ్చిందని అడగదా? పెళ్ళిరోజు జ్ఞాపకంవచ్చింది. తను ఆర్జించుకున్నదాంట్లో పెళ్ళంకి సగంయిచ్చి తీరాల —అది పాటించకపోతే పెళ్ళినాటి ప్రమాణం జవదాటాడన్నమాట! మరి రేపు యీ పాపిష్టి డబ్బుకు రాననుకున్నాడు.

36

ఉదయం అయ్యవేపు చూసి మళ్లి అలకసాగించాడు. అయ్య పిలిచినా మాటాడలేదు.నీలి యెంత కూలిచ్చారని అడిగింది. వెంటనే జబాబు చెప్పకపోతే చిక్కుని "మూడు రూపాయాలు" అన్నాడు. ఆమె సంతో

షంగా "రోజూ వుంటాడా పని" అని అడిగింది. " ఏమోలే—దొరికి న్నాడు సేస్తాను—లేనినాడు లేద"న్నాడు.

ఈ అబద్దాలు యెంతో బలవంతాన అన్నాడు. అన్నాక భయం వేసింది. ఇప్పటికీ, అప్పటికీ దబ్బు చేతపెట్టకపోవటంవల్ల నీలి "కూలివ్వనేదా?" అని ప్రశ్నించింది.

"ఇస్తారు!"

"ఎప్పుడు?"

"ఈవేళ—"

అలా కాస్సేపు నిద్దరపోవాలనిపించింది. ఇంట్లోనే చారపడుతూ మల్లుని పిలిచాడు. కొడుకు రాలేదు. కూతురు దగ్గరగానే ఆడుకుంటోంది.

"అయ్యా! యీవేళ తీసికెళ్తానులేరా....రా" అన్నాడు.

కొడుకు వచ్చేడేగానీ నవ్వలేదు. కాస్సేపు నవ్వించడానికి ప్రయత్నించాడు. ఇంతలో పొరుగమ్మ పెరటినుంచే నీలిని కేకవేసి నోరు దబ్బువిషయమై దాటీగా విడిచిపెట్టోంది. మూడు రూపాయలూ ఆవేళ యివ్వాలని పోరు. ఆ గొంతుక విని పుల్లయ్యకు పౌరుషంవచ్చి గప్పున లేచి:

"ఎక్కడో పారిపోయినోళ్లాగ మాటాడతన్నావు?"

"అంత పౌరుషం అయితే పారీకూడదా?"

"పారీకండా వుంచుకుంటా మేంటి?"

"ఎప్పుడోయిస్తే యెలాగౌతాది? యెందరో యింటికోసం వస్తన్నారు—పౌరుషంయైనోడివైతే నెల అవగానే అద్దె పారీకూడదా?"

నీలి జోక్యంచేసుకొని భర్తను వారించి లోనికి పంపించింది. ఆవిడ గొంతుకమాత్రం ఆగలేదు. పుల్లయ్యకు యెక్కడలేని అభిమానం కలిగి గబగబ అన్నయింటికి పరుగెత్తి "మూడురూపాయలు కావాలన్నా" అన్నాడు. అంతా విని చంద్రయ్య దగ్గరకు వెళ్ళి తెచ్చియిస్తూ చాటుగా మెల్లగా "రాతిరిది యింకా అమ్మలేదు. దొంగవస్తువు సగానికి సగం - ఆ కంసాలోడికి ఆళ—ఆడిబయం ఆడిది - నీ వాటాకి పది రూపాయలు వస్తాయని" సెంద్రయ్య సెప్పినాడు.

"ఇది నెయ్యి బదులు - ఆ డబ్బుమాపెందుక" న్నాడు పుల్లయ్య.

ఇంటికివచ్చి నీలిచేతికిచ్చి "దాని ముకంమీద కొట్టే అన్నాడు. ఆవిడ ఆ మాటవిని నానాగొడవ చేసింది. నీలి బ్రతిమాలింది. "ఎందు కమ్మా - ఎవురు యెన్నాళ్ళుండిపోతాం — ఈ మాత్రందానికి నోరు పాడుసేసుకుంటాం. ఇరుగూ, పొరుగూ మంచీపెడ్డకి కాకపోతే మడెవు రవుతారసిఁ". కొంతసేపటికి ఆమె ప్రవాహాన్ని అరికట్టకలిగింది.

ఆవేళ సాయంత్రం అన్నదగ్గరకి మల్లుతోసహా వెళ్ళాడు. అన్న సినీమాకి బలవంతావ తీసుకవెళ్ళాడు. ఆ బొమ్మలా చూసి మల్లు సరదా అంతా యింతా కాదు. ఒకోసారి కేకలువేసి గెంతుతుంటే ప్రక్కనున్న వాళ్ళు పుల్లయ్యను కోపగించారు. పుల్లయ్యకు సినీమా చూస్తున్నంత సేపూ అంతా అలాంటి ఆలోచనలే. ఆ మేడలూ, మిద్దెలూ, ఆ డబ్బూ, బట్టలూ అంతావుంటే సుకంగా బ్రతకరా అనుకున్నాడు. ఒకసారి చూశాక ఆ సినిమా మళ్ళీ మళ్ళీ చూడాలనిపించింది. పాటలు యెంత యింపుగా వున్నాయి. ఆ మూడుగంటలు యీ కష్టాలన్నీ మరిచిపోయి సంతోషంగా వున్నానే అనుకున్నాడు.

ఇంటికి వచ్చాక నీలి"యీ రాతిరికి పనికెళ్ళవా" అని అడిగింది. "ఈయేళ లేదట" అన్నాడు. మల్లు సినీమా సంగతులు వుత్సాహంగా చెప్తున్నాడు. ఆ మరుచటిరోజు వీధిలో చంద్రయ్య కనిపించాడు. ఒక దగ్గరకు తీసుకవెళ్ళాడు. సందుగొందులు తిరిగి అక్కడకు వెళ్తే పది మంది ఆ పాకలో కూర్చొని పేకాట ఆడుతున్నారు. "కూర్చో చూడు" అని చంద్రయ్యకూడా డబ్బుకట్టి ఆడుతున్నాడు. పుల్లయ్యకు అంతా ఆశ్చర్యంగా వుంది. మల్లుకూడా వుత్సాహంగా వుంది. మధ్యాహ్నం అయినా చంద్రయ్య కదల్లేదు. పుల్లయ్య వెళ్ళిపోతానని లేచాడు. చంద్రయ్య ఒక్కసారి బయటకు వచ్చి. "ఈ రాతిరికి రావాల — ఇప్పుడే యెళ్లి అన్నను కలుసుకో" అన్నాడు.

పుల్లయ్య తల వూపాడేగాని యింటివేపే కాలు కదిపాడు. ఇంటికి వెళ్ళేసరికి యింట్లో యేమీలేదు. "ఎంతకని వడ్డీ అప్పులు — వాళ్లు వచ్చి యింటిమీద పడ్తున్నారు —" అని నీలి అన్నది. అలా వాకిట

కూలబడి పోయాడు. చిన్నపిల్ల బువ్వకు యేడుస్తోంది. నీలి మాటాడ కండా పెళ్లో కూర్చుంది.

అలా ఆ యేడుపులోనే పుల్లయ్య యెన్నో విధాలుగా ఆలోచిం చాడు. "తనకు పని యెక్కడ దొరుకుతాది? ఎలాగా ఒకసారి బురదలో దిగాను — బాగా దిగిపోతాను. నేను మునిగిపోయేముందు యీలకీ యేదో దారి చూపిస్తాను" అనుకున్నాడు. "ఈ లోకంలో కడుపుముం దర నీతీ గీతీ యేమిటి? అలాంటి విశ్వామిత్రుడులాంటోడు మాలపేట లోన కుక్కమాంసం దొంగిలాడాడని పదంలో యిన్నానుకదా. నీ లాం టోడికేంటి? ఇదంతా దేనికొచ్చిందో వచ్చింది — దీనితో నా కష్టాలన్నీ పోవాల - ఈ ఒక్క తప్పునే ఆ యమధర్మరాజు యినుపకాకులసేత పొడిపించనీ - పడ్తాను — నాను సచ్చాక యే కాకులు పొడిస్తే యెవురు సూడొచ్చారు —"

ఇలా వుద్రేకంతో లేచి అన్న దగ్గరకు వెళ్ళాడు, అన్న యేడు రూపాయలు యిచ్చి అన్నాడు.

"ఎలాగొచ్చింది అలానే యెలిపోతాదన్నా. ఇది వుండిపోతా దనుకోక, ఉన్నప్పుడే తిను. ఒళ్ళు గట్టిచేసుకో. తరవాత యెవుడికో నంచంకత్తే పని దొరికిపోతాది" అన్నాడు. పుల్లయ్యకు యీ మాటలు నచ్చాయి.

"చంద్రయ్య ఈ రాతిరికి రమ్మన్నాడు." అని గొణిగాడు"ఆడు తేకపోతే మనకేం సేతనౌతాది? అందుకే ఆడు యేమిచ్చినా కాబోలమ కుంటున్నాం. ఆ యెదవకి యిద్దరు పెళ్ళాలు —పేకాట, బ్రేకట్లు ఆడక వుండలేడు. అందులో తాగుతాడు—ఆడితో కూడావంటే మూడు రోజుల్లో నిన్ను మార్చేస్తాడు; మన పనితోటే వాడికీ సమ్మంధం" అన్నాడు.

పుల్లయ్య కొడుకువేపు చూపించి మెల్లగా "ఈడు ఒకంతట కదలనివ్వడు —సెంద్రయ్య మాత్తర్లు యిచ్చినాడు నిద్దరకి-ఏసేస్తాను" "ముందు మా వోడుకీ అది యేసినాను. నిద్దరట్టేవస్తాది"అని చెప్పాడు.

త్రోవలో ఈ డబ్బు అంతా పెళ్ళంకి యిస్తే పోల్చుతుందని ఆమెతో అప్పుతెచ్చానని రెండు రూపాయలు యిద్దామని నిర్ధారించు కున్నాడు.

37

పుల్లయ్యకు ఇంట్లో 'ఓడదించాల' అని, వీధిలో దొంగతనంకు వెళ్ళటం అలవాటైపోయింది. ఒకరాత్రి యింటిలో పడుకోడానికి మన స్కరించలేదు. రోజులు గడిచినకొద్దీ తనూ ఈ పనిలో ఆరితేరిపోతు న్నాడు. ఇంట్లో మల్లుబాధ లేదు. అవసరంఅయినప్పుడు బిళ్ళ యివ్వ గానే వాడికి నిద్దర ఒస్తోంది. రానురాను వాడికి రాత్రులు పడుకోవటం అలవాటౌతోంది. తెలివివున్నంతవరకూ తండ్రిని విడిచిపెట్టడంలేదు.

ఇప్పుడు తన పరిస్థితి చాలానయం. కడుపునిండా తనకేకాదు, కుటుంబానికీ తిండే. కొడుకుకు బట్టలు కుట్టించాడు.బడిలో వేశాడు. ఇలాగైనా కాస్తా దూరమౌతాడని. ఆ కొడుకు చదువుమీద యెంతో ఆశ పెట్టుకున్నాడు.

అంతేకాదు. తను వారానికి మూడుసార్లయినా మిగతావారిలా సినీమా చూస్తాడు. చంద్రయ్య యిప్పుడు ప్రాణస్నేహితుడయ్యాడు. అన్నతో పొత్తు కాస్త దూరమైపోయింది. బ్రాకెట్లఆట నేర్చాడు. ఒకో రోజు ఐదు, ఆరు రూపాయలవరకూ కట్టాడు. డబ్బు పోతున్నకొద్దీ పంతం పెచ్చవుతోంది—దురాశ పీక్కుతింటోంది—వేలాస్తాయ్—వస్తే మళ్ళా తన వూరికెళ్ళి....గొప్పబ్రతుకు బతుకుతానని ఆశ తనను పీడిస్తోంది. రానురాను పోయినడబ్బు వచ్చినా ఒక యకశం పొలం దొరకదా? అన్న పట్టుదల పెచ్చవుతోంది. ఇప్పుడు దొంగతనం తప్ప, పాపం అన్నమాటే తల్చుకోడు. ఈమధ్య ఒకసారి దొరికిపోవల సింది, కాని అదృష్టంకొద్దీ తప్పుకున్నారు. ఒక వారంరోజులు జాగ్ర త్తగా వున్నారు.

ఇంతకీ ఈ ఆరునెలల్లోనూ చేసినవన్నీ చివ్వదొంగతనాలే. ఏవీ తన దాహాన్ని తీర్చేవిగాలేవు. ఇంటికి యేరోజు మూడు, రెండురూపాయలు యిస్తున్నాడు — బాగా బ్రాకెట్లు ఆడిన్నాడు యేమీ లేదు. నీలితో అబద్దాలు ఆడటం అలవాటైపోయింది. అలా ఆడటంలో తప్పుగురించి అసలే ఆలోచించలేదు. ఇంత డబ్బులోనూ నీలికి బట్టలే కొనలేదు. ఆమె అసహ్యంగా వుందని ఒకనాడు ఒక చీరె తెచ్చాడు.

"ఎక్కడిదీ — రాతిరి కూలి యియ్యలేదన్నావు" అని ప్రశ్నించింది.

"ఓడ కెప్తాను, దొర — మా మంచోడు. గరిడీ సెయ్యమంటే సేసినాను — మెచ్చి ఐదురూపాయలిచ్చి నీ పెళ్ళానికోక కొనిచ్చీ అని యిచ్చినాడు" అన్నాడు.

నీలి చీరె కట్టుకుందేగానీ — అదోలా అనిపిస్తోంది. ఒళ్ళంతా ఒణుకుతున్నట్లనిపించింది. అసలు ఆమె శరీరంలో యేంబాగు తగలటం లేదు. మొగుడు డబ్బు తెచ్చియిస్తున్నా ఆమెలో యెంత ప్రయత్నించినా సంతోషంగా లేదు. పుల్లయ్య ముఖంలో ఆమెకు యిదివరకున్న కళా కాంతులు కనపడలేదు. ఇదివరకున్న అమాయక చూపులు ఆ కళ్ళల్లో లేవు. మనిషి పుష్టిగావున్నా మోటుగా కనిపిస్తున్నాడు. నడకలో మార్పు స్పష్టంగా ఆమెకు గోచరిస్తోంది.

ఆ కట్టుకున్న చీరె విప్పేసరికి ఆమెకు మనస్సు శాంతించలేదు. రేపు పడ్తే బాగుంటాదేమోనని అనుకుంది.

ఒకనాడు, మొదట తను వూర్లో దిగిన్నాడువుండిన సత్రంలోనికి దొంగతనానికి వెళ్ళారు. ఆవేళ జరిగినదంతా జ్ఞప్తికివచ్చింది. ఆవేళ పుల్లయ్యకీ యీ వేళ పుల్లయ్యకూ యెంతతేడా అనుకున్నాడు. "ఆ పుల్లయ్య నచ్చిపోనాడు. నచ్చిపోనోడి గురించి యెందుకు తలుస్తావని" ఈ పుల్లయ్య తమాయించుకున్నాడు.

ఒకరోజు అన్న పుల్లయ్యని బలవంతాన యింటికి తీసుకెళ్ళాడు. అన్న యేమైనా అంటాడని పుల్లయ్యకు ఒకప్రక్క బెదురుగావుంది. ఈ రోజుల్లో చంద్రయ్య పుల్లయ్య కలిసి, అన్నమాట సరిగ్గా వినటంలేదు. అన్న మంచీచెడ్డా మాటాడి వెంటవచ్చాడు. ఆ పాతకాలవ గట్టున

కూర్చున్నారు. సాయంత్రమైనా భూమి చల్లబడలేదు. ఆకాశంవేపు చూస్తూ అన్న అన్నాడు "పనిమాట యేమంటావని"

"మన కెక్కడ దొరుకుతాది" అన్నాడు పుల్లయ్య. "ఎందుకు దొరకదు? ఇకముందు యేం దొరికినా మిగిలింది నా సేతికిచ్చి; ఒక మూలపెట్టి యెవుడికైనా మూతికట్టే దొరకదా?"

ఎక్కడ మిగులుతాది? పని దొరికినా మనకు మంచిపని యిస్తారా?"

"ఎందు కివ్వరు?"

"ఏంటోలే-ఈ పని బాగులేదా? ఎప్పుడో గవ్వలు పేలినట్లు పేలీదా? దాంతో ఈ వూర్లో వుంటానా? మళ్ళీ మా వూరెల్లి ఆ రాజిగాడితో పోటీపడనా? మళ్ళా వూరికి మొనగాడై యేలనా?"

అన్న, వుద్రేకంతో అంటున్న పుల్లయ్యవేపు చూసి శాంతంగా "ఓరన్నా! గోడకురాసిన సున్నం రాదు. జూదం ఆడిన డబ్బు రాదు — ఏ రోజున పేలిపోతాదని చూస్తున్నావ్? అది పేలదూ నివ్వు బతకలేవు — బతకవు!"

"రోజులు యెప్పుడూ ఒకలాగ వుంటాయా?"

"చెంద్రయ్య వృత్తే దొంగపని. నివ్వు నానూ కుటుంబంకోసం దొంగలయ్యాం. పని దొరికిననాడూ దొంగతనానికి యెళ్తే మనం పచ్చి దొంగలం అన్నమాట! అలాంటప్పుడు ఏ గవర్నమెంటోడినీ అనలేం. పచ్చిదొంగలకి, రోజులు నడుస్తున్నకొద్దీ చెడ్డవేగానీ మంచివికావు. నా మాట విని ఆ ఆట మానేసి ఆ నాలుగురాళ్ళూ ఒకమూల యేసేవంటే ఏదోపని—కష్టపడి కడుపులో యేసుకున్నదానికీ - కష్టపడకుండా నింపుకున్నదానికీ తేడాలేదా?"

"ఇప్పుడు నా కివేమీ సెప్పక. నా డబ్బు సాలా పోనాది. అది రావాల. నానీ వూరు కదలాల — నివ్వు ఎంతసెప్పు,నా తల కెక్కద"ని పుల్లయ్య కటువుగా అన్నాడు.

అన్న లేచిపోతూ "నాను ఆనాడు అన్నట్లే అయినాది. ఆ బురదలో దిగిపోనావు. పంది అయిపోనావు"

పుల్లయ్య మాటాడకండా వెళ్ళిపోయాడు.

38

వేసవికాలం ఒకనాటివుదయం పుల్లయ్య, చంద్రయ్య కలిసి వెళ్ళిపోతూండగా, బూచోడు తన మామూలుస్థలంలో కుక్కను ప్రక్కన పెట్టుకొని ఏదో గొణుక్కుంటున్నాడు. పుల్లయ్య చటుక్కున, "వాడిని చూశావా? ఆడికథ నీకు తెలుసునా?" అన్నాడు.

"ఆడు దేముడితో సమానం." అన్నాడు చంద్రయ్య. "నీవు యేదిచ్చినా పుచ్చుకోడు. పుచ్చుకున్నాడంటే మనకు పెద్ద లాభం వచ్చిందన్నమాటే!"

పుల్లయ్య అలా నడుస్తూనే, "బంగారం కొబ్బరిచెట్టుకింద పాతిపెట్టా నన్నాడు. గుట్టంతా లాగాను! అయినా, అడిఇల్లు ఎక్కడో యేంటో!"

"ఆడిఇల్లు అదిగో 'ఆ మూడంతస్థులమేడ. బూచోడు మాగొప్పోడు. పెద్దసదువు సదివినాడట. సెప్పినాడా కొబ్బరిసెట్టుకిందని!"

"అవును. ఏదీ ఆ ఇంటియెనక కొబ్బరిసెట్టు నేదే!"

"రెండేళ్ళకితం సూసినాను. అదిగో పెరటగదులు లేసిపోనాయి. ఏమాత్రం బంగారం?"

"అదే దొరికితే మరి మనం యీ యాపారం యిడిచిపెట్టేయొచ్చు!"

చంద్రయ్య సంతోషంగా నవ్వాడు. "అంతా నాకు వదిలీ! నాను ఆ గుట్టంతా లాగుతాను. ఎలాగైనా ఆ బంగారం అంకించుకోవాల. దానితో మనదరిద్రం పోతాది."

మూడురోజులు పోయాక అన్న, చంద్రయ్య, పుల్లయ్య కలుసుకున్నారు. ముగ్గురూ కాలవగట్టుమీద కూర్చొని పూసులాడుకున్నారు. చంద్రయ్య అన్నాడు. "ఆ యింటి గుట్టంతా నాగీశాను. ఆ యజమానున్నాడే బలే గట్టోడు. ఆ మూడో అంతస్థుమీద ఒకే గది వుందా? అందులోవే వుందట యినపపెట్టి, తాళాలు తలకిందే వుంటాయట. ఇంట్లో యెవురికీ నమ్మడట! రాత్రుళ్ళు యెవురినీ దగ్గిరికి సేరనివ్వడట!"

"ఇంతకీ బంగారంమాట?"

'ఇను మరి.....యిల్లు,కట్టడానికి కొబ్బరిచెట్టు కొట్టించేసి పునాదులు తవ్వుతుంటే బంగారం, పెట్టితోని దొరికిందట ఆ యేళనుంచి మరీ నమ్మడు - మనుసుల్ని! బంగారం యెక్కడ దాస్తాడు మరి యినపపెట్టెలోనే."

"మరి మనకి యింతకంటే అదును దొరకదు. ఆడి డబ్బు కాదు కదా? బూచోడిది- మనం ఆ బంగారం అంకించుకున్నా పాపంనేదు" అన్నాడు పుల్లయ్య.

"వినుమరి:మనం తొందరపడ్తే నాబంనేదు, సమయం సూడాల. ఇంత పెద్దపని మనం సెయ్యనేము-సెయ్యబోము-అంచేత అన్నీ జాగర్తగాసూసి పని నెరవేర్సుకోవాల. ఏమాత్రం పొరపాటుజరిగినా అంతా సరిఃఅంచేతనే ఆ యింటి నౌకరీవోడిని మంచి చేసుకున్నాను!"

"సచ్చిపోనాం" అన్నాడు అన్న.

"ఏం?" పుల్లయ్యందుకున్నాడు.

"రేపుపొద్దున్న దొంగతనం అయ్యాక ఆడే అటువేపు తిరిగి పోయి పోలీసోలకి నిన్ను అప్పచెప్పీదా?"

చంద్రయ్య పకాలుమని నవ్వాడు "నీకు కడుపుకి జరక్క దొంగ వయ్యావు. నానో గొప్పోడవ్వాలని దొంగనయ్యావు. నావు యెందరి పోలీసోళ్ళకళ్ళల్లోనో కారం జల్లాను. చంద్రయ్యలాగ వెళ్లానా? వేసాను-సాధూవేషం వేసాను. ఆడు సంగతులు సెప్పేసరికి కాలుమీద పడి మొక్కినాడు. ఆడి తాతలు తిరిగిరావాల పోల్చుకోడానికి! మీకా బెంగేమి వద్దురా! అంతా పసందుగా జరిగిపోవడం నా పూచీ! ఆ యజమాని అసలు ఆ వలిసి వచ్చినదానినే నమ్మడట! నానా చీవాట్లు పెట్టాడట. నీ మొగుడికి ద్రోహంచేసినదానివి నాకు సెయ్యవా అని కొరికి నమిలీసిన మాటలు ఆడతాడట! ఆ యమ్మకి పచ్చవాతం-ఈ రాపులుతో అసలు మొగుడ్ని తల్చుకొని ఏడుస్తాదట!సావేనా వచ్చినాది కాదంటాదట. ఆడి సంగతో మరి. రాత్రుళ్ళు సరిగా పడుకోడట-పడుకున్నా యేదో పేలాపన: ఒకోనాడు ఎందుకో భయం అనిపిస్తాదట-తప్పతాగేసి

పడుకొంటాడట—అదిగో ఆ సమయంచూసి మనం యెయ్యాల కాటు!"

"అంత యెత్తు మేడఇంట్లో యెందరుంటారో, వీలౌతాదా?" అన్నాడు పుల్లయ్య.

చంద్రయ్య నవ్వి "ఆ పిరికి వుంటే మనకు బతుకేలేదు.ఆకాసం మీద పడిపోతున్నా మనం అడ్డుతాం అన్నోడే యేమైనా యీ లోకం మీద సెయ్యగలడు. ఆ మేడయేపు యెప్పుడైనా సూసావా?"

"ఓ యెన్నోసార్లు.

"సెప్పు. యెలాగ యెక్కుతావో?"

"అటువేపు సందు యిటువేపు సందు. ముందు రోడ్డుమీద దీపం—అటు సందులో దీపం నేదుగానీ, యిటు సందులో వున్నాదే—చిక్కే" అన్నాడు.

"నేనంతా అప్పుడే పేనుయేసుకున్నాను. ముందుదీపం సందు దీపం బద్దలుకొట్టడం! పడమటియేపు మూడో అంతస్తునుంచి నీళ్ళు పోడానికి రెండు సిమ్మెంటు గొట్టాలు కిందదాకా వున్నాయి కాదా.—సీకటిరాత్రి ఆ రోడ్డంట తొమ్మిది దాటితే యెవురూ తిరగరు—మంచి రాత్రిమీద యెక్కిపోవడం— చేసినపనిచేసి రెండోపక్కనుంచి అలాంటివే మూడుగొట్టాలున్నాయి. నాలుగుమెట్లు దిగితే ఆ గొట్టాన్ని పట్టు,కోవచ్చు.పట్టుకోని దిగిపోవడం సులభం—

"ఇటుపక్కనుంచైతే?"

"వద్దు, ఇటువేపు పెద్దసందు....వచ్చినా రాతిరి పోలీసోలు తిరిగితే తిరుగుతారు....గప్పున దాగోడానికి అన్నీ గుమ్మాలే.యీ లుండదు. అటువేపు సందులో పెరటి గుమ్మాలు యేదొడ్లోనైనా దాగుండిపోగలం—"

"తలుపులు వేసీరా? ఆన్నాడు పుల్లయ్య.

"నాను తీస్తానుకదూ? అలాగపోతే ఆ సందునుంచి రెండు మూడు సందులున్నాయి. యే సందునుంచి యెలిపోయినా సముద్ర పొడ్డుకే. వేసంకాలం మనలాంటోలు యెందరో పడుంటారు....ఇసిక

మీద పడుకున్నట్టు టక్కువేసీడమే.....అంతా గేపకం వుంచు కోండి....ఆ సరియైన యేళకి నానే మీయిళ్ళకి వస్తాను—"

మిగిలిన యిద్దరూ చంద్రయ్య చెప్పినట్లు అంగీకరించారు.

చీకటి రాత్రులు వచ్చాయి. అనుకొని పదిహేనురోజులైంది గానీ చంద్రయ్య వెళ్దామని అనటంలేదు. పుల్లయ్యకు చాలా ఆతృతగా వుంది, ఎంతవేగిరం యీ పని అయిపోతే తను మళ్ళీ నవిరి వెళ్ళిపోదామని కలలుగంటున్నాడు. మూడురోజులై పనిలేదని యింటిదగ్గిరే వుంటున్నాడు. రాత్రుళ్ళు కొడుకూ తనూ గడపలో పడుకుంటున్నారు. నీలి గదిలో పడుకుంటోంది.

ఆ వేళ శనివారం. పొద్దున్ననుంచి పుల్లయ్యకు ఆందోళనగానే వుంది. యేమిటీ ఆలస్యమని చీరాకెత్తుతోంది. ఇదేదో అయిపోతే, తనవూరు వెళ్ళిపోదామని నీలికి, తనకూ తగూవొచ్చినా ఎలాగో సర్దుబాటు చేసుకొందామని అనకున్నాడు. తనువూరు మొంతగా మారిపోయిందో? తనూ యేదో చెక్కాముక్కా కొనుక్కొని మట్టిని నమ్ముకొని చెమటోడ్చేరైతౌతానని — మళ్ళీ అనుకున్న జన్మ తనకువస్తుందని యెన్నో విధాల అనుకున్నాడు. ఈ ఆశతో కూడుకున్న ఆలోచనలు ఈ ఆలస్యాన్ని సహింప నివ్వకండా చేస్తున్నాయ్. తను ఒంటిగా గడపలో పడుకొని యిటు అటు కదులుతున్నాడు. ఎదురుగుండా చెట్టు కొమ్మలు గాలికి కదులుతున్నాయి. కాలవకంపు ఘోరంగా వుంది. ఏదో పిట్టఅరుపు వినటానికి పసందుగాలేదు. దూరాన్న రైలుకూత:

నీలి ప్రక్కనవున్న ఇంటిగల అమ్మ వాకిట కూర్చొని ఆమె చెప్తున్న మాటలు వింటోంది. మళ్లు అమ్మ ప్రక్కన కూర్చొని ఆమె చెప్పేమాటలు వింటున్నాడు. లోకాభిరామాయణం అయ్యాక విసుగెత్తిందేమో, మళ్లు ఆయ్యప్రక్కకు వచ్చాడు. తండ్రీ కొడుకులకు నిద్దరపట్టలేదు. తండ్రికి భవిష్యత్తు ఆశాజనకంగా కనిపించడంచేత దాని విషయమై ఆలోచించుకుంటున్నాడు. కొడుకు పగటివేళ దాగా నిద్దరపోయాడు. అంచేత నిద్దరరాలేదు.

మొగుడు యింట్లోలేడేమో, పిల్లికోసం యేడ్చిన ఆవిడ రాను రాను స్వవిషయంలోనికి దిగింది. బహుశా, ఆమె జీవితంలో యెవరికీ చెప్పరాని స్వవిషయాలు నీలితో గుట్టుగా గుస గుసలాడుతూ చెప్పు

కుంటోంది — "నీలమ్మా! ఆయేల పిల్లి సచ్చిపోనేదు — నలుగురూ అని పోతారు నానే పిల్లినిసంపి. నాయేడుప్ప దానిమీదపెట్టి తీర్చుకున్నా నని....నా మొగుడి సంగతి యేడాదికాలేదుగానీ....వచ్చి....సూస్తన్నావు కదా! ఉత్తి ఆడవానికంటే అద్దోనం — నాను నోరెత్తితే పిల్లినాగై పోతాడు. నువ్వు వున్న ఇంట్లో అద్దికి ఉండేవాడు....ఎవరూ నా అనే వోళ్ళు వుండేవోరుకాదు — మొ:క్కలీసోడు — అయితే గడించుకొనే వోడు — అలాగే సుకపడేవోడు, తిండీ, తాగుడూ, ఒకటేంటి? వీధి పీదంతా నానంటె జడుస్తారా? అదేంటో ఆడిదగ్గర లొంగిపోనాను. తన్నేవోడు.ఆడుతన్నితే సుకమనిపించేది.మళ్లా యెంతో సుకపెట్టేవోడు — అబ్బాంటోడు సచ్చిపోతే — నానూ నచ్చిపోవాలనుకున్నాను. యెదవపేణం — తీపు — పిల్లిని దూరం తగిలేసి ఆ దుఃఖం, యేకిసి తీరుసుకున్నాను. నా నెప్పుడూ కళ్ళంట నీరు తెచ్చుకోనేను నీలమ్మా — అప్పుడే అదొకలాగ పిచ్చిదాన్నయిపోనాను...."

నీలి యీ ఘోషనంతనూ విన్నది. అప్పటికే చాలా రాత్రయింది. "పడుకో నీలమ్మా — ఉత్తిమనిషివి కావని" ఆవిడ లేచిపోయింది. నీలి గదిలోనికిపోయి పడుకున్నా మళ్లు వుండీ వుడిగీ అయ్యకు వేస్తున్న ప్రశ్నలు వింటూ వింటూ అలా నిద్దరపోయింది.

కాలం దొర్లిపోతోంది. కానీ పుల్లయ్యకు కునుకురాలేదు. ఆ చెట్టువేపు చూస్తున్నకొద్దీ దూపోషూ బంగారమే అగుపిస్తోంది. ఆశతో ఆలోచనలు అల్లల్లాడిపోతున్నయ్. కొడుకుమీద పడుకొని చిన్న చిన్న కూనిరాగాలు తీస్తున్నాడు. తీస్తూ తీస్తూ వుండగానే వాడికి కండ్లు బరువెక్కిపోయాయి.

ఇంతలో పుల్లయ్య యింటి యెనుకగా యిద్దరునిల్చున్నారు. పుల్లయ్యకు వాళ్ళను చూడగానే ఆ ఆకారాలనుబట్టి పోల్చుకున్నాడు.సంతోషంతో లేవబోయి కొడుకును ప్రక్కకు వేస్తే వాడు లేచిపోయాడు.వాడ్ని మెల్లగా తట్టి లేచేసరికి లేచి వెంటపడగానే పుల్లయ్యకు పట్టరాని కోపం వచ్చింది — వాళ్ళని సైగచేసి నీలి యెక్కడ లేచిపోతుందనో మెల్లగా తిరిగి వచ్చి వాడిని వక్షంమీద వేసుకొని కాసేపు జోకొట్టినట్లుగా ఒళ్లు తడిమాడు.

ఆ చిన్ని హృదయంలో అప్పుడే సంశయం పొడసూపింది---ఈవేళ యెలాగైనా తనను అయ్య రానివ్వడని నిశ్చయించుకున్నాడు. ఆరోజు రాత్రిలా అయ్య వెనకాలే మెల్లమెల్లగా అయ్యకు కనపడకండా అనుసరించాలని నిశ్చయించుకున్నాడేమో నిద్రపోతున్నట్లు నటించాడు. పుల్లయ్య కొద్దిసేపయ్యాక నుల్లని మెల్లగా పక్కమీద వేశాడు.కొడుకు నిద్రపోతున్నాడని నిర్ధారణచేసుకున్నాక మెల్లగా లేచి అడుగులు ముందుకువేస్తుంటే కొడుకు కళ్లుతెరచి చూస్తున్నాడు.

అదిగో ...ఆ రోడ్డుచివర, అయ్య ఆ యిద్దర్నీ కలుసుకున్నాడు. లేస్తే కనిపించిపోతానని యింకా అలా చూస్తూనే ఉన్నాడు. ముగ్గురూ కదిలి ఒకమూలకు చేరుకున్నారు. అక్కడ నిల్చున్నాక చంద్రయ్య గొణిగాడు. "తలుపుతీసుకొని వీ దొక్కడే మేడమీద పడున్నాడు. ఇంట్లోవాళ్ళంతా పెళ్లికి పోనారు. అంతా రడీగా వున్నాది. ఆడిదగ్గర పిస్తోలు వున్నాదట. ఒళ్ళంతా కళ్ళు పెట్టుకొని పనిసెయ్యాల. ఇలాగ యెల్లేటప్పుడు యెవడైనా పోలీసోడడిగితే రెండో ఆట సినీమానించి వస్తున్నాం. సముద్రపొడ్డున పడుకోడానికి పోతున్నాం అని సెప్పాలి" తరువాత ముగ్గురి చేతులు ఒకదానిమీద ఒకటి ఆన్చి "మన దినాలు బాగులేక మనల్లో యేఒక్కరు దొరికినా ఆ దేముడు తోడుగా మిగతా యిద్దరిగుట్టూ పీక తెగినా సెప్పకూడదు" అని ముగ్గురూ ప్రమాణ స్వీకారంచేసారు. చంద్రయ్య ఇంకో విషయంకూడా చెప్పాడు. మిగతా వాళ్లు వెంటనే దొరికిపోయినవాడియింటికి వెళ్లి పోలీసులు కొట్టినా తిట్టినా తమకేం తెలీదని చెప్పినట్లు చూడాలని, దొరికినవాడు కూడా తను దొంగతనం చెయ్యలేదని చెప్పాలని మరీ మరీ చెప్పాడు.

ఇక ముగ్గురూ కాలుకదపటం యీ చిన్నికళ్ళకి కనుపించాయి. అయ్యతో నున్న అన్న. చంద్రయ్యను గుర్తుపట్టాడు. వారు రోడ్డు మలుపుతిరిగారు. కంటికి అగపడలేదు. గబగబ లేచాడు -రోడ్డు చివరకు వెళ్ళి తొంగిచూశాడు -ముగ్గురూ అగుపించారు. అదిగో--- చెత్తలదొక్క---వొంగొని ప్రాకుతూ ఆదొక్కచాటునుంచి చూశాడు. అయ్యవెనుకకు చూశాడు. కాని, కొడుకు యిలా వచ్చాడనీ, యీ

చాటున వున్నాడని యెలా తెలుసుకుంటాడు? —మళ్ళీ యింకోసందు.... యీ సందు తనకు బాగా తెలుసు — యెన్నిసార్లో ఈ సందుత్రోవ తిరిగాడు....ఇక్కడే ఇదిగో ఆవీధిపిల్లలు గోళీకాయల ఆట ఆడుకొనే వారు. తనూ చూసేవాడు సరదాగా. తన బడీ ఈ సందులోనేకదా.... వీధిలో చీకటిగా వుంది—వాళ్ళు వెళ్ళిపోవటం కాలవలో వంగి మరీ చూశాడు—చీకటైనా ముగ్గురూ ఆగడం తనకు కనిపించింది.—అలా కాలవప్రక్కనుంచే నడ్డివంచి నడిచాడు— అదిగో చెత్తలడబ్బా ఆ చాటున కూర్చొని వంగి చూస్తుంటే ఆ చుక్కల మిసమిస వెలుగులో ఆ తెల్లని గోడలుగల మేడమీదికి ప్రాకుతున్న మనుషులు స్పష్టంగా అగుపిస్తున్నారు. ఆశ్చర్యంగా రెప్పవెయ్యకండా చూస్తున్నాడు.ఎక్కడ లేని కోరికా తనను వుత్తేజపరుస్తోంది. అయ్యలాగ తనూ ఆమేడపైకి యెగ ప్రాకాలి—కానీ అయ్యకి తను అక్కడికి వచ్చానని తెలిస్తే.... అమ్మతో ఆసారి చెప్పితే కొట్టాడుకదా—అసలే మాటాడను అనుకొని అలా నోరుకట్టుకొని చూస్తున్నాడు.

ఇంతలో తనకు కుక్క అరుపు వినిపించింది. ఆ అరుపు వినిపించేసరికి చివరివాడు సగంవరకు యెగబ్రాకాడు. ఆగిపోయి మళ్ళీ యెగబ్రాకుతున్నాడు....

మేడవీధివేపు వుండుండి బౌబౌమనీ అరుస్తున్న కుక్క బూచోడు "పడుకోర నాయినా!"అని అంటున్నా అరుస్తోంది. సగం నిద్దరనుంచి మేల్కొన్న బూచోడు ఇటూ అటూ తేరిచూశాడు....చీకటిగావుంది. కుక్క తనదగ్గరనుంచి ఒక్కగెంతుగెంతి అదేపనిగా అరవగానే బూచోడు లేచి దానిదగ్గరకు వచ్చాడు. మేడవేపు చూడగానే చివరివాడు మేడయెక్కిపోవడం చూశాడు. వెనువెంటనే కుక్క అరుపుతోబాటు "ఒరేశ్రీనీ దొంగలుదూరారురా....దొంగలురా....దొంగలురా—దొంగ" లంటూ పెద్దకేకలు పెట్టసాగాడు. ఆ కేకలు కుక్కఅరుపు శ్రీనివాసరావును మేల్కొల్పాయి. ఇంతలోనే ధన్ ధన్ అన్న ప్రేలుడు శబ్దం వినిపించింది.

కొద్ది క్షణాలు అంతా భయంకరం అనిపించింది. మల్లుకూడా భయంవేసి ఆ చెత్తల దొక్కలోనికి దిగిపోయి దగ్గరకు ముడుచుకొని

ఒకమూల కూర్చున్నాడు. అయ్య మళ్లీ ఆ గొట్టం పట్టుకొని దిగిపోతా డేమోనని కళ్ళప్పచెప్పి చూస్తున్నాడు. ఆ డొక్కు ప్రక్కనుంచే మనుషులు పరగెత్తుతున్నచప్పుడు వినిపిస్తోంది. ఎందరి గొంతుకలో వినిపిస్తున్నయ్, ఇంతలోనే లారీలువచ్చే శబ్దం—అవన్నీ వింటుంటే ఆ చిన్నప్రాణం ఆ డొక్కులో యెవరికీ కనిపించకుండా చెత్తలో చెత్తయి, మురికిలో మురికై - రెండు నక్షత్రాలులాంటి కళ్ళతో భువినుండి ఆకాశంవేపు చూస్తున్నది. ఆ కళ్ళు నిరీక్షిస్తున్న పని యెంతకీ జరగలేదు". "అయ్య దిగలేదు. మా అయ్య రాలేదు....మా అయ్య యెప్పుడొస్తాడు? మా అయ్య యెప్పుడొస్తాడు? మా అయ్యరానిది నాను కదలను!" అని ఆ చిన్నప్రాణం బితుకుబితుకు మంటూనే పట్టుదల చూపుతోంది.

చాలాసేపటికి కోలాహలం తగ్గింది.మనుషులు తిరిగి వెళ్లిపోతున్నారు బూచోడూ,కుక్కగురించి చెప్పుకుంటున్నారు, దొంగలుగురించి యేదో అనుకుంటున్నారు.కాని మళ్లుకియేమీ చెవినిపట్టలేదు.విన్నముక్కలయినా అర్థంకాలేదు. "మా అయ్యని ఆయేళ తెషినిడగ్గర అలా కొట్టేసినారు-ఇక్కడా అలాగ సేస్తన్నారా. నా నెందుకుండి? మా అయ్యని కొట్టినోళ్లని కరిసేస్తాను-యెల్తాను....యిప్పుడెల్తే....ఆ మేడ యెక్కగలనా? ఎక్కితే మా అయ్య నన్నుచూసి యేల వచ్చినావని కొట్టడా?మాఅయ్యకి యెవుడైనా కొడ్తే ఆ లిద్దరూ ఊరుకుంటారా?" ఇలా పరిపరి విధాల ఆ చిన్ని హృదయం ఆ చెత్తగృహంలోనే, ఒకప్రక్క కంటిదెప్పలు బరువెక్కుతున్నా ఓమూల కంపుతో ఒళ్ళంతా తెములుతున్నా ఆరాటం జెందుతోంది!"

చూసి చూసి కన్నులు కాయలుకాసిపోయాయి. అంతా నిశ్శబ్దం ఆవరించింది. నల్లటి ఆకాశాన మిణుకుమనే చుక్కలూ—తనచుట్టూ రకరకాల వస్తు సముదాయంతో యేర్పడ్డ చెత్త యీరెండే తోడయ్యాయి. చివరికి విసుగుజెందిన మనసుకు వొక ఆలోచన తట్టింది. "ఆయ్య ఆతోవన యింటికి యెలిపోనాడేమో; లేకపోతే అలగ ఓడ దించడానికి యెల్లిపోనడేమో!యెళ్ళి పొద్దులేసినకాడ చూస్తాను" అని

అనుకొని మెల్లగా లేస్తూ చుట్టూ చూశాడు. అంతా చీకటిగా నిశ్శబ్దంగా వుంది. భయపడి వచ్చినత్రోవవెంబడే యింటికి పరుగెత్తాడు. గడపలో అయ్య లేడు.అలాగ అయ్యకోసం యెదురుచూస్తున్న కళ్ళు చాల సేపటికి గానీ మూతపడలేకపోయాయి.

39

నీలి తెల్లవారుఝామునే కొడుకును లేపి "అయ్యేడీ" అని అడిగింది. మల్లు ఆదరా బాదరా లేచి అక్కడనుంచి పెరటికి వెళ్ళిపోయాడు. నీలి పెరటికి వెళ్ళి రెట్టించి అడిగింది. ఆ చిన్ని మనసుకు అబద్ధం ఆడటం చేతకాక, అంతా చెప్తే అయ్యకి కోపంవస్తుందని నోరుమూసుకున్నాడు.

నీలి ఓక్షణం రెట్టించినా జబాబు రాకపోవటంవల్ల యెక్కడకో బయటకు వెళ్ళివుంటాడని వూరుకుంది. మల్లు వీధిలో ఇటూ అటూ తిరుగుతూ అయ్యకోసం చూస్తున్నాడు. ఉదయభానుని కిరణాలు యేటవాలుగా పడుతున్నాయి. ఎవరిపనులు వారు చూసుకుంటున్నారు. ఆవాటంతో, దిగులుతో నిండిన యీ చిన్ని మనసుకు కాలం జాలం తెలియటంలేదు. "అయ్య యింకా రానేదు. అయ్యకి యేం అయినాదో?" అనుకోసాగాడు. అయ్యనిగురించి ఆలోచిస్తున్నకొద్దీ యెదుటివాళ్ళపై కోపం ముంచుకొస్తోంది. గబగబ యింటిలోకి వెళ్లాడు. ఇటూ అటూ చూశాడు. కర్ర అగుపించలేదు. పెరటికి వెళ్ళి తడకలోని వెదురుపుల్ల విరిచాడు. నీలి యింత ప్రొద్దెక్కినా, భర్త రాకపోవటంతో మల్లుని పట్టుకుని గట్టిగా అడిగింది. వాడు చేతులతో నోరు మూసుకోవటంతో, కోపం విసుగూ ఆమెను చుట్టివేశాయి.ఎందుకో ఆమెకు భయం భయంగా అనిపిస్తోంది. ఎక్కడో యేదో అపకారం జరిగిపోయినట్లు మనశ్శాంతి లేకండా అదోలా అయిపోతోంది.

తల్లిచేత ఒక దెబ్బతిన్నా ఖాతరుచేయక మల్లు గబగబ చేతినున్న యెదురుపుల్లతో వీధిలోపడి గబగబ మందుకు పరిగెత్తాడు.నరిగా రాత్రి వెళ్ళిన త్రోవగుండానే ఆవేశంతో పరుగెత్తాడు. రాత్రి దాగున్న

చెత్తల దొక్కుదాటి ముందుకు సాగిపోయాడు "ఇదిగో యీ మేడ లోకే మాఅయ్య వచ్చాడు. వీళ్ళ మాఅయ్యని దాచేసినారు...." అనుకొని ఆ యింటిలోకి ముఖం పొంగించి కోపంతో "మా అయ్యని యిత్తారా లేదా?" అని అరుస్తూ పరుగెత్తాడు.

ఎదురుగావున్న నౌకరీమనిషి ఆ కుర్రవాడి దుడుకుతనానికి అబ్బురపడి అలా వింతగా చూస్తున్నాడు. మళ్లు కర్రతో నేలమీద గట్టిగా కొట్టి "మా అయ్యని వదలకపోతే అందరినీ యీకర్రతో కొట్టేస్తాను" అని అరుస్తూ మళ్ళీ క్రింద నాలుగుసార్లు గట్టిగా కొట్టాడు.

ఇంతలో లోపలనించి కాకీదుస్తులతో ఒకమనిషి రావటం చూసి మరికాస్త గట్టిగా

"ఉఁ....మా అయ్యనివ్వండి" అని అరిచాడు. నౌఖరీమనిషి యేదో అనబోతున్నా అనటానికి ఆస్కారం మళ్లు యీయలేదు. ఆ పోలీసు యిన్‌స్పెక్టరు వస్తూనే నౌఖరుతో నవ్వుతూ "ఈ పిల్లాడికి బిస్కత్తులు యిష్టం — తీసుకురా వేగం" అన్నాడు. నౌఖరు బయటకు వెళ్ళాడు. ఇంతలో ఇంటినుంచి మరికొందరు వుద్యోగులు చేరారు.

మళ్లు ఆవేశం ఇంకా తగ్గలేదు. ఆ వాగ్ధాటి ఆగలేదు. ఇన్‌స్పెక్టరు నవ్వుతూ "మీ అయ్య రాలేదు!"

"రాలేదా? ఆఁ రాతిరి రానేదా?"

"తలుపులు యేసుంటే యెలావస్తాడు?"

"మాఅయ్యా మరిద్దరూ అలాగ గోడెక్కి రానేదా?" నిష్ఠూరంగా మళ్లు మాటాడుతూ మళ్ళీ పౌరుషంతో: "మా అయ్యని వదిలేయండి— మా అయ్య మా మంచోడు!"

బిస్కట్లు వచ్చాయి. ఇన్‌స్పెక్టరు నవ్వుతూ "మీ అయ్యని వదిలేస్తాం. ఇవి ముందు తిను" అని చేతిలో పెట్టుంటే అవి దూరంగా విసిరేసి "నాకొద్దు — మా అయ్య కావాల!"

"ఒక్కటైనా తిను" అంటూ విసిరేసిన బిస్కట్లు మళ్ళీ చేత పెట్టినా పుచ్చుకోక "మాఅయ్య నిస్తావాలేదా?" అంటూ కర్ర ఇన్‌స్పెక్టరు వేపు కత్తిలా ఝళిపించాడు.

ఇన్‌స్పెక్టరు ప్రసన్నవదనంతో "మీ అయ్యపేరు చెప్పితేనేగాని యెలాగిస్తాను?" అన్నాడు.

"ఇస్తావా?"

"ఇస్తాను!"

"మా అయ్యపేరే తెలీదా? — పుల్లయ్య!"

"మరి మీ అయ్యతోవున్న యిద్దరిపేర్లో?"

"మా అయ్యపేరు సెప్తే మా అయ్యనిస్తానన్నావు?"

"ఇస్తాను. నేను అడిగినవన్నీ సెప్తేనే మీ అయ్యనిస్తాను"

"ముందు మా అయ్యని సూపించు!"

"నే నడిగినవన్నీ చెప్తేనే నీకు అయ్య, లేకపోతే, వెళ్ళిపో!"

"నేను యెళ్ళను — నాకు అయ్యనిచ్చి యెళ్ళిపోతాను" అని గద్దింపుతోను, ప్రార్థనతోమా మిళితమైన స్వరంతో అన్నాడు.

నౌకరుతో; "ఈ కుర్రాడిని బయటకు పంపించు" అని ఇన్‌స్పెక్టరు అనగానే వాడు మల్లుచెయ్యి పట్టుకున్నాడు. ఆ కర్ర రెండోచేతికి తీసుకొని ఆ నౌఖర్ని కొట్టబోతుంటే ఇన్‌స్పెక్టరు ఆ కర్ర లాగుకున్నాడు. మల్లు గుంజాటనపడి నౌకర్ని కరవబోయాడు. కాని లాభం లేకపోయింది. బయటపడినా ఒకటే యేడుపు. కోపంతో మధ్యమధ్యను లేచిపోయి "మా అయ్యని యివ్వకపోతే - మీ అందరినీ యేంచేస్తానో సూడండి! మా అయ్యసేత మీ అందరినీ కొట్టించేస్తాను. మా అయ్య .....అయ్య.....అయ్యా!" అని చివరకు కేకలువేశాడు. గొంతుక పట్టుకుపోయింది. భయంపెట్టే లొంగే ఘటంకాదని తెలుసుకొన్న ఇన్‌స్పెక్టరు కొంతసేపయ్యాక నవ్వుతూ బయటకువచ్చి "నే నడిగిందిచెప్తే — ఇప్పటికి మీ అయ్యనిచ్చేద్దును — రా-లోపలికి రా-మీ అయ్యని చూద్దువుగాని," అనగానే మల్లు ఒక్కసారి వురకలువేసుకొంటూ లోనికి వెళ్ళాడు. ఇన్‌స్పెక్టర్ మల్లుమీద చెయ్యివేసి పేరు కనుక్కొన్నాక, మల్లు మంచోడు - పుల్లయ్య మరీ మంచి కాదా మల్లూ?" అన్నాడు.

ఈ పొగడ్త ఆ లేత హృదయానికి యెక్కడలేని తృప్తిని యిచ్చింది. నవ్వుముఖంతో "మా అయ్య మా మంచోడు!" అన్నాడు.

అలా ఆ కుర్రవాణ్ని పైకి లేవనెత్తి గిరగిర త్రిప్పుతూ "మల్లూ! మీ అయ్యతో ఇద్దరొచ్చారు కదూ? వాళ్ళ పేర్లు?"

"అన్న——సెంద్రియ్య!"

"వాళ్ళు యెలాగుంటారు?"

"ఒకడు అదిగో ఆడిలాగ, యింకొకడు నీలాగ" అంటూ పొట్టి పొడుగులను చూపించాడు. యిలా ఆ కుర్రవాణ్ణి నవ్వించి, మరపించి, మంచిచేసుకొని ఆ దొంగలు యెలా యెగ్రాకింది, తనుయెక్కడనుంచి చూసింది, అంతా గుట్టు లాగారు. అయ్య యేంపని చేసేవోడంటే వోడలు దించేవాడని——రాతిరిపనే అని చెప్పాడు. ఇంకెంతసేపో ప్రశ్నలువేయకేకపోయారు. కుర్రవాని మరచిపోయిన ఆత్మత మళ్ళీ పొడచూపింది. వేధిస్తుంటే ఇన్స్పెక్టర్ "ఉండు, నేనే మీ అయ్యను తీసుకొస్తానని" లోపలికి వెళ్ళాడు. కొద్ది క్షణాలలోనే ఒక క్రొత్త మనిషితో తిరిగివస్తూ "పెద్ద ఓడ వచ్చిందట!సరుకు దించడానికి మీఅయ్య పరుగెత్తాడు. మా మల్లు వస్తే రాతిరికి వస్తానని చెప్పమన్నాడట! నీవు యింటికెళ్ళి ఆడుకో. మీ అయ్య రాతిరికి వస్తాడు!" అన్నాడు.

ఆ చెప్పే విధానం, దానికి ఆ వచ్చిన క్రొత్తమనిషి సాక్ష్యం ఆ లేత మనస్సును నమ్మించాయి. తిరుగుముఖం పట్టే ఆ కుర్రవాని వెంబడి ఇన్స్పెక్టరుకూడా పడ్డాడు. మల్లు యింటిలోనికి వెళ్తుండగా చూసి ఆ యిల్లు గుర్తుపట్టాడు.

ఇంటికివెళ్ళి అమ్మతో అయ్య ఓడదించడానికి వెళ్ళాడని అమ్మ అడగకుండానే చెప్పాడు. సాయంత్రంవరకు యెటూ కదలకండా యెదురుచూస్తూ కూర్చున్నాడు.

చీకటిపడింది. అయ్య యింకారాలేదు. నిముషం గడిచినకొద్దీ ఆ లేత మనస్సులో మధనం అధికమై, కళ్ళల్లో నీరు చిమ్ముతోంది. నీలికూడా ఆత్మతగా యెదురుచూస్తోంది. ఇరుగు పొరుగువాళ్ళు ఎక్కడో భాగ్యవంతుల యింట్లో రాత్రి దొంగలు పడ్డారని ఆయన పిస్తోలు పేల్చినా దొంగలు దొరకలేదనీ విన్నది.

"వాళ్ళకేం పోయేకాలమమ్మా! దొంగబతుకూ ఒక బతుకేనా?" అని నీలి అందుకుంది.

"దోచుకెళ్ళిపోయినా పూచీలేకపోనట! ఆ బాబుబ్ర బద్దలు చేసినారట — బతికితే అదృష్టమంతుడేనట — ఆస్పత్రిలో వున్నాడట!"

నీలికి తన తలే బద్దలైనట్లు అనిపించింది. "రామ రామ — ఆ బాబు లేచిన వేళ అలాంటిది" అనుకుంది.

పొరుగమ్మ అందుకుంది: "ఆ డబ్బు ఆడిది కాదట! యెవు రిదో కలిసొచ్చిందట. ఎలాగొచ్చిందో అలాగే పోతాదని అనుకుంటే ఆ బాబు పేణంమీదికి రాకపోనట! పిస్తోలు గాలిలోన పేలించినాడట — యెదరగా పేలిస్తే అందరూ సచ్చిపోదురట!"

జేబుదొంగ పెళ్ళం మాటామాటా కలిపి "మా సెద్దోడట! అలాంటోలికి అలాగే కావాలకే!" అంది.

నీలి చప్పున "అదా తల్లీ సబబు చెప్పినావు! యెంత మంచి మారాజు కాకపోతే, పిస్తోయి గాల్కో పేలుస్తాడు? సెద్దోడైతే దొంగలమీదే పేలించేసును! అలాంటి బాబుకి అన్నాయం జరగదు. ఆ బాబు బతికి బయటపడడా! పడతాడు" అంది.

ఇలా వాళ్ళలోవాళ్లు చాలాసేపు మాటాడుకున్నారు. ఎనిమిదిగంటల రాత్రయినా ఇంకా పుల్లయ్య యింటికి చేరకపోవటంతో మళ్లు "అయ్యా!" అని యేడుస్తున్నాడు. వాడికి అయ్య రాలేదని దుఃఖంతో పాటు అయ్యమీద కోపంకూడా అధికం కాజొచ్చింది. నీలికికూడా యేం చెయ్యటానికీ తోచటంలేదు. ఆమెకూడా అలా వాకిట తూర్పొని వచ్చే పోయేవాళ్ళవేపు చూస్తోంది. తిండీతిప్పలు లేకుండా తల్లీ, కొడుకూ అలా చూస్తూనేవున్నారు. పదిగంటల రాత్రయింది. జనసంచారంలేదు. ఎదురుగానున్న చెట్లకొమ్మలు వుండుండి గాలికి కదులుతున్నాయ్. నిరాశ ఇద్దర్నీ ఆ చీకటిలాగే క్రమింగివేస్తోంది.

అంతదూరంలో ఎవరో మనిషి వస్తున్నట్లగపడింది. వస్తుండగానే మళ్లు ఒక్క యెగురుయెగిరి "అడుగో అయ్య!" అంటూ ముందుకు పరుగులెత్తాడు. అయ్యను ముందుకు కదలనివ్వకుండా కాళ్లుపట్టుకొని యేడుపూ నిష్ఠూరంతో యేవేవో అనేస్తున్నాడు. అయ్య కొడుకుని యెత్తుకున్నాడు; ముద్దులాడాడు. కానీ చేతిముడకుది రాపాడి రక్తం వచ్చిందేమో నొప్పిగావుంది. ముఖంమీద దేనికో ఢీకొనటంవల్ల తగి

లిన దెబ్బవల్ల బొడిపికట్టివున్నది.మల్లు ఉత్సాహంగా అయ్య ముఖంలో ముఖంపెట్టి తడుమగా ఆ బొడిపి తగిలింది. ఆత్మతతో "అయ్యా!దెబ్బ తగిలిందా?ఆలు కొట్టారా?" అన్నాడు.

పుల్లయ్యకు ఈ చివరప్రశ్న అయోమయంగా అనిపించింది. చప్పున "ఎవరు?" అన్నాడు.

"ఆ పెద్దమేడోలు కొట్టారా? ఆలకి దబ్బుడుదుబ్బుడు యేసేద్దం యీ రాతిరికి యెల్లి!" చాలాదయతో అన్నాడు.

పుల్లయ్య నిర్విణ్ణుడైనాడు. చప్పున మాటరాలేదు. కొడుకు మాటలు ఆపటంకూడాలేదు. ఆవేళ ప్రొద్దున్న తను కిరపట్టుకొని పెళ్లినట్లు "ఓడదించడానికి యెల్తన్నానని నానువస్తే ఆలకి నెప్పేమని నెప్పినావుకదా!" అని యిలా చెప్తుంటే యేం జరిగిందో వూహించుకొన్న పుల్లయ్య, ఇంట్లోకి వెళ్ళటానికి భయంవేసింది. ఆ మల్లుని అక్కడే దించి యెదురుగా నీలి అగపడుతున్నా వెనుకకు పరుగెత్తిపోవాలని వుబలాటపడుతున్నాడు. కానీ ఆమె ఒక తాడుతో తనను బిగించి ముందుకు లాగుతున్నట్లు అనిపించింది. అంతలోనే కొడుకుమీద అమిత కోపం చిరాకు వచ్చేశాయి. నీలి అలా సంశయంతో నిల్చున్న మొగుడు వేపు నాలుగడుగులువేసి వచ్చింది.

"ఇంట్లో నెప్పవాయె ఎవెళ్ళిందీ?ఆడు యేడ్చి యేడ్చి వున్నాడు. నాకు బెంగగా వున్నది!"

ఈ మాటలు ఆమె నోటిలోనే వున్నాయ్. రెండు వేపులనుంచీ యెపరో వస్తున్న పాదాలచప్పుడు. నీలి అటువేపు యింకా చూడనేలేదు. పుల్లయ్య ఆదరా బాదరాగా కాలువవేపు వెళ్ళిపోతున్నాడు. వాళ్లూ అటువేపే....ఇంతలో అక్కడ బేటరి దీపాలు వెలగనారంభించాయి. ఇటూ అటూ యెర్రబొపీలతో పోలీసులు. నీలి కిదంతా అయోమయం అనిపించింది. అంతా ఒక భయంకరమైన కలలా తోచింది. ఆమె కాళ్ళు గజగజ వణక నారంభించాయి. ఇంతలో కేకలు "పట్టుకో దొంగని!" అని వినిపించాయి,

"ఎవ రా దొంగ?"

తన మొగుడా? తన మొగుడా దొంగ? తను దొంగ తాలూకు పెళ్ళామా?—కాదు కాదు—ఇదంతా యేదో మాయ—ఏదోకల—ఇది నిజంకాదు.....

దొరికిపోయిన దొంగచేతులకు బేడీలు పెట్టటం ఆమె కళ్ళతో చూసింది. వీధంతా మేలుకొంది. ప్రజలంతా చుట్టుముట్టారు. ఇంత మంది మధ్య తలవంచుకుని నిల్చున్నాడు దొంగ—పుల్లయ్య! మనిషో మాట - మనిషోకూత! తన ఇరుగూ పొరుగూవాళ్ళే అనరాని నానా దుర్భాషలాడుతున్నారు. ఆ మంచి బాబు తల బ్రద్దలుగొట్టిన దొంగ ఆమెమొగుడు!

నీలి ఇవన్నీ వినలేకపోయింది. ఇవన్నీ కనలేకపోయింది.ఆమెకు గుండెదడ పట్టుకొని సగం సచ్చి నేలకు ఒరిగిపోయింది. వెంట పరుగెత్తినా వెనుకకు ప్రోయబడ్డ మల్లు ఒకే కంఠంతో గగ్గోలుపెడ్తున్నాడు. దొంగతో పోలీసులు ముందుకు సాగిపోతున్నారు. వాళ్ళవేపు చూడలేక చూడలేక చూస్తోంది. ఆ ప్రజ కదలిపోతున్నారు—కదిలిపోయారు! కాళ్ళు చేతులు కొట్టుకొని కొడుకు యేడుస్తున్నాడు.

అంతా చీకటి—ఆ చీకటిలో ఏకాకి తను - ఆమెకు యెక్కడ లేని దుఃఖమూ ముంచుకొచ్చింది. మళ్లీలేచి పరుగెత్తి అయ్యని వెంబడించాలని ఉరుకుతున్న కొడుకును వారిస్తూ గుంజాటన పడుతోంది. చాలా సేపటికి ఇద్దరూ అలసిపోయారు. మెల్లమెల్లగా కొడుకుని యెత్తుకొని ఇంటిలోకి నడిచి కూలబడిపోయింది.

40

ఆ రాత్రి నయాన భయాన్న అడిగినా పుల్లయ్య పోలీసుస్టేషనులో "నా కేమీ తెలీదని" చెప్పాడు. చివరకు లాఠీదెబ్బలతో ఒళ్ళంతా హూనంచేసినా యిలా చచ్చిపోతానుగానీ నేనేగుట్టూ ఇవ్వనని భీష్మించుకున్నాడు. విసుగెత్తిన పోలీసులు యీడ్చి యీడ్చి లాకప్‌లో వుంచారు. హూనమైన శరీరం బాధపెట్టుంటే పుల్లయ్యకు కళ్ళలో నీరుకూడా తిరిగి

పోతోంది. అలా ఆ కొట్టులో ఇనప కటకటాల వెనుక కూలబడి పోయాడు. ఆ బాధలో ఏవేవో అనుకున్నాడు; గొణుక్కున్నాడు. తనలో తనే తిట్టుకుంటున్నాడు; నెత్తి నెత్తీ కొట్టుకున్నాడు. అలా వేకువఝామువకుగానీ మాగన్నుగా నిద్దరపట్టలేదు. ఆ కొద్దిసేపైనా యే వేవో కలలు. అందులో పోలీసులు అగుపించారు; తెలివి వచ్చేసరికి ఒళ్ళంతా పచ్చిగా వుంది. కదలలేనంత నీరసం అనిపించింది. "మల్లు ఎంతగా యేడుస్తున్నాడో! నీలి ఎలాగ బతుకుతాది? ఏందారి!" అని వాపోయాడు.

నిల్చుంటే నిలవలేకపోయాడు. ఆకలి బ్రహ్మాండంగా వుంది; శరీరం అంతా దిగ్గుట్లు పొడిచినట్లు యే కీలు కా కీలు విరిగిపోయినట్లు యెక్కడి కండ లక్కడ తెగినట్లుఅనిపించింది!

ఆ రోజు పుల్లయ్యను సెంట్రల్ జైలుకి పంపించారు.

నీలికి ముందు రాత్రంతా యెంత ప్రయత్నించినా నిద్దరరాలేదు. జరిగినవన్నీ జ్ఞప్తికి వస్తున్నాయి. ఏడ్చి ఏడ్చి పడున్న మల్లు నిద్రపోతున్నాడు. తలుచుకున్నకొద్దీ మొగుడు అప్పుడు ఆడిన అబద్ధాలను నిజాలుగా యెలా తీసుకోగలిగినానని అబ్బురపడింది. "ఆడికి పని దొరకకపోతే నాను ఎక్కడైనా పాసిపని చేసి పోషిద్దును. ఎగిరే పిట్టకి మసాల రాసిన మనిసైపోనాడు! మనరాత బాగులేనప్పుడు ఏ కూలిపని సేసినా తప్పేంవున్నాది? ఈయేళ ఒకడితల కొత్తే బుణం వుండిపోతాదా? ఇక్కడ తీర్చకపోతే అక్కడ తీర్చడా? కానలేకపోనాను. ఇలాగ గొంగళిపురుగులాగా? అయిపోవాలా"

ఆమె యిలా తల్చుకొంటూ కడుపు చెరువుచేసుకుంది. కాని ఆమెకు యీ దుఃఖంలోనూ. విచారంలోనూ మామ్మ జ్ఞప్తికివచ్చింది. ఆమె చనిపోతూ చెప్పిన మాటలు నెమరువేసుకుంది. "అవును మామ్మ సెప్పింది నిజం! ఆడు అలాగైనాడని నాను యిలాగ యిసారిస్తూవుంటే పిల్లలగతేం అవుతాది? యేదిపోయినా బతకొచ్చు - ధైర్యంపోతే యిం కేంవున్నది?" అని మామ్మను తలచుకొని గుండె ధిట్టంచేసుకుంది. నీలమ్మతల్లికి మ్రొక్కుకుంది.

ప్రొద్దున్న యిరుగుపొరుగువాళ్ళు ఆమెను ఒక వెలివేసినమని షిలా చూశారు "దొంగోడి పెళ్ళం దొంగే" అని వ్యాఖ్యానించిందొక తల్లి. దీనికి తెలీకుండా యేపనౌతాది. ఇలాంటోలకి అద్దెలకు ఆశపడి యివ్వడం యీధిపరువుపోవడం" అని యింకో ముసలాడు ఛర్రుమన్నాడు. "ఆడిపని అయిపోనాది: దీనిసంగతి సూడండి — ముక్కూ ముఖం తెలియనివాళ్ళని యీధిలోన వుంచడం తప్పని" యింకోఅమ్మ అట్టహాసంచేసింది. "ఒక్కడ్నుంచి యీధంతటిమీదా పోలీసులు నిగా వుంస్తారని" జేబుదొంగ నలుగురిలోను గొడవచేశాడు.

ఇవన్నీ విన్న నీలి మౌనంగా, శాంతంగా మనుసులో నీలమ్మ తల్లికి "యివన్నీ పడేబలం యీ తల్లీ!" అని మొక్కుకుంది. యెవరే మన్నా ఆ గొంతుక పెగలలేదు. యెదురు మాటాడలేదు.ఆమె ధైర్యాన్ని మళ్లు అయ్యకోసం యేడుస్తూ కొంత సడలింపజేస్తున్నాడు.

పోలీసులు బలవంతాన తీసుకవెళ్ళి ఏమడిగినా యేడుపు తప్పించి ఇంకేమీ వాడివద్ద జవాబు రాలేదు. ఎన్నివిధాల ప్రయత్నించినా మళ్లుని మాట్లాడించలేకపోయారు. ఇంటికి తిరిగివచ్చి అయ్యని మరిపించడానికి నీలి ఏమిచెప్పినా లాభంలేకపోయింది. ఏడుపు తగ్గాక మరుచటిరోజు తీసుకవస్తానని పోలీసులతో నీలి చెప్పి వాళ్ళను పంపించింది.

అలా యేడ్చి యేడ్చి రాత్రి తొమ్మిదికి మళ్లు నిద్దరపోయాడు. పిల్ల చాలాసేపటికి క్రితమే తినగానే నిద్దరపోయింది. నీలికి ఆకలి వేస్తున్నా తిండిమీద మనసుపోలేదు. అలా వాకిట కూర్చొని శూన్యం లోకి చూస్తోంది — ఇంతలో ఒక సాధువు "మాదకవళం తల్లీ" అంటూ ఇరుగు పొరుగు ఇళ్ళు చూడకుండా ఆమెదగ్గరకే వచ్చాడు. నీలి లేచి వున్నదాంట్లో సగం తెచ్చి ఆ డొక్కులో వేయగానే ఆ సాధు "చాలా కష్టంలో వున్నావమ్మా!" అన్నాడు.

"అవును బాబూ!"

"నాకు తెలుసును - నీ మొగుడు పోలీసులచేతిలో వున్నాడు. నీ గుండె తామరాకుమీద నీటిబొట్టులా వున్నాది. నేను చెప్పినట్లు వింటివా మీరంతా సుఖపడ్తారు. ఇది భగవంతుడి ఆజ్ఞ!" అన్నాడు.

ఆమె సవినయంగా నిల్చొని "సెప్పు బాబూ!" అన్నది.

సాధువు నేల కూర్చోగానే ఆమె అంతదూరంలో కూర్చుంది. సాధువు మెల్లగా "నీ మొగుడ్ని కలిసినాను. పోలీసులు యేవడిగినా నాకు తెలీదను. నీ క్రొడుకుసేత యేమీ మాటాడించకు. ఆలు కొటనీ, తిటనీ యేమీ సెప్పకపోతే నీ మొగుడు రేప్లు యింతయేలకి యింటికిరాడా?" వస్తాడు — వస్తాడు" అన్నాడు.

నీలి ఆ సాధువువైపు ఒకసారి తలెత్తి చూసి మళ్ళీ తలదించి సవినయంగా "బాబూ, తమరు పెద్దలు. లోకం సూశారు. నాను యే లోకం సూడనేలేదు. మావూరు. యావూరే నాకళ్ళతో సూసినాను. మీ రిలాగ సెప్పమంటున్నారు కదా — పోలీసుకళ్ళు లోకంకళ్ళు మూసే స్తానుగాని దేముడికళ్లు మూసేగలనా? నాయం నాయమే - అన్నాయం అన్నాయమే! అన్నాయం నాయం యెలాగ సేసీమంటావు బాబూ? — ఈరోజు నా మొగుడ్ని మొనగాడ్నిచేసి అన్నాయాన్ని నాయంసేసీ మంటావా? కాలానికి నా మొగుడు ఆ మొనగాడు పెంకులు పట్టుకోని ఆడుకోడా? మారాజు తండ్రి ఆ పిస్తోలు నా మొగోడుమీద పేలిస్తే ఈయాళకి అంతాసరి! అలాంటి బాబుమీదా నన్ను అబద్దమాడమంటున్నావు?"

ఈ మాటలతో ఆ సాధువు "కష్టపడిపోతావు. నీకు చూసేవాడెవడూ లేడు. చిప్పపట్టుకుంటావు - ఆకలితో సచ్చిపోతావు. ఆఖరికి నీ మొగుడుమాట కాదని ఆడికి యెప్పటికీ దూరమైపోతావు. నీ మొగుడే ఇవన్నీ సెప్పమన్నాడు. నాపని నేను చేసీసినాను" కాస్త హెచ్చరిక స్వరంతో అనగానే నీలి ఓ క్షణం జవాబు చెప్పలేకపోయింది. మరు క్షణంలో ఆమెలోని అచంచలమైన విశ్వాసం జయించింది. నెమ్మ్లైన స్వరంతో అన్నది. "బాబూ! నా మొగుడు యావేళ సెప్పాడని అబద్ధం ఆడితే నిజం అయిపోతాదా? నిజం అనేది నిలకడమీదైనా తెలుస్తాది? అలాగ నేకపోతే యీలోకం యిలాగ వుంటాదా? వర్షాలు పడ్తాయా? ఎండకాస్తాదా? సీకటి వస్తాదా? బాబూ సిన్నదాన్ని మీలాంటి సాధులుకి సెప్పేండాన్ని కాను. నాను కళ్లలో నిప్పులు పోసుకోలేదు. కుడితిలోపడ్డ యెలుకలాగ కొట్టుకోనూలేదు. అన్నిటికీ ఆ తండ్రే

వున్నాడు.నాపని నాను సేసిస్తే-జరగవలసింది జరక్కమానదు" అంటూ అక్కడనించి లేచిపోయింది.

సాధువు చంద్రయ్య చేసేదిలేక తనదారిని తను వెళ్ళిపోయే ముందు "తొందరపడకు! బాగా ఆలోచించు. మొగుడు నీకు మరి దక్కడు. నివ్వు నేను సెప్పినట్లు సెయ్యకపోతే ఆడిపీక తెగిపోతాది. అడుక్కతినాలి!" అన్నాడు. ఆ రాత్రంతా నీలికి నిద్దరరాలేదు.

ఎన్నివిధాలగానో ఆలోచించుకుంటోంది. "గుడ్డిపెంకన్న దొంగాడని వాడ్నిసూసి యెగిరిపడేవోడే! మా వంశం పౌరుషంగల వంశం — నాను పౌరుషంతోనే సస్తాను – అలా సచ్చిపోతానుగానీ దొంగతనం సెయ్యనే అన్నాడే! సత్రంలో దొంగల్ని ఒక్కడే సాహసంచేసి కొట్టాడే—ఆ రోజురాత్రి టేషినికాడ దొంగతనం యెందుకు సేసావంటే బతుకుతాననుకున్నాను.మళ్ళా పీకతెగినా అలాంటి పని సేస్తానా అన్నాడే. తనదంతా వూర్లోను వొమలుకున్నాడు గానీ, ఒకడికి అన్నాయం సెయ్యలేదు. అలాంటోడు దొంగతనం సేసినాడంటే నాను నమ్మలేను —అంతోడుకొడుకు, పుట్టిని నమ్మికొని సెమటకార్చి బతికినాడు. దొంగతనానికి యెల్లాడని యెలాగ నమ్మితాను —కాదు —నా మొగుడెల్లలేదు. నా మొగుడికేమీ తేలీదు.ఆడంత మంచోడు ఇంకో రెవరున్నారు? నానే తొందరపడి ఆ దొంగతనం యీడే సేసాడనుకున్నాను —"

ఆ క్షణంలోనే యెవరో వస్తున్నట్లు అడుగులు చప్పుడయ్యింది. "అదిగో!నా మొగుడు దొంగ అయితేకదా? పోలీసులు వదిలేసినారు...." కాస్సేపు అలా యెదురుచూసింది. ఆ పాదాల చప్పుడు దూరంగా పోయింది. మరో కొద్దిసేపుషాలుపోయాక ఆ ముందురోజు రాత్రి జరిగిందంతా కళ్ళకు కట్టింది. "ఏ లొసుగులేకపోతే పోలీసులు వస్తున్నారని దాగుడుమూతలు సేస్తాడెందుకు? మాటలకి అలాగ బేజారెత్తిపోతాడెందుకు? ఒంటిమీద దెబ్బ లెలాగుంటాయ్ —ఏ సావాసంలోపడి సెయ్యకపోతే పోలీసోలు వుత్తినే తీసుక యెల్లిపోతారా? నవిరిలో తప్పుంటేకదా తీసికెళ్ళినారు – సేశాడు. సెయ్యకపోతే అబద్దం ఆడమని ఆ సాదుసేత కటురెందుకెట్టాడు? సేసినాడు — నాసెప్తే నా

మొగుడికి యేం అయిపోతాదో?ఆడికంటే యీనో కాన నాకెవురున్నారు? ఆడికోసం యేమైనా సేస్తాను. ఆడు బతకాల. అదేనాకు కావాల...." ఇలా కొంతసేపు లోలోపలే అనుకున్నది. తరవాత తన విశ్వాసాలకీ, యీ అభిమానానికి ఘర్షణపడ్డది. వేకువఝాముకు అనుకుంది. "ఏ అబద్ధాలోడో నా మొగుణ్ణి తెచ్చుకుంటాను. నా మొగుడు సేసినదానికి సిచ్చపడకండా చేస్తే మాకు జరుగుబాటు అవుతాదా?నాకు మొగుడౌతాడా? నిజం నిజమే - అబద్ధం అబద్ధమే! నాయం నిలుస్తాదిగానీ అన్నాయం నిలవదు. నాకెందుకు యిలాగ అయిపోనాను?నాను నిజమే సెప్పుతాను. దేముడునేడా? ...నా మొగుడేమవనీ - నా బతుకేమవనీ, నా పిల్లలే మవనీ....నాను నిజమే సెప్పుతాను....నాను ఆకలితో పోతున్నా నాకు యేడుపొస్తే సంతోషంమీద వస్తాది. దుఃఖంమీద రాదు! నాను అంతా నిజమే సెప్పుతాను" అని నిర్ధారించుకుంది.

ఆ మరుచటిరోజు పోలీసులువచ్చి ఆమెను, మల్లును స్టేషనుకు తీసుకవెళ్ళారు. మల్లు యెదరగా ఆరుగురు మనుషులను నిలబెట్టి ఆరాత్రి పుల్లయ్యతో యెవరు వచ్చారో పోల్చమని చెప్పారు. మల్లు కోపంగా నేను చెప్పనన్నాడు. ఈ పోలీసులంతా కలిసే తన అయ్యను తీసుకెళ్లారని వాడి బాధ. నీలి కొడుకును బ్రతిమాలింది. ఎన్ని విధాలుగానో నచ్చచెప్పితే యింములో యెవరూ లేరని తేలింది. ఆ ఇన్స్పెక్టరు యిప్పుడు తన తెలివితేటలను ఉపయోగించవలసి వచ్చింది. ఒక బొకా తను వూది మల్లు చేతికి యిచ్చాడు. ఏదీ నివ్వు వూదగలవా అన్నాడు. మల్లు అంతకంటే బాగా వూదాడు. బిస్కట్ నాలా నివ్వు తినగలవా అని అంటే అంతకంటే గబగబ పరుకుపరుకుమని నమిలేశాడు. తరువాత "చూశావా!మీ అయ్య యేంపనిచేశాడో? మీ అయ్య దొంగకాడు. పదిలేశాం. వదిలేస్తే యేంచేశాడో తెలుసా?ఆలిద్దరి యింటికి వెళ్ళిపోతా నని వెళ్ళిపోయాడు. వాళ్ళయిల్లు నీకు తెలుసా?"

"అన్నయిల్లు తెలుసు" అన్నాడు.

"చంద్రయ్యది!"

"ఉహూఁ"

"మీ అయ్యతో నీవెక్కడి కెళ్ళావో సెప్తావా?" అన్నాడు.

"ఓ" అంటే ఇన్‌స్పెక్టరు తన వెంబడి కుర్రవాడ్ని తీసుక వెళ్ళాడు. ఆ హోటల్ యజమాని యీ కుర్రవానితో యింకో యిద్దరు మనుషులు తనతో హోటలుకు అప్పుడప్పుడూ వచ్చేవారని, ఒకోసారి యింకో పొట్టిమనిషి వచ్చేవాడని వాళ్ళయిళ్ళు ఎక్కడవున్నవో తనకు తెలియదనీ చెప్పాడు. ఇన్‌స్పెక్టరు ఆ యజమానిని వాళ్ళని అప్పచెప్పక పోతే తననే తీసుకవెళ్తానని బెదిరించాడు. తరువాత అన్నయిల్లు దూరం నుంచే చూసి వెళ్ళిపోయాడు. "మీఅయ్య చంద్రయ్యయింట్లో ఉన్నాడేమో; ఆ యిల్లు తెలుసుకోని నీకు తీసుకెళ్తానులే" అని మళ్లుకి నచ్చ చెప్పాడు.

తిరిగి స్టేషనుకు వచ్చేవరకు నీలి అలానే అక్కడ కూర్చుంది. ఇన్‌స్పెక్టరు ఆమెవేపు చూడగానే యెందుకో జాలివేసింది. తను అడిగిన ప్రశ్నలకు సమాధానాలు వున్నదున్నట్లు ఆమె తడుముకోకండా చెప్తుంటే తనకు ఆమెమీద గౌరవం యేర్పడింది. ఆమెకు యేవిధంగానైనా సహాయంచేస్తే బాగుండునని అనిపించినా తన వుద్యోగధర్మం విడనాడకూడదని ఆమె చెప్పినట్లే అన్నీ వ్రాసుకున్నాడు.

ఆమె వెళ్ళిపోతూ తిరిగివచ్చి ఇన్‌స్పెక్టరుతో "ఆ మారాజు తండ్రికి యెలాగున్నది బాబూ! తెలివి వచ్చిందా?" అంటే ఇన్‌స్పెక్టరు "గండం గడిచింది. బ్రతుకుతాడు!" అన్నాడు. నీలి కదులుతూ "దేవుడు లేడా? ఆ మంచిబాబుకి బాగచూడడా?" అంటుంటే ఇన్‌స్పెక్టరు నవ్వుతూ "వాడు మంచోడా? వాడిడబ్బు చూసి అంటున్నావా?" అన్నాడు.

"మంచిబాబు కాకపోతే పిస్తోలు దొంగలమీద పేలించడా బాబూ?" అని ఆమె మెల్లగా కొడుకును పట్టుకొని ముందుకు కదలిపోయింది. అలా వెళ్ళిపోతూ నాలుగైదు వీధుల్లో పనికోసం కొన్ని గుమ్మాలదగ్గరకు వెళ్ళింది. కష్టసుఖాలు చెప్పుకుంది.

ఒక యింట్లో యజమానురాలు చాలా తక్కువ డబ్బుకు పనికి కుదుర్చుకుంది. ఎన్నో షరతుల్ని పెట్టింది. ఆమె గొంతుక ధాటీ యెవరినైనా హడలుగొట్టేట్టున్నది. అన్నిటికీ నీలి తలఒగ్గింది. ఆవేళనుంచే

పని. చెప్పినపని చేసుకొని యింటికి వెళ్తుంటే తనలాంటి మనిషే "వాళ్ళయింట్లో పనికి కుదిరావా?" అని అడిగింది.

"అవునమ్మా!"

"వాళ్ళు మనుషులా? ఇచ్చేది యేగానే గానీ, రక్తం పీల్చేస్తారు. అందుకే వాళ్ళయింట్లో నెలకో పనిమనిషి మారుతుంది. వాళ్ళసంగతి తెలిసినవాళ్ళెవ రాపనికి వెళ్ళరు"

కష్టానికి ఆదుకున్న దానమ్మా! నాలుగంటే పడతాను. ఏనాటికైనా ఆ యమ్మ మనిషేకదా, కనికరం రాదా?" అంటూ నీలి ముందుకు నడిచింది.

41

మేజస్ట్రీటుకోర్టులోనే విచారణ ప్రారంభమైంది. ముగ్గురు ముద్దాయిలను ఒకవేపు నిల్చోబెట్టి వారిమీద నేరారోపణచేశారు. ముగ్గురూ నిర్దోషులమని చెప్పారు.

ఇక అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటరుకు నేరనిరూపణ చెయ్యవలసిన ఆవసరం వచ్చింది. మొదటిసాక్షిగా నీలమ్మను పిలిపించారు. నీలి కూతురును కోర్టుబయట చెట్టుకింద కొడుకుకు అప్పచెప్పి కోర్టులోకి వచ్చింది. ఉన్నమట్టుకు చింకిచీరల్లో మంచిది కట్టుకొని శరీరమంతా కప్పుకుంది. మనిషి చిక్కిపోయివున్నది. ముఖం పాలిపోయి, వేసినమెట్టి (కొప్పు) కూడా మోటుగావుంది.

తలవంచుకొని బోను యెక్కితుండగా ఆమెకాళ్ళు గజగజ వణకనారంభించనయ్. ఎక్కి, బోనును చేతితో పట్టుకొని నిల్చొని తల యెత్తేసరికి ముగ్గురు నేరస్థులూ అగుపించారు. తలదించుకొని వున్న భర్తవేపు చూడగానే ఆమెలో అదొకవిధమైన సంచలనం కలిగింది. ఎందుకో ఆ ముఖం చూడటానికి సిగ్గువేసింది. శక్తిహీనయై కళ్ళల్లో నీరు తిరుగుతున్నప్పటికీ వెంటనే తనవిధి జ్ఞప్తికివచ్చి ధైర్యాన్ని కోలుకోడానికి ప్రయత్నించింది.

భార్య, కొడుకు చెప్పే సాక్ష్యంపైనే, తనూ తన సహచరులూ బయటపడే అవకాశం వున్నదని, తమవేపు వాదించడానికి గవర్నమెంటువారిచ్చిన ప్లీడరు చెప్పాడు. చంద్రయ్యవెళ్ళి నచ్చచెప్పాడని పుల్లయ్యకు తెలుసు. ఈసరికి అలోచించి తప్పకండా తను బయటకు రావటానికి పనికివచ్చే సాక్ష్యం ఇస్తుందనే గాఢనమ్మకంతోనే వున్నాడు.

ఇంతలో డఫేదారు "అమ్మా! ఈ ప్రమాణంచెయ్యి" అంటూ "దేవుని యెదుట ....."

ఆమె అడ్డి, "అదెందుకు బాబూ! ఆ తండ్రి యెప్పుడూ వుంటాడు ....." అంది.

"అలాగ ప్రమాణం చెయ్యాలమ్మా!"

నీలి డఫేదారు చెప్పినట్లు ప్రమాణంచేసింది. ఆమెలో కొద్ది క్షణాలక్రితంవున్న బెణుకు, బాధ, సంచలనం తగ్గిపోవటం మొదలు పెట్టింది. ఆ గొంతుకలో యేదో దైవత్వం చొచ్చుకున్నట్లుంది. భయం రానురాను సడలిపోయింది.

అసిస్టెంటు పబ్లిక్ ప్రాసిక్యూటరు ఆమెను ప్రశ్నించడానికి వుపక్రమించాడు.

"నీ పేరు?"

"నీలమ్మ"

"నీ భర్తపేరు?"

"పుల్లయ్య"

"ఈ ముగ్గురిలో నీ భర్తను గుర్తుపట్టగలవా?"

"హఁ. మధ్యనున్నాడు"

తరువాత వేసిన వివిధప్రశ్నలకూ ఆమె నిస్సంకోచంగా జవాబు చెప్తుంటే, పుల్లయ్య కళ్లు మండుకుపోతున్నాయ్. వాడికి యెక్కడలేని కోపం, బాధా పెల్లుబుకుతుంటే చేసేదిలేక లోలోన బాధపడుతున్నాడు.

ఒకనాడు స్టేషనుదగ్గర దొంగతనం మొదలు. ఓడసరుకు దించడానికని రాత్రుళ్ళు వెళ్ళేవాడని, ఒకనాడు చీరె తెచ్చిన విషయం, వాళ్ళ గ్రామంలో పొక్యూరిమెంటు తగవుల్లో జరిమానాపడ్డ సంగతి, ఈ నేరం

జరిగిననాటి రాత్రి, తరవాత వుదయం కొడుకుకూ, తనకూ జరిగిన తంతుఅంతా ప్రశ్నలు అడుగుతుంటే నీలి సమాధానాలిచ్చింది. మిగతా ఇద్దరినీ తను ఇదివరకు చూడలేదనీ, వాళ్ళు యెప్పుడూ తన యింటిదగ్గరకు రాలేదనీ కూడా చెప్పింది.

ఈ నిజాలన్నీ ఆమె తొణకకుండా, బెణకకుండా చెప్పటంతో ముద్దాయిలతరఫు ప్లీడరుకు ఆట్టే పనిలేకపోయింది. కానీ తన ప్రయత్నం మానలేదు. ఆయన వేసిన ప్రశ్నలలో కొన్ని:

"నీ మొగుడిబుద్ధి యెలాంటిది?"

ఆమె సమాధానం చెప్పలేదు.

"పోనీ నలుగురూ నీ మొగుడిని గురించి యేమనుకునేవారు?"

"మా మామ్మ చచ్చిపోతూ చెప్పింది.చెయ్యికాలితే కుండవదిలి పెడ్తాడని....ఈ వూరు వచ్చినాక ఎవురు యేం అనుకున్నారో నాకు తెలీదు బాబూ!"

"అలాంటివాడని, నీ మొగుడంటే నీకు కోపంగా వుండేది కదూ?"

"కోపం తెచ్చుకొని యెవర్ని బాగుచేస్తాం బాబూ! కోపం తెచ్చుకున్నోల్లకే నష్టంగానీ...."

"నీ మొగుడు నీమీద కోపపడేవాడుకదూ? అంచేత నీకు వాడిమీద కోపంవుండేది-ఏం? అంతేనా?"

"ఇలాంటి వెంచుకడుగుతారు బాబూ?"

"మీ యిద్దరికీ సరిగ్గా పడేదికాదని ఒప్పుకుంటావన్నమాట:"

"అలాగెందుకు ఒప్పుకుంటాను? నా మొగుడు నన్నెప్పుడూ తిట్టనేదు; కొట్టనేదు—మీ రిన్ని అనండి—ఇదేంపని?ఆ రోజుల్లో మా వూర్లో గుడ్డివెంకన్న యెప్పుడో దొంగతనాలు చేసేవోడని వాడిమీద లేచేవోడు. అలాంటోడు యిలాగ అవుతాడనుకున్నానా? కానుకున్నాను కాదు—ఆడిన మాటలన్నీ నమ్మినాను. నాను సెప్పినట్లు ఆ వూర్లోనే వుండి కంబారితనం చేసుకుంటే బతికేద్దుం బాబూ? ఇన్నాడుకాదు—ఈ పాపంపనికి నెట్టుకున్నాడు."

పుల్లయ్యకు పట్టరాని కోపంగస్తోంది. ఇదంతా నీకోసం చేశా ననీ—నిప్పే దగాచేశావనీ అరవాలనుకున్నాడు. తను మాటాడితే నేరం ఒప్పుకున్నట్లవుతుందని బలవంతాన పెదాలు నొక్కుకున్నాడు.

సీలిసాక్ష్యం అయిపోయింది. మల్లును కోర్టులోనికి తీసుకువచ్చే ముందు ప్రాసిక్యూటరు మేజిస్ట్రీటుకు విన్నపంచేశాడు—కుర్రవాడికి తండ్రిమీద చాలా అభిమానం. కాబట్టి తండ్రి యెదురుగా కనిపిస్తే ఏదుపుతప్పించి సాక్ష్యంరాదనీ అంచేత యీ ముద్దాయిని చాటుగా వుంచాలనీ కోరాడు. మేజిస్ట్రీటు అందుకు అంగీకరించాడు.

మల్లు సెప్పినట్లు విని ధీమాగా బోనుయెక్కి యిటూ అటూ తిరిగాడు. బోనులో మునిగిపోయినట్లున్నాడు. చేతిలో చిన్నకర్ర పారే మన్నా పారేకండానే బోను యెక్కాడేమో, లోనుంచే ఆ కర్రతో బోనుచుట్టూ ఒకసారి త్రిప్పి గరగరలాడించాడు.

ప్రాసిక్యూటర్ నవ్వుముఖంతో

"అబ్బాయి—చాల మంచివాడు. నీపేరు?"

"మల్లు।"

"మీ అయ్యపేరు।"

మల్లువేళాకోళంగా నవ్వుతూ "మా అయ్యపేరే తెలీదా?—పుల్లయ్య।"

"మంచిపేరే?"

"మా అయ్య మంచోడు—మాఅయ్యపేరు మంచిదే। నీపేరు?"

"నాపేరు గోవిందరావు."

వెక్కిరిస్తూ, "ఛా—అంతపేరా? మంచిదికాదు।"

"చిన్నపేరు చేసుకుంటానుగానీ....ఏదీ చెప్పు—ఆవేళరాత్రి మీ అయ్య, నిప్పూ మీ యింటిగడపలో పడుకున్నారుకదూ?"

ఎప్పుడూ పడుకుంటాం—నాను మా అయ్యగుండెమీద పడుకుంటే, మా అయ్య సరదా—నా సరదా—ఓఓ...." నవ్వు ముంచుకొచ్చింది.

"అయితే ఆవేళ యేమయిందో చెప్పు।"

"ఏయేళ?"

"మీ అయ్య మేడెక్కినాడు—ఆయేళ"

"అక్కడ నెప్పినాను. ఇక్కడెందుకు?"

"ఇదిగో వీళ్ళంతా వినలేదట—వింటామంటున్నారు. చెప్పెయ్ మల్లూ—చాల మంచివాడివి!"

మల్లు కర్ర కాలుకింద పెట్టి రెండుచేతులతోనూ బొనుపట్టుకొని కోర్టులోవున్న మనుషులవేపు చూస్తూ మొదలుపెట్టాడు. చిన్ని చెడ్డీ ఆపైన భుజాలు చిరిగిన కమీజు—ముఖంమీద పడుతున్న జుత్తు—ఎలకపళ్ళు, ముచ్చటైనమాట....

"ఆయేళ అమ్మతోని పొరుగమ్మదగ్గర కూకున్నాను. అలాగొచ్చి అయ్యదగ్గర పడుకోటానికియెళ్ళి....పదాలు పాడినాను....మద్దాన్నం పడుకున్నానుకదా - నాకు కునుకురాదు .... అయ్యకిరాదు .... సీకటి.... గొప్పసీకటి, అలాగ కునికిపోనాను. నాకు తెలివొచ్చినాది—మా అయ్య లేసిపోతన్నాడు. నానూ లేసినాను.మళ్ళావచ్చి మీదేసుకొనిజోకొట్టాడు. ఈయేళ మా అయ్య నన్ను రానివ్వడు—మా అయ్యపని నాను సూడాలి ఎంతఓడో యేమిటో .... టక్కుయేసినాను—దాగోని ఆలుయెనకాలే వెళ్లినాను."

"మీ అయ్యతో వున్నవాళ్లిద్ద రెవరు?" అని ప్రాసిక్యూటర్ ప్రశ్నించాడు.

"అన్న—సెంద్రయ్య!"

"వాళ్లేనా?" అని వాళ్ళిద్దరినీ చూపించగానే మల్లు పోల్చి అవునని చెప్తూ అన్ననుద్దేశించి "నీవు బోండాలు, సానీరు యిచ్చేవోడివి కదా?" అన్నాడు.

తరవాత ప్రాసిక్యూటరు "అయితే వాళ్ళయెనకాలే వెళ్ళావు, తరవాత యేమైంది?"

"ఏమైనాదా?" కొంతసేపు ఆలోచించి;

"ఎనకాలే యెళ్ళాను; దీపందగ్గర ఆగినారు-మా అయ్యసూస్తే కొట్టేస్తాడు—సెత్తల దొక్కుసాటునే వుండిపోనాను....అలాగయెత్తే

ఓడనేదు మేడ! నానూ . మేడెక్కితే ఎంత బాగున్ను—అయ్యసూస్తే కొట్టడా? మా అయ్యకి కోపంరాదా? మీదకెక్కినారు - కుక్క బౌ! బౌ! భయంవేసినాది. ఓ—ఓ....గొల్లు ;సెత్తలడొక్కులో దాగుండిపోనాను ....మాఅయ్య మరి రానేదు" అంటూ ధైర్యంగానే ఆ మరుపటిరోజు జరిగినవిషయం ఆగి ఆగి చెప్పాడు. అయ్య ఆరాత్రి తిరిగిరావటం వరకు బాగానే వెళ్లింది. తరవాత ధైర్యమైన ఆగొంతుక దుఃఖం పెల్లుబికింది.

"ఆయేళ పోలీసులు మా అయ్యని తీసుకపోనారు. ఎంత యేడిసినా మా అయ్య రాడు - కనపడడు—మా అయ్యని యేంచేసినారో? ఇక్కడున్నాడు. అక్కడున్నాడంటారు! ఎక్కడున్నాడో....మా అయ్యుంటే యిలాగ లేనిపోనివి సెప్పినోలకి దబ్బుడు దబ్బుడు యేసీడా? మాఅయ్య యెంతమంచోడు! మా అయ్యేడని అమ్మనడిగితే వూరికెళ్లాడంటాది. వూరికెళ్తే నాకు సెప్పకండా యెల్తాడా? యెల్తాడా? యెళ్లినా నన్నువదలి యిన్నాళ్లు వుండడే...." అంతలోనే ఆ గొంతుక మహా కటుత్వం దాల్చింది. పౌరుషం, కోపం మిన్నుముట్టాయి. గబ గబ కాళ్ళక్రిందవున్న కర్రతీసి ఝళిపించాడు. బోనుమీద గట్టిగా నాలుగుసార్లు కొట్టి "పోలీసోలూ! మీరంతా మా అయ్యని యేదో సేసినారు! మా అయ్య నివ్వకపోతే సూడండి మీ అందరిని దబ్బుడ దబ్బుడ యీ కర్రతో యేసేస్తాను. మీ అందరినీ గట్టిగా కరిసేస్తాను. అయ్యా.... అయ్యా!" గట్టిగా కేకలువేశాడు, ఆ నిముషంలోనే ప్రక్కన దాచి పెట్టిన అయ్యకు ఒళ్ళంతా వణికిపోయింది. కళ్లు కాయలు కాసి పోయాయి. కోపం, తాపం అంతా ఆక్షణంలో మరచిపోయి గప్పున ముందుకు చొచ్చుకుపోయాడు.

"మల్లా—నా నాయనా!" అంటూ బోనులోకి ఒక్కయెగురు యెగరాలనుకున్నాడు. అయ్యని చూసిన మల్లు పట్టలేని సంతోషంతో "అయ్యా" అంటూ ఒక్క కేకవేసి బోనుదిగిపోయాడు.

ఏడుస్తున్న మల్లును డఫేదారు బయటికి, ముందుకు వురుకుతున్న పుల్లయ్యను పోలీసులు వెనుకకు తీసుకపోయారు.

కోర్టునుంచి తిరిగి ఖైదులోకి వచ్చేసరికి సాయంత్రమైంది. రాగానే కూలబడిపోయాడు. మనస్సంతా రౌద్రంతో మండిపోతోంది. ఎదురుగా ఇనప కటకటాలు అడ్డుగా వున్నయ్. లేదా అంటే ఆ భరించ లేని కోపంతో పరుగెత్తిపోయి పెళ్ళంపీక పిసికేసేవాడే!

"అదే చేసినాది. నా మల్లు అయ్య పెపొ్నద్దన్నాడంటే మాటాడే వోడా? నామీద నిగాపెట్టి పగోడికి సేసినట్టు చేసింది. దానినుంచే పాడ యినాను. ఆడెమ్మపప్పమాటలు యిన్నానుకాను. బుగత అన్నట్టే నాకు దగాచేసింది. దానంచేసి ఇల్లు గుల్లచేసింది. రాజిగాడికి తల ఒగ్గించి అంతా నాశనంచేసింది. పిరికిమందేసి నా పౌరుషాన్ని కాల్చేసింది. దాని అంతస్తు సూసుకోలేకపోనాను. పంతానికి పాకులాడి ఆ తక్కువ దాన్ని, సెల్లక వుండిపోయినదాన్ని కట్టుకున్నాను. యెత్తెత్తి యెంగి లాకుమీదే కాలేసినాను! వలసివచ్చిన ఆ రంబనికట్టుకోనుంటే నాకీగతి పట్టేదా? బంగారంలాంటి వూరు వదిలేవోడినా? ఈ కటికనేలమీద దొల్లేవాడినా? ఇలా నా నాయన మల్లుకి దూరం అయ్యేవాడినా? ఇదే చేసింది. దీన్ని తిట్టినా, కొట్టినా, సంపినా పాపంనేద"ని అట్టుడికినట్ట యిపోయి ఆవేశపడిపోతున్నాడు. ఆవేశ తిండి నయించలేదు. పెళ్ళం మీద కోపమే ఒళ్ళంతా నిండిపోయివుంది. ఈ ఆలోచనలతో చీకటై పోయింది.

వుండీ వుడిగీ వెర్రివాడిలా యిటూ అటూ తిరుగుతున్నాడు. ఒకోసారి ఆలోచనలకు తగ్గట్లుగానే నటిస్తున్నాడు. మాటలు మధ్య మధ్య బయటకు వస్తున్నాయ్. మూడుసార్లు ఇనపకడ్డీలు వంచటానికి ప్రయత్నించాడు. ఆ బలమంతా వుపయోగించినా తలుపు వూడిపోలేదు.

ఈ తోడిమనిషి బాధను అలా పవళించి చూస్తున్న యింకోఖైదీ చాలాసేపయ్యాక "ఏమైంది నాయనా?" అన్నాడు.

"అయ్యింది—అదిచేసింది—ఈ తలుపు ఊడితే దాన్ని ఒక్క ఏటు ఏసేనా?"

"ఎవరిని....?"

"దానినే--ఆ తక్కువదానిని-అది నా పెళ్ళమట....వూరంతా వద్దంటే ఆ గతిలేనిదాన్ని చేసుకున్నాను. అది నామీద యెదురుసాక్ష్యం చెప్పింది...." పుల్లయ్య కోపం ఒక్కసారిగా ఉధృతమైన దుఃఖముగా మారిపోయింది. వలవల ఏడ్చేస్తూ "నా మల్లును-నా నాయన్ని ఎన్నాళ్లో అది సూడనివ్వదు....యిలాగ నా నాయనకోసం పలవరించి పలవరించి ....నా నేమౌతాను?"

వెక్కివెక్కి ఆయనదగ్గరకు వెళ్ళి ఏడుస్తున్నాడు. ఆ చల్లని చెయ్యి మెల్లగా తనదగ్గర వంగినవానితల నిమిరింది. కొంతసే పయ్యాక మెల్లగా తనచోటుకు తీసుకవెళ్ళి నిద్రపుచ్చాడు. పుల్లయ్య నరాలన్నీ నీరసంచేత పీకసాగాయ్. అలా జార్లబడి కళ్లు మూసుకున్నాడు. కళ్ళు మూయగానే కోర్టు,భార్య, కొడుకు, ఆదృశ్యం అంతా అగుపిస్తోంది. ఎక్కడలేని బాధ, దానికితోడు ఆత్మత తనలో పెన వేసుకొని వస్తున్నది. కళ్ళువిప్పి ఓరగా చూశాడు. పైన జైలు జవాను యిటూ అటూ పచారుచేస్తున్నాడు. వరండాలోని వెలుతురు కొద్దిగా ఈ కొట్టులోకి పడ్తోంది. ఆ లేతవెలుగులో తను ఓదార్చిన మనిషివేపు చూశాడు.

చప్పున బూచోడు ఇక్కడి కెలాగొచ్చా డనుకున్నాడు? బూచోడా? కాదే....ఎవరు? దాసుడులాగున్నాడు....దాసుడు ఏనాడో పోయాడుకదా ఎలా వస్తాడు? అయితే అయితే బూచోడా? అలాంటోడిని ఖయిదులో ఎందుకు పెడ్తారు? అయితే ఎవరు? ఈ మనిషి యావేళపొద్దున ఈ కొట్టులో లేడే! ఎలాగొచ్చాడు? ఎవరు?

అతడు మెల్లగా ఒకప్రశ్న వేశాడు,

"నాయనా! బాధ తగ్గిందా?" అని....

వెంటనే జవాబు రాలేదుగానీ....ఊఁ అని తనకు తెలియకండానే మూలిగాడు. పైన అడుగుల చప్పుడు వినిపించలేదు. బహుశ జవాను ఆ చివర కూర్చొని వుంటాడు. రాత్రి గడచిపోతున్నకొద్దీ పుల్లయ్యకు నిద్దర దూరమైపోతోంది. తన తోడి ఖైదీకూడా నిద్దరపోలేదు. మళ్లీ కొంతసేపయ్యాక "నిద్దర రాలేదా నాయనా?" అని ప్రశ్నించాడు.

ఆ గొంతుక వింటుంటేనే పుల్లయ్యకు ఒళ్ళు జలదరిస్తోంది. ఆగొంతుక యెక్కడో విన్నట్లు ఆ గొంతుకలోనుంచి వచ్చిన మాటలు చల్లని నీరులా తన కోపాగ్నిమీద పనిచేస్తున్నాయి.

కొంతసేపయ్యాక లేచి కూర్చున్నాడు. ఆయనకూడా దగ్గరకువచ్చి "నీకీగతి యెందుకొచ్చింది నాయనా?" అన్నాడు. ఆ ప్రశ్నతో తన బ్రతుకంతా విప్పిచెప్పుకుందామనిపించింది. తన ముక్కు,మొఖం ఎరగకపోయినా, వూరూ పేరూ తెలియకపోయినా ఈ లోకంలో యీయన ఒక్కడే తన బాధ పంచుకునే మనిషనిపించింది. అలా కూర్చొనే మెల్లగా మొదటనుంచీ తన బతుకంతా యీవేళవరకు జరిగింది చెప్పుకొచ్చాడు; అంతా విన్నాక అతను ఒకనిట్టూర్పు విడిచాడు—అంతే; ఇంకేం వ్యాఖ్యానించలేదు. లేచిపోయి "చాలారాత్రి అయ్యింది పడుకోనాయనా; అలసిపోయి వున్నావ"ని అతను తన జాగాకు వెళ్లిపోయాడు.

తను వెళ్ళిపోయినా పుల్లయ్య అటువేపే చూస్తున్నాడు. అలా చార్లబడినా దృష్టి తనవేపే పోతోంది—కొంతసేపటికి మాగన్నుగా నిద్దరపట్టింది.

వేకువజామున తెలివివచ్చింది, నిద్దరపట్టలేదు. ఆయన మఠం వేసుకొని కూర్చొనివున్నట్లు గుర్తించాడు. ఈ దృశ్యం నీలమ్మ గుడిలో శివాలువేస్తున్న దాసుడ్ని జ్ఞప్తికితెచ్చింది....అలా ఆలోచిస్తుండగానే "నాయనా!" అని పిల్చాడు, పుల్లయ్య దగ్గరకువెళ్ళాడు. ఆయనముఖం స్పష్టంగా అగపడలేదుగానీ, ఏదో తేజస్సు మెరుస్తున్నట్లు అనుకున్నాడు.

మీద చెయ్యివేసి నిమురుతూ ఆదరణతో—"నాయనా! ఒకనాడు నేను నాతోటివాళ్ళని అసూయతో అసహ్యంగా చూశాను. అప్పుడు నాదీ అనే సంపద వుండేది. కానీ మనిషిలా బ్రతకలేక, ఇలా బైళ్ళపాలయ్యాను. ఇప్పుడో—నాదీ అనేది ఏమీలేదు. కానీ, నేను తిరిగి జనంలోకి సంతోషంగా బ్రతకడానికి వెళ్ళిపోతున్నాను. ఈ గాలీ, నీరూ వగైరాపంచభూతాలూ తమ ధర్మాన్ని పాటిస్తున్నప్పుడు వాటి కలయికవల్ల తయారైన మనిషి తన ధర్మం పాటించకపోతే, ంతా సరి; నీకెవరూ దగాచెయ్యలేదు. అబద్ధం ఆడి, నీకు నివ్వే

దగాచేసుకోబోతున్నావ్. ఆ గ్రహపాటును నవ్వుతూ ధైర్యంగా తీసుకో!"

మళ్లీ తను తల నిమురుతూ గెడ్డం పట్టుకొని "నిజాన్ని బయట పెట్టిన అలాంటి పెళ్ళం వుండటం నీకు గర్వంకాదా?అలాగ ధైర్యంగా దొంగల్ని అప్పచెప్పే కొడుకును కన్నావే?—నీకంటే అదృష్టవంతు డెవడున్నాడు? నాయనా....ఈ జన్మతోనే అంతా సరికాదోయ్....ఒక పుల్లతో చక్రం తయారవుతుందా? చక్రం తయారయి కదిలి రోడ్డు చివరకు చేరేసరికి యెన్నిజన్మలో! నువ్వు ఖైదులోవుంటే వాళ్లకి ఎలా జరుగుతుందనా?....ఆ తల్లికి ఆ ధర్మమే గొడుగై కాస్తుంది—ఆమె పాపం చేస్తేనా పాపై కరవటానికి?....ఆలోచించు"

అంటూ అ వ్యక్తి లేచిపోయాడు.ఇంతలో కొట్టుతలుపులుతెరవ బడ్డాయి. ఆయన బయటకు వెళ్లాడు, గానీ పుల్లయ్య అలా కూర్చుండి పోయాడు. తెల్లవారిపోయింది—కొట్టు కదలి వెళ్ళాడు. తిరిగి వచ్చాడు గాని, అతను చెప్పిందే మనసులో తిరుగుతోంది. అలా ఆ విషయం గురించే ఆలోచించుకుంటూ కూర్చున్నాడు. రాత్రంతా సరిగా నిద్దర లేకపోవటంవల్ల కళ్ళుఎర్రబడి వున్నాయ్. కళ్ళు మూయటానికి వీలు లేకండా పనిపాట్లుచెయ్యటానికి వెళ్ళవలసివుంది. ఏదో పనిచేస్తున్నా అతనుచెప్పినవే జ్ఞాపకానికి వస్తున్నాయ్.

మధ్యాహ్నం మళ్ళీ కొట్టుకు వచ్చేసరికి అతను లేడు. వస్తా డేమో, యెలాగుంటాడో సరిగ్గా చూదామని చాలాసేపు చూశాడు. కాని యెప్పటికీ రాలేదు! చివరకు జవానుని అతనివిషయం అడిగాడు. "పొద్దున్నే వదిలేశారు" అన్నాడు- పుల్లయ్య చాలా నొచ్చుకున్నాడు. ప్రొద్దున్నే సరిగ్గా చూడవలసింది.

ప్రొద్దు తిరిగిపోతున్నకొద్దీ మనసు మనసులా లేదు. ఎడతెగని ఆలోచనలు. సాయంత్రం అయింది. గాలి వీస్తోంది. చెత్తా చెదారం యెగురుతోంది. ఉత్తరదిక్కుపవున్న మేఘాలు చెదరసాగినయ్. రాను రాను ఆకాశం వినీలంగా అగుపిస్తోంది.

చీకటి పడింది.పుల్లయ్య గతంఅంతా మళ్ళీ నెమరువేసుకుంటు న్నాడు. పెళ్ళి....పెళ్లికిముందే తనకొడు కెలా వుండాలో వూహించు

కున్నాడే....ముచ్చటగా ముద్దుగావున్న పాపడు—ఆడూ తనలాగే గేరా గిరజాలు పెంచుతాడు. నలుగురిలోనూ మెప్పుతెస్తాడు—దేనికీ జడవడు. ఆడ్ని గరిడీలో ఘటికుడ్నిచేసి —మాటన్నాడంటే పేణంపోయినా నిల బడతాడు. దొంగల్నిపట్టేదొర....నాకొడుకు దొంగల్నిపట్టే దొరకాలేడా అయ్యాడు అయ్యాడు....చెయ్యిసూసి చెప్పినాడుకదాకోటికొక్కడని.... నా కొడుకు కోటికొక్కడేఅయినాడుకాదా? ....నాను కోరినట్టే అయి నాడు—నా నాయన మల్లు —నిజాన్ని నిలిపిన కొడుకైనాడుకాదా?అయితే నాకెందుకు యింతబాధ?

ఇలా అనుకుంటుండగానే, కొడుకుతోపాటు పెళ్ళం అగుపించి నట్లయింది. ఆ అమాయకమైన ముఖం....బోనులో నిల్చొని తొణ కక్కండా, బెణకక్కండా చెప్పే ఆ ముఖవర్చస్సు....ఏదో తేజస్సు చూసినట్లనిపించింది.ఆతేజస్సుముందు తను నిల్చోలేకపోయినట్లు — తలెత్తడానికి సిగ్గుపడినట్లు అయిపోయాడే!

ఆరాత్రి అన్నంముద్ద నోటికి వెళ్ళలేదు. కలుపుతున్నాడేగాని పెళ్లం,పిల్లలూ యెలాగున్నారోనని మనసు ద్రవించసాగింది. బలవం తాన ముద్ద నోటిలోనికి కుక్కుతుంటే కళ్లంట నీరు బొటబొటా గిన్నె లోకి కారసాగింది, అలాగ లేచిపోయాడు.

ఆరాత్రంతా ఆమె, ఆ మాటలు తనను నిద్దరపోనివ్వలేదు. లోలోన యేదో పురుగు తనను తొలిచి బాధపెట్టుతున్నట్లుంది. "నాపెళ్ళం కొడుకు నిజం సెప్పారు. అంచేత ఆ పెద్దోడు అంత దెబ్బతగిలినా సచ్చిపోనేదు. నాను సెడ్డోడ్ని అయిపోనాను. జూదం నేర్చినాను;సెడ్డో డితో కూడినాను. మనిషినే మారిపోనాను, అలాగుంటే నా పెళ్ళం పిల్ల లకి అయ్యేవోడినా? నాకు జైలే బాగున్నాది. నా పెళ్ళం కొడుకూ నా మంచికే చేసినారు. నాను పదుగురిలాగ యిక్కడ పని నేర్సుకుంటాను. తరువాత బతికేనా?" అనుకున్నాడు.

ఆకాశంలోకి చూశాడు - ఎవరెవరో అగుపించినట్లయింది. కొంతసేపయ్యాక మళ్ళీకొడుకే తలుపుకొచ్చాడు. వాడు పుట్టకముందు తనుపడ్డ గర్వం— పుట్టాకతను యెగిరిన యెగుర్లూ—పేరుంచావుతండ్రీ ....అనుకున్నాడు. నిముష నిముషానికి ఆకొడుకును దగ్గరకి చేరదీసు

కాని తన మనసారా ముద్దులాడుదామనిపించింది. చివరకు ఊహలోనే కొడుకును ముద్దులాడసాగాడు.ఆ కటికనేలనే ముద్దులాడుతుంటేకళ్ళంట నీరు జలజల రాలుతోంది. ఎంతోసేపటికి పైనుంచి జవాను-

"ఎందుకేడుస్తున్నావ్---పడుకో! పడుకో!" అన్నాడు.

గబగబ ఇనపకమ్మీల దగ్గరకి పరుగెత్తుకొచ్చి "అదిగో.... ఆ ఆరుబారుకెళ్ళే తోవలో నాయిల్లు—నా నాయన్ని తెచ్చి చూపించావా? నీకు దేముడు మంచి చేస్తాడు!"

"గోలచెయ్యక. జెయిలరు వచ్చాడంటే యేమవుతాదిరపడుకో."

అంటూ వినిపించుకోకుండా వెళ్ళిపోయాడు.

పుల్లయ్య ఆ కమ్మీలు గట్టిగా పట్టుకొని బాధతో నిట్టూర్చాడు—

43

ఎండవేళ వచ్చిన నీలి. పిల్లలను పెట్టుకొని సెషన్సుకోర్టు ఎదురుగానున్న చెట్టుక్రింద కూర్చొనివుంది. ప్రొద్దు తిరిగినా ఇంకా పిలవలేదు.

ఆకలి పీడిస్తోంది. పిల్ల ఏడుస్తోంది. వీళ్ళని యేమిపెట్టి పోషించేది దేముడా అన్న బాధ ఆమెను పీక్కుతింటోంది. ఇలాంటి సమయములో పనిచేయలేదని ఆ యింటి యజమానురాలు పంపించివేసింది. పురుడుపోసుకున్నాక రమ్మంది. ఈలోగా యెలాగ జరుగుతుంది? కొడుకైనా చేతికి అందివచ్చాడు కాదని నొచ్చుకుంది. నిన్నరాత్రినుంచీ ఆమెకు బెంగ బెంగగావుంది. రాత్రి ఇన్ని మంచినీళ్ళు త్రాగి నిద్దర పోయింది. ఏ పని చెయ్యడానికీ శక్తి లేదు. ఆగిఆగి కష్టపడి యెలాగో కోర్టుకు వచ్చింది. కళ్ళు తిరిగిపోతున్నట్లున్నాయ్.

ఈ సమయాన్నే ముద్దాయిలను కోర్టులో హాజరుపర్చారు. జడ్జి ఇంకే ప్రశ్నావెయ్యకుండానే పుల్లయ్య యిలా అన్నాడు: "బాబూ! నాను నిజం సెప్పుతాను. పెభువులు కటాక్షించి నా కోరిక తీర్చండి. అదేమీ మా పెద్దది కాదు. అడిగో నా నాయన మల్లు బయట సెట్టుక్రింద వున్నాడు. ఆడిని ఒక్కసారి యీ చేతులతో యెత్తుకొని ముద్దులాడనివ్వండి బాబూ! మీకు దేముడు బాగా సూస్తాడు!"

జడ్జి అందుకు అంగీకరించి తను చెప్పదలచుకున్నది చెప్పమన్నాడు. పుల్లయ్య ఇంకో సమయంలో అయితే తను పడ్డ బాధ,తనకు

జరిగిన అన్యాయాలు, దగాలు అన్నీ చెప్పుకొనేవాడే; కానీ తన కొడుకును ఎత్తుకొని ముద్దులాడటాననే ఆతృత నిజాన్ని నాలుగు ముక్కల్లో చెప్పనిచ్చింది.

"గొట్టం పట్టుకొని సివర నానే ఆ బాబు మేడెక్కాను. ఆబాబు చేతిలో తుపాకివున్నాది. ఆలయేపు పేల్చేస్తున్నాడు. ఆలిద్దరూ సచ్చిపోతారు.ఆ గాబరాలో నాకేం తోసినాది కాదు. అక్కడేవున్న బల్ల ఎనకనించి ఆ బుర్రమీద యెత్తేసినాను. ఇంతలో యీదంతా గోల—దొరికిపోతామని, బితుకుతో దొంగతనం చెయ్యకండా యెలిపోనాను."

"నీతో వున్నవాళ్ళిద్దరూ వీళ్ళేనా?" అని జడ్జి ప్రశ్నించాడు.

పుల్లయ్య జవాబు చెప్పలేదు.

జడ్జి మళ్ళీ రెట్టించి ప్రశ్నించాడు.

"బాబూ! చెమించండి. అది నాకు అడగకండి!"

"నిజం చెప్తేకదా నీ కోరిక తీర్చటం అవుతుంది!"

పుల్లయ్య తలదించేశాడు. మనస్సు చిన్నబోయింది. ఇంతలో అన్న నోరు వినిపించింది.

"మరెందుకు బాబూ? నిజం యేనాటికైనా తెలిసిపోదా?మా ముగ్గురమే బాబూ చేసాం?"

పుల్లయ్యకు అన్నమీద యెడతెగని అభిమానం కలిగి తలెత్తి చూశాడు. ఆ అమాయకమయిన మనిషి యిదివరకు పడ్డ కష్ట నష్టాలు, నేర్పిన నీతులు అన్నీ ఒక్కసారి జ్ఞప్తికివచ్చాయి.

పోలీసు ఇన్‌స్పెక్టరు మల్లును కోర్టులోకి తీసుకువెళ్ళగానే, అయ్యను చూసి కెవ్వున కేకవేసి ముందుకు వురికాడు. చేతులుచాచిన అయ్యమీదకు యెగిరి గట్టిగా కౌగలించుకొని "అయ్యా!...."అంటూ ఒకటే సంతోషం. ఆ సంతోషంలో యేడుపు....వుత్సాహం.

అయ్య కొడుకును మనసారా ముద్దులాడుతున్నాడు. వలవల యేడ్చేస్తున్నాడు. "నాయనా... నా తండ్రీ.... పేరు నిలిపినావు...." యేడుపుతో మాట సరిగ్గా రావటంలేదు. ఎన్నో బుద్ధులు చెప్దామనుకున్నాడు. ఎన్నెన్నో....ఎంతగానో చెప్పుకుందామనుకున్నాడు. కానీ యేడుపు తప్ప ఒక్కమాటా సరిగ్గా రాలేదు. ఆ దృశ్యం చూసినవాళ్ళ మనసులు కూడా ద్రవించిపోయినయ్

ఇక మల్లుని విడిచిపెట్టాలి. పీల్లేదు....విడిపిస్తుంటే మల్లు గట్టిగా యేడుస్తున్నాడు....ఆ కేకలు విని నీలి ఆతృతగా అటువేపు రాగానే యేడుస్తున్న మొగుడు ముఖం అగపడింది. ఆ ముఖం అలా చూడగానే ఆమెలో యేదో సంతోషం పొంగిపోయింది. ఆ ముఖం నిజంగా....తొలిరోజున అమాయకముఖం....పోయినకళకాంతులు తిరిగి వచ్చినయ్....ఆముఖంవేపు చూస్తుంటే ఆమె ఆకలిఅంతా మరచి పోయింది....అప్రయత్నంగా ఆమెకళ్ళవెంట నీళ్ళుకారాయ్. ఆ గడచి పోయిన రోజులు ఒక్కసారి పెనవేసుకొని జ్ఞప్తికి వచ్చాయ్....ఆ తొలి నాటిరాత్రిపంతం....ఈ వెట్టిబాగులపిల్ల ఆనాడుఆగిరజాల్లోచేతులుపెట్టి... ఒక్కొక్క మాట రాలిస్తే ఆ ముఖం యెంత అమాయకంగావుంది! ఆనాడు కొడుకు పుట్టిన్నాడు ఆ ముఖంలో తేజస్సు.మళ్ళి యెంత కాలానికి అలాంటి మొగుడ్ని చూసింది....

మల్లును బైటకు తెచ్చిన యినస్పెక్టరు నీలికి అప్పజెప్తూ "నిజం చెప్పేశాడు. ఇంక నివ్వు యిలా తిరగక్కరలేదులే" అన్నాడు.

ఆ చూపులు దీనంగా "బాబూ...." ఏదో అడగబోయి మరచి పోయినట్లుగా వూరుకుంటే గ్రహించుకున్నట్లుగా ఇనస్పెక్టరు అన్నాడు. "మూడు నాలుగేళ్ళయినా శిక్ష తప్పదు! ఓ క్షణం అలా నిల్చుండి పోయింది.

ఆమె అక్కడనుంచి మెల్లగా కదలబోయింది. మల్లు గోల ఇంకా తగ్గలేదు. మెల్లగా కోర్టుదాటి రోడ్డుమీదపడినా "అమ్మో! అయ్యని తీసుకుపోతన్నారే...."అని అరుస్తున్నాడు. రోడ్డుమీదనడుస్తున్న వాళ్ళు వింతగా ఈ పిల్లవానివేపు చూస్తున్నారు.

నాలుగడుగులు వేశాక, ఆమె శక్తివిహీనమయ్యింది. సంతోషంతో నిండిన కడుపు మళ్ళీ యిప్పుడు ఖాళీఅయిపోయింది. ఆకలి-బ్రహ్మాండంగా వుంది.కాళ్లు తేలిపోతున్నయ్. కళ్ళు మందుకుపోతూ నీటితో నిండిపోతున్నట్లున్నయ్. మళ్ళీ ప్రయత్నించి ముందుకు అడుగులు వెయ్యబోయింది. మనిషి తూలిపోతోంది — తన యిల్లు యింకెంతో దూరం....తన యిల్లా అది....? వెళ్ళగానే అద్దె యివ్వలేదని ఆమె యెన్ని మాటలు ఆడుతుందో! — బియటకు గెంటివెయ్యదూ? తాళంవేసుకొని వుంటుంది — మరి రానివ్వదేమో!

సాయంత్రం రోడ్డుమీద ప్రజకదులుతున్నారు. బండ్లు,బస్సుల రిక్షాలు వెళ్ళిపోతున్నాయ్. కానీ ఆమె ముందుకు కదలలేకపోయిం తనకేకాదు ఆకలి —పిల్లలకి....కడుపులోనున్న కండకూడాను కొ డంత ఆకలే!

ఎలాగో కష్టపడి మరికొంతదూరం నడిచింది. అదిగో శి: లయం అగుపిస్తోంది. శివాలయంముందు బారులుతీరి ముష్టివాళ్ళు కూర్ న్నారు. దుకాణాలు అగుపిస్తున్నాయ్. అరటిపళ్ళ గెలలు —నాలుగుపళ్ తింటే కడుపు శాంతించును.....ఎలాగొస్తాది....? శివాలయానికి యెందరో భక్తులు పట్టుచీరలు కట్టుకొని, కార్లమీదకూడా వస్తున్న వాళ్ళున్నారు, చాలా రద్దీగావున్నది. రోడ్డుమీద నడుస్తూ తల తిరిగినట్ట న్నందువల్ల కూర్చుండిపోయింది. ప్రక్కనేవున్న ముష్టివాడు ఇంక కర్తె చేరిందని యేవగించుకున్నాడు, యెదురుగావున్న ఇంకో ముష్టి కొంకొడా చూసింది.

లేవలేని నీలి నిరాశతో పిల్లలవేపు చూసింది. మల్లుకు ఇంకా దుఃఖం పోలేదు. కడుపులో పిల్ల "అమ్మా ఆకలే...."అని గగ్గోలుపెట్ట న్నట్లుగా తిరిగిపోతోంది.

ఈ ఆపదూతురు కన్నవారింట్లో కడుపుకు కష్టాలుపడింది. కానీ, చెయ్యి కట్టుకోలేదు. యౌవనంతో వంగుతూ వాలుతూ, వయ్యారంగా తిరుగుతూ, పాడుతూ మురిసిపోయింది. పెళ్ళిగడియలో యేమీ తెలి యని అమాయకురాలి మల్లే సిగ్గుతో ముడుచుపోయింది,పెళ్ళమై పంతం పట్టిన మొగుడుకళ్ళు విప్పింది. ఇల్లాలై యింటిని నిలిపింది. ఒకనాడూ ఆమె ఒకరికి చెయ్యిచాచలేదు. లేనినాడుకూడా ఒకరికియిచ్చింది. ఈమె చెయ్యి ఒకనాడు యిచ్చినవేపే తిరిగిందిగానీ, పుచ్చుకున్న వేపు తిరగ లేదు. అలాంటి పవిత్రమైన చెయ్యి....ఈనాడు....ఈనిముషంలో.... అడుగుతున్నవేపు తిరుగుతుంటే....ఆమెచెయ్యి గజగజవణకనారంభిం చింది.ఎంతప్రయత్నిస్తున్నా ఆచెయ్యి మళ్ళీ క్రిందికే వెళ్ళిపోతోంది.... చివరకు అతిప్రయత్నంతో ఆ చేతినిపైకెత్తి అదుక్కునేటట్లు తిప్ప గానే....ఆ చేతిమీద....ఆమె రెండుకళ్ళనుంచీ....రెండే రెండు కన్నీటి బొట్లు రాలాయి!!.

అయిపోయింది.

BC

AQUA103B106

BC



మనము ఫౌండేషన్ పుస్తకం పరిశీలించడం

పుస్తకం పంక్తి	AOUA103B106
పుస్తకం పేరు	రాజవీణ తమ్ముడు
తారీఖు	31 December 2025
ముందు లెక్క	1165
వెనుక లెక్క	
మొత్తం పేజీలు	208
పెద్ద పైజా పేజీలు	NO
ఖాళీ పేజీలు	
లేని పేజీలు	1704
తయారు చేసినది	చదివాను
పేజీలు విడదీసినది	చదివాను
స్కాన్ చేసినది	చదివాను
పరీక్ష చేసినది	SARANYA
పేజీలు పరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పంపినది	